: సర్వస్వామ్యములు :

© శ్రీ సాయిబాబా సంస్థానము, శిరిడీ వారివి

పదహారవ ముద్రణ,2000

ప్రథమ ముద్రణ, 1953

1994 - 1,00,000 ప్రతులు

1997 - 50,000 ప్రతులు

1998 - 1,00,000 ప్రతులు

2000 - 50,000 ప్రతులు

2002 - 3,00,000 ప్రతులు

వెల : రూ.25.00

< ప్రతులకు >

శ్రీసాయిబాబా సంస్థాన్
శిరిడీ - 423109
అహమద్‌నగర్ జిల్లా, మహారాష్ట్ర

&

శ్రీసాయిబాబా సంస్థాన్
804 బి.డా. అంబేద్కర్ రోడ్
దాదర్, ముంబయి - 400 014

: టైపుసెట్ & ప్రీప్రెస్ ఇమేజింగ్:

**సాయిపథం, శిరిడీ**

---

Sri Sai Satcharitra *(Telugu)*

© *2000, Shri Sai Baba Sansthan, Shirdi*

*All Rights Reserved*

17th Edition 2002

**Price : Rs. 25/-**

*published by :*

Shri D.M. Sukthankar

**Chairman**

**Shri Sai Baba Sansthan**

**SHIRDI-423109**

*Typeset & Prepress Imaging at :*

**SAIPATHAM, SHIRDI**

**Printed By**

**Anil Apporv Printers & Manufacturers Pvt. Ltd.**

**759/74, Prabhat Road, Pune - 411 004.**



శ్రీ సాయిబాబా మహాసమాధి



# విషయసూచిక


| అధ్యాయము | విషయములు | పుట |
|---|---|---|
| | **మొదటిరోజు పారాయణము** | |
| | **గురువారము** | |
| ఉపోద్ఘాతము | శ్రీసాయిసచ్చరిత్ర యే నేటి శ్రీగురుచరిత్ర - గ్రంథకర్త హేమాడ్పంత్ - శ్రీసాయిబాబా యెవరు - శ్రీసాయిబాబా సర్వాంతర్యామి; | 1 |
| 1. | గురుదేవతా స్తుతి - శ్రీసాయిబాబా గోధుమలు పిండి విసిరిన వైనము - దాని తత్త్వము; | 9 |
| 2. | శ్రీసాయిసచ్చరిత్ర గ్రంథరచనకు ప్రేరణ - పూనుకొనుటకు అధైర్యము - తీవ్ర తాత్త్వికచర్చ - 'హేమాడ్పంత్' అను పేరు యొక్క నేపథ్యము - గురువు యొక్క ఆవశ్యకత; | 14 |
| 3. | శ్రీసాయిసచ్చరిత్ర గ్రంథరచనకు శ్రీసాయిబాబా అనుమతి, అభయము - సాయిసేవలో వైవిధ్యం - సాయిలీలలు ప్రబోధాత్మకములైన దీపస్తంభములు - శ్రీసాయిబాబా యొక్క అవ్యాజమైన ప్రేమతత్త్వము - రోహిల్లాకథ, అమృతతుల్యమగు బాబాపలుకులు; | 22 |
| 4. | యోగీశ్వరుల కర్తవ్యము - పవిత్ర శిరిడీ క్షేత్రము - శ్రీసాయిరూపము, వారి స్థితి - గౌలిబువా అనుభవము - కాకాసాహెబ్‌కు విఠలసాక్షాత్కారము - భగవంతరావు క్షీరసాగరుని కథ - దాసగణు 'ప్రయాగ' స్నానము - శ్రీసాయిబాబా అయోనిసంభవుడు - శ్రీసాయి శిరిడీ ఆగమనము - శిరిడీలో భక్తులు నిర్మించిన మూడు వసతిగృహములు; | 29 |

5. పెండ్లివారితో కలసి బాబా తిరిగి శిరిడీకి వచ్చుట - ఫకీరుకు సాయి నామమెట్లు వచ్చెను - ఇతర యోగులతో సహవాసము - బాబా దుస్తులు, వారి నిత్యకృత్యములు - వేపచెట్టు క్రింద నున్న పాదుకల చరిత్ర - మొహియొద్దీన్ తంబోలితో కుస్తీ - జీవితములో మార్పు - నీళ్లను నూనెగా మార్చుట - జౌహర్ అలీ అను కపటగురువు; 38

6. శ్రీరామనవమి ఉత్సవము - మసీదు మరామతు - గురుమహిమ - చందన ఉత్సవము - శిరిడీలో శ్రీరామనవమి ఉత్సవము మొదలైన వైనము, మార్పులు మొదలగునవి. 48

7. శ్రీసాయిఅద్భుతావతారము - సాయిబాబా వైఖరి - శ్రీసాయి యోగచర్య - (1) ధౌతి, (2) ఖండయోగము, (3) యోగము - బాబా సర్వాంతర్యామిత్వము, కారుణ్యము - కుష్ఠురోగభక్తుని సేవ - ఖాపర్డే కుఱ్ఱవానికి ప్లేగు నివారణ- పండరి ప్రయాణము. 59

## రెండవరోజు పారాయణము

### శుక్రవారము

8. మానవజన్మ ప్రాముఖ్యము - మానవ శరీరము యొక్క ప్రత్యేక విలువ - మానవుడు యత్నించవలసినది - నడువవలసిన మార్గము - బాబా భిక్షాటనము - బాయజాబాయి గొప్ప సేవ - ముగ్గురి పడక స్థలము - రహాతా నివాసి కుశాల్‌చంద్. 68

9. శిరిడీయాత్ర లక్షణములు - తాత్యాకోతే పాటీలు - ఐరోపా దేశపు పెద్దమనిషి - భిక్ష యొక్క అవశ్యకత - భక్తుల అనుభవములు, తర్‌ఖడ్ కుటుంబము (తండ్రి, కొడుకు) - ఆత్మారాముని భార్య - బాబాకు సంతుష్టిగా భోజనము పెట్టుట యెట్లు - నీతి. 75

10. సాయిబాబా జీవితము తీరు - బాబావారి విచిత్రశయ్య - బ్రహ్మము యొక్క సగుణావతారము - శిరిడీలో బాబా నివాసము, వారి జన్మతేది - బాబా లక్ష్యము, వారి బోధలు - సాయిబాబా సద్గురువు - బాబావారి అణకువ - నానావలి - అతి సులభమార్గము. 83

11. సాయి సగుణ బ్రహ్మస్వరూపము - డాక్టరు పండితుని పూజ - హాజీసిద్దీక్ ఫాల్కేఅను భక్తుడు - పంచభూతములు బాబా స్వాధీనము. 92

| | | |
|---|---|---|
| 12. | యోగుల కర్తవ్యము - కాకామహాజని - భాఊసాహెబు ధుమాళ్ ప్లీడరు - నిమోన్‌కర్ భార్య - నాసిక్ నివాసియగు ములేశాస్త్రి - ఒక డాక్టరు. | 99 |
| 13. | మాయయొక్క అనంతశక్తి - భీమాజీ పాటీలు - బాలాగణపతి షింపీ - బాపుసాహెబు బూటీ - అళందిస్వామి - కాకామహాజని - హార్దానివాసి దత్తోపంతు - ఇంకొక మూడు వ్యాధులు. | 105 |
| 14. | నాందేడు నివాసియగు రతన్‌జీ వాడియా - దక్షిణ మీమాంస - దక్షిణ గూర్చి యింకొకరి వర్ణన. | 112 |
| 15. | నారదీయ కీర్తనపద్ధతి - చోల్కరు చక్కెరలేని తేనీరు - రెండు బల్లులు. | 120 |


## మూడవరోజు పారాయణము

**శనివారము**


| | | |
|---|---|---|
| 16-17 | బ్రహ్మజ్ఞానమును త్వరగా సంపాదించుట, బ్రహ్మజ్ఞానము లేదా ఆత్మ సాక్షాత్కారమునకు యోగత్య - 1. ముముక్షుత లేదా స్వేఛ్ఛనందుటకు తీవ్రమైన కోరిక. 2. విరక్తి లేదా ఇహపర సౌఖ్యములందు విసుగు 3. లోనకు జూచుట. 4. పాపవిమోచన పొందుట. 5. సరియయిన నడవడి. 6. ప్రియమైనవాని కంటె శ్రేయస్కరమైనవానిని కోరుట 7. మనస్సును ఇంద్రియములను స్వాధీనమందుంచుకొనుట 8. మనస్సును పావనము చేయుట - 9. గురువు యొక్క ఆవశ్యకత 10. భగవంతుని కటాక్షము - బాబావారి వైశిష్ఠము. | 125 |
| 18-19 | హేమాడ్‌పంతును బాబా ఎట్లు ఆమోదించి ఆశీర్వదించెను - ప్రస్తావన - హరివినాయక సాఠే - శ్రీమతి రాధాబాయి దేశ్‌ముఖ్ - మన ప్రవర్తన గూర్చి ఉపదేశము - సద్విచారములను ప్రోత్సహించి సాక్షాత్కారమునకు దారి చూపుట - ఉపదేశములో వైవిధ్యము - నిందగూర్చి బోధ - కష్టమునకు కూలి. | 133 |
| 20. | ప్రస్తావన - కాకా నౌకరిపిల్ల ద్వారా దాసగణు సమస్య పరిష్కరించుట - ఈశావాస్యోపనిషత్తు - సద్గురువే బోధించుటకు యోగ్యత సమర్థత గలవారు - కాకా యొక్క పనిపిల్ల - విశిష్టమైన బోధన విధానము - ఈశావాస్యోపనిషత్తులోని నీతి | 150 |

21. ప్రస్తావన - యోగీశ్వరుల వ్యవస్థ - వి.హెచ్. ఠాకూరు బి.ఏ. - అనంతరావు పాటంకర్ - 9 ఉండల గుఱ్ఱపులద్ది అనే నీతి కథ - పండరీపురం ప్లీడరు. 156

22. పాము విషమునుంచి తప్పించుట - ప్రస్తావన 1. బాలాసాహెబు మిరీకర్ 2. బాపూసాహెబు బూటీ 3. అమీర్ శక్కర్ 4. హేమాడ్‌పంతు - బాబా అభిప్రాయము. 163

## నాలుగవరోజు పారాయణము

**ఆదివారము**

23. ప్రస్తావన - యోగము, ఉల్లిపాయ - పాము కాటునుండి శ్యామాను కాపాడుట - కలరావ్యాధి - గురుభక్తిని పరీక్షించుట. 171

24. ప్రస్తావన - బాబా హాస్యము, చమత్కారము, శనగల కథ; 1. హేమాడ్‌పంతు నీతి 2. సుదాముని కథ 3. అణ్ణా చించణీకరు, మావిసీబాయి - బాబా నైజము, భక్త పరాయణత్వము. 178

25. ప్రస్తావన - దాము అన్నా కాసార్ - అతని జట్టీ వ్యాపారములు -1. ప్రత్తి, 2. ధాన్యముల బేరములు - ఆమ్రలీల - ప్రార్థన. 185

26. ప్రస్తావన - ఆంతరికపూజ - భక్తపంతు - హరిశ్చంద్ర పితళే - అంబాడేకర్‌గారు. 192

27. ప్రస్తావన - గ్రంథములను పవిత్రము చేసి కానుకగా ఇచ్చుట - శ్యామా విష్ణు సహస్రనామముల పుస్తకము - గీతా రహస్యము - ఖాపర్డే దంపతులు. 199

28. ప్రస్తావన - లాలా లక్ష్మీచంద్ - దోషదృష్టి - బురహాన్‌పూర్ మహిళ - మేఘశ్యాముడు - గంగా స్నానము - త్రిశూలము, లింగము. 207

29 మదరాసు భజన సమాజము - ఆశ్చర్యకరమైన దర్శనము - తెండూల్కరు కుటుంబము - కాప్టెన్‌హాటే - పవిత్రము చేసిన రూపాయి - వామన నార్వేకర్. 216

30. ప్రస్తావన - కాకాజీవైద్య - శ్యామా మ్రొక్కు - రహతా కుశాల్ చంద్ - పంజాబి రామ్‌లాల్. 224

## ఐదవరోజు పారాయణము

### సోమవారము


| | | |
|---|---|---|
| 31. | బాబా సముఖమున మరణించినవారు - ప్రస్తావన 1. విజయానంద్, 2. బాలారామ్ మాన్కర్ 3. తాత్యాసాహెబు నూల్కరు. 4. మేఘ శ్యాముడు 5. పులి. | 230 |
| 32. | గురుని, దేవుని వెదకుట - ఉపవాసము నామోదింపకుండుట - ప్రస్తావన - అన్వేషణము - గోఖలేగారి భార్య - ఉపవాసము - బాబా సర్కారు. | 237 |
| 33. | ఊదీ మహిమ I - ప్రస్తావన - ఊదీ ప్రసాదము - తేలు కాటు - ప్లేగు జబ్బు - జామ్నేరు చమత్కారము - భక్త నారాయణరావు - బాలబువా సుతార్ - అప్పాసాహెబు కులకర్ణి - హరిభావ్ కర్ణిక్. | 245 |
| 34. | ఊదీ మహిమ II - డాక్టరు మేనల్లుడు - డాక్టరు పిళ్ళే - శ్యామా మరదలు - ఇరానీ పిల్ల - హార్దా పెద్దమనిషి - బొంబాయి స్త్రీ. | 254 |
| 35. | ఊదీ మహిమ III - పరీక్షింపబడి లోటు లేదని కనుగొనుట - ప్రస్తావన - కాకా మహాజని స్నేహితుడు - కాకా మహాజని యజమాని - నిద్రపట్టని రోగము - బాలాజీపాటీలు నెవాస్కరు - ఊదీ ప్రభావము - సాయి పాముపలె కనిపించుట. | 261 |
| 36. | ఇద్దరు గోవా పెద్ద మనుష్యులు - ఇంకొక కథ - నీతి - ఔరంగాబాద్కర్ భార్య. | 269 |


## ఆరవరోజు పారాయణము

### మంగళవారము


| | | |
|---|---|---|
| 37. | తొలిపలుకు - చావడి ఉత్సవము. | 276 |
| 38. | తొలి పలుకు - బాబా వంట పాత్ర - నానాసాహెబు దేవాలయమును అగౌరవించుట - కాలా (మిశ్రమము) - ఒక గిన్నెడు మజ్జిగ. | 282 |
| 39. | బాబాగారి సంస్కృత పరిజ్ఞానము - తొలిపలుకు - భగవద్గీతలోని శ్లోకమునకు బాబా చెప్పిన అర్థము - సమాధిమందిర నిర్మాణము. | 289 |
| 40. | బాబా కథలు - తొలిపలుకు - దేవుగారింట ఉద్యాపన వ్రతము - హేమాడ్‌పంతు ఇంట హోళిపండుగ భోజనము. | 298 |

| | | |
|---|---|---|
| 41. | చిత్రపటము యొక్క వృత్తాంతము - గుడ్డ పీలికలను దొంగిలించుట - జ్ఞానేశ్వరి చదువుట. | 304 |
| 42. | బాబా మహాసమాధి చెందుట - తొలిపలుకు - ముందుగా సూచించుట - రామచంద్ర దాదా పాటీలు - తాత్యాకోతే పాటీళ్ల మరణములు తప్పించుట - లక్ష్మీబాయి శిందేకు దానము -బాబా సర్వజీవవ్యాపి. | 310 |
| 43-44. | బాబా సమాధి చెందుట - ముందుగా సన్నాహము - ఇటుకరాయి విరుగుట -72 గంటల సమాధి - బాపుసాహెబు జోగుగారి సన్యాసము - అమృతతుల్యమగు బాబా పలుకులు - నేను అనగా ఎవరు? | 316 |


## ఏడవరోజు పారాయణము

**బుధవారము**


| | | |
|---|---|---|
| 45. | తొలిపలుకు - కాకాసాహెబు సంశయము - ఆనందరావు దృశ్యము - కొయ్యబల్ల మంచము బాబాదే మహాల్సాపతిది కాదు. | 325 |
| 46. | తొలిపలుకు - గయ యాత్ర - రెండు మేకల కథ. | 331 |
| 47. | బాబాగారి స్మృతులు - తొలిపలుకు - సర్పము, కప్ప - నీతి. | 336 |
| 48. | భక్తుల ఆపదలు బాపుట - సద్గురుని లక్షణములు - శేవడే - సపత్నేకర్ భార్యాభర్తలు - సపత్నేకర్ భార్య. | 343 |
| 49. | తొలిపలుకు - హరి కానోబా - సోమదేవస్వామి - నానాసాహెబు చాందోర్కరు. | 350 |
| 50. | తొలిపలుకు - కాకాసాహెబు దీక్షిత్ - శ్రీటెంబెస్వామి - బాలారామ్ ధురంధర్. | 357 |
| 51. | తుదిపలుకు - సద్గురు సాయియొక్క గొప్పదనము - ప్రార్థన - ఫలశ్రుతి - ప్రసాద యాచనము. | 364 |



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## మొదటి అధ్యాయము

*గురుదేవతా స్తుతి -*
*బాబా గోధుమలు పిండి విసరిన కథ - దాని తత్త్వము.*

**పూ**ర్వసంప్రదాయానుసారము హేమాడ్‌పంతు శ్రీసాయిసచ్చరిత్ర గ్రంథమును గురుదేవతాస్తుతితో ప్రారంభించుచున్నారు.

1. ప్రప్రథమమున విఘ్నేశ్వరుని స్మరించుచు ఆటంకములను తొలగించి యీ గ్రంథము జయప్రదముగా సాగునట్లు వేడుకొనుచు శ్రీసాయినాథుడే సాక్షాత్తూ శ్రీగణేశుడని చెప్పుచున్నారు.

2. పిమ్మట శ్రీసరస్వతీదేవిని స్మరించి యామె తననీ గ్రంథరచనకు పురికొల్పినందులకు నమస్కరించుచు, శ్రీసాయియే సరస్వతీ స్వరూపులై తమ కథను తామే గానము చేయుచున్నారనియు చెప్పుచున్నారు.

3. తదుపరి సృష్టిస్థితిలయ కారకులగు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను ప్రార్థించి, శ్రీసాయియే త్రిమూర్త్యాత్మక స్వరూపులనియు, సమర్థ సద్గురువులనియు, వారు మనలను సంసారమను నదిని దాటించగలరనియు చెప్పుచున్నారు.

4. తరువాత తమ గృహదేవతయగు నారాయణ ఆదినాథునకు నమస్కరించి, వారు కొంకణదేశములో వెలసిరనియు, ఆభూమి పరశురాముడు సముద్రమునుండి సంపాదించినదనియు చెప్పుచు, వారి వంశ మూలపురుషుని స్తోత్రము చేసిరి.

5. అటుపిమ్మట వారి గోత్రఋషియగు భరద్వాజమునిని స్మరించెను. అంతేగాక, యాజ్ఞవల్క్యుడు, భృగుడు, పరాశరుడు, నారదుడు, సనకసనందనాదులు, సనత్కుమారుడు, శుకుడు, శౌనకుడు, విశ్వామిత్రుడు, వసిష్ఠుడు, వాల్మీకి, వామదేవుడు, జైమిని, వైశంపాయనుడు, నవయోగీంద్రులు మొ॥న పలువురు మునులను, నివృత్తి, జ్ఞానదేవు, సోపాను, ముక్తాబాయి, జనార్దనుడు, ఏకనాథుడు, నామదేవుడు, తుకారామ్, కాన్హా, నరహరి తదితర అర్వాచీన యోగీశ్వరులను కూడ ప్రార్థించెను.

6. తరువాత తన పితామహుడైన సదాశివునకు, తండ్రి రఘునాథునకు, కన్నతల్లికి, చిన్నతనమునుండి పెంచి పెద్దచేసిన మేనత్తకు, తన జ్యేష్ఠసోదరునకు నమస్కరించెను.

7. అటుపైన పాఠకులకు నమస్కరించి, తన గ్రంథమును ఏకాగ్ర చిత్తముతో పారాయణ చేయుడని ప్రార్థించెను.

8. చివరగా తన గురువు, దత్తావతారమును అగు శ్రీసాయిబాబాకు నమస్కరించి, తాను వారిపై పూర్తిగా నాధారపడి యున్నానని చెప్పుచు, ఈ ప్రపంచము మిథ్య యనియు, బ్రహ్మమే సత్యమనే అనుభవమును తనకు కలిగించు శక్తి వారికే కలదని చెప్పుచు, నీ ప్రపంచములో నేయే జీవులందు పరమాత్ముడు నివసించుచున్నాడో వారలందరికిని నమస్కరించెను.

పరాశరుడు, వ్యాసుడు, శాండిల్యుడు మొదలుగా గలవారలు చెప్పిన భక్తి మార్గములను పొగడి వర్ణించిన పిమ్మట, హేమాడ్‌పంతు ఈ క్రింది కథను చెప్పుటకు ప్రారంభించెను.

1910 సం॥ తదుపరి యొకనాటి ఉదయమున నేను శిరిడీ మసీదులో నున్న శ్రీసాయిబాబా దర్శనము కొరకు వెళ్ళితిని. అప్పుడు జరిగిన ఈ క్రింది విషయమును గమనించి మిక్కిలి యాశ్చర్యపడితిని. బాబా ముఖప్రక్షాళనము గావించుకొని.గోధుమలు విసరుటకు సంసిద్ధుడగుచుండెను. వారు నేలపై గోనె పరచి, దానిపై తిరుగలి యుంచిరి. చేటలో కొన్ని గోధుమలు పోసికొని, కఫనీ (చొక్కా) చేతులుపైకి మడచి, పిడికెడు చొప్పున గోధుమలు వేయుచు విసరసాగిరి. అది చూచి నాలో నేను, *"ఈ గోధుమపిండిని బాబా యేమిచేయును?*

*ఆయనెందులకు గోధుమలు విసరుచుండెను? వారు భిక్షాటనముచే జీవించువారే! వారికి గోధుమపిండితో నేమి నిమిత్తము? వారికి పిండి నిల్వ చేయవలసిన అగత్యము లేదే!"* యని చింతించితిని. అచ్చటకు వచ్చిన మరికొంతమంది కూడ నిట్లే యాశ్చర్యమగ్నులయిరి. కాని మాలోనెవరికి గూడ బాబాను ప్రశ్నించుటకు ధైర్యము చాలకుండెను. ఈ సంగతి వెంటనే గ్రామములో వ్యాపించెను. ఆబాలగోపాలము ఈ వింత చర్యను చూచుటకై బాబా వద్ద గుమిగూడిరి. నలుగురు స్త్రీలు ఎటులనో సాహసించి మసీదు మెట్లెక్కి, బాబాను ప్రక్కకు జరిపి, వారే విసరుట ప్రారంభించిరి. వారు తిరుగలిపిడిని చేతపట్టుకొని, బాబా లీలలను పాడుచు విసరుట సాగించిరి. ఈ చర్యలను చూచి బాబాకు కోపము వచ్చెను. కాని, వారి ప్రేమకు భక్తికి మిగుల సంతసించి చిఱునవ్వు నవ్విరి. విసరునప్పుడు స్త్రీలు తమలో తామిట్లనుకొనిరి. "బాబాకు ఇల్లుపిల్లలు లేరు. ఆస్తిపాస్తులు లేవు. వారిపై *ఆధారపడినవారు, ఆయన పోషించవలసిన వారెవరును లేరు. వారు భిక్షాటనముచే జీవించువారు కనుక వారికి రొట్టె చేసికొనుటకు గోధుమ పిండితో నిమిత్తము లేదు. అట్టి పరిస్థితులలో బాబాకు గోధుమపిండితో నేమిపని? బాబా మిగుల దయార్ద్రహృదయుడగుటచే మనకీ పిండిని పంచిపెట్టును కాబోలు."* ఈ విధముగా మనమున వేర్వేరు విధముల చింతించుచు పాడుచు విసరుట ముగించి, పిండిని నాలుగు భాగములు చేసి యొక్కొక్కరు ఒక్కొక్క భాగమును తీసికొనుచుండిరి. అంత వరకు శాంతముగా గమనించుచున్న బాబా లేచి కోపముతో వారిని తిట్టుచు నిట్లనెను.

*"ఓ వనితలారా! మీకు పిచ్చి పట్టినదా యేమి? ఎవరబ్బ సొమ్మనుకొని లూటీ చేయుచుంటిరి? మీ వద్ద నుండి గోధుమలు వాడుకొంటినాయేమి? ఏ కారణముచేత పిండిని గొంపోవుటకు యత్నించుచున్నారు? సరే, యిట్లు చేయుడు. పిండిని తీసికొనిపోయి గ్రామపు సరిహద్దులపైని చల్లుడు."* అది విని యా వనిత లాశ్చర్యమగ్నులయిరి, సిగ్గుపడిరి, గుసగుసలాడుకొనుచు ఊరు సరిహద్దుల వద్దకు పోయి బాబా యాజ్ఞానుసారము ఆ పిండిని చల్లిరి.

నేనిదంతయు జూచి, శిరిడీ ప్రజలను బాబా చర్యను గూర్చి ప్రశ్నించితిని. ఊరిలో కలరా జాడ్యము గలదనియు దానిని శాంతింపచేయుట కది బాబా సాధనమనియు చెప్పిరి. అప్పుడు వారు విసరినవి గోధుమలు కావనియు, వారు కలరా జాడ్యమును విసరి ఊరికవతల పారద్రోలిరనియు చెప్పిరి. అప్పటి నుండి కలరా తగ్గెను. గ్రామములోని ప్రజలందరు ఆనందించిరి. ఇదంతయు వినిన నాకు మిక్కిలి సంతసము కలిగెను. దీని గూఢార్థమును తెలిసికొన కుతూహలము కలిగెను. గోధుమపిండికి కలరా జాడ్యమునకు సంబంధమేమి? ఈ రెండింటికి గల కార్యకారణ సంబంధమేమి? ఒకటి యింకొకదానినెట్లు శాంతింపజేసెను? ఇదంతయు అగోచరముగా తోచెను. అందుచే నేను తప్పక యీ విషయమును గూర్చి వ్రాసి బాబా లీలలను మనసారా పాడుకొనవలయునని నిశ్చయించుకొంటిని. ఈ లీలను జూచి యిట్లు భావించుకొని హృదయానంద పూరితుడనయితిని. ఈ ప్రకారముగా బాబా సచ్చరిత్రను వ్రాయుటకు ప్రేరేపింపబడితిని. అట్లే బాబా కృపాకటాక్షములచే ఆశీర్వాదములచే గ్రంథము నిర్విఘ్నముగను, జయప్రదముగను పూర్తియైనది.

**తిరగలి విసరుట - దాని వేదాంత తత్త్వము**

తిరుగలి విసరుటను గూర్చి శిరిడీ ప్రజలనుకొనురీతియే కాక దానిలో వేదాంత భావము కూడ కలదు. సాయిబాబా శిరిడీ యందు షుమారు 60 ఏండ్లు నివసించెను. ఈ కాలమంతయు వారు తిరుగలి విసరుచునే యుండిరి! నిత్యము వారు విసరునది గోధుమలు కావు, భక్తుల యొక్క పాపములు, మనోవిచారములు మొదలగునవి. తిరుగలి యొక్క క్రిందిరాయి కర్మ; మీదిరాయి భక్తి; చేతితో పట్టుకొనిన పిడి జ్ఞానము. జ్ఞానోదయమునకుగాని, ఆత్మసాక్షాత్కారమునకుగాని మొట్టమొదట పాపములను, కోరికలను తుడిచి వేయవలయును. అటుపిమ్మట త్రిగుణరాహిత్యము పొందవలెను. అహంకారమును చంపుకొనవలయును.

ఇది వినగనే కబీరు కథ జ్ఞప్తికి వచ్చును. ఒకనాడు స్త్రీ యొకతె తిరుగలిలో ధాన్యమును వేసి విసరుచుండెను. దానిని చూచి కబీరు యేడ్వసాగెను. నిపతినిరంజనుడను యొక సాధుపుంగవుడది చూచి కారణమడుగగా కబీరు ఇట్లు జవాబిచ్చెను: "నేను కూడ ఆ ధాన్యమువలె ప్రపంచమను తిరుగలిలో విసరబడెదను కదా?" దానికి నిపతినిరంజను డిట్లు బదులు చెప్పెను:

*"భయములేదు! తిరుగలిపిడిని గట్టిగా పట్టుకొనుము. అనగా జ్ఞానమును విడువకుము. నేనెట్లు గట్టిగా పట్టియున్నానో నీవును అట్లే చేయుము. మనస్సును కేంద్రీకరించుము. దూరముగా పోనీయకుము. అంతరాత్మను జూచుటకు దృష్టిని అంతర్ముఖముగానిమ్ము. నీవు తప్పక రక్షింపబడెదవు."*

**మొదటి అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## రెండవ అధ్యాయము

*ఈ గ్రంథరచనకు కారణము, పూనుకొనుటకు అసమర్థత;*
*బాబా అభయము; వాడాలో వివాదము; 'హేమాడ్‌పంతు' అను బిరుదు ప్రదానము;*
*గురువు యొక్క యావశ్యకత.*

### ఈ గ్రంథరచనకు ముఖ్యకారణము

**మొ**దటి యధ్యాయములో గోధుమలు విసరి యా పిండిని ఊరిబయట చల్లి కలరా జాడ్యమును తరిమివేసిన బాబా వింత చర్యను వర్ణించితిని. ఇదేగాక శ్రీ సాయి యొక్క యితరమహిమలు విని సంతోషించితిని. ఆ సంతోషమే నన్నీ గ్రంథము వ్రాయుటకు పురికొల్పినది. అదేగాక బాబాగారి వింత లీలలును చర్యలును మనస్సున కానందము కలుగజేయును; అవి భక్తులకు బోధనలుగా ఉపకరించును; తుదకు పాపములను బోగొట్టును గదా యని భావించి బాబాయొక్క పవిత్ర జీవితమును, వారి బోధనలను వ్రాయమొదలిడితిని. యోగీశ్వరుని జీవితచరిత్ర తర్కమును న్యాయమును కాదు. అది మనకు సత్యమును, ఆధ్యాత్మికమునునైన మార్గమును జూపును.

### గ్రంథరచనకు పూనుకొనుటకు అసమర్థత – బాబా అభయము

శ్రీసాయిసచ్చరిత్ర గ్రంథరచనకు తగిన సమర్థతగలవాడను కానని హేమాడ్‌పంతు భయపడెను. అతడిట్లనుకొనెను: "నా యొక్క సన్నిహితస్నేహితుని జీవితచరిత్రయే నాకు తెలియదు. నా మనస్సే నాకు గోచరము కాకున్నది. ఇట్టి స్థితిలో ఒక యోగీశ్వరుని చరిత్రను నేనెట్లు వ్రాయగలుగుదును? అవతారపురుషుల లక్షణముల నెట్లు వర్ణించగలను?

వేదములే వారిని పొగడలేకుండెను. తాను యోగియయిన గాని యోగి యొక్క జీవితమును గ్రహింపజాలడు. అట్టిచో వారి మహిమలను నేనెట్లు కీర్తించగలను? సప్తసముద్రముల లోతును గొలువవచ్చును. ఆకాశమును గుడ్డలో వేసి మూయవచ్చును. కాని యోగీశ్వరుని చరిత్ర వ్రాయుట బహుకష్టము. ఇది గొప్ప సాహసకృత్యమని కూడ నాకు తెలియును." అందువలన నలుగురిలో నవ్వులపాలగుదునేమోనని భయపడి శ్రీసాయీశ్వరుని అనుగ్రహము కొరకు ప్రార్థించెను.

మహారాష్ట్ర దేశములోని ప్రథమ కవియు, యోగీశ్వరుడునగు జ్ఞానేశ్వరమహరాజు యోగులచరిత్ర వ్రాసినవారిని భగవంతుడు ప్రేమించునని చెప్పియున్నారు. ఏ భక్తులు యోగుల చరిత్రలను వ్రాయ కుతూహలపడెదరో వారి కోరికలు నెరవేరునట్లు, వారి గ్రంథములు కొనసాగునట్లు చేయుటకు యోగులనేకమార్గముల నవలంబించెదరు. యోగులే యట్టిపనికి ప్రేరేపింతురు. దానిని నెరవేర్చుటకు భక్తుని కారణమాత్రునిగా నుంచి వారివారి కార్యములను వారే కొనసాగించుకొనెదరు. 1700 శక సంవత్సరములో మహీపతి పండితుడు యోగీశ్వరుల చరిత్రలను వ్రాయుటకు కాంక్షించెను. యోగులు అతనిని ప్రోత్సహించి ఆ కార్యమును కొనసాగించిరి. అట్లే 1800 శక సంవత్సరములో దాసగణు యొక్క సేవను ఆమోదించిరి. మహీపతి నాలుగు గ్రంథములను వ్రాసెను. అవి *భక్త విజయము*, *సంత విజయము*, *భక్తలీలామృతము*, *సంతలీలామృతము* అనునవి. దాసగణు వ్రాసినవి భక్తలీలామృతమును సంతకథామృతమును మాత్రమే. ఆధునికయోగుల చరిత్రలు వీనియందు గలవు. *భక్తలీలామృతము*లోని 31, 32, 33 అధ్యాయములందును, *సంతకథామృతము*లోని 57వ యధ్యాయమందును సాయిబాబా జీవితచరిత్రయు, వారి బోధలును చక్కగా విశదీకరింపబడినవి. ఇవి *సాయిలీలా* మాసపత్రిక, సంపుటము 17, సంచికలు 11, 12 నందు ప్రచురితములు. చదువరులు ఈ యధ్యాయములు కూడ పఠించవలెను. శ్రీసాయిబాబా అద్భుతలీలలు బాంద్రా నివాసినియగు శ్రీమతి సావిత్రీబాయి రఘునాథ్ తెండూల్కర్‌చే చిన్న పుస్తకములో చక్కగా వర్ణింపబడినవి. దాసగణు మహారాజుగారు కూడ శ్రీసాయి పాటలు మధురముగా వ్రాసియున్నారు. గుజరాతీ భాషలో అమీదాస్ భవాని మెహతా యను భక్తుడు

శ్రీసాయి కథలను ముద్రించినారు. సాయినాథప్రభ అను మాసపత్రిక శిరిడీలోని దక్షిణభిక్ష సంస్థవారు ప్రచురించి యున్నారు. ఇన్ని గ్రంథములుండగా ప్రస్తుత *సచ్చరిత్ర వ్రాయుటకు కారణమేమి? దాని యవసరమేమి?* - యనిఎవరైనను ప్రశ్నింపవచ్చును.

దీనికి జవాబు మిక్కిలి తేలిక! సాయిబాబా జీవితచరిత్ర సముద్రమువలె విశాలమైనది, లోతైనది. అందరు దీనియందు మునిగి భక్తిజ్ఞానములను మణులను వెలికితీసి కావలసినవారికి పంచి పెట్టవచ్చును. శ్రీసాయిబాబా నీతిబోధకమగు కథలు, లీలలు మిక్కిలి యాశ్చర్యమును కలుగజేయును. అవి మనోవికలత చెందినవారికి విచారగ్రస్తులకు శాంతి సమకూర్చి యానందము కలుగజేయును. ఇహపరములకు కావలసిన జ్ఞానమును బుద్ధిని ఇచ్చును. వేదములవలె రంజకములును ఉపదేశకములునునగు బాబా ప్రబోధములు విని, వానిని మననము చేసినచో భక్తులు వాంఛించునవి, అనగా బ్రహ్మైక్యయోగము, అష్టాంగయోగ ప్రావీణ్యము, ధ్యానానందము పొందెదరు. అందుచే బాబా లీలలను పుస్తకరూపమున వ్రాయ నిశ్చయించితిని. బాబాను సమాధికి ముందు చూడని భక్తులకు ఈ లీలలు మిగుల ఆనందము కలుగజేయును. అందుచేత బాబాగారి యాత్మసాక్షాత్కారఫలితమగు పలుకులు, బోధలు సమకూర్చుటకు పూనుకొంటిని. సాయిబాబాయే యీ కార్యమునకు నన్ను ప్రోత్సహించెను. నా యహంకారమును వారి పాదములపై నుంచి శరణంటిని. కావున నా మార్గము సవ్యమైనదనియు బాబా యిహపరసౌఖ్యములు తప్పక దయచేయుననియు నమ్మియుంటిని.

నా యంతట నేను ఈ గ్రంథరచనకు బాబా యొక్క యనుమతిని పొందలేకుంటిని. మాధవరావు దేశపాండే ఉరఫ్ శ్యామా అను వారు బాబాకు ముఖ్యభక్తుడు. వారిని నా తరపున బాబాను ప్రార్థించమంటిని. నా తరఫున వారు బాబాతో నిట్లనిరి. "ఈ అన్నాసాహెబు మీ జీవిత చరిత్రను వ్రాయ కాంక్షించుచున్నాడు. 'నేను *భిక్షాటనముచే* జీవించు ఫకీరును. నా జీవితచరిత్ర వ్రాయనవసరము లేద'ని యనవద్దు! మీరు సమ్మతించి సహాయపడినచో వారు వ్రాసెదరు. లేదా మీ కృపయే దానిని సిద్ధింపజేయును. మీ యొక్క యనుమతి యాశీర్వాదము లేనిదే యేదియు జయప్రదముగా చేయలేము." అది వినినంతనే శ్రీసాయిబాబా మనస్సు కరిగి, నాకు ఊదీ ప్రసాదము పెట్టి యాశీర్వదించెను.

మరియు (శ్యామాతో) నిట్లు చెప్ప దొడంగెను: "కథలను, అనుభవములను, ప్రోగు చేయమనుము. అక్కడక్కడ కొన్ని ముఖ్య విషయములను టూకిగా వ్రాయమను. నేనుసహాయము చేసెదను. వాడు నిమిత్తమాత్రుడే. నా జీవితచరిత్ర నేనే వ్రాసి నా భక్తుల కోరికలు నెరవేర్చవలెను. వాడు తన యహంకారమును విడువవలెను. దానిని నా పాదములపైన బెట్టవలెను. ఎవరయితే వారి జీవితములో నిట్లు చేసెదరో వారికి నేను మిక్కిలి సహాయపడెదను. నా జీవితచర్యలకొరకే కాదు. సాధ్యమైనంత వరకు వారి గృహకృత్యములందును తోడ్పడెదను. వాని యహంకారము పూర్తిగా పడిపోయిన పిమ్మట అది మచ్చునకు కూడ లేకుండునప్పుడు నేను వాని మనస్సులో ప్రవేశించి నా చరిత్రను నేనే వ్రాసికొందును. నా కథలు బోధలు విన్న భక్తులకు భక్తివిశ్వాసములు కుదురును. వారు ఆత్మ సాక్షాత్కారమును బ్రహ్మానందమును పొందెదరు. నీకు తోచిన దానినే నీవు నిర్ధారణ చేయుటకు ప్రయత్నించకుము. ఇతరుల యభిప్రాయములను కొట్టివేయుటకు ప్రయత్నించకుము. ఏ విషయముపై నైనను కీడు మేలు ఎంచు వివాదము కూడదు."

వివాదమనగనే నన్ను 'హేమాడ్‌పంతు' అని పిల్చుటకు కారణమేమో మీకు చెప్పెదనను వాగ్దానము జ్ఞప్తికి వచ్చినది. ఇప్పుడు దానినే మీకు చెప్పబోవుచున్నాను. కాకాసాహెబు దీక్షిత్, నానాసాహెబు చాందోర్కరులతో నేనెక్కువ స్నేహముతో నుంటిని. వారు నన్ను శిరిడీ పోయి బాబా దర్శనము చేయుమని బలవంతము చేసిరి. అట్లే చేసెదనని వారికి నేను వాగ్దానము చేసితిని. ఈ మధ్యలోనేదో జరిగినది. అది నా శిరిడీ ప్రయాణమున కడ్డుపడినది. లోనావాలాలో నున్న నా స్నేహితుని కొడుకు జబ్బుపడెను. నా స్నేహితుడు మందులు, మంత్రములన్నియు నుపయోగించెను గాని నిష్ఫలమయ్యెను. జబ్బు తగ్గలేదు. తుదకు వాని గురువును పిలిపించుకొని ప్రక్కన కూర్చుండబెట్టుకొనెను. కాని ప్రయోజనము లేకుండెను. ఈ సంగతి విని, "నా స్నేహితుని కుమారుని రక్షించలేనట్టి గురువు యొక్క ప్రయోజనమేమి? గురువు మనకు ఏమియు సహాయము చేయలేనప్పుడు నేను శిరిడీ యేల పోవలెను?" అని భావించి, శిరిడీ ప్రయాణమును మానుకొంటిని. కాని కానున్నది కాకమానదు. అది యీ క్రింది విధముగా జరిగెను.

నానాసాహెబు చాందోర్కర్ ప్రాంతీయ రెవెన్యూ అధికారి. ఉద్యోగరీత్యా యొకనాడాయన వసయీకి పర్యటనకై పోవుచుండెను. ఠాణానుండి దాదరుకు వచ్చి యచ్చట వసయీ పోవు బండికొరకు కనిపెట్టుకొని యుండెను. ఈ లోగా బాంద్రా లోకల్ బండి వచ్చెను. దానిలో కూర్చొని బాంద్రా వచ్చి, నన్ను పిలిపించి శిరిడీ ప్రయాణమును వాయిదా వేసినందులకు నాపై కోపించెను. నానా సంతోషదాయకముగను సమ్మతముగాను ఉండెను. అందుచే నా రాత్రియే శిరిడీకి పోవ నిశ్చయించితిని. సామానులు కట్టుకొని శిరిడీ బయలుదేరితిని. బాంద్రా నుండి దాదరు వెళ్ళి, అచ్చట మన్మాడ్ వెళ్ళు రైలు ఎక్కవలెనని అనుకొంటిని. అటులనే దాదరుకు టిక్కట్టు కొని, రైలు రాగానే ఎక్కి కూర్చుంటిని. బండి ఇక బయలు దేరుననగా, మహమ్మదీయుడొకడు నేను కూర్చొనిన పెట్టెలోనికి హడావిడిగా వచ్చి, నా సరంజామానంతయు జూచి, యెక్కడకు పోవుచుంటివని నన్ను ప్రశ్నించెను. నా యాలోచన వారికి చెప్పితిని. వెంటనే ఆతడు దాదరు స్టేషనులో దిగవద్దనీ, ఎందుకనగా మన్మాడుమెయిలు దాదరులో ఆగదనీ, అదే రైలులో ఇంకనూ ముందుకుబోయి బోరీబందరు స్టేషనులో దిగమని నాకు సలహా చెప్పెను. ఈ చిన్న లీలయే జరుగకుండినచో నేననుకొనిన ప్రకారము ఆ మరుసటి ఉదయము శిరిడీ చేరలేకపోయెడివాడను. అనేక సందేహములు కూడ కలిగి యుండెడివి. కాని నా యదృష్టవశాత్తు యది యట్లు జరుగలేదు. మరుసటి దినము సుమారు 9 - 10 గంటలలోగా నేను శిరిడీ చేరితిని. శిరిడీలో నా కొరకు కాకాసాహెబు దీక్షిత్ కనిపెట్టుకొని యుండెను.

ఇది 1910 ప్రాంతములో జరిగినది. అప్పటికి సాఠేవాడా యొక్కటియే శిరిడీ వచ్చు భక్తుల కొరకు నిర్మింపబడి యుండెను. టాంగా దిగిన వెంటనే బాబాను దర్శించవలెనని నాకు ఆత్రము కలిగెను. అంతలో, అప్పుడే మసీదునుండి వచ్చుచున్న తాత్యాసాహెబు నూల్కరు, బాబా వాడాచివరన ఉన్నారనియూ, మొట్టమొదట ధూళిదర్శనము చేసుకొనమని నాకు సలహా యిచ్చెను. స్నానానంతరము ఓపికగా మరల చూడవచ్చుననెను. ఇది వినినతోడనే నేను పోయి బాబా పాదములకు సాష్టాంగనమస్కారము చేసితిని. నాలో ఆనందము పొంగిపొరలినది. నానాసాహెబు చాందోర్కరు చెప్పినదానికన్ననూ ఎన్నోరెట్లు అనుభవమైనది. నా సర్వేంద్రియములు తృప్తిచెంది యాకలి దప్పికలు

మరచితిని. మనస్సుకు సంతుష్టి కలిగెను. బాబా పాదములు పట్టిన వెంటనే నా జీవితములో గొప్ప మార్పు కలిగెను. నాకు శిరిడీ పోవలసినదని ప్రోత్సహించిన వారందరికి నేనెంతో ఋణపడినట్లుగా భావించితిని. వారిని నా నిజమైన స్నేహితులుగా భావించితిని. వారి ఋణమును నేను తీర్చుకొనలేను. వారిని జ్ఞప్తికి దెచ్చుకొని, వారికి నా మనసులో సాష్టాంగప్రణామము చేసితిని. నాకు తెలిసినంతవరకు సాయిబాబా దర్శనము వల్ల కలుగు చిత్రమేమన మనలోనున్న యాలోచనలు మారిపోవును. వెనుకటి కర్మల బలము తగ్గును. క్రమముగా ప్రపంచమందు విరక్తి కలుగును. నా పూర్వజన్మ సుకృతముచే నాకీ దర్శనము లభించినదనుకొంటిని. సాయిబాబాను చూచినంత మాత్రముననే నీ ప్రపంచమంతయు సాయిబాబా రూపము వహించెను.

**తీవ్ర వాగ్వివాదము**

నేను శిరిడీ చేరిన మొదటి దినముననే నాకును బాలాసాహెబు భాటేకును గురువు యొక్క యావశ్యకతను గూర్చి గొప్ప వాగ్వివాదము జరిగెను. మన స్వేచ్ఛను విడిచి యింకొకరికి ఎందుకు లొంగియుండవలెనని నేను వాదించితిని. "*మన కర్మలను మనమే చేయుటకు గురువు యొక్క యావశ్యకత ఏమి? తనంతట తానే కృషి చేసి, మిక్కిలి యత్నముతో యీ జన్మదుఃఖము నుండి తప్పించుకొనవలెను. ఏమియు చేయక సోమరిగా కూర్చొనువానికి గురువేమి చేయగలడు?*" అని నేను స్వేచ్ఛపక్షమును ఆశ్రయించితిని. భాటే యింకొక వాదమును బట్టుకొని, ప్రారబ్ధము తరపున వాదించుచు, "*కానున్నది కాక మానదు. మహనీయులు కూడ నీ విషయములో నోడిపోయిరి. మనుజుడొకటి తలంచిన భగవంతుడు వేరొకటి తలంచును. నీ తెలివితేటలను అటుండనిమ్ము. గర్వముగాని యహంకారము కాని మీకు తోడ్పడవు*" అనెను. ఈ వాదన యొక గంట వరకు జరిగెను. కాని యిదమిత్థమని యేమియుతేలలేదు. అలసిపోవుటచే ఘర్షణ మానుకొంటిమి. ఈ ఘర్షణవల్ల నా మనఃశ్శాంతి తప్పినది. దేహాత్మబుద్ధి, అహంకారము లేకున్నచో వివాదమునకు తావు లేదని గ్రహించితిని. వేయేల, వివాదమునకు మూలకారణ మహంకారము.

ఇతరులతో కూడ మేము మసీదునకు పోగా, బాబా కాకాను బిలిచి యిట్లడిగెను: "వాడాలో నేమి జరిగినది? ఏమిటా వివాదము? అది దేనిని గూర్చి? ఈ హేమాడ్‌పంతు ఏమనుచున్నాడు?"

ఈ మాటలు విని నేను ఆశ్చర్యపడితిని. సాఠేవాడా మసీదునకు చాలా దూరముగా నున్నది. మా వివాదముగూర్చి బాబాకెట్లు తెలిసెను? అతడు సర్వజ్ఞుడై యుండవలెను. లేనిచో మా వాదన నెట్లు గ్రహించును? బాబా మన యంతరాత్మపై నధికారియై యుండవచ్చును.

**హేమాడ్‌పంతు అను బిరుదునకు మూలకారణము**

సాయిబాబా నన్నెందులకు 'హేమాడ్‌పంత'ని పిలిచెనని ఆలోచింపసాగితిని? ఇది 'హేమాద్రిపంతు' అను నామమునకు రూపాంతరము. దేవగిరికి చెందిన యాదవవంశ రాజులకు హేమాద్రిపంతు ప్రధానామాత్యుడు. అతడు గొప్ప పండితుడు, మంచి స్వభావము గలవాడు; చతుర్వర్గ చింతామణి, రాజ ప్రశస్తియను గొప్ప గ్రంథములను రచించినవాడు; మోడీ భాషను, ఒక నూతన గణిత విధానమును కనిపెట్టినవాడు. ఇక నేనా? వానికి వ్యతిరేకబుద్ధి గలవాడను, మేధాశక్తి యంతగా లేనివాడను. మరి, సాయిబాబా నాకెందుకీ 'బిరుదు' నొసంగిరో తెలియకుండెను. ఆలోచన చేయగా నిది నా యహంకారమును చంపుటకొక యస్త్రమనియు, నేనెప్పుడును అణకువ నమ్రతలు కలిగి యుండవలెనని బాబా కోరికయయి యుండవచ్చుననియు గ్రహించితిని. అంతకుముందు వాడాలో జరిగిన చర్చలో నే చూపిన తెలివితేటలను బాబా యీ రీతిగా అభినందించియుండవచ్చని యనుకొంటిని.

భవిష్యచ్చరితను బట్టి చూడగా బాబా పలుకులకు (దాభోల్కరును 'హేమాడ్‌పంతు' అనుట) గొప్ప ప్రాముఖ్యము కలదనియు, భవిష్యత్తు తెలిసియే బాబా యట్లనెననియు భావించవచ్చును. ఏలయనగా హేమాడ్‌పంతు శ్రీసాయిబాబా సంస్థానమును చక్కని చాకచక్యముతో నడిపెను. సంస్థానము యొక్క లెక్కలను బాగుగ నుంచెను. అదేకాక భక్తి, జ్ఞానము, నిర్వ్యామోహము, ఆత్మశరణాగతి, ఆత్మసాక్షాత్కారము మొదలగు విషయములతో శ్రీసాయి సచ్చరిత్ర యను గొప్ప గ్రంథమును రచించెను.

### గురువుయొక్క యావశ్యకత

ఈ విషయమై బాబా యేమనెనో హేమాడ్‌పంతు వ్రాసియుండ లేదు. కానీ, కాకాసాహెబు దీక్షిత్ ఈ విషయమును గూర్చి తాను వ్రాసికొనిన దానిని ప్రచురించెను. హేమాడ్‌పంతు బాబాను కలిసిన రెండవ దినము కాకాసాహెబు దీక్షిత్ బాబావద్దకు వచ్చి, "శిరిడీనుండి వెళ్ళ వచ్చునా" యని యడిగెను. బాబా యట్లే యని జవాబిచ్చెను. "ఎక్కడకు" అని ఎవరో యడుగగా, "చాలా పైకి" అని బాబా చెప్పెను. "మార్గమేది" యని దీక్షిత్ యడిగెను. "అక్కడకు పోవుటకు అనేక మార్గములు కలవు. శిరిడీనుంచి కూడ నొక మార్గము కలదు. మార్గము ప్రయానకరమైనది. మార్గమధ్యమున నున్న యడవిలో పులులు, తోడేళ్ళు కల"వని బాబా బదులిడెను. "మార్గదర్శకుని వెంటదీసికొని పోయినచో" నని కాకాసాహెబు యడుగగా, "అట్లయినచో కష్టమే లేద"ని బాబా జవాబిచ్చెను. మార్గదర్శకుడు తిన్నగా గమ్యస్థానము చేర్చును. మార్గమధ్యమున నున్న తోడేళ్ళు, పులులు, గోతులనుండి తప్పించును. మార్గదర్శకుడే లేనిచో అడవి మృగములచే చంపబడవచ్చును. లేదా దారి తప్పి గుంటలలో పడిపోవచ్చుననెను. మశీదులో అప్పుడచ్చటనే యున్న దాభోళ్కరు తన ప్రశ్న కదియే తగిన సమాధానమని గుర్తించెను. వేదాంత విషయములలో మానవుడు స్వేచ్ఛాపరుడా కాడా? యను వివాదము వలన ప్రయోజనము లేదని గ్రహించెను. పరమార్థము నిజముగా గురుబోధలవల్లనే చిక్కుననియు, రామకృష్ణులు తమ గురువులైన వసిష్ఠసాందీపులకు లొంగి యణకువతో నుండి యాత్మసాక్షాత్కారము పొందిరనియు, దానికి దృఢమైన నమ్మకము (నిష్ఠ), ఓపిక (సబూరీ) యను రెండు గుణములు ఆవశ్యకమనియు గ్రహించెను.

రెండవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## మూడవ అధ్యాయము

*సాయిబాబా యనుమతి - వాగ్దానము; భక్తులకు బాబా నియమించిన పనులు;*
*బాబా కథలు సముద్రమధ్యమున దీపస్తంభములు;*
*బాబా ప్రేమ - రోహిలా కథ; అమృతతుల్యములైన బాబా పల్కులు.*

### సాయిబాబా యొక్క యనుమతియు, వాగ్దానమును

**వె**నుకటి యధ్యాయములో వర్ణించిన ప్రకారము శ్రీసాయి సచ్చరిత్ర వ్రాయుటకు బాబా పూర్తి యనుమతి నొసంగుచు ఇట్లు నుడివిరి: "సచ్చరిత్ర వ్రాయు విషయములో నా పూర్తి సమ్మతి గలదు. నీ పనిని నీవు నిర్వర్తించుము. భయపడకుము. మనస్సు నిలకడగా నుంచుము. నా మాటలయందు విశ్వాసముంచుము. నా లీలలు వ్రాసినచో నవిద్య అంతరించి పోవును. శ్రద్ధాభక్తులతో వానిని వినిన వారికి ప్రపంచమందు వ్యామోహము క్షీణించును. బలమైన ప్రేమభక్తి కెరటములు లేచును. ఎవరయితే నా లీలలలో మునిగెదరో వారికి జ్ఞానరత్నములు లభించును."

ఇది విని రచయిత మిక్కిలి సంతసించెను. వెంటనే నిర్భయుడయ్యెను. కార్యము జయప్రదముగా సాగునను ధైర్యము కలిగెను. అటుపైని మాధవరావు దేశపాండే (శ్యామా) వైపు తిరిగి బాబా యిట్లనెను:

"ప్రేమతో నా నామమునుచ్చరించిన వారి కోరిక లన్నియు నెరవేర్చెదను. వారి భక్తిని హెచ్చించెదను. వారి నన్ని దిశలందు కాపాడెదను. ఎవరైతే మనఃపూర్వకముగా నాపై పూర్తిగా నాధారపడియున్నారో వారి కథలు వినునప్పుడు అమితానందమును పొందెదరు. నా లీలలను గానము

చేయువారికంతులేని యానందమును శాశ్వతమైన తృప్తిని ఇచ్చెదనని నమ్ముము. ఎవరయితే నన్ను శరణు వేడెదరో, భక్తివిశ్వాసములతో నన్ను పూజించెదరో, నన్నే స్మరించెదరో, నా రూపమును తమ మనస్సున నిలుపుకొనెదరో, వారిని 'దుఃఖబంధనములనుండి తప్పింతును. ప్రాపంచిక విషయములనన్నింటినీ మరచి, నా నామమునే జపించుచు, నా పూజనే సల్పుచు, నా లీలలను, చరిత్రమును మననము చేయుచు, ఎల్లప్పుడు నన్ను జ్ఞప్తియందుంచుకొనువారు ప్రపంచవిషయములం దెట్లు తగులుకొందురు? వారిని మరణమునుండి బయటకు లాగెదను. నా కథలు వినినచో సకలరోగములు నివారింపబడును. కావున భక్తిశ్రద్ధలతో నా కథలను వినుము. వానిని మనమున నిలుపుము. ఆనందమునకు తృప్తికి నిదియే మార్గము. నా భక్తులయొక్క గర్వాహంకారములు నిష్క్రమించును. నా లీలలు వినువారికి శాంతి కలుగును. మనఃపూర్వకమైన నమ్మకము గలవారికి శుద్ధచైతన్యముతో తాదాత్మ్యము కలుగును. 'సాయి సాయి' యను నామమును జ్ఞప్తి యందుంచుకొన్నంత మాత్రమున, చెడుపలుకుటవలన, వినుటవలన కలుగు పాపములు తొలగిపోవును."

**భక్తులకు వేర్వేరు పనులు నియమించుట**

భగవంతుడు వేర్వేరు భక్తులను వేర్వేరు పనులకు నియమించును. కొందరు దేవాలయములు, మఠములు, తీర్థములలో నదివొడ్డున మెట్లు మొదలగునవి నిర్మించుటకు నియమితు లగుదురు. భగవంతుని లీలలను పాడుటకు కొందరు నియుక్తులగుదురు. కొందరు తీర్థయాత్రలకు పోవుదురు. సచ్చరిత్ర రచన నాకు నియమింపబడినది. విషయజ్ఞానము శూన్యమగుటచే నీ పని నా అర్హతకు మించినది. అయినచో, యింత కఠినమైన పని నేనెందుకు ఆమోదించవలెను? సాయిబాబా జీవితచరిత్రను వర్ణించగల వారెవ్వరు? సాయి యొక్క కరుణయే యింత కఠినకార్యమును నెరవేర్చు శక్తిని నాకు ప్రసాదించినది. నేను చేత కలము పట్టుకొనగనే సాయిబాబా నా యహంకారమును పరిహరించి, వారి కథలను వారే వ్రాసికొనిరి. కనుక ఈ గ్రంథము రచించిన గౌరవము సాయిబాబాకే చెందునుగాని నాకు గాదు.

బ్రాహ్మణుడనై పుట్టినప్పటికిని శ్రుతి స్మృతి యను రెండు కండ్లు లేకుండుటచే సాయిసచ్చరిత్రను నేను వ్రాయలేకుంటిని. కాని భగవంతుని అనుగ్రహము మూగవానిని మాట్లాడునట్లు చేయును; కుంటివానిని పర్వతము దాటునట్లు చేయును. తన యిచ్ఛానుసారము పనులు నెరవేర్చుకొను చాతుర్యము ఆ భగవంతునికే గలదు. హార్మోనియమునకుగాని వేణువునకు గాని ధ్వనులు ఎట్లు వచ్చుచున్నవో తెలియదు. అది వాయించువానికే తెలియును. చంద్రకాంతము ద్రవించుట, సముద్రముప్పొంగుట వానివానివల్ల జరుగవు. అవి చంద్రోదయము వల్ల జరుగును.

**బాబా కథలు దీపస్తంభములు**

సముద్రమధ్యమందు దీపస్తంభము లుండును. పడవలపై పోవువారు ఆ వెలుతురుతో రాళ్ళు రప్పలవల్ల కలుగు హానులను తప్పించుకొని సురక్షితముగా ప్రయాణింతురు. ప్రపంచమను మహాసముద్రములో బాబాకథలను దీపములు దారి చూపును. అవి అమృతముకంటె తియ్యగానుండి ప్రపంచయాత్ర చేయు మార్గమును సులభముగను, సుగమముగను చేయును. యోగీశ్వరుల కథలు పవిత్రములు. అవి మన చెవులద్వారా హృదయమందు ప్రవేశించునప్పుడు శరీరస్పృహయును, అహంకారమును, ద్వంద్వభావములును నిష్క్రమించును. మన హృదయమందు నిల్వయుండిన సందేహములు పటాపంచలయిపోవును. శరీరగర్వము మాయమై పోయి కావలసినంత జ్ఞానము నిల్వచేయబడును. శ్రీసాయిబాబా కీర్తి, వర్ణనలు ప్రేమతో పాడినగాని వినినగాని భక్తుని పాపములు పటాపంచలగును. కాబట్టి యివియే మోక్షమునకు సులభసాధనములు. కృతయుగములో శమదమములు (అనగా నిశ్చలమనస్సు, శరీరము) త్రేతాయుగములో యాగము, ద్వాపరయుగములో పూజ, కలియుగములో భగవన్మహిమలను నామములను పాడుట, మోక్షమార్గములు. నాలుగు వర్ణములవారు ఈ చివరి సాధనమును అవలంబించవచ్చును. తక్కిన సాధనములు అనగా యోగము, యాగము, ధ్యానము, ధారణము అవలంబించుట కష్టతరము. కాని భగవంతుని కీర్తిని మహిమను పాడుట యతి సులభము. మన మనస్సును మాత్రము అటువైపు త్రిప్పవలెను.

భగవత్కథలను వినుటవలన పాడుటవలన మనకు దేహాభిమానము తొలగిపోవును. అది భక్తులను నిర్మోహులుగ జేసి, తుదకు ఆత్మసాక్షాత్కారము పొందునట్లు చేయును. ఈ కారణము చేతనే సాయిబాబా నాకు సహాయపడి నాచే ఈ సచ్చరితామృతమును వ్రాయించెను. భక్తులు దానిని సులభముగ చదువగలరు, వినగలరు. చదువునప్పుడు వినునప్పుడు బాబాను ధ్యానించవచ్చును. వారి స్వరూపమును మనస్సునందు మననము చేసికొనవచ్చును. ఈ ప్రకారముగా గురువునందు తదుపరి భగవంతునియందు భక్తి కలుగును. తుదకు ప్రపంచమందు విరక్తిపొంది యాత్మసాక్షాత్కారము సంపాదించగలుగుదుము. సచ్చరితామృతము వ్రాయుట, తయారుచేయుట బాబాయొక్క కటాక్షము చేతనే సిద్ధించినవి. నేను నిమిత్తమాత్రుడుగనే యుంటిని.

**సాయిబాబా యొక్క మాతృప్రేమ**

ఆవు తన దూడనెట్లు ప్రేమించునో యందరికి తెలిసిన విషయమే. దాని పొదుగెల్లప్పుడు నిండియే యుండును. దూడకు కావలసినప్పుడెల్ల కుడిచినచో పాలు ధారగా కారును. అలాగుననే బిడ్డకు ఎప్పుడు పాలు కావలెనో తల్లి గ్రహించి సకాలమందు పాలిచ్చును. బిడ్డకు గుడ్డలు తొడుగుటయందును, అలంకరించుటయందును తల్లి తగిన శ్రద్ధ తీసికొని సరిగా చేయును. బిడ్డకు ఈ విషయమేమియు తెలియదుగాని, తల్లి తన బిడ్డలు చక్కగా దుస్తులు ధరించి యలంకరింపబడుట చూచి యమితానందము పొందును. తల్లి ప్రేమకు సరిపోల్చ దగిన దేదియు లేదు. అది యసామాన్యము; నిర్వ్యాజము. సద్గురువులు కూడ నీ మాతృప్రేమ వారి శిష్యులందు చూపుదురు. సాయిబాబాకు గూడ నాయందట్టి ప్రేమ యుండెను. దానికీ క్రింది యుదాహరణ మొకటి.

1916వ సంవత్సరంలో నేను సర్కారు ఉద్యోగమునుండి విరమించితిని. నాకీయ నిశ్చయించిన పింఛను కుటుంబమును గౌరవముగా సాకుటకు చాలదు. గురుపౌర్ణమినాడు ఇతరభక్తులతో నేను కూడ శిరిడీకి పోయితిని. అణ్ణా చించణీకర్ నాగురించి బాబాతో నిట్లనెను: "దయచేసి

యీ అన్నాసాహెబ్ యందు దాక్షిణ్యము చూపుము. వానికి వచ్చు పింఛను సరిపోదు, వాని కుటుంబము పెరుగుచున్నది. వాని కింకేదైన ఉద్యోగ మిప్పించుము. వాని యాతురతను తీసి, నిశ్చింతను గలుగచేయుము." అందులకు బాబా యిట్లు జవాబిచ్చెను: "వాని కింకొక ఉద్యోగము దొరుకును. కాని వాడిప్పుడు నా సేవతో తృప్తిపడవలెను. వాని భోజనపాత్రలు ఎప్పుడూ పూర్ణముగనే యుండును. అవి ఎన్నటికిని నిండుకొనవు. వాని దృష్టినంతటిని నావైపు త్రిప్పవలెను. నాస్తికుల దుర్మార్గుల సహవాసము విడువవలెను. అందరియెడల అణకువ నమ్రతలుండవలెను. నన్ను హృదయపూర్వకముగ పూజించవలెను. వాడిట్లు చేసినచో శాశ్వతానందము పొందును."

నన్ను పూజింపుడనుదానిలోని ఈ 'నన్ను' అనగా ఎవరు? అను ప్రశ్నకు సమాధానము యీ గ్రంథము యొక్క **ఉపోద్ఘాతము**లో 'సాయిబాబా ఎవరు' అనుశీర్షిక క్రింద చెప్పిన దానిలో విశదీకరింపబడి యున్నది. చూడుడు!

**రోహిలా కథ**

రోహిలా కథ విన్నచో బాబా ప్రేమ యెట్టిదో బోధపడును. పొడుగాటి వాడును, పొడుగైన చొక్కా తొడిగినవాడును, బలవంతుడునగు రోహిలా యొకడు బాబా కీర్తి విని ఆకర్షితుడై శిరిడీలో స్థిరనివాసము ఏర్పరచుకొనెను. రాత్రింబగళ్ళు **ఖురాను**లోని కల్మాను చదువుచు, "అల్లాహు అక్బర్" యని యాబోతు రంకెవేయునట్లు బిగ్గరగా నరచుచుండెను. అందువలన పగలంతయు పొలములో కష్టపడి పనిచేసి యింటికి వచ్చిన శిరిడీ ప్రజలకు రాత్రి నిద్రాభంగమును అసౌకర్యమును కలుగుచుండెను. కొన్నాళ్ళవరకు వారు దీనినోర్చుకొనిరి. తుదకు ఆ బాధ నోర్వలేక బాబా వద్దకేగి రోహిలా అరపుల నాపుమని బతిమాలిరి. బాబా వారి ఫిర్యాదును వినకపోవుటయే కాక వారిపై కోపించి వారిపనులు వారు చూచుకొనవలసినదే కాని రోహిలా జోలికి పోవద్దని మందలించిరి. "రోహిలాకు ఒక దౌర్భాగ్యపు భార్య గలదనియు, ఆమె గయ్యాళి యనియు, ఆమె వచ్చి రోహిలాను తనను బాధ పెట్టుచున్నదనియు, రోహిలా ప్రార్థనలు విని ఆమె ఏమి చేయలేక ఊరకయుండు"ననియు బాబా చెప్పెను. నిజముగా రోహిలాకు భార్యయే లేదు. భార్యయనగా దుర్బుద్ధియని బాబా

భావము. బాబాకు అన్నిటికంటె దైవ ప్రార్థనలయందు మిక్కుటమగు ప్రేమ. అందుచే రోహిలా తరపున వాదించి, ఊరిలోనివారి నోపికతో నోర్చుకొని ఆ అసౌకర్యమును సహింపవలసినదనియు, నది త్వరలో తగ్గుననియు బాబా బుద్ధి చెప్పెను.

**బాబా యొక్క యమృతతుల్యమగు పలుకులు**

ఒకనాడు మధ్యాహ్న ఆరతి యయిన పిమ్మట భక్తులందరు తమ తమ బసలకు పోవుచుండిరి. అప్పుడు వారికి బాబా యీ క్రింది చక్కని యుపదేశమిచ్చిరి:

*"మీరెక్కడ నున్ననూ, ఏమి చేయుచున్ననూ నాకు తెలియునని బాగుగా జ్ఞాపకముంచుకొనుడు. నేనందరి హృదయముల పాలించువాడను. అందరి హృదయములలో నివసించువాడను. నేను ప్రపంచమందుగల చరాచరజీవకోటి నావరించియున్నాను. ఈ జగత్తును నడిపించువాడను, సూత్రధారిని నేనే. నేనే జగన్మాతను, త్రిగుణముల సామరస్యమును నేనే, ఇంద్రియచాలకుడను నేనే. సృష్టిస్థితిలయకారకుడను నేనే. ఎవరయితే తమ దృష్టిని నావైపు త్రిప్పెదరో వారి కేహానిగాని బాధగాని కలుగదు. నన్ను మరచిన వారిని మాయ శిక్షించును. పురుగులు, చీమలు తదితర దృశ్యమాన చరాచరజీవకోటి యంతయు నా శరీరమే, నా రూపమే!"*

ఈ చక్కని యమూల్యమైన మాటలు విని వెంటనే నా మనస్సులో యే నౌకరీ కొరకు యత్నించక, గురుసేవలోనే నిమగ్నమగుటకు నిశ్చయించుకొంటిని. కాని, అణ్ణా చించణీకరు ప్రశ్నకు బాబా చెప్పిన సమాధానము నా మనస్సునందుండెను. అది జరుగునా లేదా యని సందేహము కలుగుచుండెను. భవిష్యత్తులో బాబా పలికిన పలుకులు సత్యములైనవి. నాకొక సర్కారు ఉద్యోగము దొరకెను. కాని అది కొద్దికాలము వరకే. అటుపిమ్మట వేరే పని యేదియు చేయక శ్రీసాయిసేవకు నా జీవితమంతయు సమర్పించితిని.

ఈ యధ్యాయమును ముగించబోవుముందు చదువరులకు నేను చెప్పునదేమన, బద్ధకము నిద్ర చంచలమనస్సు దేహాభిమానము మొదలగు వానిని విడిచి, వారు తమ యావత్తు దృష్టిని సాయిబాబా కథలవైపు త్రిప్పవలెను. వారి ప్రేమ సహజముగా నుండవలెను. వారు భక్తి యొక్క రహస్యమును తెలిసికొందురుగాక. ఇతర మార్గము లవలంబించి అనవసరముగా నలసిపోవద్దు. అందరు నొకే మార్గమును త్రొక్కుదురు గాక! అనగా శ్రీసాయి కథలను విందురు గాక! ఇది వారి యజ్ఞానమును నశింపజేయును. మోక్షమును సంపాదించి పెట్టును. లోభి యెక్కడ నున్నప్పటికిని వాని మనస్సు తాను పాతిపెట్టిన సొత్తునందే యుండునట్లు, బాబాను కూడ నెల్లరు తమ హృదయములందు స్థాపించుకొందురుగాక!

మూడవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నాలుగవ అధ్యాయము

*యోగీశ్వరుల కర్తవ్యము - పవిత్ర శిరిడీ క్షేత్రము - సాయిబాబా యొక్క రూపురేఖలు - గౌలిబువాగారి వాక్కు - విఠల దర్శనము - క్షీరసాగరుని కథ - దాసగణు ప్రయాగస్నానము - సాయిబాబా అయోనిసంభవము - శిరిడీకి వారి మొదటి రాక - మూడు బసలు - యోగీశ్వరుల కర్తవ్యము*

భగవద్గీత చతుర్థాధ్యాయమున 7-8 శ్లోకములందు శ్రీకృష్ణ పరమాత్ముడు ఇట్లు సెలవిచ్చియున్నారు. "ధర్మము నశించునప్పుడు అధర్మము వృద్ధి పొందునప్పుడు నేను అవతరించెదను. సన్మార్గులను రక్షించుటకు, దుర్మార్గులను శిక్షించుటకు, ధర్మస్థాపన కొరకు, యుగయుగములందు అవతరించెదను." ఇదియే భగవంతుని కర్తవ్యకర్మ. భగవంతుని ప్రతినిధులగు యోగులు సన్యాసులు అవసరము వచ్చినపుడెల్ల అవతరించి ఆ కర్తవ్యమును నిర్వర్తించెదరు. ద్విజులగు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య జాతులవారు తమకర్మలను మానునప్పుడు, శూద్రులు పైజాతులవారి హక్కులను అపహరించునప్పుడు, మతగురువులను గౌరవించక యవమానించునప్పుడు, ఎవరును మతబోధలను లక్ష్యపెట్టనప్పుడు, ప్రతివాడును గొప్ప పండితుడనని యనుకొనునప్పుడు, జనులు నిషిద్ధాహారములు మద్యపానముల కలవాటుపడినప్పుడు, మతము పేరుతో కాని పనులు చేయునప్పుడు, వేర్వేరు మతములవారు తమలోతాము కలహించునప్పుడు, బ్రాహ్మణులు సంధ్యావందనము మానునప్పుడు, సనాతనులు తమ మతాచారములు పాటించనప్పుడు, ప్రజలు ధనదారాసంతానములే జీవిత పరమార్థముగా భావించి మోక్షమార్గమును మరచునప్పుడు, యోగీశ్వరులుద్భవించి వారి వాక్కాయకర్మలచే ప్రజలను

సవ్యమార్గమున బెట్టి వ్యవహారముల చక్కదిద్దుదురు. వారు దీపస్తంభములవలె సహాయపడి, మనము నడువవలసిన సన్మార్గమును సత్ప్రవర్తనమును నిర్దేశించెదరు. ఈ విధముగనే నివృత్తి, జ్ఞానదేవు, ముక్తాబాయి, నామదేవు, జానాబాయి, గోరా, గోణాయీ, ఏకనాథుడు, తుకారాము, నరహరి, నర్సిబాయి, సజన్‌కసాయి, సాంవతమాలి, రామదాసు, మొదలుగాగల యోగులును, తదితరులును వేర్వేరు సమయములందుద్భవించి మనకు సవ్యమైన మార్గమును జూపిరి. అట్లే సాయిబాబాగూడ సకాలమందు శిరిడీ చేరిరి.

### పవిత్ర శిరిడీ క్షేత్రము

అహమదునగరు జిల్లాలోని గోదావరినది ప్రాంతములు చాలా పుణ్యతమములు. ఏలయన నచ్చట ననేక యోగులుద్భవించిరి, నివసించిరి. అట్టి వారిలో ముఖ్యులు శ్రీజ్ఞానేశ్వర్ మహరాజ్. శిరిడీ గ్రామము అహమదు నగరు జిల్లాలోని కోపర్‌గాం తాలూకాకు చెందినది. కోపర్‌గాం వద్ద గోదావరి దాటి శిరిడీకి పోవలెను. నది దాటి 3 కోసులు పోయినచో నీమ్‌గాంవ్ వచ్చును. అచ్చటికి శిరిడీ కనిపించును. కృష్ణా తీరమందుగల గాణగాపురము, నరసింహవాడి, ఔదుంబర్ మొదలుగా గల పుణ్యక్షేత్రములవలె శిరిడీకూడ గొప్పగా పేరు గాంచినది. పండరీపురమునకు సమీపమున గల మంగళవేఢ యందు భక్తుడగు దామాజీ, సజ్జనగఢ మందు సమర్థరామదాసు, నర్సోబాచీవాడీయందు శ్రీనరసింహ సరస్వతీస్వామివార్లు వర్ధిల్లినట్లే శ్రీసాయినాథుడు శిరిడీలో వర్ధిల్లి దానిని పవిత్ర మొనర్చెను.

### సాయిబాబా రూపురేఖలు

సాయిబాబా వలననే శిరిడీ ప్రాముఖ్యము వహించినది. సాయిబాబా యెట్టి వ్యక్తియో పరిశీలింతము. వారు కష్టతరమైన సంసారమును జయించినవారు. శాంతియే వారి భూషణము. వారు జ్ఞానమూర్తులు, వైష్ణవభక్తుల కిల్లువంటివారు; ఉదారస్వభావులు; సారములోని సారాంశమువంటివారు; నశించు వస్తువులందభిమానము లేనివారు; ఎల్లప్పుడు ఆత్మసాక్షాత్కారమందే మునిగియుండెడివారు; భూలోకమందుగాని, స్వర్గలోకమందుగాని గల వస్తువులయందభిమానము లేనివారు. వారి

యంతరంగము అద్దమువలె స్వచ్ఛమైనది. వారి వాక్కులనుండి యమృతము స్రవించుచుండెను. గొప్పవారు, బీదవారు, వారికి సమానమే. వారు మానావమానాలను లెక్కించినవారు కారు. అందరికి వారు ప్రభువు. అందరితో కలసిమెలసి యుండెడివారు. ఆటలు గాంచెడివారు; పాటలను వినుచుండెడివారు. కానీ సమాధి స్థితినుండి మరలువారు కారు. ఎల్లప్పుడు అల్లా నామము నుచ్చరించుచుండెడివారు. ప్రపంచమంతా మేలుకొనునప్పుడు వారు యోగనిద్రయందుండెడివారు. లోకము నిద్రించినప్పుడు వారు మెలకువతో నుండెడివారు. వారి యంతరంగము లోతయిన సముద్రమువలె ప్రశాంతము. వారి యాశ్రమము, వారి చర్యలు ఇదమిత్థముగా నిశ్చయించుటకు వీలుకానివి. ఒకచోటనే కూర్చుండియున్నప్పటికిని ప్రపంచమందు జరుగు సంగతులన్నియు వారికి తెలియును. వారి దర్బారు ఘనమైనది. నిత్యము వందలకొలది కథలు చెప్పినప్పటికిని మౌనము తప్పెడివారు కారు. ఎల్లప్పుడు మసీదుగోడకు ఆనుకొని నిలుచువారు. లేదా, ఉదయము మధ్యాహ్నము సాయంత్రము లెండీ తోటవైపుగాని చావడివైపుగాని పచార్లు చేయుచుండెడివారు. ఎల్లప్పుడు ఆత్మధ్యానమునందే మునిగి యుండెడివారు. సిద్ధపురుషుడైనప్పటికిని సాధకునివలె నటించువారు. అణకువ నమ్రత కలిగి, యహంకారము లేక యందరిని ఆనందింపజేయువారు. అట్టివారు సాయిబాబా. శిరిడీ నేల వారి పాదస్పర్శచే గొప్ప ప్రాముఖ్యము పొందినది. జ్ఞానేశ్వర్ మహరాజ్ ఆళందిని వృద్ధి చేసినట్లు, ఏకనాథుడు పైఠానును వృద్ధి చేసినట్లు శ్రీసాయిబాబా శిరిడీని వృద్ధి చేసెను. శిరిడీలోని గడ్డి రాళ్ళు పుణ్యము చేసికొన్నవి. ఏలయన బాబా పవిత్రపాదములను ముద్దు పెట్టుకొని వారి పాదధూళి తలపైని వేసికొనగలిగినవి. శిరిడీ మావంటి భక్తులకు పండరీపురము, జగన్నాథము, ద్వారక, కాశి, రామేశ్వరము, బదరీకేదార్, నాసిక్, త్ర్యంబకేశ్వరము, ఉజ్జయిని, మహాబలేశ్వరము, గోకర్ణములవంటిదయినది. శిరిడీ సాయిబాబా స్పర్శయే మాకు వేదపారాయణతంత్రము. అది మాకు సంసారబంధముల సన్నగిలచేసి యాత్మసాక్షాత్కారమును సులభసాధ్యము చేయును. శ్రీసాయి దర్శనమే మాకు యోగసాధనముగా నుండెను. వారితో సంభాషణ మా పాపములను తొలగించుచుండెను. త్రివేణీ ప్రయాగల

స్నానఫలము వారి పాదసేవ వలననే కలుగుచుండెడిది. వారి పాదోదకము మాకోరికలను నశింపజేయుచుండెడిది. వారి యాజ్ఞ మాకు వేదవాక్కుగా నుండెడిది. వారి ఊదీ ప్రసాదము మమ్ము పావనము చేయుచుండెను. వారు మాపాలిట శ్రీకృష్ణుడుగ, శ్రీరాముడుగా నుండి ఉపశమనము కలుగజేయుచుండిరి. వారు మాకు పరబ్రహ్మస్వరూపమే. వారు ద్వంద్వాతీతులు; నిరుత్సాహముగాని ఉల్లాసముగాని యెరుగరు. వారు ఎల్లప్పుడు సచ్చిదానందస్వరూపులుగా నుండెడివారు. శిరిడీ వారి కేంద్రమైనను వారి లీలలు పంజాబు, కలకత్తా, ఉత్తర హిందూస్థానము, గుజరాతు, దక్కను, కన్నడదేశములలో చూపుచుండిరి. ఇట్లు వారి కీర్తి దూరదేశములకు వ్యాపించగా, భక్తు లన్నిదేశములనుండి శిరిడీ చేరి వారిని దర్శించి వారి యాశీర్వాదమును పొందుచుండిరి. వారి దర్శన మాత్రముననే భక్తుల మనములు వెంటనే శాంతి వహించుచుండెడివి. పండరీపురమందు విఠల్ రఖుమాయిలను దర్శించినచో భక్తులకు కలిగెడి యానందము శిరిడీలో దొరకుచుండెడిది. ఇది యతిశయోక్తి కాదు. ఈ విషయమును గూర్చి భక్తుడొకడు చెప్పినది గమనింపుడు.

**గౌలిబువా అభిప్రాయము**

95 సంవత్సరముల వయస్సుగల గౌలిబువా యను వృద్ధభక్తుడు ఒకడు పండరీయాత్ర ప్రతిసంవత్సరము చేయువాడు.ఎనిమిది మాసములు పండరీపురమందు, మిగత నాలుగు మాసములు -- ఆషాఢము మొదలు కార్తీకమువరకు (జూలై - నవంబరు) -- గంగానది యొడ్డునను ఉండెడివాడు. సామాను మోయుటకొక గాడిదను, తోడుగా నొక శిష్యుని తీసికొని పోవువాడు. ప్రతి సంవత్సరము పండరీయాత్ర చేసికొని శిరిడీ సాయిబాబా దర్శనమునకై వచ్చెడివాడు. అతడు బాబాను మిగుల ప్రేమించువాడు. అతడు బాబా వైపు చూచుచూ యిట్లనెడివాడు: "*వీరు పండరీనాథుని యవతారమే! అనాథల కొరకు, బీదల కొరకు వెలసిన కారుణ్యమూర్తి!*" గౌలిబువా విఠోబాదేవుని ముసలిభక్తుడు. పండరీయాత్ర యెన్ని సారులో చేసెను. వీరు సాయిబాబా పండరీనాథుని యవతారమని నిర్ధారణ పరచిరి.

## విఠలదేవుడు దర్శనమిచ్చుట

సాయిబాబాకు భగవన్నామస్మరణయందును, సంకీర్తనమందును మిక్కిలి ప్రీతి. వారెప్పుడు 'అల్లా మాలిక్' -- అనగా, 'అల్లాయే యజమాని' -- అని యనుచుండెడివారు. ఏడు రాత్రింబగళ్ళు భగవన్నామస్మరణ చేయించుచుండెడివారు. దీనినే నామసప్తాహమందురు. బాబా ఒకప్పుడు దాసగణు మహారాజును నామసప్తాహము చేయుమనిరి. సప్తాహము ముగియునాడు విఠల్ దర్శనము కలుగునని వాగ్దానమిచ్చినచో నామసప్తాహమును సలిపెదనని దాసగణు జవాబిచ్చెను. బాబా తన గుండెపై చేయి వేసి, *"తప్పనిసరిగ దర్శనమిచ్చును గాని, భక్తుడు భక్తి ప్రేమలతో నుండవలెను. డాకూరునాథ్ యొక్క డాకూరు పట్టణము, విఠల్ యొక్క పండరీ పురము, శ్రీకృష్ణుని ద్వారకా పట్టణము, ఇక్కడనే -- యనగా శిరిడీలోనే -- యున్నవి. ఎవరును ద్వారకకు పోవలసిన అవసరము లేదు. విఠలుడు ఇక్కడనే యున్నాడు. భక్తుడు భక్తిప్రేమలతో కీర్తించునప్పుడు విఠలుడిక్కడనే యవతరించును"* అనెను.

సప్తాహము ముగిసిన పిమ్మట విఠలుడీ క్రింది విధముగా దర్శనమిచ్చెను. స్నానానంతరము కాకాసాహెబు దీక్షిత్ ధ్యానములో మునిగినప్పుడు విఠలుడు వారికి గాన్పించెను. కాకా మధ్యాహ్నారతి కొరకు బాబా యొద్దకు పోగా తేటతెల్లముగా కాకాను బాబా యిట్లడిగెను. *"విఠల్ పాటిల్ వచ్చినాడా? నీవు వానిని జూచితివా? వాడు మిక్కిలి పారుబోతు. వానిని దృఢముగా పట్టుకొనుము. ఏమాత్రము అజాగ్రత్తగ నున్నను తప్పించుకొని పారిపోవును."* ఇది ఉదయము జరిగెను. మధ్యాహ్నము ఎవడో పటముల నమ్మువాడు 25, 30 విఠోబా చిత్రపటములను అమ్మకమునకు తెచ్చెను. ఆ పటము సరిగా కాకాసాహెబు ధ్యానములో చూచిన దృశ్యముతో పోలియుండెను. దీనిని జూచి బాబామాటలు జ్ఞాపకమునకు దెచ్చుకొని, కాకాసాహెబు ఆశ్చర్యానందములలో మునిగెను. విఠోబా పటము నొకటి కొని పూజామందిరములో నుంచుకొనెను.

## భగవంతరావు క్షీరసాగరుని కథ

విఠలపూజయందు బాబాకెంత ప్రీతియో భగవంతరావు క్షీరసాగరుని కథలో విశదీకరింపబడినది. భగవంతరావు తండ్రి విఠోబా భక్తుడు. పండరీ పురమునకు నియమముగ యాత్ర చేయుచుండెడివాడు. ఇంటివద్ద కూడ విఠోబా ప్రతిమనుంచి దానిని పూజించువాడు. అతడు మరణించిన పిమ్మట వారి కొడుకు పూజను, యాత్రను, శ్రాద్ధమును మానెను. భగవంతరావు శిరిడీ వచ్చినప్పుడు, బాబా వాని తండ్రిని జ్ఞప్తికి దెచ్చుకొని: "వీని తండ్రి నా స్నేహితుడు గాన వీని నిచ్చటకు ఈడ్చుకొని వచ్చితిని. వీడు నైవేద్యము ఎన్నడు పెట్టలేదు. కావున నన్నును విఠలుని కూడ ఆకలితో మాడ్చినాడు. అందుచేత వీని నిక్కడకు తెచ్చితిని. వీడు చేయునది తప్పని బోధించి చివాట్లు పెట్టి తిరిగి పూజ ప్రారంభించునట్లు చేసెదను," అనిరి.

## ప్రయాగ క్షేత్రములో దాసగణు స్నానము

గంగానది యమునానది కలియుచోటునకు ప్రయాగయని పేరు. ఇందులో స్నానమాచరించిన ప్రతివానికి గొప్ప పుణ్యము ప్రాప్తించునని హిందువుల నమ్మకము. అందుచేతనే వేలకొలది భక్తులు అప్పుడప్పుడచటికి పోయి స్నానమాడుదురు. దాసగణుకూడా ప్రయాగ పోయి అచ్చట సంగమములో స్నానము చేయవలెనని మనస్సున దలచెను. బాబా వద్దకేగి యనుమతించమనెను. అందుకు బాబా యిట్లు జవాబిచ్చెను. "అంత దూరము పోవలసిన అవసరమే లేదు. మన ప్రయాగ యిచ్చటనే కలదు. నా మాటలు విశ్వసింపుము." ఇట్లనునంతలో నాశ్చర్యములన్నిటికంటె నాశ్చర్యకరమైన వింత జరిగినది. దాసగణు మహరాజ్ బాబా పాదములపై శిరస్సునుంచిన వెంటనే బాబా రెండుపాదముల బొటన వ్రేళ్ళనుండి గంగాయమునా జలములు కాలువలుగా పారెను. ఈ చమత్కారమును చూచి దాసగణు ఆశ్చర్యచకితుడయ్యాడు. భక్త్యావేశాలతో మైమరచాడు. కన్నులు ఆనందాశ్రువులతో నిండాయి. అతని హృదయంలో పుప్పొంగిన కవితావేశం శ్రీసాయిలీలాగానరూపంలో పెళ్ళుకుబికింది.

**బాబా అయోనిసంభవుడు; శిరిడీ మొట్టమొదట ప్రవేశించుట**

సాయిబాబా తల్లిదండ్రులను గూర్చిగాని, జన్మము గూర్చిగాని జన్మస్థానమును గూర్చిగాని యెవరికి ఏమియు తెలియదు. ఎందరో పెక్కుసారులీ విషయములు కనుగొనుటకు ప్రయత్నించిరి. పలుసార్లీ విషయముగ బాబాను ప్రశ్నించిరి గాని, యెట్టి సమాధానము గాని సమాచారము గాని పొందకుండిరి. నామదేవు, కబీరు, సామాన్యమానవులవలె జన్మించియుండలేదు. ముత్యపుచిప్పలలో చిన్న పాపలవలె లభించిరి. నామదేవుడు భీమారథి నదీతటమున గోణాయికి కనిపించెను. కబీరు భాగీరథీనదీతటమున తమాలుకు కనిపించెను. అట్టిదే సాయి జన్మ వృత్తాంతము. భక్తుల కొరకు బాబా పదునారేళ్ళ బాలుడుగా శిరిడీలోని వేపచెట్టు క్రింద నవతరించెను. బాబా అప్పటికే బ్రహ్మజ్ఞానిగా గాన్పించెను. బాబా స్వప్నావస్థయందయినను ప్రపంచవస్తువులను కాంక్షించెడివారు కాదు. ఆయన మాయను తన్నెను. ముక్తి బాబా పాదములను సేవించుచుండెను. నానా చోప్దారు తల్లి మిక్కిలి ముసలిది. ఆమె బాబా నిట్లు వర్ణించినది. "ఈ చక్కని చురుకైన కుఱ్ఱవాడు వేపచెట్టుక్రింద ఆసనములో నుండెను. శీతోష్ణములను లెక్కింపక యంతటి చిన్న కుఱ్ఱవాడు కఠినతపమాచరించుట సమాధిలో మునుగుట చూచి గ్రామస్థులు ఆశ్చర్యపడిరి. ఆ బాలుడు పగలు ఎవరితో కలిసెడివాడు కాదు. రాత్రియందెవరికి భయపడువాడు కాడు. చూచినవారాశ్చర్య నిమగ్నులై యీ చిన్నకుఱ్ఱ వాడెక్కడనుండి వచ్చినాడని యడుగసాగిరి. అతని రూపు, ముఖలక్షణములు చాల అందముగ నుండెను. చూచినవారెల్లరు ఒక్కసారిగ ముగ్ధులగుచుండిరి. ఆయన ఎవరి యింటికి పోకుండెను, ఎల్లప్పుడు వేపచెట్టు క్రిందనే కూర్చొనువాడు. పైకి చిన్నబాలునివలె గాన్పించినప్పటికిని చేతలను బట్టి చూడగా నిజముగా మహానుభావుడే. నిర్వ్యామోహము రూపుదాల్చిన యాతని గూర్చి యెవరికి నేమి తెలియకుండెను." ఒకనాడు ఖండోబా దేవుడొకని నావేశించగా నీ బాలు డెవడయి యుండునని ప్రశ్నించిరి. వాని తల్లిదండ్రు లెవరని, ఎచ్చటినుండి వచ్చినాడని యడిగిరి. ఆ ఖండోబా గణము యొక స్థలమును చూపి, గడ్డపారను దీసికొని వచ్చి యచ్చట త్రవ్వుమనెను. అట్లు త్రవ్వగా నందులో

కొన్ని నిటుకలు, వాని దిగువ వెడల్పు రాయి యొకటి గాన్పించెను. ఆ బండను తొలగించగా క్రిందనొక సందు గాన్పించెను. అచ్చట నాలుగు దీపములు వెలుగుచుండెను. ఆసొరంగము ద్వారా ముందుకుపోగా నచ్చట నొక భూగృహము కాన్పించెను. అందులో గోముఖ నిర్మాణములు, కఱ్ఱ బల్లలు, జపమాలలు గాన్పించెను. ఈ బాలుడచ్చట 12 సంవత్సరములు తపస్సు నభ్యసించెనని ఖండోబా చెప్పెను. పిమ్మట కుఱ్ఱవాని నీ విషయము ప్రశ్నించగా, వారలను మరపించుచు అది తన గురుస్థానమనియు, వారి సమాధి యచ్చట గలదు గావున దానిని కాపాడవలెననియు చెప్పెను. వెంటనే దాని నెప్పటివలె మూసివేసిరి. అశ్వత్థ ఉదుంబర వృక్షములవలె నీ వేపచెట్టును పవిత్రముగా చూచుకొనుచు బాబా ప్రేమించువాడు. మహాల్సాపతి తదితర శిరిడీలోని భక్తులు దీనిని బాబాయొక్క గురువుగారి సమాధిస్థానమని భావించి సాష్టాంగనమస్కారములు చేసెదరు.

### మూడు వసతిగృహాములు

వేపచెట్టును, దాని చుట్టునున్న స్థలమును హరివినాయక సాఠే అనువాడు కొని సాఠేవాడాయను నొక పెద్ద వసతిగృహమును గట్టించెను. అప్పట్లో శిరిడీకి పోయిన భక్తమండలికిది యొక్కటియే నివాసస్థలము. వేపచెట్టు చుట్టు ఎత్తుగా అరుగు కట్టిరి. మెట్లు నిర్మించిరి. మెట్ల దిగువన నొక గూడు వంటిది గలదు. భక్తులు మండపముపై నుత్తరాభిముఖముగా కూర్చొనెదరు. ఎవరిచ్చట గురుశుక్రవారములు ధూపము వేయుదురో వారు బాబా కృపవల్ల సంతోషముతో నుండెదరు. ఈ వాడా చాల పురాతనమైనది. కావున మరమ్మతునకు సిద్ధముగా నుండెను. తగిన మార్పులు మరమ్మతులు సంస్థానమువారు చేసిరి.

కొన్ని సంవత్సరముల పిమ్మట దీక్షిత్ వాడాయను పేర ఇంకొక వసతి గృహము కట్టబడినది. న్యాయవాదియైన కాకాసాహెబు దీక్షిత్ ఇంగ్లండుకు బోయెను. అచ్చట రైలు ప్రమాదమున కాలు కుంటుపడెను. అది యెంత ప్రయత్నించినను బాగు కాలేదు. తన స్నేహితుడగు నానాసాహెబు చాందోర్కరు శిరిడీ సాయిబాబాను దర్శించుమని సలహా యిచ్చెను.

1909వ సంవత్సరమున కాకా శిరిడీకి బోయెను. బాబా దర్శనమాత్రమున అమితానందభరితుడై శిరిడీలో నివసించుటకు నిశ్చయించుకొనెను. కాలు కుంటితనముకన్న తన మనస్సులోని కుంటితనమును తీసివేయుమని బాబాను ప్రార్థించెను. తన కొరకును, ఇతర భక్తులకును పనికి వచ్చునట్లు ఒక వాడాను నిర్మించెను. 10-12-1910వ తారీఖున ఈ వాడా కట్టుటకు పునాది వేసిరి. అనాడే రెండు ముఖ్యమైన సంఘటనలు జరిగెను. (1) దాదాసాహెబు ఖాపర్డేకు తన ఇంటికి బోవుటకు బాబా సమ్మతి దొరికెను. (2) చావడిలో శేజ్ (రాత్రి) ఆరతి ప్రారంభమయ్యెను. దీక్షిత్‌వాడా పూర్తికాగానే 1911వ సంవత్సరములో శ్రీరామనవమి సమయమందు శాస్త్రోక్తముగా గృహప్రవేశము జరిపిరి.

తరువాత, కోటీశ్వరుడును నాగపూరు నివాసియునగు బూటీ మరియొక పెద్ద రాతి మేడను నిర్మించెను. అతడు చాల ద్రవ్యము దీనికొరకు వెచ్చించెను. వెచ్చించిన ద్రవ్యమంతయు నిజమునకు సార్థకమయ్యెను. ఏలయన బాబాగారి భౌతికశరీర మందులో సమాధి చేయబడినది. దీనినే సమాధిమందిర మందురు. ఈ స్థలములో మొట్టమొదట పూలతోట యుండెను. ఆ తోటలో బాబాయే తోటమాలిగా మొక్కలకు నీళ్ళు పోయుట మొదలగునవి చేసెడివారు.

ఇట్లు మూడు వాడాలు (వసతి గృహములు) కట్టబడెను. అంతకు ముందిచ్చట ఒక్క వసతిగృహము కూడ లేకుండెను. అన్నిటికంటె సాతేవాడా మొదటి రోజులలో అందరికి చాలా ఉపకరించుచుండెను.

నాలుగవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## అయిదవ అధ్యాయము

*చాంద్‌పాటీలు పెండ్లి బృందముతో కలసి బాబా తిరిగి శిరిడీ రాక; 'సాయి'యను నామము; ఇతర యోగులతో సహవాసము; పాదుకల చరిత్ర; మొహియొద్దీన్‌తో కుస్తీ; జీవితములో మార్పు; నీళ్లను నూనెగా మార్చుట; జవ్హర్ అల్లీ యను కపటగురువు.*

### పెండ్లివారితో కలసి బాబా తిరిగి శిరిడీకి వచ్చుట

ఔరంగాబాద్ జిల్లాలో ధూప్ అను గ్రామము కలదు. అచ్చట ధనికుడగు మహమ్మదీయు డొకడుండెను. అతని పేరు చాంద్‌పాటీలు. ఔరంగాబాదు పోవుచుండగా అతని గుఱ్ఱము తప్పిపోయెను. రెండుమాసములు వెదకినను దానియంతు దొరకకుండెను. అతడు నిరాశచెంది భుజముపై జీను వేసుకొని ఔరంగాబాదునుండి ధూప్ గ్రామమునకు పోవుచుండెను. సుమారొక తొమ్మిది మైళ్ళు నడచిన పిమ్మట నొక మామిడిచెట్టు వద్దకు వచ్చెను. దాని నీడలో నొక వింత పురుషుడు కూర్చొనియుండెను. అతడు తలపై టోపి పొడగైన చొక్కా ధరించియుండెను. చంకలో సటకా పెట్టుకొని చిలుము త్రాగుటకు ప్రయత్నించుచుండెను. దారి వెంట పోవు చాంద్‌పాటీలును జూచి, అతనిని బిలిచి చిలుము త్రాగి కొంత తడవు విశ్రాంతి గొనుమనెను. జీను గురించి ప్రశ్నించెను. అది తాను పోగొట్టుకొనిన గుఱ్ఱముదని చాంద్‌పాటీల్ బదులు చెప్పెను. ఆ దగ్గరలోనున్న కాలువ ప్రక్కన వెదకుమని ఫకీరు చెప్పెను. అతడచటకు పోయి గడ్డి మేయుచున్న గుఱ్ఱమును చూచి మిక్కిలి యాశ్చర్యపడెను. ఈ ఫకీరు సాధారణమనుజుడు కాడనియు గొప్ప ఔలియా (సిద్ధపురుషుడు) అయియుండవచ్చు ననియు అనుకొనెను.

గుఱ్ఱమును దీసికొని ఫకీరువద్దకు వచ్చెను. చిలుము తయారుగా నుండెను. కాని చిలుము వెలిగించుటకు నిప్పు, గుడ్డను తడుపుటకు నీరు కావలసియుండెను. ఫకీరు సటకాను భూమిలోనికి గ్రుచ్చగా నిప్పు వచ్చెను. మరల అక్కడే సటకాతో నేలపై మోదగా నీరు వచ్చెను. ఫకీరు చ్ఛాపీ (గుడ్డ ముక్క) నా నీటితో తడిపి, నిప్పుతో చిలుమును వెలిగించెను. అటుల సిద్ధమైన చిలుమును ఆ ఫకీరు తాను పీల్చి, తరువాత చాంద్‌పాటీలు కందించెను. ఇదంతయు జూచి చాంద్‌పాటీలు ఆశ్చర్యచకితుడయ్యెను. ఫకీరును తన గృహమునకు అతిథిగా రమ్మని చాంద్‌పాటీలు వేడెను. ఆ మరుసటిదినమే ఫకీరు పాటీలు ఇంటికి పోయి యచ్చట కొంతకాలముండెను. ఆ పాటీలు గ్రామమునకు మునసబు. అతని భార్య తమ్ముని కొడుకు పెండ్లి సమీపించెను. పెండ్లి కూతురుది శిరిడీ గ్రామము. అందుచే కావలసిన సన్నాహములన్నియు చేసికొని పాటీలు శిరిడీ ప్రయాణమయ్యెను. పెండ్లివారితో కలసి ఫకీరు కూడా బయలుదేరెను. ఎట్టి చిక్కులు లేక వివాహము జరిగిపోయెను. పెండ్లివారు ధూప్ గ్రామము తిరిగి వెళ్ళిరి గాని ఫకీరు మాత్రము శిరిడీలో ఆగి, యచ్చటనే స్థిరముగా నిలిచెను.

### ఫకీరుకు 'సాయి' నామ మెట్లు వచ్చెను?

పెండ్లివారు శిరిడీ చేరగనే ఖండోబా మందిరమునకు సమీపమున నున్న భక్త మహల్సాపతిగారి పొలములో నున్న మఱ్ఱిచెట్టు క్రింద బస చేసిరి. ఖండోబామందిరమునకు తగిలియున్న ఖాళీ జాగాలో బండ్లు విడిచిరి. బండ్లలో నున్నవారొకరి తరువాత నొకరు దిగిరి. ఫకీరు కూడ దిగెను. బండి దిగుచున్న యువ ఫకీరును జూచి భక్త మహల్సాపతి, "రండి సాయీ!"యని స్వాగతించెను. తక్కినవారు గూడ ఆయనను 'సాయి'యని పిలువనారంభించిరి. అది మొదలు వారు 'సాయిబాబా'గా ప్రఖ్యాతులైరి.

### ఇతరయోగులతో సహవాసము

సాయిబాబా శిరిడీలో నొక మసీదులో నివాస మేర్పరచుకొనిరి. బాబా శిరిడీకి రాక పూర్వమే దేవీదాను అను యోగి శిరిడీలో ఎన్నో సంవత్సరములనుండి నివసించుచుండెను. బాబా అతనితో సాంగత్యమున

కిష్టపడెను. అతనితో కలసి కొంతకాలము మారుతీ మందిరములోను, చావడిలోను నుండెను. కొంతకాల మొంటరిగా నుండెను. అంతలో జానకీదాసు గోసావి అను నింకొక యోగి యచ్చటకు వచ్చెను. బాబా అప్పుడప్పుడు ఈ యోగితో మాట్లాడుచుండెడివారు లేదా, బాబా ఉండు చోటుకు జానకీదాసు పోవుచుండెను. అటులనే, పుణతాంబే నుండి యొక వైశ్యయోగి శిరిడీ వచ్చుచుండెడివాడు. ఆయన గృహస్థుడు; పేరు గంగాగీరు. ఒకనాడు, బాబా స్వయముగా కుండలతో నీళ్ళు తెచ్చి పూలచెట్లకు పోయుచుండుట జూచి అతడు శిరిడీ గ్రామస్థులతో నిట్లనెను. *"ఈ మణి యిచ్చటుండుటచే శిరిడీ పుణ్యక్షేత్రమైనది. ఈయనీనాడు కుండలతో నీళ్ళు మోయుచున్నాడు. కాని యితడు సామాన్యమానవుడు కాడు. ఈ నేల నిజముగ పుణ్యము చేసికొనినది. కనుకనే సాయిబాబా యను నీ మణిని రాబట్టుకొనగలిగెను."* ఏవలా గ్రామములో నున్న మఠములో ఆనందనాథుడను యోగిపుంగవుడుండెను. అతడు అక్కల్‌కోటకర్ మహరాజ్ గారి శిష్యుడు. అతడొకనాడు శిరిడీ గ్రామనివాసులతో బాబాను చూడవచ్చెను. అతడు సాయిబాబాను జూచి యిట్లనెను. *"ఈయన యొక యమూల్యమైన రత్నము. సామాన్యమానవుని వలె గాన్పించునప్పటికిని ఈయన మామూలు రాయివంటివాడు కాదు. ఈయనొక యమూల్య వజ్రము. ముందు ముందు ఈ సంగతి మీకే తెలియగలదు."* ఇట్లనుచు ఆనందనాథుడు తిరిగి ఏవలా వెళ్ళెను. ఇది శ్రీసాయిబాబా యౌవ్వనమున జరిగిన సంగతి.

**బాబా దుస్తులు - వారి నిత్యకృత్యములు**

యౌవనమునందు బాబా తమ తలవెంట్రుకలు కత్తిరించుకొనక జుట్టు పెంచుచుండెను. పహిల్వానువలె దుస్తులు వేసికొనెడివారు. శిరిడీకి మూడుమైళ్ళ దూరములో నున్న రహాతాకు పోయినప్పుడొకసారి బంతి, గన్నేరు, నిత్యమల్లె మొక్కలు తీసికొనివచ్చి, నేలను చదును చేసి, వానిని నాటి, నీళ్ళు పోయుచుండిరి. అనుదినము వామన్ తాత్యా యను కుమ్మరి బాబాకు కాల్చని రెండు పచ్చి కుండలను ఇచ్చుచుండెడివాడు. బాబా స్వయముగ బావినుండి నీళ్ళు చేది, ఆ నీటిని ఆ పచ్చి కుండలలో తోడి, భుజముపై మోసుకొని

తెచ్చి మొక్కలకు పోసెడివారు. సాయంకాలము ఆ కుండలను వేపచెట్టు మొదట బోర్లించుచుండిరి. కాల్చనివగుటచే అవి వెంటనే విరిగి ముక్కలు ముక్కలగుచుండెడివి. ఇట్లు మూడు సంవత్సరములు గడచెను. సాయిబాబా కృషివలన అచ్చట నొక పూలతోట లేచెను. ఆ స్థలములోనే యిప్పుడు బాబా సమాధి యున్నది. దానినే సమాధి మందిర మందురు. దానిని దర్శించుట కొరకే యనేకమంది భక్తులు విశేషముగా పోవుచున్నారు.

**వేపచెట్టు క్రిందనున్న పాదుకల వృత్తాంతము**

అక్కల్‌కోటకర్ మహరాజ్‌గారి భక్తుడు భాయికృష్ణజీ అలీబాగ్‌కర్. ఇతడు అక్కల్‌కోటకర్ మహరాజ్‌గారి చిత్రపటమును పూజించెడివాడు. అతడొకప్పుడు షోలాపూరు జిల్లాలోని అక్కల్‌కోట గ్రామమునకు పోయి, మహరాజ్‌గారి పాదుకలు దర్శించి పూజించవలెనని యనుకొనెను. అతడచ్చటికి పోకమునుపే స్వప్నములో ఆ మహరాజ్ దర్శనమిచ్చి యిట్లు చెప్పెను: *"ప్రస్తుతము శిరిడీ నా నివాసస్థలము. అచ్చటికి పోయి నీ పూజ యొనరింపుము!"* అందుచే, అక్కల్‌కోట పోవలెనను తన నిర్ణయమును మార్చుకొని భాయికృష్ణజీ శిరిడీ చేరి, బాబాను పూజించి, అచ్చటనే ఆరు మాసములు ఆనందముతో గడిపెను. దీని జ్ఞాపకార్థము పాదుకలు చేయించి శ్రావణమాసములో నొక శుభదినమున వేపచెట్టుక్రింద ప్రతిష్ఠ చేయించెను. ఇది శక సం॥ 1834, శ్రావణ మాసములో (అనగా, క్రీ.శ.1912 లో) జరిగెను. దాదా కేల్కర్, ఉపాసనీబాబా అనువారు పూజను శాస్త్రోక్తముగా జరిపిరి. దీక్షిత్ యను బ్రాహ్మణుడు పాదుకల నిత్యపూజకు నియమింపబడెను. దీనిని పర్యవేక్షించు బాధ్యత భక్త సగుణ్‌మేరు నాయక్ నకప్పగించబడినది.

**ఈ కథయొక్క పూర్తి వివరములు**

ఠాణే వాస్తవ్యుడైన శ్రీబి.వి.దేవు బాబాకు గొప్ప భక్తుడు. వీరు మామల్తదారుగా పదవీ విరమణ చేసిరి. వేపచెట్టు క్రింద ప్రతిష్ఠింపబడిన పాదుకలకు సంబంధించిన వివరములన్నియు సగుణ్‌మేరు నాయక్ మరియు గోవింద కమలాకర్ దీక్షిత్‌ల నుండి సేకరించి, పాదుకల పూర్తి వృత్తాంతము, శ్రీసాయిలీల మాసపత్రిక రెండవ సంపుటము, మొదటి సంచిక, 25వ పేజీలో నీరీతిగా ప్రచురించినారు.

1912వ సంవత్సరములో బొంబాయినుండి డాక్టరు రామారావు కొఠారెయను నతడు శిరిడీ వచ్చెను. వానితో బాటుగ అతని కంపౌండర్‌ను, మరియు అతని మిత్రుడైన భాయికృష్ణజీ అలీబాగ్‌కర్ అనునతడును వెంటవచ్చిరి. శిరిడీలో వారు సగుణ్‌మేరు నాయక్‌కు జి.కె.దీక్షిత్‌కు సన్నిహితులైరి. అనేక విషయములు తమలో తాము చర్చించుకొనునప్పుడు సంభాషణ వశాత్తూ, బాబా ప్రప్రథమమున శిరిడీ ప్రవేశించి వేపచెట్టు క్రింద తపస్సు చేసిన దాని జ్ఞాపకార్థము బాబా పాదుకలు ఆ వేపచెట్టు క్రింద ప్రతిష్ఠించవలెనని నిశ్చయించుకొనిరి. పాదుకలను రాతితో చెక్కించుటకు నిర్ణయించిరి. ఈ సంగతి డాక్టరు రామారావు కొఠారేకు దెలిపినచో ఆయన చక్కని పాదుకలు చెక్కించెదరని భాయికృష్ణజీ మిత్రుడైన కంపౌండర్ సలహానిచ్చెను. అందరును యీ సలహాకు సమ్మతించిరి. అప్పటికి బొంబాయి తిరిగి వెళ్ళిన డాక్టరుగారికి ఈ విషయము తెలియపరచిరి. వారు వెంటనే మరల శిరిడీ వచ్చి పాదుకల నమూనా వ్రాయించిరి. ఖండోబా మందిరమందున్న ఉపాసనీ మహరాజ్ వద్దకు పోయి తాము వ్రాసిన పాదుకల నమూనాను జూపిరి. శ్రీఉపాసనీ దానిలో కొన్ని మార్పులను జేసి, పద్మము, శంఖము, చక్రము మొదలగునవి చేర్చి, బాబా యోగశక్తిని వేపచెట్టు గొప్పతనమును దెలుపు యీ క్రింది శ్లోకమును కూడ చెక్కించమనిరి:

**సదా నింబవృక్షస్య మూలాధివాసాత్**
**సుధా స్రావిణం తిక్తమప్యప్రియం తమ్ ।**
**తరుం కల్పవృక్షాధికం సాధయంతం**
**నమామీశ్వరం సద్గురుం సాయినాథమ్ ॥**

ఉపాసనీ సలహాల నామోదించి పాదుకలు బొంబాయిలో చేయించి, కంపౌండరు ద్వారా పంపిరి. శ్రావణ పౌర్ణమినాడు స్థాపన చేయుమని బాబా యాజ్ఞాపించెను. ఆనాడు 11 గంటలకు జి.కె. దీక్షిత్ తన శిరస్సుపై పాదుకలు పెట్టుకొని ఖండోబా మందిరమునుండి ద్వారకామాయికి ఉత్సవముతో వచ్చిరి. బాబా యా పాదుకలను స్పృశించి, అవి భగవంతుని పాదుకలని నుడివెను. వానిని వేపచెట్టు మూలమున ప్రతిష్ఠింపుడని యాదేశించెను.

ఆ ముందురోజు బొంబాయి నుండి పాస్తాసేట్ యను పార్సీ భక్తుడొకడు మనియార్డరు ద్వారా 25 రూపాయలు పంపియుండెను. బాబా యా పైకము పాదుకాప్రతిష్ఠకగు ఖర్చు నిమిత్తమిచ్చెను. మొత్తము 100 రూపాయలు ఖర్చయినవి. అందులో 75 రూపాయలు చందాల ద్వారా వసూలు చేసిరి. మొదటి 5 సంత్సరములు జి.కె. దీక్షిత్ ఈ పాదుకలకు పూజ చేసెను. తరువాత లక్ష్మణ్ కచేశ్వర్ జాఖడె యను బ్రాహ్మణుడు (నానుమామా పూజారి) పూజ చేయుచుండెను. మొదటి 5 సంవత్సరములు నెలకు 2 రూపాయల చొప్పున డాక్టర్ కొఠారె దీపపు ఖర్చు నిమిత్తము పంపుచుండెను. పాదుకల చుట్టు కంచెకూడ పంపెను. ఈ కంచెయు, పైకప్పును కోపర్‌గాం స్టేషన్‌నుండి శిరిడీ తెచ్చుటకు 7-8-0 ఖర్చు సగుణ్ మేరు నాయక్ ఇచ్చెను. (ప్రస్తుతము జాఖడె పూజ చేయుచున్నాడు. సగుణుడు నైవేద్యమును దీపమును పెట్టుచున్నాడు.)

మొట్టమొదట భాయికృష్ణజీ, అక్కల్‌కోటకర్ మహారాజ్ భక్తుడు. 1912వ సంవత్సరములో వేపచెట్టు క్రింద పాదుకలు స్థాపించునప్పుడు అక్కల్ కోటకు పోవుచు మార్గమధ్యమున శిరిడీయందు దిగెను. బాబా దర్శనము చేసిన తరువాత అక్కల్‌కోట గ్రామమునకు పోవలెననుకొని బాబావద్దకేగి యనుమతి నిమ్మనెను. బాబా యిట్లనెను. *"అక్కల్‌కోటలో నేమున్నది? అక్కడకేల పోయెదవు? అక్కడుండే మహరాజ్ ప్రస్తుతమిక్కడనే యున్నారు. వారే నేను."* ఇది విని భాయికృష్ణజీ అక్కల్‌కోట వెళ్ళుట మానుకొనెను. పాదుకల స్థాపన తరువాత అనేక పర్యాయములు శిరిడీ యాత్ర చేసెను.

హేమాడ్‌పంతునకీ వివరములు తెలిసియుండవు. తెలిసియున్నచో సచ్చరిత్ర లో వ్రాయుట మానియుండరు.

**మొహియొద్దీన్ తంబోలితో కుస్తీ – జీవితములో మార్పు**

శిరిడీ గ్రామములో కుస్తీలు పట్టుట వాడుక. అచ్చట మొహియొద్దీన్ తాంబోళి యనువాడు తరచుగా కుస్తీలు పట్టుచుండెడివాడు. వానికి బాబాకు ఒక విషయములో భేదాభిప్రాయము వచ్చి కుస్తీ పట్టిరి. అందులో బాబా యోడిపోయెను. అప్పటి నుండి బాబాకు విరక్తి కలిగి తన దుస్తులను, నివసించు రీతిని మార్చుకొనెను. లంగోటి బిగించుకొని, (ఫకీరులు ధరించు) పొడవాటి

చొక్కా (కఫ్నీ) ని తొడిగికొని, నెత్తిపైని గుడ్డ కట్టుకొనేవారు. ఒక గోనె ముక్కపై కూర్చునెడివారు. చింకిగుడ్డలతో సంతుష్టి చెందెడివారు. రాజ్యభోగముకంటె దారిద్ర్యమే మేలని నుడివెడువారు. పేదవారికి భగవంతుడు స్నేహితుడనేవారు. గంగాగీరుకు కూడ కుస్తీలయందు ప్రేమ. ఒకనాడు కుస్తీ పట్టుచుండగా యతనికి వైరాగ్యము కలిగెను. అదే సమయములో 'దేహమును దమించి, దేవుని సహవాసము చేయమ'ని యొక యశరీరవాణి యతనికి వినిపించెను. అప్పటినుండి గంగాగీరు సంసారము విడిచెను. ఆత్మసాక్షాత్కారము కొరకు పాటుపడెను. పుణతాంబే దగ్గర నదియొడ్డున ఒక మఠమును స్థాపించి తన శిష్యులతో నివసించుచుండెను.

సాయిబాబా జనులతో కలసిమెలసి తిరిగెడివారు కారు; ఎవ్వరితోను తమంతటతాము మాట్లాడెడివారు కారు. ఎవరైన యేదైన అడిగిన యాయడిగినదానికి మాత్రము జవాబిచ్చువారు. దినములో యెక్కువ భాగము వేపచెట్టునీడయందు, అప్పుడప్పుడు యూరవతలనున్న కాలువ యొడ్డునగల తుమ్మచెట్టు నీడన కూర్చొనెడివారు. సాయంకాల మూరకనే కొంతదూరము నడిచెడివారు; ఒక్కొక్కసారి నీమ్‌గాం పోవుచుండెడివారు. నీమ్‌గాంలో బాబాసాహెబ్ త్ర్యంబక్‌జీ డేంగలే యనునతని యింటికి తరుచుగా పోవువారు. బాబాసాహెబ్ డేంగలేయందు సాయిబాబాకు మిక్కిలి ప్రేమ. అతని తమ్ముని పేరు నానాసాహెబు. అతడు రెండు వివాహములు చేసికొన్నను సంతానము కలుగలేదు. బాబాసాహెబు డేంగలే తన సోదరుని సాయిబాబా వద్దకు పంపెను. బాబా యనుగ్రహముచే నానాసాహెబునకు పుత్రసంతానము కలిగెను. అప్పటినుంచి బాబాను దర్శించుటకు ప్రజలు తండోపతండములుగా రాసాగిరి. వారి కీర్తి యంతటను వెల్లడి యాయెను. అహమద్ నగరు వరకు వ్యాపించెను. అక్కడనుంచి నానాసాహెబు చాందోర్కరు, కేశవ్ చిదంబర్ మొదలుగాగల యనేకమంది శిరిడీకి వచ్చుట ప్రారంభించిరి. దినమంతయు బాబాను భక్తులు చుట్టియుండెడివారు. రాత్రులందు బాబా పాడుపడిన పాతమసీదునందు శయనించుచుండెను. పొగపీల్చుకొను 'చిలిం' గొట్టము, కొంత పొగాకు, ఒక రేకు డబ్బా, కఫ్నీ, తలగుడ్డ, ఎల్లప్పుడు దగ్గరనుంచుకొను 'సటకా' (చిన్న చేతికర్ర) మాత్రమే అప్పటిలో ఆయనకున్న సామానులు.

తలపై నొక గుడ్డను చుట్టి, దాని అంచులను జడవలె మెలిబెట్టి ముడివేసి, యెడమచెవిపై నుంచి వెనుకకు వ్రేలాడునట్లు వేసుకొనువారు. తమ దుస్తులను వారముల తరబడి ఉతుకకుండ నుంచువారు. చెప్పులను తొడిగేవారు కారు. దినమంతయు గోనెగుడ్డపైనే కూర్చొనేవారు. (కఫ్నీ క్రింద) లంగోటీ కట్టుకొనెడివారు. చలిని కాచుకొనుటకు ధుని కెదురుగా (మసీదు ఈశాన్యభాగములో గల) కొయ్య చేపట్టుపై తమ యెడమచేతినానించి, దక్షిణాభిముఖముగా కూర్చునేవారు. ఆ ధునిలో అహంకారమును, కోరికలను, ఆలోచనలను ఆహుతి చేసి 'అల్లాయే యజమాని' అని పలికేవారు. మసీదులో రెండు గదుల స్థలము మాత్రముండెను. భక్తులందరు అచటనే బాబాను దర్శించుచుండిరి. 1912 తదుపరి మసీదుకు కొన్ని మార్పులు చేయబడినవి. పాత మసీదును మరామతు చేసి నేలపైన నగిషీరాళ్ళు తాపన చేసిరి. బాబా యీ మసీదుకు రాకపూర్వము 'తకియా'(రచ్చ)లో చాలాకాలము నివసించిరి. బాబా తమ కాళ్ళకు చిన్న గజ్జలు కట్టుకొని సొగసుగా నాట్యము చేసేవారు; భక్తి పూర్వకమయిన పాటలు పాడేవారు.

### నీళ్లను నూనెగా మార్చుట

సాయిబాబాకు దీపములన్న చాల యిష్టము. ఊరిలో నూనెను విక్రయించు షాహుకార్లను నూనె యడిగి తెచ్చి మసీదునందు రాత్రియంతయు దీపములు వెలిగించు చుండేవారు. కొన్నాళ్ళు ఇట్లు జరిగెను. ఒకనాడు నూనె ఇచ్చు దుకాణాదారులందరు కూడబలుకుకొని బాబాకు నూనె ఇవ్వకూడదని నిశ్చయించుకొనిరి. బాబా వారి దుకాణములకు ఎప్పటివలె పోగా నూనె లేదనిరి. బాబా కలత జెందక వట్టి వత్తులు మాత్రమే ప్రమిదలలో పెట్టియుంచెను. నూనెవ్యాపారులు ఆసక్తితో నిదంతయు గమనించు చుండిరి. అడుగున రెండుమూడు నూనెచుక్కలు మిగిలియున్న తమ రేకుడబ్బాలో నీటిని పోసి కలియబెట్టి, ఆ నీటిని త్రాగివేసిరి. ఈ విధముగా యా రేకుడబ్బాలోని నూనె అవశేషమును పావనము చేసిన పిమ్మట, మరల డబ్బాతో నీరు తీసికొని, యా నీటిని ప్రమిదలలో నింపెను. దూరముగా నిలిచి పరీక్షించుచు దుకాణాదారులు విస్మయమొందునట్లు ప్రమిదలన్నియు తెల్లవారుదాక చక్కగా వెలుగుచుండెను. ఇదంతయు జూచి యా షాహుకార్లు పశ్చాత్తాపపడి,

బాబాను మన్నింపు కోరిరి. బాబా వారిని క్షమించి, ఇకపైనైననూ సత్యము నంటిపెట్టుకొనుడని హితవు చెప్పి పంపివేసిరి.

**జౌహర్ అలీ యను కపటగురువు**


పైన వివరించిన కుస్తీ జరిగిన యయిదేండ్ల తరువాత అహమదునగరు నుండి జవ్హర్ అల్లీ యను ఫకీరొకడు శిష్యులతో రహాతా వచ్చెను. వీరభద్రమందిరమునకు సమీపమున నున్న స్థలములో దిగెను. ఆ ఫకీరు బాగా చదువుకొన్నవాడు, ఖురానంతయు వల్లించగలడు, మధురభాషణుడు. ఆ యూరిలోని భక్తులు వచ్చి వానిని సన్మానించుచు గౌరవముతో చూచుచుండెడి వారు. వారి సహాయముతో వీరభద్ర మందిరమునకు దగ్గరగా 'ఈద్గా' యను గోడను నిర్మించుటకు పూనుకొనెను. ఈదుల్ ఫితర్ అను పండుగనాడు మహమ్మదీయులు నిలుచుకొని ప్రార్థించు గోడయే 'ఈద్గా'. ఈ విషయములో వివాదములేచి, అది ఘర్షణలకు దారితీసెను. దానితో జవ్హర్ అల్లీ రహాతా విడిచి, శిరిడీచేరి, బాబాతో మసీదునందుండసాగెను. ప్రజలు వాని తీపిమాటలకు మోసపోయిరి. అతడు బాబాను తన శిష్యుడని చెప్పువాడు. బాబా యందుల కడ్డు చెప్పక శిష్యునివలెనే మసలుకొనెను. తరువాత గురుశిష్యులిద్దరూ రహాతాకు పోయి యచ్చట నివసించుటకు నిశ్చయించుకొనిరి. గురువునకు శిష్యుని శక్తి యేమియు తెలియకుండెను. శిష్యునికి మాత్రము గురువుయొక్క లోపములు బాగా తెలియును. అయినప్పటికి బాబా ఆ కపట గురువునెప్పుడు అగౌరవించక, శిష్యధర్మమును శ్రద్ధగా నెరవేర్చుచుండెడివారు. అప్పుడప్పుడు వారిరువురు శిరిడీకి వచ్చి పోవుచుండెడివారు కాని అధికముగా రహాతాలోనే నివసించేవారు. శిరిడీలోని సాయిభక్తులకు బాబా ఆవిధముగ రహాతాలో నుండుట ఎంతమాత్ర మిష్టములేకుండెను. అందుచే వారందరు కలసి సాయిబాబాను మరల శిరిడీకి పిలుచుకొనివచ్చుటకు రహాతా వెళ్ళిరి. వారు రహాతాలో ఈద్గా వద్ద బాబాను ఒంటరిగా చూచి, వారిని తిరిగి శిరిడీ తీసికొనిపోవుటకై వచ్చినామని చెప్పిరి. వ్హర్ అలీ ముక్కోపి యనీ, ఆయన తనను విడిచిపెట్టడనీ, అందువలన వారు తన యందు ఆశ విడిచి, ఫకీరు అక్కడకు వచ్చులోపల, శిరిడీ మరలివెళ్ళుట మంచిదని బాబా వారికి సలహా ఇచ్చెను. వారిట్లు మాట్లాడుకొనుచుండగా,

జవ్హర్ అల్లీ అక్కడకు వచ్చి, బాబాను తీసికొని పోవుటకు ప్రయత్నించుచున్న శిరిడీ ప్రజలపై మండిపడెను. కొంత వాదోపవాదములు జరిగిన పిమ్మట గురుశిష్యులిద్దరూ తిరిగి శిరిడీ పోవుటకు నిర్ణయమైనది.

వారు శిరిడీ చేరి యచ్చటనే నివసించుచుండిరి. కొన్ని దినముల పిమ్మట దేవీదాసు ఆ కపటగురువును పరీక్షించి యతని బండారము బయటబెట్టెను. చాంద్‌పాటిల్ పెళ్ళి బృందముతో బాబా శిరిడీ వచ్చుటకు 12 సంవత్సరముల ముందే పదిపన్నెండేళ్ళ వయసులో దేవీదాసు శిరిడీ చేరెను. వారు మారుతి దేవాలయములో నుండేవారు. దేవీదాసు చక్కని అంగసౌష్ఠవము, తేజోవంతములైన నేత్రములు కలిగి, నిర్వ్యామోహితావతారమువలె జ్ఞానివలె కనపడుచుండెను. తాత్యాపాటీలు, కాశీనాథ్ షింపీ మొదలుగా గల యనేకమంది దేవీదాసును తమ గురువుగా భావించెడివారు. వారు జవ్హర్ అల్లీని దేవిదాసు వద్దకు తీసికొనివచ్చిరి. వారి మధ్య జరిగిన వాదములో జవ్హర్ అల్లీ చిత్తుగా యోడిపోయి, శిరిడీ నుండి పలాయనము చిత్తగించెను. ఆ తరువాత యతడు వైజాపూరులో నుండి, చాల యేండ్ల తరువాత శిరిడీ తిరిగి వచ్చి బాబా పాదములపై బడెను. తాను గురువు, సాయిబాబా శిష్యుడను భ్రమ వాని మనస్సునుండి తొలగి, తన ప్రవర్తనకు పశ్చాత్తాపపడెను. సాయిబాబా వానిని యథారీతి గౌరవముగానే చూచెను. ఈ విధముగా శిష్యుడు గురువునెట్లు సేవింపవలెనో, యెట్లు అహంకారమమకారములను విడిచి గురుశుశ్రూష చేసి తుదకు ఆత్మసాక్షాత్కారమును పొందవలెనో బాబా అచరణాత్మకముగ నిరూపించెను. ఈ కథ భక్తమహాల్సాపతి చెప్పిన వివరముల యాధారముగ వ్రాయబడినది.

అయిదవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఆరవ అధ్యాయము

*గురు కరస్పర్శ ప్రభావము -*
*శ్రీరామనవమి యుత్సవము - దాని ప్రారంభము, పరిణామము మొదలగునవి -*
*మసీదు మరమ్మతులు.*

### గురు కరస్పర్శ ప్రభావము

సంసారమను సాగరములో జీవుడనెడి యోడను సద్గురుడే సరంగుయై నడుపునప్పుడు అది సులభముగను సురక్షితముగను గమ్యమును చేరును. సద్గురువనగానే సాయిబాబా స్ఫురణకు వచ్చుచున్నారు. నాకండ్ల యెదుట సాయిబాబా నిలచియున్నట్లు, నా నుదుట ఊదీ పెట్టుచున్నట్లు, నాశిరస్సుపై చేయివేసి యాశీర్వదించుచున్నట్లు పొడముచున్నది. నా మనస్సు సంతోషముతో నిండిపోయి, కండ్లనుండి ప్రేమ పొంగి పొరలుచున్నది. గురుహస్తస్పర్శ మహిమ అద్భుతమైనది. ప్రళయాగ్నిచే కూడ కాలనట్టి వాసనామయమైన సూక్ష్మశరీరము గురుకరస్పర్శ తగులగనే భస్మమైపోవును; అనేకజన్మార్జిత పాపసంచయము పటాపంచలైపోవును. ఆధ్యాత్మికసంబంధమైన విషయములు వినుటకే విసుగుపడువారి వాక్కు కూడ నెమ్మది పొందును. శ్రీసాయి సుందరరూపము కాంచుటతోడనే కంఠము ఆనందాతిరేకముతో గద్గదమగును; కన్నుల నుండి ఆనందాశ్రువులు పొంగిపొరలును; హృదయము భావోద్రేకముతో యుక్కిరిబిక్కిరి యగును. 'నేనే తాన'ను (పరబ్రహ్మస్వరూపమను) స్ఫురణ మేల్కొని, ఆత్మసాక్షాత్కారానందమును కలిగించును. 'నేను నీవు' అను భేదభావమును తొలగించి బ్రహ్మైక్యానుభవమును సిద్ధింపజేయును.

నేను వేదపురాణాది సద్గ్రంథములు చదువునప్పుడు నా సద్గురుమూర్తియే యడుగడుగునకు జ్ఞప్తికి వచ్చుచుండును; నా సద్గురువైన శ్రీసాయిబాబాయే శ్రీరాముడుగా, శ్రీకృష్ణుడుగా నా ముందు నిలచి, తన లీలలను తామే వినిపింప జేయునట్లు తోచును. నేను భాగవత పారాయణకు పూనుకొనగనే శ్రీసాయి యాపాదమస్తకము కృష్ణునివలె గాన్పించును. భాగవతమో, ఉద్ధవగీతయో తామే పాడుచున్నట్లుగ అనిపించును. ఎవరితోనైన సంభాషించునప్పుడు సాయిబాబా కథలే ఉదాహరణములుగా నిచ్చుటకు జ్ఞప్తికి వచ్చును. నాకై నేను యేదైన వ్రాయ తలపెట్టినచో, యొక మాటగాని వాక్యముగాని వ్రాయుటకు రాదు. వారి యాశీర్వాదము లభించిన వెంటనే రచనా ధార యంతులేనట్లు సాగును. భక్తునిలో అహంకారము విజృంభించగనే బాబా దానిని యణచివేయును. తన శక్తితో వాని కోరికలను నెరవేర్చి సంతుష్టుజేసి యాశీర్వదించును. సాయి పాదములకు సాష్టాంగ నమస్కారము చేసి సర్వస్య శరణాగతి చేసినవానికి ధర్మార్థకామమోక్షములు కరతలామలకములగును. భగవత్ సాన్నిధ్యమునకు పోవుటకు కర్మ, జ్ఞాన, యోగ, భక్తిమార్గములనెడి నాలుగు త్రోవలు గలవు. అన్నింటిలో భక్తిమార్గము కష్టమైనది. అది ముండ్లు గోతులతో నిండియుండును. సద్గురుని సహాయముతో ముండ్లను గోతులను తప్పించుకొని ముందుకుసాగినచో గమ్యస్థానము అవలీలగా చేరవచ్చును. ఈ సత్యమును దృఢముగా నమ్ముమని శ్రీసాయిబాబా నొక్కివక్కాణించెడివారు.

స్వయంసత్తాకమైన బ్రహ్మము, జగత్తును సృష్టించు నా బ్రహ్మముయొక్క శక్తి (మాయ), సృష్టి -- యను యీ మూడింటి గూర్చిన తత్త్వవిచారము చేసి, వాస్తవమునకీ మూడును నొకటియేయని సిద్ధాంతీకరించి, బాబా తన భక్తుల శ్రేయస్సుకై చేసిన అభయప్రదానవాక్యములను రచయితఈ క్రింద ఉదహరించుచున్నాడు:

"నా భక్తుని యింటిలో అన్నవస్త్రములకు ఎప్పుడూ లోటుండదు. నాయందే మనస్సు నిలిపి, భక్తిశ్రద్ధలతో మనఃపూర్వకముగా నన్నే యారాధించువారి యోగక్షేమముల నేను జూచెదను. కావున వస్త్రాహారముల కొరకు ప్రయాసపడవద్దు! నీకేమైన కావలసిన భగవంతుని వేడుకొనుము. ప్రపంచములోని కీర్తిప్రతిష్ఠలకై ప్రాకులాడుట మాని, దైవము

యొక్క దర్బారులో మన్ననలు పొందుటకు, భగవంతుని కరుణాకటాక్షములు సంపాదించుటకు యత్నించుము. ప్రపంచగౌరవమందుకొను భ్రమను విడువుము. మనస్సునందు ఇష్టదైవము యొక్క యాకారమును నిలుపుము. సమస్తేంద్రియములను మనస్సును భగవంతుని యారాధనకొరకే నియమింపుము. ఇతరముల వైపు మనస్సు పోనివ్వకుము. ఎల్లప్పుడు నన్నే జ్ఞప్తియందుంచుకొనుము. మనసును ధనసంపార్జనము, దేహపోషణ, గృహసంరక్షణము మొ॥న విషయముల పట్ల సంచరించకుండ గట్టిగా నిలుపుము. అప్పుడది నెమ్మదివహించి, శాంతముగను చింతారహితముగను యుండును. మనస్సు సరియైన సాంగత్యములో నున్నదనుటకు నిదియే గుర్తు. చంచలమనస్కునకు స్వాస్థ్యము చిక్కదు."

బాబా మాటలుదహరించిన పిమ్మట గ్రంథకర్త శిరిడీలో జరుగు శ్రీరామనవమి యుత్సవమును వర్ణించుటకు పూనుకొనెను. శిరిడీలో జరుగు నుత్సవములన్నిటిలో శ్రీరామనవమియే గొప్పది. సాయిలీల (1925-పుట 197) పత్రికలో శిరిడీలో జరుగు శ్రీరామనవమి యుత్సవము గురించి విపులముగ వర్ణింపబడినది. దాని సంగ్రహమిట పేర్కొనబడుచున్నది.

కోపర్‌గాంవ్‌లో గోపాల్‌రావు గుండ్ అనునతడు పోలీసు సర్కిలు ఇన్‌స్పెక్టరుగా నుండెను. అతడు బాబాకు గొప్పభక్తుడు. అతనికి ముగ్గురు భార్యలున్నప్పటికి సంతానము కలుగలేదు. శ్రీసాయి యాశీర్వచనముచే అతనికొక కొడుకు బుట్టెను. ఆ ఆనందసమయంలో అతనికి శిరిడీలో 'ఉరుసు'* ఉత్సవము నిర్వహించవలెనను ఆలోచన కలిగినది. తన ఆలోచనను తాత్యాకోతేపాటీలు, దాదాకోతేపాటీలు, మాధవరావు దేశపాండే తదితర తక్కిన సాయిభక్తుల ముందుంచెను. వారంతా దీనికి ఆమోదించిరి. బాబా యాశీర్వాదమును, అనుమతిని పొందిరి. ఇది 1897లో జరిగెను. ఉరుసు ఉత్సవం జరుపుకోవడానికి జిల్లా కలెక్టరు అనుమతికై దరఖాస్తు పెట్టిరి. గ్రామకులకర్ణి (కరణము) దానిపై నేదో వ్యతిరేకముగా చెప్పినందున అనుమతి రాలేదు.

* ఉరుసు = సమాధిచెందిన మహమ్మదీయ మహాత్ముల దర్గాల (సమాధుల) వద్ద యేటేటా భక్తులు జరుపుకొను ఆరాధనోత్సవము.

కాని బాబా యాశీర్వదించి యుండుటచే, మరల ప్రయత్నించగా వెంటనే యనుమతి వచ్చెను. బాబా సలహా ననుసరించి ఉరుసు ఉత్సవమును శ్రీరామనవమినాడు చేయుటకు నిశ్చయించిరి. ఈ ఉరుసు ఉత్సవమును శ్రీరామనవమినాడు జరుపుకొనమనుటలో హిందూ-మహమ్మదీయుల సమైక్యతాభావము బాబా ఉద్దేశ్యము కాబోలు. భవిష్యత్సంఘటనలను బట్టి చూడగా బాబా సంకల్పము నెరవేరినట్లు స్పష్టమగును.

ఉత్సవము జరుపుటకు అనుమతయితే వచ్చెనుగాని, యితర అవాంతరములు కొన్ని తలెత్తినవి. చిన్నగ్రామమైన శిరిడీలో నీటి ఎద్దడి అధికముగా నుండెను. గ్రామమంతటికి రెండు నూతులుండెడివి. ఒకటి యెండాకాలములో నెండిపోవుచుండెను. రెండవదానిలోని నీళ్ళు ఉప్పనివి. ఈ సమస్యను బాబాకు నివేదించగా, బాబా ఆ ఉప్పునీటిబావిలో పువ్వులు వేసెను. ఆశ్చర్యకరముగ ఆ ఉప్పునీరు మంచినీళ్ళుగా మారిపోయినవి. ఆ నీరు కూడా చాలకపోవుటచే తాత్యాపాటీలు దూరమునుంచి మోటల ద్వారా నీరు తెప్పించెను. తాత్కాలికముగ అంగళ్ళు వెలసినవి. కుస్తీపోటీల కొరకేర్పాట్లు చేయబడినవి.

గోపాలరావు గుండున కొక మిత్రుడు గలడు. వాని పేరు దాము అణ్ణా కాసార్. అతనిది అహమద్‌నగరు. అతనికిని ఇద్దరు భార్యలున్నప్పటికి సంతానము లేకుండెను. అతనికి కూడ బాబా యాశీర్వాదముచే పుత్ర సంతానము గలిగెను. ఉత్సవము కొరకు ఒక జండా తయారు చేయించవలెనని గోపాలరావు అతనికి పురమాయించెను. అటులనే నానాసాహెబు నిమోన్‌కరును ఒక నగిషీజండా తెమ్మని కోరెను. ఈ రెండు జండాలను ఉత్సవముతో తీసికొనిపోయి మసీదు రెండు మూలలందు నిలబెట్టిరి. ఈ పద్ధతినిప్పటికిని అవలంబించుచున్నారు. బాబా తాము నివసించిన యా మసీదును 'ద్వారకామాయి'యని పిలిచెడివారు.

### చందనోత్సవము

సుమారు అయిదేళ్ళ తరువాత ఈ యుత్సవముతోబాటు నింకొక ఉత్సవము కూడ ప్రారంభమయ్యెను. కొరాఃలా గ్రామమునకు చెందిన

అమీరుశక్కర్ దలాల్ అను మహమ్మదీయభక్తుడు చందన ఉత్సవమును ప్రారంభించెను. ఈ ఉత్సవము గొప్ప మహమ్మదీయ ఫకీరుల గౌరవార్థము చేయుదురు. వెడల్పు పళ్ళెరములో చందనపు ముద్ద నుంచి తలపై పెట్టుకొని సాంబ్రాణి ధూపములతో బాజాభజంత్రీలతో ఉత్సవము సాగించెదరు. ఉత్సవ మూరేగిన పిమ్మట మసీదునకు వచ్చి మసీదు గూటి *(నింబారు)* లోను, గోడలపైనను ఆ చందనమును చేతితో నందరును తట్టెదరు. మొదటి మూడు సంవత్సరములు ఈ యుత్సవమును ,అమీరుశక్కరు నిర్వహించెను. పిమ్మట అతని భార్య ఆ సేవను కొనసాగించెను. ఒకేదినమందు పగలు హిందువులచే జండాయుత్సవము, రాత్రులందు మహమ్మదీయులచే చందనోత్సవము యే అబమరికలు లేక జరుగుచున్నవి.

**ఏర్పాట్లు**

శిరిడీలో జరుగు శ్రీరామనవమి ఉత్సవము బాబాభక్తులకు ముఖ్యమైనది, పవిత్రమైనది. భక్తులందరు వచ్చి ఈ యుత్సవములో పాల్గొనుచుండిరి. బయటి ఏర్పాట్లన్నియు తాత్యాకోతే పాటీలు చూచుకొనెడివాడు. ఇంటిలోపల చేయవలసినవన్నియు రాధాకృష్ణమాయి యను భక్తురాలు చూచుచుండెను. ఉత్సవ దినములలో ఆమె నివాసము భక్తులతో నిండిపోయెడిది. ఆమె వారికి కావలసినయేర్పాట్లు చూచుకొనుటయేగాక, ఉత్సవమునకు కావలసిన సరంజామానంతయు సిద్ధపరచుచుండెను. అంతేకాదు. స్వయముగా ఆమె మసీదును శుభ్రపరచి గోడలకు సున్నము వేయుచుండెను. మసీదుగోడలు బాబా వెలిగించు ధునిమూలముగా మసిపట్టియుండెడివి. మండుచున్న ధునితో సహా, మసీదులోని వస్తువులనన్నింటినీ తీసి బయట పెట్టి, మసీదుగోడలను చక్కగా కడిగి వెల్లవేయించుచుండెను. ఆమె ఇదంతయు బాబా (దినము మార్చి దినము) చావడిలో పరుండునప్పుడు చేసెడిది. ఈ పనిని శ్రీరామనవమికి ఒక రోజు ముందే పూర్తిచేయుచుండెను. పేదలకు అన్నదానమనిన బాబాకు చాల ప్రీతి. అందుచే ఈ యుత్సవ సమయమందు అన్నదానము విరివిగా చేయుచుండిరి. భోజనపదార్థములు, మిఠాయిలు రాధాకృష్ణమాయి ఇంటిలో విస్తారముగ వండబడెడివి. అనేకమంది సంపన్నులైన సాయిభక్తులు స్వచ్ఛందముగ పూనుకొని యీ సేవలో పాల్గొనుచుండెడివారు.

## ఉరుసు శ్రీరామనవమి ఉత్సవముగా మారిన వైనము

ఈ ప్రకారముగా 1897 నుండి 1911 వరకు ఉరుసు ఉత్సవము శ్రీరామనవమినాడు వైభవముగా జరుగుచుండెను. రానురాను అది వృద్ధియగుచు ప్రాముఖ్యము సంతరించుకొనెను. 1912లో యీ ఉత్సవమునకు సంబంధించి నొక మార్పు జరిగెను. శ్రీసాయినాథసగుణోపాసన గ్రంథకర్తయైన కృష్ణారావు జోగేశ్వర భీష్మ యనువాడు దాదాసాహెబు ఖాపర్డే (అమరావతి)తో కలిసి నుత్సవమునకు వచ్చెను. వారు దీక్షిత్ వాడాలో బసచేసిరి. ఉత్సవము ముందు రోజు కృష్ణారావు దీక్షిత్ వాడా వసారాలో పండుకొనియుండెను. ఆ సమయములో లక్ష్మణరావు ఉరఫ్ కాకామహాజని పూజాపరికరముల పళ్ళెముతో మసీదునకు పోవుచుండెను. అతనిని చూడగనే భీష్మకు యొక క్రొత్త యాలోచన తట్టెను. వెంటనే కాకామహాజనిని దగ్గరకు పిలిచి అతనితో, "ఉరుసు యుత్సవమును శ్రీరామనవమినాడు చేయుమనుటలో భగవదుద్దేశమేదియో యుండవచ్చును. శ్రీరామనవమి హిందువులకు చాల ముఖ్యమైన పర్వదినము. కనుక యీ దినమందు రామజన్మోత్సవము యేల జరుపకూడ"దని యడిగెను. కాకామహాజనికి ఆ యాలోచన బాగా నచ్చినది. తమ సంకల్పమునకు బాబా యనుమతి సంపాదించుటకు ఆయత్తమయ్యిరి. కానీ, భగవన్సంకీర్తన చేయుటకు, అంత తక్కువ వ్యవధిలో హరిదాసును సంపాదించుట కష్టము. ఈ సమస్యను కూడా తుదకు భీష్మయే పరిష్కరించెను. ఎట్లన, అతని వద్ద రామాఖ్యానమను శ్రీరాముని చరిత్ర సిద్ధముగా నుండుటచే, అతడే దానిని సంకీర్తన చేయుటకు, కాకామహాజని హార్మోనియం వాయించుటకు తీర్మానించిరి. చక్కెరతో కలిపిన శొంఠి గుండ ప్రసాదము రాధాకృష్ణమాయి చేయుట కేర్పాటయ్యెను. బాబా యనుమతి బొందుటకై వారు మసీదుకు పోయిరి. సర్వజ్ఞుడైన బాబా, "వాడలో నేమి జరుగుచున్నద"ని మహాజనిని ప్రశ్నించెను. బాబా యడిగిన ప్రశ్నలోని అంతరార్థమును మహాజని గ్రహించలేక, యేమీ జవాబివ్వక మౌనముగ నుండెను. బాబా యదే ప్రశ్న భీష్మ నడిగెను. అతడు శ్రీరామనవమి యుత్సవము చేయవలయునను తమ యాలోచనను బాబాకు వివరించి, అందులకు బాబా యనుమతి నివ్వవలెనని కోరెను. బాబా వెంటనే యాశీర్వదించెను. అందరు సంతసించి రామజయంతి ఉత్సవమునకు

సంసిద్ధులైరి. ఆ మరుసటి దినము మసీదు నలంకరించిరి. రాధాకృష్ణమాయి యొక ఊయలనిచ్చెను. దానిని బాబా ఆసనము ముందు వ్రేలాడగట్టిరి. శ్రీరామజన్మోత్సవ వేడుక ప్రారంభమయ్యెను. భీష్మడు కీర్తన చెప్పుటకు లేచెను. మహాజని హార్మోనియం ముందు కూర్చొనెను. అప్పుడే లెండీ నుండి మసీదుకు వచ్చిన బాబా అదంతయు చూచి, మహాజనిని పిలిపించెను. రామజన్మోత్సవము జరుపుటకు బాబా యొప్పుకొనునో లేదో, యేమగునో యని జంకుతూ అతడు బాబా వద్దకు వెళ్ళెను. అదియంతయు యేమని, అక్కడ ఊయల యెందుకు కట్టిరని బాబా యతనిని యడిగెను. శ్రీరామనవమి మహోత్సవము ప్రారంభమైనదనియు అందులకై ఊయల కట్టిరనియు అతడు చెప్పెను. బాబా మసీదులో నుండు భగవంతుని నిర్గుణస్వరూపమును సూచించు 'నింబారు' (గూడు) నుండి రెండు పూలమాలలను తీసి, యొకటి మహాజని మెడలో వేసి, యింకొకటి భీష్మకు పంపెను. హరికథ ప్రారంభమయ్యెను. రామకథాసంకీర్తనము ముగియగానే, బాజాభజంత్రీధ్వనుల మధ్య 'శ్రీరామచంద్రమూర్తికీ జై' యను జయజయధ్వానములు చేయుచూ, పరమోత్సాహముతో అందరూ యొకరిపైనొకరు 'గులాల్' (ఎఱ్ఱ రంగుపొడి) జల్లుకొనిరి. అంతలో నొక గర్జన వినబడెను. భక్తులు చల్లుకొనుచుండిన గులాల్ ఎటులనో పోయి బాబా కంటిలో పడెను. బాబా కోపముతో బిగ్గరగా తిట్టుట ప్రారంభించెను. ఇది చూచి చాలమంది భయముతో పారిపోయిరి. కాని బాబా యొక్క సన్నిహితభక్తులు మాత్రము అవన్నియు తిట్ల రూపముగా బాబా తమకిచ్చిన యాశీర్వాదములని గ్రహించి కదలక నక్కడనే యుండిరి. శ్రీరామజయంతినాడు రావణుడనే యహంకారాది అరిషడ్వర్గములను సంహరించుటకు శ్రీసాయిరూపములో నున్న శ్రీరాముడు ఆగ్రహించుట సహజమేకదా యని భావించిరి. శిరిడీలో ఏదైన క్రొత్తది ప్రారంభించునపుడెల్ల బాబా కోపించుట యొక రివాజు. దీనిని తెలిసినవారు గమ్మున నూరకుండిరి. తన ఊయలను బాబా విరుచునను భయముతో రాధాకృష్ణమాయి మహాజనిని బిలిచి ఊయలను దీసికొని రమ్మనెను. మహాజని పోయి దానిని విప్పుచుండగా బాబా అతని వద్దకు పోయి ఊయలను తీయవలదని చెప్పెను. కొంతసేపటికి బాబా శాంతించెను. ఆనాటి మహాపూజ ఆరతి మొదలగునవి ముగిసెను. సాయంత్రము మహాజని పోయి ఊయలను

విప్పుచుండగా నింకనూ దానియవసరమున్నదనీ, కనుక దానిని విప్పవద్దనీ బాబా యతనిని వారించెను. రామనవమి మరుసటి దినమున జరుపు గోపాలకలోత్సవముతోగాని యుత్సవము పూర్తికాదను విషయము అప్పుడు భక్తులకు స్ఫురించెను. మరునాడు శ్రీకృష్ణజననము నాడు పాటించు 'కాలాహండి' యను ఉత్సవము జరిపిరి. కాలాహండి యనగా నల్లని కుండలో అటుకులు, పెరుగు, ఉప్పుకారము కలిపి వ్రేలాడగట్టెదరు. హరికథ సమాప్తమైన పిమ్మట దీనిని కట్టెతో పగులగొట్టెదరు. రాలిపడిన యటుకులను భక్తులకు ప్రసాదముగ పంచి పెట్టెదరు. శ్రీకృష్ణపరమాత్ముడు ఈ మాదిరిగనే తన స్నేహితులగు గొల్ల పిల్లవాండ్రకు పంచి పెట్టుచుండెను. ఆ మరుసటిదినము ఇవన్నియు పూర్తియైన పిమ్మట ఊయలను విప్పుటకు బాబా సమ్మతించెను. శ్రీరామనవమి వేడుకలీవిధముగ జరిగిపోవుచుండగా, పగటివేళ పతాకోత్సవము, రాత్రియందు చందనోత్సవము కూడా యథావిధిగ జరిగినవి. ఈవిధముగ ఆనాటి నుండి ఉరుసు ఉత్సవము శ్రీరామనవమి ఉత్సవముగ మారెను.

1913 నుండి శ్రీరామనవమి యుత్సవములోని యంశములు క్రమముగ హెచ్చినవి. చైత్రపాడ్యమినుంచి రాధాకృష్ణమాయి 'నామసప్తాహము' ప్రారంభించు చుండెను. భక్తులందరు వంతులవారీగా అందు పాల్గొనుచుండిరి. ఒక్కొక్కప్పుడు రాధాకృష్ణమాయి కూడ వేకువఝాముననే భజనలో చేరుచుండెను. శ్రీరామనవమి ఉత్సవములు దేశమంతటా జరుగుటచే హరికథాకాలక్షేపము చేయు హరిదాసులు దొరకుట దుర్లభముగా నుండెను. శ్రీరామనవమికి 5, 6 రోజులు ముందు 'ఆధునిక తుకారామ్'యని పిలువబడు బాలాబువ మాలీ యను సంకీర్తనకారుని కాకామహాజని యాదృచ్ఛికముగ కలియుట తటస్థించినది. శ్రీరామనవమి నాడు సంకీర్తన చేయుటకు మహాజని అతనిని శిరిడీ తోడ్కొని వచ్చెను. ఆ మరుసటి సంవత్సరము కూడా, అనగా 1914లో, తన స్వగ్రామమైన సతారా జిల్లా బృహద్ సిద్ధకవటె గ్రామములో ప్లేగు వ్యాపించియుండుటచేత బాలబువ సతార్కర్ సంకీర్తనకార్యక్రమములు లేక ఖాళీగా నుండెను. కాకాసాహెబ్ దీక్షిత్ ద్వారా బాబా యనుమతి పొంది అతడు శిరిడీ వచ్చి, హరికథాసంకీర్తనము చేసెను. బాబా అతనిని తగినట్లు సత్కరించెను. 1914 సం॥ లో ప్రతి సంవత్సరము శ్రీరామనవమి నాడు శిరిడీలో సంకీర్తన చేయు బాధ్యతను శ్రీదాసగణు మహరాజునకు బాబా అప్పగించుట ద్వారా యేటేటా ఒక్కొక్క క్రొత్త హరిదాసును పిలుచు సమస్య శాశ్వతముగపరిష్కరింపబడెను.

1912 నుండి ఈ యుత్సవము రానురాను వృద్ధి పొందుచుండెను. చైత్రశుద్ధ అష్టమి మొదలు ద్వాదశి వరకు శిరిడీ తేనెత్రుట్టెయవలె ప్రజలతో కిటకిటలాడుచుండెను. అంగళ్ళ సంఖ్య పెరిగిపోయెను. కుస్తీపోటీలలో ననేకమంది ప్రముఖ మల్లులు పాల్గొనుచుండిరి. పేదలకు అన్నసంతర్పణ విరివిగ జరుగుచుండెను. రాధాకృష్ణమాయి కృషిచే శిరిడీ యొక సంస్థానముగ రూపొందెను. వివిధములైన హంగులు, అలంకారములు పెరిగినవి. అలంకరింపబడిన గుఱ్ఱము, పల్లకి, రథము, పాత్రలు, వెండిసామానులు, బాల్టీలు, వంటపాత్రలు, పటములు, నిలువుటద్దములు మొ॥నవి బహూకరింపబడెను. ఉత్సవమునకు ఏనుగులు కూడ వచ్చెను. ఇవన్నియు యెంత హెచ్చినప్పటికి సాయిబాబా వీనినేమాత్రము లక్ష్యపెట్టక యథాపూర్వము నిరాడంబరులై యుండెడివారు. ఈ యుత్సవములో గమనింపవలసిన ముఖ్యవిషయమేమన హిందువులు, మహమ్మదీయులు యెట్టి అరమరికలు లేక కలసిమెలసి ఉత్సవములలో పాలుబంచుకొనెడివారు. ఈనాటి వరకు యెటువంటి మతకలహములు శిరిడీలో తలెత్తలేదు. మొదట 5000 నుండి 7000 వరకు యాత్రికులు వచ్చేవారు. క్రమముగ యా సంఖ్య 75,000కు పెరిగినది. అంతపెద్ద సంఖ్యలో జనులు గుమిగూడినప్పటికి ఎన్నడూ అంటువ్యాధులుకాని, అల్లరులుగాని సంభవించలేదు!

**మసీదుకు మరమ్మతులు**

గోపాలరావుగుండునకు ఇంకొక మంచి యాలోచన తట్టెను. ఉరుసు ఉత్సవమును ప్రారంభించినవిధముగనే, మసీదును తగినట్లుగా తీర్చిదిద్దవలెనని నిశ్చయించుకొనెను. మసీదు మరమ్మతు చేయు నిమిత్తమై రాళ్ళను తెప్పించి చెక్కించెను. కాని ఈపని బాబా అతనికి నియమించలేదు. నానాసాహెబు చాందోర్కరుకు ఆ సేవ లభించినది. రాళ్ళ తాపన కార్యము కాకాసాహెబు దీక్షిత్‌కు నియోగింపబడెను. మసీదుకు మరమ్మతులు చేయుట మొదట బాబా కిష్టము లేకుండెను. కాని భక్తుడగు మహాల్సాపతి కల్పించుకొని, యెటులనో బాబా యనుమతిని సాధించెను. బాబా చావడిలోపండుకొన్న ఒక్క రాత్రిలో మసీదు నేలను చక్కని రాళ్ళతో తాపనచేయుట ముగించిరి.

అప్పటినుండి బాబా గోనెగుడ్డపై కూర్చుండుట మాని చిన్న పరుపుమీద కూర్చుండువారు. గొప్ప వ్యయ ప్రయాసలతో 1911వ సంవత్సరములో సభామండపము పూర్తి చేసిరి. మసీదుకు ముందున్న జాగా చాల చిన్నది. సౌకర్యముగా లేకుండెను. కాకాసాహెబు దీక్షిత్ దానిని విశాలపరచి పై కప్పు వేయదలచెను. ఎంతో డబ్బుపెట్టి ఇనుపస్తంభములు మొదలగునవి తెప్పించి పని ప్రారంభించెను. రాత్రియంతయు శ్రమపడి స్తంభములు నాటెడివారు. మరుసటిదినము ప్రాతఃకాలముననే బాబా చావడినుండి వచ్చి యది యంతయు జూచి కోపముతో వానిని పీకి పారవైచెడివారు.

ఒకసారి బాబా మిక్కిలి కోపోద్దీపితుడై, నాటిన ఇనుపస్తంభము ను ఒక చేతితో బెకలించుచు, రెండవచేతితో తాత్యాపాటీలు పీకను బట్టుకొనెను. తాత్యా తలపాగాను బలవంతముగా దీసి, యగ్గిపుల్లతో నిప్పంటించి, యొక గోతిలో పారవైచెను. బాబా నేత్రములు నిప్పుకణములవలె వెలుగుచుండెను. ఎవరికిని బాబావైపు చూచుటకుకూడా ధైర్యము చాలకుండెను. అందరు భయకంపితులైరి. బాబా తన జేబులోనుంచి ఒక రూపాయి తీసి యటువైపు విసరెను. అది శుభసమయమందు చేయు యాహుతివలె కనబడెను. తాత్యాకూడ చాల భయపడెను. తాత్యాకేమి జరుగనున్నదో ఎవరికీ ఏమియు తెలియకుండెను. కల్పించుకొని బాబా పట్టునుండి తాత్యాను విడిపించుటకెవ్వరికిని ధైర్యము చాలలేదు. ఇంతలో కుష్ఠరోగియు బాబా భక్తుడు నగు భాగోజి శిందే కొంచెము ధైర్యము కూడగట్టుకొని ముందుకు పోగా బాబా వానిని ఒక ప్రక్కకు త్రోసివేసెను. మాధవరావు సమీపించబోగా బాబా అతనిపై ఇటుకరాయి రువ్వెను. ఎంతమంది ఆ జోలికి పోదలచిరో అందరికి యొకే గతి పట్టెను. కాని కొంతసేపటికి బాబా శాంతించెను. ఒక దుకాణదారుని పిలిపించి, వాని వద్దనుంచి యొక నగిషీ జరీపాగాను కొని, తాత్యాను ప్రత్యేకముగా సత్కరించుటకాయన్నట్లు, దానిని స్వయముగా తాత్యా తలకు చుట్టెను. బాబా యొక్క యీ వింతచర్యను జూచినవారెల్లరు నాశ్చర్యమగ్నులైరి. అంత త్వరలో బాబా కెట్లు కోపము వచ్చెను? ఎందుచేత నీ విధముగ తాత్యాను శిక్షించెను? వారి కోపము తక్షణమే ఎట్లు చల్లబడెను? అని యందరు ఆలోచించుచుండిరి. బాబా ఒక్కొక్కప్పుడు శాంతమూర్తివలె గూర్చుండి

యత్యంత ప్రేమానురాగముతో మాట్లాడుచుండువారు. అంతలో నకారణముగా కోపించెడివారు. అటువంటి సంఘటనలు అనేకములు గలవు. కాని యేది చెప్పవలెనను విషయము తేల్చుకొనలేకున్నాను. అందుచే నాకు జ్ఞాపకము వచ్చినపుడెల్ల ఒక్కొక్కటి చెప్పెదను.

ఆరవ అధ్యాయము

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఏడవ అధ్యాయము

*అద్భుతావతారము; సాయిబాబా వైఖరి; వారి యోగాభ్యాసము; వారి సర్వాంతర్యామిత్వము; కుష్ఠభక్తుని సేవ; ఖాపర్డే కుమారుని ప్లేగు; పండరిపురము పోవుట.*

### అద్భుతావతారము

**సా**యిబాబా హిందువన్నచో వారు మహమ్మదీయుని వలె కనిపించెడివారు. మహమ్మదీయుడనుకొన్నచో హిందూమతాచారసంపన్నుడుగ గాన్పించుచుండెను. ఆయన హిందువా లేక మహమ్మదీయుడా యన్న విషయము ఇదమిద్ధముగ యెవ్వరికీ తెలియదు. బాబా శాస్త్రోక్తముగా హిందువుల శ్రీరామనవమి యుత్సవము జరుపుచుండెను. అదేకాలమందు మహమ్మదీయుల చందనోత్సవము జరుపుటకు అనుమతించెను. ఈ యుత్సవ సమయమందు కుస్తీపోటీలను ప్రోత్సహించుచుండువారు. గెలిచినవారికి మంచి బహుమతులిచ్చెడివారు. గోకులాష్టమినాడు గోపాల్‌కాలోత్సవము జరిపించుచుండిరి. ఈదుల్‌ఫితర్ పండుగనాడు మహమ్మదీయులచే మసీదులో నమాజు చేయించెడివారు. మొహర్రం పండుగకు కొంతమంది మహమ్మదీయులు మసీదులో తాజియా లేదా తాబూతు నిల్పి, కొన్ని దినములు దాని నచ్చట నుంచి పిమ్మట గ్రామములో నూరేగించెదమనిరి. నాలుగు దినములవరకు మసీదులో తాబూతు నుంచుటకు బాబా సమ్మతించి యయిదవనాడు నిస్సంకోచముగ దానిని తామే తీసి వేసిరి. వారు మహమ్మదీయులన్నచో హిందువులకువలె వారి చెవులు కుట్టబడియుండెను. వారు హిందువులన్నచో, సున్తీ ని ప్రోత్సహించెడివారు. బాబా హిందువైనచో మసీదునందేల యుండును?

మహమ్మదీయుడైనచో ధునియను అగ్నిహోత్రమునేల వెలిగించి యుండువారు? అదియేగాక, తిరుగలితో విసరుట, శంఖమూదుట, గంటవాయించుట, హోమము చేయుట, భజన, అన్నసంతర్పణ, అర్ఘ్యపాద్యాదులతో పూజలు మొదలగు మహమ్మదీయమతమునకు అంగీకారముకాని విషయములు మసీదులో జరుగుచుండెను. వారు మహమ్మదీయులైనచో కర్మిష్ఠులగు సనాతనాచారపరాయణులైన బ్రాహ్మణులు వారి పాదములపై సాష్టాంగ నమస్కారము లెట్లు చేయుచుండెడివారు? వారే తెగవారని యడుగబోయిన వారెల్లరు వారిని సందర్శించిన వెంటనే మూగలగుచు పరవశించుచుండిరి. అందుచే సాయిబాబా హిందువో మహమ్మదీయుడో ఎవరును సరిగా నిర్ణయించలేకుండిరి. ఇదియొక వింతకాదు. ఎవరయితే సర్వమును త్యజించి భగవంతుని సర్వస్యశరణాగతి యొనరించెదరో వారు దేవునితో నైక్యమై పోయెదరు. వారికి దేనితో సంబంధముగాని, భేదభావముగాని యుండదు. వారికి జాతి మతములతో నెట్టి సంబంధములేదు. సాయిబాబా అట్టివారు. వారికి జాతులందు వ్యక్తులందు భేదము గాన్పించకుండెను. ఫకీరులతో కలిసి బాబా మత్స్య మాంసములు భుజించుచుండెను. వారి భోజనపళ్ళెములో కుక్కలు మూతి పెట్టినను సణుగువారు కారు.

శ్రీసాయి యవతారము విశిష్టమైనది; యద్భుతమైనది. నా పూర్వ సుకృతముచే వారి పాదములచెంత కూర్చొను భాగ్యము లభించినది. వారి సాంగత్యము లభించుట నా యదృష్టము. వారి సన్నిధిలో నాకు కలిగిన యానందోల్లాసములు చెప్పనలవి కానివి. సాయిబాబా నిజముగా శుద్ధానంద చైతన్యమూర్తులు. నేను వారి గొప్పతనమును, విశిష్టతను పూర్తిగా వర్ణించలేను. ఎవరు వారి పాదములను నమ్మెదరో వారికి ఆత్మానుసంధానము కలుగును. సన్యాసులు, సాధకులు, ముముక్షువులు తదితరులనేకమంది సాయిబాబా వద్దకు వచ్చెడివారు. బాబా వారితో కలసి నవ్వుచూ, సంభాషించుచూ సంచరించుచున్నప్పటికీ, వారి నాలుకపై 'అల్లామాలిక్' యను మాట యెప్పుడూ నాట్యమాడుచుండెడిది. వారికి వాదవివాదములు గాని, చర్చలుగాని యిష్టము లేదు. అప్పుడప్పుడు కోపము వహించినప్పటికీ, వారెల్లప్పుడు శాంతముగాను, సంయమముతోను యుండెడివారు. ఎల్లప్పుడు పరిపూర్ణ వేదాంతతత్త్వమును

బోధించుచుండువారు. ఆఖరివరకు బాబా యెవరో ఎవరికి తెలియనేలేదు. వారు ప్రభువులను భిక్షుకులను నొకే రీతిగా ఆదరించిరి. అందరి యంతరంగములందు గల రహస్యములన్ని బాబా యెరింగెడివారు. బాబా ఆ రహస్యములను వెలిబుచ్చగనే యందరు ఆశ్చర్యమగ్నులగుచుండిరి. వారు సర్వజ్ఞులయినప్పటికి ఏమియు తెలియనివానివలె నటించుచుండిరి. సన్మానములన్నచో వారికేమాత్రము ఇష్టము లేదు. సాయిబాబా నైజమట్టిది. మానవదేహముతో సంచరించుచున్నప్పటికీ, వారి చర్యలను బట్టి జూడ వారు సాక్షాత్తు భగవంతుడనియే చెప్పవలెను. వారిని జూచిన వారందరు వారు శిరిడీలో వెలసిన భగవంతుడనియే యనుకొనుచుండిరి. వట్టి మూర్ఖుడనైన నేను బాబా మహిమలనెట్లు వర్ణించగలను?

**సాయిబాబా వైఖరి**

శిరిడీ గ్రామములో నున్న శని, గణపతి, పార్వతీ-శంకర, గ్రామదేవత, మారుతీ మొదలగు దేవాలయములన్నిటిని తాత్యాపాటీలు ద్వారా బాబా మరమ్మతు చేయించెను. వారి దానగుణము ఎన్నదగినది. దక్షిణరూపముగా వసూలయిన పైకమునంతయు నొక్కొక్కరికి రోజుకొక్కంటికి రూ.50/-, 20/-, 15/-ల చొప్పున ఇచ్చువచ్చినట్లు పంచిపెట్టెడివారు.

బాబాను దర్శించిన మాత్రమున ప్రజలు శుభములు పొందేవారు. రోగులు ఆరోగ్యవంతు లగుచుండిరి, దుర్మార్గులు సన్మార్గులుగా మారుచుండిరి. కుష్ఠువారు కూడ రోగవిముక్తులగుచుండిరి. అనేకులకు కోరికలు నెరవేరుచుండెను. ఎటువంటి మందులు పసరులతో పనిలేకుండనే గ్రుడ్డివారికి దృష్టి వచ్చుచుండెను. కుంటివారికి కాళ్ళు వచ్చుచుండెను. అంతులేని బాబా గొప్పతనమును పారమును ఎవ్వరును కనుగొనకుండిరి. వారి కీర్తి నలుమూలల వ్యాపించెను. అన్ని దేశముల నుండి భక్తులు శిరిడీకి తండోపతండములుగ రాసాగిరి. బాబా ఎల్లప్పుడు ధునికెదురుగా ధ్యానమగ్నులయి కూర్చొనెడివారు. ఒకొక్కప్పుడు మలమూత్రవిసర్జన కూడా అక్కడే చేసేవారు. ఒక్కొక్కప్పుడు స్నానముచేసేవారు; మరొక్కప్పుడు స్నానము లేకుండానే యుండేవారు.

తొలిదినములలో బాబా తెల్లటి తలపాగా, శుభ్రమైన ధోవతి, చొక్కా ధరించేవారు. మొదటి రోజులలో వారు వైద్యం చేసేవారు. గ్రామములో రోగులను పరీక్షించి ఔషధము లిచ్చెడివారు. వారి చేతితో నిచ్చిన మందులు అద్భుతముగ పని చేయుచుండెడివి. వారు గొప్ప 'హకీం' (వైద్యుడు) యని పేరు వచ్చెను. ఈ సందర్భమున నొక ఆసక్తికరమైన సంఘటనను చెప్పవలెను. ఒక భక్తునికి కండ్లు వాచి మిక్కిలి యెఱ్ఱబడెను. శిరిడీలో వైద్యుడు దొరకలేదు. ఇతరభక్తు లాతనిని బాబా వద్దకు గొనిపోయిరి. సామాన్యముగ అట్టి రోగులకు అంజనములు, ఆవుపాలు, కర్పూరముతో చేసిన యౌషధములు వైద్యులుపయోగించెదరు. కాని బాబా చేసిన చికిత్స విలక్షణమైనది. నల్లజీడిగింజలను నూరి రెండు మాత్రలుగ జేసి, యొక్కొక్క కంటిలో నొక్కొక్క దానిని పెట్టి గుడ్డతో కట్టుకట్టిరి. మరుసటి దినము ఆ కట్లను విప్పి నీళ్ళను ధారగా పోసిరి. కండ్లలోని పుసి తగ్గి కంటిపాపలు తెల్లబడి శుభ్రమయ్యెను. నల్లజీడి పిక్కలను నూరి కండ్లలో పెట్టిననూ సున్నితమైన కండ్లు మండనేలేదు. అటువంటి చిత్రములనేకములు గలవు కాని, యందు యిదొకటి మాత్రమే చెప్పబడినది.

**బాబా యోగాభ్యాసములు**

సాయిబాబాకు సకలయోగప్రక్రియలు తెలిసియుండెను. ధౌతి, ఖండయోగము, సమాధి మున్నగు షడ్విధయోగప్రక్రియలందు బాబా ఆరితేరినవారు. అందులో రెండు మాత్రమే యిక్కడ వర్ణింపబడినవి.

### 1. ధౌతి

మసీదుకు చాల దూరమున ఒక మఱ్ఱిచెట్టు కలదు. అక్కడొక బావి కలదు. ప్రతి మూడురోజులకొకసారి బాబా యచ్చటకు పోయి ముఖప్రక్షాళనము, స్నానము చేయుచుండెను. ఆ సమయములో బాబా తన ప్రేవులను బయటికి వెడల గ్రక్కి, వాటిని నీటితో శుభ్రపరచి, ప్రక్కనున్న నేరేడు చెట్టుపై ఆరవేయుట శిరిడీలోని కొందరు కండ్లార చూచి చెప్పిరి. మామూలుగా ధౌతియనగా 3 అంగుళముల వెడల్పు 22 1/2 అడుగుల పొడవుగల గుడ్డను మ్రింగి కడుపులో అరగంటవరకు నుండనిచ్చి పిమ్మట తీసెదరు, కాని బాబా చేసిన ధౌతి చాల విశిష్టము, అసాధారణమునైనది.

### 2. ఖండయోగము

బాబా తన శరీరావయవములన్నియు వేరుచేసి మసీదునందు వేర్వేరు స్థలములలో విడిచి పెట్టువారు. ఒకనాడొక పెద్దమనిషి మసీదుకు పోయి బాబా యవయవములు వేర్వేరు స్థలములందు పడియుండుట జూచి భయకంపితుడై బాబాను ఎవరో ఖూని చేసిరనుకొని గ్రామ మునసబు వద్దకు పోయి ఫిర్యాదు చేయ నిశ్చయించుకొనెను. కాని మొట్టమొదట ఫిర్యాదు చేసినవానికి ఆ విషయము గూర్చి కొంచెమైన తెలిసి యుండునని తననే అనుమానించెదరని భయపడి యూరకొనెను. మరుసటిదినమతడు మసీదుకు పోగా, బాబా యెప్పటివలె హాయిగా కూర్చొనియుండుట జూచి యాశ్చర్యపడెను. ముందుదినము తాను చూచిన దంతయు భ్రాంతియనుకొనెను.

చిరుప్రాయమునుండి బాబా వివిధ యోగప్రక్రియలు చేయుచుండెను. వారి యోగస్థితి యెవ్వరికిని అంతుబట్టనిది. రోగులవద్దనుంచి డబ్బు పుచ్చుకొనక యుచితముగా చికిత్స చేయుచుండిరి. ఎందరో పేదలు వ్యథార్థులు వారి యనుగ్రహమువల్ల స్వస్థత పొందిరి. నిస్వార్థముగ వారు చేయు సత్కార్యముల వల్లనే వారికి గొప్పకీర్తి వచ్చెను. బాబా తమ సొంతముకొరకు ఏమియు చేయక, యితరుల మేలుకొరకే యెల్లప్పుడు పాటుపడేవారు. ఒక్కొక్కప్పుడు ఇతరుల వ్యాధిని తమపై వేసికొని ఆ బాధను తామనుభవించేవారు. అటువంటి సంఘటననొకదానిని యీ దిగువ పేర్కొందును. దీనిని బట్టి బాబా యొక్క సర్వజ్ఞత, దయార్ద్రహృదయము విదితమగును.

**బాబా సర్వాంతర్యామిత్వము, కారుణ్యము**

1910వ సంవత్సరము (ఘనత్రయోదశి నాడు, యనగా) దీపావళి పండుగ ముందురోజున బాబా ధునివద్ద కూర్చుండి చలికాచుకొనుచు, ధునిలో కట్టెలు వేయుచుండెను. ధుని బాగుగా మండుచుండెను. కొంతసేపయిన తరువాత హఠాత్తుగ కట్టెలకు మారు తన చేతిని ధునిలో పెట్టి, నిశ్చలముగ యుండిపోయిరి. మంటలకు చేయి కాలిపోయెను. మాధవుడనే నౌకరును, మాధవరావు దేశపాండేయు దీనిని జూచి, వెంటనే బాబా వైపుకు పరుగిడిరి. మాధవరావు దేశపాండే బాబా నడుమును పట్టుకొని బలముగ వెనుకకు

లాగెను. "దేవా! ఇట్లేల చేసితిర"ని బాబా నడిగిరి. (మరేదోలోకములో యుండినట్లుండిన) బాబా బాహ్యస్మృతి తెచ్చుకొని, "ఇక్కడకు చాలదూరములో ఒక కమ్మరి స్త్రీ తన బిడ్డను యొడిలో నుంచుకొని, కొలిమినూదుచుండెను. అంతలో నామె భర్త పిలిచెను. తన యొడిలో బిడ్డయున్న సంగతి మరచి ఆమె తొందర్గగా లేచెను. బిడ్డ మండుచున్న కొలిమిలో బడెను. వెంటనే నాచేతిని కొలిమిలోనికి దూర్చి ఆ బిడ్డను రక్షించితిని. నా చేయి కాలితే కాలినది. అది నాకంత బాధాకరము కాదు. కాని బిడ్డ రక్షింపబడెనను విషయము నా కానందము గలుగచేయుచున్న" దని జవాబిచ్చెను.

### కుష్ఠురోగభక్తుని సేవ

బాబా చెయ్యి కాలెనను సంగతి మాధవరావు దేశపాండే ద్వారా తెలిసికొనిన నానా సాహెబు చాందోర్కరు వెంటనే బొంబాయినుండి డాక్టరు పరమానంద్ యను ప్రఖ్యాత వైద్యుని వెంటబెట్టుకొని వైద్యసామగ్రితో సహా హుటాహుటిన శిరిడీ చేరెను. చికిత్స చేయుటకై డాక్టరుకు కాలిన తమ చేయి చూపమని బాబాను నానా కోరెను. బాబా యందుల కొప్పుకొనలేదు. చేయి కాలిన లగాయతు భాగోజీశిందే యను కుష్ఠురోగి యేదో ఆకువేసి కట్టు కట్టెడివాడు. నానా యెంతవేడినను బాబా డాక్టరుగారిచే చికిత్స పొందుటకు సమ్మతింపలేదు. డాక్టరుగారు కూడ అనేకసారులు వేడుకొనిరి. 'అల్లాయే తన వైద్యుడనీ', 'తమకేమాత్రము బాధలేదనీ' చెప్పుచూ, యెటులో డాక్టరుచే చికిత్సచేయించుకొనుటను దాటవేయుచుండెను. అందుచే డాక్టరు మందుల పెట్టె మూతయైన తెరువకుండగనే బొంబాయి తిరిగి వెళ్ళిపోయెను. కాని అతనికి యీ మిషతో బాబా దర్శనభాగ్యము లభించెను. ప్రతిరోజు భాగోజీ వచ్చి బాబా చేతికి కట్టు కట్టుచుండెను. కొన్ని దినముల తరువాత గాయము మానిపోయెను. అందరు సంతోషించిరి. అప్పటికిని యింకా ఏమైన నొప్పి మిగిలియుండినదాయను సంగతి యెవరికి తెలియదు.కాని, ప్రతిరోజు ఉదయము భాగోజీ పట్టీలను విప్పి, బాబా చేతిని నేతితో తోమి, తిరిగి కట్లను కట్టుచుండెడివాడు. బాబా మహాసమాధి వరకు ఇది జరుగుచునేయుండెను. మహాసిద్ధపురుషుడయిన బాబాకిదంతయు నిజానికి అవసరములేనప్పటికీ,

తన భక్తుడైన భాగోజీ యందు గల ప్రేమచే అతడొనర్చు ఉపాసనను గైకొనెను. బాబా లెండీకి పోవునప్పుడు భాగోజీ బాబా తలపై గొడుగు పట్టుకొని వెంట నడిచెడివాడు. ప్రతిరోజు ఉదయము బాబా ధునియొద్ద కూర్చొనగనే, భాగోజీ తన సేవాకార్యము మొదలిడువాడు. భాగోజీ గతజన్మయందు చేసిన పాపఫలితముగ యీ జన్మమున కుష్ఠురోగముచే బాధపడుచుండెను. వాని వ్రేళ్ళు ఈడ్చుకొని పోయియుండెను. వాని శరీరమంతయు చీము కారుచు, దుర్వాసన కొట్టుచుండెను. బాహ్యమునకు అతడెంత దురదృష్టవంతునివలె గాన్పించు నప్పటికి, అతడు మిక్కిలి అదృష్టశాలి, సంతోషి. ఎందుకనగా అతడు బాబా సేవకులందరిలో మొదటివాడు; బాబా సహవాసమును పూర్తిగా ననుభవించినవాడు.

### ఖాపర్డే కుమారుని ప్లేగు వ్యాధి

బాబా విచిత్రలీలలలో నింకొకదానిని వర్ణించెదను. అమరావతి నివాసి యగు దాదాసాహెబు ఖాపర్డే భార్య తన చిన్న కొడుకుతో కలిసి శిరిడీలో కొన్ని దినములుండెను. ఒకనాడు ఖాపర్డే కుమారునికి తీవ్ర జ్వరము వచ్చెను. అది ప్లేగు జ్వరము క్రింద మారెను. తల్లి మిక్కిలి భయపడెను. శిరిడీ విడచి అమరావతి పోవలెననుకొని సాయంకాలము బాబా బూటీవాడా వద్దకు వచ్చుచున్నప్పుడు వారిని సెలవు నడుగబోయెను. గద్గదకంఠముతో తన చిన్నకొడుకు ప్లేగుతో పడియున్నాడని బాబాకు చెప్పెను. బాబా యామెతో దయతో మృదువుగ నిట్లెనెను: "ప్రస్తుతము ఆకాశము మబ్బుపట్టియున్నది. కొద్దిసేపటిలో మబ్బులన్నియు చెదిరిపోయి, ఆకాశము నిర్మలమగును." అట్లనుచు బాబా కఫ్నీని పై కెత్తి, చంకలో కోడిగ్రుడ్లంత పరిమాణముగల నాలుగు ప్లేగు పొక్కులను చూపుచూ, "నా భక్తులకొరకు నే నెట్లు బాధపడెదనో చూడుము! వారి కష్టములన్నియు నావే!" ఈ మహాద్భుతలీలను జూచిన జనులకు, మహాత్ములు తమ భక్తుల బాధలు తామే యెట్లుస్వీకరింతురో యను విషయము స్పష్టమయ్యెను. మహాత్ముల మనస్సు మైనముకన్న మెత్తనిది, వెన్నవలె మృదువైనది. వారు భక్తులను ప్రత్యుపకారమేమియు ఆశించక ప్రేమించెదరు. భక్తులనే తమ స్వజనులుగ భావించెదరు.

**బాబా పండరి ప్రయాణము!**

సాయిబాబా తన భక్తులనెట్లు ప్రేమించుచుండెనో వారి కోరికలను అవసరముల నెట్లు గ్రహించుచుండెనో యను కథను చెప్పి ఈ అధ్యాయమును ముగించెదను. నానాసాహెబు చాందోర్కరు బాబాకు గొప్ప భక్తుడు. అతడు ఖాందేషులోని నందూరుబారులో మామల్తదారుగా నుండెను. అతనికి పండరీపురమునకు బదిలీ అయ్యెను. సాయిబాబాయందు అతనికిగల భక్తి యను ఫలమానాటికి పండెను. పండరీపురమును భూలోకవైకుంఠ మనెదరు. అట్టి స్థలమునకు బదిలీ యగుటచే నాతడు గొప్ప ధన్యుడు. నానాసాహెబు వెంటనే పండరి పోయి ఉద్యోగములో ప్రవేశించవలసి యుండెను. శిరిడీలో యెవ్వరికీ ఉత్తరము వ్రాయక, హుటాహుటిన పండరికి ప్రయాణమయ్యెను. ముందుగా శిరిడీకి పోయి తన వితోబాయగు బాబాను దర్శించి, ఆ తరువాత పండరికి పోవలెననుకొనెను. నానాసాహెబు శిరిడీకి వచ్చు సంగతి యెవరికి తెలియదు. కాని బాబా సర్వజ్ఞుడగుటచే గ్రహించెను. నానాసాహెబు నీమ్‌గాం చేరుసరికి శిరిడీ మసీదులో కలకలము రేగెను. బాబా మసీదులో కూర్చుండి మహాల్సాపతి, అప్పాశిందే, కాశీరాములతో మాట్లాడుచుండెను. హఠాత్తుగా బాబా వారితో నిట్లనియెను: "*మన నలుగురము కలిసి భజన చేసెదము. పండరీ ద్వారములు తెరచినారు. కనుక ఆనందముగా పాడెదము లెండు!*" అందరు కలిసి పాడదొడంగిరి. ఆ పాట యొక్క భావమేమన, "*నేను పండరి పోవలెను. నేనక్కడనే నివసించవలెను. ఎందుకనగా, అదియే నా ప్రభువు యొక్క ధామము.*"

అట్లు బాబా పాడుచుండెను. భక్తులందరు బాబాను అనుకరించిరి. కొద్దిసేపటికి నానాసాహెబ్ కుటుంబసమేతముగ వచ్చి బాబా పాదములకు సాష్టాంగనమస్కారము చేసి, తనకు పండరీపురము బదలీయైనదనీ, బాబా కూడా వారితో పండరీపురము వచ్చి యక్కడుండవలసినదనీ వేడుకొనెను. అటుల బ్రతిమాలుట కవసరము లేకుండెను. ఏలన బాబా యప్పటికే పండరి పోవలెను, అచ్చట నుండవలెనను భావమును వెలిబుచ్చుచుండెనని తక్కిన భక్తులు చెప్పిరి. ఇది విని నానా మనస్సు కరిగి బాబా పాదములపై బడెను.

బాబా యొక్క ఊదీ ప్రసాదమును ఆశీర్వాదమును అనుజ్ఞను పొంది, నానాసాహెబు పండరికి పోయెను. ఇట్టి బాబా లీలల కంతులేదు!

ఏడవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

**మొదటిరోజు పారాయణము సమాప్తము**



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

**రెండవరోజు పారాయణము**

**శుక్రవారము**

## ఎనిమిదవ అధ్యాయము

*మానవజన్మ ప్రాముఖ్యము; సాయిబాబా భిక్షాటనము; బాయిజాబాయి సేవ; సాయిబాబా పడక జాగా; కుశాల్‌చంద్‌పై వారి ప్రేమ.*

### మానవజన్మ యొక్క ప్రాముఖ్యము

ఈ యద్భుత విశ్వమందు భగవంతుడు కోటానుకోట్ల జీవులను సృష్టించి యున్నాడు. దేవయక్షగంధర్వాదులు, జంతుకీటకాదులు మనుష్యులు మొదలగువానిని సృష్టించెను. స్వర్గము, నరకము, భూమి మహాసముద్రము, ఆకాశమునందు నివసించు జీవకోటి యంతయు సృష్టించెను. వీరిలో నెవరి పుణ్యమెక్కువగునో వారు స్వర్గమునకు పోయి వారి పుణ్యఫలము ననుభవించిన పిమ్మట త్రోసి వేయబడుదురు. ఎవరి పాప మెక్కువగునో వారు నరకమునకు పోదురు. అచ్చట వారు పాపములకు తగినట్లు బాధలను పొందెదరు. పాపపుణ్యములు సమానమగునప్పుడు భూమిపై మానవులుగా జన్మించి మోక్షసాధనమునకై యవకాశము గాంచెదరు. వారి పాపపుణ్యములు నిష్క్రమించునప్పుడు వారికి మోక్షము కలుగును. వేయేల మోక్షముగాని, పుట్టుకగాని వారువారు చేసికొనిన కర్మపై ఆధారపడి యుండును.

### మానవశరీరము యొక్క ప్రత్యేక విలువ

జీవకోటి యంతటికి ఆహారము, నిద్ర, భయము, సంభోగము సామాన్యము. మానవునికివిగాక మరొక్క ప్రజ్ఞ గలదు. అదియే జ్ఞానము. దీని సహాయముననే మానవుడు భగవత్ సాక్షాత్కారమును పొందగలడు. ఇంకే జన్మయందును దీని కవకాశము లేదు. ఈ కారణముచేతనే దేవతలు సైతము మానవజన్మను ఈర్ష్యతో చూచెదరు. వారు కూడ భూమిపై మానవజన్మమెత్తి మోక్షమును సాధించవలెనని కోరెదరు.

కొంతమంది మానవజన్మము చాల నీచమైనదనియు; చీము, రక్తము, మలములతో నిండియుండు ననియు, తుదకు శిథిలమై రోగమునకు మరణమునకు కారణమగుననియునందురు. కొంతవర కదికూడ నిజమే. ఇన్ని లోపములున్నప్పటికి మానవునకు జ్ఞానమును సంపాదించు శక్తి కలదు. శరీరముండుట చేతనే మానవుడు తన దేహము యొక్క, జగత్తు యొక్క అనిత్యత్వమును గ్రహించి, ఇంద్రియసుఖముల పట్ల విరక్తి పొంది, నిత్యానిత్యవివేకముతో కడకు భగవత్సాక్షాత్కారమును బొందుచున్నాడు. శరీరము మలభూయిష్టమైనదని నిరాకరించినచో మోక్షమును సంపాదించు అవకాశమును పోగొట్టుకొనెదము. దేహమును ముద్దుగా పెంచి విషయసుఖములకు మరగినచో నరకమున బడెదము. ఉచితమార్గమేమన, దేహము నశ్రద్ధ చేయకూడదు; దానిని లోలత్వముతో పోషింపనూగూడదు. తగు జాగ్రత్త మాత్రమే తీసికొనవలెను. గుఱ్ఱపురౌతు తన గమ్యస్థానము చేరువరకు గుఱ్ఱమును ఎంత జాగ్రత్తతో చూచుకొనునో యంతజాగ్రత్త మాత్రమే తీసికొనవలెను. ఈ శరీరమును మోక్షసాధన, లేక యాత్మసాక్షాత్కారము కొరకు వినియోగించవలెను. ఇదియే జీవుని పరమావధియై యుండవలెను.

భగవంతు డనేకజీవులను సృష్టించినప్పటికి అతనికి సంతుష్టి కలుగలేదట. ఎందుకనగా భగవంతుని శక్తిని యవేవియు గ్రహించలేక పోయినవి. అందుచేత భగవంతుడు ప్రత్యేకముగా మానవుని సృష్టించెను. వానికి జ్ఞానమనే ప్రత్యేక శక్తి నిచ్చెను. మానవుడు భగవంతుని లీలలను, అద్భుతకార్యములను, శేముషీవిజ్ఞానములను జూచి పరవశమొంది నప్పుడు భగవంతుడు మిక్కిలి సంతుష్టి జెంది యానందించును. అందుచే మానవజన్మ

లభించుట గొప్ప యదృష్టము. బ్రాహ్మణజన్మ పొందుట అందులోనూ శ్రేష్టము. అన్నిటికంటె గొప్పది సాయిబాబా చరణారవిందములపై సర్వస్యశరణాగతి చేయునవకాశము కలుగుట.

**మానవుని విధ్యుక్త ధర్మము**

మానవజన్మ విలువైనదనియు, దానికెప్పటికైననూ మరణము అనివార్యమనియు గ్రహించి మానవుడెల్లప్పుడు జాగరూకుడై యుండి జీవిత పరమావధిని సాధించుటకై యత్నించవలయును. ఏ మాత్రమును అశ్రద్ధగాని ఆలస్యముగాని చేయరాదు. త్వరలో దానిని సంపాదించుటకు యత్నించవలెను. భార్య చనిపోయిన వాడు రెండవ భార్య కొఱకెంత ఆతురపడునో, తప్పిపోయిన యువరాజుకై చక్రవర్తి యెంతగా వెదకయత్నించునో యటులనే, విసుగు విరామములేక రాత్రింబవళ్ళు కృషి చేసి యాత్మసాక్షాత్కారమును సంపాదించవలెను. బద్ధకమును, అలసతను, కునుకుపాట్లను దూరమొనర్చి అహోరాత్రములు ఆత్మయందే ధ్యానము నిలుపవలెను. ఈ మాత్రము చేయలేనిచో మనము పశుప్రాయుల మగుదుము.

**తక్షణ కర్తవ్యము**

మన ధ్యేయము సత్వరము ఫలించు మార్గమేదన, వెంటనే భగవత్సాక్షాత్కారము పొందిన సద్గురువు వద్దకేగుట. అధ్యాత్మికోపన్యాసములెన్ని వినినప్పటికి పొందనట్టిదియు, అధ్యాత్మికగ్రంథములెన్ని చదివినను తెలియనట్టిదియునగు ఆత్మసాక్షాత్కారము సద్గురువుల సాంగత్యముచే సులభముగా పొందవచ్చును. నక్షత్రములన్నియు కలిసి యివ్వలేని వెలుతురును సూర్యుడెట్లు ఇవ్వగలుగుచున్నాడో యట్లనే అధ్యాత్మికోపన్యాసములు, గ్రంథములు ఇవ్వలేని జ్ఞానమును సద్గురువు విప్పి చెప్పగలడు. వారి చర్యలు, సామాన్య సంభాషణలే మనకు మౌనప్రబోధములు. శాంతి, క్షమ, వైరాగ్యము, దానము, ధర్మము, మనోదేహములను స్వాధీన మందుంచుకొనుట, అహంకారము లేకుండుట మొదలగు శుభలక్షణములను - వారి ఆచరణలో చూచి, భక్తులు నేర్చుకొందురు. వారి పావనచరితములు భక్తుల మనములకు ప్రబోధము కలుగజేసి వారిని పారమార్థికముగా ఉద్ధరించును. సాయిబాబా యట్టి మహాపురుషుడు; సద్గురువు.

బాబా సామాన్య ఫకీరువలె సంచరించుచున్నప్పటికి వారెప్పుడును ఆత్మానుసంధానము నందే నిమగ్నులగుచుండిరి. దైవభక్తిగల పవిత్ర హృదయులు వారికి సదా ప్రీతిపాత్రులు. వారు సుఖములకు ఉప్పొంగువారు కారు, కష్టముల వలన క్రుంగిపోవువారు కారు. రాజైననూ, నిరుపేదైననూ వారికి సమానమే. తమదృష్టి మాత్రమున ముష్టివానిని చక్రవర్తిని చేయగలశక్తి యున్నప్పటికి బాబా ఇంటింటికి తిరిగి భిక్ష నెత్తెడివారు! వారి భిక్ష యెట్టిదో చూతము.

**బాబా యొక్క భిక్షాటనము**

శిరిడీజనులు పుణ్యాత్ములు. ఎందుకనగా, వారి యిండ్ల యెదుటనేగదా బాబా భిక్షుకునివలె నిలచి, "అమ్మా! రొట్టెముక్క పెట్టు" డనుచు, దానిని అందుకొనుటకు చేయి చాచెడివారు! చేత ఒక రేకుడబ్బా పట్టుకొని, భుజానికి ఒక గుడ్డజోలె తగిలించుకొని భిక్షాటనకు పోయెడివారు. బాబా కొన్ని యిండ్లకు మాత్రమే భిక్షకు పోయెడివారు. పులుసు, మజ్జిగ వంటి ద్రవ పదార్థములు, కూరలు మొదలగునవి రేకుడబ్బాలో పోసికొనెడివారు. అన్నము, రొట్టెలు మొదలగునవి జోలెలో వేయించుకొనెడివారు. బాబాకు రుచి యనునది లేదు. వారు జిహ్వను స్వాధీనమందుంచుకొనిరి. కాన అన్ని పదార్థములను రేకుడబ్బాలోను, జోలెలోను వేసికొనెడివారు. అన్ని పదార్థములను ఒకేసారి కలిపివేసి భుజించి సంతుష్టి చెందేవారు. పదార్థముల రుచిని పాటించేవారు కాదు. వారి నాలుకకు రుచి యనునది లేనట్లే కాన్పించుచుండెను. బాబా భిక్షకు యొక్క పద్ధతి, కాలనియమము లేకుండెను. ఒక్కొక్కదినము కొన్ని యిండ్లవద్ద మాత్రమే భిక్షచేసెడివారు. ఒక్కొక్కసారి 12 సార్లు కూడా భిక్షకువెళ్ళెడివారు. భిక్షలో దొరికిన పదార్థముల నన్నింటిని ఒక మట్టిపాత్రలో వేసేవారు. దానిని కుక్కలు, పిల్లులు, కాకులు విచ్చలవిడిగా తినుచుండెడివి. వాటిని తరిమే వారు కారు. మసీదు తుడిచి శుభ్రము చేయు స్త్రీ 10-12 రొట్టెముక్కలను నిరాటంకముగా తీసికొనుచుండెడిది. కుక్కలను, పిల్లులనుగూడ కలలో సైతము అడ్డు పెట్టనివారు, ఆకలితోనున్న పేదల ఆహారమునకు అడ్డుచెప్పుదురా? "ఫకీరు పదవియే నిజమైన మహారాజపదవియనీ, అదియే శాశ్వతమనీ, మామూలు సిరిసంపదలు క్షణభంగురాలనీ", బాబా యను చుండెడివారు. ఆ పావనచరితుని జీవితము వంటి జీవితమేగదా మిగుల ధన్యమైనది!

మొదట శిరిడీ ప్రజలు బాబానొక పిచ్చిఫకీరని భావించి, అటులనే పిలిచెడివారు. భోజనోపాధికై రొట్టెముక్కలకై గ్రామములో భిక్షనెత్తి పొట్టపోసికొనెడు పేదఫకీరన్న ఎవరికి గౌరవమేమియుండును? కానీ, యీ ఫకీరు పరమవిశాలహృదయుడు, ఉదారుడు, ధనాపేక్ష లేశమాత్రము లేని నిరాసక్తుడు.బాహ్యదృష్టికి వారు చంచలునిగను, స్థిరత్వము లేనివారుగను గాన్పించినను, లోన వారు స్థిరచిత్తులు. వారి చర్యలు అంతుబట్టనివి. ఆ కుగ్రామములో కూడ బాబాను ఒక గొప్ప మహాత్మునిగ గుర్తించి, సేవించిన ధన్యజీవులు కొద్దిమంది గలరు. అట్టివారిలో నొకరి వృత్తాంతమిక్కడ చెప్పబోవుచున్నాను.

### బాయజాబాయి యొక్క ఎనలేని సేవ

తాత్యాకోతే పాటీలు తల్లి పేరు బాయజాబాయి. ఆమె ప్రతిరోజు మధ్యాహ్నము తలపై ఒక గంపలో రొట్టె కూర పెట్టుకొని, సమీపముననున్న చిట్టడవిలో ముండ్లు పొదలు లెక్కచేయక క్రోసులకొద్ది దూరమునడచి, ఆత్మధ్యానములో నిశ్చలముగ యెక్కడో కూర్చునియున్న బాబాను వెదకి పట్టుకొని, భోజనము పెట్టుచుండెను. బాబాకు సాష్టాంగనమస్కారముచేసి, వారి యెదుట విస్తరొకటి వేసి తాను తెచ్చిన రొట్టె కూర మొదలగు భోజన పదార్థములను వడ్డించి, కొసరికొసరి వాటిని బాబాచే తినిపించుచుండెను. ఆమె భక్తివిశ్వాసములు అద్భుతమైనవి. ఎనలేని ఆమె సేవను బాబా చివరి వరకు మరువలేదు. ఆమె సేవకు తగినట్లు ఆమె పుత్రుడగు తాత్యాపాటీలును యెంతో ఆదరించి ఉద్ధరించెను. ఆ తల్లి కొడుకులకు బాబా సాక్షాత్ భగవంతుడనే విశ్వాసముండెను. కొన్ని సంవత్సరముల తదుపరి బాబా యడవులకు బోవుట మాని మసీదులోనే కూర్చుండి భోజనము చేయసాగిరి. అప్పటినుంచి పొలములో తిరిగి బాబాను వెతకిపట్టుకొను శ్రమ బాయజాబాయికి తప్పినది.

### ముగ్గురి పడుక స్థలము

ఎవరి హృదయమందు సదా వాసుదేవుడు వసించుచుండునో అట్టి మహాత్ములు ధన్యులు; అట్టి మహాత్ముల సాంగత్యము లభించిన భక్తులు గొప్ప యదృష్టవంతులు. తాత్యాకోతే పాటీలు, మహల్సాపతి ఇద్దరు అట్టి

అదృష్టశాలురు. బాబా వారిరువురిని సమానముగా ప్రేమించెడివారు. బాబా వీరిరువురితో కలసి, మసీదులో తమ తలలను తూర్పు, పడమర, ఉత్తరముల వైపు చేసి, మధ్యలో ఒకరి కాళ్ళు ఒకరికి తగులునట్లు పండుకొనెడివారు. ప్రక్కలు పరచుకొని, వానిపై చతికిలపడి సగము రేయివరకు ఏవేవో సంగతులు ముచ్చటించుకొనెడివారు. అందులో నెవరికైన నిద్రవచ్చుచున్నటుల గాన్పించిన తక్కిన వారు వారిని మేల్గొలుపుచుండిరి. తాత్యా పండుకొని గుఱ్ఱుపెట్టినచో బాబా వానిని యటునిటు ఊపి, వాని శిరస్సును గట్టిగా నొక్కుచుండెను. బాబా ఒక్కొక్కసారి మహాల్సాపతిని అక్కునజేర్చుకొని, అతని కాళ్ళు నొక్కి వీపు తోమెడివారు. ఈ విధముగా 14 సంవత్సరములు తాత్యా తన తల్లిదండ్రులను విడచి బాబాపై ప్రేమచే మసీదులోనే పండుకొనెను. అవి మరపురాని మధురదినములు. బాబా ప్రేమానురాగములు కొలువరానివి; వారి అనుగ్రహము ఇంతయని చెప్పుటకు అలవికానిది. తండ్రి మరణించిన పిమ్మట తాత్యా గృహబాధ్యతను స్వీకరించి ఇంటిలోనే నిద్రించుటకు ప్రారంభించెను.

**రహాతా నివాసి కుశాల్‌చంద్**

శిరిడీలో (తాత్యా తండ్రిగారైన) గణపతిరావుకోతేపాటీలును బాబా ఎంత ప్రేమాభిమానములతో జూచెడివారో, అంతటి ప్రేమాదరములతోనే రహాతా నివాసియగు చంద్రభాను శేట్ మార్వాడీని జూచుచుండిరి. ఆ శేట్ మరణించిన పిమ్మట అతని యన్న కొడుకగు కుశాల్‌చందును గూడ మిక్కిలి ప్రేమతో జూచుచు అహర్నిశలు వాని యోగక్షేమమరయుచుండిరి. ఒకొక్కప్పుడు టాంగాలోను, మరొకప్పుడెద్దులబండి మీదను బాబా తన సన్నిహిత భక్తులతో కలసి రహతా పోవువారు. రహతా ప్రజలు బాజాభజంత్రీలతో యెదురేగి, బాబాను గ్రామసరిహద్దు ద్వారము వద్ద దర్శించి, సాష్టాంగనమస్కారములు చేసెడివారు. తరువాత మహా వైభవముగ బాబాను గ్రామములోనికి సాదరముగ తీసికొని వెళ్ళెడివారు. కుశాల్‌చందు బాబాను తన యింటికి తీసికొనిపోయి తగిన యాసనమునందు కూర్చుండజేసి భోజనము పెట్టెడివాడు. ఇరువురు కొంతసేపు ప్రేమోల్లాసములతో ముచ్చటించుకొనెడివారు. తదుపరి బాబా వారిని ఆశీర్వదించి శిరిడీ చేరుచుండెడివారు.

శిరిడీ గ్రామమునకు సమాన దూరములో ఒకవైపు (దక్షిణమున) రహాతా, మరోవైపు (ఉత్తరదిశయందు) నీమ్‌గాం ఉన్నవి. ఈ రెండు గ్రామములు దాటి బాబా యెన్నడు ఎచ్చటికి పోయి యుండలేదు.వారెన్నడూ రైలుబండిలో ప్రయాణము చేసి యెరుగరు; రైలుబండిని కనీసము చూచికూడా యుండలేదు. కానీ, సర్వజ్ఞుడైన బాబాకు బండ్ల రాకపోకలు ఖచ్చితముగ తెలియుచుండెడివి. బాబా వద్ద సెలవు పుచ్చుకొని వారి యాజ్ఞానుసారము ప్రయాణము చేయువారల కేకష్టములుండెడివి కావు. బాబా యాదేశమునకు వ్యతిరేకముగ పోవువారనేకకష్టముల పాలగుచుండిరి. అటువంటి కొన్ని సంఘటనలను, మరికొన్ని ఇతరవిషయములను రాబోవు యధ్యాయములో చెప్పెదను.

ఎనిమిదవ అధ్యాయము
సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## తొమ్మిదవ అధ్యాయము

*బాబా వద్ద సెలవు పుచ్చుకొనునప్పుడు వారి యాజ్ఞను పాలించవలెను-*
*వారి యాజ్ఞకు వ్యతిరేకముగా నడచిన ఫలితములు; కొన్ని ఉదాహరణములు;*
*భిక్ష, దాని యావశ్యకత. భక్తుల యనుభవములు.*

### శిరిడీ యాత్ర యొక్క లక్షణములు

శిరిడీ సందర్శనములోని యొక ప్రత్యేక విశేషమేమన, బాబా యనుమతి లేనిదే యెవరును శిరిడీ విడువ లేకుండిరి. బాబా యనుమతిలేక యెవరైనను శిరిడీ విడచి వెళ్ళినచో, వారు ఊహించని కష్టములు కొనితెచ్చుకున్నవారగుచుండిరి. బాబా యెవరినైన బయలుదేరుడని శలవిచ్చిన తరువాత, ఇక శిరిడీలో నుండరాదు. శలవు తీసుకొనుటకు బాబా వద్దకు భక్తులు పోయినప్పుడు బాబా వారికి స్పష్టముగనో లేక సూచనప్రాయముగనో కొన్ని సలహాల నిచ్చుచుండెడివారు. బాబా ఆదేశానుసారము నడచి తీరవలెను. వ్యతిరేకముగా పోయినచో ప్రమాదములేవో తప్పక వచ్చుచుండెడివి. ఈ దిగువ అట్టి యుదాహరణములు కొన్ని ఇచ్చుచున్నాను.

**తాత్యాకోతే పాటిల్**

తాత్యాకోతేపాటిల్ ఒకనాడు టాంగాలో కోపర్‌గాంవ్‌లో జరుగు సంతకు బయలుదేరెను. హడావుడిగా మసీదుకు వచ్చి, బాబాకు నమస్కరించి కోపర్‌గాంవ్ సంతకు పోవుచుంటినని చెప్పెను. బాబా అతనితో, "తొందర పడవద్దు! కొంచెమాగుము. సంత సంగతి యటుండనివ్వు! ఊరు విడిచి అసలు బయటకెక్కడికిని పోవలదు" అని అనెను. సంతకు వెళ్ళవలెననెడి

తాత్యా యాతురతను జూచి, కనీసము షామా (మాధవరావు దేశపాండే) నయిన వెంట దీసికొని పొమ్మని బాబా చెప్పెను. బాబా మాటలను లెక్కచేయక తాత్యా హుటాహుటిన టాంగానెక్కి కోపర్‌గాంవ్ బయలుదేరెను. టాంగాకు కట్టిన రెండు గుఱ్ఱములలో నొకటి మూడువందలరూపాయలు ఖరీదు పెట్టి క్రొత్తగా కొన్నది. మిక్కిలి చురుకైనది. శిరిడీ వదలి సావుల్‌విహిర్ దాటిన వెంటనే అది మిక్కిలి వడిగా పరుగెత్తసాగెను. కొంతదూరము పోయిన పిమ్మట కాలు మడతబడి యది కూలబడెను. తాత్యాకు పెద్ద దెబ్బలేమీ తగులలేదు గానీ, తల్లి వలే ప్రేమతో బాబా చెప్పిన సలహా జ్ఞప్తికి వచ్చెను. మరొకప్పుడు గూడా, ఇటులనే బాబా యాజ్ఞను వ్యతిరేకించి కోల్హారు గ్రామమునకు ప్రయాణమై, దారిలో టాంగా ప్రమాదమునకు గురయ్యెను.

**ఐరోపాదేశస్థుని ఉదంతము**

బొంబాయి నుండి ఐరోపాదేశస్థుడొకడు యేదోఉద్దేశముతో బాబా దర్శనార్థము శిరిడీ వచ్చెను. తనతో నానాసాహెబు చాందోర్కరు వద్దనుంచి తనను గూర్చిన యొక పరిచయ పత్రమును కూడా తెచ్చెను. అతనికొరకు ఒక ప్రత్యేక గుడారమువేసి, అందులో సౌకర్యముగ బస యేర్పాటుచేసిరి. బాబా ముందు మ్రోకరిల్లి, వారి చేతిని ముద్దిడవలెనను కోరికతో అతడు మూడుసారులు మసీదులో ప్రవేశింప యత్నించెను. కాని బాబా అతనిని మసీదులో ప్రవేశించుటకు నిషేధించెను. క్రిందగా మశీదు ముందు గల బహిరంగావరణములో కూర్చుండియే తమను దర్శించుకొనవచ్చుననిరి. అతడు తనకు జరిగిన మరియాదకు అసంతుష్టిపడి వెంటనే శిరిడీ విడువవలెనని నిశ్చయించుకొనెను. బాబా సెలవు పొందుటకు వచ్చెను. తొందరపడక మరుసటి దినము పొమ్మని బాబా చెప్పెను. తక్కినవారు కూడ బాబా ఆదేశమును పాటించమని సలహా ఇచ్చిరి. ఆ సలహాలను ఖాతరుచేయక అతడు టాంగానెక్కి శిరిడీ నుండి బయలుదేరెను. మొదట గుఱ్ఱములు బాగుగనే పరుగెత్తినవి. సావుల్‌విహిర్ దాటిన కొద్దిసేపటిలో యొక సైకిలు అతని టాంగా కెదురువచ్చెను. దానిని జూచి గుఱ్ఱములు బెదరినవి. టాంగా తలక్రిందులయ్యెను. ఆ పెద్దమనిషి క్రిందబడి, రోడ్డుపై కొంత దూరము ఈడ్వబడెను. ఫలితముగా గాయములను బాగు చేసికొనుటకై

కోపర్‌గాంవ్‌లో ఆసుపత్రి పాలయ్యెను. ఇటువంటి అనేకసంఘటనల మూలమున బాబా యాజ్ఞను ధిక్కరించువారు ప్రమాదముల పాలగుదురనియు, బాబా యాజ్ఞానుసారము పోవువారు సురక్షితముగా నుందురనియు జనులు గ్రహించిరి.

**భిక్షయొక్క యావశ్యకత**

బాబాయే భగవంతుడయినచో వారు భిక్షాటనముచే జీవితమంతయు గడుపనేల? యను సందియము చాలామందికి కలుగవచ్చును. దీనికి, (1) భిక్షాటనము చేసి జీవించు హక్కు ఎవరికి కలదు? (2) పంచసూనములు, వానిని పోగొట్టుకొను మార్గమేది? యను రెండు ప్రశ్నలకు వచ్చు సమాధానముతో సమాధానపడును.

సంతానము, ధనము, కీర్తి సంపాదించుటయందాపేక్ష వదలుకొని సన్యసించువారు భిక్షాటనముచే జీవించవచ్చునని మన శాస్త్రములు ఘోషించుచున్నవి. వారు ఇంటివద్ద వంట ప్రయత్నములు చేసికొని తినలేరు. వారికి భోజనము పెట్టు బాధ్యత గృహస్థులపై గలదు. సాయిబాబా గృహస్థుడు కారు; వానప్రస్థుడు కూడ కారు; వారస్ఖలితబ్రహ్మచారులు. బాల్యమునుంచి బ్రహ్మచర్యమునే అవలంబించుచుండిరి. ఈ సకల జగత్తంతయు వారి గృహమే. ఈ జగత్తునకు వారు కారణభూతులు. వారిపై జగత్తు ఆధారపడి యున్నది. వారు పరబ్రహ్మస్వరూపులు. కాబట్టి వారికి భిక్షాటన చేయు హక్కు సంపూర్ణముగా కలదు.

పంచసూనములు, వానిని తప్పించుకొను మార్గమును ఆలోచింతము. భోజనపదార్థములు తయారు చేయుటకు గృహస్థులు అయిదు పనులు తప్పక చేయవలెను. అవి యేవన: 1) దంచుట లేక రుబ్బుట, 2) విసరుట 3) పాత్రలు తోముట, 4) ఇల్లు ఊడ్చుట, తుడుచుట, 5) పొయ్యి యంటించుట. ఈ అయిదు పనులు చేయునప్పుడనేక క్రిమికీటకాదులు మరణించుట తప్పదు. గృహస్థులు ఈ పాపము ననుభవించవలెను. ఈ పాపపరిహారమునకు మన శాస్త్రములు ఆరు మార్గములు ప్రబోధించుచున్నవి. 1) బ్రహ్మయజ్ఞమ. 2) వేదాధ్యయనము, 3) పితృయజ్ఞము, 4) దేవయజ్ఞము, 5) భూతయజ్ఞము, 6) అతిథి యజ్ఞము. శాస్త్రములు విధించిన ఈ యజ్ఞములు నిర్వర్తించినచో

గృహస్థుల మనస్సులు పాపరహితములగును. మోక్షసాధనమునకు ఆత్మ సాక్షాత్కారమునకు యివి తోడ్పడును. బాబా యింటింటికి వెళ్ళి భిక్ష యడుగుటలో, ఆ గృహస్తులకు వారు చేయవలసిన కర్మను బాబా జ్ఞప్తికి దెచ్చినట్లయినది. తమ ఇంటి గుమ్మము వద్దనే యింత గొప్ప ప్రబోధమును పొందిన శిరిడీ ప్రజలెంతటి ధన్యులు!

**భక్తుల యనుభవములు**

శ్రీకృష్ణుడు భగవద్గీత (9అ. 26శ్లో.) యందు, "శ్రద్ధాభక్తులతో ఎవ్వరేని పత్రముగాని పుష్పముగాని ఫలముగాని లేదా నీరుగాని యర్పించినచో దానిని నేను గ్రహించెదను" అని నుడివెను. సాయిబాబాకు సంబంధించి యింకా సంతోషదాయకమగు విషయమేమన, తమ భక్తుడేదైన తమకు సమర్పించవలెననుకొని, యే కారణముచేతైనను ఆ సంగతి మరచినచో, అట్టివానికి బాబా ఆ విషయము జ్ఞాపకము చేసి, ఆ నివేదనను గ్రహించి యాశీర్వదించువారు. అట్టి యుదాహరణలు కొన్ని యీ క్రింద చెప్పబోవుచున్నాను.

**తర్ఖడ్ కుటుంబము**

రామచంద్ర ఆత్మారామ్ వురఫ్ బాబాసాహెబు తర్ఖడ్ యొకానొకప్పుడు ప్రార్థనసమాజస్థుడైనను, తరువాత బాబాకు ప్రియభక్తుడైనాడు. వాని భార్యాపుత్రులు కూడ బాబాను మిగుల ప్రేమించుచుండిరి. ఒకసారి తల్లీ కొడుకులు శిరిడీకి పోయి యచ్చట వేసవి సెలవులు గడుపవలెనని నిర్ణయించిరి. శిరిడీ పోవుట సంతోషదాయకమైనను, కొడుకు మాత్రము దానికి మనఃస్ఫూర్తిగ ఇష్టపడలేదు. కారణమేమన తన తండ్రి ప్రార్థన సమాజమునకు చెందినవాడగుటచే ఇంటివద్ద బాబాయొక్క పూజ సరిగా చేయకపోవచ్చునని సంశయించెను. కాని, బాబాపూజను తాను నియమానుసారము సక్రమముగా చేసెదనని తండ్రి వాగ్దానము చేయుటచే బయలుదేరెను. శుక్రవారము రాత్రి తల్లి కొడుకు బయలుదేరి శిరిడీకి వచ్చిరి.

అమరుసటి దినము శనివారమునాడు తండ్రియగు తర్ఖడ్ పెందలకడనే నిద్రలేచి, స్నానముచేసి, పూజను ప్రారంభించుటకు ముందుగా బాబా పటమునకు సాష్టాంగనమస్కారము చేసి, యేదో లాంఛనమువలె కాక, తన

కుమారుడు చేయునట్లు పూజను శ్రద్ధగా తనచే చేయింపవలసినదని ప్రార్థించెను. ఆనాటి పూజను సమాప్తి చేసి నైవేద్యముగ కలకండను అర్పించెను. భోజనసమయమందు దానిని పంచిపెట్టెను.

ఆనాటి సాయంత్రము, ఆ మరుసటిదినము, అనగా ఆదివారము నాడు, పూజ యంతయు సవ్యముగా జరిగెను. సోమవారము కూడ చక్కగా గడిచెను. ఆత్మారాముడు ఎప్పుడిట్లు పూజ చేసియుండలేదు. పూజయంతయు కొడుకునకు వాగ్దానము చేసినట్లు సరిగా జరుగుచున్నందుకు సంతసించెను. మంగళవారమునాడు పూజనెప్పటివలె సలిపి కచేరికి పోయెను. మధ్యాహ్నమింటికి వచ్చి భోజనమునకు కూర్చున్నపుడు అక్కడ ప్రసాదము లేకుండుట గమనించెను. నౌఖరును అడుగగా ఆనాడు నైవేద్యమిచ్చుట మరచుటచే ప్రసాదము లేదని బదులు చెప్పెను. ఈ సంగతి వినగనే భోజనమునకు కూర్చున్న ఆత్మారామ్ వెంటనే లేచి, బాబా పటమునకు సాష్టాంగనమస్కారము చేసి, బాబాను క్షమాపణ కోరెను. బాబా తనకు ఆ విషయము జ్ఞప్తికి తేనందుకు నిందించెను. ఈ సంగతులన్నిటిని శిరిడీలో నున్న తన కొడుకునకు వ్రాసి, బాబాను క్షమాపణ వేడుమనెను. ఇది బాంద్రాలో మంగళవారము మధ్యాహ్నము సుమారు 12 గంటలకు జరిగెను.

అదే సమయమందు శిరిడీలో, మధ్యాహ్నహారతి ప్రారంభించుటకు ముందు, ఆత్మారాముని భార్యతో బాబా యిట్లనెను: "*తల్లీ! ఏమయిన తినవలెనను ఉద్దేశముతో బాంద్రాలో మీ యింటికి పోయినాను. తలుపు తాళము వేసియుండెను. ఏలాగుననో లోపల ప్రవేశించితిని. కాని అక్కడ తినుట కేమిలేకపోవుటచే తిరిగి వచ్చితిని*" అనెను.

బాబా మాటలు ఆమెకేమియు బోధపడలేదు. కాని ప్రక్కనేయున్న కుమారుడు మాత్రము ఇంటివద్ద పూజలో నేమియో లోటుపాటులు జరిగినవని గ్రహించి, యింటికి పోవుటకు సెలవు నిమ్మని బాబాను వేడెను. అందులకు బాబా పూజను అక్కడనే చేయుమనీ, యింటికి పోనవసరములేదని చెప్పెను. వెంటనే కొడుకు శిరిడీలో జరిగిన విషయమంతయు వివరముగ తండ్రికి ఉత్తరము వ్రాసి, బాబాపూజను అశ్రద్ధచేయవద్దని వేడుకొనెను. ఈ రెండు ఉత్తరములు ఒకటికొకటి మార్గమధ్యమున తటస్థపడి తమ తమ గమ్యస్థానములకు చేరెను. ఇది ఆశ్చర్యకరము కదా!

**ఆత్మారాముని భార్య**

ఇక ఆత్మారాముని భార్య విషయము. ఒకసారి ఆమె మూడు పదార్థములను బాబాకు నైవేద్యము పెట్టుటకు సంకల్పించుకొనెను. అవి: 1) వంకాయ పెరుగుపచ్చడి, 2) వంకాయ వేపుడు కూర, 3) పేడా. బాబా వీనినెట్లు గ్రహించెనో చూచెదము.

బాంద్రా నివాసియగు రఘువీర భాస్కర పురందరే బాబాకు మిక్కిలి భక్తుడు. అతడు ఒకనాడు భార్యతో శిరిడీకి బయలుదేరుచుండెను. ఆత్మారాముని భార్య పెద్దవంకాయలు రెండింటిని మిగుల ప్రేమతో తెచ్చి పురందరుని భార్య చేతికిచ్చి యొకవంకాయతో పెరుగుపచ్చడిని రెండవదానితో వేపుడును చేసి బాబాకు వడ్డించుమని వేడెను. శిరిడీ చేరిన వెంటనే పురందరుని భార్య వంకాయ పెరుగుపచ్చడి మాత్రము చేసి బాబా భోజనమునకు కూర్చున్నప్పుడు తీసికొని వెళ్ళెను. బాబాకా పచ్చడి చాలా రుచిగా నుండెను, కాన దాని నందరికి పంచిపెట్టెను. వెంటనే, తనకు వంకాయ వేపుడు కూడ అప్పుడే కావలెనని బాబా అడిగెను. ఈ సంగతి భక్తులు రాధాకృష్ణమాయికి తెలియపరచిరి. అది వంకాయల కాలము కాదు గనుక యామె కేమియు తోచకుండెను. వంకాయలు ఎట్లు సంపాదించుట యనునది ఆమెకు సమస్యయాయెను. వంకాయపచ్చడి తెచ్చినదెవరని కనుగొనగా పురందరుని భార్యయని తెలియుటచే వంకాయవేపుడు గూడ ఆమెయే చేసి పెట్టవలెనని ఆమెకు కబురంపిరి. అప్పుడందరికి వంకాయ వేపుడును బాబా యెందులకు కోరిరో తెలిసినది. బాబా సర్వజ్ఞతకు యందరాశ్చర్యపడిరి.

1915 డిసెంబరులో గోవింద బాలారాంమాన్కర్ యనువాడు శిరిడీకి పోయి తన తండ్రికి ఉత్తరక్రియలు చేయవలెననుకొనెను. ప్రయాణమునకు పూర్వము ఆత్మారాముని వద్దకు వచ్చెను. ఆత్మారాం భార్య బాబా కొరకేమైన పంపవలెననుకొని ఇల్లంతయు వెదకెను. కాని యొక్క పేడా తప్ప యేమియు గాన్పించలేదు. ఆ పేడా కూడా యప్పటికే బాబాకు నైవేద్యముగ సమర్పింపబడియుండెను. తండ్రి మరణించుటచే గోవిందుడు విచారగ్రస్తుడై యుండెను. కాని బాబా యందున్న భక్తి ప్రేమలచే ఆమె యా పేడాను అతని ద్వారా పంపెను. బాబా దానిని పుచ్చుకొని తినునని నమ్మియుండెను. గోవిందుడు

శిరిడీ చేరెను; బాబాను దర్శించెను. కానీ, పేడా తీసికొని వెళ్ళుట మరచెను. బాబా అప్పటికి ఊరకుండెను. సాయంత్రము బాబా దర్శనమునకై వెళ్ళినప్పుడు కూడ అతడు పేడా తీసికొనిపోవుట మరచెను. అప్పుడు బాబా యోపిక పట్టక తనకొర కేమి తెచ్చినావని యడిగెను. ఏమియు తీసికొని రాలేదని గోవిందుడు జవాబిచ్చెను. వెంటనే బాబా, "నీవు యింటివద్ద బయలు దేరునప్పుడు ఆత్మారాముని భార్య నా కొరకు నీ చేతికి మిఠాయి ఇవ్వలేదా?" యని యడిగెను. కుఱ్ఱవాడదియంతయు జ్ఞప్తికి దెచ్చుకొని సిగ్గుపడెను. బాబాను క్షమాపణ కోరెను. బసకు పరుగెత్తి పేడాను దెచ్చి బాబా చేతికిచ్చెను. చేతిలో పడిన వెంటనే బాబా దానిని గుటుక్కున మ్రింగెను. ఇవ్విధముగా ఆత్మారాముని భార్య యొక్క భక్తిని బాబా ప్రీతిపూర్వకముగ స్వీకరించెను. "నా భక్తులు నన్నెట్లు భావింతురో, నేను వారి నావిధముగనే *అనుగ్రహింతును*" అను గీతావాక్యము (4-11) నిరూపించెను.

**బాబాకు సంతుష్టిగా భోజనము పెట్టుట యెట్లు?**

ఒకప్పుడు ఆత్మారామ్ తర్ఖడ్ భార్య శిరిడీలో నొక ఇంటియందు దిగెను. మధ్యాహ్న భోజనము తయారయ్యెను. అందరికి వడ్డించిరి. ఆకలితో నున్న కుక్క యొకటి వచ్చి మొఱుగుట ప్రారంభించెను. వెంటనే తర్ఖడ్ భార్యలేచి యొక రొట్టెముక్కను విసరెను. ఆ కుక్క ఎంతో మక్కువగా అరొట్టెముక్కను తినెను. ఆనాడు సాయంకాలము ఆమె మసీదునకు పోగా బాబా ఆమెతో నిట్లనెను, "*తల్లీ! నాకు కడుపునిండ గొంతువరకు భోజనము పెట్టినావు. నా జీవశక్తులు సంతుష్టి చెందినవి. ఎల్లప్పుడు ఇట్లనే చేయుము. ఇది నీకు సద్గతి కలుగజేయును. ఈ మసీదులో గూర్చుండి నేనెన్నడసత్యమాడను. నాయందిట్లే దయ యుంచుము. మొదట యాకలితో నున్న జీవికి భోజనము పెట్టిన పిమ్మట నీవు భుజింపుము. దీనిని జాగ్రత్తగా జ్ఞప్తియందుంచుకొనుము.*" ఇదంతయు ఆమెకేమియు బోధపడ లేదు. కావున ఆమె యిట్లు జవాబిచ్చెను. "*బాబా! నేను నీకెట్లు భోజనము పెట్టగలను? నా భోజనము కొరకే ఇతరులపై ఆధారపడి యున్నాను. నేను వారికి డబ్బిచ్చి భోజనము చేయుచున్నాను.*" అందులకు బాబా యిట్లు జవాబిచ్చెను. "*నీవు ప్రేమపూర్వకముగ పెట్టిన యా రొట్టెముక్కను తిని యిప్పటికి త్రేనుపులు*

తీయుచున్నాను. నీ భోజనమునకు ముందు యే కుక్కను నీవు జూచి రొట్టె పెట్టితివో అదియు నేను ఒక్కటియే. అట్లనే, పిల్లులు, పందులు, ఈగలు, ఆవులు మొదలుగా గలవన్నియు నా యంశములే. నేనే వాని యాకారములో తిరుగుచున్నాను. ఎవరయితే సకల జీవకోటిలో నన్ను జూడగలుగుదురో వారే నా ప్రియభక్తులు. కావున నేను వేరు తక్కిన జీవరాశి యంతయు వేరు యను ద్వంద్వభావమును భేదమును విడిచి నన్ను సేవింపుము." ఈ యమృతతుల్యమగు మాటలు యామె హృదయము నెంతయో కదలించినవి. ఆమె నేత్రములు అశ్రువులతో నిండెను. గొంతు గద్గదమయ్యెను. ఆమె యానందమునకు అంతు లేకుండెను.

**నీతి**

'జీవులన్నిటి యందు భగవంతుని దర్శింపుము' అనునది యీ యధ్యాయములో నేర్చుకొనవలసిన నీతి. ఉపనిషత్తులు, భగవద్గీత, భాగవతము మొదలగునవి యన్నియు భగవంతుని ప్రతిజీవియందు చూడుమని ప్రబోధించుచున్నవి. ఈ యధ్యాయము చివర చెప్పిన యుదాహరణమువలనను, ఇతర అనేక భక్తుల అనుభవములవలనను, సాయిబాబా ఉపనిషత్తులలోని ప్రబోధములను, తమ ఆచరణరూపమున చూపి, యనుభవపూర్వకముగా నిర్ధారణచేసి యున్నారనియు స్పష్టమగును. ఉపనిషదాది గ్రంథములలో ప్రతిపాదింపబడిన తత్త్వమును అనుభవపూర్వకముగ ప్రబోధించిన సమర్థ సద్గురుడే శ్రీసాయిబాబా.

**తొమ్మిదవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## పదవ అధ్యాయము

*సాయిబాబా జీవిత విధానము; వారి పడక బల్ల; శిరిడీలో వారి నివాసము; వారి బోధలు; వారి యణకువ; అతిసులభమార్గము.*

### సాయిబాబా జీవిత విధానము

ఎల్లప్పుడు శ్రీసాయిబాబాను భక్తిప్రేమలతో జ్ఞప్తియందు యుంచుకొనుము. ఏలన బాబా ఎల్లప్పుడు తమ ఆత్మస్వరూపమునందే లీనమై, సర్వులకు హితము చేయుటయందు నిమగ్నమై యుండువారు; వారి స్మరణయే జీవన్మరణరూపమైన సంసారమనెడు చిక్కుముడిని విప్పు తరుణోపాయము. ఇది అన్నింటికంటే అత్యంత శ్రేష్ఠము సులభతరము యైన సాధనము. దీనిలో వ్యయ ప్రయాసలు లేవు. కొద్ది శ్రమతో గొప్ప ఫలితమును పొందవచ్చును. అందువలన ఇక ఆలస్యము చేయక, మన దేహేంద్రియములలో పటుత్వమున్నంత వరకు ప్రతి నిమిషమును ఈ సాధనమును అనుష్ఠించుటకు వెచ్చించవలెను. ఇతర దేవతలంతా ఉత్త భ్రమ. గురువొకడే దేవుడు. సద్గురువు చరణములను నమ్మి కొల్చినచో వారు మన యదృష్టమును బాగుచేయగలరు. వారిని శ్రద్ధగా సేవించినచో సంసారబంధములనుండి తప్పించుకొనగలము. న్యాయమీమాంసాది షడ్దర్శనములను చదువ పనిలేదు. మన జీవితమనే ఓడకు సద్గురుని సరంగుగా జేసికొన్నచో, కష్టములు చింతలతో కూడిన సంసారమనే సాగరమును మనము సులభముగా దాటగలము. సముద్రములు నదులు దాటునప్పుడు మనము ఓడ నడిపేవానియందు నమ్మకముంచినట్లు, సంసారమనే

సాగరమును దాటుటకు సద్గురువనే సరంగుపై పూర్తి నమ్మకముంచవలెను. భక్తులయొక్క యంతరంగమున గల భక్తిప్రేమలను బట్టి, సద్గురువు వారికి జ్ఞానమును శాశ్వతానందమును ప్రసాదించును.

గత అధ్యాయములో బాబా యొక్క భిక్షాటనమును, కొందరు భక్తుల యనుభవములు మొదలగునవి చెప్పితిమి. ఈ అధ్యాయములో బాబా యెక్కడ నివసించెను? ఏలాగున జీవించెను? ఎట్లు శయనించెడివారు? భక్తులకు ఎట్లు బోధించుచుండెను? మొదలగునవి చెప్పెదుము.

**బాబావారి శయన లీల**

మొట్టమొదట బాబా యెచ్చట పండుకొనుచుండెనో, ఎట్లు పండు కొనుచుండెనో చూచెదము. ఒకసారి నానాసాహెబు డేంగలే, సుమారు నాలుగు మూరల పొడవు, ఒకజానెడు మాత్రమే వెడల్పు గల యొక కఱ్ఱబల్లను బాబా పడకకని తెచ్చెను. ఆ బల్లను నేలపై వేసుకొని పండుకొనుటకు మారుగా, బాబా దానిని మసీదు యొక్క దూలములకు ఊయలవలె వ్రేలాడునట్లు చినిగిన పాతగుడ్డ పీలికలతో గట్టి, దానిపై పండుకొన మొదలిడెను. గుడ్డ పీలికలు పలుచనివి, యేమాత్రము బలమైనవికావు. అవి ఆ కొయ్యబల్లయొక్క బరువును మోయుటయే గగనము. ఇంక బాబా యొక్క బరువును కూడ కలిపి అవి యెట్లు భరించుచుండె ననునది యాశ్చర్యవినోదములకు హేతువయ్యెను. ఆ పాతగుడ్డపీలికలు యంత బరువును మోయగలుగుట, నిజముగ బాబా లీలయే. బాబా ఈ బల్ల యొక్క నాలుగు మూలలయందు నాలుగు దీపపు ప్రమిదలుంచి రాత్రి యంతయు దీపములు వెలిగించుచుండిరి. ఇది యేమి చిత్రము! బల్లపై ఆజానుబాహువగు బాబా పండుకొనుటకే స్థలము చాలనప్పుడు దీపములు పెట్టుటకు జాగా యెక్కడిది? బాబా బల్లపైన పండుకొనిన యా దృశ్యమును దేవతలు సహితము చూచి తీరవలసినదే! ఆ బల్లపైకి బాబా యెట్లు ఎక్కుచుండెను? ఎట్లు దిగుచుండెను? అనునవి యందరకు నాశ్చర్యము కలిగించుచుండెను. అనేకమంది ఉత్సుకతతో బాబా బల్లపైకి యెక్కుట, దిగుట గమనించుటకై కనిపెట్టుకొని ఉండెడివారు. కాని బాబా యెవరికి ఆ వైనము అంతు తెలియనివ్వలేదు. ఆ వింత చూచుటకు జనులు గుంపులు గుంపులుగ గుమిగూడుచుండుటచే బాబా విసుగుచెంది నొకనాడు యా బల్లను విరచి

పారవైచిరి. అష్టసిద్ధులు బాబా యధీనములు. బాబా వానినపేక్షించలేదు, వాని కొరకు నే అభ్యాసములను చేయలేదు. వారు పరిపూర్ణులు గనుక సహజముగనే అవి వారికి సిద్ధించెను.

**బ్రహ్మము యొక్క సగుణావతారము**

సాయిబాబా మూడున్నర మూరల మానవదేహముతో గాన్పించినను వారు సర్వహృదయాంతరస్థులు. అంతరంగమున వారు పరమ నిరీహులు నిస్పృహులైనప్పటికి, బాహ్యమునకు లోకహితము కోరువానిగ గనిపించువారు. అంతరంగమున వారు మమకారరహితులైనప్పటికీ, బాహ్యదృష్టికి మాత్రము తమ భక్తుల యోగక్షేమముల కొరకు ఎంతయో తాపత్రయపడుతున్నవారివలే కనిపించెడివారు. వారి అంతరంగము శాంతికి ఉనికి పట్టయినను, బయటకు చంచల మనస్కునివలె గనిపించుచుండెను. లోపల పరబ్రహ్మస్థితి యందున్నప్పటికిని, బయటకు దయ్యమువలె నటించుచుండెడి వారు. లోపల యద్వైతియైనను బయటకు ప్రపంచమునందు తగుల్కొనిన వానివలె గాన్పించుచుండెను. ఒక్కొక్కప్పుడందరిని ప్రేమతో చూచెడివారు. ఇంకొకప్పుడు వారిపై రాళ్ళు విసరుచుండిరి. ఒక్కొకప్పుడు వారిని తిట్టుచుండిరి. ఇంకొకప్పుడు వారిని ప్రేమతో అక్కునజేర్చుకొని, ఎంతో నెమ్మదితోను శాంతముతోను ఓరిమితోను సంయమముతోను వ్యవహరించెడివారు.

బాబా ఎల్లప్పుడు ఆత్మానుసంధానమందే మునిగియుండెడివారు; భక్తులపై కారుణ్యమును జూపుచుండెడివారు. వారెల్లప్పుడు నొకే యాసనమందు స్థిరముగ నుండెడివారు. వారెక్కడకు ప్రయాణములు చేసెడివారు కారు. చిన్న చేతికఱ్ఱ (సటకా) యే వారు సదా ధరించెడి దండము; చింతారహితులై యెప్పుడు శాంతముగా నుండేవారు. సిరిసంపదలను గానీ కీర్తిప్రతిష్ఠలనుగానీ లక్ష్యపెట్టక, భిక్షాటనముచే నిరాడంబరులై జీవించెడివారు. అట్టి పావన జీవనులు వారు. ఎల్లప్పుడు బాబా 'అల్లామాలిక్' (భగవంతుడే యజమాని) అని యనెడివారు. భక్తులయందు అవిచ్ఛిన్నమైన పరిపూర్ణప్రేమానురాగాలను కలిగి యుండెడివారు. ఆత్మజ్ఞానమునకు ఆయన గని, దివ్యానందమునకు వారు ఉనికిపట్టు. సాయిబాబా యొక్క దివ్యస్వరూపము అట్టిది. ఆద్యంతములు లేనట్టిది, అక్షయమైనట్టిది, భేదరహితమైనట్టిది, విశ్వమంతయు నావరించినట్టిది యైన ఆ పరబ్రహ్మ తత్త్వమే సాయిబాబాగా యవతరించినది. ఎంతో పుణ్యము

చేసుకొన్న అదృష్టవంతులు మాత్రమే యా నిధిని పొందగలిగిరి. గ్రహించగలుగుచుండిరి. సాయిబాబా యొక్క నిజతత్త్వమును గ్రహించలేక,వారినొక సామాన్యమానవునిగా నెంచినవారు నిజముగ దురదృష్టవంతులు.

**శిరిడీలో బాబా నివాసము - వారి జన్మతేది**

బాబాయొక్క తల్లిదండ్రుల గురించి గాని, వారి సరియైన జన్మతేదీగాని యెవరికిని తెలియదు. వారు శిరిడీలో వుండిన కాలాన్నిబట్టి దానిని సుమారుగా నిశ్చయింపవచ్చును. బాబా 16 యేండ్ల ప్రాయమున శిరిడీ వచ్చి మూడు సంవత్సరములు అచట నుండిరి. హఠాత్తుగా అచటనుండి అదృశ్యులై, కొంతకాలము పిమ్మట నైజాము రాజ్యములోని ఔరంగాబాదుకు సమీపమున గనిపించిరి. 20 సంవత్సరముల ప్రాయమున చాంద్‌పాటీలు పెండ్లిగుంపుతో శిరిడీ చేరిరి. అప్పటినుండి 60 సంవత్సరములు శిరిడీ వదలక యచ్చటనే యుండి, 1918వ సంవత్సరములో మహాసమాధి చెందిరి. దీనిని బట్టి బాబా సుమారు 1838వ సంవత్సర ప్రాంతములందు జన్మించియుందురని భావింపవచ్చును.

**బాబా లక్ష్యము, వారి బోధలు**

17వ శతాబ్దములో రామదాసను యోగిపుంగవుడు (1608-81) వర్ధిల్లెను. గోబ్రాహ్మణులను మహమ్మదీయులనుండి రక్షించు లక్ష్యమును వారు చక్కగా నిర్వర్తించిరి. వారు గతించిన 200 ఏండ్ల పిమ్మట హిందువులకు మహమ్మదీయులకు తిరిగి వైరము ప్రబలెను. వారి మధ్య సమైక్యభావమును నెలకొల్పుటకే సాయిబాబా అవతరించెను. ఎల్లప్పుడు వారు చెప్పెడి హితవు: "హిందువులదైవమగు శ్రీరాముడును, మహమ్మదీయుల దైవమగు రహీమును ఒక్కరే. వారిరువురి మధ్య యేమీ భేదము లేదు. అట్లయినప్పుడు వారి భక్తులు వారిలో వారు కలహమాడుట యెందులకు? ఓ అజ్ఞానులారా! చేతులు చేతులు కలిపి రెండు జాతులును కలిసి మెలిసి యుండుడు. బుద్ధితో ప్రవర్తింపుడు. జాతీయ ఐకమత్యమును సమకూర్చుడు. వివాదము వల్లగాని, ఘర్షణవల్లగాని ప్రయోజనము లేదు. అందుచే వివాదమును విడువుడు. ఇతరులతో పోటీ పడకుడు. మీ యొక్క వృద్ధిని మేలును చూచుకొనుడు. భగవంతుడు మిమ్ము రక్షించును. యోగము, త్యాగము, తపస్సు, జ్ఞానము మోక్షమునకు మార్గములు.

వీనిలో నేదైన అవలంబించి మోక్షమును సంపాదించనిచో మీ జీవితము వ్యర్థము. ఎవరైన మీకు కీడు చేసినచో, ప్రత్యపకారము చేయకుడు. ఇతరుల కొరకు మీరేమైన చేయగలిగినచో నెల్లప్పుడు మేలు మాత్రమే చేయుడు." సంగ్రహముగా ఇదియే బాబా యొక్క ప్రబోధము. ఇది ఇహపరసాధనము.

**సాయిబాబా సద్గురువు**

గురువులమని చెప్పుకొని తిరుగువారు అనేకులు గలరు. వారు ఇంటింటికి తిరుగుచు వీణ, చిరతలు చేతబట్టుకొని ఆధ్యాత్మికాడంబరము చాటెదరు. శిష్యుల చెవులలో మంత్రముల నూది వారినుండి ధనము లాగెదరు. పవిత్రమార్గమును మతమును బోధించెదమని చెప్పెదరు. కాని మత మనగానేమో వారికే తెలియదు. స్వయముగా వారపవిత్రులు.

సాయిబాబా తన గొప్పతన మెన్నడును ప్రదర్శించవలె ననుకొనలేదు. వారికి దేహాభిమానము ఏ మాత్రము లేకుండెను. కాని భక్తుల యందు మిక్కిలి ప్రేమ మాత్రము ఉండెడిది. నియతగురువులని అనియతగురువులని గురువులు రెండు విధములు. నియతగురువులనగా నియమింపబడినవారు. అనియత గురువులనగా సమయానుకూలముగా వచ్చి యేదైన సలహానిచ్చి మన యంతరంగముననున్న సుగుణమును వృద్ధిచేసి మోక్షమార్గము త్రొక్కునట్లు చేయువారు. నియతగురువుల సహవాసము 'నీవు నేన'ను ద్వంద్వభావనను పోగొట్టి, అంతరంగమును యోగమున ప్రతిష్ఠించి "తత్వమసి" యగునట్లు చేయును. సర్వవిధముల ప్రపంచజ్ఞానమును బోధించుగురువులనేకులు గలరు. కాని మనల నెవరయితే సహజస్థితి యందు నిలుచునట్లు చేసి మనలను ప్రపంచపుటునికికి అతీతముగా తీసికొని పోయెదరో వారే సద్గురువులు. సాయిబాబా యట్టి సద్గురువు. వారి మహిమ వర్ణనాతీతము. ఎవరైనా వారిని దర్శించినచో, బాబా వారి యొక్క భూత భవిష్యద్వర్తమానములన్నిటిని చెప్పువారు. ప్రతి జీవియందు బాబా దైవత్వమును జూచేవారు. స్నేహితులు, విరోధులు వారికి సమానులే. నిరభిమానము సమత్వము వారిలో మూర్తీభవించినవి. వారు దుర్మార్గుల యవసరముల గూడ దీర్చెడివారు. కలిమి లేములు వారికి సమానము. మానవదేహముతో సంచరించినప్పటికి, వారికి గృహదేహాదులయందు యభిమానము లేకుండెను. శరీరధారులవలె గనిపించినను వారు నిజమునకు నిశ్శరీరులు, జీవన్ముక్తులు.

బాబాను భగవానునివలె పూజించిన శిరిడీ ప్రజలు పుణ్యాత్ములు. ఏది తినుచున్నను, త్రాగుచున్నను, తమ దొడ్లలోనో పొలములలోనో పని చేసికొనుచున్నను, వారెల్లప్పుడు సాయిని జ్ఞప్తి యందుంచుకొని సాయి మహిమను కీర్తించుచుండేవారు. సాయి తప్ప యింకొక దైవమును వారెరిగియుండలేదు. శిరిడీ స్త్రీల ప్రేమను భక్తిని దాని మాధుర్యమును వర్ణించుటకు మాటలు చాలవు. వారు పామరులయినప్పటికి, వారికున్న స్వల్పభాషాజ్ఞానముతోనే ప్రేమతో బాబాపై పాటలను కూర్చుకొని పాడుకొనుచుండిరి. వారికి అక్షరజ్ఞానము శూన్యమయినప్పటికి వారి పాటలలో నిజమైన కవిత్వము గానవచ్చును. యదార్థమైన కవిత్వము పాండిత్యమువల్ల రాదు. అది యసలైన ప్రేమవలన వెలువడును. కవిత్వము స్వచ్ఛమైన ప్రేమభావమునుండి వెలువడును. అటువంటి సిసలైన కవిత్వాన్ని విబుధులైన శ్రోతలు ఆస్వాదించగలరు. ఈ పల్లెపదాలనన్నియు సేకరింపదగినవి. సాయి అనుగ్రహముంటే, ఏ భక్తుడయిన వీనిని **శ్రీసాయిలీల** పత్రికలోనో లేదా పుస్తకరూపముననో ప్రకటించిన యెంతయో బాగుండును.

**బాబావారి యణకువ**

భగవంతునికి ఆరు లక్షణములు గలవు (1) కీర్తి, (2) ధనము, (3) అభిమానము లేకుండుట, (4) జ్ఞానము, (5) మహిమ, (6) ఔదార్యము. ఈగుణములన్నియు బాబాలో నుండెను. భక్తుల కొరకు మానవరూపమున అవతరించిన భగవతత్త్వమే సాయిబాబా. వారి కరుణ, అనుగ్రహము అద్భుతములు. వారే కరుణతో భక్తులను తమ వద్దకు చేర్చుకొనకుండిన, వారి మహాత్మ్యమును తెలుసుకొనగల శక్తి యెవరికి గలదు? భక్తులకొరకు బాబానోట వెలువడిన పలుకులు పలుకుటకు సరస్వతీ దేవి కూడ వెరగుచెందును. ఒక యుదాహరణ. బాబా మిక్కిలి యణకువతో నిట్లనెడివారు: "బానిసలకు బానిసనగు నేను మీకు ఋణగ్రస్థుడను. మీదర్శనముచే నేను తృప్తుడనైతిని. మీ పాదములు దర్శించుట నా భాగ్యము. మీ యశుద్ధములో నేనొక పురుగును. అట్లగుటవలన నేను ధన్యుడను." ఏమి వారి యణకువ! బాబా యొక్క యీ

వాక్యములను ప్రచురించుట ద్వారా బాబాను కించపరిచితినని ఎవరైన యనినచో, యీ నా అపరాధమునకు బాబాను క్షమాపణ కోరెదను; తత్పాపపరిహారార్థమై బాబా నామజపము చేసెదను.

బాహ్యదృష్టికి బాబా ఇంద్రియవిషయముల ననుభవించువానివలె కన్పట్టినను, ఇంద్రియానుభూతులలో వారికేమాత్ర మభిరుచి యుండెడిది కాదు. అసలు ఇంద్రియానుభవముల స్పృహయే వారికి లేకుండెను. వారు భుజించునప్పటికి దేనియందు వారికి రుచి యుండెడిది కాదు. వారు ప్రపంచమును చూచుచున్నట్లు గాన్పించినను వారికి దానియందేమాత్రము ఆసక్తి లేకుండెను. కామమన్నచో వారు హనుమంతునివలె యస్ఖలిత బ్రహ్మచారులు. వారికి దేనియందు మమకారము లేకుండెను. వారు శుద్ధచైతన్యస్వరూపులు; కోరికలు, కోపము మొదలగు భావవికారములు శాంతించి, స్వాస్థ్యము చెందెడి విశ్రాంతి ధామము. వేయేల వారు విరాగులు, ముక్తులు, పరిపూర్ణులు. దీనిని వివరించుట కొక యుదాహరణము.

**నానావలి**

శిరిడీలో విచిత్రపురుష డొకడుండెను. అతని పేరు నానావలి. అతడు బాబా విషయములను, పనులను చక్కపెట్టుచుండువాడు. ఒకనాడతడు బాబావద్దకు పోయి, బాబాను వారి గద్దె (ఆసనము) నుండి లేవవలసినదనీ, దానిపై తాను కూర్చుండవలెనని తనకు బుద్ధి పుట్టినదనీ అనెను. వెంటనే బాబా లేచి గద్దెను ఖాళీ చేసెను. నానావలి దానిపై కొంతసేపు కూర్చుండి లేచి, బాబాను తిరిగి కూర్చొనుమనెను. బాబా తన గద్దెపై కూర్చొనెను. నానావలి బాబా పాదములకు సాష్టాంగనమస్కారము చేసి వెళ్ళిపోయెను. తన గద్దె మీదనుంచి దిగి పొమ్మనినను, దానిపై నింకొకరు కూర్చొనినను, బాబా యెట్టి యసంతుష్టి వెలిబుచ్చలేదు. బాబాను నానావలి యెంతగా ప్రేమించువాడనిన, అతడు బాబా మహాసమాధి చెందిన పదమూడవనాడు దేహత్యాగము చేసెను.

**మహాత్ముల కథాశ్రవణము, వారి సాంగత్యమే అతిసులభమార్గము**

సాయిబాబా సామాన్యమానవునివలె నటించినప్పటికి, వారి చర్యలను బట్టి వారు యసాధారణ బుద్ధికుశలతలు కలవారని తెలియవచ్చును. వారు

చేయునదంతయు తమ భక్తుల మేలుకొరకే. వారు ఆసనములు గాని, యోగాభ్యాసములు గాని, మంత్రోపదేశములు గాని తమ భక్తులకు ఉపదేశించలేదు. తెలివితేటలను ప్రక్కకు బెట్టి 'సాయి సాయి' యను నామమును మాత్రము జ్ఞప్తి యందుంచుకొనుమనిరి. అట్లు చేసినచో వారు సర్వబంధములనుండి విముక్తులై, స్వాతంత్ర్యము పొందెదరని చెప్పిరి. పంచాగ్నుల నడుమ కూర్చొనుట, యాగములు చేయుట, మంత్రజపము చేయుట, అష్టాంగయోగములు మొదలగునవి బ్రాహ్మణులకే వీలుపడును. తక్కిన వర్ణములవారికి అవి ఉపయుక్తములు కావు. ఆలోచించుటే మనస్సు యొక్క పని. అది యాలోచించకుండ యొక్క నిముషమైన నుండలేదు. దానికేదైన ఇంద్రియవిషయము జ్ఞప్తికి దెచ్చినచో, దానినే చింతించుచుండును. గురువును జ్ఞప్తికి దెచ్చినచో గురువునే చింతించు చుండును. మీరు సాయిబాబా యొక్క గొప్పతనమును వైభవమును శ్రద్ధగా వింటిరి. ఇదియే వారిని జ్ఞప్తియందుంచుకొనుటకు సహజమైన మార్గము. ఇదియే వారి పూజయు కీర్తనయు.

మహాత్ముల కథలను వినుట పైన చెప్పిన ఇతర సాధనములవలె కష్టమైనది కాదు. ఇది మిక్కిలి సులభసాధ్యమైనది. వారికథలు సంసారమునందు గల భయము లన్నిటిని పారద్రోలి పారమార్థిక మార్గమునకు దీసికొనిపోవును. కావున మహాత్ముల చరిత్రలను శ్రవణము చేయుడు; వానినే మననము చేయుడు; వానిలోని సారాంశమును జీర్ణించుకొనుడు. ఇంతమాత్రము చేసినచో బ్రాహ్మణులే గాక స్త్రీశూద్రాది అన్ని వర్ణములవారు కూడ పవిత్రులగుదురు. ప్రాపంచికబాధ్యతలందు తగుల్కొని యున్నను మీ మనస్సును సాయిబాబా కర్పింపుడు, వారి కథలు వినుడు. వారు తప్పక మనలను అనుగ్రహించగలరు. ఇది మిక్కిలి సులభోపాయము. అయినచో మరి దీని నెందుకు అందరు అవలంబించకున్నారు? అని యడుగవచ్చు. కారణమేమన; భగవంతుని కృపాకటాక్షము లేనియెడల మహాత్ములచరిత్రలను వినుటకు కూడా మనస్సు అంగీకరించదు. భగవంతుని చేతనే సర్వము నిరాటంకము, సుగమము యగును. మహాత్ముల కథలు వినుట యనగా వారి సాంగత్యము చేయుటే. మహాత్ముల సాంగత్యముచే కలుగు ప్రాముఖ్యము చాలా గొప్పది. అది మన యహంకారమును,

దేహాభిమానమును నశింపజేయును; చావు పుట్టుకలనే బంధములను కూడ నశింపజేయును; హృదయగ్రంథులను తెగగొట్టును. తుదకు శుద్ధచైతన్యరూపుడగు భగవంతుని సాన్నిధ్యమునకు తీసికొనిపోవును. విషయవ్యామోహముల యందు మనకు గల యభిమానమును తగ్గించి ప్రాపంచిక కష్టసుఖములందు విరక్తి కలుగజేసి పారమార్థికమార్గమున నడుపును. మీకు భగవన్నామస్మరణము పూజ భక్తివంటి యితరసాధనము లేవియు లేకపోయినను, కేవలము హృదయపూర్వకముగ మహాత్ముల నాశ్రయించినచో చాలును, వారు మనలను భవసాగరమునుండి తరింపజేయుదురు. మహాత్ములు అందుకొరకే నవతరించెదరు. ప్రపంచ పాపముల తొలగజేయునట్టి గంగా, గోదావరీ, కృష్ణా, కావేరీ మున్నగు పవిత్రనదులు కూడ మహాత్ములు వచ్చి తమ నీటిలో స్నానము చేసి తమను పావనము చేయవలెనని వాంఛించుచుండును. మహాత్ముల మహిమ అట్టిది. మన పూర్వజన్మ సుకృతముచే మనకు సాయిబాబా పాదములనాశ్రయించు భాగ్యము లభించినది.

మసీదుగోడ కానుకొని ఊదీమహాప్రసాదమును తన భక్తుల యోగ క్షేమములకై పంచి పెట్టు సుందరస్వరూపుడును, ఈ ప్రపంచము యొక్క అభావమును చింతించువాడును, సదా పూర్ణానందములో మునిగి యుండువాడునగు సాయిపాదములకు సాష్టాంగనమస్కారములు చేయుచూ ఈ అధ్యాయమును ముగించెదము.

పదవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## పదునొకండవ అధ్యాయము

*సాయి సగుణ బ్రహ్మస్వరూపుడు; డాక్టర్ పండిట్‌గారి పూజ; హాజీ సిద్దీఖ్ ఫాల్కే; పంచభూతములు బాబా స్వాధీనము.*

### సగుణ బ్రహ్మస్వరూపమే శ్రీసాయిబాబా

భగవంతుడు లేదా బ్రహ్మము రెండు విధములుగా నవతరింపవచ్చును. (1) నిర్గుణస్వరూపము, (2) సగుణస్వరూపము. నిర్గుణస్వరూపమునకు ఆకారము లేదు. సగుణస్వరూపమునకు ఆకారము గలదు. రెండును పరబ్రహ్మము యొక్క స్వరూపములే. మొదటిదానిని కొందరు ధ్యానింతురు; రెండవదానిని కొందరు పూజింతురు. భగవద్గీత 12వ అధ్యాయములో సగుణస్వరూపమును పూజించుటయే సులభమని కలదు. కావున దానినే అనుసరించవచ్చునని చెప్పిరి. మనుష్యుడు ఆకారము గలిగి యున్నాడు; కావున సహజముగ భగవంతుని గూడ ఆకారముతో సగుణస్వరూపునిగ భావించి పూజించుట సులభము.

కొంతకాలమువరకు సగుణ స్వరూపమగు బ్రహ్మమును పూజించినగాని మన భక్తి ప్రేమలు వృద్ధిచెందవు. క్రమముగ ఆ భక్తి నిర్గుణస్వరూపమగు పరబ్రహ్మోపాసనకు దారితీయును. విగ్రహము, యజ్ఞవేదిక, అగ్ని, వెలుతురు, సూర్యుడు, నీరు, బ్రహ్మము - ఈ ఏడును పూజనీయములు. కాని సద్గురువు వీని యన్నిటికంటె నుత్కృష్టుడు. అట్టి సద్గురుడైన సాయినాథుని మనమున ధ్యానించెదము గాక! వారు రూపుదాల్చిన వైరాగ్యము; నిజభక్తులకు విశ్రాంతిధామము. వారి వాక్కులయందు మనకుగల భక్తియే యాసనముగ,

మనకోరికలన్నియు విసర్జించుటయే పూజా సంకల్పముగ జేసి వారిని ఉపాసింతుము గాక! కొందరు సాయిబాబా యొక భగవద్భక్తుడనెదరు; కొందరు మహాభాగవతుడందురు; కాని మాకు మాత్రము బాబా సాక్షాత్తు భగవంతుని యవతారమే. వారు క్షమాశీలురు, క్రోధరహితులు, ఋజువర్తనులు, శాంతమూర్తులు, నిశ్చలులు, నిత్యసంతుష్టులు. శ్రీసాయిబాబా యాకారముతో కనిపించినప్పటికి వాస్తవమునకు వారు నిరాకారస్వరూపులు, నిర్వికారులు, నిస్సంగులు, నిత్యముక్తులు. గంగానది సాగరసంగమం చేయబోవుటకు ముందు దారిలో తాపార్తులకు చల్లదనాన్నిస్తూ, చెట్లుచేమలకు జీవాన్నిస్తూ, ఎందరో దాహార్తుల దాహాన్ని తీర్చుచూ సాగిపోతున్నటులే, సాయిబాబా వంటి మహాత్ములు తమ జీవనగమనంలో జనులకు సుఖశాంతులను ప్రసాదించుచూ జగత్తును పావనం చేస్తున్నారు. భగవద్గీతయందు శ్రీకృష్ణుడు, మహాత్ములు తన యాత్మయనియు, తన సజీవప్రతిమయనియు, తానే వారనియు, వారే తాననియు నుడివియున్నాడు. వర్ణింపనలవికాని యా సచ్చిదానంద స్వరూపమే శిరిడీలో సాయిబాబా రూపమున నవతరించెను. శ్రుతులు బ్రహ్మమును ఆనందస్వరూపముగా వర్ణించుచున్నవి (తైత్తిరీయ ఉపనిషత్తు). ఈ సంగతి పుస్తకములందు చదువుచున్నాము. కాని భక్తులు ఈ ఆనందస్వరూపమును శిరిడీలో అనుభవించిరి. సర్వమునకు ఆధారభూతమగు బాబా ఉపాధిరహితుడు. వారు తమ యాసనము కొరకు ఒక గోనెసంచి నుపయోగించెడివారు. భక్తులు దానిపై చిన్న పరుపు వేసి, ఆనుకొనుటకు చిన్న బాలేసును సమకూర్చిరి. బాబా తన భక్తుల కోరికను మన్నించి, వారివారి భావాన్ననుసరించి తనను పూజించుట కెట్టి యభ్యంతరము జూపకుండెను. కొందరు చామరములతోను, కొందరు విసనకఱ్ఱలతోను విసరుచుండిరి. కొందరు సంగీత వాద్యములను ప్రయోగించుచుండిరి. కొందరు వారికి అర్ఘ్యపాద్యములను సమర్పించుచుండిరి. కొందరు వారికి చందనము, అత్తరు పూయుచుండిరి. కొందరు తాంబూలములు సమర్పించుచుండిరి. కొందరు నైవేద్యము సమర్పించుచుండిరి. శిరిడీలో నివసించుచున్నట్లు కాన్పించినప్పటికి వారు సర్వాంతర్యామి; ఎక్కడ జూచినను వారే యుండువారు. భక్తులు బాబాయొక్క సర్వాంతర్యామిత్వమును ప్రతిరోజు అనుభవించుచుండెడివారు. సర్వాంతర్యామియగు యా సద్గురుమూర్తికి మా వినయపూర్వక సాష్టాంగనమస్కారములు.

### డాక్టరు పండితుని పూజ

తాత్యాసాహెబు నూల్కరు మిత్రుడైన డాక్టరు పండిత్ యొకసారి బాబా దర్శనమునకై శిరిడీ వచ్చెను. బాబాకు నమస్కరించిన పిమ్మట మసీదులో కొంతసేపు కూర్చుండెను. అతనిని దాదాభట్ కేల్కరు వద్దకు పొమ్మని బాబా చెప్పెను. డాక్టరు పండిత్ అటులనే దాదాభట్ వద్దకు పోయెను. దాదాభట్ అతనిని సగౌరవముగా ఆహ్వానించెను.

బాబాను పూజించుటకై పూజాసామాగ్రి పళ్ళెముతో దాదాభట్ మసీదుకు వచ్చెను. డాక్టరు పండిత్ కూడ ఆతనిననుసరించెను. దాదాభట్ బాబాను పూజించెను. అంతకు మునుపెవ్వరును బాబా నుదుటిపై చందనము పూయుటకు సాహసించలేదు. ఒక్క మహాల్సాపతి మాత్రమే బాబా కంఠమునకు చందనము పూయుచుండెను. కాని యీ అమాయికభక్తుడగు డాక్టరు పండిత్ దాదాభట్ యొక్క పూజాపళ్ళెరమునుండి చందనమును దీసికొని బాబా నుదుటిపై త్రిపుండ్రాకారముగ వ్రాసెను. అందరికి ఆశ్చర్యము కల్గునట్లు బాబా ఒక్క మాటయిననూ అనక యూరకుండెను. ఆనాడు సాయంకాలము దాదాభట్ బాబాను ఇట్లడిగెను. *"బాబా! మేమెవరయిన మీ నుదుటిపై చందనము పూయుదుమన్న నిరాకరింతురే? డాక్టరు పండిత్ వ్రాయగా ఈనాడేల యూరకుంటిరి?"* అందులకు బాబా ప్రసన్నముగ యిట్లు సమాధానమిచ్చెను: *"నేనొక ముసల్మానుననీ, తానొక సద్బ్రాహ్మణుడననీ, ఒక మహమ్మదీయుని పూజించుట ద్వారా తాను మైలపడిపోవుదుననే దురభిమానము లేకుండా, అతడు నాలో తన గురువును భావించుకొని, అట్లు చేసెను. అతని నిష్కల్మష భక్తి నన్ను కట్టిపడవేసినది. అతనికి నేనెట్లు అడ్డు చెప్పగలను?"* దాదాభట్ ఆ తరువాత డాక్టరు పండిత్‌ని ప్రశ్నించగా అతడు, బాబాను తన గురువుగా భావించి తన గురువున కొనరించినట్లు బాబా నుదుటిపై త్రిపుండ్రమును వ్రాసితిననెను.

భక్తులు వారివారి భావానుసారము తమను ఆరాధించుటకు బాబా సమ్మతించినను, ఒక్కొక్కసారి వారు మిక్కిలి వింతగా ప్రవర్తించువారు. ఒక్కొక్కప్పుడు పూజాద్రవ్యముల పళ్ళెమును విసరివేయుచు ఉగ్రావతారమును

దాల్చెడివారు. అట్టి సమయములలో బాబాను సమీపించుటకు కూడా యెవ్వరికీ ధైర్యము చాలెడిదికాదు. ఒక్కొక్కప్పుడు భక్తులను తిట్టుచుండెను. ఒక్కొక్కప్పుడు మైనముకంటె మెత్తగా గనిపించెడివారు. అప్పుడు వారు శాంతిక్షమలకు ప్రతిరూపమువలే గాన్పించుచుండిరి. బయటికి కోపముతో నూగిపోవుచూ, కళ్ళెఱ్ఱజేసినప్పటికీ, వారి హృదయము మాత్రము మాతృహృదయమువలే అనురాగమయము. వెంటనే వారు తమ భక్తులను ప్రేమతో దగ్గరతీసి, *"నేనెప్పుడూ యెవరిపైనా కోపించి యెరుగను. తల్లి తన బిడ్డలనెక్కడైనా తరిమివేయునా? సముద్రము తనను చేరు నదులనెప్పుడైన తిరుగగొట్టునా? నేను మిమ్ములనెందుకు నిరాదరించెదను? నేనెప్పుడూ మీ యోగక్షేమములనే అపేక్షించెదను. నేను మీ సేవకుడను. నేనెప్పుడూ మీవెంటనే యుండి, పిలచిన పలుకుతాను. నేనెప్పుడు కోరేది మీ ప్రేమను మాత్రమే!"* అనెడివారు.

**హాజీ సిద్ధిఖ్ ఫాల్కే**

బాబా యెప్పుడు ఏ భక్తుని ఎట్లు ఆశీర్వదించునో యెవరికీ తెలియదు. అది కేవలము వారి ఇచ్ఛపై ఆధారపడియుండెను. హాజీ సిద్ధిఖ్ ఫాల్కే కథ ఇందు కుదాహరణము. సిద్ధిఖ్ ఫాల్కేయను మహమ్మదీయుడు కల్యాణ్ నివాసి. మక్కా మదీనా యాత్రలు చేసిన పిమ్మట శిరిడీ చేరెను. అతడు చావడి ఉత్తరభాగమున బసచేసెను. తొమ్మిదినెలలు శిరిడీలో నున్ననూ, బాబా వానిని మసీదులో పాదము పెట్టనివ్వలేదు. అతడు మసీదు ముందున్న ఖాళీ జాగాలో కూర్చొనుచుండెను. ఫాల్కే మిక్కిలి నిరాశానిస్పృహలకు లోనయ్యెను. ఏమి చేయుటకు అతనికి తోచకుండెను. నిరాశ చెందవద్దనీ, నందీశ్వరుని ద్వారా వెళ్ళిన శివుడు ప్రసన్నుడైనట్లు, మాధవరావు దేశపాండే (షామా) ద్వారా బాబా వద్దకెళ్ళిన అతని మనోరథము సిద్ధించుననియూ కొందరు భక్తులతనికి సలహానిచ్చిరి. అటులేయని, తన తరపున బాబాతో మాట్లాడుమని షామాను ఫాల్కే వేడుకొనెను. షామా యందులకు సమ్మతించి, ఒకనాడు సమయము కనిపెట్టి, బాబాతో నిట్లనియెను:

"బాబా! ఆ ముదుసలి హాజీని మసీదులో కాలుపెట్టనీయ వేల? ఎంతోమంది వచ్చి నిన్ను దర్శించి పోవుచున్నారు. ఆ హాజీని మాత్రమెందుకు ఆశీర్వదించవు?" దానికి బాబా యిట్లని జవాబిచ్చెను: "షామా! ఇటువంటి విషయాలలో నీవింకా పసివాడవు. నీకివన్నీ అర్థం కావు. అల్లా యొప్పుకొననిచో నేనేమి చేయగలను? అల్లామియా కటాక్షము లేనిచో యీ మసీదులో పాదము పెట్టగలుగువా రెవ్వరు? సరే, నీవు వానివద్దకు పోయి వానిని బారవీ బావి వద్దనున్న ఇరుకు కాలిబాటకు రాగలడేమో యడుగుము!" షామా పోయి హాజీని ఆ విషయము అడిగి, తిరిగి బాబా వద్దకొచ్చి, హాజీ అందులకు సమ్మతించెనని చెప్పెను. నలుబదివేల రూపాయలు నాలుగు వాయిదాలలో నివ్వగలడేమో కనుగొనుమని తిరిగి బాబా యడిగెను. షామా వెంటనే పోయి, హాజీ తాను నాలుగు లక్షలు కూడ ఇచ్చుటకు సిద్ధముగా నున్నాడని జవాబు తెచ్చెను. సరే మరల పోయి వాని నిట్లడుగుము, "మసీదులో ఈ నాడు మేకను కోసెదము. వానికి దాని మాంసము కావలెనో, వృషణములు కావలెనో కనుగొనుము." బాబావారి కొళంబా (మశీదులో బాబా భిక్షచేసి తెచ్చిన పదార్థములుంచెడి మట్టిపాత్ర)లో నున్న చిన్నముక్కతోనైన సంతుష్టి చెందెదనని షామా ద్వారా హాజీ బదులు చెప్పెను. ఇది వినగనే బాబా మిక్కిలి కోపముతో మసీదులోని కొళంబా, నీటికుండలను బయటికి విసరివైచి, తిన్నగా చావడిలో నున్న హాజీవద్దకు బోయి, తన కఫ్నీని పైకెత్తి పట్టుకొని, తీవ్రస్వరంతో: "*నన్ను గురించి యేమనుకొనుచున్నావు? నీవేదో గొప్పవాడివనీ, పెద్ద హాజీవని గొప్పలు పోవుచూ, యేమిటేమిటో వదరుచున్నావే? నా దగ్గరా నీ ఆటలు? ఖురాను చదివి నీవు తెలుసుకొన్నదిదేనా? మక్కామదీనా యాత్రలు చేసితిననే గర్వంతో నేనెవరో తెలుసుకొనలేకున్నావు!*" అనుచూ, యేమేమో యింకనూ అతనిని తిట్టి, మసీదుకు మరలి వెళ్ళెను. బాబా ఆగ్రహావేశములను చూచి హాజీ గాబరా పడెను. ఆ పిమ్మట బాబా కొన్ని గంపల మామిడి పండ్లను కొని వాటిని హాజీకి పంపెను. తిరిగి హాజీ వద్దకు వచ్చి తన జేబులో నుంచి 55 రూపాయలు తీసి లెక్కపెట్టి హాజీ చేతిలో పెట్టెను. అప్పటినుంచి హాజీని బాబా ప్రేమాదరములతోచూచుచూ, భోజనమునకు బిలుచుచుండెను. హాజీ ఆనాటి నుండి తన కిష్టము వచ్చినప్పుడెల్ల మసీదులోనికి వచ్చిపోవుచుండెను. బాబా యొక్కొక్కప్పుడు వానికి డబ్బు నిచ్చుచుండెను. బాబా దర్బారులో అతనుగూడ యొకడయ్యెను.

**పంచభూతములు బాబా స్వాధీనము**

బాబాకు పంచభూతములు స్వాధీనములని తెలుపు రెండు సంఘటనలను వర్ణించిన పిమ్మట ఈ యధ్యాయమును ముగించెదను.

(1) ఒకనాడు సాయంకాలము శిరిడీలో గొప్ప తుఫాను సంభవించెను. నల్లని మేఘములు ఆకాశమును కప్పెను. గాలి తీవ్రముగా వీచెను. ఉరుములు మెరుపులతో కుంభవృష్టి కురిసెను. కొంతసేపటిలో నేలయంతయు జలమయమయ్యెను. పశుపక్ష్యాది జీవకోటితో సహా జనులందరు మిక్కిలి భయపడిరి. శిరిడీగ్రామంలో కొలువైయున్న శని, శివపార్వతులు, మారుతి, ఖండోబా మొదలైన దేవతలెవ్వరూ వారిని అదుకొనలేదు. కావున వారందరు మశీదుకొచ్చి బాబాను శరణుజొచ్చిరి. తుఫానును ఆపివేయుడని బాబాను వేడుకొనిరి. ఆపదలో నున్న జనులను చూచి బాబా మనస్సు కరిగెను. వారు బయటకు వచ్చి మసీదు అంచున నిలబడి బిగ్గరగా, *"అగు, నీ తీవ్రతను తగ్గించు, నెమ్మదించు"*మని గర్జించిరి. కొన్ని నిమిషములలో వర్షము తగ్గెను. గాలివీచుటమానెను. తుఫాను ఆగిపోయెను. చంద్రుడు ఆకాశమున కనిపించెను. ప్రజలందరు సంతుష్టిచెంది వారివారి గృహములకు బోయిరి.

(2) ఇంకొకప్పుడు మిట్టమధ్యాహ్నము ధునిలోని మంటలు అపరిమితముగా లేచెను. మంటలు మసీదు కప్పుకున్న దూలములకు తాకునట్లు ఎగయుచుండెను. మసీదులో కూర్చొన్నవారి కేమి చేయుటకు తోచలేదు. ధునిలోని కట్టెలు తగ్గింపుడనిగానీ, నీళ్ళు పోసి మంటలు చల్లార్పుడనిగానీ బాబాకు సలహా నిచ్చుటకు వారు భయపడుచుండిరి. వారి భయాందోళనలను బాబా వెంటనే గ్రహించి, తమ సటకాతో ప్రక్కనున్న స్తంభముపై కొట్టుచు, *"దిగు దిగు, శాంతించుము"* అనిరి. ఒక్కొక్క సటకా దెబ్బకు, కొంచము కొంచము చొప్పున మంటలు తగ్గిపోయి, ధుని యధాపూర్వము మితముగ మండసాగెను.

భగవదవతారమైన శ్రీసాయినాథుడట్టివారు. వారి పాదములపైబడి సాష్టాంగనమస్కారము చేసి, సర్వస్యశరణాగతి వేడినవారినెల్ల వారు

కాపాడెదరు. ఎవరయితే భక్తిప్రేమలతో నీ యధ్యాయములోని కథలను నిత్యము పారాయణ చేసెదరో వారు కష్టములన్నిటినుండి విముక్తులగుదురు. అంతేకాక సాయియందే యభిరుచి, భక్తి కలిగి త్వరలో భగవత్సాక్షాత్కారమును పొందెదరు. వారి కోరికలన్నియు నెరవేరి, తుదకే కోరికలు లేనివారై, ముక్తినిబొందెదరు!

పదునొకండవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## పన్నెండవ అధ్యాయము

*శ్రీసాయి లీలలు: 1. కాకా మహాజని, 2. ధుమాల్ ప్లీడరు, 3. నిమోణ్‌కర్ భార్య, 4. ములేశాస్త్రి, 5. రామభక్తుడైన ఒక డాక్టరు, మొ॥ న వారి అనుభవములు.*

శిష్టులను రక్షించుటకు దుష్టులను శిక్షించుటకు భగవంతుడవతరించునను సంగతి పూర్వపు అధ్యాయములలో తెలిసికొన్నాము. కాని సద్గురుమూర్తుల కర్తవ్యము దానికి భిన్నమైనది. వారికి మంచివాడును చెడ్డవాడును నొకటే. వారు దుర్మార్గులను కనికరించి వారిని సన్మార్గమున ప్రవర్తించునట్లు చేసెదరు. భవసాగరమును హరించుటకు వారు అగస్త్యుల వంటివారు. అజ్ఞానమనే చీకటిని నశింపచేయుటకు వారు సూర్యుని వంటివారు. భగవంతుడు యోగుల హృదయమున నివసించును. వాస్తవముగ వారు భగవంతునికంటె వేరుకారు. సద్గురుశ్రేష్ఠుడైన శ్రీసాయిబాబా భక్తుల క్షేమముకొరకు అవతరించిరి. జ్ఞానములో నుత్కృష్టులై, దైవీతేజస్సుతో ప్రకాశించుచు వారు అందరిని సమానముగ ప్రేమించెడివారు. వారికి దేనియందు అభిమానము లేకుండెను. శత్రువులు, మిత్రులు, రాజులు, ఫకీరులు, అందరు వారికి సమానమే. వారి పరాక్రమమును వినుడు. భక్తులకొరకు తమ పుణ్యము నంతయు వ్యయపరచి యెప్పుడూ వారికి సహాయము చేయుటకు సిద్ధముగా నుండువారు. వారికిచ్ఛలేనిచో భక్తులు వారివద్దకు రాలేకుండిరి. వారి వంతు రానిదే వారు బాబాను స్మరించువారు కారు, వారి లీలలు ఎరుగుట కూడా తటస్థించదు. మరి అట్టి వారికి బాబాను దర్శించుకొనవలెనను బుద్ధి యెట్లు పుట్టును? కొందరు బాబాను దర్శింపవలెననుకొనిరి. కాని బాబా మహాసమాధి చెందులోపల వారికా యవకాశము కలుగలేదు. బాబాను దర్శించవలెనను కోరిక

గలవారనేకులున్నారు. కాని వారి కోరికలు నెరవేరలేదు. అట్టివారు విశ్వాసముతో బాబా లీలలను వినినచో దర్శనమువల్ల కలుగు సంతుష్టిని పొందెదరు. కొందరదృష్టవశమున వారి దర్శనము చేసికొన్నను, బాబా సన్నిధిలో ఉండవలెనని అనుకొనినను నచ్చట ఉండలేకుండిరి. ఎవ్వరును తమ యిష్టానుసారము శిరిడీ పోలేకుండిరి. అచ్చట నుండుటకు ప్రయత్నించినను ఉండలేకుండిరి. బాబా యాజ్ఞ యెంతవరకు గలదో యంతవరకే వారు శిరిడీలో నుండగలిగిరి. బాబా పొమ్మనిన వెంటనే శిరిడీ విడువవలసి వచ్చుచుండెను. కాబట్టి సర్వము బాబా ఇష్టముపైననే ఆధారపడి యుండెను.

**కాకా మహాజని**

ఒకప్పుడు బొంబాయినుండి కాకా మహాజని శిరిడీకి పోయెను. అచ్చటొక వారమురోజులుండి గోకులాష్టమి యుత్సవమును చూడవలెననుకొనెను. బాబాను దర్శించిన వెంటనే అతనితో బాబా యిట్లనిరి. "ఎప్పుడు తిరిగి యింటికి పోయెదవు?" ఈ ప్రశ్న విని మహాజని యాశ్చర్యపడెను. కాని యేదో జవాబు నివ్వవలయును కదా! బాబా యాజ్ఞ యెప్పుడయిన నప్పుడే పోయెదనని కాకా జవాబిచ్చెను. అందులకు బాబా యిట్లనియెను, "రేపు పొమ్ము!" బాబా ఆజ్ఞ అనుల్లంఘనీయము. కావుననట్లే చేయవలసి వచ్చెను. అందుచే నా మరుసటిదినమే కాకా మహాజని శిరిడీ విడిచెను. బొంబాయిలో తన ఆఫీసుకు పోగానే వాని యజమాని వాని కొరకే కనిపెట్టుకొని యున్నట్లు తెలిసెను. ఆఫీసు మేనేజరు హఠాత్తుగా జబ్బుపడెను. కావున కాకా మహాజని ఆఫీసులో ఉండవలసిన యవసరము యేర్పడెను. ఈ విషయమై యజమాని శిరిడీలో నున్న కాకా మహాజని కొక యుత్తరము కూడా వ్రాసెను. అది కొన్నిరోజుల తరువాత తిరుగు టపాలో బొంబాయి చేరినది.

**భావూసాహెబు ధుమాల్**

పై దానికి భిన్నమగు కథ నిప్పుడు వినుడు. ప్లీడరు వృత్తిలో నుండిన భావూసాహెబు ధుమాల్ యొకసారి కోర్టుపనిపై నిఫాడ్ పోవుచుండెను. దారిలో దిగి శిరిడీకి పోయెను. బాబా దర్శనము చేసికొని, వెంటనే నిఫాడ్ పోవ శలవు కోరెను. కాని బాబా అనుజ్ఞ ఇవ్వలేదు. శిరిడీలోనే యింకొక వారముండునట్లు

చేసెను. ఆ తరువాత అతడు బాబా వద్ద శలవు పొంది నిఫాడ్ చేరగా, అక్కడి మెజిస్ట్రేటుకు కడుపునొప్పి వచ్చి కేసు వాయిదా పడెనని తెలిసెను. తరువాత ఆ కేసువిచారణ కొన్ని నెలల వరకు సాగెను. నలుగురు మెజిస్ట్రేటులు దానిని విచారించిరి. తుట్టతుదకు ధుమాల్ దానిని గెలిచెను. అతని కక్షిదారు విడుదలయ్యెను.

**నిమోన్‌కర్ భార్య**

నిమోన్ గ్రామ వతనుదారును, గౌరవ మెజిస్ట్రేటును అగు నానాసాహెబు నిమోన్‌కర్, తన భార్యతో శిరిడీలో కొంతకాలముండెను. ఆ దంపతులు తమ సమయమంతయు మసీదులోనే గడుపుచు బాబా సేవ చేయుచుండిరి. బేలాపూరులో నున్న వారి కుమారుడు జబ్బుపడినట్లు కబురు వచ్చెను. బేలాపూర్ పోయి తన కుమారుని, అక్కడున్న తమ బంధువులను జూచి, యక్కడ కొన్ని దినములుండవలెనని తల్లి అనుకొనెను. కాని బేలాపూర్ పోయి ఆ మరుసటి దినముననే శిరిడీ తిరిగి రావలెనని భర్త చెప్పెను. ఆమె సందిగ్ధములో పడెను. ఏమి చేయుటకు తోచలేదు. ఆమె దైవమైన శ్రీసాయినాథుడే యామెనప్పుడు ఆదుకొనెను. బేలాపూరుకు పోవుటకు ముందు ఆమె బాబా దర్శనమునకై వెళ్ళెను. అప్పుడు బాబా సాఠేవాడా ముందర నానాసాహెబు మొదలగువారితో నుండెను. ఆమె బాబా వద్దకు పోయి సాష్టాంగ నమస్కారము చేసి, బేలాపూరు పోవుటకు అనుమతి నిమ్మని కోరెను. అప్పుడు బాబా ఆమెతో యిట్లు చెప్పెను. "*వెళ్ళుము, ఆలస్యము చేయవద్దు! హాయిగా బేలాపూరులో నాలుగురోజులుండి రా! నీ బంధువులందరిని చూచి, నింపాదిగా శిరిడీకి రమ్ము!*" బాబా మాటలెంత సమయానుకూలముగ నుండెనో గమనించుడు. నిమోన్‌కర్ ఆదేశమును బాబా ఆజ్ఞ రద్దుచేసెను.

**నాసిక్ నివాసియగు ములేశాస్త్రి**

ములేశాస్త్రి పూర్వాచారపరాయణుడైన బ్రాహ్మణుడు. నాసిక్ నివాసి. ఆయన షట్‌శాస్త్రపారంగతుడు. జ్యోతిషసాముద్రిక శాస్త్రములలో దిట్ట. అతడు నాగపూరుకు చెందిన కోటీశ్వరుడగు బాపూసాహెబు బూటీని కలిసికొనుటకు శిరిడీకి వచ్చెను. బూటీని చూచిన పిదప బాబా దర్శనముకై మసీదుకు

పోయెను. బాబా తన డబ్బుతో మామిడిపండ్లను, కొన్ని ఫలహారపు వస్తువులను కొని మసీదులోనున్న వారందరికి పంచిపెట్టుచుండెను. మామిడిపండును బాబా యొక చిత్రమైన విధముగ అన్నివైపుల నొక్కెడివారు. తినువారు ఆ పండును నోటబెట్టుకొని చప్పరించగానే రసమంతయు నోటిలోనికి బోయి తొక్క, టెంక మిగిలెడివి. అరటిపండ్ల నొలిచి గుజ్జును భక్తులకు పంచి పెట్టి, తొక్కలు బాబా తమ వద్ద యుంచుకొనెడివారు. ములేశాస్త్రి సాముద్రికము తెలిసిన వాడగుటచే పరీక్షించుటకై బాబాను చేయిచాచుమని యడిగెను. బాబా దానినసలు పట్టించుకొనక, నాలుగు అరటిపండ్లు అతని చేతిలో బెట్టిరి. తరువాత నందరు వాడా చేరిరి. ములేశాస్త్రి స్నానము చేసి మడిబట్టలు కట్టుకొని యగ్నిహోత్రము మొదలగునవి యాచరించుటకు మొదలిడెను. బాబా మామూలుగనే లెండీతోటకు బయలుదేరెను.

మార్గమధ్యమున బాబా హఠాత్తుగా, "*గేరు (ఎఱ్ఱరంగు) తయారుగ నుంచుడు. ఈనాడు కాషాయవస్త్రమును ధరించెదను*" అని యనెను. ఆ మాటలెవరికి బోధపడలేదు. కొంతసేపటికి బాబా లెండీతోటనుంచి తిరిగి వచ్చెను. మధ్యాహ్న హారతి కొరకు సర్వము సిద్ధమయ్యెను. మధ్యాహ్న ఆరతికి తనతో వచ్చెదరా యని ములేశాస్త్రిని బూటీ యడిగెను. సాయంకాలము బాబా దర్శనము చేసికొనెదనని శాస్త్రి బదులు చెప్పెను. అంతలో బాబా తన యాసనముపై కూర్చుండెను. భక్తులు వారికి నమస్కరించిరి. ఆరతి ప్రారంభమయ్యెను. బాబా నాసిక్ బ్రాహ్మణుని వద్దనుంచి దక్షిణ తెమ్మనెను. బూటీ స్వయముగా దక్షిణ తెచ్చుటకై పోయెను. బాబా యాజ్ఞ అతనికి చెప్పగనే అతడు ఆశ్చర్యపడెను. తనలో తానిట్లనుకొనెను: "నేను అగ్నిహోత్రిని. బాబా గొప్ప మహాత్ముడేకావచ్చును. కానీ, నేనాయన ఆశ్రితుడను గానే! వారికి నేనెందులకు దక్షిణ నీయవలెను?" సాయిబాబా యంతటి మహాత్ముడు బూటీ వంటి సంపన్నుని ద్వారా దక్షిణ అడుగుటచే అతడు కాదనలేకపోయెను. తన అనుష్ఠానమును మధ్యలోనే ఆపి, బూటీతో మసీదుకు బయలుదేరెను. మడితో నున్న తాను మసీదులో అడుగిడిన మైలపడిపోవుదునని భావించి, మశీదు బయటే దూరముగ నిలువబడి, బాబాపై పువ్వులను విసరెను. హఠాత్తుగా బాబా స్థానములో గతించిన తమ గురువగు ఘోలప్‌స్వామి కూర్చొని

యుండెను. అతడు ఆశ్చర్యపోయెను. అది కలా నిజమా యని సందేహపడెను. తనను తాను గిల్లుకొని మళ్ళీ చూచెను. తాను పూర్తి జాగ్రదావస్థలోనే యున్నాడు. భ్రాంతియగుటకు వీలులేదు. అయినచో యేనాడో గతించిన తన గురువచ్చుటకెట్లు వచ్చెను? అతనికి నోట మాటరాకుండెను. తుదకు సందిగ్ధములన్నియు విడచిపెట్టి, మసీదులో ప్రవేశించి, తన గురువు పాదములపై బడి, లేచి చేతులు జోడించి నిలువబడెను. తక్కిన వారందరు బాబా ఆరతి పాడుచుండుగా, ములేశాస్త్రి తన గురునామము నుచ్ఛరించుచుండెను. తాను అగ్రకులమునకు చెందినవాడను, పవిత్రుడను యను ఆభిజాత్యమును వదలిపెట్టి, తన గురుని పాదములపైబడి సాష్టాంగ నమస్కార మొనర్చి, కండ్లు మూసికొనెను. లేచి, కండ్లు తెరచి చూచుసరికి, వానిని దక్షిణ యడుగుచూ సాయిబాబా కాన్పించెను. బాబావారి ఆనందరూపమును, ఊహకందని వారి శక్తిని జూచి ములేశాస్త్రి మైమరచెను; మిక్కిలి సంతుష్టి చెందెను. అతని నేత్రములు సంతోషభాష్పములచే నిండెను. మనస్ఫూర్తిగ బాబాకు తిరిగి నమస్కరించి దక్షిణ నొసంగెను. తన సందేహము తీరినదనియు, తనకు గురుదర్శనమైనదనియు చెప్పెను. బాబాయొక్క యా ఆశ్చర్యకరమైన లీలను గాంచినవారందరు అచ్చెరువొందిరి. "*గేరు తెండు! కాషాయవస్త్రముల ధరించెద*"నని అంతకు ముందు బాబా పలికిన మాటలకర్థమును అప్పుడు వారు గ్రహించిరి. సాయియొక్క లీలలు ఆశ్చర్యకరములు.

**రామభక్తుడైన డాక్టరు**

ఒకనాడొక మామలతదారు తన స్నేహితుడగు డాక్టరుతో కలసి శిరిడీ వచ్చెను. శిరిడీ బయలుదేరుటకు ముందు, తన మిత్రునితో ఆ డాక్టరు 'తన ఆరాధ్యదైవము శ్రీరాముడనియు, తాను శిరిడీకి పోయి యొక మహమ్మదీయునికి నమస్కరించ మనస్కరించుట లేదనియు చెప్పెను. అక్కడ శిరిడీలో బాబాకు నమస్కరించుమని యెవ్వరూ బలవంతపెట్టరనియు, కలసి సరదాగా గడుపుటకు తనతో రావలెననియు మామలతదారు కోరెను. దానికి ఆ డాక్టరు సమ్మతించెను. శిరిడీ చేరి, బాబాను చూచుటకు వారు మసీదుకు పోయిరి. అందరికంటె ముందు డాక్టరు బాబాకు నమస్కరించుట జూచి అందరు ఆశ్చర్యపడిరి.

తన మనోనిశ్చయమును మార్చుకొని యొక మహమ్మదీయునికెట్లు నమస్కరించితివని యందరు అడిగిరి. తన ఇష్టదైవమగు శ్రీరాముడు ఆ గద్దెపైన తనకు గాన్పించుటచే వారి పాదములపైబడి సాష్టాంగనమస్కార మొనర్చితినని డాక్టరు బదులిడెను. అతడట్లని, తిరిగి చూడగా, అక్కడ సాయిబాబానే గాన్పించెను. ఏమీ తోచక, అతడు, "ఇది స్వప్నమా యేమి? వారు మహమ్మదీయుడగుట ఎట్లు? వారు గొప్ప యోగసంపన్నులైన యవతారపురుషులు" అని నుడివెను.

ఆ మరుసటి దినమే డాక్టరు యేదో దీక్ష వహించి ఉపవాసముండెను. బాబా తనను అనుగ్రహించువరకు మసీదుకు పోనను నిశ్చయముతో మసీదుకు వెళ్ళుట మానెను. ఇట్లు మూడు రోజులు గడచెను. నాలుగవ దినమున తన ప్రియస్నేహితు డొకడు ఖాందేషునుండి రాగా, వానితో కలసి మసీదులో బాబా దర్శనమునకై తప్పక మసీదుకు పోవలసివచ్చెను. బాబాకు నమస్కరించగనే, బాబా అతనితో, "ఎవరైన వచ్చి నిన్నిక్కడకు రమ్మని పిలిచితిరా, యేమి? ఇట్లు వచ్చితివి" అని ప్రశ్నించెను. ఆ ప్రశ్న డాక్టరు మనస్సును కదలించెను. ఆనాటి రాత్రియే నిద్రలో అతనికి గొప్ప అధ్యాత్మికానుభూతి కలిగి, అనిర్వచనీయమైన ఆనందాన్ని అనుభవించెను. ఆ తరువాత అతడు తన ఊరికి బోయిననూ, ఆ యానందానుభూతి 15 దినములవరకు అటులనే యుండెను. ఆ ప్రకారముగా అతనికి సాయిబాబా యందు భక్తి అనేక రెట్లు వృద్ధి పొందెను.

పై కథల వలన, ముఖ్యముగా ములేశాస్త్రి కథ వలన, నేర్చుకొనిన నీతి యేమన మనము మన గురువునందే అనన్యమైన నిశ్చలవిశ్వాస ముంచవలెను. వచ్చే అధ్యాయములో మరికొన్ని సాయిలీలలు చెప్పెదను.

పన్నెండవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## పదమూడవ అధ్యాయము

*మరికొన్ని సాయిలీలలు: జబ్బులు నయమగుట: 1. భీమాజీ పాటీలు; 2. బాలాషింపి;*
*3. బాపుసాహెబు బూటీ; 4. ఆళందిస్వామి; 5. కాకా మహాజని; 6. హర్దానివాసి దత్తోపంతు.*

### మాయ యొక్క యనంత శక్తి

**బా**బా మాటలు క్లుప్తముగను, భావగర్భితముగను, అర్థపూర్ణముగను, శక్తివంతముగను, సమతూకముతోను నుండెడివి. వారు ఎప్పుడు తృప్తిగా, నిశ్చింతగా నుండువారు. బాబా యిట్లనిరి. "నేను ఫకీరునయినప్పటికీ, ఇల్లువాకిలి, భార్యబిడ్డలు, తదితర బాదరబందీ లేవీలేకుండా, ఎక్కడికీ కదలక యొకచోట కూర్చునియున్నప్పటికీ, తప్పించుకొనలేని మాయ నన్నునూ బాధించుచున్నది. నేను నన్ను మరచినను ఆమెను మరువలేకున్నాను. ఎల్లప్పుడు ఆమె నన్నావరించుచున్నది. హరి యొక్క ఆ ఆదిమాయ బ్రహ్మాదులనే చికాకు పరచుచుండగా, నావంటి దుర్బలుడయిన ఫకీరనగ నెంత? హరి ప్రసన్నుడైనపుడే ఆ మాయ నుండి తప్పించుకొనుట సాధ్యం. నిరంతర హరిభజనయే దానికి మార్గం." మాయాశక్తిని గూర్చి బాబా ఆ విధముగా పలికెను. మహాభాగవతములో శ్రీకృష్ణుడు యోగులు తన సజీవప్రతిరూపములని ఉద్ధవునకు చెప్పియున్నాడు. తన భక్తుల మేలుకొరకు బాబా యింకా యేమి చెప్పియున్నారో వినుడు: "ఎవరు అదృష్టవంతులో, యెవరి పాపములు క్షీణించినవో, వారే నన్ను భజించుటయందు తత్పరులై నన్నెఱుగగలరు. ఎల్లప్పుడు 'సాయి సాయి' అని స్మరించుచుండిన సప్తసముద్రములు దాటించెదను. ఈ మాటలను

విశ్వసింపుము. తప్పక మేలు పొందెదవు. పూజా తంతుతో నాకు పనిలేదు. షోడశోపచారములు గాని అష్టాంగయోగములు గాని నాకు అవసరము లేదు. భక్తి యున్నచోటనే నా నివాసము." ఇక, తమకు పూర్తిగా శరణాగతులైనవారి క్షేమము కొరకు బాబా యేమి చేసెనో వినుడు.

**భీమాజీ పాటీలు**

పూనాజిల్లా, జున్నరు తాలుకా, నారాయణగాంవ్ వాస్తవ్యుడు భీమాజీపాటీలు. 1909వ సంవత్సరములో తీవ్రమైన ఊపిరితిత్తుల రుగ్మతకు గురయ్యెను. తుదకు అది క్షయవ్యాధిగా పరిణమించెను. అన్ని రకముల యౌషధములను వాడెను గాని ప్రయోజనము లేకుండెను. ఇక ఆశలన్నియు వదలుకొని, "ఓ భగవంతుడా! ఇక నీవే నాకిక దిక్కు! నన్ను కాపాడు!" అని ప్రార్థించెను. మన పరిస్థితులు బాగుండునంతవరకు మనము భగవంతుని తలచము అను సంగతి యందరికి తెలిసినదే. కష్టములు మనల నావరించునప్పుడు మనము భగవంతుని జ్ఞప్తికి దెచ్చుకొనెదము. అట్లనే భీమాజీ కూడ భగవంతుని స్మరించెను. ఆ తరువాత, తన అనారోగ్యవిషయమై బాబా భక్తుడగు నానాసాహెబు చాందోర్కరుతో సలహా చేయవలెనను ఆలోచన కలిగెను. వెంటనే తన జబ్బు యొక్క వివరములన్నియు దెలుపుచు ఆయనకొక లేఖ వ్రాసి యతని యభిప్రాయమడిగెను. బాబా పాదములపైబడి బాబాను శరణు వేడుకొనుట యొక్కటే యారోగ్యమునకు సాధనమని నానాసాహెబు చాందోర్కరు జవాబు వ్రాసెను. అతడు నానాసాహెబు సలహాపై ఆధారపడి శిరిడీకి పోవుట కేర్పాటు లన్నియు చేసికొనెను. అతనిని శిరిడీకి తెచ్చి మసీదులో నున్న బాబా ముందు కూర్చునబెట్టిరి. నానాసాహెబు, శ్యామా కూడ నచ్చటనే ఉండిరి. ఆ జబ్బు వాని గతజన్మలోని పాపకర్మల ఫలితమనీ, అతని విషయములో తాను జోక్యము జేసికొనదలచుట లేదనియు బాబా చెప్పెను. కాని రోగి తనకు వేరే దిక్కులేదనియు నందుచే చివరకు వారి పాదముల నాశ్రయించితిననియు మొరపెట్టుకొని వారి కటాక్షమునకై వేడుకొనెను. అతని ప్రార్థనకు బాబా హృదయము కరిగెను. అప్పుడు బాబా అతనితో నిట్లనిరి: "ఊరడిల్లుము! నీ యాతురతను పారద్రోలుము; నీ కష్టములు గట్టెక్కినవి. ఎంతటి పీడ, బాధలున్నవారైనను ఎప్పుడైతే యీ మసీదు మెట్లు ఎక్కుదురో వారి

కష్టములన్నియు నిష్క్రమించి సంతోషమునకు దారి తీయును. ఇచ్చటి ఫకీరు మిక్కిలి దయార్ద్రహృదయుడు. వారీ రోగమును తప్పక బాగుచేయును. ఆ ఫకీరుఅందరిని ప్రేమతోను దయతోను కాపాడును."

ప్రతి అయిదు నిమిషములకు రక్తము గ్రక్కుచుండిన ఆ రోగి బాబా సముఖమున యొక్కసారియైన రక్తము గ్రక్కలేదు! బాబా వానిని దయతో గాపాడెదనను అభయమిచ్చిన వెంటనే రోగము నయమగుట ప్రారంభించెను. వానిని భీమాబాయి యింటిలో బసచేయుమని బాబా చెప్పెను. భీమాజీ వంటి రోగికి ఆ ఇల్లు అంత సదుపాయమైనది గాని, ఆరోగ్యకరమైనదిగాని కాదు. కాని బాబా యాజ్ఞ జవదాటరానిది. అతడు శిరిడీలో నుండునప్పుడు బాబా అతనికి రెండు స్వప్నానుభవముల నిచ్చి, వాని రోగమును కుదిర్చెను. మొదటి స్వప్నములో వాడొక పాఠశాల విద్యార్థిగా పద్యములు కంఠోపాఠము చేయకుండుటచే క్లాసు ఉపాధ్యాయుడు దెబ్బలు కొట్టినట్లు కనిపించెను. రెండవ స్వప్నములో వాని ఛాతీపై పెద్ద బండను వైచి క్రిందకు మీదకు త్రోయుటచే మిక్కిలి బాధననుభవించెను. స్వప్నములో పడిన ఈ బాధలతో వాని జబ్బు నయమై వాడు ఇంటికి పోయెను. ఆ తరువాత అతడప్పుడప్పుడు శిరిడీకి వచ్చుచుండెను. బాబా తనకు చేసిన మేలును జ్ఞప్తియందుంచుకొని బాబా పాదములపై సాష్టాంగనమస్కారములు చేయుచుండెను. బాబా తన భక్తుల వద్దనుంచి యేమియు కాంక్షించెడువారు కాదు. వారికి కావలసిన దేమన, భక్తులు తాము పొందిన మేలును జ్ఞప్తియందుంచుకొని, అచంచలమైన నమ్మకమును భక్తియును కలిగియుండుటయే. మహారాష్ట్ర దేశములో నెలకొకసారిగాని, పక్షమున కొకసారిగాని ఇండ్లలో సత్యనారాయణ వ్రతము చేయుట సంప్రదాయము. కాని భీమాజీ పాటీలు ఆ సత్యనారాయణ వ్రతమునకు మారుగా క్రొత్తగా సాయిసత్యవ్రతమును తన ఊరు చేరిన వెంటనే ప్రారంభించెను.

**బాలాగణపతి షింపీ**

బాలాగణపతి యనువాడు బాబా భక్తుడు. ఒకసారి అతడు మలేరియా జబ్బుచే మిగుల బాధపడెను. అన్నిరకముల యౌషధములు, కషాయములు పుచ్చుకొనెను. కాని నిష్ప్రయోజనమయ్యెను. జ్వరము కొంచెమైన తగ్గలేదు.

శిరిడీకి పరుగెత్తెను. బాబా పాదములపై బడెను. బాబా వానికి లక్ష్మీ మందిరము ముందరనున్న నల్లకుక్కకు పెరుగన్నము కలిపి పెట్టుమని చెప్పెను. ఈ వింత రోగనివారణోపాయమునెట్లు నెరవేర్చవలెనో బాలాకు తెలియకుండెను. ఇంటికి పోగా అచ్చట అన్నము పెరుగు సిద్ధముగా నుండుట జూచెను. రెంటిని కలిపి లక్ష్మీమందిరము వద్దకు దెచ్చెను. అచ్చటొక నల్లని కుక్క తోక యాడించుకొనుచూ కనిపించెను. పెరుగన్నము కుక్క ముందర పెట్టెను. కుక్క దానిని తినెను. అంతటితో బాలాగణపతి మలేరియా జబ్బు శాశ్వతముగా పోయెను.

**బాపుసాహెబు బూటీ**

ఒకానొకప్పుడు బాపుసాహెబు బూటీ జిగట విరేచనములతోను వమనములతోను బాధపడుచుండెను. అతని అలమారునిండ మంచి మంచి మందులుండెను. కాని అవేమియు గుణమివ్వలేదు. విరేచనముల వల్లను వమనముల వల్లను బాపుసాహెబు బాగా నీరసించెను. అందుచే బాబా దర్శనమునకై మసీదుకు కూడా పోలేకుండెను. బాబా ఆతనిని మసీదుకు రమ్మని కబురు పంపి, అతడు రాగానే తమ ముందు కూర్చొండబెట్టుకొని, తమ చూపుడు వ్రేలాడించుచూ, "*జాగ్రత్త! నీవిక విరేచనము చేయకూడదు! వమనము కూడ ఆగవలెను!*" అనెను. బాబా మాటల సత్తువను గనుడు. వెంటనే ఆ రెండు వ్యాధులు పారిపోయెను. బూటీ జబ్బు కుదిరెను.

ఇంకొకప్పుడు బూటీకి కలరా సోకెను. తీవ్రమైన దప్పికతో బాధపడుచుండెను. డాక్టరు పిళ్ళే యను వైద్యుడు యన్ని యౌషధములను ప్రయత్నించెను. కాని రోగము కుదురలేదు. బాపుసాహెబు అప్పుడు బాబా వద్దకు వెళ్ళి ఏ యౌషధము పుచ్చుకొనినచో తన దాహము పోయి, జబ్బు కుదురునని సలహా అడిగెను. బాదాముపప్పు, పిస్తా, అక్రోటు, నానబెట్టి, పాలు చక్కెరలో ఉడికించి పుచ్చుకొనినచో రోగము కుదురునని బాబా చెప్పెను. ఇది జబ్బును మరింత హెచ్చించునని యే డాక్టరయినను చెప్పును. కాని బాపుసాహెబు బాబా యాజ్ఞను శిరసావహించెను. పాలతో తయారుచేసి దానిని సేవించెను. విచిత్రముగా రోగము వెంటనే కుదిరెను.

### ఆళంది స్వామి

ఆళంది నుండి ఒక సన్యాసి బాబా దర్శనమునకై శిరిడీకి వచ్చెను. అతనికి చెవిపోటెక్కువగా నుండి నిద్ర పట్టకుండెను. శస్త్రచికిత్స కూడ చేయించుకొనెను. కాని వ్యాధి నయము కాలేదు. బాధ యెక్కువగా నుండెను. ఏమి చేయుటకు తోచకుండెను. తిరిగి పోవునప్పుడు బాబా దర్శనమునకై వచ్చెను. అతని చెవిపోటు తగ్గుట కేదైన చేయుమని షామా ఆ సన్యాసి తరపున బాబాను వేడుకొనెను. బాబా అతని నిట్లు ఆశీర్వదించెను. "అల్లా అచ్ఛా కరేగా" (భగవంతుడు నీకు మేలు చేయును). ఆ సన్యాసి పూనా చేరి, ఒక వారము రోజుల పిమ్మట శిరిడీకి ఉత్తరము వ్రాసెను. ఆ ఉత్తరములో తన చెవిపోటు తగ్గెననియు, కాని ఇంకనూ వాపు తగ్గలేదనియు వ్రాసెను. వాపు పోగొట్టుకొనుటకై శస్త్ర చికిత్స చేయించుకొనవలెనని బొంబాయి వెళ్ళెను. డాక్టర్లు చెవి పరీక్ష చేసి శస్త్రచికిత్స అవసరము లేదని చెప్పిరి. బాబా వాక్కుకున్న శక్తి అంత యద్భుతమైనది.

### కాకామహాజని

కాకామహాజని యను నింకొక భక్తుడు గలడు. అతడు నీళ్ళ విరేచనములతో బాధపడుచుండెను. బాబా సేవ కాటంకము లేకుండునట్లు ఒక చెంబు నిండ నీళ్ళు పోసుకొని, దానిని మసీదులో నొక మూల పెట్టుకొనెను. అవసరము వచ్చినప్పుడెల్ల పోవుచుండెను. సర్వజ్ఞుడయిన బాబాతో నేమియు చెప్పనక్కర లేదనియు, బాబాయే త్వరలో తనకు స్వస్థత చేకూర్చుననియు కాకా నమ్మెను. మసీదు ముందర రాళ్ళు తాపన చేయుటకు బాబా సమ్మతించెను, కావున పని ప్రారంభమయ్యెను. వెంటనే బాబా కోపోద్దీపితుడై బిగ్గరగా నరచెను. అందరు పరుగెత్తి పారిపోయిరి. కాకా కూడ పరుగిడ మొదలిడెను. కాని బాబా అతనిని పట్టుకొని యచ్చట కూర్చుండబెట్టెను. ఈ సందడిలో నెవరో వేరుశనగపప్పుతో చిన్న సంచిని అచ్చట విడిచి పారిపోయిరి. బాబా యొక పిడికెడు శనగపప్పు తీసి, చేతులతో నలిపి, పొట్టును ఊదివైచి శుభ్రమైన పప్పును కాకాకిచ్చి తినుమనెను. తిట్టుట శుభ్రపరచుట తినుట యొకేసారి జరుగుచుండెను. బాబా కూడ కొంత పప్పును తినెను. సంచి

ఉత్తది కాగానే నీళ్ళు తీసుకొని రమ్మని బాబా కాకాను ఆజ్ఞాపించెను. కాకా కుండతో నీళ్ళు తెచ్చెను. బాబా కొన్ని నీళ్ళు త్రాగి, కాకాను గూడ త్రాగుమనెను. అప్పుడు బాబా యిట్లనెను. "నీ నీళ్ళ విరేచనములు ఆగిపోయినవి. ఇప్పుడు నీవు రాళ్ళు తాపనజేయు పనిని చూచుకొనవచ్చును." అంతలో పారిపోయిన వారందరును తిరిగి మసీదు చేరిరి. పని ప్రారంభింపబడెను. విరేచనములు ఆగిపోవుటచే కాకా కూడ వారితో కలిసెను. నీళ్ళ విరేచనములకు వేరుశనగపప్పు ఔషధమా? వైద్యశాస్త్ర ప్రకారము వేరుశనగ పప్పు విరేచనములను హెచ్చించును గాని తగ్గించలేదు. ఇందు నిజమైన యౌషధము బాబా యొక్క వాక్కే.

**హార్దా నివాసి దత్తోపంతు**

దత్తోపంతు హార్దాగ్రామ నివాసి. అతడు కడుపునొప్పితో 14 సంవత్సరములు బాధపడెను. ఏ యౌషధము వానికి గుణము నివ్వలేదు. అతడు బాబా కీర్తి వినెను. వారు జబ్బులను దృష్టిచేతనే బాగు చేసెదరను సంగతి తెలిసికొని శిరిడీకి పోయి బాబా పాదములపై బడెను. బాబా అతనిని దయాదృష్టితో యాశీర్వదించెను; బాబా అతని తలపై తమ హస్తము నుంచి, ఊదీ ప్రసాదమిచ్చి ఆశీర్వదించగనే యతనికి గుణమిచ్చెను. ఆ జబ్బువలన తిరిగి అతడు యెన్నడు బాధ పడలేదు.

**ఇంకొక మూడు వ్యాధులు**

(1) మాధవరావు దేశపాండే మూలవ్యాధిచే బాధపడెను. సోనాముఖి కషాయమును బాబా వానికిచ్చెను. ఇది వానికి గుణమిచ్చెను. రెండు సంవత్సరముల పిమ్మట జబ్బు తిరుగదోడెను. మాధవరావు ఇదే కషాయమును బాబా యాజ్ఞలేకుండ పుచ్చుకొనెను. కాని వ్యాధి అధికమాయెను. తిరిగి బాబా యాశీర్వాదముతో నయమయ్యెను.

(2) కాకామహాజని అన్నగారైన గంగాధరపంతు అనేక సంవత్సరములు కడుపు నొప్పితో బాధపడెను. బాబా కీర్తి విని శిరిడీకి వచ్చెను. కడుపునొప్పి బాగుచేయుమని బాబాను వేడెను. బాబా వాని కడుపును తమ హస్తముతో స్పృశించి, భగవంతుడే బాగు చేయగలడనెను. అప్పటినుండి అతని కడుపు నొప్పి తగ్గి, వ్యాధి పూర్తిగా నయమయ్యెను.

(3) ఒకప్పుడు నానాసాహెబు చాందోర్కరు కడుపు నొప్పితో మిగుల బాధపడెను. ఒకనాడు రాత్రింబవళ్ళు ఆ బాధతో సతమతమయ్యెను. డాక్టర్లు మందులు ఇంజక్షనులు ఇచ్చిరి. కాని యవి ఫలించలేదు. అప్పుడతడు బాబా వద్దకు వచ్చెను. బాబా ఆశీర్వదించెను. వెంటనే అతని జబ్బు పూర్తిగా తొలగిపోయెను.

ఈ కథలన్నియు నిరూపించునదేమన, అన్ని వ్యాధులు బాగగుట కసలైన ఔషధము బాబా యొక్క వాక్కు, ఆశీర్వాదములు మాత్రమేకాని, ఔషధములు కావు.

పదమూడవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## పదునాలుగవ అధ్యాయము

నాందేడ్ నివాసియగు రతన్‌జీ వాడియా -
మౌలాసాహెబు అను యోగి - దక్షిణమీమాంస.

గత అధ్యాయములో బాబాయొక్క వాక్కు, ఆశీర్వాదములచే అనేకమైన అసాధ్యరోగములెట్లు నయమయ్యెనో వర్ణించితిమి. ఈ అధ్యాయములో రతన్‌జీ వాడియా యనువానిని బాబా ఆశీర్వదించి సంతానమునెట్లు కలుగజేసెనో వర్ణించెదము.

ఈ యోగీశ్వరుని జీవితము లోపల వెలుపల కూడ సహజముగా అత్యంత మధురముగా నుండును. వారు నడచినా, భుజించినా, మట్లాడినా, యే పని చేసిననూ అన్నియు మధురముగా నుండును. వారి జీవితము మూర్తీభవించిన ఆనందము. శ్రీసాయి తమ భక్తులు జ్ఞప్తియందుంచుకొను నిమిత్తము వానిని చెప్పిరి. భక్తులు చేయవలసిన పనుల ననేకకథల రూపముగా బోధించిరి. క్రమముగా నవి యసలైన మతమునకు మార్గమును జూపును. ప్రపంచములోని జనులందరు హాయిగా నుండవలెనని బాబా యుద్దేశము. కాని వారు జాగ్రత్తగా నుండి జీవితాశయము అనగా ఆత్మసాక్షాత్కారమును సంపాదించవలెనని వారి యుద్దేశము. గతజన్మల పుణ్యముకొలది మనకు మానవజన్మ లభించినది. కాబట్టి దాని సహాయముతో భక్తి నవలంబించి దానివల్ల జన్మరాహిత్యమును పొందవలెను. కనుక మన మెప్పుడును బద్ధకించరాదు; ఎల్లప్పుడు జాగ్రత్తగా నుండి జీవితాశయమును, దాని ముఖ్యోద్దేశమునునైన మోక్షమును సంపాదించవలెను.

ప్రతి నిత్యము సాయిలీలలు వినినచో, నీవు శ్రీసాయిని చూడగలవు. నీ మనస్సున వారిని రాత్రింబగళ్ళు జ్ఞప్తియందుంచుకొనుము. ఈ ప్రకారముగా శ్రీసాయిని అవగాహనము చేసికొన్నచో నీ మనస్సులోని చాంచల్యమంతయు పోవును. ఇటులే కొనసాగిన యెడల తుదకు శుద్ధ చైతన్యమునందు కలిసిపోదువు.

**నాందేడు పట్టణ నివాసియగు రతన్‌జీ**

ఇక ఈ అధ్యాయపు ముఖ్యకథను ప్రారంభించెదము. నైజాం యిలాకాలోని నాందేడులో పార్శీవర్తకుడొకడుండెను. అతని పేరు రతన్‌జీ షాపుర్జీ వాడియా. అతడు చాల ధనము నార్జించెను. పొలములు తోటలు సంపాదించెను. పశువులు, బండ్లు, గుఱ్ఱములు మొదలగు ఐశ్వర్యముతో తులతూగుచుండెను. బయటకు జూచుటకు చాలా సంతుష్టిగా సంతోషముతో గాన్పించెడివాడు. కాని లోపల వాస్తవముగా నట్లుండెడివాడు కాడు. ఈ లోకమునందు పూర్తి సుఖముగా నున్నవారొక్కరు లేరు. ధనికుడగు రతన్‌జీ గూడ ఏదో చింతతోనుండెను. అతడు ఔదార్యము గలవాడు, దానధర్మములు చేయువాడు, బీదలకు అన్నదానము వస్త్రదానము చేయుచుండువాడు, అందరి కన్ని విధముల సహాయము చేయుచుండువాడు. చూచిన వారందరును "అతడు మంచివాడు; సంతోషముగ నున్నా"డని యనుకొనిరి. కాని రతన్‌జీ చాల కాలము వరకు సంతానము లేకపోవుటచే నిరుత్సాహియై యుండెను. భక్తి లేని హరికథవలె, వరుస లేని సంగీతమువలె, జందెము లేని బ్రాహ్మణుని వలె, ప్రపంచజ్ఞానము లేని శాస్త్రవేత్తవలె, పశ్చాత్తాపము లేని యాత్రవలె, కంఠాభరణము లేని యలంకారమువలె రతన్‌జీ జీవితము పుత్రసంతానము లేక నిష్ప్రయోజనము గాను, కళావిహీనముగాను యుండెను. రతన్‌జీ యెల్లప్పుడు ఈ విషయమును గూర్చియే చింతించుచుండెను.

రతన్‌జీ తనలో తానిట్లనుకొనెను. "భగవంతుడెన్నడయిన సంతుష్టి జెంది పుత్రసంతానము కలుగజేయడా?" మనస్సునందలి ఈ చింతతో అతడాహారమందు రుచి గోల్పోయెను. రాత్రింబవళ్ళు తనకు పుత్రసంతానము కలుగునా లేదా యను నాతురతతో నుండువాడు. దాసగణు మహారాజునందు

గొప్పగౌరవము కలిగియుండెడివాడు. ఒకనాడు దాసగణు మహరాజ్‌ని కలిసి, ఆయతలో తన మనస్సులోని కోరికను చెప్పెను. దాసగణు అతనికి శిరిడీకి వెళ్ళుమని సలహా యిచ్చెను. బాబాను దర్శించుమనెను; బాబా ఆశీర్వాదము పొందుమనెను; సంతానము కొరకు వేడుకొనుమనెను. రతన్‌జీ దీనికి సమ్మతించెను. శిరిడీకి వెళ్ళుటకు నిశ్చయించెను. కొన్ని దినముల తరువాత శిరిడీకి వెళ్ళెను. బాబా దర్శనము చేసెను. బాబా పాదముల మీద పడెను. ఒక బుట్టలో చక్కని పూలమాలను తెచ్చి, దానిని బాబా మెడలో వేసి, ఒక గంపతో పండ్లను బాబాకు సమర్పించెను. మిక్కిలి వినయవిధేయతలతో బాబా దగ్గర కూర్చుండి, ఇట్లు ప్రార్థించెను:

*"కష్టదశలోనున్నవారనేకమంది నీ దర్శనమునకు రాగా వారిని వెంటనే రక్షించి కాపాడెదవు. ఈ సంగతి విని నీపాదముల నాశ్రయించితిని. కనుక దయయుంచి నాకు ఆశాభంగము కలుగజేయకుము."* బాబాకు 5 రూపాయలు దక్షిణ ఇవ్వవలెనని రతన్‌జీ తన మనసులో దలచెను. బాబా అతనిని 5 రూపాయలు దక్షిణ కోరి, అతడా పైకము నిచ్చునంతలో, తనకు రూ. 3-14-0 ఇంతకు పూర్వమే ముట్టి యుండెననీ, కాన మిగిలిన రూ. 1-2-0 మాత్రమే యిమ్మనెను. ఇది విని రతన్‌జీ మిగుల ఆశ్చర్యపడెను. బాబా యాడిన మాటలను రతన్‌జీ గ్రహించుకొనలేకపోయెను. కాని బాబా పాదముల వద్ద కూర్చుండి మిగత దక్షిణ యిచ్చెను. తాను వచ్చిన పని యంతయు బాబాకు విన్నవించి, తనకు పుత్రసంతానము కలుగజేయుమని వేడెను. బాబా మనస్సు కరిగెను. *"దిగులు పడకు! నీ కీడురోజులు ముగిసినవి. అల్లా నీ మనస్సులోని కోరిక నెరవేర్చు"*నని చెప్పెను.

బాబా వద్ద సెలవు పుచ్చుకొని రతన్‌జీ నాందేడుకు వచ్చెను. దాసగణుకు శిరిడీలో జరిగిన వృత్తాంతమంతయు దెలిపెను. అంతయు సవ్యముగా జరిగె ననియు, బాబా దర్శనము, వారి యాశీర్వాదము, ప్రసాదము లభించినవనియు, ఒక్కటి మాత్రమే తనకు బోధపడని సంగతి గలదని యనెను. తమకు అంతకుముందే రూ. 3-14-0 ముట్టినవని బాబా యాడిన మాటల కర్థమేమని దాసగణు నడిగెను. *"ఇంతకు మునుపు నేనెప్పుడు శిరిడీకి వెళ్ళియుండలేదే! నావల్ల బాబాకు రూ. 3-14-0 ఎట్లు*

ముట్టెను?" అది దాసగణుకు కూడ యొక చిక్కు సమస్యగా తోచెను. దానిని గూర్చి కొంతసేపు ఆలోచించెను. కొంతకాలమయిన పిమ్మట అతనికే దాని వివరమంతయు తట్టెను. మౌలాసాహెబను మహాత్ముని రతన్‌జీ అంతకు మునుపు సత్కరించిన విషయము జ్ఞాపకము వచ్చెను. నాందేడులో మౌలాసాహెబు గూర్చి తెలియనివారు లేరు. వారు నెమ్మదైన యోగి. రతన్‌జీ శిరిడీకి పోవ నిశ్చయించగనే ఈ మౌలాసాహెబు రతన్‌జీ ఇంటికి వచ్చెను. ఆనాటి ఖర్చు సరిగ 3-14-0 అగుట జూచి యందరు ఆశ్చర్యపడిరి. అందరికి బాబా సర్వజ్ఞుడని స్పష్టపడినది. వారు శిరిడిలో నున్నప్పటికి దూరములో నేమి జరుగుచుండెనో వారికి తెలియుచుండెను. లేనిచో మౌలాసాహెబు కిచ్చిన రూ. 3-14-0 సంగతి బాబాకెట్లు తెలియగలదు? వారిద్దరొక్కటేయని గ్రహించిరి.

దాసగణు చెప్పిన సమాధానమునకు రతన్‌జీ సంతుష్టి చెందెను. అతనికి బాబా యందు స్థిరమైన నమ్మకము కలిగెను. భక్తి హెచ్చాయెను. కొద్దికాలము పిమ్మట అతనికి పుత్రసంతానము కలిగెను. ఆ దంపతుల యానందమునకు మితి లేకుండెను. కొన్నాళ్ళకు వారికి 12గురు సంతానము కల్గిరి. కాని నలుగురు మాత్రము బ్రతికిరి.

ఈ యధ్యాయము చివరన హరివినాయక సాఠె యనువాడు తన మొదటి భార్య కాలముచేసిన పిమ్మట, రెండవ వివాహము చేసుకొనినచో పుత్ర సంతానము కలుగునని బాబా యాశీర్వదించిన కథ గలదు. అట్లే రెండవ భార్య వచ్చిన పిమ్మట వారికి ఇద్దరు కుమార్తెలు గలిగిరి. అతడు నిరుత్సాహము చెందెను. కాని బాబా మాటలెన్నిటికి అసత్యములు గానేరవు. మూడవసారి అతనికి కొడుకు పుట్టెను. ఇట్లు బాబా వాక్యము నిజమైనది. అంత నతడు మిక్కిలి సంతుష్టి చెందెను.

### దక్షిణ మీమాంస

దక్షిణ గూర్చి క్లుప్తముగా చెప్పి యీ యధ్యాయమును ముగించెదము. బాబా తమను జూచుటకు వెళ్ళినవారివద్ద నుండి దక్షిణ పుచ్చుకొనుట యందరికి తెలిసిన సంగతే. బాబా ఫకీరయినచో, వారికి దేని యందు అభిమానము

లేకున్నచో, వారు దక్షిణ నెందు కడుగవలెను? వారు ధనమునేల కాక్షించవలెనని యెవరైన అడుగవచ్చును. దీనికి పూర్తి సమాధానమిది.

మొట్టమొదట బాబా యేమియు పుచ్చుకొనెడివారు కారు. కాల్చిన యగ్గిపుల్లలను జాగ్రత్త పెట్టుకొని జేబులో వేసుకొనెడివారు. భక్తులను గాని, తదితరులనుగాని బాబా యేమియు నడిగెడివారు కారు. ఎవరైన నొక కాని గాని రెండు కానులుగాని యిచ్చినచో వానితో నూనె, పొగాకు కొనెడివారు. బీడిగాని, చిలుముగాని పీల్చేవారు. రిక్త హస్తములతో యోగులను చూడరాదని కొందరు ఒకటిగాని రెండుగాని పైసలను బాబా ముందర పెట్టేవారు. ఒక్కకాని యిచ్చినచో బాబా జేబులో నుంచుకొనెడివారు. అర్ధణా అయినచో తిరిగి యిచ్చేవారు. బాబా కీర్తి యన్నిదిశలకు వ్యాపించిన తరువాత అనేకమంది బాబాదర్శనమునకై గుంపులు గుంపులుగా రాజొచ్చిరి. అప్పుడు బాబా వారిని దక్షిణ యడుగుచుండెను.

*"దేవుని పూజయందు బంగారు నాణెము లేనిదే యా పూజ పూర్తికాదు"* అని వేదము చెప్పుచున్నది. దేవుని పూజయందు నాణెమవసరమైనచో యోగులపూజలో మాత్రమేల యుండరాదు? శాస్త్రములలో గూడ నేమని చెప్పబడినదో వినుడు. భగవంతుని, రాజును, యోగిని, గురుని దర్శించుటకు పోవునప్పుడు రిక్తహస్తములతో పోరాదు. నాణెముగాని డబ్బుగాని సమర్పించవలెను. ఈ విషయము గూర్చి యుపనిషత్తులు ఏమని ఘోషించుచున్నవో చూచెదము. బృహదారణ్యకోపనిషత్తులో ప్రజాపతి దేవతలకు, మానవులకు, రాక్షసులకు 'ద' యను నక్షరమును బోధించెను. ఈ అక్షరము వల్ల దేవతలు 'దమము' నవలంబించవలెనని గ్రహించిరి. (అనగా నాత్మను స్వాధీనమందుంచుకొనుట.) మానవులు ఈ యక్షరమును 'దానము'గా గ్రహించిరి. రాక్షసులు దీనిని 'దయ' యని గ్రహించిరి. దీనిని బట్టి మానవులు దానము చేయవలెనను నియమ మేర్పడెను. తైత్తిరీయోపనిషత్తు దానము మొదలగు సుగుణముల నభ్యసించ వలయునని చెప్పును. దానము గట్టి విశ్వాసముతోను, ధారాళముగను, అణకువతోను, భయముతోను, కనికరముతోను చేయవలెను. భక్తులకు దానముగూర్చి బోధించుటకు, ధనమందు వారికి గల అభిమానమును పోగొట్టుటకు వారి మనములను

శుభ్రపరచుటకు బాబా దక్షిణ యడుగుచుండెను. కాని ఇందులో నొక విశేషమున్నది. బాబా తాము పుచ్చుకొనుదానికి వందరెట్లు తిరిగి యివ్వవలసి వచ్చుచుండెను. ఇట్లనేకమందికి జరిగెను. దీనికొక యుదాహరణము. గణపతిరావు బోడస్‌యను ప్రముఖ నటుడు, తన మరాఠీ జీవితచరిత్రలో గడియ గడియకు బాబా దక్షిణ అడుగుచుండుటచేత ధనముంచుకొను సంచి తీసి బాబా ముందు కుమ్మరించితి ననియు, దీని ఫలితముగా ఆనాటినుండి తన జీవితములో ధనమునకు యెట్టి లోటు లేకుండెననియు వ్రాసెను. ఎల్లప్పుడు కావలసినంత ధనము గణపతిరావు బోడస్‌కు దొరకుచుండెను.

బాబా 'దక్షిణ' యడిగినపుడు ధనమే ఇవ్వనక్కర లేదను నర్థము గూడ పెక్కు సంఘటనల వలన తెలియువచ్చుచున్నది. దీనికి రెండుదాహరణములు.

(1) బాబా 15 రూపాయలు దక్షిణ యిమ్మని ప్రొఫెసర్ జి.జి. నార్కే నడుగగా, నతడు తన వద్ద దమ్మిడీయయిన లేదనెను. దానికి బాబా యిట్లనెను. *"నీ వద్ద ధనము లేదని నాకు తెలియును. కాని నీవు యోగవాసిష్ఠము చదువుచున్నావు గదా? దాని నుంచి నాకు దక్షిణ యిమ్ము!"* దక్షిణ యనగా నిచ్చట గ్రంథమునుంచి నేర్చుకొనిన విషయములను జాగ్రత్తగా హృదయములో దాచుకొనుమని యర్థము. (2) ఇంకొకసారి, తర్‌ఖడ్ భార్యను 6 రూపాయలు దక్షిణ యిమ్మని బాబా యడిగెను. తన వద్ద పైకము లేకుండుటచే నామె మిగుల చిన్నబోయెను. అప్పుడు అక్కడనే యున్న ఆమె భర్త బాబా వాక్కులకు అర్థము జెప్పెను. తన ఆరుగురు శత్రువులను (కామక్రోధ లోభాదులను) తమకు పూర్తిగ సమర్పించవలెనని బాబా భావమని యతడు తన భార్యకు వివరించెను. దానికి బాబా పూర్తిగ సమ్మతించెను.

బాబా దక్షిణ రూపముగా కావలసినంత ధనము వసూలు చేసినప్పటికి, దానినంతయు వారు ఆనాడే పంచి పెట్టుచుండిరి. ఆ మరుసటి యుదయమునకు బాబా మామూలు పేద ఫకీరగుచుండెను.

10 సంవత్సరముల కాలము వేల కొలది రూపాయలను దక్షిణరూపముగా పుచ్చుకొనినను, మహాసమాధి చెందునాటికి ఏడు రూపాయలు మాత్రమే వారి చెంత మిగిలెను. వేయేల బాబా దక్షిణపుచ్చుకొనుట భక్తులకు దానమును, త్యాగమును నేర్పుటకొరకే.

**దక్షిణగూర్చి యింకొకరి వర్ణన**

బి.వి. దేవ్ ఠాణానివాసి; ఉద్యోగ విరమణ చెందిన మామలతదారు; బాబా భక్తుడు. దక్షిణగూర్చి అయన 'శ్రీసాయిలీలా మాసిక్' పత్రికలో నిట్లు వ్రాసియున్నారు:

బాబా యందరిని దక్షిణ యడుగువారు కారు. అడుగకుండ ఇచ్చినచో నొక్కొకప్పుడు పుచ్చుకొనెడివారు; ఇంకొకప్పుడు నిరాకరించువారు. బాబా కొంతమంది భక్తులవద్ద దక్షిణ యడుగుచుండెను. బాబా యడిగినచో యిచ్చెద మనుకొనువారివద్ద బాబా దక్షిణ పుచ్చుకొనెడివారు కారు. తమ ఇష్టమునకు వ్యతిరేకముగా నెవరైన దక్షిణ యిచ్చినచో, బాబా దానిని ముట్టేవారు కారు. ఎవరైన దక్షిణ తమ ముందుంచినచో దానిని తిరిగి తీసుకొని పొమ్మనుచుండిరి. బాబా యడిగెడు దక్షిణ పెద్ద మొత్తములుగాని చిన్న మొత్తములుగాని భక్తుల కోరికలు, భావము, వసతి బట్టి యుండును. స్త్రీలు, పిల్లల వద్ద కూడా బాబా దక్షిణ యడుగుచుండెను. వారు అందరు ధనికులనుగాని అందరు బీదలను గాని దక్షిణ యడుగలేదు.

తాము అడిగినను దక్షిణ యియ్యనివారిపై బాబా కోపించి యుండలేదు. ఎవరి ద్వారానైన భక్తులు దక్షిణ పంపినచో, తెచ్చిన వారు దానిని మరచునప్పుడు, వారికి దానిని గూర్చి జ్ఞప్తికి దెచ్చి, ఆ దక్షిణను పుచ్చుకొనువారు. ఒక్కొక్కప్పుడు చెల్లించిన దక్షిణనుంచి కొన్ని రూపాయలు తిరిగి యిచ్చి పూజలో పెట్టుకొనమనెడివారు. దీనివలన భక్తునికి మిక్కిలి ప్రయోజనము గనిపించుచుండెను. అనుకున్నదానికంటె నెక్కువ యిచ్చినచో, కావలసినదానినే యుంచుకొని మిగతాదానిని తిరిగి యిచ్చి వేయుచుండిరి. ఒక్కొకప్పుడు భక్తులనుకొనిన దానికంటె నెక్కువగా ఇవ్వుమనుచుండువారు. లేదనినచో నెవరివద్దనయిన బదులు పుచ్చుకొనిగాని, అడిగితీసుకొనిగాని ఇవ్వుమనుచుండిరి. కొందరివద్ద నుంచి యొకేరోజు మూడు నాలుగు సారులు దక్షిణ కోరుచుండిరి.

దక్షిణరూపముగా వసూలయిన పైకమునుంచి బాబా కొంచెము మాత్రమే చిలుమునకు, ధునికొరకు ఖర్చు పెట్టుచుండిరి. మిగతదాని నంతయు బీదలకు దానము చేయుచుండెడివారు. 50 రూపాయలు మొదలు ఒక రూపాయి వరకును ఒక్కొకరికి నిత్యము దానము చేయుచుండువారు. శిరిడీ సంస్థానములో నున్న విలువైన వస్తువులన్నియు రాధాకృష్ణమాయి సలహాచే భక్తులు తెచ్చి యిచ్చిరి. ఎవరయిన విలువైన వస్తువులు తెచ్చినచో బాబా వారిని తిట్టెడివారు. నానాసాహెబు చాందోర్కరుతో తన యాస్తి యంతయు నొక కౌపీనము, ఒక విడిగుడ్డ, యొక కఫనీ, యొక తంబిరేలు గ్లాసు మాత్రమే యనియు అయినప్పటికి భక్తులనవసరమైన నిష్ప్రయోజనమయిన విలువైన వస్తువులు తెచ్చుచున్నారని అనుచుండెడివారు.

మన పారమార్థికమునకు ఆటంకములు రెండు గలవు; మొదటిది స్త్రీ. రెండవది ధనము. శిరిడీలో బాబా యీ రెండు సంస్థలను నియమించియున్నారు. అందొకటి దక్షిణ, రెండవది రాధాకృష్ణమాయి. తన భక్తులు ఈ రెంటిని ఎంతవరకు విడిచి పెట్టిరో పరీక్షించుటకై బాబా వీనిని నియమించెను. భక్తులు రాగానే దక్షిణ యడిగి పుచ్చుకొని, "బడికి" (రాధాకృష్ణమాయి గృహమునకు) పంపుచుండిరి. ఈ రెండు పరీక్షలకు తట్టుకొన్నచో అనగా కనకమందు కాంతయందు అభిమానము పోయినదని నిరూపించినప్పుడే బాబా దయవలన ఆశీర్వాదమువలన వారి పారమార్థికప్రగతి శీఘ్రమగుట దృఢపడుచుండెను.

భగవద్గీతలోను, ఉపనిషత్తులలోను, పవిత్రమైన స్థలమందు పవిత్రున కిచ్చిన దానము, అదాతయొక్క యోగక్షేమములకు అధికముగా తోడ్పడునని యున్నది. శిరిడీకన్న పవిత్రస్థల మేది? అందున్న దైవము సాయిబాబాకన్న మిన్న యెవరు?

పదునాలుగవ అధ్యాయము
సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## పదునైదవ అధ్యాయము

*నారదీయకీర్తనపద్ధతి; చోల్కరు చక్కెరలేని టీ; రెండు బల్లులు.*

**ఆ**రవ అధ్యాయములో శిరిడీలో జరుగు శ్రీరామనవమి యుత్సవమెట్లు ప్రారంభమయ్యెను? ఆ సమయములో హరిదాసును దెచ్చుట యెంత కష్టముగ నుండెడిది? తుదకు ఆ పనిని దాసగణు మహారాజు నిర్వహించునట్లు బాబా శాశ్వతముగా నియమించుట, దానిని ఇప్పటి వరకు దాసగణు జయప్రదముగా నడుపుట యనునవి చదువరులు జ్ఞాపకముంచుకొనియే యుందురు. ఈ అధ్యాయములో దాసగణు హరికథల నెట్లు చెప్పువారో వర్ణింతును.

**నారదీయకీర్తనపద్ధతి**

సాధారణముగ మహారాష్ట్రదేశములో హరిదాసులు హరికథ చెప్పునప్పుడు ఆడంబరమైన నిండు అంగరఖాలు వేసికొనెదరు. తలపైని పాగా గాని, పేటా (ఒక విధమైన యెత్తుని మహారాష్ట్రపు టోపి) కాని, పొడవైన కోటు, లోపల చొక్కా, పైన నుత్తరీయము, మామూలుగా ధరించెడి ధోవతిని కట్టుకొనెదరు. ఈ ప్రకారముగా దుస్తులు ధరించి, శిరిడీలో హరికథ చెప్పుటకై దాసగణు తయారయ్యెను. బాబా సెలవు పొందుటకై మసీదుకు బోయెను. బాబా అతనితో, "ఏమోయ్, పెండ్లికొడుకా! ఇంత చక్కగ ముస్తాబై యెక్కడకు పోవుచున్నావు?" అనెను. హరికథ చెప్పుటకు పోవుచున్నానని దాసగణు జవాబిచ్చెను. అప్పుడు బాబా యిట్లనెను. "దానికి ఈ దుస్తులన్ని యెందుకు?

కోటు, కండువా, టోపీ మొదలగునవి ముందర వెంటనే తీసి పారవేయుము. శరీరముపై యీ అలంకారాలన్నీ యెందుకు?" వెంటనే దాసగణు వానినన్నిటిని తీసి బాబా పాదముల వద్ద నుంచెను. అప్పటినుంచి హరికథ చెప్పునప్పుడు వానిని దాసగణు యెన్నడు ధరించలేదు. నడుము మొదలు తలవరకు ఏమియు వేసికొనెడి వాడు కాదు. చేతిలో చిరుతలు మెడలో పూలమాల మాత్రమే ధరించెడువాడు. ఇది మహారాష్ట్ర దేశములో తక్కిన హరిదాసులు అవలంబించు పద్ధతికి వ్యతిరేకము. నారద మహర్షియే హరికథలు ప్రారంభించినవారు. వారు తలపైని, శరీరముపైన ఏమియు తొడిగేవారు కారు. చేతి యందు వీణను ధరించి యొక చోటునుంచి యింకొక చోటికి హరినామసంకీర్తన చేయుచు పోవువారు.

**చోల్కరు చక్కరలేని తేనీరు**

పూనా అహ్మదునగరు జిల్లాలలో బాబాను గూర్చి యందరికి తెలియునుగాని, నానాసాహెబు చాందోర్కరు ఉపన్యాసముల వల్లను, దాసగణు హరికథలవల్లను బాబా పేరు కొంకణదేశమంతయు ప్రాకెను. నిజముగా దాసగణు తన చక్కని హరికథలవల్ల బాబాను అనేకులకు పరిచయ మొనర్చెను. హరికథలు వినుటకు వచ్చినవారికి అనేకరుచులుండును. కొందరు హరిదాసుగారి పాండిత్యమునకు సంతసించెదరు; కొందరికి వారి నటన, కొందరికి వారి పాటలు, కొందరికి హాస్యము, చమత్కారము, సంతసము గలుగజేయును. కథాపూర్వమున దాసుగారు సంభాషించు వేదాంతవిషయములు వినుటకు కొందరు; అసలు కథను వినుటకు కొందరు వచ్చెదరు. వచ్చినవారిలో చాల కొద్దిమందికి మాత్రమే భగవంతునియందుగాని, యోగులయందుగాని, ప్రేమవిశ్వాసములు కలుగును. కాని దాసగణుయొక్క హరికథలు వినువారల మనస్సులపై కలుగు ప్రభావమతిసమ్మోహనకరముగా నుండెను. ఇచ్చట నొక యుదాహరణము నిచ్చెదము.

ఠాణాలో నున్న కోపీనేశ్వరాలయములో ఒకనాడు దాసగణు మహరాజ్ హరికథ చెప్పుచు సాయి మహిమను పాడుచుండెను. కథను వినుటకు వచ్చిన వారిలో చోల్కర్ యనునతడుండెను. అతడు పేదవాడు. ఠాణా సివిల్ కోర్టులో గుమాస్తాగా పనిచేయుచుండెను. అతడు దాసగణు కీర్తన నతి శ్రద్ధగా వినెను.

వాని మనస్సు కరగెను. వెంటనే అక్కడకక్కడే మనస్సునందు బాబాను ధ్యానించి ఇట్లు మ్రొక్కుకొనెను. "బాబా! నేను పేదవాడను, నాకుటుంబమునే నేను పోషించుకొన లేకున్నాను. మీ యనుగ్రహముచేత సర్కారువారి పరీక్షలో నుత్తీర్ణుడనై స్థిరమైన ఉద్యోగము లభించినచో నేను శిరిడీకి వచ్చెదను. నీ పాదములకు సాష్టాంగనమస్కారము చేసెదను. నీ పేరున కలకండ పంచి పెట్టుదును." బాబా కృపచే చోల్కరు పరీక్షలో ప్యాసయ్యెను. స్థిరమైన యుద్యోగము దొరకెను. కనుక మ్రొక్కు చెల్లించవలసిన బాధ్యత ఎంత త్వరగా తీర్చినచోనంత బాగుండుననుకొనెను. చోల్కరు బీదవాడు. వాని కుటుంబము చాలపెద్దది. కనుక శిరిడీయాత్ర చేయుటకు ఖర్చు పెట్టుకొనలేకుండెను. ఎవరైన పర్వతశిఖరమునైన దాటవచ్చునుగాని, బీదవాడు తన యింటి గడపనే దాటలేడనిగదా లోకోక్తి!

చోల్కరు కెటులైన శ్రీసాయి మ్రొక్కును త్వరలో చెల్లించవలెనని యాతురత గలిగెను. కావున తన సంసారమునకగు ఖర్చులను తగ్గించి కొంతపైకమును మిగుల్చవలెనని నిశ్చయించుకొనెను. తేనీటిలో వేయు చక్కెరను మాని యా మిగిలిన ద్రవ్యమును దాచుటకు ప్రారంభించెను. ఇవ్విధముగా కొంత ద్రవ్యమును మిగిల్చిన పిమ్మట, శిరిడీకి వచ్చి బాబా పాదములపై బడెను. ఒక టెంకాయ బాబాకు సమర్పించెను. తాను మ్రొక్కుకున్న ప్రకారము కలకండ పంచిపెట్టెను. తన మనసులోని కోరికలన్నియు ఆనాడు నెరవేరినవనియు, తనకు యెంతయో తృప్తిగ నున్నదనియు బాబాతో చెప్పెను. చోల్కరు బాపూసాహెబు జోగు గృహమందు దిగెను. అప్పుడు వీరిరువురు మసీదులో నుండిరి. ఇంటికి పోవుటకై వారు లేచి నిలువగా బాబా జోగును బిలచి యిట్లనెను. "*నీ యతిథికి టీ కప్పులలో విరివిగా చక్కెర వేసి యిమ్ము!*" ఈ పలుకులలోని భావమును గ్రహించినవాడై, చోల్కరు మనస్సు కరగెను. అతడాశ్చర్యమగ్ను డయ్యెను. వానికండ్లు బాష్పములచే నిండెను. తిరిగి బాబా పాదములపై బడెను. జోగు కూడ ఈ మాటలు విని టీ కప్పులలో చక్కెర యెక్కువగా కలుపుట యనుదాని భావము ఏమైయుండునా యని యోచించెను. బాబా తన పలుకులచే చోల్కరు మనస్సునందు భక్తి, నమ్మకములను కలుగజేయవలెనని యుద్దేశించెను. వాని మ్రొక్కు ప్రకారము తనకు రావలసిన

కండచక్కెర ముట్టినదనియు, తేయాకునీళ్ళలో చక్కెర నుపయోగించక పోవుటయను రహస్యమనోనిశ్చయమును చక్కగా కనుగొనె ననియు చెప్పెను. బాబా యిట్లు చెప్పనుద్దేశించెను. "నా ముందర భక్తితో మీ చేతులు చాపినచో వెంటనే రాత్రింబవళ్ళు మీ చెంత నేనుండెదను. నా దేహము నిచ్చట నున్నప్పటికి సప్తసముద్రముల కవ్వల మీరు చేయుచున్న పనులు నాకు తెలియును. ప్రపంచమున మీకిచ్చవచ్చిన చోటుకు పోవుడు. నేను మీ చెంతనే యుండెదను. నా నివాసస్థలము మీ హృదయమునందే గలదు. నేను మీ శరీరములోనే యున్నాను. ఎల్లప్పుడు మీ హృదయములలోను సర్వజన హృదయములందు గల నన్ను పూజింపుడు. ఎవ్వరు నన్ను ఈ విధముగా గుర్తించెదరో వారు ధన్యులు; పావనులు; అదృష్టవంతులు."

బాబా చోల్కరు కెంత చక్కని ముఖ్యమైన నీతిని ఈ విధముగా బోధించెనో గదా!

### రెండు బల్లులు

ఈ అధ్యాయమును రెండు చిన్న బల్లుల కథతో ముగించెదము. ఒకనాడు బాబా మసీదులో కూర్చొని యుండెను. ఒక భక్తుడు బాబా ముందర కూర్చొని యుండెను. ఒక బల్లి టిక్కుటిక్కుమని పలికెను. కుతూహలమునకై యా భక్తుడు బల్లి పలికిన దాని కర్థమేమని బాబా నడిగెను. అది శుభశకునమా, లేక యశుభమా యని ప్రశ్నించెను. తన చెల్లెలు ఔరంగాబాదునుండి తనను చూచుటకు వచ్చునని యా బల్లి యానందించుచున్నదని బాబా పలికెను. భక్తుడు నిర్ఘాంతపోయి కిమ్మనక కూర్చుండెను. బాబా పలికినదానిని అతడు గ్రహించలేకుండెను. కొంత తడవైన పిమ్మట ఔరంగాబాదునుండి యెవరో గుఱ్ఱముపై బాబా దర్శనమునకై శిరిడీకి వచ్చిరి. అతడింకను కొంతదూరము పోవలసియుండెను. కాని వాని గుఱ్ఱము ఆకలిచే ముందుకు పోలేకుండెను. గుఱ్ఱమునకు ఉలవలు కావలసియుండెను. తన భుజముపై నున్న సంచిని తీసి ఉలవలు తీసికొని వచ్చుటకై పోవునప్పుడు దానిలో నున్న ధూళిని విదిలించెను. అందులో నుండి యొక బల్లి క్రిందపడి యందరు చూచుచుండగా గోడనెక్కెను. ప్రశ్నించిన భక్తున కదంతయు జాగ్రత్తగా

గమనించుమని బాబా చెప్పెను. వెంటనే యా బల్లి తన సోదరి వద్దకు సంతోషముతో పోయెను. చాలకాలము పిమ్మట అక్కచెల్లెండ్రు కలిసికొనిరి. ఒకరినొకరు కౌగిలించుకొని ముద్దిడుకొనిరి. గుండ్రముగా తిరుగుచు నధికప్రేమతో నాడిరి. శిరిడీ యెక్కడ? ఔరంగాబాదెక్కడ? గుఱ్ఱపు రౌతు ఔరంగాబాదునుంచి బల్లిని తీసికొని శిరిడీకి ఎట్లు వచ్చెను? రాబోయే యిద్దరు అక్కచెల్లెండ్రు కలియుదురని బాబా ముందుగానే యెట్లు చెప్పగలిగెను? ఇది యంతయు బహుచిత్రముగా నున్నది. ఇది బాబా సర్వజ్ఞుడని నిరూపించుచున్నది.

**ఉత్తర లేఖనము**

ఎవరయితే యీ అధ్యాయమును భక్తి శ్రద్ధలతో నిత్యము పారాయణ చేసెదరో వారి కష్టములన్నియు శ్రీసాయినాథుని కృపచే తొలగును.

పదునైదవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

**రెండవరోజు పారాయణము సమాప్తము**



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయిసచ్చరిత్రము

## మూడవరోజు పారాయణము

**శనివారము**

# 16 - 17 వ అధ్యాయములు

*బ్రహ్మజ్ఞానమును త్వరగా సంపాదించుట!*

గత అధ్యాయములో చోల్కరు తన మ్రొక్కు నెట్లు చెల్లించెనో బాబా దాని నెట్లు ఆమోదించెనో చెప్పితిని. ఏకొంచెమైనను భక్తిప్రేమలతో నిచ్చినదానిని ఆమోదించెదననియు, గర్వముతోను అహంకారముతోను ఇచ్చిన దానిని తిరస్కరించెదననియు బాబా ఆ కథలో నిరూపించెను. బాబా పూర్ణసచ్చిదానంద స్వరూపుడగుటచే కేవలం బాహ్యతంతును లక్ష్యపెట్టెడివారు కారు. ఎవరైన భక్తి ప్రేమలతో నేదైన సమర్పించినచో మిక్కిలి సంతోషముతో ఆత్రముతో దానిని పుచ్చుకొనెడివారు. నిజముగా సద్గురుసాయికంటె నుదారస్వభావులు, దయార్ద్ర హృదయులు లేరు. కోరికలు నెరవేర్చు చింతామణి, కల్పతరువు, వారికి సమానము కావు. మనము కోరినదెల్ల నిచ్చు కామధేనువు కూడ బాబాతో సమానము కాదు. ఏలన, యవి మనము కోరునవి మాత్రమే యిచ్చును. కాని సద్గురువు అచింత్యము అనుపలభ్యమునైన ఆత్మసాక్షాత్కారమును ప్రసాదించును. ఒకనాడొక ధనికుడు సాయిబాబా వద్దకు వచ్చి బ్రహ్మజ్ఞానమును ప్రసాదించుమని బతిమాలెను. ఆ కథ యిచ్చట చెప్పెదను.

సకలైశ్వర్యముల ననుభవించుచున్న ధనికుడొకడుండెను. అతడిండ్లను ధనమును, పొలములను, తోటలను సంపాదించెను. వాని కనేకమంది సేవకులుండెడివారు. బాబా కీర్తి వాని చెవుల పడగనే శిరిడీకి పోయి బాబా పాదములపైబడి బ్రహ్మజ్ఞానమును ప్రసాదించుమని బాబాను వేడుకొనెదనని తన స్నేహితునితో చెప్పెను. తనకు వేరేమియు వలదనియు, బ్రహ్మజ్ఞానము పొందినచో తనకు మిక్కిలి సంతసము కలుగుననియు చెప్పెను. ఆ స్నేహితుడిట్లనెను: "*బ్రహ్మజ్ఞానమును సంపాదించుట అంత సులభమైనపని కాదు. ముఖ్యముగా నీవంటి పేరాస గలవానికి అది మిగుల దుర్లభము. ధనము, భార్య బిడ్డలతో తేలి మునుగుచున్న నీవంటివానికి బ్రహ్మజ్ఞానము నెవరిచ్చెదరు? నీవొక పైసయయిన దానము చేయనివాడవే! నీవు బ్రహ్మజ్ఞానమునకై వెదకునప్పుడు నీ కోరిక నెరవేర్చు వారెవరు?*"

తన స్నేహితుని సలహాను లక్ష్యపెట్టక, రానుపోను టాంగాను బాడుగకు కట్టించుకొని అతడు శిరిడీకి వచ్చెను. మసీదుకు పోయి, బాబాను జూచి వారి పాదములకు సాష్టాంగ నమస్కారము చేసి యిట్లనెను: "*బాబా! ఇక్కడకు వచ్చిన వారికి ఆలస్యము చేయక బ్రహ్మమును జూపెదరని విని నేనంతదూరమునుంచి వచ్చితిని. ప్రయాణముచే నేను మిక్కిలి బడలితిని. మీరు బ్రహ్మజ్ఞానమును ప్రసాదించినచో నేను పడిన శ్రమకు ఫలితము లభించును*". బాబా యిట్లు బదులు చెప్పెను: "*నా ప్రియమైన స్నేహితుడా! ఆతుర పడవద్దు. త్వరలో నిప్పుడే నీకు బ్రహ్మమును జూపెదను. నాది నగదు బేరమే గాని యరువు బేరము కాదు. అనేకమంది నావద్దకు వచ్చి ధనము, ఆరోగ్యము, పలుకుబడి, గౌరవము, ఉద్యోగము, రోగనివారణము మొదలగు ప్రాపంచికవిషయములనే యడుగుదురు. నా వద్దకు వచ్చి బ్రహ్మజ్ఞానము నివ్వుమని యడుగువారు చాల తక్కువ. ప్రపంచ విషయములు కావలెనని యడుగువారికి లోటు లేనే లేదు. పారమార్థికవిషయమై యోచించువారు మిక్కిలి యరుదు. కావున నీవంటి వారు వచ్చి బ్రహ్మజ్ఞానము కావలెనని యడుగు సమయము శుభమైనది; శ్రేయోదాయకమైనది. కనుక సంతసముతో నీకు బ్రహ్మమును దానికి సంబంధించినవాని నన్నింటిని జూపెదను.*"

ఇట్లని బాబా వానికి బ్రహ్మమును జూపుటకు మొదలిడెను. వాని నక్కడ కూర్చుండుమని ఏదో సంభాషణలోనికి దించెను. అప్పటి కాతడు తన ప్రశ్న తానే మరచునట్లు చేసెను. ఒక బాలుని బిలిచి నందుమార్వాడి వద్దకు బోయి 5 రూపాయలు చేబదులు తెమ్మనెను. కుఱ్ఱవాడు పోయి వెంటనే తిరిగి వచ్చి నందు ఇంటివద్ద లేడనియు వాని యింటి వాకిలికి తాళము వేసి యున్నదనియు చెప్పెను. కిరాణా దుకాణదారు బాలా వద్దకు పోయి యప్పు తెమ్మని బాబా యనెను. ఈ సారి కూడ కుఱ్ఱవాడు వట్టి చేతులతో తిరిగి వచ్చెను. ఇంతకిద్దరుముగ్గురి వద్దకు పోగా ఫలితము లేకపోయెను.

సాయిబాబా సాక్షాత్ పరబ్రహ్మావతారమేయని మనకు తెలియును. అయినచో 5 రూపాయలు అప్పు చేయవలసిన యవసరమేమి? వారికి అంత చిన్న మొత్తముతో నేమి పనియని ఎవరైన అడుగవచ్చును. వారికి ఆ డబ్బు అవసరమే లేదు. నందు మరియు బాలా యింటివద్ద లేరని వారికి తెలిసియే యుండును. ఇది యంతయు బ్రహ్మజ్ఞానము కోరి వచ్చినవాని కొర్కై జరిపించి యుందురు. ఆ పెద్ద మనిషి వద్ద నోటుల కట్ట యుండెను. అతనికి నిజముగా బాబా వద్దనుంచి బ్రహ్మజ్ఞానము కావలసి యున్నచో, బాబా యంత ప్రయాసపడుచున్నప్పు డతడూరకనే కూర్చుండడు. బాబా యా పైకమును తిరిగి యిచ్చి వేయునని కూడ వానికి తెలియును. అంత చిన్న మొత్తమయినప్పటికిని వాడు తెగించి యివ్వలేకపోయెను. అట్టివానికి బాబా వద్దనుంచి బ్రహ్మజ్ఞానము కావలెనట! నిజముగా బాబా యందు భక్తి ప్రేమలు కలవాడెవడైనను వెంటనే 5 రూపాయలు తీసి యిచ్చియుండునే కాని ప్రేక్షకునివలె ఊరకే చూచుచు కూర్చుని యుండడు. ఈ పెద్దమనిషి వైఖరి శుద్ధ విరుద్ధముగా నుండెను. వాడు డబ్బు ఇవ్వలేదు సరికదా బాబాను త్వరగా బ్రహ్మజ్ఞాన మివ్వుమని తొందరపెట్టుచుండెను. అప్పుడు బాబా యిట్లనెను: *"ఓ మిత్రుడా! నేను నడుపుచున్నదాని నంతటిని గ్రహించలేకుంటివా యేమి? ఇచ్చట కూర్చుండి నీవు బ్రహ్మమును జూచుటకై యిదంతయు జరుపుచున్నాను. సూక్ష్మముగా విషయ మిది. బ్రహ్మమును జూచుటకు 5 వస్తువులు సమర్పించవలెను. అవి యేవన: - 1. పంచ ప్రాణములు; 2. పంచేంద్రియములు; 3. మనస్సు; 4. బుద్ధి; 5. అహంకారము. బ్రహ్మజ్ఞానము*

లేదా యాత్మసాక్షాత్కారమునకు బోవు దారి చాల కఠినమయినది. అది కత్తివాదరవలె మిక్కిలి పదునైనది.

అట్లనుచు బాబా యీ విషయమునకు సంబంధించిన సంగతులన్నియు జెప్పెను. వానిని క్లుప్తముగా ఈ దిగువ పొందుపరచితిమి:

***బ్రహ్మజ్ఞానము లేదా ఆత్మసాక్షాత్కారమునకు యోగ్యత***

అందరును తమ జీవితములో బ్రహ్మమును జూడలేరు. దానికి కొంత యోగ్యత యవసరము.

*1. ముముక్షుత లేదా స్వేచ్ఛ నందుటకు తీవ్రమయిన కోరిక*

ఎవడయితే తాను బద్ధుడనని గ్రహించి బంధనములనుండి విడివడుటకు కృతనిశ్చయుడై శ్రమపడి ఇతరసుఖములను లక్ష్యపెట్టక దానిని పొందుటకై ప్రయత్నించునో వాడు ఆధ్యాత్మికజీవితమున కర్హుడు.

*2. విరక్తి లేదా ఇహపరసౌఖ్యములందు విసుగు చెందుట*

ఇహపరలోకములందు గల గౌరవములకు విషయములకు విసుగు జెందినగాని పారమార్థికరంగములో ప్రవేశించుటకు అర్హత లేదు.

*3. అంతర్ముఖత (లోనికి జూచుట)*

మన యింద్రియములు బాహ్యమును జూచుటకే భగవంతుడు సృజించియున్నాడు. కనుక మనుష్యుడెప్పుడును బయట నున్న వానిని చూచును. కాని ఆత్మసాక్షాత్కారము లేదా మోక్షమును కోరువాడు దృష్టిని లోపలకు పోనిచ్చి లోనున్న యాత్మ నేకధ్యానముతో జూడవలయును.

*4. పాపవిమోచన పొందుట*

మనుష్యుడు దుర్మార్గమార్గమునుండి బుద్ధిని మరలించనప్పుడు, తప్పులు చేయుట మాననప్పుడు, మనస్సును చలింపకుండ నిలబెట్టలేనప్పుడు జ్ఞానము ద్వారా కూడ ఆత్మసాక్షాత్కారమును పొందలేడు.

*5. సరియయిన నడవడి*

ఎల్లప్పుడు సత్యమును పలుకుచు, తపస్సు చేయుచు, లోన జూచుచు బ్రహ్మచారిగ నుండిన గాని ఆత్మసాక్షాత్కారము లభించదు.

*6. ప్రియమైనవాని కంటె శ్రేయస్కరమైనవానిని కోరుట*

లోకములో రెండు తీరుల వస్తువులున్నవి. ఒకటి మంచిది; రెండవది ప్రీతికరమయినది. మొదటిది వేదాంతవిషయములకు సంబంధించినది. రెండవది ప్రాపంచికవిషయములకు సంబంధించినది. ఈ రెండును మానవుని చేరును. వీనిలో నొకదానినే అతడెంచుకొనవలెను. తెలివిగలవాడు మొదటిదానిని అనగా శుభమైనదానిని కోరును. బుద్ధి తక్కువవాడు రెండవదానిని కోరును.

*7. మనస్సును ఇంద్రియములను స్వాధీనమందుంచుకొనుట*

శరీరము రథము; ఆత్మ దాని యజమాని; బుద్ధి ఆ రథమును నడుపు సారథి; మనస్సు కళ్ళెము; ఇంద్రియములు గుఱ్ఱములు; ఇంద్రియ విషయములు వాని మార్గములు. ఎవరికి గ్రహించు శక్తి లేదో, ఎవరి మనస్సు చంచలమయినదో, ఎవరి యింద్రియములు అస్వాధీనములో (బండి తోలువాని దుర్మార్గపు గుఱ్ఱముల వలె) వాడు గమ్యస్థానమును చేరలేడు. చావుపుట్టుకల చక్రములో పడిపోవును. ఎవరికి గ్రహించుశక్తి గలదో, ఎవరి మనస్సు స్వాధీనమందున్నదో, ఎవరి యింద్రియములు స్వాధీనమందుండునో (బండి నడుపువాని మంచి గుఱ్ఱమువలె) ఎవడు తన బుద్ధిని మార్గదర్శిగా గ్రహించి తన మనస్సును పగ్గముతో లాగి పట్టుకొనగలడో వాడు తన గమ్యస్థానమును చేరగలడు; విష్ణుపదమును చేరగలడు.

*8. మనస్సును పావనము చేయుట*

మానవుడు ప్రపంచములో తన విధులను తృప్తిగా, ఫలాపేక్ష లేకుండ నిర్వర్తించని యెడల నతని మనస్సు పావనము కాదు. మనస్సు పావనము కానిదే యతడు యాత్మసాక్షాత్కారము పొందలేడు. పావనమైన మనస్సులోనే వివేకము (అనగా సత్యమైనదానిని యసత్యమైన దానిని కనుగొనుట) వైరాగ్యము (అసత్యమైన దానియందభిమానము లేకుండుట) మొలకలెత్తి క్రమముగా ఆత్మసాక్షాత్కారమునకు దారితీయును. అహంకారము రాలిపోనిదే, లోభము నశించనిదే, మనస్సు కోరికలను విడచిపెట్టనిదే, ఆత్మసాక్షాత్కారమున కవకాశము లేదు. దేహమే 'నేన' నుకొనుట గొప్ప భ్రమ. ఈ యభిప్రాయమందభిమాన ముండుటయే బంధమునకు కారణము. నీవాత్మసాక్షాత్కారమును కాంక్షించినచో యీ యభిమానమును విడువవలెను.

*9. గురువుయొక్క యావశ్యకత*

ఆత్మజ్ఞానము మిక్కిలి సూక్ష్మము గూఢమునైనది. ఎవ్వరైనను తమ స్వశక్తిచే దానిని పొందుట కాశించలేరు. కనుక ఆత్మసాక్షాత్కారము పొందిన యింకొకరి (గురువు) సహాయము మిక్కలి యవసరము. గొప్ప కృషి చేసి, శ్రమించి ఇతరు లివ్వలేనిదాని నతిసులభముగా గురువునుండి పొందవచ్చును. వారా మార్గమందు నడచియున్నవారు కావున శిష్యుని సులభముగా ఆధ్యాత్మిక ప్రగతిలో క్రమముగా ఒక మెట్టు మీదనుంచి యింకొక పై మెట్టునకు తీసికొని పోగలరు.

*10. భగవంతుని కటాక్షము*

ఇది యన్నిటికంటె మిక్కిలి యవసరమైనది. భగవంతుడు తన కృపకు పాత్రులైనవారికి వివేకమును వైరాగ్యమును కలుగజేసి సురక్షితముగా భవసాగరమునుండి తరింపజేయగలడు. "వేదము లభ్యసించుటవల్ల గాని మేధాశక్తి వల్లగాని పుస్తక జ్ఞానమువల్ల గాని యాత్మానుభూతి పొందలేరు. ఆత్మ యెవరిని వరించునో వారే దానిని పొందగలరు. అట్టివారికే యాత్మ తన స్వరూపమును తెలియజేయు"నని కఠోపనిషత్తు చెప్పుచున్నది.

ఈ ప్రసంగము ముగిసిన పిమ్మట బాబా యా పెద్దమనుష్యుని వైపు తిరిగి "అయ్యా! నీ జేబులో బ్రహ్మము యాబదింతలు 5 రూపాయల నోట్ల రూపముతో (250) నున్నది. దయచేసి దానిని బయటకు దీయుము" అనెను. ఆ పెద్ద మనుష్యుడు తన జేబునుంచి నోట్లకట్టను బయటకు దీసెను. లెక్కపెట్టగా సరిగా 25 పదిరూపాయల నోట్లుండెను. అందరు మిక్కిలి యాశ్చర్యపడిరి. బాబా సర్వజ్ఞతను జూచి వాని మనస్సు కరగెను. బాబా పాదములపైబడి వారి యాశీర్వాదమునకై వేడెను. అప్పుడు బాబా యిట్లనెను. "నీ బ్రహ్మపు నోటులకట్టలను చుట్టిపెట్టుము. నీ పేరాసను, లోభమును పూర్తిగా వదలనంతవరకు నీవు నిజమైన బ్రహ్మమును చూడలేవు. ఎవరి మనస్సు ధనమందు సంతానమందు ఐశ్వర్యమందు లగ్నమైయున్నదో, వాడా యభిమానమును పోగొట్టుకొననంతవరకు బ్రహ్మము నెట్లు పొందగలడు? అభిమానమనే భ్రమ, ధనమందు తృష్ణ, దుఃఖమను సుడిగుండము వంటిది. అది యసూయ యహంభావమను మొసళ్ళతో నిండియున్నది. ఎవడు

కోరికలు లేనివాడో వాడు మాత్రమే ఈ సుడిగుండమును దాటగలడు. పేరాసయు బ్రహ్మజ్ఞానమును ఉత్తర దక్షిణ ధ్రువముల వంటివి. అవి శాశ్వతముగా ఒకటికొకటి బద్ధవైరము గలవి.

ఎక్కడ పేరాస గలదో యక్కడ బ్రహ్మము గూర్చి యాలోచించుటకు గాని, దాని ధ్యానమునకు గాని తావులేదు. అట్లయినచో పేరాసగలవాడు విరక్తిని, మోక్షమును ఎట్లు సంపాదించగలడు? లోభికి శాంతిగాని సంతుష్టిగాని, దృఢ నిశ్చయముగాని యుండవు. మనస్సునందేమాత్రము పేరాసయున్నను సాధనలన్నియు (అధ్యాత్మిక ప్రయత్నములు) నిష్ప్రయోజనములు.

ఎవడు ఫలాపేక్షరహితుడు కాడో, ఎవడు ఫలాపేక్ష కాంక్షను విడువడో, ఎవనికి వానియందు విరక్తి లేదో యట్టివాడు గొప్ప చదువరియైనప్పటికి వాని జ్ఞానమెందుకు పనికిరానిది. ఆత్మసాక్షాత్కారము పొందుట కిది వానికి సహాయపడదు. ఎవరహంకారపూరితులో, ఎవరింద్రియవిషయములగూర్చి యెల్లప్పుడు చింతించెదరో, వారికి గురుబోధలు నిష్ప్రయోజనములు. మనస్సును పవిత్రమొనర్చుట తప్పనిసరి యవసరము. అది లేనిచో మన ఆధ్యాత్మిక ప్రయత్నములన్నియు ఆడంబరము డాంబికము కొరకు చేసినట్లగును. కావున దేనిని జీర్ణించుకొనగలడో దేనిని శరీరమునకు పట్టించుకొనగలడో దానినే వాడు తీసుకొనవలెను. నా ఖజానా నిండుగా నున్నది. ఎవరికేది కావలసిన దానిని వారికివ్వగలను. కాని వానికి పుచ్చుకొను యోగ్యత గలదా లేదా? యని నేను మొదట పరీక్షించవలెను. నేను చెప్పినదానిని జాగ్రత్తగా విన్నచో నీవు తప్పక మేలు పొందెదవు. ఈ మసీదులో కూర్చొని నేనెప్పుడు అసత్యములు పలుకను!"

ఒక యతిథిని ఇంటికి బిలిచినప్పుడు, ఇంటిలోనివారు, అక్కడున్నవారు, స్నేహితులు, బంధువులు గూడ అతిథితో పాటు విందులో పాల్గొందురు. కావున నప్పుడు మసీదులో నున్నవారందరు బాబా ఆ పెద్దమనుష్యునకు చేసిన యీ ఆధ్యాత్మిక విందులో పాల్గొనిరి. బాబా యాశీర్వాదములను పొందిన పిమ్మట అచ్చట నున్నవారందరును, ఆ పెద్దమనిషితో సహా, మిక్కిలి సంతోషముతో సంతుష్టి చెందినవారై వెళ్ళిపోయిరి.

**బాబావారి వైశిష్ట్యము**

అనేకమంది సన్యాసులు ఇండ్లు విడచి యడవులలోని గుహలలోను, ఆశ్రమములలోను, నొంటరిగా నుండి జన్మరాహిత్యమునుగాని, మోక్షమునుగాని సంపాదించుటకు ప్రయత్నించెదరు. వారితరులగూర్చి యాలోచించక ఆత్మానుసంధానమందే మునిగి యుందురు. సాయిబాబా అట్టివారు కారు. బాబాకు ఇల్లుగాని, భార్యగాని, సంతానముగాని, బంధువులుగాని లేరు. అయినప్పటికి వారు సమాజములోనే యుండెడివారు. బాబా నాలుగయిందిండ్ల నుండి భిక్షచేసి, ఎల్లప్పుడు వేపచెట్టు క్రిందనే కూర్చొనెడువారు. లౌకిక విషయములందు మగ్నులైన జనులకు, ఈ ప్రపంచములో నెట్లు ప్రవర్తించవలయునో బోధించెడువారు. ఆత్మసాక్షాత్కారము పొందిన పిమ్మట గూడ ప్రజల క్షేమమునకై పాటుపడు సాధువులు, యోగులు మిక్కిలి యరుదు. అట్టివారిలో శ్రీసాయిబాబా ప్రథమగణ్యులు.

కనుక హేమాడ్‌పంతు ఇట్లు చెప్పెను. "ఏ దేశమునందు సాయిబాబా యను యీ అపూర్వము అమూల్యము యైన పవిత్రరత్నము పుట్టినదో యా దేశము ధన్యము! ఏ కుటుంబములో వీరు పుట్టిరో యదియు ధన్యము! ఏ తల్లిదండ్రులకు వీరు పుట్టిరో వారును ధన్యులు!"

16, 17 అధ్యాయములు
సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## 18, 19 అధ్యాయములు

*హేమాడ్‌పంతును బాబా ఎట్లు ఆమోదించి యాశీర్వదించెను? సాఠేగారి కథ; దేశముఖ్‌గారి భార్యకథ; సద్విచారములను ప్రోత్సహించి సాక్షాత్కారమునకు దారి జూపుట; ఉపదేశములో వైవిధ్యము; నిందగూర్చి బోధ; కష్టమునకు కూలి.*

గత రెండు అధ్యాయములలో బ్రహ్మజ్ఞానము నభిలషించు ఒక ధనికుని బాబా యెట్లు ఆదరించెనో హేమాడ్‌పంత్ వర్ణించెను. రాబోవు రెండు అధ్యాయములలో హేమాడ్‌పంత్‌ను బాబా యెట్లు ఆమోదించి యాశీర్వదించెనో, బాబా యెట్లు తమ భక్తులలో మంచి యాలోచనలు ప్రేరేపించి మోక్షమునకు మార్గము చూపుచుండెనో, ఆత్మోన్నతి గూర్చి, పరనిందా వాక్యముల గూర్చి, ఇతరుల కష్టమునకు ఇవ్వవలసిన ప్రతిఫలమును గూర్చి, బాబా వారి ప్రబోధములెట్టివో వర్ణింతుము.

### ప్రస్తావనము

సద్గురువు మొట్టమొదట తన శిష్యుల యోగ్యతను గనిపెట్టి, వారి మనస్సు కలత చెందకుండ తగిన బోధచేసి, తుదకు వారి లక్ష్యమైన ఆత్మ సాక్షాత్కారమునకు దారి చూపునను విషయమందరికి తెలిసినదే. ఈ విషయములో సద్గురువు బోధించిన దాని నితరులకు వెల్లడి చేయరాదని కొందరనెదరు. అట్లు గురువు బోధించినదానిని వెల్లడి చేసినచో ఆ బోధలు నిష్ప్రయోజనములగునని వారి యాలోచన. ఇది సరియైనది కాదు. సద్గురువు

వర్షాకాలపు మేఘమువంటివారు. వారు తమ యమృతతుల్యములైన బోధలను పుష్కలముగా విశాలప్రదేశములందు కురిపించెదరు. వానిని మనమనుభవించి హృదయమునకు తృప్తికరముగా జీర్ణించుకొని, పిమ్మట నిస్సంకోచముగా ఇతరుల మేలుకొరకు వెల్లడి చేయవలెను. ఇది వారు మన జాగ్రదవస్థలోనే గాక స్వప్నావస్థలో కూడ తెలియజేయు విషయములకు వర్తించును. తన స్వప్నమందు గనిన 'రామరక్షా స్తోత్రము'ను బుధకౌశికఋషి ప్రచురించిన యుదాహరణము నిచ్చట స్మరించవలెను.

ప్రేమగల తల్లి, గుణమిచ్చు చేదైన యౌషధములను బిడ్డ మేలుకొరకే బలవంతముగా గొంతులోనికి త్రోయునట్లు, ఆధ్యాత్మికవిషయములను బాబా తన భక్తులకు బోధించువారు. వారి మార్గము రహస్యమైనది కాదు. అది బహిరంగమైనది. వారి బోధల ననుసరించిన భక్తుల ధ్యేయము నెరవేరెడిది. సాయిబాబా వంటి సద్గురువులు మన జ్ఞాననేత్రములను తెరిపించి యాత్మయొక్క దైవీసౌందర్యములను జూపి మన కోరికలను నెరవేర్చెదరు. ఇది జరిగిన పిమ్మట, మన ఇంద్రియవిషయవాంఛలు నిష్క్రమించి, వివేకవైరాగ్యములను జంటఫలములు చేతికి వచ్చును. నిద్రలో కూడ ఆత్మజ్ఞానము మొలకెత్తును. సద్గురువుల సహవాసము చేసి, వారిని సేవించి వారి ప్రేమను పొందినచో నిదంతయు మనకు లభించును. భక్తుల కోరికలు నెరవేర్చు భగవంతుడు మనకు తోడ్పడి, మన కష్టములను బాధలను తొలగించి, మనలను సంతోషపెట్టును. ఈ యభివృద్ధి పూర్తిగా సద్గురుని సహాయమువలననే జరుగును. సద్గురువును భగవంతునివలె కొలువవలెను. కాబట్టి మనము సద్గురువును వెదకవలెను. వారి కథలను వినవలెను. వారి పాదములకు సాష్టాంగ నమస్కారము చేసి వారి సేవ చేయవలెను. ఇక ఈ యధ్యాయములోని ముఖ్యకథను ప్రారంభించెదము.

**సాఠే**

సాఠే యనునతడు ఒకప్పుడు మిక్కిలి పలుకుబడి కలిగియుండెను. కాలాంతరమున వ్యాపారములో చాల నష్టము పొందెను. అంతేగాక మరికొన్ని సమస్య లతనిని చీకాకు పరచెను. అందుచే నతడు విచారగ్రస్తుడయ్యెను. విరక్తి చెందెను. మనస్సు చెడి చంచలమగుటచే నిల్లు విడిచి చాల దూరము

పోవలెననుకొనెను. మానవుడు సాధారణముగా భగవంతుని గూర్చి చింతించడుగాని, కష్టములు, నష్టములు, దుఃఖములు చుట్టుకొనినప్పుడు భగవంతుని ధ్యానము చేసి విముక్తి పొందుటకు ప్రార్థించును. వాని పాపకర్మలు ముగియువేళకు భగవంతుడు వానికొక యోగీశ్వరునితో కలిసికొనుట సంభవింపజేయును. వారు తగిన సలహానిచ్చి వాని క్షేమమును జూచెదరు. సాఠేగారికి కూడ అట్టి యనుభవము కలిగెను. అతని స్నేహితులు శిరిడీకి వెళ్ళుమని సలహా ఇచ్చిరి. అచ్చట సాయిబాబాను దర్శించి యనేకమంది శాంతి పొందుచుండిరి. వారి కోరికలు గూడ నెరవేరుచుండెను. సాఠేగారికి ఇది నచ్చెను. వెంటనే 1917వ సంవత్సరములో శిరిడీకి వచ్చెను. అచ్చట శాశ్వతబ్రహ్మవలె స్వయంప్రకాశుడై, నిర్మలుడు, శుద్ధస్వరూపుడునగు సాయిబాబాను చూచిన వెంటనే యతనికి మనశ్చాంచల్యము తగ్గిపోయి శాంతి కలిగెను. వాని పూర్వజన్మపుణ్యమువలన బాబా యొక్క పవిత్రమయిన పాదసేవ లభించెను. అతడు గొప్ప మనోబలము గలవాడగుటచే వెంటనే గురుచరిత్రము పారాయణము మొదలు పెట్టెను. 7 రోజులలో చరిత్ర చదువుట పూర్తి కాగానే బాబా యానాడు రాత్రి అతనికొక దృష్టాంతమును చూపెను. అది యిట్లుండెను:

బాబా గురుచరిత్రము చేతిలో బట్టుకొని దానిలోని విషయములను ఎదుట కూర్చున్న సాఠేకు బోధించుచున్నట్లు, అతడు దానిని శ్రద్ధగా వినుచున్నట్లు జూపెను. సాఠే నిద్రనుంచి లేచిన వెంటనే కలను జ్ఞాపకముంచుకొనెను. మిగుల సంతసించెను. అజ్ఞానమనే నిద్రలో గుఱ్ఱుపెట్టి నిద్రపోవుచున్న తనవంటివారిని లేపి, గురుచరితామృతమును రుచి చూపుట బాబా యొక్క దయార్ద్రహృదయమె గదా యనుకొనెను. ఆ మరుసటిదిన మాదృశ్యమును కాకాసాహెబు దీక్షితుకు తెలియజేసి దాని భావమేమయి యుండునో సాయిబాబా నడిగి తెలిసికొనుమనెను. ఒక సప్తాహము చాలునో లేక యింకొక సప్తాహము పారాయణము చేయవలెనో కనుగొనమనెను. కాకాసాహెబు సమయము చూచి బాబాను ఇట్లడిగెను, "ఓ దేవా! యీ దృశ్యమువలన సాఠేకు ఏమని చెప్ప నిశ్చయించితివి? అతడూరకొనవలెనా లేక యింకొక సప్తాహము పారాయణము చేయవలెనా? అతడు అమాయిక

భక్తుడు: అతని కోరిక నెరవేరవలెను. అతనికి దృష్టాంతార్థమును బోధించవలెను. వాని నాశీర్వదింపు"డన బాబా, "అతడు గురుచరిత్ర మింకొక సప్తాహము పారాయణ చేయవలెను. ఆ గ్రంథమునే జాగ్రత్తగా పఠించినచో నాతడు పావనుడగును: మేలు పొందగలడు. భగవంతుడు ప్రీతి చెంది వానిని ప్రపంచబంధముల నుండి తప్పించును!" అనెను.

ఆ సమయమున హేమాడ్‌పంతు అచ్చట నుండి, బాబా కాళ్ళ నొత్తుచుండెను. బాబా పలుకులు విని యతడు తన మనస్సులో నిట్లనుకొనెను: "సాఠే యొక్క వారమే పారాయణ చేసి ఫలితమును పొందెనా! నేను నలుబది సంవత్సరములనుంచి పారాయణ చేయుచున్నాను గాని నాకు ఫలితము లేదు గదా! అతడిక్కడ 7 దినములు మాత్రమే నివసించెను. నేనో 7 సంవత్సరములనుంచి యున్నాను. నా ప్రయత్నములు నిష్ఫలమా యేమి? చాతకపక్షి మేఘమునుంచి పడు నీటి బిందువుకై కనిపెట్టుకొని యున్నట్లు, నేను కూడ బాబా తమ దయామృతమును నాపై వర్షించెదరని, వారి బోధనలచే నన్ను ఆశీర్వదించెదరని కనిపెట్టుకొని యున్నాను." ఈ యాలోచన వాని మనస్సులో మెదలిన వెంటనే బాబా దానిని గ్రహించెను. భక్తుల మనస్సులలో నుండెడి యాలోచనలన్నియు బాబా గ్రహించెడివారు. అంతియేగాక, చెడ్డ యాలోచనలను అణచుచు, మంచి యాలోచనలను ప్రోత్సహించువారు. హేమాడ్‌పంతు మనస్సును గనిపెట్టి బాబా వానిని వెంటనే లేపి, శ్యామావద్దకు పోయి అతనివద్ద 15 రూపాయలు దక్షిణ తీసికొని, అతనితో కొంతసేపు మాట్లాడిన పిమ్మట రమ్మనెను. బాబా మనస్సున కారుణ్యోదయ మయ్యెను. కాన వారిట్లాజ్ఞాపించిరి. బాబా యాజ్ఞను జవదాటగల వారెవరు?

హేమాడ్‌పంతు వెంటనే మసీదు విడచి శ్యామా గృహమునకు పోయెను. అప్పుడే యతడు స్నానము చేసి ధోవతి కట్టుకొనుచుండెను. అతడు బయటకు వచ్చి హేమాడ్‌పంతు నిట్లడిగెను: "మధ్యాహ్న హారతి సమయమందు మీరిక్కడ ఏల యున్నారు? మీరు మసీదునుండి వచ్చుచున్నట్లున్నదే! మీరేల చీకాకుతో చంచలముగా నున్నారు? మీరొంటరిగా వచ్చినారేల? కొంతసేపు కూర్చొని విశ్రాంతి చెందుడు. నా పూజను ముగించి వచ్చెదను. ఈ లోగా తాంబూలము వేసికొనుడు. పిమ్మట ఆనందముగా కొంతసేపు కూర్చొని మాట్లాడుకొనెదము!"

ఇట్లనుచు నతడు లోపలికి పోయెను. హేమాడ్‌పంతు ముందర వసారాలో కూర్చొనెను. కిటికీలో ఏకనాథభాగవత మను ప్రసిద్ధ మరాఠీ గ్రంథముండెను. ఇది భాగవతములోని యేకాదశస్కంధమునకు ఏకనాథుడు వ్రాసిన వ్యాఖ్యానము. సాయిబాబా సిఫారసు చేయుటచే బాపూసాహెబు దీక్షితు (శ్రీకృష్ణునకు అర్జునునకు జరిగిన సంభాషణారూపమైన) భగవద్గీత, దాని మరాఠీ వ్యాఖ్యానమైన భావార్థదీపిక (జ్ఞానేశ్వరి), (శ్రీకృష్ణునకు అతని సేవకుడగు ఉద్ధవునకు జరిగిన సంభాషణారూపమైన) ఏకనాథభాగవతము, మరియు భావార్థ రామాయణమును నిత్యము శిరిడీలో చదువు చుండెడివాడు. భక్తులు వచ్చి బాబాను యేదైన ప్రశ్నలు వేసినప్పుడు బాబా కొంతవరకు జవాబిచ్చి, అటుపైన వారిని ఆ గ్రంథముల పారాయణమును వినుమని పంపుచుండెను. ఈ గ్రంథములే భాగవతధర్మములోని ముఖ్యగ్రంథములు. భక్తులు బాబా ఆజ్ఞానుసారము ఆ సత్సంగములకు పోయి, ఆ గ్రంథములు వినునప్పుడు వారి ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానములు లభించు చుండెను. హేమాడ్‌పంతు కూడ నిత్యము ఏకనాథభాగవతమును పారాయణము చేయువాడు.

హేమాడ్‌పంత్ ఆ దినము తాను నిత్యము చదువు గ్రంథభాగము పూర్తిచేయకయే కొందరు భక్తులతో కలసి మసీదుకు పోయెను. శ్యామా ఇంటి కిటికీలో నున్న ఏకనాథభాగవతము తీయగా తానానాడు పూర్తిచేయని భాగము వద్దనే పుస్తకము తెరుచుకొనెను. తన నిత్యపారాయణము పూర్తిచేయుటకే కాబోలు బాబా తననచ్చటకు పంపెనని హేమాడ్‌పంత్ యనుకొనెను. వెంటనే తన నిత్యపారాయణమును పూర్తి చేసెను. పిమ్మట శ్యామా తన పూజను ముగించి బయటకు వచ్చెను. వారిరువురికి ఈ దిగువ సంభాషణ జరిగెను.

హేమాడ్‌పంతు: నేను బాబా వద్దనుండి యొక కబురు తీసికొని వచ్చినాను. బాబా నీ వద్దనుండి 15 రూపాయలు దక్షిణ తీసికొని రమ్మని నన్ను ఆజ్ఞాపించి యున్నారు. అంతేకాదు, కొంతసేపు నీతో కూర్చొని మాట్లాడిన పిమ్మట మసీదుకు రమ్మని చెప్పిరి.

శ్యామా: (ఆశ్చర్యముతో) నావద్ద డబ్బులేదు. నా 15 సాష్టాంగ నమస్కారములు పైకమునకు బదులుగా బాబాకు సమర్పింపుము.

హేమాడ్‌పంతు: సరే నీ నమస్కారము లామోదింపబడెను. మనము కూర్చొని కొంతసేపు మాట్లాడుకొనెదము. మన పాపములను నశింపజేయునట్టి బాబా లీలలను, కథలను చెప్పుము.

శ్యామా: అయితే కొంతసేపు కూర్చొనుము. ఈ దేవుని (బాబా) లీలలు మిక్కిలి యాశ్చర్యకరమైనవని నీకిదివరకే తెలియును. నేను పల్లెటూరి వాడను; నీవా చదువుకొన్న పట్టణవాసివి. నీవిక్కడకు వచ్చిన తరువాత కొన్ని లీలలను చూచియే యుందువు. వానిని నీ ముందు నేనెట్లు వర్ణించగలను? సరే యీ తమలపాకులు వక్క సున్నము తీసికొని తాంబూలము వేసికొనుము. నేను లోపలకు బోయి దుస్తులు ధరించి వచ్చెదను.

కొద్ది నిమిషములలో శ్యామా బయటికి వచ్చి హేమాండ్‌పంతుతో మాట్లాడుచు కూర్చొనెను. అతడిట్లనియెను: "ఈ దేవుని (బాబా) లీల కనుగొన శక్యము కానిది. వారి లీలల కంతులేదు. వాని నెవరు గమనించగలరు? వారీ లీలలతో వినోదించు నట్లగుపడినను వారు వాని నంటినట్లు కాన్పించరు. మావంటి జానపదుల కేమి తెలియును? బాబాయే యీ కథల నెందుకు చెప్పరాదు? మీవంటి పండితులను నావంటి పామరునివద్ద కేల పంపుచున్నారు? వారి మార్గములు ఊహింపరానివి. అవి మానవుల చేష్టలు కావనిచెప్పగలను." ఈ యుపోద్ఘాతముతో శ్యామా యిట్లనెను: "నాకొక కథ జ్ఞాపకమునకు వచ్చుచున్నది. అది నీకు చెప్పెదను. నాకది స్వయముగా తెలియును. భక్తుడెంత మనోనిశ్చయముతో పట్టుదలతో నుండునో, బాబా యంత త్వరగా వానికి సహాయపడును. ఒక్కొక్కప్పుడు బాబా భక్తులను కఠిన పరీక్షచేసిన పిమ్మట వారికి ఉపదేశము నిచ్చును." (ఇచ్చట ఉపదేశమనగా నిర్దేశము).

ఉపదేశమనుమాట విన్నతోడనే హేమాడ్‌పంత్ మనస్సులో నొక స్మృతి తళుక్కుమనెను. వెంటనే సాఠేగారి గురుచరిత్ర పారాయణము జ్ఞప్తికి వచ్చెను. తన మనస్సునకు శాంతి కలిగించు నిమిత్తము బాబా తన నచ్చటకు పంపియుండుననుకొనెను. అయినప్పటికి ఈ భావము నణచుకొని, శ్యామా చెప్పు కథలను వినుటకు సిద్ధపడెను. ఆ కథలన్నియు బాబాకు తన

భక్తులందెట్టి దయాదాక్షిణ్యములు గలవో తెలుపును. వానిని వినగా హేమాడ్‌పంతుకు ఒక విధమైన సంతోషము కలిగెను. శ్యామా ఈ దిగువ కథను చెప్పదొడంగెను.

**శ్రీమతి రాధాబాయి దేశ్‌ముఖ్**

రాధాబాయి యను యొక ముసలమ్మ యుండెను. ఆమె ఖాశాబా దేశ్‌ముఖ్‌గారి తల్లి. బాబా ప్రఖ్యాతి విని ఆమె సంగమనేరు గ్రామప్రజలతో కలసి శిరిడీకి వచ్చెను. బాబాను దర్శించి మిక్కిలి తృప్తిచెందెను. ఆమె బాబాను గాఢముగా ప్రేమించెను. బాబాను తన గురువుగా చేసికొని యేదైన యుపదేశమును పొందవలెనని మనోనిశ్చయము చేసికొనెను. ఆమె కింకేమియు తెలియకుండెను. బాబా యామె సంకల్పమును ఆమోదించక తనకు మంత్రోపదేశము చేయనిచో నుపవాసముండి చచ్చెదనని మనోనిశ్చయము చేసికొనెను. ఆమె తన బసలోనే యుండి భోజనము, నీరు మానివేసెను. అట్లు మూడు రోజులు గడిచెను. ఆమె పట్టుదలకు నేను (శ్యామా) భయపడి యామె పక్షమున బాబాతో నిట్లంటిని. *"దేవా! మీరేమి ప్రారంభించితిరి? నీ వనేకమంది నిచ్చటకు ఈడ్చెదవు. ఆ ముదుసలిని నీవెరిగియే యుందువు. ఆమె మిక్కిలి పట్టుదల గలది. ఆమె నీపైన ఆధారపడియున్నది. ఆమె చచ్చువరకు ఉపవసింప నిశ్చయించుకొని యున్నది. నీవు ఆమె ననుగ్రహించి ఉపదేశమిచ్చునంతవర కామె తన నిరాహారదీక్షను మానదు. ఆమె కేమైన హాని జరిగినచో ప్రజలు నిన్నే నిందించెదరు. నీవు తగిన ఆదేశ మివ్వకపోవుటచే ఆమె చచ్చినదని లోకులనెదరు. కాబట్టి యామెను కరుణించుము, ఆశీర్వదించుము, ఆమెకు తగిన దారి చూపుము!"* ఆమె మనోనిశ్చయమును జూచి, బాబా యామెను బిలిపించి, ఈ క్రింది విధముగా బోధించెను:

*"ఓ తల్లీ! అనవసరమైన యాతన కేల పాల్పడి చావును కోరుచున్నావు? నీవు నిజముగా నా తల్లివి; నేను నీ బిడ్డను. నాయందు కనికరించి నేను చెప్పునది పూర్తిగా వినుము! నీకు నా వృత్తాంతమును చెప్పెదను. నీవు దానిని బాగా వినినచో నీకది మేలు చేయును. నాకొక గురువుండెను. వారు గొప్ప యోగీశ్వరులు; మిక్కిలి*

దయార్ద్రహృదయులు. వారికి చాల కాలము శుశ్రూష చేసితిని. కాని నా చెవిలో వారేమంత్రము నూదలేదు. నాకు వారిని వదలిపోవ తలంపే లేకుండెను. నేను వారితోనే యుండుటకు, వారి సేవ చేయుటకు, వారి వద్ద కొన్ని ఉపదేశములను గ్రహించుటకు నిశ్చయించుకొంటిని. కాని వారి మార్గము వారిది. వారు నా తల గొరిగించిరి; నానుండి రెండు పైసలు దక్షిణ యడిగిరి. నేను దానిని వెంటనే వారికి సమర్పించితిని. 'మీ గురువుగారు పూర్ణకాములయినచో వారు మిమ్ములను దక్షిణ యడుగనేల? వారు నిష్కాములని యెట్లనిపించుకొందురు?' అని నీవడుగవచ్చును. దానికి సమాధానము సూటిగా చెప్పగలను. వారు డబ్బును లక్ష్యపెట్టేవారు కారు. ధనముతో వారు చేయున దేమున్నది? వారు కోరిన రెండు కాసులలో ఒకటి నిష్ఠ, రెండవది సంతోష స్థైర్యములతో గూడిన ఓరిమి! నేనీ రెంటినీ వారి కర్పించితిని. వారు ప్రసన్నులైరి.

"నా గురువును అట్లు 12 సంవత్సరములు సేవించితిని. వారే నన్ను పెంచిపోషించిరి. భోజనమునకు గాని వస్త్రములకుగాని నాకు లోటు లేకుండెను. వారు పరిపూర్ణులు. వారు ప్రేమావతారమని చెప్పవచ్చును. ఆ ప్రేమను నేనెట్లు వర్ణించగలను? వారు నన్ను మిక్కిలి ప్రేమించెడివారు. ఆ విధమైన గురువే యుండరు. నిరంతర ధ్యానములో నున్న వారిని తదేకముగ జూచుచుండెడి వాడను. మేమిద్దర మానందములో మునిగెడివారము. రాత్రింబవళ్ళు నిద్రాహారములు లేక నేను వారివైపు దృష్టి నిగిడ్చితిని. వారిని చూడనిచో నాకు శాంతి లేకుండెను. వారి ధ్యానము వారి సేవ తప్ప నాకింకొటి లేకుండెను. వారే నాయాశ్రయము. నా మనస్సు ఎల్లప్పుడు వారియందే నాటుకొని యుండెడిది. ఇదియే వారడిగిన దక్షిణలో ఒక పైస. 'సబూరి' (సంతోష స్థైర్యములతో గూడిన ఓరిమి) యనునది రెండవ పైసా. నేను మిక్కిలి సంతోషముతో చాలకాలము కనిపెట్టుకొని వారి సేవ చేసితిని. ఈ ప్రపంచమనే సాగరమును 'సబూరి' యను ఓడ నిన్ను సురక్షితముగా దాటించును. సబూరి యనునది అత్యంత ఉత్తమ లక్షణము. అది

పాపములన్నిటిని తొలగించును; కష్టములను పారద్రోలును. అనేకవిధముల అవాంతరములను తొలగించి, భయమును పారద్రోలును. తుదకు జయమును కలుగజేయును. సబూరి యనునది సుగుణములకు గని, మంచి యాలోచనకు తోడువంటిది. నిష్ఠ, సబూరి అనునవి అన్యోన్యమైన అక్కచెల్లెండ్ర వంటివి.

"నా గురువు నానుండి యితరమేమియు ఆశించియుండలేదు. వారు నన్ను ఉపేక్షింపక సర్వకాలసర్వావస్థలయందు కాపాడుచుండెడివారు. నేను వారితో కలసి యుండెడివాడను. ఒక్కొక్కప్పుడు వారిని విడిచి యుండినను, వారి ప్రేమకు ఎన్నడును లోటు కలుగలేదు. వారు తమ దృష్టి చేతనే నన్ను కాపాడుచుండెడివారు. తాబేలు తన పిల్లలను కేవలము తన దృష్టితో పెంచునట్లు, నన్ను గూడ మా గురువు తమ దృష్టితో పోషించుచుండెడివారు. తల్లితాబేలు ఒక ఒడ్డున నుండును. బిడ్డతాబేలు రెండవ యొడ్డున ఉండును. తల్లితాబేలు, పిల్లతాబేలుకు ఆహారము పెట్టుటగాని పాలిచ్చుటగాని చేయదు. తల్లి తన పిల్లలపై తన దృష్టిని పోనిచ్చును. పిల్లలెదిగి పెద్దవి యగును. అటులనే మా గురువు కూడా తమ దృష్టిని నాయందు నిల్పి, నన్ను ప్రేమతో గాపాడిరి. ఓ తల్లీ! నా గురువు నాకు మంత్ర మేమియు నుపదేశించలేదు. అటువంటపుడు నేను నీ చెవిలో మంత్రమెట్లు ఊదగలను? గురువుయొక్క ప్రేమమయమయిన తాబేలు చూపే మనకు సంతోషము నిచ్చునని జ్ఞాపక ముంచుకొనుము. మంత్రముగాని యుపదేశముగాని యెవ్వరివద్దనుండిగాని పొందుటకు ప్రయత్నించకుము. నీ యాలోచనలు, నీవు చేయు పనులు నాకొరకే వినియోగించుము. నీవు తప్పక పరమార్థమును పొందెదవు. నావైపు సంపూర్ణహృదయముతో చూడుము. నేను నీవైపు అట్లనే చూచెదను. ఈ మసీదులో కూర్చొని నేను నిజమునే చెప్పెదను. నిజము తప్ప మరేమియు మాట్లాడను. ఏ సాధనలుగాని యారు శాస్త్రములలో

ప్రావీణ్యముగాని యవసరము లేదు. నీ గురువునందు ప్రేమ విశ్వాసముల నుంచుము. గురువే సర్వమును చేయువాడనియు, కర్తయనియు పూర్తిగా నమ్ముము. ఎవరయితే గురువు యొక్క మహిమను, గొప్పదనమును గ్రహించెదరో, ఎవరయితే గురుని బ్రహ్మవిష్ణుమహేశ్వర స్వరూపుడని యెంచెదరో వారే ధన్యులు!"

ఈ ప్రకారముగా ఉపదేశించి బాబా యా ముసలమ్మను ఒప్పించెను. ఆమె బాబాకు సమస్కరించి యుపవాసమును వదలుకొనెను.

ఈ కథను జాగ్రత్తగాను, శ్రద్ధగాను విని దాని ప్రాముఖ్యమును, సందర్భమును గుర్తించి, హేమాడ్‌పంతు మిక్కిలి యాశ్చర్యపడెను. ఈ యాశ్చర్యకరమైన బాబా లీలను జూచి అతని యాపాదమస్తకము పులకరించెను. సంతోషముతో నుప్పొంగెను. గొంతుక యారిపోయెను. ఒక్క మాటైన మాట్లాడుటకు చేత కాకుండెను. శ్యామా అతని నీ స్థితిలో జూచి "ఏమి జరిగినది? ఏల యూరకున్నావు? అట్టి బాబా లీలలు నీకెన్ని వర్ణింపవలెను?" అని అడిగెను.

అదే సమయమందు మసీదులో గంట మ్రోగెను. మధ్యాహ్నహారతి పూజ ప్రారంభమయ్యెనని గ్రహించిరి. కనుక శ్యామా, హేమాడ్‌పంతులిద్దరూ మసీదుకు త్వరగా పోయిరి. బాపూసాహెబు జోగు అప్పుడే హారతి ప్రారంభించెను. స్త్రీలు మసీదు నిండిరి. దిగువ ఖాళీ జాగాలో పురుషులు నిండిరి. అందరు బాజా భజంత్రీలతో నొకే వరుసతో హారతి పాడుచుండిరి. బాబాకు కుడివైపు శ్యామా; ముందర హేమాడ్‌పంతు కూర్చొనిరి. వారిని జూచి బాబా హేమాడ్‌పంతును శ్యామా యిచ్చిన దక్షిణ నిమ్మనెను. శ్యామా రూపాయలకు బదులు నమస్కారముల నిచ్చెననియు, శ్యామా ప్రత్యక్షముగా గలడు కనుక అడుగవచ్చు ననెను. బాబా యిట్లనెను: "సరే, మీరిద్దరు కొంతసేపు మాట్లాడుకొంటిరా? అట్లయినచో మీరేమి మాట్లాడుకొనినారో చెప్పుము." గంటల చప్పుడును, మద్దెల శబ్దమును, పాటల ధ్వనిని లెక్కించక హేమాడ్‌పంతు బాబాకు జరిగిన దంతయు చెప్పుటకు ఆతురపడెను. తాము ముచ్చటించిన దంతయు తనకు చాల ఆనందము కలుగజేసినదనియు ముఖ్యముగా ముసలమ్మ కథ మిక్కిలి యాశ్చర్యము కలుగజేసినదనియు,

దానిని విని బాబాలీలలు అగోచరములని తెలిసికొంటిననియు ఆ కథ రూపముతో తన్ను బాబా ఆశీర్వదించిరని హేమాడ్‌పంతు చెప్పెను. అప్పుడు బాబా "కథ చాలా అద్భుతమైనది. నీవెట్టుల ఆనందించితివి? నాకా విషయమై వివరములన్నియు చెప్పుము" అనిరి. అప్పుడు హేమాడ్‌పంతు తానింతకు ముందు విన్న కథను పూర్తిగా బాబాకు వినిపించి, యది తన మనమునందు శాశ్వత ప్రభావమును కలిగించినదని చెప్పెను. ఇది విని బాబా మిగుల సంతసించెను. *"ఆ కథ నీకు నచ్చినదా? దాని ప్రాముఖ్యమును నీవు గుర్తించితివా?"* యని బాబా హేమాడ్‌పంతునడిగెను. *"అవును బాబా నా మనశ్చాంచల్యము నిష్క్రమించినది. నాకు నిజమైన శాంతి విశ్రాంతి కలిగినది. సత్యమార్గమును కనుగొనగలిగితిని"* అని హేమాడ్‌పంతు బదులిచ్చెను.

బాబా యిట్లు చెప్పెను. *"నాపద్ధతి మిక్కిలి విశిష్టమైనది! ఈ ఒక్క కథను జ్ఞప్తియందుంచుకొనుము. అది మిక్కిలి యుపయోగించును. ఆత్మసాక్షాత్కారమునకు ధ్యాన మవసరము. దాని నలవరచుకొన్నచో వృత్తులన్నియు శాంతించును. కోరికలన్నియు విడచి నిష్కామివై, నీవు సమస్త జీవరాశియందు గల భగవంతుని ధ్యానింపుము. మనస్సు ఏకాగ్రమైనచో లక్ష్యము నెరవేరును. సదా నా నిరాకారస్వభావమును ధ్యానింపుము! అదియే జ్ఞానస్వరూపము, చైతన్యము, ఆనందము. మీరిది చేయలేనిచో రాత్రింబగళ్ళు మీరు చూచుచున్న నాయీ యాకారమును ధ్యానించుడు. అట్లు కొన్నాళ్ళు చేయగా మీ వృత్తులు కేంద్రీకృతమగును. ధ్యాత, ధ్యానము, ధ్యేయము అను మూడింటికి గల భేదము పోయి ధ్యానించువాడు చైతన్యముతో నైక్యమై, బ్రహ్మముతో నభిన్నమగును. తల్లి తాబేలు నదికి ఒక యొడ్డున నుండును. దాని పిల్ల లింకొక యొడ్డున నుండును. తల్లి వానికి పాలిచ్చుటగాని, పొదువుకొనుటగాని చేయదు. దాని చూపు మాత్రమే వానికి జీవశక్తి నిచ్చుచున్నది. చిన్న తాబేళ్ళు ఏమి చేయక తల్లిని జ్ఞాపకముంచుకొనును. తల్లితాబేలు చూపు చిన్నవానికి యమృతధారవలె పనిచేయును. అదియే వాని బ్రతుకునకు సంతోషమునకు ఆధారము. గురువునకు శిష్యునకు గల సంబంధము ఇట్టిదే."* బాబా యీ మాటలు పూర్తి చేయుసరికి, హారతి పూర్తియాయెను. అందరు 'శ్రీసచ్చిదానంద సద్గురు

సాయినాథ్ మహారాజ్‌కి జై' యని జయజయధ్వానములు చేసిరి. ఓ ప్రియపాఠకులారా! యీ సమయమందు మనము కూడ మసీదులోని జనసమూహముతో కలిసి యున్నట్లు భావించి, మనము కూడ ఆ జయజయధ్వనులలో పాల్గొందము.

హారతి పూర్తి కాగానే ప్రసాదము పంచి పెట్టిరి. బాబాకు నమస్కరించి బాపూసాహెబు జోగ్ బాబాచేతిలో కలకండ ముక్కను పెట్టెను. బాబా దాని నంతను హేమాడ్‌పంతు చేతిలో పెట్టి యిట్లనెను: "ఈ కథను నీవు మనసుకు పట్టించుకొని జ్ఞప్తియందుంచుకొనినచో, నీ స్థితి కలకండవలె తియ్యగా నుండును. నీ కోరికలన్నియు నెరవేరును. నీవు సుఖముగా నుందువు." హేమాడ్‌పంతు బాబాకు సాష్టాంగనమస్కారము చేసి, "ఇట్లు ఎల్లప్పుడు నన్ను అనుగ్రహించుము, ఆశీర్వదించుము, కాపాడుము!" అని ప్రార్థించెను. అందుకు బాబా యిట్లు జవాబిచ్చెను. "ఈ కథను వినుము. దీనిని మననము చేయుము. నిధి ధ్యాసనము చేయుము. అట్లయినచో నీవు భగవంతుని ఎల్లప్పుడు జ్ఞప్తి యందుంచుకొని ధ్యానించెదవు. భగవంతుడు నీ ముందర ప్రత్యక్షమగును."

ఓ ప్రియమైన చదువరులారా! అప్పుడు హేమాడ్‌పంతుకు కలకండ ప్రసాదము దొరికెను. ఇప్పుడు మనము ఈ కథయనే కలకండ ప్రసాదము పొందెదము. దానిని హృదయపూరితముగా సేవించి, ధ్యానించి, మనస్సున నిలిపెదము. ఇట్లు బాబా కృపచే బలముగాను సంతోషముగాను నుండెదము. తథాస్తు!

19వ అధ్యాయము చివర హేమాడ్‌పంతు కొన్ని యితర విషయములను జెప్పియున్నారు. అవి యీ దిగువ పొందు పరచితిమి.

### మన ప్రవర్తన గూర్చి బాబా యుపదేశము

ఈ దిగువ చెప్పిన బాబా పలుకులు సాధారణమైన వయినప్పటికి అమూల్యములు. వానిని మనస్సునందుంచుకొని యట్లే చేసినచో నవి మనకు మేలు చేయును. "ఏదైన సంబంధముండనిదే యొకరు ఇంకొకరి వద్దకు పోరు. ఎవరుగాని యెట్టి జంతువుగాని నీవద్దకు వచ్చినచో నిర్దాక్షిణ్యముగా

వానిని తరిమివేయకుము. వానిని సాదరముగ చూడుము. దాహము గలవారికి నీరిచ్చినచో, ఆకలితో నున్నవారికి అన్నము పెట్టినచో, బట్టలు లేనివారికి బట్టలిచ్చినచో, నీ ఇంటి వసారా యితరులు కూర్చొనుటకు విశ్రాంతి తీసికొనుటకు వినియోగించినచో నిశ్చయముగా భగవంతుడు మిక్కిలి ప్రీతి జెందును. ఎవరైన ధనసహాయము గోరి నీవద్దకు వచ్చినచో, నీకిచ్చుట కిష్టము లేకున్న నీవు ఇవ్వనక్కరలేదు. కాని వానిపై కుక్కవలె మొఱగవద్దు. ఇతరులు నిన్నెంతగా నిందించినను నీవు కఠినముగా జవాబు నివ్వకుము. అట్టివానిని నీవెల్లప్పుడు ఓర్చుకొనినచో నిశ్చయముగా నీకు సంతోషము కలుగును. ప్రపంచము తల క్రిందులైనప్పటికి నీవు చలించకుము. నీవున్న చోటనే స్థైర్యముగా నిలిచి, నెమ్మదిగా నీ ముందర జరుగుచున్న నాటకమును చూచుచుండుము. నీకు నాకు మధ్యగల గోడను నిర్మూలించుము. అప్పుడు మన మిద్దరము కలియు మార్గమేర్పడును. నాకు నీకు భేదము గలదనునదియే భక్తుని గురువునకు దూరముగా నుంచుచున్నది. దానిని నశింపజేయనిది మనకు ఐక్యత కలుగదు. 'అల్లా మాలిక్!' భగవంతుడే సర్వాధికారి. ఇతరులెవ్వరు మనలను కాపాడువారు కారు. భగవంతుని మార్గమసామాన్యము, మిక్కిలి విలువైనది, కనుగొన వీలులేనిది. వారి యిచ్ఛానుసారమే మనము నడచెదము. మన కోరికలను వారు నెరవేర్చెదరు. మనకు దారి చూపెదరు. ఋణానుబంధముచే మనమందరము కలిసితిమి. ఒకరికొకరు తోడ్పడి, ప్రేమించి సుఖముగాను సంతోషముగాను నుందము గాక. ఎవరయితే తమ జీవితపరమావధిని పొందెదరో వారు అమరులై సుఖముగా నుండెదరు. తక్కినవారందరు పేరునకే ఊపిరి సలుపువరకు మాత్రమే బ్రతికెదరు.

### సద్విచారములను ప్రోత్సహించి సాక్షాత్కారమునకు దారిచూపుట

సాయిబాబా సద్విచారముల నెట్లు ప్రోత్సహించుచుండెనో తెలిసికొనుట మిగుల ఆసక్తికరముగా నుండును. భక్తిప్రేమలతో వారికి సర్వస్యశరణాగతి చేసినచో వారు నీకెట్లు పదేపదే సహాయపడెదరో తెలియును. ప్రక్కనుంచి లేవగనే నీ కేమయిన మంచి యాలోచన కలిగిన, దానిని తరువాత పగలంతయు వృద్ధి చేసినచో నీ మేధాశక్తి వృద్ధి పొందును. నీ మనస్సు శాంతి

పొందును. హేమాడ్‌పంతు దీనికై ప్రయత్నించదలచెను. ఒక బుధవారము రాత్రి పండుకొనేటప్పు డిట్లనుకొనెను. రేపు గురువారము. శుభదినము. శిరిడీ పవిత్రమైన స్థలము కావున రేపటి దినమంతయు రామనామస్మరణతోనే కాలము గడపెదను అని నిశ్చయించుకొని పరుండెను. ఆ మరుసటి దినము లేవగనే, రామనామము ప్రయత్నము లేకుండ జ్ఞప్తికి వచ్చెను. అతడు మిక్కిలి సంతసించెను. కాలకృత్యములు దీర్చుకొనిన పిమ్మట బాబాను జూచుటకు పువ్వులను దీసుకొని పోయెను. దీక్షిత్‌వాడా విడిచి బూటీవాడా దాటుచుండగా ఒక చక్కని పాట వినబడెను. ఔరంగాబాదునుంచి వచ్చినవాడొకడు మసీదులో బాబా ముందర పాడుచుండెను. అది ఏకనాథ్ మహరాజ్ రచించిన 'గురుకృపాంజన పాయో మేరే భాయి' యనునది. గురువు కృపయను అంజనము లభించెను. దాని మూలమున తన కండ్లు తెరువబడెననియు, దానిచే తాను శ్రీరాముని లోన, బయట, నిద్రావస్థలోను, జాగ్రదవస్థలోను, స్వప్నావస్థలోను నన్నిచోట్లను చూచితినని చెప్పెడు పాట యది. అనేక పాటలుండగ బాబా భక్తుడగు ఔరంగాబాదు నివాసి యీపాట నేల పాడెను? ఇది సందర్భానుసారముగ బాబా చేసిన ఏర్పాటు కాదా? హేమాడ్‌పంతు ఆనాడంతయు రామనామస్మరణచే కాలము గడుప నెంచినవాడు గావున నాతని మనోనిశ్చయమును దృఢపరచుటకై బాబా యీ పాటను పాడించియుండును.

రామనామ స్మరణ ఫలితము గూర్చి మహాత్ములందరిది ఒకే భావము. అది భక్తుల కోరికలు నెరవేర్చి వారిని కష్టములనుండి కాపాడును.

**ఉపదేశములో వైవిధ్యము - నిందగూర్చి బోధ**

శ్రీసాయిబోధనకు ప్రత్యేక స్థలముగాని, ప్రత్యేక సమయముగాని యక్కరలేదు. సందర్భావసరములను బట్టి వారి ప్రబోధము నిరంతరము జరుగుచుండెను. ఒకనాడొక భక్తుడు ఇంకొక భక్తుని గూర్చి పరోక్షమున ఇతరుల ముందు నిందించు చుండెను. ఒప్పులు విడిచి భక్త సోదరుడు చేసిన తప్పులనే ఎన్నుచుండెను. మిక్కిలి హీనమైన అతని దూషణలు విన్నవారు విసిగిరి. అనవసరముగా ఇతరులను నిందించుటచే అసూయ, దురభిప్రాయము

మొదలగునవి కలుగును. యోగులు నిందల నింకొక విధముగా భావించెదరు. మలినమును పోగొట్టుట కనేక మార్గములు గలవు. సబ్బుతో మాలిన్యమును కడుగవచ్చును. పరులను నిందించువాని మార్గము వేరు. ఇతరుల మలినములను వాడు తన నాలుకతో శుభ్రపరచును. ఒక విధముగా వాడు నిందించువానికి సేవ చేయుచున్నాడు. ఎట్లన, వాని మలినమును వీడు తన నాలుకతో శుభ్రపరచుచున్నాడు. కావున తిట్టబడినవాడు, తిట్టినవానికి కృతజ్ఞతలు తెలుపవలెను! అట్లు పరనిందకు పాల్పడువానిని బాబా సరిదిద్దిన పద్ధతి విశిష్టమైనది. నిందించువాడు చేసిన యపరాధమును బాబా సర్వజ్ఞుడగుటచే గ్రహించెను. మిట్ట మధ్యాహ్నము బాబా లెండీతోటకు పోవునపుడు వాడు బాబాను దర్శించెను. బాబా వానికొక పందిని జూపి యిట్లనెను, "*చూడుము! ఈ పంది అమేధ్యమును యెంత రుచిగా తినుచున్నదో! నీ స్వభావముకూడా అట్టిదే! ఎంత ఆనందముగ నీ సాటిసోదరుని తిట్టుచున్నావు. ఎంతయో పుణ్యము జేయగ నీకీ మానవజన్మ లభించినది. ఇట్లు చేసినచో శిరిడీ దర్శనము నీకు తోడ్పడునా?*" భక్తుడు నీతిని గ్రహించి వెంటనే పోయెను.

ఈ విధముగా బాబా సమయము వచ్చినప్పుడెల్ల ఉపదేశించుచుండెడి వారు. ఈ యుపదేశములను మనస్సునందుంచుకొని పాటించినచో ఆత్మ సాక్షాత్కారము దూరము కాదు. ఒక లోకోక్తి కలదు. "*నా దేవుడున్నచో నాకు మంచముపైని కూడ బువ్వ పుట్టును.*" అది భోజనము, వస్త్రములను గూర్చి చెప్పినది. ఎవరయిన దీనిని ఆధ్యాత్మిక విషయమై నమ్ముకొని ఊరకున్నచో చెడిపోయెదరు. ఆత్మసాక్షాత్కారమునకై సాధ్యమైనంత పాటుపడవలెను. ఎంత కృషి చేసిన నంత మేలు.

బాబా తాను సర్వాంతర్యామినని చెప్పెడివారు. అన్నిటియందు అనగా భూమి, గాలి, దేశము, ప్రపంచము, వెలుతురు, స్వర్గములందు వారు గలరు. ఆయన అనంతుడు. ఆ కనిపించెడి మూడున్నర మూరల దేహమే బాబా యని అనుకున్నవారికి పాఠము చెప్పుటకే వారు ఈ రూపముతో నవతారమెత్తిరి. బాబాకు సర్వస్యశరణాగతి చేసి, అహర్నిశలు వారినే ధ్యానించినచో, చక్కెర-

తీపి, కెరటములు-సముద్రము, కన్ను-కాంతి, కలిసి యున్నట్లే శ్రీసాయితో తాదాత్మ్యతను పొందెదరు. ఎవరయితే చావుపుట్టుకల నుండి తప్పించుకొనుటకు ప్రయత్నించెదరో వారు శాంతము స్థిరమైన మనస్సుతో ధార్మికజీవనము గడుపవలెను. ఇతరుల మనస్సు బాధించునట్లు మాట్లాడరాదు. మేలొనరించు పనులనే చేయుచుండవలెను. తన కర్తవ్యకర్మల నాచరించుచు భగవంతునికి సర్వస్యశరణాగతి చేయవలెను. వాడు దేనికి భయపడనవసరము లేదు. ఎవరయితే భగవంతుని పూర్తిగా నమ్మెదరో, వారి లీలలను విని, యితరులకు చెప్పెదరో, ఇతర విషయములేమియు నాలోచించరో వారు తప్పక ఆత్మసాక్షాత్కారము పొందుదురు. అనేకమందికి బాబా తన నామమును జ్ఞప్తియందుంచుకొని, శరణువేడు మనెను. 'తానెవరు' అనుదానిని తెలిసికొనగోరు వారికి శ్రవణమును మననమును చేయుమని సలహా యిచ్చెడివారు. కొందరికి భగవన్నామమును జ్ఞప్తియందుంచుకొనుమనువారు. కొందరికి తమ లీలలు వినుట, కొందరికి తమ పాదపూజ, కొందరికి అధ్యాత్మరామాయణము, జ్ఞానేశ్వరి మొదలగు గ్రంథములు చదువుట, కొందరికి తమ పాదముల వద్ద కూర్చొనుమనుట, కొందరిని ఖండోబా మందిరమునకు బంపుట, కొందరికి విష్ణు సహస్రనామములు కొందరికి ఛాందోగ్యోపనిషత్తు, భగవద్గీత పారాయణ చేయుమని విధించుచుండెను. వారి ఉపదేశములకు పరిమితి లేదు; అడ్డులేదు. కొందరికి స్వయముగా ఉపదేశము నిచ్చువారు; కొందరికి స్వప్నములో నిచ్చేవారు. ఒక త్రాగుబోతుకు స్వప్నములో గనిపించి ఛాతీపైన కూర్చొని అదుముచూ, ఇక యెన్నడు త్రాగనని అతడు వాగ్దానము చేసిన పిమ్మట వదలిరి. కొందరికి స్వప్నములో 'గురుబ్రహ్మాది' మంత్రార్థముల బోధించిరి. ఒకడు హఠయోగము చేయుచుండగా దానిని మానుమనిరి. వారి మార్గములను జెప్పుట కలవి గాదు. ప్రపంచ విషయములలో తమ ఆచరణలే ఉదాహరణముగా బోధించువారు. అట్టి వానిలో నొకటి.

## పనికి తగిన ప్రతిఫలము

బాబా ఒకనాడు మిట్టమధ్యాహ్నము, రాధాకృష్ణమాయి యింటి సమీపమునకు వచ్చి "నిచ్చెన తీసికొని రమ్ము" అనెను. ఒకడు పోయి దానిని తెచ్చి యింటికి చేరవేసెను. బాబా వామనగోండ్కర్ యింటి పైకప్పు ఎక్కి రాధాకృష్ణమాయి యింటి పైకప్పును దాటి, ఇంకొక ప్రక్క దిగెను. బాబా యభిప్రాయమేమో యెవరికిని తెలియలేదు. రాధాకృష్ణమాయి మలేరియా జ్వరముతో నుండెను. ఆమె జ్వరమును తొలగించుటకై బాబా యిట్లు చేసియుండునని యనుకొనిరి. దిగిన వెంటనే నిచ్చెన తెచ్చిన వానికి బాబా రెండు రూపాయలు ఇచ్చెను. ఎవడో ధైర్యము చేసి నిచ్చెన తెచ్చినంత మాత్రమున వానికి రెండు రూపాయలేల యివ్వవలెనని బాబాను ప్రశ్నించెను. ఒకరి కష్టము నింకొకరుంచుకొనరాదు. కష్టపడువాని కూలి సరిగాను దాతృత్వముతోను ధారాళముగ నివ్వవలెనని బాబా చెప్పెను. బాబా సలహా ప్రకారము ప్రవర్తించినచో కూలివాడు సరిగా పని చేయును. పని చేయించేవాడు, పని చేసేవారలు కూడ సుఖపడెదరు. సమ్మెలకు తావుండదు. మదుపు పెట్టువానికి, కష్టపడి కూలి చేయువాండ్రకు మనఃస్పర్థలుండవు.

18, 19 అధ్యాయములు

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువదవ అధ్యాయము

*కాకా నౌకరీ పిల్ల ద్వారా దాసగణు సమస్య పరిష్కరించుట*

**ఈ** అధ్యాయములో దాసగణుకు గలిగిన యొక సమస్యను కాకాసాహెబు ఇంటిలోని పనిపిల్ల ఎట్లు పరిష్కరించెనో హేమాడ్‌పంతు చెప్పెను.

మౌలికముగా సాయి నిరాకారుడు. భక్తులకొరకాకారమును ధరించెను. ఈ మహాజగన్నాటకమునందు మాయయను నటి సాయముతో వారు నటుని పాత్ర ధరించిరి. సాయిని స్మరించి ధ్యానింతము గాక. శిరిడీకి పోయి యచ్చటి మధ్యాహ్న హారతి పిమ్మట జరుగు కార్యక్రమమును జాగ్రత్తగా గమనింతము. హారతి అయిన పిమ్మట సాయి మసీదు బయటకు వచ్చి, గోడ ప్రక్కన నిలిచి ప్రేమతోను దయతోను భక్తులకు ఊదీ ప్రసాదమును పంచి పెట్టుచుండిరి. భక్తులుకూడ సమానమైన ఉత్సాహముతో వారి సమక్షమున నిలిచి వారి పాదములకు నమస్కరించి, వారి వైపు చూచుచు ఊదీ ప్రసాదపు జల్లు లనుభవించుచుండిరి. బాబా భక్తుల చేతులలో పిడికిళ్ళతో ఊదీ పోయుచు, వారి నుదుటిపై తమ చేతులతో ఊదీబొట్టు పెట్టుచుండిరి. వారి హృదయమున భక్తులయెడ అమితమైన ప్రేమ. బాబా భక్తుల నీ క్రింది విధముగా పలుకరించుచుండిరి.

"అన్నా, మధ్యాహ్న భోజనమునకు పొమ్ము! బాబా, నీబసకు పో. బాపూ! భోజనము చేయుము." ఈ విధముగా ప్రతిభక్తుని పల్కరించి యింటికి సాగనంపుచుండిరి. ఇప్పటికి అది యంతయు ఊహించుకొన్నచో, ఆ దృశ్యములను తిరిగి చూచినంత ఆనందము గలుగును. మనోఫలకమున సాయిని నిల్పి, వారిని ఆపాదమస్తకము ధ్యానింతము. వారి పాదములపైబడి సగౌరవముగ ప్రేమతో వినయముగ సాష్టాంగనమస్కార మొనర్చుచు, ఈ అధ్యాయములోని కథను చెప్పెదను.

**ఈశావాస్యోపనిషత్తు**

ఒకప్పుడు దాసగణు ఈశావాస్యోపనిషత్తుపై మరాటీభాషలో వ్యాఖ్య వ్రాయుటకు మొదలిడెను. మొట్టమొదట ఈ యుపనిషత్తు గూర్చి క్లుప్తముగా చెప్పెదము.

వేదసంహితలోని మంత్రములు గలదగుటచే దీనిని మంత్రోపనిషత్తు అని కూడా యందురు. ఇందులో యజుర్వేదములోని 40వ అధ్యాయమగు వాజసనేయ సంహిత యుండుటచే, దీనికి వాజసనేయ సంహితోపనిషత్తని కూడా పేరు. వైదిక సంహిత లుండుటచే దీనినితర ఉపనిషత్తులకన్న శ్రేష్ఠమని భావించెదరు. దీనికొక యుదాహరణము. ఉపనిషత్తులన్నిటిలో పెద్దదియగు బృహదారణ్య కోపనిషత్తు యీ ఈశావాస్యోపనిషత్ పై వ్యాఖ్యయని పండితుడగు సాత్వలేకర్‌గారు భావించుచున్నారు.

ప్రొఫెసరు రానడేగా రిట్లనుచున్నారు: *"ఈశావాస్యోపనిషత్తు మిక్కిలి చిన్నదైనప్పటికి దానిలో అంతర్‌దృష్టిని కలిగించు అనేకాంశములున్నవి. 18 శ్లోకములలో ఆత్మగూర్చి విలువైన యపురూపమగు వర్ణన, అనేకాకర్షణలకు దుఃఖములకు తట్టుకొను స్థైర్యము గల ఆదర్శయోగీశ్వరుని వర్ణన లిందున్నవి. తరువాతి కాలమున సూత్రీకరింపబడిన కర్మయోగసిద్ధాంతముల ప్రతిబింబమే ఈ యుపనిషత్తు. తుదకు జ్ఞానముకు కర్మలకు సమన్వయముగ నున్న సంగతులు చెప్పబడినవి. జ్ఞానమార్గమును కర్మయోగమును సమన్వయము చేసి చెప్పుట యీ యుపనిషత్తులోని సారాంశము."* ఇంకొక చోట వారిట్లనిరి: "ఈశావాస్యోపనిషత్తులోని కవిత్వము నీతి, నిగూఢతత్వము, వేదాంతముల మిశ్రమము".

పై వర్ణను బట్టి యీ ఉపనిషత్తును మరాటీ భాషలోనికి అనువాదము చేయుట యెంత కష్టమో ఊహించవచ్చును. దాసగణు దీనిని మరాటీ ఓవీ ఛందములో వ్రాసెను. దానిలోని సారాంశమును గ్రహించలేకుండుటచే తాను వ్రాసినదానితో నతడు తృప్తి చెందలేదు. అతడు కొందరు పండితుల నడిగెను, వారితో చర్చించెను. కాని వారు సరియైన సమాధానమియ్యకుండిరి. కావున దాసగణు కొంతవరకు వికలమనస్కుడయ్యెను.

**సద్గురువే బోధించుటకు యోగ్యత, సమర్థత గలవారు.**

ఈ యుపనిషత్తు వేదములయొక్క సారాంశము. ఇది యాత్మ సాక్షాత్కారమునకు సంబంధించిన శాస్త్రము. ఇది జననమరణములనే బంధములను తెగగొట్టు ఆయుధము, లేదా కత్తి. ఇది మనకు మోక్షమును ప్రసాదించును. కనుక ఎవరయితే యాత్మసాక్షాత్కారము పొంది యున్నారో యట్టివారే ఈ ఉపనిషత్తులోని అసలు సంగతులు చెప్పగలరని అతడు భావించెను. ఎవరును దీనికి తగిన సమాధానము నివ్వనప్పుడు దాసగణు సాయిబాబా సలహా పొంద నిశ్చయించుకొనెను. అవకాశము దొరకగానే శిరిడీకి పోయి, సాయిబాబాను దర్శించి, వారి పాదములకు నమస్కరించి ఈశావాస్యోపనిషత్తును అర్థము చేసుకొనుటలో తన కష్టముల జెప్పి, సరియైన యర్థమును బోధింపమని వేడుకొనెను. సాయిబాబా యాశీర్వదించి యిట్లనెను: "*తొందర పడవద్దు. ఆ విషయములో నెట్టి కష్టము లేదు. తిరుగు ప్రయాణములో విలేపార్లేలోని కాకాసాహెబు దీక్షితుని పనిపిల్ల నీ సందేహమును తీర్చును.*" అప్పుడక్కడ నున్నవారీ మాటలు విని, బాబా తమాషా చేయుచున్నారనుకొనిరి. భాషాజ్ఞానము లేని పనిపిల్ల ఈ విషయమెట్లు చెప్పగలదనిరి. కాని దాసగణు అట్లనుకొనలేదు. బాబా పలుకులు బ్రహ్మవాక్కు లనుకొనెను.

**కాకాయొక్క పనిపిల్ల**

బాబా మాటలందు పూర్తి విశ్వాసముంచి, దాసగణు శిరిడీ విడిచి విలేపార్లే చేరి, కాకాసాహెబు దీక్షితు ఇంటిలో బసచేసెను. ఆ మరుసటిదిన ముదయము దాసగణు నిద్రనుంచి లేవగనే, యొక బీదపిల్ల చక్కని పాటను

మిక్కిలి మనోహరముగా పాడుచుండెను. ఆపాటలోని విషయము ఎఱ్ఱచీర వర్ణనము. అది చాల బాగుండెననియు, దాని కుట్టుపని చక్కగా నుండెననియు, దాని యంచుల చివరలు చాల సుందరముగా నుండెననియు ఆమె పాడుచుండెను. ఆ పాట నచ్చుటచే, దాసగణు బయటకు వచ్చి వినెను. అది కాకా పనిమనిషి నామ్యా చెల్లెలు పాడుచుండెను. ఆమె చిన్నపిల్ల. ఆమె చింకి గుడ్డ కట్టుకొని పాత్రలు తోముచుండెను. ఆమె పేదరికము, ఆమె సంతోషభావమును గాంచి, దాసగణు ఆమెపై జాలిపడెను. ఆ మరుసటి దినము రావుబహద్దూర్ యమ్.వి. ప్రధాన్ తనకు ధోవతుల చాపు లివ్వగ, ఆ పేదపిల్లకు చిన్న చీరనిమ్మని చెప్పెను. రావుబహద్దూర్ ఒక మంచి చిన్న చీరను కొని యామెకు బహూకరించెను. ఆకలితో నకనకలాడుతున్నవారికి విందు భోజనము దొరికినట్లు ఆమె యమితానంద పరవశురాలయ్యెను. ఆ మరుసటిదిన మామె యా కొత్త చీరను ధరించెను. అమితోత్సాహముతో తక్కిన పిల్లలతో కలసి గిఱ్ఱున తిరుగుచు నాట్యము చేసెను. అందరికంటె తానే బాగుగ ఆడి పాడెను. మరుసటి దినము చీరను పెట్టెలో దాచుకొని మామూలు చింకి బట్ట కట్టుకొని పనిచేయుటకు వచ్చెను. కాని యామె యానందమునకు లోటు లేకుండెను. ఇదంతయు చూచి దాసగణు జాలిభావము మెచ్చుకోలుగా మారెను. పిల్ల నిరుపేద కాబట్టి చింకిగుడ్డలు కట్టుకొనెను. ఇప్పుడు ఆమెకు కొత్తచీర గలదు, గాని దానిని పెట్టెలో దాచుకొనెను. అయినప్పటికి విచారమనునది గాని, నిరాశ యనునది గాని లేక యాడుచు పాడుచుండెను. కాబట్టి కష్టసుఖములను భావములు మన మనోవైఖరిపై నాధారపడి యుండునని ఆతడు గ్రహించెను. ఈ విషయమును గూర్చి దీర్ఘాలోచన చేసెను. భగవంతు డిచ్చినదానితో మనము సంతసింపవలెను. భగవంతుడు మనల నన్ని దిశలనుండి కాపాడి మనకు కావలసినది ఇచ్చుచుండును. కాన భగవంతుడు ప్రసాదించినదంతయు మన మేలుకొరకే యని గ్రహించెను. ఈ ప్రత్యేక విషయములో ఆ పిల్ల యొక్క పేదరికము, ఆమె చినిగినచీర, క్రొత్తచీర, దాని నిచ్చిన దాత, దానిని పుచ్చుకొనిన గ్రహీత, దానభావము - ఇవి యన్నియు భగవంతుని యంశములే. భగవంతుడు యీ యన్నిటియందు వ్యాపించి యున్నాడు. ఇచ్చట దాసగణు ఉపనిషత్తులలోని నీతిని అనగా

ఉన్నదానితో సంతుష్టి చెందుట, ఏది మనకు సంభవించుచున్నదో - యది అంతయు భగవంతుని యాజ్ఞచే జరుగుచున్నదనియు, తుదకది మన మేలుకొరకే యనియు గ్రహించెను.

**విశిష్టమైన బోధన విధానము**

పై కథను బట్టి బాబా మార్గము మిక్కిలి విశిష్టమైన దనియు అపూర్వమైనదనియు పాఠకులు గ్రహించియేయుందురు. బాబా శిరిడీని విడువనప్పటికి, కొందరిని మఛ్చీంద్రగఢ్‌కు, కొందరిని కొల్హాపూరుకు గాని, షోలాపూరుకుగాని సాధననిమిత్తము పంపుచుండెను. కొందరికి సాధారణ రూపములోను, కొందరికి స్వప్నావస్థలోను, అది రాత్రిగాని, పగలుగాని, కాన్పించి కోరికలు నెరవేర్చుచుండెను. భక్తులకు బాబా బోధించు మార్గములు వర్ణింపనలవి కాదు. ఈ ప్రస్తుత విషయములో దాసగణును విలేపార్లే పంపి, పనిపిల్లద్వారా అతని సమస్యను పరిష్కరించెను. కాని విలేపార్లే పంపకుండ శిరిడీలోనే బాబా బోధించరాదాయని కొందరనవచ్చును. కాని బాబా అవలంబించినదే సరియైన మార్గము. కానిచో పేద నౌకరీ పిల్ల, యామె చీరకూడ భగవంతుని సంకల్ప రూపములే యని దాసగణు ఎట్లు నేర్చుకొని యుండును?

**ఈశావాస్యోపనిషత్తులోని నీతి**

ఈశావాస్యోపనిషత్తులో నున్న ముఖ్యవిషయము అది బోధించు నీతిమార్గమే. ఈ ఉపనిషత్తులో నున్న నీతి దానిలో చెప్పబడిన ఆధ్యాత్మిక విషయములపై ఆధారపడియున్నది. ఉపనిషత్తు ప్రారంభ వాక్యములే భగవంతుడు సర్వాంతర్యామి యని చెప్పుచున్నవి. దీనినిబట్టి మనము గ్రహించవలసిన దేమన మానవుడు భగవంతుడిచ్చిన దానితో సంతుష్టి చెందవలెను. ఏలయన భగవంతుడన్నింటియందు గలడు. కావున భగవంతుడేది యిచ్చెనో అదియెల్ల తన మేలుకొరకే యని గ్రహించవలెను. దీనిని బట్టి యితరుల సొత్తుకై యాశించరాదనియు, ఉన్నదానితో సంతుష్టి చెందవలెననియు, భగవంతుడు మన మేలుకొరకే దాని నిచ్చియున్నాడనియు, కావున నది మనకు మేలు కలుగజేయునదేయనియు గ్రహించవలెను.

దీనిలోని ఇంకొక నీతి యేమన మనుష్యుడెల్లప్పు డేదో తనకు విధింపబడిన కర్మను చేయుచునే యుండవలెను. శాస్త్రములో చెప్పిన కర్మలు నెరవేర్చవలెను. భగవంతుని యాజ్ఞానుసారము నెరవేర్చుట మేలు. ఈ ఉపనిషత్తు ప్రకారము కర్మ చేయకుండ నుండుట యాత్మనాశనమునకు కారణము. మానవుడు శాస్త్రములో విధింపబడిన కర్మలు నెరవేర్చుటవలన నైష్కర్మ్యాదర్శము పొందును. ఏ మానవుడు సమస్తజీవరాశిని ఆత్మలో చూచునో, ఆత్మ యన్నిటియందుండునట్లు చూచునో, వేయేల సమస్త జీవరాశియు, సకలవస్తువులు ఆత్మగా భావించునో, యట్టివాడెందుకు మోహమును పొందును? వాడెందులకు విచారించును? అన్ని వస్తువులలో నాత్మను చూడకపోవుటచే మనకు మోహము, అసహ్యము, విచారము కలుగుచున్నవి. ఎవడయితే సకలవస్తుకోటిని ఒక్కటిగా భావించునో, ఎవనికయితే సమస్తమాత్మ యగునో, అతడు మానవులు పడు సామాన్యబాధలకు, దుఃఖవికారములకు లోను గాడు.

శ్రీసాయినాథాయ నమః

**ఇరువదవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువదియొకటవ అధ్యాయము

1. వి.హెచ్. ఠాకూర్ 2. అనంతరావు పాటంకర్. 3. పండరీపురము ప్లీడరు - వీరి కథలు.

ఈ అధ్యాయములో హేమాడ్‌పంతు వినాయక హరిశ్చంద్ర ఠాకూరు బి.ఏ., అనంతరావు పాటంకర్ (పూనా), పండరీపురము ప్లీడరు గూర్చిన కథలు చెప్పెను. ఈ కథలన్నియు నానందదాయకమైనవి. ఇవి సరిగా చదివి గ్రహించినచో, ఆధ్యాత్మికమార్గమునకు దారి చూపును.

### ప్రస్తావన

సామాన్యముగ మన గతజన్మపుణ్యసముపార్జనమువలన మహాత్ముల సాంగత్యభాగ్యము పొంది, దానివలన మేలు పొందెదము. దీనికి ఉదాహరణముగా హేమాడ్‌పంతు తన సంగతినే చెప్పుచున్నాడు. బొంబాయి దగ్గరగా నున్న బాంద్రాకు ఇతడు చాలకాలము మెజిస్ట్రేటుగ నుండెను. అక్కడ పీరుమౌలానా యను మహమ్మదీయ మహాత్ముడు నివసించుచుండెను. అనేకమంది హిందువులు, పారశీకులు, ఇతర మతస్థులు పోయి వారిని దర్శించుచుండిరి. హేమాడ్‌పంతు పురోహితుడగు ఇనుస్, పీరుమౌలానాను దర్శించుమని అనేకసార్లు హేమాడ్‌పంతుకు చెప్పెను. కాని ఏవో కారణములచేత హేమాడ్‌పంతు ఆ మహాత్ముని దర్శించలేకపోయెను. అనేకసంవత్సరముల తరువాత అతని వంతు వచ్చెను. అతడు శిరిడీకి పోయి

శ్రీసాయి దర్బారులో శాశ్వతస్థానమును పొందెను. దురదృష్టవంతులకు ఇట్టి మహాత్ముల సాంగత్యము లభించదు. కేవలము అదృష్టవంతులకే యట్టిది లభించును.

## యోగీశ్వరుల వ్యవస్థ

అత్యంతప్రాచీనకాలమునుండి ప్రపంచమున యోగీశ్వరుల వ్యవస్థ యున్నది. అనేకమందియోగు లనేకచోట్ల అవతరించి వారి వారికి విధింపబడిన పనులను నెరవేర్చెదరు. వారనేకచోట్ల పనిచేసినను అందరా భగవంతుని యాజ్ఞానుసారము నెరవేర్చెదరు. కాన ఒకరు చేయునది యింకొకరికి తెలియును. ఒకరు చేసినదానిని ఇంకొకరు పూర్తి చేసెదరు. దీనిని బోధించుట కొక యుదాహరణమీ దిగువ కలదు.

## వి.హెచ్. ఠాకూరు

వీరు రెవెన్యూ శాఖలో గుమాస్తాగా నుండిరి. ఆయన ఒకానొకప్పుడు బెళగాం సమీపమందలి వడ్‌గాం అను పట్టణమున కొక సర్వేపార్టీతో వచ్చెను. అక్కడ 'అప్ప' యను కన్నడయోగిని దర్శించి వారి పాదములకు నమస్కరించెను. ఆ యోగి నిశ్చలదాసు రచించిన 'విచారసాగర' మను వేదాంత గ్రంథమును సభలో నున్నవారికి బోధించుచుండెను. ఠాకూర్ పోవునపుడు వారి సెలవు కోరగా వారిట్లు చెప్పిరి. "ఈ పుస్తకమును నీవు చదువవలెను. నీ వట్లు చేసినచో నీ కోరికలు నెరవేరును. ముందుముందు నీ యుద్యోగమునకు సంబంధించిన పనిమీద ఉత్తరదిక్కునకు బోయినప్పుడు నీ అదృష్ట వశమున నీకొక గొప్ప మహాత్ముని దర్శనము గలుగును. వారు నీ భవిష్యత్తుకు మార్గమును చూపెదరు. నీ మనస్సునకు శాంతి ఆనందములు కలుగజేసెదరు."

ఆ తరువాత ఠాకూరు జున్నరుకు బదిలీ యయ్యెను. అచ్చటికి పోవుటకై నాన్హేఘాటు లోయను దాటి పోవలసియుండెను. ఈ లోయ మిక్కిలి లోతైనది. దానిని దాటుట చాల కష్టము. దానిని దాటుట కెనుబోతు తప్ప యితర మేదియు నుపయోగించరు. కావున ఎనుబోతుపై లోయను దాటుటచే అతనికి

బాధ కలిగెను. అచ్చటినుండి కల్యాణ్‌కు పెద్ద యుద్యోగముపై బదిలి యయ్యెను. అచట నానాసాహెబు చాందోర్కరుతో పరిచయము కలిగెను. ఆయన వలన సాయిబాబా గూర్చి యనేక సంగతులు తెలిసికొని వారిని దర్శింప కాంక్షించెను. ఆ మరుసటి దినమే నానాసాహెబు శిరిడీ పోవుటకు నిశ్చయించుకొనెను. కావున ఠాకూరును కూడా తనతో రమ్మని యడిగెను. ఠాకూర్ తనకు ఠాణాలో సివిల్ కేసుండుటచే రాలేనని చెప్పెను. అందుచే నానాసాహెబు ఒక్కడే వెళ్ళెను. ఠాకూరు ఠాణాకు వెళ్ళెను. కాని యచ్చట కేసు వాయిదా పడెను. అతడు నానాసాహెబు వెంట శిరిడీకి వెళ్ళకపోవుటచే మిక్కిలి పశ్చాత్తాపపడెను. అయినప్పటికి శిరిడీ వెళ్ళెను. అంతకు ముందురోజే నానాసాహెబు శిరిడీ విడిచి పెట్టెనని తెలిసెను. ఇతర స్నేహితులు కొందరు అక్కడ కలిసిరి. వారు ఠాకూరును బాబా వద్దకు దీసికొనిపోయిరి. అతడు బాబాను జూచి, వారి పాదములకు నమస్కరించి మిక్కిలి సంతసించెను. అతని కండ్లు ఆనందభాష్పములచే నిండెను; ఒడలు గగుర్పొడిచెను. కొంతసేపటికి సర్వజ్ఞుడగు బాబా యిట్లనెను. "ఇచ్చటి మార్గము అప్పా బోధించు నీతులంత సులభము కాదు. నాన్హేఘాటులో ఎనుబోతుపైన *సవారిచేయుటకంటే కష్టము! ఈ యధ్యాత్మమార్గము మిగుల కఠినమైనది. దీనికి ఎంతో కృషి అవసరము."* ఠాకూరుకొక్కనికే అర్థమగు ఆ మాటలు వినగనే యతడు యమితానంద పరవశుడయ్యెను. కన్నడయోగి చెప్పిన మాటలు యథార్థములని గ్రహించెను. రెండు చేతులు జోడించి బాబా పాదములపై శిరస్సును బెట్టి, తనను స్వీకరించి యాశీర్వదించ వలెనని ప్రార్థించెను. అప్పుడు బాబా యిట్లనెను. "అప్పా చెప్పినదంతయు నిజమే! *కాని యవన్నియు అభ్యసించి ఆచరణలో పెట్టవలెను. ఊరకనే గ్రంథములు చదువుటవలన ప్రయోజనము లేదు. నీవు చదివిన విషయమును గూర్చి జాగ్రత్తగ విచారించి, అర్థము జేసుకుని, యాచరణలో పెట్టవలెను. లేనిచో ప్రయోజనము లేదు. గుర్వనుగ్రహము లేని ఉత్త పుస్తకజ్ఞానము నిష్ప్రయోజనము."* విచారసాగరము లోని సిద్ధాంతభాగమాతడు చదివియుండెను. కాని ఆచరణను శిరిడీలో నేర్చెను. ఈ దిగువ చెప్పిన యింకొక కథ కూడ నీ సత్యమును బలపరచును.

### అనంతరావు పాటంకర్

అనంతరావు పాటంకర్ యను పూనా పెద్దమనుష్యుడొకడు బాబాను చూడగోరెను. శిరిడీకి వచ్చి బాబా దర్శనము చేసెను. అతని కండ్లు సంతుష్టిచెందెను. అతడానందించెను. అతడు బాబా పాదములపయి బడి, తగువిధముగ పూజించి, పిమ్మట బాబాతో ఇట్లనెను: "నేనెక్కువగా చదివితిని. వేదములను, వేదాంతములను చదివితిని. అష్టాదశపురాణములు వింటిని. నా మనస్సునకు శాంతి కలుగుట లేదు. కనుక నా పుస్తక జ్ఞానమంతయు నిష్ప్రయోజనము. పుస్తకజ్ఞానములేని నిరాడంబరభక్తులు నాకంటె మేలు. మనస్సు శాంతి పొందనిచో పుస్తకజ్ఞానమంతయు వ్యర్థము. నీ దృష్టివలనను నీ మహత్తరమైన మాటలవలనను నీవు శాంతి ప్రసాదింతువని వింటిని. అందుచే నేనిచ్చటికి వచ్చితిని. కావున నాయందు దాక్షిణ్యము చూపుము. నన్ను ఆశీర్వదించుము." అప్పుడు బాబా ఒక నీతికథను ఈ విధముగా చెప్పెను:

### తొమ్మిది ఉండల గుఱ్ఱపులద్ది నీతికథ (నవవిధభక్తి)

"ఒకనాడొక వర్తకుడిక్కడకు వచ్చెను. అతని ముందు ఒక ఆడగుఱ్ఱము లద్దివేసెను. అది తొమ్మిది యుండలుగా పడెను. జిజ్ఞాసువైన యా వర్తకుడు పంచెకొంగు సాచి తొమ్మిది యుండల నందులో పెట్టుకొనెను. ఇట్లు అతడు మనస్సును కేంద్రీకరించగలిగెను."

ఈ మాటల యర్థమును పాటంకర్ గ్రహించలేకుండెను. అందుచే నతడు గణేశదామోదర్ వురఫ్ దాదాకేల్కరు నిట్లు అడిగెను: "ఆ మాటలలో బాబా యుద్దేశమేమి?" కేల్కరు యిట్లు జవాబు ఇచ్చెను: "నాకు గూడ బాబా చెప్పినదంతయు తెలియదుగాని, వారి ప్రేరణ ప్రకారము నాకు తోచినది నేను చెప్పెదను. ఆడగుఱ్ఱమనగా ఇచట భగవంతుని యనుగ్రహము. తొమ్మిదియుండల లద్ది యనగా నవవిధభక్తులు. అవి యేవన 1. శ్రవణము (వినుట) 2. కీర్తనము (ప్రార్థించుట) 3. స్మరణము (జ్ఞప్తియందుంచుకొనుట) 4. పాదసేవనము (పాదసంవాహనము) 5. అర్చనము (పూజ) 6. నమస్కారము (వంగి నమస్కరించుట) 7. దాస్యము (సేవ). 8. సఖ్యత్వము (స్నేహము) 9. ఆత్మనివేదనము (ఆత్మను సమర్పించుట).

"ఇవి నవవిధభక్తులు. వీనిలో నేదయిన ఒక మార్గమును హృదయపూర్వకముగ అనుసరించిన యెడల భగవంతుడు సంతుష్టి జెందును. భక్తుని గృహమందు ప్రత్యక్షమగును. భక్తిలేని సాధనము లన్నియు -- అనగా జపము, తపము, యోగము, ఆధ్యాత్మికగ్రంథముల పారాయణ, వానిలోని సంగతుల నితరులకు బోధించుట మొ॥ గునవి -- నిష్ప్రయోజనము. భక్తియే లేనిచో వేదములలోని జ్ఞానము, జ్ఞానియను గొప్ప ప్రఖ్యాతి, నామమాత్రమునకే చేయు భజన, ఇవన్నియు వ్యర్థము. కావలసినది ప్రేమాస్పదమయిన భక్తి మాత్రమే. నీవు కూడ ఆ వర్తకుడ ననుకొనుము. లేదా సత్యమును దెలిసికొనుటకు ప్రయత్నించుచున్న వ్యక్తి ననుకొనుము. వానివలె నవవిధభక్తులను ప్రోగు చేయుము. ఆతురతతో నుండుము. వానివలె నవవిధభక్తులను ఆచరణలో పెట్టుటకు సిద్ధముగా నుండుము. అప్పుడే నీకు మనఃస్థైర్యము, శాంతి కలుగును."

ఆ మరుసటి దినము పాటంకర్ బాబాకు నమస్కరించుటకు పోగా, "తొమ్మిది గుఱ్ఱపులద్ది ఉండలను ప్రోగుచేసితివా లేదా?" యని ప్రశ్నించెను. అతడు తాను నిస్సహాయుడననియు, బాబా అనుగ్రహముచే మాత్రమే వానిని సులభముగా ప్రోగుచేయవచ్చు ననెను. అప్పుడు బాబా శాంతి క్షేమములు కలుగునని యాశీర్వదించెను. పాటంకర్ యపరిమితానంద భరితుడయ్యెను.

### పండరీపురము ప్లీడరు

ఒక చిన్న కథతో నీ అధ్యాయమును ముగించెదము. ఆ కథ బాబా సర్వజ్ఞుడని తెలుపును. ప్రజలను సరియైన మార్గమున బెట్టుటకు, వారి తప్పులను సవరించుటకు, బాబా సర్వజ్ఞత్వము నుపయోగించుచుండెను. ఒకనాడు పండరీపురమునుండి యొక ప్లీడరు వచ్చెను. అతడు మసీదుకు పోయి సాయిబాబాను దర్శించెను; వారి పాదములకు నమస్కరించెను; అడుగకుండనే దక్షిణ యిచ్చెను; జరుగుచున్న సంభాషణలు వినుట కొక మూల గూర్చుండెను. బాబా యతనివైపు ముఖము త్రిప్పి యిట్లనెను. "ప్రజలెంత టక్కరులు? వారు పాదములపయి బడెదరు. దక్షిణ నిచ్చెదరు.

కానీ, చాటున నిందించెదరు. ఇది చిత్రము గాదా?" ఆ మాటలు ప్లీడరుకు సూటిగ తగిలినవి. ఎవరికీ బాబా మాటలలోని అంతరార్థము బోధపడలేదు. ప్లీడరు మాత్రము గ్రహించెను. కాని అక్కడ యేమియు మాట్లాడలేదు. వాడాకు పోయిన పిమ్మట, ప్లీడరు కాకాసాహెబు దీక్షితుతో ఇట్లనియెను: "బాబా చెప్పినదంతయు యదార్థమే. ఆ బాణము నాపయి ప్రయోగించిరి. అది నాగూర్చియే. నేనెవరిని నిందించకూడదు, తృణీకరించరాదని బోధించుచున్నది. పండరీపురము సబ్‌జడ్జియగు నూల్కర్ తన యారోగ్యాభివృద్ధికొరకు శిరిడీకి వచ్చెను. ఇచ్చటనే మకాము చేసెను. ప్లీడర్ల విశ్రాంతిగదిలో దీని గూర్చి వివాదము జరిగెను. రోగముచే బాధపడుచున్న సబ్‌జడ్జీ యౌషధమును సేవించక, శిరిడీకి పోయిన మాత్రమున బాగగునా? అని మాట్లాడుకొనిరి. సబ్‌జడ్జిని వ్యాఖ్య చేసిరి. సాయిబాబాను నిందించిరి. నేను కూడ అందు కొంత భాగము వహించితిని. నేను చేసినది సమంజసము గాదని ఇప్పుడు సాయిబాబా నిరూపించెను. ఇది నాకు దూషణ కాదు. నాకిది యాశీర్వచనమే. ఇది నాకు ఒక ఉపదేశము. నేనిక మీదట ఎవరిని దూషించరాదు. ఎవరిని నిందించరాదు. ఇతరుల విషయములో జోక్యము కలుగజేసికొనరాదు."

పండరీపురమునకు శిరిడీ మూడు వందల మైళ్ళ దూరమున నున్నది. బాబా సర్వజ్ఞుడగుటచే పండరీపురములో ప్లీడర్ల విశ్రాంతి గదిలో నేమి జరిగెనో తెలిసికొనిరి. ఈ నడుమనున్న స్థలము, నదులు, అడవులు, పర్వతములు, వారి సర్వజ్ఞత్వమున కడ్డుపడలేదు. వారు సర్వమును జూడ గలిగిరి. అందరి హృదయములలో గలదానిని చదువగలిగిరి. వారికి తెలియని రహస్యమేదియు లేదు. దగ్గర నున్నవి దూరముగ నున్నవి ప్రతి వస్తువు కూడ పగటి కాంతివలె వారికి తేటతెల్లము. ఎవడయిన దూరముగా గాని దగ్గరగా గాని యుండనిమ్ము. బాబా సర్వాంతర్యామి యగుటచే వారి దృష్టినుంచి తప్పించుకొనుటకు వీలులేదు. దీనిని బట్టి ప్లీడరొక నీతిని నేర్చుకొనెను. ఒకరిని గూర్చి చెడు చెప్పరాదు. మరియు ననవసరముగ వ్యాఖ్యానము చేయరాదు. అట్లు బాబా అతని దుర్గుణమును పోగొట్టి సన్మార్గమందు పెట్టెను.

ఇది యొక ప్లీడరును గూర్చినదైనప్పటికి అందరికి వర్తించును. కాబట్టి యీ కథ బోధించు నీతిని జ్ఞప్తియందుంచుకొని మేలు పొందెదము గాక.

సాయిబాబా మహిమ అగాధము, వారి లీలలు కూడ అట్టివే. వారి జీవితము అట్టిదే. వారు పరబ్రహ్మముయొక్క యవతారమే.

శ్రీసాయినాథాయ నమః

**ఇరువదియొకటవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువదిరెండవ అధ్యాయము

*పాము విషమునుంచి తప్పించుట: 1. బాలాసాహెబు మిరీకర్. 2. బాపూసాహెబు బూటీ 3. అమీరు శక్కర్. 4. హేమాడ్‌పంతు. సర్పములను చంపుట గూర్చి బాబా అభిప్రాయము*

**బా**బాను ధ్యానించుటెట్లు? భగవంతుని నైజముగాని, స్వరూపముగాని అగాధములు. వేదములుగాని, వెయ్యి నాలుకలు గల ఆదిశేషుడుగాని వానిని పూర్తిగా వర్ణింపలేరు. భక్తులు భగవంతుని రూపమును చూచి కనుగొని తీరవలెను. ఎందుకనగా తమ యానందమునకు భగవంతుని పాదములే ముఖ్యమార్గమని వారికి తెలియును. జీవిత పరమార్థమును పొందుటకు గురుని పాదములనే ధ్యానించవలెను గాని యింకొక మార్గము లేదని వారలకు తెలియును. హేమాడ్‌పంతు ఒక సులభమైన మార్గమును ఉపదేశరూపముగా చెప్పుచున్నాడు. అది ధ్యానమునకు భక్తికి కూడ అనుకూలించును.

నెలలో కృష్ణపక్షమున రానురాను వెన్నెల క్రమముగా క్షీణించును. తుదకు అమావాస్యనాడు చంద్రుడు కానరాడు. వెన్నెల కూడ రాదు. శుక్లపక్షము ప్రారంభమవగనే ప్రజలు చంద్రుని చూచుటకు ఆతురపడెదరు. మొదటి దినము చంద్రుడు కానరాడు. రెండవనాడది సరిగా కనిపించదు. అప్పుడు రెండు చెట్టుకొమ్మల మధ్యగుండా చూడుమనెదరు. ఆతురతతో

నేకధ్యానముతో ఆ సందుద్వారా చూచునప్పుడు దూరముగా నున్న చంద్రుని యాకారమొక గీతవలె గాన్పించును. వారప్పుడు సంతసించెదరు. ఈ సూత్రము ననుసరించి బాబా తేజమును జూచెదము గాక. బాబా కూర్చున్న విధానమును జూడుడు. అది యెంత సుందరముగా నున్నది! వారు కాళ్ళను ఒకదానిపైని ఇంకొకటి వేసియున్నారు. ఎడమచేతి వ్రేళ్ళు కుడి పాదముపై వేసియున్నారు. కుడికాలి బొటన వ్రేలుపై చూపుడు వ్రేలున్ను మధ్య వ్రేలున్ను ఉన్నవి. ఈ కూర్చున్న విధమునుబట్టి చూడగా బాబా మనకీ దిగువ విషయము చెప్ప నిశ్చయించు కొన్నట్లున్నది. "నా ప్రకాశమును చూడవలెనంటే, అహంకారమును విడిచి మిక్కిలి యణకువతో చూపుడు వ్రేలుకు మధ్యవ్రేలుకు మధ్యనున్న బొటన వ్రేలుపై దృష్టిని సారించినచో నా ప్రకాశమును జూడగలరు. ఇది భక్తికి సులభమైన మార్గము."

ఒక క్షణము బాబా జీవితమును గమనించెదము. బాబా నివాసము వలన శిరిడీ యొక యాత్రాస్థల మాయెను. అన్ని మూలలనుండి ప్రజలచట గుమిగూడుచుండిరి. బీదవారు గొప్ప వారు కూడ అనేకవిధముల మేలు పొందుచుండెడివారు. బాబా యొక్క యనంతప్రేమను, ఆశ్చర్యకరమైన సహజమైన వారి జ్ఞానమును, వారి సర్వాంతర్యామిత్వమును వర్ణించగల వారెవ్వరు? వీనిలో నేదైన నొకదానిని గాని, యన్నియుగాని యనుభవించినవారు ధన్యులు. ఒక్కొక్కప్పుడు బాబా దీర్ఘమౌనము పాటించువారు. అది వారియొక్క బ్రహ్మబోధము. ఇంకొకప్పుడు చైతన్యఘనులుగా నుండువారు. ఆనందమున కవతారముగా భక్తులచే పరివేష్టితులై యుండెడివారు. ఒక్కొక్కప్పుడు వారు నీతిని బోధించు కథలను చెప్పెడివారు. ఇంకొకప్పుడు హాస్యము, తమాషా చేయుటలో మునిగెడివారు. ఒకప్పుడు సూటిగా మాట్లాడువారు. ఒక్కొక్కప్పుడు కోపోద్దీపితుడా యని తోచువారు. ఒక్కొక్కపుడు తమ బోధలు క్లుప్తముగా చెప్పుచుండెడివారు. ఒక్కొక్కపుడు దీర్ఘ వివాదములోనికి దించెడివారు. అనేకసార్లు ఉన్నదున్నట్లు మాట్లాడెడివారు. ఈ ప్రకారముగ సందర్భావసరముల బట్టి వారి ప్రబోధము అనేక విధముల అనేకమందికి కలుగుచుండెడిది. వారి జీవిత మగోచరమైనది. అది మన మేధాశక్తికి భాషకు అందుబాటులో నుండెడిదికాదు. వారి

ముఖారవిందమును జూచుటయందు అనక్తిగాని, వారితో సంభాషించుటయందుగాని, వారి లీలలు వినుటయందుగాని తనివి తీరెడిదికాదు. అయినప్పటికి సంతోషముతో నుప్పొంగుచుండేవారము. వర్షబిందువులను లెక్కించగలము; తోలుసంచిలో గాలిని మూయగలము. కాని బాబా లీలలను లెక్కించలేము. వానిలో నొక్కదానిని గూర్చి చెప్పెదము. భక్తుల యాపదలను కనుగొని, భక్తులను వాని బారినుండి సకాలమున బాబా యెట్లు తప్పించుచుండెనో యిచట చెప్పెదుము.

**బాలాసాహెబు మిరీకర్**

సర్దారు కాకాసాహెబు మిరీకర్ కొడుకగు బాలాసాహెబు మిరీకర్ కోపర్‌గాంకు మామలతదారుగా నుండెను. అతడొకనాడు చితలీ గ్రామపర్యటనకు పోవుచుండెను. మార్గమధ్యమున బాబాను జూచుటకు శిరిడీకి వచ్చెను. మసీదుకు బోయి, బాబాకు నమస్కరించెను. బాబా ఆతని యోగక్షేమముల నడిగి, జాగ్రత్తగా నుండవలెనని హెచ్చరిక చేయుచు నిట్లడిగెను. "నీకు మన ద్వారకామాయి తెలియునా?" బాలాసాహెబునకు ఆ ప్రశ్న బోధపడక పోవుటచే ఊరకుండెను. "నీవిప్పుడు కూర్చున్నదే ద్వారకామాయి. ఎవరైతే ఆమె ఒడిలో కూర్చొనెదరో వారిని ఆమె కష్టములనుండి యాతురతల నుండి తప్పించును. ఈ మసీదు తల్లి చాల దయార్ద్రహృదయురాలు. ఆమె నిరాడంబర భక్తులకు తల్లి. వారిని ఆపదలనుండి తప్పించును. ఆమె ఒడి నాశ్రయించిన వారి కష్టములన్నియు సమసిపోవును. ఎవరామె నీడ నాశ్రయించెదరో వారికి ఆనందము కలుగును" అనెను. పిమ్మట బాలాసాహెబుకు ఊదీ ప్రసాదమిచ్చి వాని శిరస్సుపై చేయి వేసెను. బాలాసాహెబు పోవుచుండగా బాబా, "నీకు ఆ పొడుపాటి వ్యక్తి తెలియునా? అదే, సర్పము!" అనెను. బాబా తమ ఎడమచేతిని మూసి దానిని కుడిచేతి వద్దకు తెచ్చి పాముపడగవలె నుంచి, "అతడు మిక్కిలి భయంకరమైనవాడు. కాని ద్వారకామాయి బిడ్డలను అతడేమి చేయగలడు? ద్వారకామాయి కాపాడుచుండగా, పాము యేమి చేయగలదు?" అనెను.

అక్కడున్నవారందరు దీని భావమును దెలిసికొనుటకు, దానికి మిరీకరుకు గల సంబంధమును దెలిసికొనుటకు కుతూహల పడుచుండిరి. కాని బాబా నీవిషయమై యడుగుటకు ధైర్యము లేకుండెను. బాలాసాహెబు బాబాకు నమస్కరించి, మసీదును విడచి శ్యామాతో వెళ్ళెను. బాబా శ్యామాను బిలిచి, బాలాసాహెబుతో చితలీ వెళ్ళి యానందించుమనెను. బాబా యాజ్ఞానుసారము తాను కూడా వెంట వచ్చెదనని శ్యామా బాలాసాహెబుతో చెప్పెను. అసౌకర్యముగ నుండును కాన, వద్దని బాలాసాహెబు శ్యామాతో చెప్పెను. శ్యామా బాబాకీ సంగతి దెలిపెను. బాబా యిట్లనెను. "సరే, వెళ్ళవద్దు. వాని మంచి మనము కోరితిమి. ఏది నుదుట వ్రాసియున్నదో యది జరుగక తప్పదు."

ఈ లోపల బాలాసాహెబు తిరిగి యాలోచించి శ్యామాను తన వెంట రమ్మనెను. శ్యామా బాబావద్ద కేగి సెలవు పుచ్చుకొని బాలాసాహెబుతో టాంగాలో బయలుదేరెను. వారు రాత్రి 9 గంటలకు చితలీ చేరిరి. ఆంజనేయాలయములో బసచేసిరి. కచేరీలో పనిచేయువారెవరు రాలేదు; కావున నెమ్మదిగా నొకమూల కూర్చొని మాట్లాడుచుండిరి. చాపపైని కూర్చొని బాలాసాహెబు వార్తాపత్రిక చదువుచుండెను. అతడు ధరించిన అంగవస్త్రముపై నొక సర్పముండెను. దాని నెవ్వరును చూడలేదు. అది బుసకొట్టుచు కదలుచుండెను. ఆధ్వని నౌకరు వినెను. అతడొక లాంతరు దెచ్చి, సర్పమును జూచి పాము పామని యరచెను. బాలాసాహెబు భయపడెను. వణకుట ప్రారంభించెను. శ్యామా కూడ ఆశ్చర్యపడెను. అందరు మెల్లగా కట్టెలను దీసిరి. బాలాసాహెబు నడుమునుండి పాము దిగుటకు ప్రారంభించెను. దానిని కొట్టి చంపివేసిరి. ఈ ప్రకారముగా బాబా ముందుగా హెచ్చరించి బాలాసాహెబును హానినుండి తప్పించిరి. బాబా యందు బాలాసాహెబుకు గల ప్రేమ దృఢమయ్యెను.

**బాపూసాహెబు బూటీ**

నానా డేంగలే యను గొప్ప జ్యోతిష్కుడు, బాపూసాహెబు బూటీ శిరిడీలో నుండునప్పుడు, ఒకనాడిట్లనెను. "ఈ దినము నీకు అశుభము. నీకీ దినము

ప్రాణగండమున్నది." ఇది బాపూసాహెబును ఆందోళనకు గురిచేసెను. ఆయన యథాప్రకారము మసీదుకు బోగా, బాబా బాపూసాహెబుతో నిట్లనియెను. *"ఈ నానా యేమనుచున్నాడు? నీకు మరణ మున్నదని చెప్పుచున్నాడు గదా? సరే! నీవు యేమీ భయపడనక్కరలేదు: 'మృత్యువు ఎట్లు చంపునో చూచెదము గాక!' యని వానికి ధైర్యముతో జవాబిమ్ము!"* ఆనాటి సాయంకాలము బాపూసాహెబు బూటీ మరుగు దొడ్డికి పోయెను. అక్కడొక పామును జూచెను. అతని నౌకరు దానిని చూచెను. ఒక రాయినెత్తి కొట్టబోయెను. బాపూసాహెబు పెద్ద కఱ్ఱను దీసికొని రమ్మనెను. నౌకరు కఱ్ఱను తీసికొని వచ్చునంతలో, పాము కదలిపోయి యదృశ్య మయ్యెను. ధైర్యముతో నుండుమని యాడిన బాబా పలుకులను బాపూసాహెబు జ్ఞప్తికి తెచ్చుకొని సంతోషించెను.


### అమీరు శక్కర్

కోపర్‌గాం తాలుకాలో కొరాలే గ్రామనివాసి అమీరు శక్కర్. అతడు కసాయి కులమునకు చెందినవాడు. అతడు బాంద్రాలో కమీషను వ్యాపారిగ పనిచేసెను. అక్కడతనికి మంచి పలుకుబడి కలదు. అతడు కీళ్ళవాతముతో బాధపడుచుండుటచే, భగవంతుని జ్ఞప్తికి దెచ్చుకొని, వ్యాపారమును విడిచిపెట్టి శిరిడీ చేరి బాధనుండి తప్పింపుమని బాబాను వేడెను. చావడిలో కూర్చొనుమని బాబా అతనినాజ్ఞాపించెను. అటువంటి రోగికి ఆ స్థలము సరియైనది కాదు. అది యెల్లప్పుడు తేమగా నుండును. గ్రామములో నింకేదైన స్థలము బాగుండెడిది. కానీ బాబా పలుకులే తగిన యౌషధము, నిర్ణయసూత్రము. మసీదుకు వచ్చుటకు బాబా అతనికి అనుజ్ఞ ఇవ్వలేదు. చావడిలోనే కూర్చొనుమని యాజ్ఞాపించెను. అది వానికి మిక్కిలి లాభకారి యయ్యెను. ఎందుకనగా బాబా ఉదయము సాయంకాలము చావడివైపు పోవుచుండెను. అదియును గాక దినము విడిచి దినము ఉత్సవముతో బోయి బాబా యచట నిద్రించుచుండెను. అందుచే అమీరు బాబా యొక్క సాంగత్యమును సులభముగా పొందుచుండెను. పూర్తిగా 9 మాసములు అమీరు శక్కర్ అక్కడ నుండెను. కొంతకాలము తరువాత అతనికి ఆ స్థలముపై విసుగు కలిగెను. ఒకనాటి రాత్రి యెవరికి చెప్పకుండ కోపర్‌గాం పారిపోయెను. అచ్చటొక

ధర్మశాలలో దిగెను. అక్కడొక ఫకీరు చచ్చుటకు సిద్ధముగా నుండెను. ఫకీరు నీళ్ళు కావలెననగా అమీరు పోయి నీరు తెచ్చి యిచ్చెను. ఆ నీళ్ళను త్రాగి ఫకీరు చనిపోయెను. అమీరు చిక్కులో పడెను. అతడు పోలీసువారికి తెలియపరచినచో, మొట్టమొదట సమాచారమును దెచ్చినవాడగుటచే తనకా ఫకీరు విషయమేమైన తెలిసియుండునని పట్టుకొనెదరు. ఆ చావునకు కూడ అతడు కారణభూతుడయి యుండవచ్చునని యనుమానించెదరు. బాబా యాజ్ఞ లేనిది శిరిడీ విడిచిపెట్టుట తనదే తప్పని అతడు గ్రహించి, పశ్చాత్తాపపడెను. శిరిడీ పోవ నిశ్చయించుకొని యా రాత్రియే యచటనుండి శిరిడీకి పోయెను. మార్గమధ్యమున బాబా నామమును జపము చేయుచుండెను. సూర్యోదయమునకు ముందు శిరిడీ చేరి యాతురతనుండి తప్పించుకొనెను. బాబా యాజ్ఞానుసారము చావడిలోనే యుండి రోగవిముక్తుడయ్యెను. ఒకనాటి మధ్యరాత్రి బాబా, "ఓ అబ్దుల్! నా పరుపువైపు ఏదోదుష్టప్రాణి వచ్చుచున్నది" యని యరచెను. లాంతరు దీసికొని అబ్దుల్ వచ్చి బాబా పరుపు జూచెను గాని యేమియు గాన్పించలేదు. జాగ్రత్తగా చూడుమని బాబా చెప్పుచు నేలపై సటకాతో కొట్టుచుండెను. అమీరు శక్కర్ బాబా లీలను జూచి అచ్చటకు పాము వచ్చెనని బాబా యనుమానించి యుండునని యనుకొనెను. బాబా సాంగత్యము వలన, బాబా యాడుమాటల, చేయు క్రియల భావమును అమీరు గ్రహించు చుండెను. అమీరు తన దిండుకు సమీపమున నేదో కదలుచుండుట గమనించి, అబ్దుల్‌ను లాంతరు తీసికొని రమ్మనెను. అంతలో నచ్చటొక పాము కనబడెను. అది తలను క్రిందికి పయికి ఆడించుచుండెను. వెంటనే దానిని చంపిరి. ఇట్లు బాబా సకాలమున హెచ్చరిక చేసి అమీరును కాపాడెను.

**తేలు-పాము**

**1. తేలు:** బాబాఆజ్ఞచే కాకాసాహెబు దీక్షిత్ నిత్యము శ్రీఏకనాథ మహరాజ్ రచించిన భాగవతమును, భావార్థ రామాయణమును పారాయణ చేయుచుండెను. ఒకనాడు పురాణకాలక్షేపము జరుగుచుండగా హేమాడ్‌పంతు గూడ శ్రోతయయ్యెను. రామాయణములో అంజనేయుడు



ద్వారకామాయి (మసీదు) లోని

**శ్రీసాయిబాబా చిత్రపటము**

తన తల్లి యాజ్ఞానుసారము శ్రీరాముని మహిమను పరీక్షించు భాగము చదువునప్పుడు వినువారందరు మైమరిచియుండిరి. అందులో హేమాడ్‌పంతొకడు. ఇంతలో ఒకపెద్ద తేలు హేమాడ్‌పంత్ భుజముపై బడి వాని యుత్తరీయముపై కూర్చుండెను. మొదట దాని నెవ్వరు గమనించలేదు. ఎవరు పురాణముల శ్రవణము జేసెదరో వారిని భగవంతుడు రక్షించును. ఇంతలో హేమాడ్‌పంతు తన కుడి భుజముపై నున్న తేలును జూచెను. అది చచ్చినదానివలె నిశ్శబ్దముగా కదలకుండెను. అది కూడ పురాణము వినుచున్నట్లు గనుపించెను. భగవంతుని కటాక్షమును స్మరించి, పురాణశ్రవణములో నున్న నితరులకు భంగము కలుగజేయకుండ, యుత్తరీయము రెండు చివరలను పట్టుకొని, దానిలో తేలుండునట్లు జేసి, బయటకు వచ్చి ఆ తేలును తోటలో పారవైచెను.

**2. పాము:** ఇంకొకప్పుడు సాయంకాలము కాకాసాహెబు మేడమీద కొందరు కూర్చొని యుండిరి. ఒక సర్పము కిటికీలోనున్న చిన్న రంధ్రము ద్వారా దూరి చుట్టుకొని కూర్చొనెను. దీపమును దెచ్చిరి. మొదట అది వెలుతురుకు తడబడెను. అయినప్పటికి అది నెమ్మదిగా కూర్చొనెను. తల మాత్రము క్రిందకు మీదకు నాడించుచుండెను. అనేకమంది బడితెలు కఱ్ఱలు తీసుకొని వేగముగా వచ్చిరి. అది యెటూ కాని స్థలములో నుండుటచే దానిని చంపలేకుండిరి. మనుష్యుల శబ్దమును విని యా సర్పము వచ్చిన రంధ్రములోనికి గబగబ దూరెను. అందరు ఆపదనుండి తప్పించుకొనిరి.

### బాబా అభిప్రాయము

ముక్తారామ్ యను నొక భక్తుడు పాము తప్పించుకొని పోవుటచే మంచియే జరిగినదనెను. హేమాడ్‌పంతు అందుల కొప్పుకొనలేదు. అది సరియైన యాలోచన కాదనెను. పాములను చంపుటయే మంచిదనెను. ఇద్దరికి గొప్ప వాదన జరిగెను. ముక్తారామ్ సర్పములు మొదలగు క్రూరజంతువులను చంప నవసరము లేదనెను. హేమాడ్‌పంతు వానిని తప్పక చంపవలెననెను. రాత్రి సమీపించెను. చర్చ సమాప్తి గాకుండెను. ఆ మరుసటి దిన మా ప్రశ్నను బాబా నడిగిరి. బాబా యిట్లు జవాబిచ్చెను: "భగవంతుడు సకలజీవులందు

నివసించుచున్నాడు. అవి సర్పములుగాని, తేళ్ళుగాని కానిండు. ఈ ప్రపంచమును నడిపించు సూత్రధారి భగవంతుడు. సకలజంతుకోటి పాములు, తేళ్ళతో సహ సకల ప్రాణులు భగవదాజ్ఞను శిరసావహించును. వారి యాజ్ఞయైనగాని యెవరు యెవరినీ యేమీ చేయలేరు. ప్రపంచమంతయు వానిపై నాధారపడి యున్నది. ఎవ్వరును స్వతంత్రులు కారు. కాబట్టి మనము కనికరించి అన్ని జీవులను ప్రేమించవలెను. అనవసరమైన కలహములందు, చంపుటయందు పాల్గొనక యోపికతో నుండవలెను. అందరిని రక్షించువాడు దైవమే!"

శ్రీసాయినాథాయ నమః

**ఇరువదిరెండవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

**మూడవరోజు పారాయణము సమాప్తము**



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువది మూడవ అధ్యాయము

### నాల్గవ రోజు పారాయణము

**ఆదివారము**

*1. యోగము - ఉల్లిపాయ. 2. శ్యామా పాముకాటు బాగగుట. 3. కలరా నియమముల నుల్లంఘించుట. 4. గురుభక్తి పరీక్ష*

**ని**జముగా నీ జీవుడు త్రిగుణములకు అనగా సత్వరజస్తమోగుణముల కతీతుడు. కాని మాయచే గప్పబడి, వాని నైజమగు సచ్చిదానందమును మరచుచు తాను శరీరమే యనుకొనుచు, అట్టి భావనతో తానే చేయువాడు అనుభవించువాడు అని యనుకొనుచు, లెక్కలేని బాధలలో చిక్కుకొనుచు విముక్తిని గాంచలేకున్నాడు. విమోచనమునకు మార్గమొక్కటే కలదు. అది గురుని పాదములయందు ప్రేమమయమగు భక్తి. గొప్పనటుడగు సాయి తన భక్తులను వినోదింపజేసి వారిని తమ నైజములోనికి మార్చెను.

ఇంతకు పూర్వము చెప్పిన కారణములచే మేము సాయిని భగవంతుని యవతారముగా నెన్నుచున్నాము. కాని వారెల్లప్పుడు తాము భగవంతుని సేవకుడనని చెప్పెడివారు. వారు అవతారపురుషులయినప్పటికి ఇతరులు సంతృప్తికరముగా నెట్లు ప్రవర్తింపవలెనో చూపుచుండెడివారు; ఆయా వర్ణాశ్రమములకు విధింపబడిన కర్మల నెట్లు నెరవేర్చవలెనో తెలిపెడివారు. ఇతరులతో యేవిషయములోనూ పోటీ పడెడివారు కారు. తనకొరకేమైన

చేయుమని యితరులను కోరెడివారు కారు. సమస్త చేతనాచేతనములందు, భగవంతుని జూడగలిగిన బాబాకు వినయశీలమే ఉచితముగదా! ఎవరిని నిరాదరించుటగాని, అవమానించుటగాని వారెరుగరు. సమస్తజీవులలో వారు నారాయణుని గాంచుచుండెడివారు. 'నేను భగవంతుడను' అని వారెన్నడు అనలేదు. భగవంతుని విధేయసేవకుడనని వారు చెప్పేవారు; భగవంతుని ఎల్లప్పుడు తలచువారు. ఎల్లప్పుడు 'అల్లా మాలిక్!' అనగా భగవంతుడే సర్వాధికారియని యను చుండెడివారు.

మేమితర యోగుల నెరుగము. వారెట్లు ప్రవర్తింతురో, ఏమి చేసెదరో, ఎట్లు తినెదరో తెలియదు. భగవత్కటాక్షముచే వారవతరించి యజ్ఞానులకు, బద్ధజీవులకు విమోచనము కలుగజేసెదరని మాత్రమెరుగుదుము. మన పుణ్యమేమైన యున్నచో మహాత్ముల కథలను లీలలను వినుటకు కుతూహలము కలుగును. లేనిచోనట్లు జరుగదు. ఇక నీ యధ్యాయములోని ముఖ్య కథలను చూచెదము.

**యోగము - ఉల్లిపాయ**

ఒకనాడు యోగాభ్యాసము చేయు సాధకుడొకడు నానాసాహెబు చాందోర్కరుతో కలసి శిరిడీకి వచ్చెను. అతడు యోగశాస్త్రమునకు సంబంధించిన గ్రంథములన్నియు చదివెను. తుదకు పతంజలి యోగసూత్రములు కూడ చదివెను. కాని యనుభవమేమియు లేకుండెను. అతడు మనస్సును కేంద్రీకరించి సమాధిస్థితిలో కొంచెము సేపయిన నుండలేకుండెను. సాయిబాబా తన యెడ ప్రసన్నుడైనచో చాలసేపు సమాధిలో నుండుట నేర్పెదరని అతడనుకొనెను. ఈ లక్ష్యముతో నాతడు శిరిడీకి వచ్చెను. అతడు మసీదుకు పోయి చూచుసరికి బాబా ఉల్లిపాయతో రొట్టె తినుచుండిరి. దీనిని చూడగనే అతనికి మనస్సున ఒక యాలోచన మెదిలెను. 'రుచిలేని రొట్టెను పచ్చి యుల్లిపాయతో తినువాడు నాకష్టముల నెట్లు తీర్చగలడు? నన్నెట్లు ఉద్ధరించగలడు?' సాయిబాబా యతని మనస్సున మెదిలిన ఆలోచనను గ్రహించి, నానాసాహెబుతో నిట్లనియెను. "నానా! యెవరికైతే ...ని జీర్ణించుకొను శక్తి కలదో వారే దానిని తినవలెను." ఇది విని యోగి

యాశ్చర్యపడెను. వెంటనే బాబా పాదములపయి బడి సర్వస్యశరణాగతి చేసెను. స్వచ్ఛమైన మనస్సుతో తన కష్టముల దెలిపి ప్రత్యుత్తరముల బడసెను. ఇట్లు సంతృప్తి జెంది యానందించినవాడై బాబా ఊదీ ప్రసాదముతో ఆశీర్వచనములతో శిరిడీ విడిచెను.

**పాముకాటు నుండి శ్యామాను కాపాడుట**

ఈ కథను ప్రారంభించకపూర్వము హేమాడ్‌పంత్, జీవుని పంజరములో నున్న రామచిలుకతో సరిపోల్చవచ్చుననిరి. రెండును బంధింపబడియే యున్నవి; ఒకటి శరీరములోను, రెండవది పంజరమందును. రెండును తమ ప్రస్తుతస్థితియే బాగున్నదని యనుకొనుచున్నవి. సహాయకుడు వచ్చి వానిని బంధములనుండి తప్పించగనే వానికి నిజము తెలియును. భగవత్కటాక్షముచే గురువు వచ్చి వారి కండ్లను తెరిపించి బంధవిముక్తుల జేసినప్పుడు వారి దృష్టి యన్నిటికంటె గొప్ప స్థితివైపు బోవును. అప్పుడే గతించిన జీవితముకంటె రానున్నది గొప్పదియని గ్రహింతురు.

గత అధ్యాయములో మిరీకర్‌కు రానున్న యపాయము గనిపెట్టి దానినుండి యతనిని తప్పించిన కథ వింటిరి. అంతకంటె ఘనమగు కథను ఇచ్చట వినెదరు. ఒకనాడు శ్యామాను విషసర్పము కరచెను. అతని చిటికెన వ్రేలును పాము కరచుటచే శరీరములోనికి విషము వ్యాపింప మొదలిడెను. బాధ యెక్కువగా నుండెను. శ్యామా తాను మరణించెద ననుకొనెను. స్నేహితులాతని విరోబా గుడికి తీసికొనిపోవ నిశ్చయించిరి. పాముకాట్లు అచ్చట బాగగుచుండెను. కాని శ్యామా తన విరోబా యగు బాబా వద్దకు పరుగిడెను. బాబా యతనిని జూడగనే కోపముతో వానిని తిట్టనారంభించెను. "ఓరి పిరికి పురోహితుడా! పైకెక్కవద్దు! ఎక్కితివో నేమగునో చూడు" మని బెదిరించుచూ, తరువాత ఇట్లు గర్జించెను: "పో, వెడలి పొమ్ము, దిగువకు పొమ్ము." బాబా యిట్లు కోపోద్దీపితుడగుట జూచి శ్యామా మిక్కిలి విస్మయమందెను. నిరాశ చెందెను. అతడు మసీదును తన యిల్లుగా, బాబా తన యాశ్రయముగా భావించుచుండెను. బాబా తననట్లు తరిమివేసినచో తానెక్కడకు పోగలడు? అతడు ప్రాణమందాశ వదలుకొని యూరకుండెను. కొంతసేపటికి బాబా

శాంతించి, శ్యామా దగ్గరకు పోయి కూర్చుని, యిట్లనెను: "భయపడవద్దు. ఏ మాత్రము చింతించకు. ఈ దయామయుడైన ఫకీరు నిన్ను తప్పక రక్షించును. ఇంటికి పోయి ఊరక కూర్చుండుము. బయటికి పోవద్దు. నాయందు విశ్వాసముంచుము. భయపడకుము. ఆందోళన పడవద్దు" ఇట్లని శ్యామాను ఇంటికి పంపించెను. వెంటనే బాబా తాత్యా పాటిలును, కాకాసాహెబు దీక్షితుని అతని వద్దకు పంపి, తన కిష్టము వచ్చినవి తినవచ్చుననియు, గృహములోనే తిరుగవచ్చుననియు, కాని పండుకొనగూడదనియు, ఈ సలహాల ప్రకారము నడుచుకొమ్మనెను. కొద్ది గంటలలో శ్యామా బాగుపడెను. ఈ పట్టున జ్ఞప్తియందుంచుకొనవలసిన దేమన, బాబా పలికిన 5 అక్షరముల మంత్రము (పో, వెడలిపొమ్ము, క్రిందకు దిగు) శ్యామాను ఉద్దేశించినదిగాక విషమును ఆజ్ఞాపించిన మాటలు. ఆ విషము పైకి ఎక్కరాదనియు, అది శరీరమంతట వ్యాపించరాదనియు బాబా ఆజ్ఞాపించిరి. మంత్రములలో నారితేరిన తక్కినవారివలె, వారేమంత్రము ఉపయోగింప నవసరము లేకుండెను. మంత్రబియ్యము కాని, తీర్థముగాని ఉపయోగించ నవసరము లేకుండెను. శ్యామా జీవితమును రక్షించుటలో వారి పలుకులే అత్యంత శక్తివంతములైనవి.

ఎవరైన ఈ కథగాని, యింక నితరకథలు గాని, వినినచో బాబా పాదములయందు స్థిరమైన నమ్మకము కలుగును. మాయయను మహా సముద్రమును దాటుటకు బాబా పాదములను హృదయములో ధ్యానించవలెను.

**కలరా రోగము**

ఒకప్పుడు శిరిడీలో కలరా భయంకరముగా చెలరేగుచుండెను. గ్రామవాసులు మిక్కిలి భయపడిరి. వారితరులతో రాకపోకలు మానిరి. గ్రామములో పంచాయితీవారు సభ చేసి రెండత్యవసరమైన నియమములు చేసి, కలరా నిర్మూలించ ప్రయత్నించిరి. అవి యేవన 1. కట్టెల బండ్లను గ్రామములోనికి రానీయకూడదు; 2.మేకను గ్రామములో కోయరాదు. ఎవరయిన వీనిని ధిక్కరించినచో వారికి జరిమానా వేయవలెనని తీర్మానించిరి.

బాబా కిదంతయు వట్టి చాదస్తమని తెలియును. కాబట్టి బాబా యా చట్టములను లక్ష్యపెట్టలేదు. ఆ సమయములో కట్టెలబండి యొకటి ఊరిలోనికి ప్రవేశించుచుండెను. ఊరిలో కట్టెలకు కరువున్నదని అందరికి తెలియును. అయినప్పటికి కట్టెలబండిని తరిమివేయుటకు ప్రయత్నించుచుండిరి. బాబా యా సంగతి తెలిసికొని, అచ్చటికి వచ్చి కట్టెలబండిని మసీదుకు తీసికొనిపొమ్మని యుత్తరువు నిచ్చెను. బాబా చర్యకు వ్యతిరేకముగా చెప్పుటకెవ్వరు సాహసించలేదు. ధునికొరకు కట్టెలు కావలసియుండెను. కనుక బాబా కట్టెలు కొనెను. నిత్యాగ్నిహోత్రివలె బాబా తన జీవితమంతయు ధునిని వెలిగించియే యుంచెను. అందులకయి వారికి కట్టెలవసరము గనుక వాటిని నిల్వ చేయువారు. బాబా గృహము, అనగా మసీదు, ఎప్పుడు తెరచియుండెడిది. ఎవరయిన పోవచ్చును. దానికి తాళముగాని చెవి లేదు. కొందరు తమ యుపయోగము కొరకు కొన్ని కఱ్ఱలను తీసికొనిపోవువారు. అందుకు బాబా యెప్పుడును గొణుగుకొన లేదు. ఈ ప్రపంచమంతయు దేవుడే యావరించి యుండుటచే వారికి ఎవరియందు శత్రుత్వముండెడిది గాదు. వారు పరిపూర్ణవిరాగులైనప్పటికి సాధారణ గృహస్థులకు ఆదర్శముగా నుండుటకై యిట్లు చేయుచుండెడివారు.

### గురుభక్తిని పరీక్షించుట

రెండవ కలరా నిబంధనమును బాబా యెట్లు ధిక్కరించెనో చూతము. నిబంధనలమలులో నున్నప్పుడెవరో యొక మేకను మసీదుకు తెచ్చిరి. ఆ ముసలి మేక దుర్బలముగా చావుకు సిద్ధముగా నుండెను. ఆ సమయమున మాలేగాం ఫకీరు పీర్ మహమ్మద్ ఉరఫ్ బడేబాబా యచటనే యుండెను. సాయిబాబా దానిని యొక కత్తి వ్రేటుతో నరికి బలి వేయుమని బడేబాబాకు చెప్పెను. ఈ బడేబాబా యందు సాయిబాబాకు ఎక్కువ గౌరవము. ఆయనను ఎల్లప్పుడు సాయిబాబా తన కుడివయిపున కూర్చొనబెట్టుకొనెడివారు. చిలుము బడేబాబా పీల్చిన పిదప సాయిబాబా పీల్చి యితరులకు ఇచ్చెడివారు. మధ్యాహ్న భోజనసమయమందు సాయిబాబా సాదరముగ బడేబాబాను పిలిచి, యెడమప్రక్కన కూర్చుండబెట్టుకొనిన పిమ్మట భోజనము

ప్రారంభించువారు. దక్షిణ రూపముగా వసూలయిన పైకమునుంచి ఆయనకు దినమొక్కంటికి 50 రూపాయలు సాయిబాబా యిచ్చుచుండెడివారు. బడేబాబా పోవునప్పుడు 100 అడుగుల వరకు సాయిబాబా వెంబడించువారు. అట్టిది బాబాకు వారికి గల సంబంధము. సాయిబాబా వారిని మేకను నరుకుమనగా అనవసరముగా దానిని చంపనేలయని బడేబాబా నిరాకరించెను. అప్పుడు సాయిబాబా శ్యామాను ఆపని చేయుమనెను. అతడు రాధాకృష్ణమాయివద్దకు పోయి కత్తిని దెచ్చి బాబా ముందు బెట్టెను. ఎందులకు కత్తిని దెప్పించిరో తెలిసికొనిన పిమ్మట రాధాకృష్ణమాయి దానిని తిరిగి తెప్పించుకొనెను. ఇంకొక కత్తి తెచ్చుటకు శ్యామా పోయెను; కాని వాడా నుండి త్వరగా రాలేదు. తరువాత కాకాసాహెబు దీక్షిత్ వంతు వచ్చెను. వారు మేలిమి బంగారమే కాని, దానిని పరీక్షించవలెను. ఒక కత్తి దెచ్చి నరుకుమని బాబా యాజ్ఞాపించెను. అతడు సాఠేవాడాకు బోయి కత్తిని దెచ్చెను. బాబా యుత్తరువు కాగానే దానిని నరకుటకు సిద్ధముగా నుండెను. అతడు స్వచ్ఛమైన బ్రాహ్మణకుటుంబములో పుట్టి చంపుట యనునది ఎరుగకుండిరి. హింసించు పనులను చేయుటయం దిష్టము లేనివాడయినప్పటికి, మేకను నరకుటకు సంసిద్ధుడయ్యెను. బడేబాబాయను మహమ్మదీయుడే యిష్టపడ నప్పుడు ఈ బ్రాహ్మణుడేల సిద్ధపడుచుండెనని యందరాశ్చర్య పడుచుండిరి. అతడు తన ధోవతిని ఎత్తి బిగించి కట్టుకొనెను. కత్తిని పయికెత్తి బాబా యాజ్ఞకై యెదురు చూచుచుండెను. బాబా *"ఏమి యాలోచించుచుంటివి? నరుకుము!"* అనెను. అతని చేతిలో నున్న కత్తి మేకపై పడుటకు సిద్ధముగా నుండగా బాబా ఆగు మనెను. *"ఎంతటి కఠినాత్ముడవు? బ్రాహ్మణుడవయి మేకను చంపెదవా?"* యనెను. బాబా యాజ్ఞానుసారము దీక్షిత్ కత్తిని క్రిందబెట్టి బాబాతో నిట్లనియె. *"నీ యమృతమువంటి పలుకే మాకు చట్టము. మాకింకొక చట్టమేమియు తెలియదు. నిన్నే యెల్లప్పుడు జ్ఞప్తియందుంచుకొనెదము. మీరూపమును ధ్యానించుచు రాత్రింబవళ్ళు నీ యాజ్ఞలు పాటింతుము. అది ఉచితమా? కాదా? యనునది మాకు తెలియదు. దానిని మేము విచారించము. అది సరియైనదా కాదా? యని వాదించము, తర్కించము. గురువు ఆజ్ఞ అక్షరాల పాటించుటయే మా విధి, మా ధర్మము."*

బాబా తామే మేకను చంపి బలివేసెదనని చెప్పిరి. మేకను 'తకియా' యనుచోట చంపుటకు నిశ్చయించిరి. ఇది ఫకీరులు కూర్చొను స్థలము. అచటికి దానిని తీసికొనిపోవునప్పుడు మార్గమధ్యమున అది ప్రాణములు విడిచెను.

శిష్యులెన్ని రకములో చెప్పుచు ఈ యధ్యాయము హేమాడ్‌పంతు ముగించుచున్నారు. శిష్యులు మూడు రకములు 1. ఉత్తములు, 2. మధ్యములు, 3. సాధారణులు.

గురువులకేమి కావలెనో గుర్తించి వెంటనే వారాజ్ఞాపించక పూర్వమే దానిని నేరవేర్చువారు ఉత్తమ శిష్యులు. గురుని యజ్ఞానుసారము ఆలసింపక అక్షరాల నెరవేర్చువారు మధ్యములు. మూడవ రకమువారు అడుగడుగునకు తప్పులు చేయుచు గురుని అజ్ఞను వాయిదా వేసెదరు.

శిష్యులకు దృఢమైన నమ్మకముండవలెను. తోడుగా బుద్ధి కుశలత యోరిమి యున్నచో అట్టివారికి ఆధ్యాత్మికపరమావధి దూరము కాదు. ఉచ్ఛ్వాసనిశ్వాసములను బంధించుట గాని, హఠయోగము గాని యితర కఠినమయిన సాధనలన్నియు ననవసరము. పైన చెప్పిన గుణముల నలవరచుకొన్నచో, వారు ఉత్తరోత్తరోపదేశముల కర్హులగుదురు. అప్పుడు గురువు తటస్థించి జీవిత పరమావధిని పొందుటకై ఆధ్యాత్మిక మార్గమున నడిపింతురు.

వచ్చే అధ్యాయములో బాబా యొక్క హాస్యము, చమత్కారముల గూర్చి చెప్పుకొందము.

శ్రీసాయినాథాయ నమః

**ఇరువదిమూడవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువదినాలుగవ అధ్యాయము

*బాబా హాస్యము, చమత్కారము, శనగల లీల*
*1. హేమాడ్‌పంతు 2. సుదామ 3. అన్నా చించణీకర్ 4. మావిశీ బాయి - అనుభవములు.*

ఈ అధ్యాయములోగాని, వచ్చే అధ్యాయములలోగాని ఫలానిది చెప్పెదమనుట ఒకవిధముగా అహంకారమే. మన సద్గురుని పాదములకు అహంకారమును సమర్పించినగాని, మన ప్రయత్నమందు జయమును పొందము. మన మహంకారరహితుల మయినచో, మన జయము నిశ్చయము.

సాయిబాబాను పూజించుటచే ఇహపరసౌఖ్యములు రెంటిని పొందవచ్చును. మన మూలప్రకృతియందు పాతుకొని, శాంతి సౌఖ్యములను పొందెదము. కాబట్టి యెవరయితే తమ క్షేమమును కోరెదరో వారు గౌరవాదరములతో సాయిబాబా లీలలను వినవలెను; మననము చేయవలెను. దీనిని నెరవేర్చినచో వారు సులభముగా జీవితపరమావధిని పొందెదరు. తుదకు మోక్షానందమును పొందెదరు.

సాధారణముగా నందరు హాస్యము, చమత్కారభాషణమన్న నిష్టపడెదరు గాని, తాము హాస్యాస్పదులగుట కిష్టపడరు. కాని బాబా చమత్కార మార్గము వేరు. అది అభినయముతో కూడినప్పుడు చాల సంతోషదాయకముగ

నీతిదాయకముగ నుండెడిది. కావున ప్రజలు తాము వెక్కిరింతపాలైనప్పటికి అంతగా బాధపడేవారు కారు. హేమాడ్‌పంతు తన విషయమునే యీ క్రింద తెలుపుచున్నాడు.

### శనగల కథ

శిరిడీలో ఆదివారమునాడు సంత జరిగెడిది. చుట్టుప్రక్కల పల్లెల నుండి ప్రజలు వచ్చి వీథులలో దుకాణములు వేసికొని వారి సరుకులు అమ్ముచుండెడివారు. ప్రతిరోజు మధ్యాహ్నము 12 గంటలకు మసీదు నిండుచుండెను. ముఖ్యముగా ఆదివారమునాడు క్రిక్కిరిసి పోవుచుండెను. ఒక ఆదివారమునాడు హేమాడ్‌పంతు సాయిబాబా ముందు కూర్చొని బాబా పాదము లొత్తుచు మనస్సునందు జపము చేయుచుండెను. బాబా యెడమవైపు శ్యామా, కుడివైపు వామనరావు ఉండిరి. శ్రీమాన్ బూటీ, కాకా సాహెబుదీక్షిత్ మొదలగువారు కూడ నుండిరి. శ్యామా నవ్వుచు అణ్ణా సాహెబుతో, "*నీ కోటుకు శనగగింజ లంటినట్లున్నవి చూడుము*" అనెను. అట్లనుచు హేమాడ్‌పంతు చొక్కా చేతులను తట్టగా శనగగింజలు నేల రాలెను. హేమాడ్‌పంతు తన చొక్కా ఎడమచేతి ముందుభాగమును సాచెను. అందరికి ఆశ్చర్యము కలుగునట్లు కొన్ని శనగగింజలు క్రిందికి దొర్లుట ప్రారంభించెను. అక్కడున్నవారు వానిని ఏరుకొనిరి.

ఈ సంఘటన హాస్యమునకు తావిచ్చెను. అక్కడున్న వారందరు ఆశ్చర్యపడిరి. ఎవరికి తోచినట్లు వారు శనగలు చొక్కాచేతిలో నెట్లు ప్రవేశించి యుండునో ఊహింపనారంభించిరి. శనగలు చొక్కాలో నెట్లు దూరి యచట నిలువగలిగినవో హేమాడ్‌పంతు కూడ గ్రహించలేకుండెను. ఎవ్వరికి సరియైన సమాధానము తోచక జవాబు నివ్వనప్పుడు అందరును ఈ యద్భుతమున కాశ్చర్యపడుచుండగా బాబా, "*వీనికి (అణ్ణాసాహెబుకు) తానొక్కడే తిను దుర్గుణ మొకటి గలదు. ఈనాడు సంతరోజు శనగలు తినుచు ఇక్కడకు వచ్చినాడు. వాని నైజము నాకు తెలియును. ఈ శనగలే దానికి నిదర్శనము. ఈ విషయములో నేమి యాశ్చర్యమున్నది?*" అనిరి.

హేమాడ్‌పంతు:- బాబా నేనెప్పుడు ఒంటరిగా తిని యెరుగను. అయితే యీ దుర్గుణమును నాపై నేల మోపెదవు? ఈనాటికి ఎన్నడును శిరిడీలోని

సంత నేను చూచి యుండలేదు. ఈ దినము కూడ నేను సంతకు పోలేదు. అట్లయినచో నేను శనగల నెట్లు కొనియుంటిని? నేను కొననప్పుడు నేనెట్లు తినియుందును? నాదగ్గర నున్నవారికి పెట్టకుండ నే నెప్పుడేమియు తిని యెరుగను.

బాబా:- అవును అది నిజమే. దగ్గరున్న వారి కిచ్చెదవు. ఎవరును దగ్గర లేనప్పుడు నీవుగాని, నేనుగాని యేమి చేయగలము? కాని నీవు తినుటకు ముందు నన్ను స్మరింతువా? నేనెల్లప్పుడు నీ చెంత లేనా? నీవేదైన తినుటకు ముందు నాకర్పించుచున్నావా?

**నీతి**

ఈ సంఘటనమున బాబా యేమి చెప్పిరో జాగ్రత్తగా గమనించెదము. పంచేంద్రియములకంటె ముందే, మనస్సు బుద్ధి విషయానంద మనుభవించును. కనుక మొదలే భగవంతుని స్మరించవలెను. ఇట్లు చేసినచో నిదికూడ ఒక విధముగ భగవంతుని కర్పితమగును. విషయములను విడిచి పంచేంద్రియము లుండలేవు. కనుక ఆ విషయములను మొదట గురుని కర్పించినచో వానియందభిమానము సహజముగా అదృశ్యమైపోవును. ఇవ్విధముగా కామము, క్రోధము, లోభము మొదలగువాని గూర్చిన వృత్తులన్నిటిని (ఆలోచనలను) మొట్టమొదట గురుని కర్పించవలెను. ఈ అభ్యాసము నాచరించినచో దేవుడు వృత్తులన్నియు నిర్మూలనమగుటకు సహాయపడును. విషయముల ననుభవించు ముందు బాబా మనచెంతనే యున్నట్లు భావించినచో, ఆ వస్తువు ననుభవింపవచ్చునా? లేదా? యను ప్రశ్న యేర్పడును. ఏది యనుభవించుటకు తగదో దానిని విడిచిపెట్టెదము. ఈ విధముగా మన దుర్గుణములన్నియు నిష్క్రమించును. మన శీలము చక్కబడును. గురువునందు ప్రేమ వృద్ధిపొందును. శుద్ధజ్ఞానము మొలకెత్తును. ఈ జ్ఞానము వృద్ధిపొందినప్పుడు దేహబుద్ధి నశించి, బుద్ధి చైతన్యఘనమున లీనమగును. అప్పుడే మన కానందము, సంతృప్తి కలుగును. గురువునకు, దేవునకు ఎవరు భేదము నెంచెదరో వారు దైవము నెచ్చటను జూడలేరు. భేదము లన్నింటిని ప్రక్కకు త్రోసి, గురువును, దేవుని ఒకటిగా భావించవలెను.

ఈ ప్రకారముగా గురుని సేవించినచో భగవంతుడు నిశ్చయముగా ప్రీతిచెందును. మన మనస్సులను స్వచ్ఛము చేసి ఆత్మ సాక్షాత్కారము ప్రసాదించును. క్లుప్తముగా చెప్పునదేమన మనము గురుని స్మరించనిదే యేవస్తువును పంచేంద్రియములతో ననుభవించరాదు. మనస్సును ఈ విధముగా శిక్షించినచో మనమెల్లప్పుడు బాబాను జ్ఞప్తియందుంచుకొనెదము. మనకు బాబా ధ్యాన మెన్నో రెట్లు వృద్ధిపొందును. బాబా సగుణస్వరూపము మన కండ్ల యెదుట నిలుచును. అప్పుడు భక్తి, వైరాగ్యము, మోక్షము మన వశమగును. మన మనస్సునందు బాబాను ఎప్పుడయితే నిలుపగలమో, అప్పుడు మనము ఆకలిని, పిపాసను, సంసారమును మరచెదము. ప్రపంచ సుఖములందు గల యభిలాష నశించి మన మనస్సులు శాంతిని, ఆనందమును పొందును.

**సుదాముని కథ**

పై కథ చెప్పుచున్నప్పుడే హేమాడ్‌పంతుకు సుదాముని కథ జ్ఞప్తికి వచ్చెను. అందులో కూడ ఇదే నీతి యున్నది. కనుక దాని నిక్కడ చెప్పుచున్నాము.

శ్రీకృష్ణుడు, అతని యన్న బలరాముడు, మరియొక సహపాఠి సుదాముడనువాడును గురువగు సాందీపని యాశ్రమములో నివసించుచుండిరి. శ్రీకృష్ణబలరాములను అడవికి పోయి కట్టెలు తీసికొని రమ్మని గురువు పంపెను. సాందీపని భార్య సుదాముని కూడ అదే పని మీద ముగ్గురి కొరకు శనగలిచ్చి పంపెను. కృష్ణుడు సుదాముని యడవిలో గలసి, "దాదా, నీళ్ళు కావలెను, నాకు దాహము వేయుచున్నది" అనెను. సుదాముడు, "ఉత్తకడుపుతో నీరు త్రాగకూడదు, కనుక కొంత తడవాగుట మంచి" దనెను. కాని తనవద్ద శనగలున్నవని, కొంచెము తినుమని యనలేదు. శ్రీకృష్ణుడు అలసియుండుటచే సుదాముని తొడపయి తల యుంచి గుఱ్ఱుపెట్టుచు నిద్రపోయెను. ఇది కనిపెట్టి సుదాముడు తన జేబులోని శనగలు తీసి తినుట కారంభించెను. హఠాత్తుగా శ్రీకృష్ణుడిట్లనెను. "దాదా యేమి తినుచుంటివి? ఎక్కడనుంచి యీ శబ్దము వచ్చుచున్నది?" సుదాముడిట్లనెను. "తినుట కేమున్నది? నేను చలితో వణకుచున్నాను. నా పండ్లు

కటకట మనుచున్నవి, విష్ణుసహస్రనామమును కూడ సరిగా ఉచ్ఛరించలేకున్నాను.'' ఇది విని సర్వజ్ఞుడగు శ్రీకృష్ణుడిట్లనెను. "నేనొక స్వప్నమును గంటిని. అందులో ఒకడింకొకరి వస్తువులను దినుచుండెను. ఏమి తినుచుంటివని యడుగగా ఏమున్నది తినుటకు మన్నా?'' యనెను. అనగా తినుట కేమియు లేదని భావము. రెండవవాడు 'తథాస్తు' అనెను. దాదా! యిది యొక స్వప్నము. నాకివ్వకుండ నీవేమియు తినవని నాకు తెలియును. స్వప్నప్రభావముచే నీవేమి తినుచుంటివని యడిగితిని.'' శ్రీకృష్ణుడు సర్వజ్ఞుడనిగాని, అతని లీలలుగాని తెలిసియున్నచో సుదాముడట్లు చేసి యుండడు. కాబట్టి అతడు చేసినదానిని తానే యనుభవింపవలసి వచ్చెను. శ్రీకృష్ణుని ప్రియ స్నేహితుడయినప్పటికి అతని ఉత్తరకాల మంతయు గర్భదారిద్ర్యముచే బాధపడవలసి వచ్చెను. కొన్నాళ్ళకు భార్య కష్టము చేసి సంపాదించి ఇచ్చి పంపిన పిడికెడు అటుకులు సమర్పించగనే శ్రీకృష్ణుడు సంతసించి ఒక బంగారు పట్టణము ననుభవించుట కిచ్చెను. ఎవరికయితే దగ్గరున్నవారి కియ్యకుండ తిను అలవాటుండునో వారు దీనిని జ్ఞప్తియందుంచుకొనవలెను.

శ్రుతికూడ దీనినే నొక్కి చెప్పుచున్నది. మొదట భగవంతునికి అర్పించి ఆ భుక్తశేషమునే మనము అనుభవించవలెను. బాబా కూడ దీనినే హాస్యరూపముగా యుక్తితో బోధించెను.

**అణ్ణా చించణీకరు, మావిశీబాయి**

హేమాడ్‌పంతు ఇచ్చట నింకొక హాస్యసంఘటనను అందులో బాబా చేసిన మధ్యవర్తిత్వమును వర్ణించెను. దామోదర్ ఘనశ్యామ్ బాబరె వురఫ్ అణ్ణా చించణీకర్ యను భక్తుడొకడు గలడు. అతడు సరళుడు, మోటువాడు ముక్కుసూటిగా మాట్లాడువాడు, ఎవరిని లక్ష్యపెట్టువాడు కాడు; ఉన్నదున్నట్లు చెప్పేవాడు, ఎప్పటి దప్పుడే తేల్చువాడు. బయటికి కఠినునివలెను, హఠము చేయువానివలెను గాన్పించినను, వాడు మంచి హృదయము గలవాడు. నక్కజిత్తులవాడు కాడు. అందుచే బాబా వానిని ప్రేమించుచుండెను. అందరు సేవ చేయునట్లే, యితడు కూడ మధ్యాహ్నము

బాబా యెడమచేతిని (కఠడా పైన వేసి యున్నదానిని) తోముచుండెను. కుడివయిపున ఒక ముసలి వితంతువు వేణుబాయి కౌజల్గి యనునామె యుండెను. ఆమెను బాబా 'అమ్మా' యని పిలిచెడివారు. ఇతరులు మావిశీబాయి యని పిలిచెడివారు. ఆమె కూడ బాబాను సేవించుచుండెను. ఈమెది స్వచ్ఛమైన హృదయము. ఆమె బాబా నడుమును మొలను వీపును తన రెండు చేతుల వ్రేళ్ళు అల్లి దానితో నొక్కుచుండెను. ఆమె దీనిని అతితీవ్రముగా చేయుచుండెను. బాబా వీపు కడుపు కలిసిపోవునట్లు గాన్పించుచుండెను. ఇంకొక ప్రక్క అణ్ణా తోముచుండెను. మావిశీబాయి ముఖము క్రిందకు మీదకగుచుండెను. ఒకసారి యామె ముఖము అణ్ణా ముఖమునకు చాలా దగ్గరగా పోయెను. హాస్యమాడు నైజము గలదగుటచే నామె, *"ఓహో! అణ్ణా చెడ్డవాడు, నన్ను ముద్దుబెట్టుకొనుటకు యత్నించుచున్నాడు. ఇంత ముసలివాడయినప్పటికి నన్ను ముద్దు పెట్టుకొనుటకు సిగ్గులేదా?"* యనెను. అణ్ణాకు కోపము వచ్చెను. చొక్కా చేతులు పైకెత్తి అతడిట్లనెను. *"నేను ముసలివాడను దుర్మార్గుడననుచున్నావు. నేను వెఱ్ఱివాడనా? నీవే. కలహమునకు కాలు దువ్వుచున్నావు."* అక్కడున్నవారందరు ఈ ముసలివాండ్ర కలహమును జూచి నవ్వుచుండిరి. బాబా యిద్దరిని సమానముగా ప్రేమించువారు కనుక ఇద్దరిని ఓదార్చవలెనని తలచి యీ క్రింది విధముగా నేర్పుతో సమాధానపరచిరి. బాబా ప్రేమతో *"ఓ అణ్ణా! ఎందు కనవసరముగా గోల చేయుచున్నావు? తల్లిని ముద్దుపెట్టుకొనినచో దానిలో అనౌచిత్యమేమి?"* యనెను. బాబా మాటలు విని, యిద్దరు సంతుష్టి జెందిరి. అందరు సరదాగా నవ్విరి. బాబా చమత్కారమునకు హృదయానందపూరితులైరి.

**బాబా నైజము, భక్త పరాయణత్వము**

బాబా తన భక్తులకు వారివారి యిష్టానుసారము సేవ చేయుటకు అనుమతించుచుండెను. దీనిలో నితరులు జోక్యము కలుగజేసికొనుట బాబా కిష్టము లేదు. ఒక ఉదాహరణము నిచ్చెదము. ఈ మావిశీబాయియే యింకొకప్పుడు బాబా పొత్తి కడుపును తోముచుండెను. ఆమె ప్రయోగించు బలమును జూచి, యితర భక్తులు ఆతురపడిరి. వారిట్లనిరి. "అమ్మా!

కాంచెము మెల్లగా తోముము. బాబా కడుపులోని ప్రేవులు, నరములు తెగిపోగలవు". ఇట్లనగనే, బాబా వెంటనే లేచి కోపముతో సటకాను నేలపై గొట్టెను. వారి కండ్లు నిప్పు కణములవలె ఎఱ్ఱనాయెను. బాబాను జూచుటకెవ్వరికి ధైర్యము లేకుండెను. బాబా సటకా చివరను రెండు చేతులతో పట్టుకొని పొత్తికడుపులోనికి గ్రుచ్చుకొనెను. ఇంకొక చివరను స్తంభమునకు నానించెను. సటకా యంతయు పొత్తికడుపులో దూరినట్లు కానవచ్చుచుండెను. కొద్దిసేపటిలో పొత్తి కడుపు ప్రేలు ననుకొనిరి. బాబా క్రమముగా స్తంభమువైపు పోవుచుండెను. అందరు భయపడిరి. ఆశ్చర్యముతోను, భయముతోను మాట్లాడలేక మూగవాండ్రవలె నిలిచిరి. బాబా తన భక్తురాలికొరకు ఈ కష్టము అనుభవించిరి. తక్కిన భక్తులు ఆమెను బాబాకు హాని లేకుండ తోముమనిరి. మంచి యుద్దేశముతో వారు ఈ మాటలనిరి. దీనికి కూడ బాబా యొప్పుకొనలేదు. వారి మంచి యుద్దేశమే బాబాను కష్టములో దించినందుకు వారాశ్చర్యపడిరి. ఏమియు చేయలేక కనిపెట్టుకొని చూచుచుండిరి. అదృష్టముచే బాబా కోపము తగ్గెను. సటకాను విడిచి గద్దెపై కూర్చుండిరి. అప్పటినుండి భక్తుల యిష్టానుసారము సేవ చేయునప్పుడు ఇతరులు జోక్యము కలుగజేసికొనరాదను నీతిని నేర్చుకొనిరి. ఎవరి సేవ యెట్టిదో బాబాకే గుర్తు.

శ్రీసాయినాథాయ నమః

## ఇరువదినాలుగవ అధ్యాయము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువదియైదవ అధ్యాయము

*దాము అన్నా కాసార్ (అహమదునగరు) - సట్టా వ్యాపారము - మామిడి పండ్ల లీల.*

భగవదవతారమును, పరబ్రహ్మస్వరూపుడును, మహాయోగేశ్వరుడును, కరుణాసాగరుడును అగు శ్రీసాయినాథునకు సాష్టాంగనమస్కారము లొనర్చి ఈ అధ్యాయమును ప్రారంభించెదము. యోగిచూడామణియగు శ్రీసాయినాథమహారాజుకు జయమగు గాక! సమస్తశుభములకు నిలయము, మన ఆత్మారాముడు, భక్తులపాలిటి ఆశ్రయదాత యగు సాయికి జయమగుగాక. జీవితాశయమును, పరమావధిని గాంచిన బాబాకు ప్రణామములు.

సాయిబాబా యెల్లప్పుడు కరుణాపూర్ణులు. మనకు కావలసినది వారియందు మనఃపూర్వకమైన భక్తి. భక్తునకు స్థిరమైన నమ్మకము పూర్ణభక్తి యున్నప్పుడు వాని కోరికలన్నియు శీఘ్రముగా నెరవేరును. హేమాడ్‌పంతు మనస్సునందు బాబా జీవితలీలలను వ్రాయు కోరిక జనించగనే, బాబా వెంటనే అతనిచే వ్రాయించెను. సంగ్రహముగా సంగతులను వ్రాసికొనుమని బాబా యాజ్ఞ యిచ్చిన వెంటనే హేమాడ్‌పంతుకు ప్రేరణ కలిగి గ్రంథరచనకు కావలసిన బుద్ధి, శక్తి, ధైర్యము కలిగి దానిని ముగించెను. దానిని వ్రాయు యోగ్యత మొదట అతనికి లేకుండెను. కాని బాబా దయాపూరితమగు

ఆశీర్వచనములచే దాని నతడు పూర్తి చేయగలిగెను. ఈ విధముగా సచ్చరిత్ర సిద్ధమైనది. అది యొక చంద్రకాంతమణి వంటిది. దానినుండి సాయిలీలలను అమృతము స్రవించును. దానిని చదువరులు మనసారా త్రాగవచ్చును.

భక్తునకు సాయియందు పరిపూర్ణమైన, హృదయపూర్వకమగు భక్తి కలిగినప్పుడు దుఃఖములనుండి అపాయములనుండి బాబా కాపాడి రక్షించుచుండెను. వాని యోగక్షేమములు బాబా చూచుచుండెను. అహమద్‌నగరు నివాసియగు (ప్రస్తుతము పూనావాసి) దామోదర్ సావల్ రాం రాసనే కాసార్ వురఫ్ దాము అన్నా కథ పైన పేర్కొనిన వాక్యమునకు ఉదాహరణముగా దిగువ నివ్వబడినది.

**దాము అన్నా (దామోదర్ సావల్‌రాం రాసనే)**

6వ అధ్యాయములో శ్రీరామనవమి యుత్సవ సందర్భమున ఇతని గూర్చి చెప్పితిమి. చదువరులు దానిని జ్ఞప్తియందుంచుకొనియే యుందురు. అతడు 1897వ సంవత్సరమున శ్రీరామనవమి నాడు ఉరుసు యుత్సవము ప్రారంభించినప్పుడు శిరిడీకి పోయెను. అప్పటినుండి ఇప్పటివరకు అలంకరించిన పతాక మొకటి కానుకగా నిచ్చుచున్నాడు. అదియునుగాక ఉత్సవమునకు వచ్చు బీదలకు అన్నదానము చేయుచున్నాడు.

**అతని జట్టీ వ్యాపారములు: I. ప్రత్తి**

బొంబాయి స్నేహితుడొకడు దాము అన్నాకు, ప్రత్తిలో జట్టీ వ్యాపారము చేసి భాగస్వామిగా సుమారు రెండులక్షల రూపాయలు లాభము సంపాదించ వలెనని వ్రాసెను. వ్యాపారము లాభకరమైన దనియు, నెంత మాత్రము ప్రమాదకరము కాదనియు, గనుక అవకాశము పోగొట్టుకొనవలదనియు అతడు వ్రాసెను. దాము అన్నా యా బేరమును చేయుటయా? మానుటయా? యను నాందోళనలో పడెను. జట్టీ వ్యాపారమును చేయుటకు వెంటనే నిశ్చయించు కొనలేకుండెను. దాని గూర్చి బాగుగ ఆలోచించి తాను బాబా భక్తుడగుటచే శ్యామా కొక జాబు సవివరముగా వ్రాసి బాబా నడిగి వారి సలహాను తెలిసికొనుమనెను. ఆ మరుసటి దినము ఆ ఉత్తరము శ్యామాకు ముట్టెను. శ్యామా దానిని తీసికొని మసీదుకు బోయెను. బాబా ముందర

బెట్టెను. బాబా యా కాగితమేమని యడిగెను. సమాచార మేమనెను? శ్యామా అహమద్‌నగరు నుండి దాము అన్నా యేదో కనుగొనుటకు వ్రాసినాడనెను. బాబా యిట్లనెను. "ఏమి వ్రాయుచున్నాడు? ఏమి యెత్తు వేయుచున్నాడు? భగవంతుడిచ్చినదానితో సంతుష్టిజెందక యాకాశమున కెగుర ప్రయత్నించుచున్నట్లున్నది. వాని యుత్తరము చదువుము" బాబా చెప్పినదే అయుత్తరములో గల సమాచారమని, శ్యామా "దేవా! నీవిక్కడనే ప్రశాంతముగా కూర్చొని, భక్తుల నాందోళనపాలు చేసెదవు. వారు వ్యాకులులగుటతో, వారి నిచట కీడ్చుకొనివచ్చెదవు. కొందరిని ప్రత్యక్షముగాను, కొందరిని లేఖల రూపముగాను తెచ్చెదవు. ఉత్తరములోని సంగతులు తెలిసి నన్నేల చదువుమని బలవంత పెట్టుచున్నావు?" అనెను. బాబా "ఓ శ్యామా! దయచేసి చదువుము. నా నోటికి వచ్చినది నేను మాట్లాడెదను. నన్ను విశ్వసించు వారెవ్వరు?" అనెను.

అప్పుడు శ్యామా ఉత్తరమును చదివెను. బాబా జాగ్రత్తగా విని కనికరముతో నిట్లనెను. "సేటుకు పిచ్చి యెత్తినది. అతని గృహమందేలోటు లేదని వ్రాయుము. తనకున్న సగము రొట్టెతో సంతుష్టి చెందుమని వ్రాయుము. లక్షలార్జించుటకు ఆయాసపడవద్దని చెప్పుము." శ్యామా జవాబు పంపెను. దానికొరకాతురతతో దాము అన్నా కనిపెట్టుకొని యుండెను. జాబు చదువుకొని అతడు తన యాశయంతయు అడియాస యైనదనుకొనెను. కాని స్వయముగా వచ్చి మాట్లాడుటకు, ఉత్తరము వ్రాయుటకు భేదము కలదని శ్యామా వ్రాయుటచే తానే స్వయముగా శిరిడీ వెళ్ళి బాబాతో స్వయముగా మాట్లాడవలెనని యనుకొనెను. అందుచే శిరిడీకి వెళ్ళెను. బాబాకు నమస్కరించెను. బాబా పాదములు ఒత్తుచు కూర్చుండెను. అతనికి బాబాను బహిరంగముగా జట్టీ వ్యాపారము గూర్చి యడుగుటకు ధైర్యము చాలకుండెను. బాబా సహాయపడినచో వ్యాపారములో కొంతలాభము బాబాకిచ్చినచో బాగుండు ననుకొనెను. ఇట్లు రహస్యముగా దాము అన్నా తన మనస్సున ననుకొనెను. బాబాకు తెలియనిదేమియు లేదు. అరచేతనున్న యుసిరికాయవలె భూతభవిష్యత్ వర్తమానములు కూడ బాబా తెలిసినవారు. బిడ్డకు తీపి వస్తువులు కావలయును. కాని తల్లి చేదుమాత్ర లిచ్చును. తీపి

వస్తువులు ఆరోగ్యమును జెరచును. చేదుమాత్ర లారోగ్యమును వృద్ధిచేయును. తల్లి తన బిడ్డయొక్క మేలును కాంక్షించి బుజ్జగించి చేదుమాత్రలే యిచ్చును. బాబా దయ గల తల్లివంటివారు. తన భక్తుల భవిష్యత్ వర్తమానముల లాభముల గూర్చి బాగుగా దెలిసినవారు. దాము అన్నా మనస్సును గనిపెట్టి బాబా యిట్లనెను. "ప్రపంచ విషయములలో తగుల్కొనుటకు నా కిష్టము లేదు." బాబా యొక్క యసమ్మతి గ్రహించి దాము అన్నా యా పనిని మానుకొనెను.

**2. ధాన్యముల బేరము**

పిమ్మట దాము అన్నా ధాన్యము వ్యాపారము చేయ తలపెట్టెను. ఈ యాలోచనకూడ బాబా గ్రహించి "నీవు 5 సేర్ల చొప్పున కొని 7 సేర్ల చొప్పున అమ్మవలసి వచ్చును. కనుక నీ వ్యాపారము కూడ మానుకొను"మనెను. కొన్నాళ్ళ వరకు ధాన్యము ధర హెచ్చుగానే యుండెను. కాని యొక మాసము రెండు మాసములు వర్షములు విశేషముగా కురిసెను. ధరలు హఠాత్తుగా వడిపోయెను. ధాన్యములు నిలువచేసినవారెల్ల నష్టపడిరి. ఈ దురదృష్టమునుండి దాము అన్నా కాపాడబడెను. ప్రత్తి జట్టీ వ్యాపారము కూడ కూలిపోయెను. ఆ దళారి ఇంకొక వర్తకుని సహాయముతో వ్యాపారము చేసెను. మదుపు పెట్టినవారికి గొప్ప నష్టము వచ్చెను. బాబా తనను రెండుసారులు గొప్ప నష్టములనుండి తప్పించెనని, దాము అన్నాకు బాబా యందుగల నమ్మకము హెచ్చెను. బాబా మహాసమాధి చెందువరకు వారికి నిజమైన భక్తుడుగా నుండెను. వారి మహాసమాధి పిమ్మట గూడ ఇప్పటివరకు భక్తితో నున్నాడు.

**ఆమ్రలీల (మామిడిపండ్ల చమత్కారము)**

ఒకనాడు 300 మామిడపండ్ల పార్సెలు వచ్చెను. రాళేయను మామలతదారు గోవానుంచి శ్యామా పేరున ఆ పండ్లను బాబాకు పంపెను. అది తెరుచునప్పటికి పండ్లన్నియు బాగానే యుండెను. అది శ్యామా స్వాధీనములో పెట్టిరి. అందులో 4 పండ్లు మాత్రమే బాబా కొలంబలో (కుండలో) పెట్టెను. బాబా "ఈ నాలుగు దాము అన్నాకు, అవి యక్కడనే యుండవలె" ననెను.

దాము అన్నాకు ఇద్దరు భార్యలు గలరు. కాని యతనికి సంతానము లేకుండెను. అనేక జ్యోతిష్కులను సంప్రదించెను. అతడు కూడ జ్యోతిషమును కొంతవరకు చదివెను. తన జాతకములో దుష్టగ్రహప్రభావ ముండుటచే అతనికి సంతానము కలుగు నవకాశము లేదనుకొనెను. కాని అతనికి బాబాయందు మిక్కిలి నమ్మకము గలదు. మామిడిపండ్లు అందిన రెండు గంటలకు అతడు శిరిడీకి చేరి బాబాకు నమస్కరించుటకు పోగా బాబా యిట్లనెను. "అందరు మామిడిపండ్లవైపు చూచుచున్నారు. కాని అవి దాముకొరకుంచినవి. కావున అవి దామ్యా తిని చావవలెను." దాము ఈ మాటలు విని భయపడెను. కాని మహాల్సాపతి (బాబా ముఖ్యభక్తుడు) దాని నిట్లు సమర్థించెను. "చావనునది యహంకారమును గూర్చి. దానిని బాబాముందు చంపుట యొక యాశీర్వాదము." బాబా యతనితో నిట్లనియె: "నీవు తినవద్దు. నీ చిన్న భార్య కిమ్ము. ఈ యామ్రలీల ఆమెకు నలుగురు కొడుకులను, నలుగురు కుమార్తెలను ప్రసాదించును." దాము ఆ ప్రకారమే చేసెను. కొంతకాలమునకు బాబా మాటలు నిజమాయెను. జ్యోతిష్కుని మాటలు ఉత్తవాయెను.

బాబా మాటలు వారి సమాధికి పూర్వమేగాక ఇప్పుడు గూడ వారి మాహాత్మ్యమును స్థాపించుచున్నవి. బాబా యిట్లనెను. "సమాధి చెందినప్పటికి నా సమాధిలోనుంచి నా యెముకలు మాట్లాడును. అవి మీకు ధైర్యమును విశ్వాసమును కలిగించును. మనఃపూర్వకముగ నన్ను శరణుజొచ్చినవారితో నా సమాధి కూడ మాట్లాడును. వారి వెన్నంటి కదలును. నేను మీవద్ద నుండనేమో యని మీరాందోళన పడవద్దు. నా యెముకలు మాట్లాడుచు మీ క్షేమమును కనుగొనుచుండును. ఎల్లప్పుడు నన్నే జ్ఞప్తియందుంచుకొనుడు. నాయందే మనఃపూర్వకముగను హృదయపూర్వకముగను నమ్మకముంచుడు. అప్పుడే మీరు మిక్కిలి మేలు పొందెదరు!" హేమాడ్‌పంతు ఈ అధ్యాయము నొక ప్రార్థనతో ముగించుచున్నాడు.

### ప్రార్థన

"ఓ సాయీ సద్గురూ! భక్తుల కోరికల నెరవేర్చు కల్పవృక్షమా! మీ పాదముల మేమెన్నటికి మరువకుందుము గాక. మీ పాదముల నెప్పుడు చూచుచుండెదము గాక. ఈ సంసారమున చావు పుట్టుకలచే మిక్కిలి బాధ

పడుచుంటిమి. ఈ చావుపుట్టుకలనుంచి మమ్ము తప్పింపుము. మా ఇంద్రియములు విషయములపై బోనీయకుండ యడ్డుకొనుము. మాదృష్టిని లోపలకు మరల్చి యాత్మతో ముఖాముఖి చేయుము. ఇంద్రియములు, మనస్సు బయటకు పోవు నైజము నాపనంతవరకు ఆత్మసాక్షాత్కారమునకు అవకాశము లేదు. అంత్యకాలమున కొడుకుగాని, భార్యగాని, స్నేహితుడుగాని యుపయోగపడరు. నీవే మాకు ఆనందమును, మోక్షమును కలుగజేయువాడవు. వివాదములందు దుర్మార్గపు పనులందు మాకు గల యాసక్తిని పూర్తిగా నశింపజేయుము. నీ నామస్మరణము చేయుటకు జిహ్వ యుత్సహించుగాక. మా యాలోచనలను అవి మంచివే యగుగాక చెడ్డవే యగుగాక తరిమి వేయుము. మాగృహములను శరీరమును మరచునట్లు జేయుము. మా యహంకారమును నిర్మూలింపుము. నీ నామమే ఎల్లప్పుడు జ్ఞప్తియందుండునటుల చేయుము. తక్కిన వస్తువులన్నిటిని మరచునట్లు జేయుము. మనశ్చాంచల్యమును తీసివేయుము. దానిని స్థిరముగా ప్రశాంతముగా నుంచుము. నీవు మమ్ములను గట్టిగ పట్టియుంచినచో యా యజ్ఞానాంధకారము నిష్క్రమించును. నీ వెలుతురు నందు మేము సంతోషముగా నుండెదము. మమ్ములను నిద్రనుండి లేపుము. నీ లీలామృతము త్రాగు భాగ్యము నీకటాక్షము చేతను గతజన్మలలో మేము చేసిన పుణ్యమువలనను కలిగినది."

నోటు:- దాము అన్నా యిచ్చిన వాఙ్మూలము ఈ సందర్భమున గమనింప దగినది.

ఒకనాడనేకమందితో నేను గూడ బాబా పాదముల వద్ద కూర్చొని యున్నప్పుడు, నా మనస్సున రెండు సంశయములు కలిగెను. ఆ రెంటికి బాబా యిట్లు జవాబిచ్చెను.

1. సాయిబాబా వద్ద అనేకమంది గుమిగూడుచున్నారు. వారందరు బాబావలన మేలు పొందెదరా?

దీనికి బాబా యిట్లు జవాబిచ్చెను. "మామిడిచెట్ల వయిపు పూత పూసియున్నప్పుడు చూడుము. పువ్వులన్నియు పండ్లు అయినచో, నెంత మంచి పంట యగును? కాని యట్లు జరుగునా? పువ్వుగానే చాలా మట్టుకు రాలిపోవును. గాలికి కొన్ని పిందెలు రాలిపోవును. కొన్ని మాత్రమే మిగులును.

2. ఇది నాగురించి యడిగినది. బాబా భౌతికశరీరము విడచిన పిమ్మట, నా జీవితమనే ఓడ నెట్లు నడుపగలను? అది యెటో కొట్టుకొని పోవునా? అయినచో నాగతి యేమి?

దీనికి బాబా జవాబిట్లు ఇచ్చెను. "ఎక్కడైనను నెప్పుడయినను నా గురించి చింతించినచో నేనక్కడనే యుండెదను." 1918కి ముందు వారి వాగ్దానము ప్రకారము వారు నెరవేర్చుచుండిరి. 1918 తరువాత కూడ నెరవేర్చుచున్నారు. ఇప్పటికీ నాతోనే యున్నారు. ఇప్పటికీ నాకు దారి చూపుచున్నారు. ఇది 1910-11 కాలములో జరిగెను. నా సోదరులు వేరుపడిరి. నా సోదరి కాలధర్మము నొందెను. దొంగతనము జరిగెను. పోలీసు విచారణ జరిగెను. ఇవన్నియు నన్ను కల్లోలపరచినవి.

నా సోదరి చనిపోగా నా మనస్సు వికలమయ్యెను. నేను జీవితమును సుఖములను లక్ష్యపెట్టలేదు. నేను బాబా వద్దకు పోగా వారు ఉపదేశముతో శాంతింపజేసి, అప్పా కులకర్ణి యింటిలో బొబ్బట్లతో విందు గావించిరి. నా నుదుట చందనము పూసిరి.

నాయింటిలో దొంగతనము జరిగినది. నాకు ముప్పది సంవత్సరముల నుండి యొక స్నేహితుడుండెను. అతడు నాభార్యయొక్క నగలపెట్టె దొంగిలించెను. అందులో శుభమగు నత్తు (నాసికాభరణము) ఉండెను. బాబా ఫోటో ముందేడ్చితిని. ఆ మరుసటి దినమే యా మనిషి నగలపెట్టెను తిరిగి యిచ్చి వేసి క్షమాపణ కోరెను.

శ్రీసాయినాథాయ నమః

**ఇరువదియైదవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువదియారవ అధ్యాయము

1. భక్త పంతు 2. హరిశ్చంద్ర పితలే 3. గోపాల అంబాడేకర్‌ల అనుభవములు.

**ఈ** విశ్వమునందు కనిపించు ప్రతివస్తువు కేవలము భగవంతుని మాయచే సృష్టింపబడినది. ఈ వస్తువులు నిజముగా నుండియుండలేదు. నిజముగా నుండునది ఒక్కటే. అదియే భగవంతుడు. చీకటిలో తాడునుగాని, దండమును కాని చూచి పామనుకొనునట్లు, ప్రపంచములో కనిపించు వస్తువు బాహ్యమునకు అగుపడునట్లు గాన్పించును; గాని యంతర్గతముగా నున్న సత్యమును తెలిసికొనలేము. సద్గురువే మన బుద్ధియను అక్షులను దెరిపించి వస్తువులను సరిగా జూచునటుల జేయును. మన కగుపడునది నిజస్వరూపము కాదని గ్రహించెదము. కాబట్టి సద్గురుని యసలయిన దృష్టిని కలుగజేయుమని ప్రార్థింతముగాక! అదే సత్యదృష్టి.

### ఆంతరిక పూజ

హేమాడ్‌పంతు మనకొక కొత్తరకము పూజావిధానమును బోధించుచున్నారు. సద్గురుని పాదములు కడుగుట కానందభాష్పములనే వేడినీళ్ళనుపయోగించెదముగాక! స్వచ్ఛమైన ప్రేమయను చందనమును వారి శరీరమునకు పూసెదముగాక! దృఢవిశ్వాసమను వస్త్రముతో వారి శరీరమును కప్పెదముగాక! అష్టసాత్త్వికభావములనెడు ఎనిమిది తామరపుష్పములు

సమర్పించెదము గాక. ఏకాగ్రచిత్తమను ఫలమును సమర్పించెదము గాక. భావమను బుక్కా వారి శిరముపై జల్లి భక్తియనే మొలత్రాడును కట్టెదము గాక. మన శిరస్సును వారి బొటన వ్రేళ్ళపై నుంచెదము గాక. సద్గురుని ఈ ప్రకారముగా నగలతో నలంకరించి మన సర్వస్వమును వారికి సమర్పింతము గాక. అట్టి యానందకరమైన పూజ చేసిన పిమ్మట ఇటుల ప్రార్థించెదము గాక!

*"మా మనస్సును అంతర్ముఖము చేయుము. దానిని లోపలివయిపు పోవునటుల జేయుము. నిత్యానిత్యములకు గల తారతమ్యమును దెలిసికొను శక్తి దయచేయుము. ప్రపంచ వస్తువులందు మాకు గల యాసక్తిని పోగొట్టి మాకు ఆత్మసాక్షాత్కారము కలుగునటుల చేయుము. మేము మా శరీరమును ప్రాణమును సర్వమును నీకు సమర్పించెదము. సుఖదుఃఖానుభవములు కలుగకుండునట్లు మా నేత్రములు నీవిగా చేయుము. మా శరీరమును మనస్సును నీ స్వాధీన మందుంచుకొనుచు నీ యిష్టము వచ్చినటుల చేయుము. మా చంచల మనస్సు నీ పాదముల చెంత విశ్రాంతి పొందుగాక."*

ఇక నీ అధ్యాయములోని కథలవైపు మరలుదము.

**భక్త పంతు**

ఒకనాడు పంతు అనుభక్తుడు, మరొక సద్గురుని శిష్యుడు అదృష్టవశమున శిరిడీకి వచ్చెను. అతనికి శిరిడీకి పోవు ఇచ్ఛలేకుండెను. కాని తానొకటి తలచిన దైవమింకొకటి తలచునందురు. అతడు బి.బి. అండ్ సి.ఐ. రైల్వేలో పోవుచుండెను. అందులో అనేకులు స్నేహితులు, బంధువులు కలిసిరి. వారందరు శిరిడీకి పోవుచుండిరి. వారందరు తమ వెంట రమ్మని కోరగా అతడు వారిని కాదన లేకుండెను. వారు బొంబాయిలో దిగిరి. పంతు విరార్‌లో దిగెను. అచ్చట తన గురువును దర్శించి, శిరిడీకి పోవుటకు అనుమతి పొంది, ఖర్చుల నిమిత్తము డబ్బును కూర్చుకొని యందరితో కలిసి శిరిడీకి వచ్చెను. అందరు ఉదయమే శిరిడీ చేరి 11 గంటలకు మసీదుకు పోయిరి. బాబా పూజ కొరకు చేరిన భక్తుల గుంపును జూచి యందరు సంతసించిరి. కాని పంతుకు మూర్ఛ వచ్చి హఠాత్తుగా క్రిందపడెను. వారందరు భయపడిరి.

అతనికి చైతన్యము కలిగించుటకు ప్రయత్నించిరి. అతని ముఖముపై నీళ్ళు చల్లగా బాబా కటాక్షముచే తెలివి వచ్చెను. నిద్రనుంచి లేచినవానివలె లేచి కూర్చుండెను. సర్వజ్ఞుడగు బాబా అతడు ఇంకొక గురువు తాలూకు శిష్యుడని గ్రహించి, నిర్భయముగా నుండుమని ధైర్యము చెప్పుచు తన గురువునందే భక్తి నిలుచునటుల నీ క్రింది విధముగా బలికెను. "ఏమైనను కానిండు. పట్టు విడువరాదు. నీ గురునియందే యాశ్రయము నిలుపుము; ఎల్లప్పుడు నిలకడగా నుండుము. ఎప్పుడు వారి ధ్యానమునందే మునిగి యుండుము." పంతు ఈ మాటలయొక్క ప్రాముఖ్యమును గ్రహించెను. ఈ విధముగా తన సద్గురుని జ్ఞప్తికి దెచ్చుకొనెను. అతడు తన జీవితములో బాబా చేసిన యీ మేలును మరువలేదు.

**హరిశ్చంద్ర పితలే**

బొంబాయిలో హరిశ్చంద్ర పితలే యనునాత డుండెను. అతనికి మూర్ఛ రోగముతో బాధపడుచున్న కొడుకొకడు గలడు. ఇంగ్లీషు మందులను ఆయుర్వేదము మందులను కూడ వాడెను గాని జబ్బు కుదురలేదు. కావున యోగుల పాదములపయి బడుటయనే సాధన యొక్కటే మిగిలెను. 15వ అధ్యాయమందు చక్కని కీర్తనలచే దాసగణు బాబాకీర్తిని బొంబాయి ప్రెసెడెన్సీలో వెల్లడి చేసెనని తెలుసుకొంటిమి. 1910లో పితలే అట్టి కథలు కొన్నిటిని వినెను. వానినుండి, యితరులు చెప్పినదానినుండి, బాబా తన దృష్టిచేతను, స్పర్శ్య చేతను, బాగుకానట్టి జబ్బులను బాగు చేయునని గ్రహించెను. సాయిబాబాను జూచుటకు మనస్సులో కోరిక పుట్టెను. సర్వవిధముల సన్నాహమై, బహుమానములను వెంట దీసికొని పండ్ల బుట్టలను బట్టుకొని భార్యాబిడ్డలతో శిరిడీకి వచ్చెను. అతడు మసీదుకు బోయెను. బాబాకు సాష్టాంగ నమస్కారము చేసెను. తన రోగి కొడుకును బాబా పాదములపై వైచెను. బాబా యా బిడ్డవైపు చూడగనే యొక వింత జరిగెను. పిల్లవాడు వెంటనే కండ్లు గిఱ్ఱున త్రిప్పి చైతన్యము తప్పి నేలపై బడెను. అతని నోట చొంగ కారెను. అతని శరీరమున చెమట పట్టెను. అతడు చచ్చినవానివలె పడెను. దీనిని జూచి తల్లిదండ్రులు మిక్కిలి భయపడిరి. అటువంటి మూర్ఛలు వచ్చుచుండెనుగాని యీ మూర్ఛ చాలాసేపటివర

కుండెను. తల్లి కంటినీరు వరదలుగా కారుచుండెను. ఆమె యేడ్చుటకు మొదలిడెను. ఆమెస్థితి దొంగలనుండి తప్పించుకొనవలెనని యొక గృహము లోనికి పరుగెత్తగా అది తన నెత్తిపై బడినట్లు, పులికి భయపడి పారిపోయి కసాయివాని చేతిలో పడిన యావువలె, ఎండచే బాధపడి చెట్టు నీడకు పోగా నది బాటసారిపై బడినట్లు, లేదా భక్తుడు దేవాలయమునకు పోగా అది వానిపై కూలినట్లుండెను.

ఆమె యిటులేడ్చుచుండగా బాబా యామె నిటుల ఓదార్చెను. "*ఇటు లేడ్వవలదు. కొంతసేపాగుము. ఓపికతో నుండుము. కుఱ్ఱవానిని బసకు దీసికొని పొమ్ము. అరగంటలో వానికి చైతన్యము వచ్చును.*" బాబా చెప్పిన ప్రకారము వారు నెరవేర్చిరి. బాబా మాటలు యథార్థము లయ్యెను. వాడాలోనికి దీసికొని పోగానే కుఱ్ఱవానికి చైతన్యము వచ్చెను. పితలే కుటుంబమంతయు సంతోషించిరి. వారి సంశయములన్నియు దీరెను. పితలే బాబా దర్శనమునకై భార్యతో మసీదుకు వచ్చెను. వారు బాబాపాదములకు వినయముతో సాష్టాంగ నమస్కారము చేసి వారి పాదముల నొత్తుచు కూర్చుండిరి. మనస్సులో బాబా చేసిన యుపకారమునకు నమస్కరించుచుండిరి. బాబా చిరునవ్వుతో నిట్లనిరి. "నీ యాలోచనలు, సంశయములు, భయోత్పాతములు, ఇప్పుడు చల్లబడినవా? ఎవరికయితే నమ్మకము ఓపిక గలదో, వారిని తప్పక భగవంతుడు రక్షించును." పితలే ధనికుడు, మరియాద గలవాడు. అతడందరికి అపరిమితముగా మిఠాయి పంచి పెట్టెను. బాబాకు చక్కని పండ్లను తాంబులము నిచ్చెను. పితలే భార్య సాత్వికురాలు. ఆమె నిరాడంబరత, ప్రేమభక్తులతో నిండియుండెను. ఆమె స్తంభమునకు దగ్గరగా కూర్చొని బాబావైపు దృష్టి నిగిడ్చి కండ్లనుండి యానందబాష్పములు రాల్చుచుండెను. ఆమె స్నేహ ప్రేమ భావములను గని బాబా మిక్కిలి సంతుష్టి చెందెను. దేవునివలె యోగీశ్వరులు కూడ తమ భక్తులపయి నాధారపడెదరు. ఏ భక్తుడు హృదయపూర్వకముగను, మనఃపూర్వకముగను పూజించి శరణు వేడునో వానికే భగవంతుడు తోడ్పడును. వారు కొద్దిరోజులు బాబా వద్ద సుఖముగా నున్న పిమ్మట ఇంటికి పోవనిశ్చయించి, బాబా దర్శనమునకయి మసీదుకు వచ్చిరి. బాబా వారికి

ఊదీ ప్రసాదమిచ్చి ఆశీర్వదించెను. పితలేను దగ్గరకి బిలిచి యిట్లనెను. "బాపూ! అంతకుముందు 2 రూపాయ లిచ్చియుంటిని. ఇప్పుడు 3 రూపాయలిచ్చుచున్నాను. వీనిని మీ పూజామందిరములో బెట్టుకొని పూజింపుము. నీవు మేలు పొందెదవు." పితలే వీనిని ప్రసాదముగా నంగీకరించెను. బాబాకు సాష్టాంగనమస్కారము చేసి యాశీర్వచనములకయి ప్రార్థించెను. ఇదే తాను శిరిడీ పోవుట మొదటిసారి గనుక, అంతకుముందు 2 రూపాయలిచ్చెనను బాబా మాటల యర్థమును గ్రహింపలేకుండెను. దీనిని తెలిసి కొనవలెనని కుతూహలపడెను గాని బాబా యూరకొనెను.

స్వగృహమునకు పోయి తన ముదుసలి తల్లికి ఈ వృత్తాంతమంతయు చెప్పి బాబా యంతకు ముందు రెండురూపాయలిచ్చెననెను, అదేమియని యడిగెను. ఆమె తన పుత్రునితో నిట్లనెను: "నీ కొడుకుతో నీవిప్పుడు శిరిడీకి పోయినట్లు, మీ తండ్రి నిన్ను దీసికొని అక్కల్ కోట్‌కర్ మహారాజుగారి వద్దకు బోయెను. ఆ మహారాజు కూడ సిద్ధపురుషుడు; పూర్ణయోగి, సర్వజ్ఞుడు, దయాళువు. మీ తండ్రి నిర్మలమైన భక్తుడు కనుక ఆయన పూజను స్వామి ఆమోదించిరి. వారు మీ తండ్రికి రెండు రూపాయలిచ్చి మందిరములో బెట్టి పూజింపుమనిరి. మీ తండ్రిగారు చనిపోవువరకు వానిని పూజించుచుండిరి. అటు పిమ్మట పూజ ఆగిపోయినది. రూపాయలు పోయినవి. కొన్ని సంవత్సరముల పిమ్మట రూపాయల సంగతి పూర్తిగా మరచితిమి. నీవదృష్టవంతుడ వగుటచే, అక్కల్ కోట్‌కర్ మహారాజు శ్రీ సాయిరూపములో గనిపించి నీ కర్తవ్యమును జ్ఞప్తికి దెచ్చి, నీకష్టములను తప్పింప జూచుచున్నారు. కాబట్టి యిక మీదట జాగ్రత్తగా నుండుము. సంశయములను దురాలోచనములను విడువుము. మీ తాతముత్తాతల యాచారము ప్రకారము నడువుము. సత్ప్రవర్తనము నవలంబింపుము. కుటుంబదైవములను పూజింపుము. రూపాయలను పూజింపుము. వాని విలువను గ్రహించి, వాటిని శ్రద్ధగా పూజించి, మహాత్ముల యాశీర్వచనము దొరికినందుకు గర్వించుము. శ్రీసాయి నీలోనున్న భక్తిని మేలు కొల్పినారు. నీ మేలుకొరకు దాని నభివృద్ధి చేసికొనుము." తల్లి మాటలు విని పితలే మిక్కిలి సంతోషించెను. శ్రీసాయియొక్క సర్వాంతర్యామిత్వమునందు, వారి శక్తియందు అతనికి

నమ్మకము కలిగెను. వారి దర్శన ప్రాముఖ్యమును గ్రహించెను. అప్పటినుండి తన నడవడి గూర్చి చాలా జాగ్రత్తగా నుండెను.

**అంబాడేకర్ గారు**

పూనానివాసి గోపాల నారాయణ అంబాడేకర్ బాబా భక్తుడు. అతడు అబ్కారి డిపార్టుమెంటులో 10 సంవత్సరములు నౌకరి చేసెను. ఠాణా జిల్లాలోను, జవ్హార్‌స్టేట్‌లోను ఆయన ఉద్యోగములను జేసి విరమించుకొనెను. మరొక ఉద్యోగము కొరకు ప్రయత్నించెను. కాని ఫలించలేదు. అతడనేక కష్టముల పాలయ్యెను. అతని స్థితి రానురాను అసంతృప్తికరముగా నుండెను. ఈ ప్రకారము 7 ఏండ్లు గడచెను. అతడు ప్రతి సంవత్సరము శిరిడీకి పోవుచు బాబాకు తన కష్టములు చెప్పుచుండెడివాడు. 1916లో నతని స్థితి చాల హీనముగా నుండుటచే శిరిడీలో ప్రాణత్యాగము చేయ నిశ్చయించుకొనెను. అతడు భార్యతో శిరిడీకి వచ్చి రెండు మాసములుండెను. దీక్షిత్ వాడాకు ముందున్న యెడ్లబండి మీద కూర్చొని ఒకనాడు రాత్రి దగ్గరనున్న నూతిలో బడి చావవలెనని నిశ్చయించుకొనెను. అతడీ ప్రకారము చేయ నిశ్చయించుకొనగనే బాబా మరియొకటి చేయ నిశ్చయించెను. కొన్ని అడుగుల దూరమున నొక హోటలుండెను. దాని యజమాని సగుణమేరు నాయక్. అతడు బాబా భక్తుడు. అతడు అంబాడేకర్‌ను బిలచి అక్కల్‌కోట్‌కర్ మహారాజుగారి చరిత్రను చదివితివా? యని యడుగుచు పుస్తకము నిచ్చెను. అంబాడేకర్ దానిని తీసుకొని చదువనెంచెను. పుస్తకము తెరుచుసరికి ఈ కథ వచ్చెను. అక్కల్‌కోట్‌కర్ మహారాజుగారి కాలములో ఒక భక్తుడు బాగుకానట్టి దీర్ఘరోగముచే బాధపడుచుండెను. బాధను సహించలేక నిరాశజెంది బావిలో దుమికెను. వెంటనే మహారాజు వచ్చి వానిని బావిలోనుంచి బయటకు దీసి యిట్లనెను. *"గతజన్మ పాపపుణ్యములను నీవు అనుభవించక తప్పదు.కర్మానుభవము పూర్తికాకున్నచో ప్రాణత్యాగము నీకు తోడ్పడదు. నీవింకొక జన్మమెత్తి బాధ యనుభవించవలెను. చచ్చుటకు ముందు కొంతకాలమేల నీ కర్మ ననుభవించరాదు? గత జన్మముల పాపముల నేల తుడిచి వేయరాదు? దానిని శాశ్వతముగా పోవునట్లు జేయుము."*

సమయోచితమైన ఈ కథను చదివి అంబాడేకర్ మిగుల నాశ్చర్యపడెను. వాని మనస్సు కరగెను. బాబా సలహా యీ ప్రకారముగా లభింపనిచో వాడు చచ్చియే యుండును. బాబా సర్వజ్ఞత్వమును, దయాళుత్వమును జూచి అంబాడేకరుకు బాబా యందు నమ్మకము బలపడి అతని భక్తి దృఢమయ్యెను. అతని తండ్రి అక్కల్ కోట్‌కర్ మహారాజు భక్తుడు. కాన కొడుకు కూడ తండ్రివలె భక్తుడు కావలెనని బాబా కోరిక. అతడు బాబా యాశీర్వచనమును పొందెను. వాని శ్రేయస్సు వృద్ధిపొందెను. జ్యోతిషము చదివి అందులో ప్రావీణ్యము సంపాదించి దానిద్వారా తన పరిస్థితి బాగు చేసికొనెను. కావలసినంత ధనమును సంపాదించుకొనగలిగెను. మిగత జీవితమంతయు సుఖముగా గడపెను.

శ్రీసాయినాథాయ నమః

**ఇరువదియారవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువదియేడవ అధ్యాయము

భాగవతము, విష్ణుసహస్రనామములనిచ్చి అనుగ్రహించుట.
1. దీక్షిత్ యొక్క విఠల్ దర్శనము 2. గీతారహస్యము 3. ఖాపర్డే దంపతులు.

బాబా మతగ్రంథములను తమ స్వహస్తములతో స్పృశించి, పవిత్రము చేసి వానిని తమ భక్తులకు పారాయణము కొరకు ప్రసాదించుట మొదలగునవి యీ అధ్యాయములో చెప్పుకొందము.

మానవుడు సముద్రములో మునుగగనే, అన్ని తీర్థములలోను పుణ్యనదులలోను స్నానము చేసిన పుణ్యము లభించును. అటులనే మానవుడు సద్గురుని పాదారవిందముల నాశ్రయింపగనే, త్రిమూర్తులకు (బ్రహ్మవిష్ణుమహేశ్వరులకు) నమస్కరించిన ఫలముతోపాటు పరబ్రహ్మమునకు నమస్కరించిన ఫలితముకూడ లభించును. కోరికలను నెరవేర్చు కల్పతరువు, జ్ఞానమునకు సముద్రమును, మనకు ఆత్మసాక్షాత్కారమును కలుగజేయునట్టి శ్రీసాయిమహారాజునకు జయమగుగాక! ఓ సాయి! నీ కథలందు శ్రద్ధను కలుగజేయుము. చాతకపక్షి మేఘజలము త్రాగి యెట్లు సంతసించునో, అటులనే నీకథలను చదువువారును, వినువారును మిక్కిలి ప్రీతితో వానిని గ్రహింతురుగాక. నీకథలు వినునప్పుడు వారికి, వారి కుటుంబములకు సాత్వికభావములు కలుగునుగాక! వారి శరీరములు చెమరించుగాక! వారి నేత్రములు కన్నీటిచే నిండుగాక!

వారి ప్రాణములు స్థిరపడుగాక! వారి మనస్సులు ఏకాగ్రమగుగాక! వారికి గగుర్పాటు కలుగుగాక! వారు వెక్కుచు ఏడ్చి వణకెదరుగాక! వారిలోగల వైషమ్యములు తరతమభేదములు నిష్క్రమించుగాక! ఇట్లు జరిగినచో గురువుగారి కటాక్షము వారిపైన ప్రసరించిన దనుకొనవలెను. ఈ భావములు నీలో కలిగినప్పుడు, గురువు మిక్కిలి సంతసించి ఆత్మ సాక్షాత్కారమునకు దారి చూపును. మాయాబంధములనుండి స్వేచ్ఛ పొందుటకు బాబాను హృదయపూర్వకముగ శరణాగతి వేడవలెను. వేదములు నిన్ను మాయయనే మహాసముద్రమును దాటించలేవు. సద్గురువే యాపని చేయగలరు. సర్వజీవకోటియందును భగవంతుని చూచునట్లు చేయగలరు.

**గ్రంథములను పవిత్రము చేసి కానుకగా నిచ్చుట**

ముందటి అధ్యాయములో బాబా బోధలొనర్చు తీరులను జూచితిమి. అందులో నింకొకదానిని యీ అధ్యాయములో జూచెదము. కొందరు భక్తులు మతగ్రంథములను పారాయణ చేయుటకు బాబా చేతికిచ్చి బాబా పవిత్రము చేసినపిమ్మట వానిని పుచ్చుకొనెడివారు. అట్టి గ్రంథములు పారాయణ చేయునప్పుడు బాబా తమతో నున్నటుల భావించెడివారు. ఒకనాడు కాకామహాజని ఏకనాథభాగవతమును దీసికొని శిరిడీకి వచ్చెను. శ్యామా యాపుస్తకమును చదువుటకై తీసుకొని మసీదుకు బోయెను. అచ్చట బాబా దానిని తీసికొని చేతితో తాకి, కొన్ని పుటలను త్రిప్పి శ్యామాకిచ్చి దానిని తనవద్ద నుంచుకొమ్మనెను. అది కాకా పుస్తకమనియు, నందుచే దాని నాతని కిచ్చి వేయవలెననియు శ్యామా చెప్పెను. కాని బాబా "దానిని నేను నీకిచ్చితిని. దానిని జాగ్రత్తగా నీవద్ద నుంచుము. అది నీకు పనికివచ్చు" ననిరి. ఈ ప్రకారముగ బాబా అనేక పుస్తకములు శ్యామావద్ద నుంచెను. కొన్ని దినముల పిమ్మట కాకామహాజని తిరిగి భాగవతమును తెచ్చి బాబా కిచ్చెను. బాబా దానిని తాకి ప్రసాదముగా మహాజనికే ఇచ్చి దానిని భద్రపరచుమనెను. అది యాతనికి మేలు చేయుననిరి. కాకా సాష్టాంగనమస్కారముతో స్వీకరించెను.

**శ్యామా విష్ణుసహస్రనామముల పుస్తకము**

శ్యామా బాబాకు మిక్కిలి ప్రియభక్తుడు. బాబా యతనికి మేలు చేయ నిశ్చయించి విష్ణుసహస్రనామమును ప్రసాదముగా నిచ్చెను. దానిని ఈ క్రింది విధముగా జరిపెను.

ఒకప్పుడు ఒక రామదాసి (సమర్థ రామదాసు భక్తుడు) శిరిడీకి వచ్చెను. కొన్నాళ్ళు అక్కడ నుండెను. ప్రతి రోజు ఉదయమే లేచి, ముఖము కడుగుకొని, స్నానము చేసి, పట్టుబట్టలు ధరించి, విభూతి పూసికొని, విష్ణుసహస్రనామమును, అధ్యాత్మరామాయణమును శ్రద్ధతో పారాయణ చేయుచుండెను. అతడీ గ్రంథముల ననేకసారులు పారాయణ చేసెను. కొన్ని దినముల పిమ్మట బాబా శ్యామాకు మేలు చేయనిశ్చయించి విష్ణుసహస్రనామ పారాయణము చేయింపదలచెను. కావున రామదాసిని బిలచి తమకు కడుపు నొప్పిగా నున్నదనియు సోనాముఖి తీసికొననిదే నొప్పి తగ్గదనియు, కనుక బజారుకు పోయి యా మందును తీసికొని రమ్మని కోరెను. పారాయణము ఆపి రామదాసి బజారుకు పోయెను. బాబా తమ గద్దె దిగి రామదాసి పారాయణ చేయు స్థలమునకు వచ్చి విష్ణుసహస్రనామ పుస్తకమును దీసికొని తమ స్థలమునకు తిరిగి వచ్చి యిట్లనెను. *"ఓ శ్యామా! యీ గ్రంథము మిగుల విలువైనది. ఫలప్రదమైనది. కనుక నీ కిది బహూకరించుచున్నాను. నీవు దీనిని చదువుము. ఒకప్పుడు నేను మిగుల బాధ పడితిని. నా హృదయము కొట్టుకొనెను. నా జీవిత మపాయములో నుండెను. అట్టి సందిగ్ధస్థితి యందు నేను ఈ పుస్తకమును నా హృదయమునకు హత్తుకొంటిని. శ్యామా! అది నాకు గొప్ప మేలు చేసెను. అల్లాయే స్వయముగా వచ్చి బాగు చేసెనని యనుకొంటిని. అందుచే దీనిని నీ కిచ్చుచున్నాను. దీనిని కొంచెము ఓపికగా చదువుము. రోజున కొక నామము చదివినను మేలు కలుగజేయును."* శ్యామా తనకా పుస్తక మక్కరలేదనెను. ఆ పుస్తకము రామదాసిది. అతడు పిచ్చివాడు, మొండివాడు, కోపిష్టి. కావున వానితో కయ్యము వచ్చుననెను. మరియు తాను అనాగరికుడగుటచే దేవనాగరి అక్షరములు చదువలేననెను.

వినోదార్థము తనకు రామదాసితో బాబా కయ్యము కలుగజేయుచున్నాడని శ్యామా యనుకొనెనే గాని, బాబా తనకు మేలు కలుగజేయనున్నాడని యనుకొనలేదు. బాబా యా సహస్రనామమనే మాలను శ్యామా మెడలో వేయ నిశ్చయించెను. అతడు అనాగరికుడయినప్పటికి బాబాకు ముఖ్యభక్తుడు. బాబా ఈ ప్రకారమతనిని ప్రపంచబాధలనుండి తప్పించగోరెను. భగవన్నామఫలిత మందరికి విశదమే. సకల పాపములనుండి,

దురాలోచనలనుండి, చావుపుట్టుకలనుండి అది మనలను తప్పించును. దీనికంటె సులభమయిన సాధన మింకొకటి లేదు. అది మనస్సును పావనము చేయుటలో మిక్కిలి సమర్థమైనది. దాని కెట్టి తంతు కూడ అవసరము లేదు. దానికి నియమము లేమియు లేవు. అది మిగుల సులభమైనది; ఫలప్రదమైనది. శ్యామాకు ఇష్టము లేనప్పటికి వానిచే దాని నభ్యసింపచేయవలెనని బాబాకు దయకలిగెను. కనుక దానిని బాబా వానిపయి బలవంతముగా రుద్దెను. ఆ ప్రకారముగనే చాల కాలము క్రిందట ఏకనాథమహారాజు బలవంతముగా విష్ణుసహస్రనామము నొక బీదబ్రాహ్మణునిచే పారాయణ చేయించి వానిని రక్షించెను. విష్ణుసహస్రనామపారాయణ చిత్తశుద్ధి కొక విశాలమయిన చక్కటి మార్గము. కాన దానిని బాబా శ్యామాకు బలవంతముగా ఇచ్చెను.

రామదాసి త్వరలో సోనాముఖి తెచ్చెను. అన్నా చించణీకర్ యక్కడనే యుండెను. నారదునివలె నటించి జరిగిన దంతయు వానికి జెప్పెను. రామదాసి వెంటనే కోపముతో మండిపడెను. కోపముతో శ్యామాపయి బడి, శ్యామాయే కడుపునొప్పి సాకుతో బాబా తనను బజారునకు పంపునట్లు చేసి ఈ లోపల పుస్తకమును తీసికొనెనని యనెను. శ్యామాను తిట్టనారంభించెను. పుస్తకము ఈయనిచో తల పగులగొట్టుకొందుననెను. శ్యామా నెమ్మదిగా జవాబిచ్చెను. కాని ప్రయోజనము లేకుండెను. అప్పుడు దయతో బాబా రామదాసితో నిట్లు పలికెను. *"ఓ రామదాసీ! యేమి సమాచారము? ఎందులకు చికాకుపడుచున్నావు? శ్యామా మనవాడు కాడా? అనవసరముగా వాని నేల తిట్టెదవు? ఎందుకు జగడ మాడుచున్నావు? నెమ్మదిగా ప్రేమతో మాట లాడలేవా? ఈ పవిత్రమైన గ్రంథములను నిత్యము పారాయణ చేయుచుంటివి గాని, యింకను నీ మనస్సు నపవిత్రముగాను, అస్వాధీనముగాను ఉన్నట్లున్నది. నీ వెట్టి రామదాసివయ్యా? సమస్త విషయములందు నీవు నిర్మలుడవుగా నుండవలెను. నీ వా పుస్తకమును అంతగా నభిలషించుట వింతగా నున్నది. నిజమైన రామదాసికి మమత కాక సమత యుండవలెను. ఒక పుస్తకము కొరకు శ్యామాతో పోరాడుచున్నావా? వెళ్ళు, నీ స్థలములో కూర్చొనుము. ధనమిచ్చిన పుస్తకము లనేకములు*

వచ్చును, కాని మనుష్యులు రారు. బాగా ఆలోచించుము, తెలివిగా ప్రవర్తింపుము. నీ పుస్తకము విలువ యెంత? శ్యామాకు దానితో నెట్టి సంబంధము లేదు. నేనే దానిని తీసికొని వాని కిచ్చితిని. నీ కది కంఠపాఠముగా వచ్చును కదా! కావున శ్యామా దానిని చదివి మేలు పొందుననుకొంటిని. అందుచే దాని నతనికిచ్చితిని."

బాబా పలుకులెంత మధురముగా మెత్తగా కోమలముగా అమృత తుల్యముగా నున్నవి! వాని ప్రభావము విచిత్రమయినది. రామదాసి శాంతించెను. దానికి బదులు పంచరత్నగీతయను గ్రంథమును శ్యామావద్ద తీసికొనెద ననెను. శ్యామా మిక్కిలి సంతసించి, "ఒక్కటేల పది పుస్తకముల నిచ్చెద"ననెను.

బాబా ఈ విధముగా వారి తగవును తీర్చెను. ఇందు ఆలోచించవలసిన విషయమేమన రామదాసి పంచరత్నగీత నేల కోరెను? అతడు లోనున్న భగవంతుని తెలిసికొనుట కెన్నడు యత్నించి యుండలేదు. ప్రతినిత్యము మతగ్రంథములను మసీదులో బాబా ముందర పారాయణ చేయువాడు, శ్యామాతో బాబా యెదుట ఏల జగడమాడెను? మనము ఎవరిని నిందించవలెనో, యెవరిని తప్పుపట్టవలెనో పోల్చుకొనలేము. ఈ కథ నీ విధముగా నడిపించక పోయినచో ఈ విషయము యొక్క ప్రాముఖ్యము భగవన్నామస్మరణఫలితము, విష్ణుసహస్రనామపారాయణ మొదలగునవి శ్యామాకు తెలిసియుండవు. బాబా బోధించు మార్గము, ప్రాముఖ్యము కలుగజేయు విషయములు సాటిలేనివి. ఈ గ్రంథమును క్రమముగ శ్యామా చదివి దానిలో గొప్ప ప్రావీణ్యము సంపాదించెను. శ్రీమాన్ బూటీ అల్లుడగు జి.జి. నార్కేకు బోధించగలిగెను. ఈ నార్కే పూనా యింజనీరింగు కాలేజి ప్రిన్సిపాలుగా నుండెను.

**గీతా రహస్యము**

బ్రహ్మవిద్య నధ్యయనము చేయువారిని బాబా యెల్లప్పుడు ప్రేమించు వారు, ప్రోత్సహించువారు. ఇచట దానికొక యుదాహరణమిచ్చెదము. ఒకనాడు బాపూసాహెబు జోగ్‌కు ఒక పార్సెలు వచ్చెను. అందులో తిలక్ వ్రాసిన గీతా రహస్యముండెను. అతడా పార్సెలును తన చంకలో పెట్టుకొని మసీదుకు

వచ్చెను. బాబాకు సాష్టాంగనమస్కారము చేయునప్పుడది క్రింద పడెను. అదేమని బాబా యడిగెను. అక్కడనే దానిని విప్పి బాబా చేతిలో ఆ పుస్తకము నుంచెను. బాబా కొన్ని నిమిషములు పుస్తకములోని పేజీలను త్రిప్పి తన జేబులోనుండి ఒక రూపాయి తీసి పుస్తకముపై బెట్టి దక్షిణతో గూడ పుస్తకమును జోగున కందించుచు, "దీనిని పూర్తిగ చదువుము. నీకు మేలు కలుగును" అనిరి.

**ఖాపర్డే దంపతులు**

ఖాపర్డేల వృత్తాంతముతో నీ యధ్యాయమును ముగించెదము. ఒకప్పుడు ఖాపర్డే తన భార్యతో శిరిడీకి వచ్చి కొన్ని నెలలుండెను. దాదాసాహెబు ఖాపర్డే సామాన్యుడు కాడు. అమరావతిలో మిక్కిలి ప్రసిద్ధికెక్కిన ప్లీడరు, మిక్కిలి ధనవంతుడు, ఢిల్లీ కౌన్సిలులో సభ్యుడు, మిక్కిలి తెలివయినవాడు, గొప్ప వక్త. కాని బాబా ముందర నెప్పుడు నోరు తెరవలేదు. అనేకమంది భక్తులు పలుమారులు బాబాతో మాటలాడిరి, వాదించిరి; కాని ముగ్గురు మాత్రము - ఖాపర్డే, నూల్కర్, బూటీ - నిశ్శబ్దముగా కూర్చుండువారు. వారు వినయవిధేయత నమ్రతలున్న ప్రముఖులు. పంచదశిని ఇతరులకు బోధించగలిగిన ఖాపర్డే బాబా ముందర మసీదులో కూర్చొనునప్పుడు నోరెత్తి మాట్లాడువాడు కాడు. నిజముగా మానవుడెంత చదివినవాడైనను, వేదపారాయణ చేసినవాడైనను, బ్రహ్మజ్ఞాని ముందర వెలవెలబోవును. పుస్తకజ్ఞానము బ్రహ్మజ్ఞానము ముందు రాణించదు. దాదాసాహెబు ఖాపర్డే 4 మాసములుండెను. కాని యతని భార్య 7 మాసములుండెను. ఇద్దరును శిరిడీలో నుండుటచే సంతసించిరి. ఖాపర్డేగారి భార్య బాబాయందు భక్తిశ్రద్ధలు గలిగి యుండెడిది. ఆమె బాబాను మిగుల ప్రేమించుచుండెను. ప్రతి రోజు 12 గంటలకు బాబా కొరకు నైవేద్యము స్వయముగా దెచ్చుచుండెను. దానిని బాబా యామోదించిన తరువాత తాను భోజనము చేయుచుండెను. ఆమె యొక్క నిలకడను, నిశ్చలభక్తిని బాబా యితరులకు బోధించనెంచెను. ఆమె ఒకనాడు మధ్యాహ్న భోజనసమయమున ఒకపళ్ళెములో సాంజా, పూరీ, అన్నము, పులుసు, పరమాన్నము మొదలగునవి మసీదుకు దెచ్చెను. గంటల కొలది యూరకనే యుండు బాబా యానాడు వెంటనే లేచి, భోజనస్థలములో

గూర్చుండి, యామె తెచ్చిన పళ్ళెము పయి యాకు దీసి త్వరగా తిన నారంభించెను. శ్యామా యిట్లడిగెను. “ఎందుకీ పక్షపాతము? ఇతరుల పళ్ళెముల నెట్టివైచెదవు. వానివైపు చూడనయిన చూడవు కాని, దీనిని నీ దగ్గర కీడ్చుకొని తినుచున్నావు. ఈమె తెచ్చిన భోజనమెందుకంత రుచికరము? ఇది మాకు సమస్యగా నున్నది.” బాబా యిట్లు బోధించెను. “ఈ భోజనము యదార్థముగా మిక్కిలి యమూల్యమయినది. గతజన్మలో నీమె ఒక వర్తకుని యావు. అది బాగా పాలిచ్చుచుండెను. అచ్చటినుండి నిష్క్రమించి, ఒక తోటమాలి యింటిలో జన్మించెను. తదుపరి యొక క్షత్రియుని యింటిలో జన్మించి యొక వర్తకుని వివాహమాడెను. తరువాత ఒక బ్రాహ్మణుని కుటుంబములో జన్మించెను. చాలకాలము పిమ్మట ఆమెను నేను జూచితిని కావున ఆమె పళ్ళెమునుండి యింకను కొన్ని ప్రేమయుతమగు ముద్దలను దీసికొననిండు.” ఇట్లనుచు బాబా యామె పళ్ళెము ఖాళీ చేసెను. నోరు చేతులు కడుగుకొని త్రేన్పులు తీయుచు తిరిగి తన గద్దెపయి కూర్చుండెను. అప్పుడు ఆమె బాబాకు నమస్కరించెను. బాబా కాళ్ళను పిసుకుచుండెను. బాబా యామెతో మాట్లాడదొడంగెను. బాబా కాళ్ళను తోముచున్న యామె చేతులను బాబా తోముటకు ప్రారంభించెను. గురుశిష్యులు ఒండొరులు సేవ చేసికొనుట జూచి శ్యామా యిటులనెను. “చాల బాగా జరుగుచున్నది. భగవంతుడును, భక్తురాలును ఒకరికొకరు సేవ చేసికొనుట మిగుల వింతగా నున్నది.” ఆమె యదార్థమయిన ప్రేమకు సంతసించి బాబా మెల్లగా మృదువయిన యాకర్షించు కంఠముతో ‘రాజారామ్’ యను మంత్రమును ఎల్లప్పుడు జపించు మనుచు నిట్లనియెను. “నీవిట్లు చేసినచో నీ జీవితాశయమును పొందెదవు. నీ మనస్సు శాంతించును. నీకు మేలగును.” ఆధ్యాత్మికము తెలియనివారికి ఇది సామాన్య విషయమువలె గాన్పించును. కాని యది యట్లు గాదు. అది శక్తిపాతము; అనగా గురువు శిష్యునకు శక్తి ప్రసాదించుట. బాబా యొక్క మాటలెంత బలమయినవి! ఎంత ఫలవంతమయినవి! ఒక్క క్షణములో నవి యామె హృదయములో ప్రవేశించి స్థిరపడెను.

ఈ విషయము గురువునకు శిష్యునకు గల సంబంధమును బోధించుచున్నది. ఇద్దరు పరస్పరము ప్రేమించి సేవ చేసికొనవలెను. వారిద్దరికి మధ్య భేదము లేదు. ఇద్దరొకటే. ఒకరు లేనిదే మరియొకరు లేరు. శిష్యుడు తన శిరస్సును గురువు పాదముల మీద బెట్టుట బాహ్యదృశ్యమేగాని, యదార్థముగా వారిరువురు లోపల ఒక్కటే. వారి మధ్య భేదము పాటించువారు పక్వమునకు రానివారు; సంపూర్ణజ్ఞానము లేనివారును.

శ్రీసాయినాథాయ నమః

ఇరువదియేడవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీ సాయి సచ్చరిత్రము

## ఇరువది యెనిమిదవ అధ్యాయము

***బాబా తన భక్తులను షిరిడీకి రప్పించుకొనుట***

***లాలా లక్ష్మీచంద్: బురహాన్‌పూరు మహిళ: మేఘశ్యాముడు***

**బాబా తన భక్తులను షిరిడీకి రప్పించుట :**

శ్రీసాయి యనంతుడు. చీమలు, పురుగులు మొదలుకొని బ్రహ్మ పర్యంతము సకల జీవులందు వసించును. వారు సర్వాంతర్యామి. వేద జ్ఞానమందు, ఆత్మసాక్షాత్కారవిద్యయందు వారు పారంగతులు. ఈ రెండింటిలో వారికి ప్రావీణ్య ముండుటచే వారు సద్గురువు లనిపించుకొనుటకు సమర్థులు. పండితులయినప్పటికి శిష్యుల నెవరైతే ప్రేరేపించి యాత్మ సాక్షాత్కారము కలిగించలేరో వారు సద్గురువులు కానేరరు. సాధారణముగ తండ్రి శరీరమును పుట్టించును. పిమ్మట చావు జీవితమును వెంబడించును. కాని సద్గురువు చావుపుట్టుకలను రెంటిని దాటింతురు. కాబట్టి వారందరి కంటె దయార్ద్ర హృదయులు.

*సాయిబాబా యనేకసార్లు లిట్లు నుడివిరి. "నా మనుష్యుడు ఎంత దూరమున నున్నప్పటికి, **1000** క్రోసుల దూరమున నున్నప్పటికి, పిచ్చుక కాళ్ళకు దారము కట్టి యీడ్చినటుల అతనిని షిరిడీకి లాగెదను"* **అటువంటి మూడు పిచ్చుకల గురించి ఈ అధ్యాయములో చెప్పుకొందము.**

**లాలా లక్ష్మీచంద్ :**

అతడు మొట్టమొదట రైల్వేలోను, అటు తరువాత బొంబాయిలోని శ్రీ వెంకటేశ్వర ముద్రణాలయమునందును, తదుపరి ర్యాలీ బ్రదర్సు కంపెనీలోను గుమస్తాగా ఉద్యోగము చేసెను. 1910వ సంవత్సరమున అతనికి బాబా సాంగత్యము లభించెను. శాంతాక్రజులో, క్రిస్మస్ పండుగకు ఒకటి రెండు మాసములకు పూర్వము, స్వప్నములో గడ్డముతో నున్న యొక ముసలివానిని, చుట్టు భక్తులు గుంపులు గూడి యున్నట్లు చూచెను. కొన్నాళ్ళ తరువాత దాసగణు కీర్తన వినుటకు తన స్నేహితుడగు దత్తాత్రేయ మంజునాథ్ బిజూర్ యింటికి వెళ్ళెను. కీర్తన చేయునప్పుడు దాసగణు బాబా పటమును సభలో పెట్టుట యాచారము. స్వప్నములో చూచిన ముసలివాని ముఖ లక్షణములు ఈ పటములో నున్నవానికి సరిపోయెను. కావున తాను సాయిబాబాను స్వప్నములో జూచినటుల గ్రహించెను. పటము, దాసగణు కీర్తన, తుకారాం జీవితము (అప్పుడు దాసగణు చెప్పుచున్న హరికథ) ఇవన్నియు మనస్సున నాటి, లక్ష్మీచంద్ షిరిడీ పోవుట కువ్విళ్ళూరుచుండెను. సద్గురుని వెదకుటలోను ఆధ్యాత్మిక కృషియందును దేవుడు భక్తులకు సహాయపడు ననునది భక్తుల యనుభవమే. ఆనాటి రాత్రి 8 గంటలకు అతని స్నేహితుడగు శంకరరావు వచ్చి తలుపు కొట్టి షిరిడీకి వచ్చెదవాయని అడిగెను. అతని యానందమున కంతులేకుండెను. షిరిడీకి పోవలెనని నిశ్చయించుకొనెను. పినతండ్రి కొడుకు వద్ద 15 రూపాయలు అప్పుపుచ్చుకొని కావలసిన యేర్పాటు లన్నియును జేసికొనిన పిమ్మట షిరిడీకి పయనమయ్యెను. రైలులో నతడును, స్నేహితుడగు శంకరరావును భజన చేసిరి. సాయిబాబాను గూర్చి తోటి ప్రయాణీకుల నడిగిరి. చాలా సంవత్సరముల నుంచి షిరిడీలో నున్న సాయిబాబా గొప్ప యోగిపుంగవులని వారు చెప్పిరి. కోపర్‌గాం రాగానే అతడు బాబా కొరకు జామపండ్లను కొనవలెననుకొనెను. కాని యా గ్రామపరిసరములను ప్రకృతి దృశ్యములను జూచి యానందించి యా విషయమును మరచెను. షిరిడీ సమీపించుచుండగా

వారికీ సంగతి జ్ఞప్తికి వచ్చెను. అప్పుడే యొక ముసలమ్మ నెత్తిపై జామపండ్ల గంప పెట్టుకొని తమ గుఱ్ఱపుబండి వెంట పరుగెత్తుకొని వచ్చుచుండెను. ఆతడు బండినాపి కొన్ని యెంపుడు పండ్లను మాత్రమే కొనెను. అప్పుడా ముసలమ్మ తక్కిన పండ్లను కూడ తీసికొని తన పక్షమున బాబా కర్పితము చేయుడని కోరెను. జామపండ్లను కొనవలెననుకొనుట, ఆ విషయమే మరచుట, ముసలమ్మను కలిసికొనుట, యామె భక్తి, యివన్నియు నిద్దరికి ఆశ్చర్యమును కలుగజేసెను. ఆ ముసలమ్మ తాను స్వప్నములో చూచిన ముసలివాని బంధువై యుండవచ్చు ననుకొనెను. అంతలో బండి షిరిడీ చేరెను. వారు మసీదుపయి జండాలను చూచి నమస్కరించిరి. పూజా సామగ్రితో మసీదుకు వెళ్ళి బాబాను యుచితరీతిన పూజించిరి. లక్ష్మీచంద్ మనస్సు కరిగెను. బాబాను జూచి చాలా సంతసించెను. సువాసనగల తామరపువ్వును భ్రమరము జూచి సంతసించునటుల బాబా పాదముల జూచి సంతసించెను. అప్పుడు బాబా యిట్లనెను. *"టక్కరివాడు ! దారిలో భజన చేయును. నన్ను గూర్చి ఇతరులను విచారించుచుండును. ఇతరుల నడుగనేల ? మన కండ్లతోడ సమస్తము చూడవలెను. ఇతరుల నడుగవలసిన యవసరమేమి ? నీ స్వప్నము నిజమయినదా కాదా యనునది యాలోచించుము. మార్వాడి వద్ద 15 రూపాయలు అప్పు తీసికొని షిరిడీ దర్శనము చేయవలసిన యవసరమేమి? హృదయములోని కోరిక యిప్పుడయిన నెరవేరినదా ?"*

ఈ మాటలు విని బాబా సర్వజ్ఞత్వమునకు లక్ష్మీచంద్ యాశ్చర్యపడెను. బాబాకీ సంగతులన్నియు నెటుల దెలిసినవని ఆతడాశ్చర్యపడెను. ఇందులో ముఖ్యముగా గమనింపదగినది బాబా దర్శనము కొరకుగాని, సెలవురోజు అనగా పండుగ దినము గడుపుటకుగాని, తీర్థయాత్రకు పోవుటకు గాని అప్పుచేయరాదని బాబా యభిప్రాయము.

**సాంజా (ఉప్మా):**

మధ్యాహ్న భోజనమునకు గూర్చున్నప్పుడు లక్ష్మీచందుకు ఒక భక్తుడు సాంజాను ప్రసాదముగా నిచ్చెను. అది తిని లక్ష్మీచందు సంతసించెను. ఆ

**మేఘశ్యాముడు :**

ఇక అన్నిటికంటె పెద్దదైన మూడవ పిచ్చుక గురించి వినుడు. విరమ్‌గాం నివాసియగు మేఘశ్యాముడు హరి వినాయక సాఠేగారి వంట బ్రాహ్మణుడు. అతడు అమాయకుడైన చదువురాని శివభక్తుడు. ఎల్లప్పుడు శివపంచాక్షరి **('ఓం నమశ్శివాయ')** జపించువాడు. అతనికి సంధ్యావందనముగాని, గాయత్రీ మంత్రముగాని తెలియకుండెను. సాఠేగారికి వీనియందు శ్రద్ధ గలిగి గాయత్రీ మంత్రముతో సంధ్యావందనము నేర్పించిరి. సాయిబాబా శివుని యవతారమని సాఠే అతనికి బోధించి షిరిడీకి ప్రయాణము చేయించెను. బ్రోచి స్టేషనువద్ద సాయిబాబా మహమ్మదీయుడని యెవరో చెప్పగా అతని మనస్సు కలవరపడి తనను అచటకు పంపవద్దని యజమానిని వేడుకొనెను. కాని ఆ యజమాని మేఘుడు షిరిడీకి పోయితీరవలెనని నిశ్చయించి అతనికి ఒక పరిచయపు టుత్తరము షిరిడీవాసి తన మామగారగు దాదా కేల్కరుకు వ్రాసి సాయిబాబాతో పరిచయము కలుగజేయవలెనని ఇచ్చెను. షిరిడీ చేరి మసీదుకు పోగా బాబా కోపించి అతనిని లోపలకు రానీయక, ***"ఈ వెధవను తన్ని తరిమి వేయుడు !"*** అని గర్జించి మేఘునితో నిట్లనెను. ***"నీవు గొప్ప జాతి బ్రాహ్మణుడవు. నేనా తక్కువ జాతి మహమ్మదీయుడను. నీ విచటకు వచ్చినచో నీ కులము పోవును, కనుక వెడలిపొమ్ము !"*** ఈ మాటలు విని మేఘుడు వణక నారంభించెను. అతడు తన మనస్సులోనున్న విషయములు బాబా కెట్లు దెలిసెనని యాశ్చర్యపడెను. కొన్ని దినములచటనే యుండి తనకు తోచినట్లు బాబాను సేవించుచుండెను. కాని యతడు సంతృప్తి చెందలేదు. తరువాత తన యింటికి పోయెను. అక్కడనుండి త్ర్యంబక్ (నాసిక్ జిల్లా) పోయి యచట ఒక సంవత్సరము 6 మాసములుండెను. తిరిగి షిరిడీకి వచ్చెను. ఈసారి దాదాకేల్కర్ కల్పించుకొనుటచే నాతడు మసీదులో ప్రవేశించుటకు, షిరిడీలో నుండుటకు బాబా సమ్మతించెను. మేఘశ్యామునకు బాబా యుపదేశము ద్వారా సహాయము చేయలేదు. అతని మనస్సులోనే మార్పు కలుగజేయుచు చాలా

మేలుచేసెను. అప్పటినుండి ఆతడు సాయిబాబాను శివుని యవతారముగా భావించుచుండెను. శివుని యర్చనకు బిల్వపత్రి కావలెను. మేఘుడు ప్రతిరోజు మైళ్ళకొలది నడచి పత్రిని దెచ్చి బాబాను పూజించుచుండెను. గ్రామములో నున్న దేవతల నందరిని పూజించిన పిమ్మట మసీదుకు వచ్చి బాబా గద్దెకు నమస్కరించి పిదప బాబాను పూజించుచుండెను. కొంతసేపు వారి పాదముల నొత్తిన పిమ్మట బాబా పాద తీర్థమును త్రాగుచుండెడివాడు. ఒకనాడు ఖండోబా మందిరము వాకిలి మూసి యుండుటచే ఖండోబా దేవుని పూజింపక మసీదుకు వచ్చెను. బాబా అతని పూజను అంగీకరించక తిరిగి పంపివేసెను. ఖండోబా మందిరము వాకిలి తెరిచియున్నదని చెప్పెను. మేఘశ్యాముడు మందిరమునకు పోయెను. వాకిలి తెరిచి యుండుటచే ఖండోబాను పూజించి తిరిగి వచ్చి బాబాను పూజించెను.

**గంగాస్నానము :**

ఒక మకర సంక్రాంతి నాడు మేఘుడు బాబా శరీరమునకు చందనము పూసి గంగానదీ జలముతో నభిషేకము చేయదలంచెను. బాబాకు అది ఇష్టము లేకుండెను. కాని యతడనేకసారులు వేడుకొనగా బాబా సమ్మతించెను. మేఘశ్యాముడు రాను పోను 8 క్రోసుల దూరము నడచి గోమతీనదీ తీర్థము తేవలసియుండెను. ఆతడు తీర్థము దెచ్చి, యత్నము లన్నియు జేసికొని, బాబా వద్దకు 12 గంటలకు వచ్చి, స్నానమునకు సిద్ధముగా నుండుమనెను. బాబా తనకా యభిషేకము వలదనియు, ఫకీరగుటచే గంగాజలముతో నెట్టి సంబంధము లేదనియు చెప్పెను. కాని మేఘుడు వినలేదు. శివుని కభిషేక మిష్టము గనుక, తనకు శివుడైన బాబాకు అభిషేకము చేసి తీరవలెనని పట్టుబట్టెను. బాబా సమ్మతించి క్రిందికి దిగి పీటపయి కూర్చుండి తల ముందుకు సాచి ఇట్లనెను. **"ఓ మేఘా ! ఈ చిన్న యుపకారము చేసి పెట్టుము. శరీరమునకు తల ముఖ్యము. కావున తలపైనే నీళ్ళు పోయుము. శరీరమంతటిపై పోసినట్లగును".** అట్లనేయని మేఘశ్యాము డొప్పుకొని, నీళ్ళకుండను పైకెత్తి తలపై పోయ యత్నించెను. కాని భక్తి

పారవశ్యమున **"హరగంగే, హరగంగే"** యనుచు శరీరమంతటిపై నీళ్ళు పోసెను. కుండనొక ప్రక్కకు బెట్టి బాబావయిపు జూచెను. వాని యాశ్చర్యానందములకు మేరలేదు. బాబా తల మాత్రమే తడిసి, శరీరమంతయు పొడిగా నుండెను.

**త్రిశూలము - లింగము :**

మేఘశ్యాముడు బాబాను రెండుచోట్ల పూజించుచుండెను. మసీదులో బాబాను స్వయముగా పూజించుచుండెను. వాడాలో నానాసాహెబు చాందోర్కరిచ్చిన పటమును పూజించుచుండెను. ఈ ప్రకారము 12 నెలలు చేసెను. వాని భక్తికి మెచ్చుకొనెనని తెలుపుటకు బాబా అతనికొక దృష్టాంతము చూపెను. ఒకనాడు వేకువఝామున మేఘుడు తన శయ్యపయి పండుకొని కండ్లు మూసియున్నప్పటికి, లోపల ధ్యానము చేయుచు బాబా రూపమును జూచెను. బాబా అతనిపై యక్షతలు చల్లి ***"మేఘా ! త్రిశూలమును గీయుము!"*** అని చెప్పి అదృశ్యుడయ్యెను. మేఘుడు బాబా మాటలు విని, యాతురతగా కండ్లు దెరచెను. బాబా కనిపించలేదు గాని, యక్షత లక్కడక్కడ పడియుండెను. బాబా వద్దకు పోయి, చూచిన దృశ్యమును గూర్చి చెప్పి త్రిశూలమును గీయుట కాజ్ఞ నిమ్మనెను. బాబా యిట్లనెను : ***"నా మాటలు వినలేదా ? త్రిశూలమును గీయుమంటిని. అది దృశ్యము కాదు. స్వయముగా వచ్చి నేనే చెప్పితిని. నా మాటలు పొల్లుగావు. అర్థవంతములు"***. మేఘుడిట్లు పలికెను. **"మీరు నన్ను లేపినటుల భావించితిని. తలుపులన్ని వేసి యుండుటచే నది దృశ్యమనుకొంటిని"**. బాబా తిరిగి యిట్లు జవాబిచ్చెను: ***"ప్రవేశించుటకు నాకు వాకిలి యవసరము లేదు. నాకు రూపము లేదు. నేనన్నిచోట్ల నివసించుచున్నాను. ఎవరయితే నన్నే నమ్మి నా ధ్యానమునందే మునిగి యుందురో వారి పనులన్నియు సూత్రధారినై నేనే నడిపించెదను"***.

మేఘుడు వాడాకు తిరిగి వచ్చి, బాబా పటము వద్ద గోడపై త్రిశూలమును ఎఱ్ఱరంగుతో గీసెను. ఆ మరుసటి దినము ఒక రామదాసి భక్తుడు పూనా నుంచి వచ్చి బాబాకు నమస్కరించి ఒక లింగమును సమర్పించెను. అప్పుడే మేఘుడు కూడ అచ్చటకు వచ్చెను. బాబా యిట్లనెను.

"చూడు శంకరుడు వచ్చినాడు ! జాగ్రత్తగా పూజింపుము" ! మేఘుడు త్రిశూలమును గీసిన వెంటనే లింగము వచ్చుట గాంచెను. ఆతడాశ్చర్య పడుచుండగా మేఘశ్యాముడు వచ్చి బాబా తనకు లింగము కానుకగా నిచ్చెనని చూపెను. దీక్షిత్ దానిని జూచి సరిగా నది తన ధ్యానములో కనపడినదానివలె నున్నదని సంతసించెను. కొద్దిరోజులలో త్రిశూలమును వ్రాయుట పూర్తికాగా బాబా, మేఘశ్యాముడు పూజచేయుచున్న పెద్ద పటము వద్ద లింగమును ప్రతిష్ఠించెను. మేఘశ్యామునకు శివుని పూజించుట చాల ప్రీతి గనుక త్రిశూలమును వ్రాయించి, లింగమును ప్రతిష్ఠించుట ద్వారా బాబా వానియందుండు నమ్మకమును స్థిరపరచెను.

అనేక సంవత్సరములు బాబా సేవ చేసి యనగా పూజా, మధ్యాహ్న సాయంకాల హారతి సేవలు చేసి తుదకు 1912లో మేఘశ్యాముడు కాలము నొందెను. బాబా వాని కళేబరముపయి చేతులు చాచి **"ఇతడు నా నిజమయిన భక్తు"**డనెను. బాబా తన సొంత ఖర్చులతో బ్రాహ్మణులకు చావు భోజి ఏర్పాటు చేయుమనెను. కాకాసాహెబు దీక్షిత్ బాబా ఆజ్ఞ నెరవేర్చెను.

**ఇరువది యెనిమిదవ అధ్యాయము సంపూర్ణము**



**సద్గురు శ్రీ సాయినాథార్పణమస్తు**

**శుభం భవతు**



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఇరువదితొమ్మిదవ అధ్యాయము

1. మద్రాసు భజనసమాజము, 2. తేండూల్కర్, (తండ్రి-కొడుకులు), 3. డాక్టర్ కాప్టెన్ హాటే, 4. వామన్ నార్వేకర్ మొదలైన వారి కథలు.

**ఈ** యధ్యాయములో రుచికరములు ఆశ్చర్యకరములునైన మరికొన్ని సాయి కథలున్నవి.

### 1. మద్రాసు భజనసమాజము

1916వ సంవత్సరములో రామదాసి పంథాకు చెందిన మదరాసు భజన సమాజ మొకటి కాశీయాత్రకు బయలుదేరెను. అందులో నొక పురుషుడు అతని భార్య, అతని కుమార్తె, అతని వదినెయు నుండిరి. వారి పేర్లు తెలియవు. మార్గమధ్యమున వారు అహమదునగరు జిల్లా, కోపర్‌గాం తాలూకాలో శిరిడీ యను గ్రామమున సాయియనునొక గొప్ప యోగీశ్వరుడున్నారనియు, వారు పరబ్రహ్మస్వరూపులనియు, ప్రశాంతులనియు, ఉదారస్వభావులనియు, భక్తులకు ప్రతిరోజు ద్రవ్యము పంచి పెట్టెదరనియు. విద్యావంతుల కళాకుశలతను బట్టి యథోచితముగా సత్కరింతురనియు వినిరి. ప్రతిరోజు దక్షిణరూపముగా చాల డబ్బు వసూలు చేసి, దానిని భక్తకొండాజి కూతురు 3 ఏండ్ల అమనికి ఒక రూపాయ, 2 రూపాయల నుంచి 5 రూపాయల వరకు కొందరికి, జమాలికి 6 రూపాయలను, అమనితల్లికి 10 రూపాయలు

మొదలుకొని 20 రూపాయల వరకు, కొందరు భక్తులకు 50 రూపాయల వరకు బాబా ఇచ్చుచుండెను. ఇదంతయు విని సమాజము శిరిడీకి వచ్చి యచట ఆగి మంచి భజన చేసెను. వారు మంచి పాటలు పాడిరి. కాని లోలోన ద్రవ్యము నాశించుచుండిరి. వారిలో ముగ్గురు పేరాస గలవారు. యజమానురాలు మాత్రమట్టి స్వభావము గలది కాదు. ఆమె బాబా యందు ప్రేమగౌరవములు కలది. ఒకనాడు మధ్యాహ్నహారతి జరుగుచుండగా బాబా యామె భక్తి విశ్వాసములకు ప్రీతి జెంది యామె యిష్టదైవముయొక్క దృశ్యము ప్రసాదించెను. ఆమెకు బాబా శ్రీరామునివలె గాన్పించెను. కాని ఇతరులకు మామూలు సాయినాథునివలె గాన్పించెను. తన యిష్టదైవమును జూచి యామె మనస్సు కరిగెను. కండ్లనుండి యానందబాష్పములు కారుచుండగా ఆమె ఆనందముతో చేతులు, తట్టెను. ఆమె యానందవైఖరికి తక్కినవా రాశ్చర్యపడిరి. కాని కారణమేమో తెలిసికొనలేకుండిరి. జరిగిన దంతయు ఆమె సాయంకాలము తన భర్తతో చెప్పెను. ఆమె సాయిబాబాలో శ్రీరాముని జూచితిననెను. ఆమె అమాయిక భక్తురాలగుటచే, శ్రీరాముని జూచుట ఆమె పడిన భ్రమ యని భర్త యనుకొనెను. అది యంతయు వట్టి చాదస్తమని వెక్కిరించెను. అందరు సాయిబాబాను జూడగా ఆమె శ్రీరాముని జూచుట యసంభవమనెను. ఆమె యా యాక్షేపణకు కోపగించలేదు. ఆమెకు శ్రీరామదర్శనము అప్పుడప్పుడు తన మనస్సు ప్రశాంతముగా నుండునప్పుడు, దురాశలు లేనప్పుడును, లభించుచునే యుండెను.

**ఆశ్చర్యకరమైన దర్శనము**

ఈ ప్రకారముగా జరుగుచుండగా ఒకనాటి రాత్రి భర్తకొక యద్భుతమైన దృశ్యము ఈ విధముగా కనబడెను. అతడొక పెద్ద పట్టణములో నుండెను. అక్కడి పోలీసులు తనను బంధించిరి. తాడుతో చేతులు కట్టి, యొక పంజరమున బంధించిరి. పోలీసువారు తాడుముడి మరింత బిగించుచుండగా సాయిబాబా పంజరము దగ్గరనే నిలిచియుండుట జూచి విచారముగా నత డిట్లనెను, "నీ కీర్తి విని నీ పాదముల వద్దకు వచ్చితిని, నీవు స్వయముగా నిచట నిలచి యుండగా ఈ యాపద నాపయి బడనేల?" బాబా యిట్లనెను: "నీవు చేసిన కర్మఫలితమును నీవే యనుభవింపవలెను!" అతడిట్లనెను, "ఈ

జన్మలో నాకిట్టి యాపద వచ్చుటకు నేనేమి పాపము చేయలేదు." బాబా యిటులనెను: "ఈ జన్మములో కాకున్న గతజన్మలో నేమయిన పాపము చేసియుండవచ్చును." అతడిట్లనెను, "గత జన్మలో నేమయిన పాపము చేసి యున్నచో, నీ సముఖమున దాని నేల నిప్పుముందర యెండు గడ్డివలె దహనము చేయరాదు?" బాబా "నీ కట్టి విశ్వాసము గలదా?" యని యడుగ అతడు 'కలదు' అనెను. బాబా యప్పుడు కండ్లు మూయుమనెను. అతడు కండ్లు మూసి తెరచునంతలో ఏదో క్రింద బడిన పెద్ద చప్పుడయ్యెను. పోలీసువారు రక్తము కారుచు పడిపోయి యుండిరి. తాను బంధవిముక్తుడై యుండెను. అతడు మిక్కిలి భయపడి బాబా వైపు జూచెను. బాబా యిట్లనెను, "ఇప్పుడు నీవు బాగుగ పట్టుబడితివి. ఆఫీసర్లు వచ్చి నిన్ను బంధించెదరు." అప్పుడతడు ఇటుల విన్నవించెను. "నీవు తప్ప రక్షించు వారెవరును లేరు. నన్ను ఎటులయిన కాపాడుము." అప్పుడు బాబా వానిని కండ్లు మూయుమనెను. వాడట్లు చేసి తిరిగి కనులు తెరచునంతలో, వాడు పంజరమునుండి విడుదలయినట్లు బాబా ప్రక్కనున్నట్లు గాన్పించెను. అతడు బాబా పాదములపై బడెను.

బాబా యిట్లనెను: "ఈ నమస్కారములకు ఇంతకు ముందటి నమస్కారములకేమైన భేదము కలదా? బాగా యాలోచించి చెప్పుము!" అతడు ఇట్లనెను: "కావలసినంత భేదము కలదు. ముందటి నమస్కారములు నీవద్ద పైకము తీసుకొనుటకు చేసినవి. ఈ నమస్కారము నిన్ను దేవునిగా భావించి చేసినది. మరియును నేను కోపముతో నీవు మహమ్మదీయుడవై యుండి హిందువులను పాడు చేయుచుంటివని యనుకొనెడివాడను." బాబా "నీ మనసులో మహమ్మదీయ దేవతలను నమ్మవా?" యని ప్రశ్నింప అతడు నమ్మనననెను. అప్పుడు బాబా "నీ యింటిలో పంజా లేదా? నీవు మొహరమప్పుడు పూజ చేయుట లేదా? మరియు మీ యింటిలో మహమ్మదీయ దేవత యగు కాడ్బీబీ లేదా? పెండ్లి మొదలగు శుభకార్యములప్పు డామెను మీరు శాంతింప జేయుట లేదా?" యనెను. అతడు దీనికంతటికి యొప్పుకొనెను. అప్పుడు బాబా "నీ కింక ఏమి కావలె" నని యడిగెను. అతడు తన గురువగు రామదాసును దర్శింప కోరిక గలదనెను.

వెనుకకు తిరిగి చూడుమని బాబా యనెను. వెనుకకు తిరుగగనే యతనికి ఆశ్చర్యము కలుగునట్లు రామదాసస్వామి తన ముందర నుండెను. వారి పాదములపై బడగనే, రామదాసు అదృశ్యుడయ్యెను. జిజ్ఞాసగలవాడై యతడు బాబాతో యిటులనెను: "మీరు వృద్ధులుగా గనబడుచున్నారు. మీ వయస్సు మీకు తెలియునా?" బాబా, "నేను ముసలివాడ ననుచున్నావా? నాతో పరుగెత్తి చూడు" మనుచు పరుగిడ మొదలిడెను. అతడు కూడ వెంబడించెను. ఆధూళిలో బాబా అదృశ్యుడయ్యెను. అతడు నిద్రనుండి మేల్కొనెను.

మేలుకొనిన వెంటనే స్వప్నదర్శనము గూర్చి తీవ్రముగా నాలోచించ మొదలిడెను. వాని మనోవైఖరి పూర్తిగా మారి, బాబా గొప్పదనమును గ్రహించెను. అటుపిమ్మట వాని సంశయవైఖరి పేరాస పూర్తిగా తొలగెను. బాబా పాదములపై అసలయిన భక్తి మనమున నుద్భవించెను. ఆ దృశ్యమొక స్వప్నమే కాని, యందుగల ప్రశ్నోత్తరములు చాల ముఖ్యమైనవి, రుచికరమైనవి. ఆ మరుసటి యుదయ మందరు మసీదులో హారతికొరకు గుమిగూడియుండగా అతనికి బాబా రెండురూపాయల విలువగల మిఠాయిని, రెండురూపాయల నగదు నిచ్చి ఆశీర్వదించెను. అతనిని మరికొన్ని రోజులుండుమనెను. అతనిని బాబా ఆశీర్వదించి యిట్లనియె. "అల్లా నీకు కావలసినంత డబ్బు నిచ్చును. నీకు మేలు చేయును." అతని కచ్చుట యెక్కువ ధనము దొరుకలేదు. కాని అన్నిటికంటె మేలైన వస్తువు దొరికెను. అదియే బాబా యాశీర్వాదము. తరువాత ఆ భజనసమాజమునకెంతో ధనము లభించెను. వారి యాత్రకూడ జయప్రదముగా సాగెను. వారి కెట్టి కష్టములు ప్రయాణమధ్యమున కలుగలేదు. అందరు క్షేమముగా ఇల్లు చేరిరి. వారు బాబా పలుకులు, ఆశీర్వాదములు, వారి కటాక్షములచే కలిగిన ఆనందము గూర్చి మనమున చింతించుచుండిరి.

తన భక్తులను వృద్ధిచేయుటకు, వారి మనస్సులను మార్చుటకు బాబా యవలంబించిన మార్గములలో నొకటి చూపుట కీ లీల యొక యుదాహరణము. ఇప్పటికి నిట్టి మార్గములను బాబా అవలంబించుచున్నారు.

2. తేండూల్కర్ కుటుంబము

బాంద్రాలో తేండూల్కర్ కుటుంబముండెను. ఆ కుటుంబము వారందరు బాబాయందు భక్తి కలిగియుండిరి. సావిత్రీబాయి తేండూల్కర్ 'శ్రీసాయినాథ భజనమాల' యను మరాటీ గ్రంథమును 800 అభంగములు, పదములతో ప్రచురించెను. దానిలో సాయిలీల లన్నియు వర్ణింపబడెను. బాబా యందు శ్రద్ధాభక్తులు గలవారు దానిని తప్పక చదువవలెను. వారి కుమారుడు బాబు తేండూల్కర్ వైద్యపరీక్షకు కూర్చొనవలెనని రాత్రింబవళ్ళు కష్టపడి చదువుచుండెను. అతడు కొందరు జ్యోతిష్కుల సలహా చేసెను. వారు అతని జాతకమును జూచి ఈ సంవత్సరము గ్రహములు అనుకూలముగా లేవని చెప్పిరి. కనుక యా మరుసటి సంవత్సరము పరీక్షకు కూర్చొనవలెననియు అట్లు చేసిన తప్పక ఉత్తీర్ణుడగుననియు చెప్పిరి. ఇది విని అతని మనస్సుకు విచారము అశాంతి కలిగెను. కొన్ని దినముల తరువాత అతని తల్లి శిరిడీకి పోయి బాబాను దర్శించెను. ఆమె బాబాకు అనేకవిషయములతో పాటు తన కొడుకు విచారగ్రస్తుడైన సంగతి కూడ చెప్పెను. ఇది విని బాబా యామెతో ఇట్లనియెను. "నాయందు నమ్మకముంచి జాతకములు, వాని ఫలితములు, సాముద్రికశాస్త్రజ్ఞుల పలుకు లొకప్రక్కకు ద్రోసి, తన పాఠములు చదువుకొనుమని చెప్పుము. శాంత మనస్సుతో పరీక్షకు వెళ్ళుమనుము. అతడు ఈ సంవత్సరము తప్పక ఉత్తీర్ణుడగును. నాయందే నమ్మక ముంచుమనుము. నిరుత్సాహము చెందవద్దనుము." తల్లి యింటికి వచ్చి బాబా సందేశము కొడుకుకు వినిపించెను. అతడు శ్రద్ధగా చదివెను; పరీక్షకు కూర్చొనెను. వ్రాతపరీక్షలో బాగుగ వ్రాసెను గాని సంశయములో మునిగి ఉత్తీర్ణుడగుటకు కావలసిన మార్కులు రావనుకొనెను. కావున నోటిపరీక్షకు కూర్చొన నిష్టపడలేదు. కాని పరీక్షకులు అతని వెంటబడిరి. వ్రాతపరీక్షలో ఉత్తీర్ణుడాయెననియు నోటిపరీక్షకు రావలెననియు పరీక్షాధికారి కబురు పెట్టెను. ఇట్లు ధైర్యవచనము విని యాతడు పరీక్షకు కూర్చొని రెండింటిలో ఉత్తీర్ణుడాయెను. గ్రహములు వ్యతిరేకముగా నున్నను బాబా కటాక్షముచే ఆ సంవత్సరము పరీక్షలో ఉత్తీర్ణుడయ్యెను. సంశయములు కష్టములు మన భక్తిని స్థిరపరచుటకు మనలను చుట్టుముట్టును; మనల

పరీక్షించును. పూర్తి విశ్వాసముతో బాబాను కొలుచుచు మన కృషి సాగించినచో, మన ప్రయత్నములన్నియు తుదకు విజయవంతమగును.

ఈ విద్యార్థి తండ్రి రఘునాథరావు బొంబాయిలో నొక విదేశీ కంపెనీలో కొలువుండెను. వృద్ధులగుటచే సరిగా పనిచేయలేక సెలవు పెట్టి విశ్రాంతి పొందుచుండెను. సెలవు కాలములో అతని స్థితి మెరుగుపడలేదు. కావున సెలవు పొడిగించవలె ననుకొనెను; లేదా ఉద్యోగమునుండి విరమించుకొనుట నిశ్చయమని తోచెను. కంపెనీ మేనేజరు అతనికి పింఛను ఇచ్చి ఉద్యోగ విరమణము చేయించవలెనని నిశ్చయించెను. మిక్కిలి నమ్మకముతో చాలాకాలము తమ వద్ద ఉద్యోగము చేసినవాడు కనుక ఎంత పింఛను ఇవ్వవలెననునది యాలోచించుచుండిరి. అతని వేతనము నెలకు 150 రూపాయలు. పింఛను అందులో సగము 75 రూపాయలు, కుటుంబము ఖర్చులకు సరిపోదు. కాబట్టి యీ విషయమై వారందరు ఆతురతతో నుండిరి. తుది నిర్ణయమునకు 15 రోజులు ముందు తేండూల్కర్ భార్యకు బాబా స్వప్నములో గనిపించి, "*100 రూపాయలు పింఛను ఇచ్చిన బాగుండు ననుకొందును. అది నీకు సంతృప్తికరమా?*" యనెను. ఆమె యిట్లు జవాబిచ్చెను. "*బాబా నన్నేల యడిగెదవు? మేము నిన్నే విశ్వసించి యున్నాము.*" బాబా 100 రూపాయలు అనినను, అతనికి 10 రూపాయలు అధికముగా అనగా 110 రూపాయలు పింఛను లభించెను. తన భక్తులపై బాబా ఇట్టి విచిత్రమైన ప్రేమానురాగములు ప్రదర్శించువారు.

### 3. కాప్టెన్ హాటే

కాప్టెన్ హాటే బికానేరులో నుండెడివాడు. అతడు బాబాకు కూర్చు భక్తుడు. ఒకనాడు బాబా యతని స్వప్నములో గనిపించి, "*నన్ను మరచితివా?*"యనెను. హాటే వెంటనే బాబా పాదములు పట్టుకొని, "*బిడ్డ తల్లిని మరచినచో అదెట్లు బ్రతుకును?*" అనుచు తోటలోనికి బోయి తాజా చిక్కుడు కాయలు తెచ్చి స్వయంపాకమును, దక్షిణను బాబా కర్పింపనుండగా, నతడు మేల్కొనెను. ఇది యంతయు స్వప్నమనుకొనెను. ఈ వస్తువులన్నిటిని శిరిడీ సాయిబాబా వద్దకు పంప నిశ్చయించుకొనెను. కొన్ని దినముల తరువాత

గ్వాలియర్ వెళ్ళెను. అక్కడనుండి 12 రూపాయలు మనియార్డరు ద్వారా బొంబాయిలో నుండిన తన స్నేహితునకు బంపి అందులో రెండు రూపాయలతో స్వయంపాకము వస్తువులు చిక్కుడుకాయలు కొని, 10 రూపాయలు దక్షిణ సమర్పించవలెనని వ్రాసెను. ఆ స్నేహితుడు శిరిడీకి పోయి కావలసిన సామానులు కొనెను. కాని చిక్కుడుకాయలు దొరకలేదు. కొంచెము సేపటికి యొక స్త్రీ తలపై చిక్కుడుకాయల గంపను పెట్టుకొని వచ్చెను. అతడు చిక్కుడుకాయలు కొని స్వయంపాకము సిద్ధము చేసి కాప్టెన్ హాటే పక్షమున దానిని బాబాకు అర్పించెను. నిమోన్‌కర్ మరుసటి దినము అన్నము కూర చేసి బాబా కర్పించెను. బాబా భోజనము చేయునప్పుడు అన్నము ఇతర పదార్థములను మాని చిక్కుడు కాయ కూరను తినెను. ఈ సంగతి స్నేహితుని ద్వారా తెలిసికొన్న హాటే సంతోషమున కంతు లేకుండెను.

**పవిత్రము చేసిన రూపాయి**

ఇంకొకసారి హాటేకు తన ఇంటిలో బాబా తాకి పవిత్ర మొనర్చిన రూపాయి నుంచవలెనని కోరిక గలిగెను. శిరిడీకి పోవు స్నేహితుడొకడు తటస్థపడగా వానిద్వారా హాటే రూపాయి పంపెను. ఆ స్నేహితుడు శిరిడీ చేరెను. బాబాకు నమస్కరించిన పిదప తన గురుదక్షిణ యొసంగెను. బాబా దానిని జేబులో వేసికొనెను. తరువాత హాటే యిచ్చిన రూపాయిని ఇవ్వగా బాబా దానివైపు బాగా చూచి, తన కుడిచేతి బొటన వ్రేలుతో పై కెగురవేసి యాడి, ఆ స్నేహితునితో నిట్లనెను: "దీనిని దాని యజమానికి ఊదీ ప్రసాదముతో కూడ ఇచ్చి వేయుము. నాకేమి యక్కరలేదని చెప్పుము. శాంతముగా సంతోషముగా నుండుమనుము." ఆ స్నేహితుడు గ్వాలియర్ తిరిగి వచ్చెను. హాటేకు బాబా పవిత్రము చేసిన రూపాయి ఇచ్చి జరిగినదంతయు చెప్పెను. ఈసారి హాటే మిక్కిలి సంతుష్టిజెందెను. బాబా సద్బుద్ధి కలుగజేయునని గ్రహించెను. మనఃపూర్వకముగా కోరుటచే బాబా తన కోరికను యథాప్రకారము నెరవేర్చెనని సంతసించెను.

**4. వామన నార్వేకర్**

చదువరు లింకొక కథను వినెదరుగాక. వామన నార్వేకర్ అను నతడు బాబాను మిక్కిలి ప్రేమించువాడు. ఒకనాడతడు ఒక రూపాయి తెచ్చెను.

దానికి నొక ప్రక్క సీతారామలక్ష్మణులును, ఇంకొక ప్రక్క భక్తాంజనేయుడు గలరు. అతడు దానిని బాబా కిచ్చెను. బాబా దానిని తాకి పవిత్రమొనర్చి ఊదీ ప్రసాదముతో తన కివ్వవలెనని అతని కోరిక. కాని బాబా దానిని వెంటనే జేబులో వేసికొనెను. శ్యామా, నార్వేకర్ ఉద్దేశమును తెలుపుచు దానిని తిరిగి ఇచ్చివేయుమని బాబాను వేడెను. బాబా యిట్లనెను, *"దీని నేల అతనికివ్వవలెను? దీనిని మనమే యుంచుకొందము. అతడు 25 రూపాయలిచ్చినచో తిరిగి వానిది వాని కిచ్చెదము."* ఆ రూపాయి కొరకు వామనరావు 25 రూపాయలు వసూలు చేసి బాబా ముందరపెట్టెను. బాబా యిట్లనెను. *"ఆ నాణెము విలువ 25 రూపాయల కంటే యెంతో ఎక్కువ. శ్యామా! యీ రూపాయిని దీసికొనుము. మన కోశములో దీని నుంచుము. దీనిని నీ పూజామందిరములో బెట్టి పూజించుకొనుము."* బాబా యెందులకీ మార్గము నవలంబించిరో యడుగుట కెవరికిని ధైర్యము చాలకుండెను. ఎవరికేది క్షేమమో బాబాకే తెలియును.

శ్రీసాయినాథాయ నమః

**ఇరువదితొమ్మిదవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదవ అధ్యాయము

*శిరిడీకి లాగబడిన భక్తులు:*
1. వణి నివాసి కాకాజీ వైద్య 2. బొంబాయి నివాసి పంజాబి రామలాల్.

**ఈ** అధ్యాయములో బాబా శిరిడీకి ఈడ్చిన యిద్దరు భక్తుల వృత్తాంతము చెప్పుకొందము.

దయామయుడు భక్తవత్సలుడునగు శ్రీసాయికి నమస్కారము. వారు దర్శనమాత్రముననే భవసాగరమును తరింపజేసి మన ఆపదలను బాపెదరు. వారు నిర్గుణస్వరూపులైనను భక్తులు కోరుటచే సగుణ స్వరూపము వహించిరి. భక్తుల కాత్మసాక్షాత్కారము కలిగించుటే మహాత్ముల కర్తవ్యము. అది యోగేశ్వరుడైన సాయినాథునకు ముఖ్యతమమైనది, తప్పనిసరి యైనది. వారి పాదముల నాశ్రయించినవారి పాపము లెల్ల నశించును. అట్టివారి ప్రగతి నిశ్చయము. వారి పాదములు స్మరించుచు పుణ్యక్షేత్రములనుండి బ్రాహ్మణులు వచ్చి వారి సన్నిధిలో వేదశాస్త్రములు పారాయణచేసి, గాయత్రీమంత్రమును జపించెదరు. దుర్బలులము, పుణ్యహీనుల మగుటచే భక్తి యనగా నేమో మనకు దెలియదు. మనకింత మాత్రము తెలియును. ఇతరులు మనలను విడిచి పెట్టినప్పటికి బాబా మాత్రము మనలను విడువడు. వారి కృపకు పాత్రులైనవారు కావలసినంత శక్తి, జ్ఞానము, నిత్యానిత్యవివేకములను పొందెదరు.

భక్తుల కోరికలను పూర్తిగా గ్రహించి సాయి వానిని నెరవేర్చును. అందుచేత ఎవరికి కావలసినవి వారు పొంది, కృతజ్ఞతతో నుండెదరు. కాని మేము వారికి సాష్టాంగనమస్కారము చేసి వేడుకొనెదము. మా తప్పులన్నియు క్షమించి సాయి మా యారాటము లన్నియు బాపుగాక. కష్టములపాలై సాయి నీ విధముగా ప్రార్థించువారి మనస్సు శాంతించి, బాబా కటాక్షముచే వారు సంతుష్టి నందెదరు.

దయాసముద్రుడగు సాయి కటాక్షించుటచే హేమాడ్‌పంతు ఈ గ్రంథమును వ్రాయగలిగెనని చెప్పుకొనెను. లేకున్నచో తనకు గల యోగ్యత యెంత? ఎవరింత కఠినమైన పనికి పూనుకొనగలరనెను. శ్రీసాయి ఈ భారమంతయు వహించుటచే హేమాడ్‌పంతుకు కష్టముగాని, శ్రమగాని కానరాకుండెను. తన వాక్కును, కలమును గూడ ప్రేరేపించుటకు శక్తివంతమగు జ్ఞానమనే వెలుతురుండగా నతడు సంశయముగాని, ఆరాటముగాని పొందనేల? అతడు వ్రాసిన యీ పుస్తకరూపమున శ్రీసాయి అతని సేవను గైకొనెను. ఇది యతని గతజన్మల పుణ్యపరంపరచే ప్రాప్తించెను. కావున నాతడదృష్టవంతుడనియు పుణ్యాత్ముడనియు అనుకొనెను.

ఈ క్రింది కథ సాధారణ కథ కాదు; స్వచ్ఛమైన యమృతము. దీని నెవరు త్రాగెదరో వారు సాయి మహిమను సర్వాంతర్యామిత్వమును దెలిసికొందురు. వాదించువారు విమర్శించువారు ఈ కథలను చదువనక్కరలేదు. దీనికి కావలసినది యంతులేని ప్రేమ, భక్తి; వివాదము కాదు. జ్ఞానులు భక్తి విశ్వాసములు గలవారు లేదా యోగుల సేవకుల మనుకొనువారు, ఈ కథల నిష్టపడి మెచ్చుకొనెదరు. తదితరులు కాకమ్మకథ లనుకొందురు. అదృష్టవంతులు అయిన సాయిభక్తులు సాయి లీలలను కల్పతరువుగా భావించెదరు. ఈ సాయి లీలామృతమును త్రాగినచో అజ్ఞానులకు జన్మరాహిత్యము కలుగును. గృహస్థులకు సంతృప్తికలుగును. ముముక్షువుల కిది సాధనగా నుపకరించును. ఇక ఈ అధ్యాయములోని కథను ప్రారంభించెదము.

**కాకాజీ వైద్య**

నాసిక్ జిల్లా వణిలో కాకాజీవైద్య యనువాడుండెను. అతడచటి సప్తశృంగి దేవతకు పూజారి. అతడనేక కష్టముల పాలై మనఃశ్శాంతిని పోగొట్టుకొని చంచలమనస్కుడయ్యెను. అట్టి పరిస్థితులలో ఒకనాటి సాయంకాలము దేవతాలయమునకు బోయి తనను ఆందోళననుండి కాపాడుమని హృదయ పూర్వకముగా వేడుకొనెను. అతని భక్తికి దేవత సంతసించి యానాటి రాత్రి యాతనికి స్వప్నమున గాన్పించి *"బాబావద్దకు పొమ్ము! నీ మనస్సు శాంతి వహించు"* ననెను. ఈ బాబా యెవరో దేవి నడిగి తెలిసికొనుటకు కాకాజీ యుత్సహించెను. కాని ఇంతలోనే అతనికి మెలకువ కలిగెను. ఈ బాబా యెవరైయుండవచ్చునని అతడు యోచించెను. కొంతసేపు ఆలోచించిన పిమ్మట యీ బాబా త్ర్యంబకేశ్వరుడు (శివుడు) కావచ్చునని అతడు పుణ్యస్థలమగు త్ర్యంబకము (నాసిక్ జిల్లా) వెళ్ళెను. అచ్చట పదిరోజులుండెను. అక్కడున్నంత కాలము వేకువఝామున స్నానము చేసి, రుద్రమును జపించుచు, అభిషేకమును తదితరపూజలను గావించెను. అయినప్పటికి మునుపటివలెనే అశాంత మనస్కుడుగా నుండెను. పిమ్మట స్వగ్రామమునకు తిరిగివచ్చి దేవతను తిరిగి వేడుకొనెను. ఆ రాత్రి ఆమె స్వప్నములో గనిపించి యిట్లనెను. *"అనవసరముగా త్ర్యంబకేశ్వరమెందుకు వెళ్ళినావు? బాబా యనగా శిరిడీ సాయిబాబా యని నా యభిప్రాయము."*

శిరిడీకి పోవుటెట్లు? ఎప్పుడు పోవలెను? బాబాను జూచుటెట్లు? అని కాకాజీ మనోవ్యాకులత పొందుచుండెను. ఎవరయిన యోగీశ్వరుని చూడవలె ననుకున్నచో, ఆ యోగియేగాక దైవముకూడ అతని కోరికను నెరవేర్చుటకు సహాయపడును. యదార్థముగా యోగియు భగవంతుడును నొకరే. వారిలో నేమియు భేదము లేదు. ఎవరైన తానై పోయి యోగిని దర్శించుటన్నది యుత్తబూటకము. యోగి సంకల్పించనిదే వారిని జూడగలుగు వారెవరు? అతని యాజ్ఞ లేక చెట్టు ఆకు గూడ కదలదు. యోగి దర్శనమునకై భక్తుడు ఎంత వేదన పడునో, ఎంత భక్తివిశ్వాసములు జూపునో, యంత త్వరగాను, బలముగాను అతని కోరిక నెరవేరును. దర్శనమునకై ఆహ్వానించువాడే వచ్చువానికి స్వాగతసన్నాహము లొనర్చును. కాకాజీ విషయములో అట్లే జరిగెను.

**శ్యామా మ్రొక్కు**

కాకాజీ శిరిడీకి పోవుట కాలోచించుచుండగా, ఒక యతిథి అతనిని శిరిడీకి తీసికొనిపోవుట కాతని యింటికే వచ్చెను. అతడింకెవడో కాదు, బాబాకు ముఖ్యభక్తుడు శ్యామాయే. శ్యామా ఆ సమయమున వణికి ఎట్లు వచ్చెనో చూతము. శ్యామా బాల్యములో జబ్బు పడినప్పుడు అతని తల్లి తమ గృహదేవతయగు వణిలోని సప్తశృంగికి, 'జబ్బు నయము కాగానే నీ దర్శనమునకు వచ్చి బిడ్డను నీ పాదములపై బెట్టెద'నని మ్రొక్కుకొనెను. కొన్ని సంవత్సరముల పిమ్మట ఆ తల్లి కుచములపై తామర లేచి ఆమె మిక్కిలి బాధపడెను. తనకు నయమైనచో రెండు వెండికుచములు సమర్పించెదనని అప్పుడింకొక మ్రొక్కు మ్రొక్కెను. కాని ఈ రెండు మ్రొక్కులు కూడ ఆమె చెల్లించలేదు. ఆమె చనిపోవునప్పుడు ఈ సంగతి శ్యామాకు చెప్పి రెండు మ్రొక్కులు చెల్లించు భారము నాతనిపై వైచి ఆమె మృతిచెందెను. శ్యామా కొన్నాళ్ళకు ఆ మ్రొక్కులను పూర్తిగా మరచెను. ఇట్లు 30 సంవత్సరములు గడచెను. అప్పట్లో శిరిడీకి ఒక పేరు పొందిన జ్యోతిష్కుడు వచ్చి నెల దినములచట మకాము చేసెను. అతడు శ్రీమాన్ బూటీ మొదలగు వారికి చెప్పిన భవిష్యత్తు సంతృప్తికరముగా నుండెను. శ్యామా తమ్ముడు బాపాజి జ్యోతిషపండితుని సంప్రదించగా అతడు తల్లి మ్రొక్కులు చెల్లించక పోవుటచే వారికి కష్టములు సప్తశృంగి దేవత కలుగ జేయుచున్న దనెను. బాపాజీ యీ సంగతి శ్యామాకు తెలియపరచెను. అప్పుడు శ్యామాకు సర్వము జ్ఞప్తికి వచ్చెను. ఇంకను ఆలస్యము చేసినచో హానికరమని యెంచి శ్యామా ఒక కంసాలిని బిలిచి, రెండు వెండి కుచములను చేయించెను. మసీదుకు బోయి బాబా పాదములపై బడి, రెండు కుచముల నచట బెట్టి, తన మ్రొక్కులను చెల్లజేయుమని, బాబాయే తన సప్తశృంగి దేవత యగుటచే వాని నామోదించుమని వేడెను. "నీవు స్వయముగా బోయి సప్తశృంగి దేవతకు మ్రొక్కును చెల్లింపు"మని బాబా నిర్బంధించెను. బాబా ఊదీని ఆశీర్వాదమును పొంది, శ్యామా వణి పట్టణమునకు బయలుదేరెను. పూజారి యిల్లు వెదకుచు తుదకు కాకాజీ యిల్లు చేరెను. అప్పుడు కాకాజీ శిరిడీకి పోవలెనని గొప్ప కుతూహలముతో నుండెను. అట్టి సమయములో శ్యామా వారింటికి వెళ్ళెను. ఇది ఎంత యాశ్చర్యకరమైన కలయికయో చూడుడు!

"మీ రెవ్వరు? ఎచ్చటినుండి వచ్చినా"రని కాకాజీ యడిగెను. "మాది శిరిడీ, నేను సప్తశృంగికి మ్రొక్కు చెల్లించుట కిక్కడకు వచ్చినా"నని శ్యామా యనెను. శిరిడీనుంచి వచ్చెనని తెలియగానే శ్యామాను కాకాజీ కౌగలించుకొనెను, ప్రేమచే మైమరచెను. వారు సాయిలీలల గూర్చి ముచ్చటించుకొనిరి. శ్యామా మ్రొక్కులన్నియు చెల్లించిన పిమ్మట వారిద్దరు శిరిడీకి బయలు దేరిరి. శిరిడీ చేరగనే కాకాజీ మసీదుకు బోయి బాబాను జూచి, వారి పాదములపై బడెను. అతని కండ్లు కన్నీటితో నిండెను. అతని మనస్సు శాంతించెను. సప్తశృంగిదేవత స్వప్నములో తెలియపరచిన రీతిగా బాబాను చూడగనే అతని మనస్సులోని చంచలత్వ మంతయు పోయి ప్రశాంతి వహించెను. కాకాజీ తన మనస్సులో నిట్లనుకొనెను. "ఏమి ఈ యద్భుతశక్తి! బాబా యేమియు పలుకలేదు. ఉత్తరప్రత్యుత్తరములు కూడ జరుగలేదు. ఆశీర్వచనములనైన పలుకలేదు. కేవలము వారి దర్శనమే సంతోషమునకు కారణమయ్యెను. వారి దర్శన మాత్రముననే నామనశ్చాంచల్యము పోయినది. అంతరంగమున ఆనంద ముద్భవించినది. ఇదియే దర్శనభాగ్యము." అతడు తన దృష్టి సాయినాథుని పాదములపై నిగిడించెను. అతని నోట మాట రాకుండెను. బాబా లీలలు విని యతని సంతోషమున కంతులేకుండెను. బాబాను సర్వస్యశరణాగతి వేడెను. తన వేదనను బాధలను మరచెను. స్వచ్ఛమైన యానందమును పొందెను. అక్కడ 12 రోజులు సుఖముగా నుండి తుదకు బాబా వద్ద సెలవు తీసుకొని వారి ఊదీ ప్రసాదమును ఆశీర్వచనమును పొంది యిల్లు చేరెను.

**రహాతా కుశాల్‌చంద్**

తెల్లవారుఝామున వచ్చిన స్వప్నము నిజమగునని యందురు. ఇది సత్యమే కావచ్చు. కాని బాబా స్వప్నములకు కాలనియమము లేదు. ఒక ఉదాహరణము: ఒకనాడు సాయంకాలము బాబా కాకాసాహెబు దీక్షితును రహాతాకు పోయి, చాలా రోజులనుండి చూడకుండుటచే, కుశాల్‌చంద్‌ను తీసికొని రమ్మనెను. ఒక టాంగాను దీసికొని కాకా రహాతా వెళ్ళెను. కుశాల్‌చంద్‌ను కలిసికొని బాబా చెప్పిన వార్త నందజేసెను. దీనిని విని కుశాల్‌చంద్ యాశ్చర్యపడెను. మధ్యాహ్నభోజనానంతరము నిద్రపోవుచుండగా తనకు స్వప్నములో బాబా కనపడి వెంటనే శిరిడీకి రమ్మనినందున నతడు

శిరిడీకి పోవుటకు ఆతురతతో నున్నానని చెప్పెను. తన గుఱ్ఱము అచ్చట లేకుండుటచే, తన కుమారుని బాబాకు ఈ సంగతి దెలుపుటకై పంపెను. కుమారుడు ఊరు బయటకు పోవు సరికి దీక్షిత్ టాంగాను తీసికొని వచ్చెను. కుశాల్‌చందును దీసికొని రావలసినదని బాబా దీక్షితుకు చెప్పుటచే, నిద్దరు టాంగాలో కూర్చుండి శిరిడీకి చేరిరి. కుశాల్‌చంద్ బాబాను దర్శించెను. అందరు సంతసించిరి. బాబా ప్రదర్శించిన ఈ లీలను జూచి కుశాల్‌చంద్ మనస్సు కరగెను.

**పంజాబి రామలాల్ (బొంబాయి)**

ఒకనాడు బొంబాయిలో నుండు పంజాబి బ్రాహ్మణుడు రామలాల్ యనువాడు ఒక స్వప్నమును గాంచెను.ఆ స్వప్నములో బాబా కనపడి శిరిడీకి రమ్మనెను. బాబా వానికి మహంతువలె గనిపించెను కాని అతనికి వారెచట గలరో తెలియకుండెను. పోయి వారిని చూడవలెనని మనమున నిశ్చయించెను. కాని చిరునామా తెలియకుండుటచే చేయుట కేమియు తోచకుండెను. ఎవరినైన మనము పిలిచినచో వచ్చువారికొరకు కావలసిన వన్నియు మనము సమకూర్చెదము. ఈ విషయములో కూడ అట్లనే జరిగెను. అతడు ఆనాడు సాయంకాలము వీథిలో పోవుచుండగా ఒక దుకాణములో బాబా ఫోటోను జూచెను. స్వప్నములో జూచిన మహంతు ముఖలక్షణములీ పటములో నున్న వానితో సరిపోయెను. కనుగొనగా యీ పటము సాయిబాబాదని తెలిసెను. అతడు వెంటనే శిరిడీకి పోయి యచ్చటనే తన యంత్యకాలము వరకుండెను.

ఈ విధముగా బాబా తన భక్తులకు దర్శన మిచ్చుటకై శిరిడీకి తీసికొని వచ్చుచుండెను. వారి యిహపరముల కోరికలు నెరవేర్చుచుండెను.

శ్రీసాయినాథాయ నమః

**ముప్పదవ అధ్యాయము**

సంపూర్ణము

**నాల్గవరోజు పారాయణము సమాప్తము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదియొకటవ అధ్యాయము

**ఐదవ రోజు పారాయణము**

**సోమవారము**

*బాబా సముఖమున మరణించినవారు:*

1. సన్యాసి విజయానంద్ 2. బాలారామ్ మాన్‌కర్ 3. నూల్కర్ 4. మేఘశ్యాముడు 5. పులి.

**ఈ** అధ్యాయములో బాబా సన్నిధిలో కొంతమందితోపాటు ఒక పులికూడ మరణముపొందుటను గూర్చి హేమాడ్‌పంతు వర్ణించుచున్నాడు.

మరణకాలమున మనస్సునందున్న కోరికగాని యాలోచనగాని ఆవ్యక్తి భవిష్యత్తును నిశ్చయించును. భగవద్గీత 8వ అధ్యాయమున 5- 6 శ్లోకములలో శ్రీకృష్ణుడిట్లు చెప్పియున్నాడు. *"ఎవరయితే వారి యంత్యదశయందు నన్ను జ్ఞప్తియందుంచుకొందురో వారు నన్ను చేరెదరు. ఎవరయితే యేదో మరొక దానిని ధ్యానించెదరో, వారు దానినే పొందెదరు."* అంత్యకాలమందు మనము మంచి యాలోచనలే మనస్సునందుంచుకొనగలమను నిశ్చయము లేదు. అనేకమంది అనేక కారణముల వల్ల భయపడి యదరి పోయెదరు. కావున అంత్య సమయమందు మనస్సును నిలకడగా నేదో మంచి యాలోచనయందే నిలుప వలెనన్నచో నిత్యము దాని నభ్యసించు టవసరము. భగవంతుని ధ్యానము చేయుచు జ్ఞప్తియందుంచుకొని యెల్లప్పుడు భగవన్నామస్మరణ చేసినచో, మరణకాలమందు గాబరా పడకుండ ఉండగలమని

యోగీశ్వరులందరు మనకు బోధించుచుందురు. భక్తులు యోగులకు సర్వస్యశరణాగతి చేసెదరు. ఏలన సర్వజ్ఞులగు యోగులు దారి చూపి, యంత్యకాలమున సహాయము చేసెదరని వారి నమ్మకము. అటువంటివి కొన్ని యిచ్చట చెప్పెదము.

## 1. విజయానంద్

విజయానంద్ అను మద్రాసు దేశపు సన్యాసి మానససరోవరమునకు యాత్రార్థమై బయలుదేరెను. మార్గములో బాబా సంగతి విని శిరిడీలో ఆగెను. అక్కడ హరిద్వారమునుంచి వచ్చిన సన్యాసియగు సోమదేవస్వామిని కలిసికొనెను. మానససరోవరపు యాత్రగూర్చి వివరములను కనుగొనెను. మానససరోవరము గంగోత్రికి 500 మైళ్ళపైన గలదని, ప్రయాణములో కలుగు కష్టములన్నిటిని ఆ స్వామి వర్ణించెను. మంచు యెక్కువనియు భాష ప్రతి 50 క్రోసులకు మారుననియు భూటాన్ ప్రజల సంశయనైజమును, వారుయాత్రికులను పెట్టు కష్టములు మొదలగువానిని జెప్పెను. దీనిని విని సన్యాసి నిరాశచెంది యాత్రను మానుకొనెను. అతడు బాబా వద్దకేగి సాష్టాంగనమస్కారము చేయగా బాబా కోపగించి యిట్లనెను. "ఈ పనికిమాలిన సన్యాసిని తరిమి వేయుడు. వాని సాంగత్యము మన కుపయుక్తము గాదు." సన్యాసికి బాబా నైజము తెలియనందున అసంతృప్తి కలిగెను. కూర్చుండి జరుగుచున్న విషయములన్నింటిని గమనించుచుండెను. అది ఉదయమున జరుగు దర్బారు సమయము. మసీదు భక్తులచే క్రిక్కిరిసి యుండెను. వారు బాబాను అనేక విధముల పూజించుచుండిరి. కొందరు వారి పాదముల కభిషేకము చేయుచుండిరి. వారి బొటనవ్రేలునుండి తీర్థమును కొందరు త్రాగుచుండిరి. కొందరు దానిని కండ్ల కద్దుకొనుచుండిరి. కొందరు బాబా శరీరమున కత్తరు చందనములను పూయుచుండిరి. జాతిమత భేదములు లేక యందరును సేవ చేయుచుండిరి. బాబా తనను కోపించినప్పటికి ఆతనికి బాబాయందు ప్రేమ కలిగెను. కావున నాతనికి ఆ స్థలము విడిచి పెట్టుట కిష్టము లేకుండెను.

అతడు శిరిడీలో రెండు రోజులుండిన పిమ్మట తల్లికి జబ్బుగా నున్నదని మద్రాసునుండి ఉత్తరము వచ్చెను. విసుగుచెంది అతడు తన తల్లి వద్దకు పోగోరెను. కాని బాబా యాజ్ఞ లేనిదే శిరిడీ విడువ లేకుండెను. ఉత్తరము తీసికొని బాబా దర్శనమునకై వెళ్ళెను. ఇంటికి పోవుటకు బాబా యాజ్ఞ వేడెను. సర్వజ్ఞుడగు బాబా, ముందు జరుగుబోవునది గ్రహించి, "నీ తల్లిని అంత ప్రేమించువాడవయితే సన్యాసమెందుకు పుచ్చుకొంటివి? కాషాయవస్త్రములు ధరించువానికి దేనియందభిమానము చూపుట తగదు. నీ బసకు పోయి హాయిగ కూర్చుండుము. ఓపికతో కొద్ది రోజులు కూర్చుండుము. వాడాలో పెక్కు దొంగలున్నారు. తలుపు గడియవేసికొని జాగ్రత్తగా నుండుము. దొంగలంతయు దోచుకొని పోయెదరు. ధనము ఐశ్వర్యము మొదలగునవి నిత్యము కావు. శరీరము శిథిలమై తుదకు నశించును. దీనిని తెలిసికొని, నీ కర్తవ్యమును జేయుము. ఇహలోక పరలోక వస్తువులన్నిటియందు గల యభిమానమును విడిచి పెట్టుము. ఎవరయితే ఈ ప్రకారముగ జేసి హరియొక్క పాదములను శరణు వేడెదరో, వారు సకలకష్టములనుండి తప్పించుకొని మోక్షమును పొందెదరు. ఎవరయితే భక్తిప్రేమలతో భగవంతుని ధ్యానము చేసి మననము చేసెదరో వారికి దేవుడు పరుగెత్తిపోయి సహాయము చేయును. నీ పూర్వపుణ్య మెక్కువగుటచే నీ విక్కడకు రాగలిగితివి. నేను చెప్పిన దానిని జాగ్రత్తగ విని జీవిత పరమావధిని కాంచుము. కోరికలు లేనివాడవై రేపటినుండి భాగవతమును పారాయణ చేయుము. శ్రద్ధతో మూడు సప్తాహములను చేయుము. భగవంతుడు సంతుష్టిజెంది నీ విచారములను దొలగించును. నీ భ్రమలు నిష్క్రమించును. నీకు శాంతి కలుగును"అనిరి. అతని మరణము సమీపించినందున బాబా అతనికీ విరుగుడు నుపదేశించెను. బాబా కూడా తన దేహావసాన సమయాన మృత్యుదేవతకు ప్రీతి కలిగించే 'రామవిజయము' చదివించెను. ఆ మరుసటి యుదయము స్నానము మొదలగునవి యాచరించిన పిమ్మట విజయానందుడు భాగవతమును లెండీ తోటలో ఏకాంతమున చదువుటకు ప్రారంభించెను. రెండు పారాయణములు చేయగనే యలసిపోయెను. వాడాకు వచ్చి రెండు దినములుండెను. మూడవ రోజు ఫకీరు (బడే) బాబా తొడపై ప్రాణములు వదలెను. బాబా ఒకరోజంతయు శవము నటులే

యుంచుడనెను. పిమ్మట పోలీసువాండ్రు వచ్చి విచారణ జరిపి శవసంస్కారమున కాజ్ఞనిచ్చిరి. యథోచితముగా శరీరమును తగిన స్థలమునందు పూడ్చిరి. ఈ విధముగా బాబా ఆ సన్యాసి సద్గతికి సహాయపడెను.

**2. బాలారామ్ మాన్‌కర్**

బాలారామ్ మాన్‌కర్ అను గృహస్థుడొకడు బాబా భక్తుడుగా నుండెను. అతని భార్య చనిపోయెను. అతడు విరక్తిచెంది కొడుకునకు గృహభారమప్పగించి శిరిడీకి వచ్చి బాబాతో నుండెను. అతని భక్తికి బాబా మెచ్చుకొని, అతనికి సద్గతి కలుగ జేయవలెనని యీ దిగువరీతిగ జేసెను. బాబా అతనికి 12 రూపాయలిచ్చి సతారా జిల్లాలోని మచ్ఛింద్రగడ్‌లో నుండుమనెను. బాబాను విడిచిపెట్టి మచ్ఛింద్రగడ్‌లో నుండుట అతనికిష్టము లేకుండెను. కాని యిదే అతనికి మంచి మార్గమని బాబా యొప్పించెను. అచట రోజుకు మూడుసారులు ధ్యానము చేయుమనెను. బాబా మాటలందు నమ్మకముంచి మాన్‌కర్ మచ్ఛింద్రగడమునకు వచ్చెను. అక్కడి చక్కని దృశ్యమును, శుభ్రమైన నీటిని, ఆరోగ్యమైన గాలిని, చుట్టుప్రక్కల గల ప్రకృతి సౌందర్యమును జూచి సంతసించి, బాబా సెలవిచ్చిన ప్రకారము మిక్కిలి తీవ్రముగా ధ్యానము చేయమొదలిడెను. కొలది దినముల పిమ్మట యొక దృశ్యమును గనెను. సాధారణముగా భక్తులు సమాధిస్థితియందు దివ్యానుభవములను పొందెదరు. గాని మాన్‌కర్ విషయములో నట్లుగాక చైతన్యమునకు వచ్చిన పిమ్మట దివ్యదర్శనము లభించెను. అతనికి బాబా స్వయముగా గాన్పించెను. మాన్‌కర్ బాబాను జూచుటయేగాక తన నచట కేల పంపితివని యడిగెను. బాబా యిట్లు చెప్పెను. *"శిరిడీలో అనేకాలోచనలు నీ మనస్సున లేచెను. నీ చంచలమనస్సునకు నిలకడ కలుగజేయవలెనని యిచటకు బంపితిని. నీవు పంచేంద్రియములతో మూడున్నర మూరల మనిషిగా నన్ను భావించితివి. నేనెల్లప్పుడు శిరిడీలోనే యుండెద ననుకొంటివి. ఇప్పుడు నీ విచట చూచిన నా రూపము శిరిడీలో చూచిన నా రూపముతో సమానముగా నున్నదో లేదో నిర్ధారింపుము. ఇందుకే నిన్నిచటికి బంపితిని."* కొంతకాలము గడచిన పిమ్మట మాన్‌కర్ గఢమును విడచి బాంద్రాకు పయనమయ్యెను. పూనానుండి దాదరుకు రైలులో పోవలెననుకొనెను. టిక్కెట్టు కొరకు బుకింగ్

ఆఫీసుకు పోగా నది మిక్కిలి క్రిక్కిరిసి యుండెను. అతనికి టిక్కెటు దొరకకుండెను. లంగోటి కట్టుకొని కంబళి కప్పుకొన్న ఒక పల్లెటూరివాడు వచ్చి, "మీరెక్కడికి పోవుచున్నా"రని యడిగెను. దాదరుకని మాన్కర్ బదులు చెప్పెను. అతడిట్లనెను. "దయచేసి నా దాదరు టిక్కెట్టు తీసికొనుము, నాకవసరమైన పని యుండుటచే దాదరుకు వెళ్ళుట మానుకొంటిని." టిక్కెట్టు లభించినందున మాన్కర్ యెంతో సంతసించెను. జేబులోనుంచి పైకము తీయునంతలో నా జానపదు డంతర్ధానమయ్యెను. మాన్కర్ ఆ గుంపులో నతనికై వెదకెను. కాని లాభము లేకపోయెను. అతని కొరకు బండి కదలునంతవర కాగెను. కాని వాని జాడయే కానరాకుండెను. మాన్కర్‌కు కలిగిన వింత యనుభవములందు ఇది రెండవది. ఇంటికి పోయివచ్చి తిరిగి మాన్కర్ శిరిడీ చేరెను. అప్పటినుంచి శిరిడీలోనే బాబా పాదముల నాశ్రయించి యుండెను. వారి సలహాల ననుసరించి నడుచు కొనుచుండెను. తుదకు బాబా సముఖమున వారి యాశీర్వాదములతో ఈ ప్రపంచమును విడిచినందువలన అతడెంతో యదృష్టవంతుడని చెప్పవచ్చును.

**3. తాత్యాసాహెబు నూల్కర్**

తాత్యాసాహెబు నూల్కర్ గూర్చి హేమాడ్‌పంతు ఏమియు చెప్పియుండ లేదు. వారు శిరిడీలో కాలము చేసినారని మాత్రము చెప్పెను. సాయిలీలా పత్రిక నుండి యీ వృత్తాంతమును గ్రహించితిమి.

1909 సంవత్సరములో తాత్యాసాహెబు పండరీపురములో సబ్‌జడ్జిగా నుండెను. అప్పుడు నానాసాహెబు చాందోర్కరు అచట మామలతదారుగా నుండెను. ఇద్దరు చాలాసార్లు కలిసికొని మాట్లాడుచుండిరి. తాత్యాసాహెబుకు యోగులయందు నమ్మకము లేకుండెను. నానాసాహెబుకు వారియందు మిగుల ప్రేమ. అనేక పర్యాయములు నానాసాహెబు, నూల్కర్‌కు బాబా లీలలను చెప్పి శిరిడీకి పోయి వారి దర్శనము చేయుమని బలవంత పెట్టెను. తుదకు రెండు షరతులపై నూల్కర్ ఒప్పుకొనెను. అందులో ఒకటి బ్రాహ్మణవంటవాడు దొరకవలెను. రెండవది బహూకరించుటకు చక్కని నాగపూరు కమలాఫలములు దొరకవలెను. భగవత్కటాక్షముచే ఈ రెండును తటస్థించెను. ఒక బ్రాహ్మణుడు నానాసాహెబువద్దకు రాగా అతడు వానిని

తాత్యాసాహెబు నూల్కర్ వద్దకు వంపెను. ఎవరోగాని వంద కమలాఫలములను నూల్కర్‌కు పంపిరి. రెండు షరతులు నెరవేరుటచే తాత్యాసాహెబు శిరిడీకి తప్పక పోవలసి వచ్చెను. మొట్టమొదట బాబా అతనిపై కోపగించెను. క్రమముగా బాబా యవతారపురుషుడని తగిన నిదర్శనములు తాత్యాసాహెబు నూల్కర్‌కు లభించెను. కనుక నతడు బాబా యెడ మక్కువపడి తన యంత్యదశవరకు శిరిడీలోనే యుండెను. తన యంత్యదశలో మతగ్రంథముల పారాయణము వినెను. చివరి సమయములో బాబా పాదతీర్థము అతని కిచ్చిరి. అతని మరణవార్త విని బాబా యిట్లనెను. "అయ్యో! తాత్యా మనకంటె ముందే వెళ్ళిపోయెను. అతనికి పునర్జన్మము లేదు."

**4. మేఘశ్యాముడు**

28వ అధ్యాయములో మేఘుని కథ చెప్పితిమి. మేఘశ్యాముడు మరణించగా గ్రామవాసులందరు శవమువెంట వెళ్ళిరి. బాబా కూడ వెంబడించెను. బాబా అతని శవముపై పువ్వులు చల్లెను. దహనసంస్కారమైన పిమ్మట బాబా కంట నీళ్ళు కారెను. సాధారణమానవునివలె బాబా చింతావిచారమగ్నుడైనట్లు కనబడెను. శవమంతయు పూలతో కప్పి దగ్గరి బంధువువలె నేడ్చి బాబా మసీదుకు తిరిగి వచ్చెను.

యోగు లనేకులు భక్తులకు సద్గతి నిచ్చుట విందుము. కాని బాబా గొప్పదన మమోఘమైనది. క్రూరమైన పులికూడ వారివలన సద్గతినే పొందెను. ఆ కథయే ఇప్పుడు చెప్పుదును.

**5. పులి**

బాబా సమాధి చెందుటకు 7 రోజుల ముందొక విచిత్రమైన సంగతి శిరిడీలో జరిగెను. ఒక నాటుబండి వచ్చి మసీదు ముందర ఆగెను. ఆ బండిపై ఇనుపగొలుసులతో కట్టియుంచిన పులి యుండెను. దాని భయంకరమైన ముఖము వెనుకకు తిరిగి యుండెను. దానిని ముగ్గురు దర్వేషులు పెంచుచు ఊరూర త్రిప్పి డబ్బు సంపాదించుకొనుచుండిరి. అది వారి జీవనోపాధి. ఆ పులియేదో జబ్బుతో బాధపడుచుండెను. అన్ని విధముల ఔషధములను వాడిరి. కాని వారి ప్రయత్నములు నిష్ఫలమయ్యెను. బాబా కీర్తి విని వారు

దానిని శిరిడీకి తీసికొని వచ్చిరి. దానిని గొలుసులతో పట్టుకొని ద్వారమువద్ద నిలబెట్టి, దర్వేషులు బాబా వద్దకు బోయి దాని విషయ మంతయు బాబాకు చెప్పిరి. అది చూచుటకు భయంకరముగా నుండియు జబ్బుతో బాధపడుచుండెను. అందుచే అది మిగుల చికాకు పడుచుండెను. భయాశ్చర్యములతో ప్రజలందరు దానివైపు చూచుచుండిరి. బాబా దానిని తన వద్దకు దీసికొని రమ్మనెను. అప్పుడు దానిని బాబా ముందుకు తీసికొని వెళ్ళిరి. బాబా కాంతికి తట్టుకొనలేక యది తల వాల్చెను. బాబా దానివైపు చూడగా నది బాబా వైపు ప్రేమతో చూచెను. వెంటనే తన తోకను నేలపై మూడుసార్లు కొట్టి తెలివితప్పి క్రిందపడి చచ్చెను. అది చచ్చుట జూచి దర్వేషులు విరక్తి జెంది విచారములో మునిగిరి. కొంతసేపటికి వారికి తెలివి కలిగెను. ఆ జంతువు రోగముతో బాధపడుచు చచ్చుటకు సిద్ధముగా నుండుటచే నది బాబా సముఖమున వారి పాదములవద్ద ప్రాణములు గోల్పోవుట దాని పూర్వజన్మపుణ్యమే యని భావించిరి. అది వారికి బాకీపడి యుండెను. దాని బాకీ తీరిన వెంటనే యది విమోచనము పొంది బాబా పాదములచెంత ప్రాణములు విడిచినది. యోగుల పాదములకడ వినమ్రులై ప్రాణములు విడుచువారు రక్షింపబడుదురు. వారెంతో పుణ్యము చేయనిదే వారి కట్టి సద్గతి యెట్లు కలుగును?

శ్రీసాయినాథాయ నమః

**ముప్పదియొకటవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదిరెండవ అధ్యాయము

*గురుని, దైవమును వెదకుట; ఉపవాసము నామోదింపకుండుట*

**ఈ** యధ్యాయములో హేమాడ్‌పంతు రెండు విషయములను వర్ణించెను. *1. బాబా తన గురువును అడవిలో నెట్లు కలిసెను; వారి ద్వారా దైవమును ఎట్లు గనెను.* 2. గోఖలేగారి భార్య మూడురోజులు ఉపవసింప నిశ్చయించుకొనగా నామెచే బాబా యెట్లు ఉపవాసదీక్ష మాన్పించెను.

ప్రారంభమున హేమాడ్‌పంతు సంసారమును అశ్వత్థవృక్షముతో పోల్చుచు గీతలో చెప్పిన ప్రకారము దాని వ్రేళ్ళు పైన, కొమ్మలు క్రింద గలవనెను. దాని కొమ్మలు క్రింది వైపు మీది వైపు గూడ వ్యాపించి యున్నవి. అవి గుణములచే పోషింపబడుచున్నవి. దాని యంకురములు ఇంద్రియ విషయములు. దాని వ్రేళ్ళు కర్మను చేయించుచు మానవప్రపంచమువరకు వ్యాపించి యున్నవి. దాని స్వరూపము గాని, దాని యాధారముగాని, దాని యాద్యంతములు గాని ఈ లోకమున తెలియరావు. వైరాగ్యమను పదునైన కత్తితో ఈ బలమైన వ్రేళ్ళుగల అశ్వత్థవృక్షమును నరికి, ఏ యతీతమార్గము ననుసరించిన తిరిగి జన్మలేదో యట్టి దాని ననుసరించవలెను.

అట్టి దారియందు నడచుటకు, దారి చూపు మంచి గురువు సహాయము మిక్కిలి యవసరము. ఒకడెంత పండితుడైనప్పటికి వేదవేదాంగములను

బాగుగ చదివినప్పటికిని, తన గమ్యస్థానమునకు సురక్షితముగ పోలేడు. మార్గదర్శియే యుండి సహాయపడి సరియైన దారి చూపినచో, మార్గములో నున్న గోతులనుండి, అడవి మృగముల నుండి తప్పించుకొని సుగమముగా పయనించును.

ఈ విషయములో బాబా యనుభవము బాబాయే స్వయముగా చెప్పెను. ఇది మిక్కిలి చిత్రమైనది. దీని ప్రకారము జాగ్రత్తగా నడచుకొన్నచో నమ్మకము, భక్తి, మోక్షము ప్రాప్తించును.

**అన్వేషణము**

ఒకానొకప్పుడు మేము నలుగురము మతగ్రంథములు చదువుచు ఆ జ్ఞానముతో బ్రహ్మము నైజముగూర్చి తర్కించ మొదలిడితిమి. మాలో నొకడు ఆత్మను ఆత్మచే ఉద్ధరించవలెను గాని యితరులపై నాధారపడరాదు అనెను. అందుకు రెండవవాడు మనస్సును స్వాధీనమందుంచుకొన్నవాడే ధన్యుడనియు మనము ఆలోచనలనుండి భావములనుండి ముక్తులమైనచో మనకంటె వేరైనది ఈ ప్రపంచములో మరేదియు లేదని చెప్పెను. మూడవవాడు దృశ్యప్రపంచము సదాపరిణామశీలమైన దనియు, నిరాకారమే శాశ్వతమైనదనియు కావున సత్యాసత్య విచక్షణ మవసరమనియు చెప్పెను. నాలుగవవారు (అనగా బాబా) "*పుస్తక జ్ఞానమెందుకు పనికిరానిది. మనకు విధింపబడిన కర్మను మనము పూర్తి చేసి, తనువును, మనమును, పంచప్రాణములను గురువు పాదములపై బెట్టి శరణు వేడవలెను. గురువే దైవము; సర్వమున వ్యాపించినవాడు. ఇట్టి ప్రత్యయ మేర్పడుటకు, దృఢమైన యంతులేని నమ్మకమవసరము*" అనెను.

ఈ ప్రకారముగా తర్కించుచు, మేము నలుగురు పండితులము భగవంతుని వెదకుట కడవులలో తిరుగ నారంభించితిమి. తక్కిన ముగ్గురు వారి స్వతంత్రబుద్ధి నుపయోగించి వెదక నిశ్చయించిరి. దారిలో ఒక వర్తకుడు (బంజారా) మమ్ములను కలిసి "ఇప్పుడు చాల ఎండగా నున్నది. ఎంతదూరము పోవుచున్నారు. ఎక్కడికి పోవుచున్నా"రని యడిగెను. అడవులు వెదకుటకని మేము జవాబిచ్చితిమి. ఏమి వెదకుటకు పూనుకొంటిరని యతడు తిరిగి అడిగెను. ఏదో సందిగ్ధమైన యుక్తి జవాబిచ్చితిమి. ధ్యేయరహితముగా

మేము తిరుగుట చూచి యతడు కనికరించి యిట్లనెను. "అడవుల సంగతి పూర్తిగ తెలియకుండ మీ యిష్టము వచ్చినట్లు తిరుగరాదు. అడవులలో సంచరింపదలచినచో మీ వెంట నొక మార్గదర్శి యుండియే తీరవలెను. అనవసరముగా ఈ ఎండవేళప్పుడు ప్రయాస పడెద రెందుకు? మీ రహస్యాన్వేషణము నాకు జెప్పనక్కర లేదు. అయినను మీరు కూర్చుండి, భోజనము చేసి, నీళ్ళు త్రాగి కొంత విశ్రాంతి దీసికొని పిమ్మట పోవచ్చును. ఓపికతో నుండు" డనెను. అతడంత మృదువుగా మాట్లాడినను, వానిని నిరాకరించి నడువ సాగితిమి. మా కన్ని సంగతులు దెలియును కాన ఇతరుల సహాయ మక్కరలేదనుకొంటిమి.

అడవులు పెద్దవి, మార్గములు లేనివి. చెట్లు దగ్గరగాను, ఎత్తుగాను నుండుటచే సూర్యరశ్మి లోపల ప్రవేశింపకుండెను. కనుక దారి తప్పి యటునిటు చాల సేపు తిరిగితిమి. తుట్టతుద కెక్కడనుండి బయలుదేరితిమో యచ్చటికే యదృష్టవశాత్తు తిరిగి వచ్చితిమి. బంజారా తిరిగి కలిసికొని యిట్లనెను. "మీ తెలివితేటలపై నాధారపడి మీరు దారి తప్పితిరి. చిన్నదానికిగాని పెద్దదానికిగాని సరియైన మార్గము చూపుటకొక మార్గదర్శి యుండియే తీరవలెను. ఉత్తకడుపుతో నేయన్వేషణము జయప్రదము కాదు. భగవంతుడు సంకల్పించనిదే మనకు దారిలో నెవ్వరు కలియరు. పెట్టిన భోజనము వద్దనకుడు. వడ్డించిన విస్తరిని త్రోసివేయకుడు. భోజనపదార్థము లర్పించుట శుభసూచకము." ఇట్లనుచు తిరిగి మమ్ములను ప్రశాంతముగా భోజనము చేయుమని బతిమాలెను. నా మిత్రులు ముగ్గురు ఆ మాటలను లక్ష్యపెట్టక, భోజనము చేయకుండ ప్రయాణము సాగించిరి. వారి హఠ మావిధముగా నుండెను. నేనుమాత్ర మాకలితోను దాహముతోను నుంటిని. బంజారా చూపిన యసామాన్య ప్రేమకు లొంగి పోతిని. మేమెంతో తెలివైనవార మనుకొంటిమి కాని, దయా దాక్షిణ్యములకు దూరమయితిమి. బంజారా చదువుకొన్నవాడు కాడు; యోగ్యతలు లేనివాడు; తక్కువజాతివాడు. కాని వాని హృదయము ప్రేమమయము. భోజనము చేయుమని మమ్ముల వేడెను. ఈ విధముగా ఫలాపేక్ష లేకుండ ఎవరయితే యితరులను ప్రేమించెదరో వారు నిజముగా నాగరికులని యెంచి వాని యాతిథ్యము నామోదించుటయే

జ్ఞానమునకు ప్రథమసోపానమని యనుకొంటిని. మిక్కలి మర్యాదతో అతడు పెట్టిన భోజనము నేను తిని (అనగా బాబా) నీళ్ళు త్రాగితిని.

ఏమి యాశ్చర్యము! వెంటనే మాగురువుగారు వచ్చి మా యెదుట నిలచిరి. వారడుగుటచే జరిగిన వృత్తాంతమంతయు విశదపరచితిని. అప్పుడు వారు "నాతో వచ్చుట కిష్టపడెదరా? మీకు కావలసిన దేదో నేను జూపెదను. నాయందు విశ్వాసమున్న వారికే జయము కలుగును" అనిరి. తక్కినవారు వారి మాటలకు సమ్మతింపక యెక్కడికో పోయిరి. నేను మాత్రము వారికి గౌరవపూర్వకముగా నమస్కరించి వారి యాజ్ఞకు లోబడితిని. అంతట వారు నన్నొక బావి వద్దకు దీసికొని పోయిరి. నా కాళ్ళను తాడుతో కట్టి నన్ను తలక్రిందులుగా ఒక చెట్టుకు గట్టి బావిలో నీళ్ళకు మూడడుగుల మీదుగా నన్ను వ్రేలాడ దీసిరి. నా చేతులతో గాని నోటితోగాని నీళ్ళను అందుకొనలేకుంటిని. నన్ను ఈ విధముగా వ్రేలాడగట్టి వారు ఎచ్చటికో పోయిరి. 4, 5 గంటల తరువాత వారు మరల వచ్చి నన్ను బావిలోనుంచి బయటికి దీసి యెట్లుంటివని యడిగిరి. "*ఆనందములో మునిగియుంటిని, నేను పొందిన యానందమును నావంటి మూర్ఖుడెట్లు వర్ణించగలడు!*" అని జవాబిచ్చితిని. దీనిని విని గురువుగారు మిక్కిలి సంతుష్టి చెందిరి. నన్ను దగ్గరకు చేరదీసి నా వీపును తమ చేతులతో తట్టి నన్ను వారివద్ద నుంచుకొనిరి. తల్లిపక్షి పిల్లపక్షులను జాగ్రత్తగా జూచునట్లు నన్ను వారు కాపాడిరి. నన్ను తమ బడిలో చేర్చుకొనిరి. అది చాలా అందమైన బడి. అక్కడ నేను నా తల్లిదండ్రులను మరచితిని. నా యభిమాన మంతయు తొలగెను. నాకు సులభముగా విమోచనము కలిగెను. గురువుగారి మెడను కౌగిలించుకొని వారిని తదేక దృష్టితో నెల్లప్పుడు చూచుచుండవలె ననిపించినది. వారి ప్రతిబింబము నా కనుపాపలందు నిలువనప్పుడు నాకు కనులు లేకుండుటే మేలనిపించెడిది. అది యటువంటి బడి. అందులో ప్రవేశించినవా రెవరును రిక్తహస్తములతో బయటకు రారు. నా గురువే నాకు సమస్తముగ తోచుచుండెను. నా యిల్లు నా యాస్తి నా తల్లిదండ్రులు అంతయు వారే. నా యింద్రియము లన్నియు తమతమ స్థానములు విడచి, నా కండ్ల యందు కేంద్రీకృతమయ్యెను; నాదృష్టి గురువునందు కేంద్రీకృతమయ్యెను. నా ధ్యాన

మంతయు నాగురువుపైననే నిల్పితిని. నాకింకొక దాని యందు స్పృహ లేకుండెను. వారిని ధ్యానము చేయునప్పుడు నా మనసు నా బుద్ధి స్తబ్ధమగుచుండెను. నిశ్శబ్దముగా వారికి నమస్కరించుచుంటిని.

ఇతర పాఠశాలలలో పూర్తిగా మరొక విధమైన దృశ్యములు కానవచ్చును. భక్తులు జ్ఞానము సంపాదించుటకు పోయి ద్రవ్యమును, కాలమును, కష్టమును వ్యయము చేసెదరు. తుట్టతుదకు పశ్చాత్తాప పడెదరు. అక్కడున్న గురువు తనకు గల రహస్యశక్తిని గురించి తన ఋజువర్తనము గూర్చి పొగడుకొనుచు తన పావిత్ర్యమును ప్రదర్శించునే కాని, హృదయము మృదువుగా నుండదు. అత డనేకవిషయముల గూర్చి మాట్లాడును. తన మహిమను తానే పొగడుకొనును. కాని యతని మాటలు భక్తుల హృదయమందు నాటవు, వారిని ఒప్పింపజేయవు. ఆత్మసాక్షాత్కార మతనికి తెలియనే తెలియదు. అటువంటి బడులు శిష్యుల కేమి మేలు చేయును? వారి కేమి లాభము? కాని పైన పేర్కొన్న గురువు మరొక రకమువారు. వారి కటాక్షముచే ఎట్టి శ్రమ లేకయే యాత్మజ్ఞానము దానిమట్టు కది నాయందు ప్రకాశించెను; నేను కోరుట కేమియు లేకుండెను. సర్వము దాని మట్టు కదియే పగటి ప్రకాశమువలె బోధపడెను. తలక్రిందుగను కాళ్ళు మీదుగను నుంచుటవలన గలుగు ఆనందము గురువుకే తెలియును.

నలుగురిలో ఒకడు కర్మఠుడు (అనగా కర్మలందు నమ్మకము గలవాడు). అతనికి కొన్ని కర్మలు విధులు నిషేధములు మాత్రమే తెలియును. రెండవవాడు జ్ఞాని. అతడు తనకున్న జ్ఞానమునకు గర్వించువాడు. మూడవవాడు భక్తుడు, భగవంతునికి సర్వస్యశరణాగతి చేసినవాడు, భగవంతుడే సర్వమును చేయువాడని అతని నమ్మకము. వారిట్లు తర్కించుచు వివాదపడుచుండగా దేవుని సమస్య వచ్చెను. వారు తమకు దెలిసిన విద్యపై నాధారపడి దేవుని వెదకుటకు పోయిరి. వివేకమునకు వైరాగ్యమునకు అవతారమగు శ్రీసాయి ఆ నలుగురిలో నొకరు. పరబ్రహ్మస్వరూపులైకూడ వారెందుచేత నితరులతో కలిసి తెలివితక్కువగా ప్రవర్తించిరని యెవరైన నడుగవచ్చును. ప్రజాభిప్రాయమును, వారి మంచిని సంపాదించుటకును, వారికొక యుదాహరణము జూపుటకును, వారిట్లు చేసిరి. వారు

అవతారపురుషులైనప్పటికి ఒక సాధారణుడైన బంజారాను గౌరవించి వాని యాహారము నామోదించిరి. అన్నము పరబ్రహ్మస్వరూపమని వారి నమ్మకము. బంజారా యాహారమును నిరాకరించినవారు కష్టముల పాలయిరి. గురువు లేనిదే జ్ఞానము సంపాదించుటకు వీలుకాదని వారు బోధించిరి. తైత్తిరీయోపనిషత్తు తల్లిని తండ్రిని గురువును గౌరవించి పూజించి మతగ్రంథముల నభ్యసించవలెనని చెప్పుచున్నది. ఇవియే మన మనస్సును పావనము చేయుటకు మార్గములు. మనస్సును పావనము చేయనిదే ఆత్మసాక్షాత్కారము పొందలేము. ఇంద్రియములుగాని, మనస్సుగాని, బుద్ధిగాని ఆత్మను చేరలేవు. ప్రత్యక్షము, అనుమానము మొదలైన ప్రమాణములు మనకు ఈ విషయములో సహాయపడవు. గురువుగారి కటాక్షమే మనకు తోడ్పడును. ధర్మము, అర్థము, కామము మన కృషివల్ల లభించును. కాని నాలుగవదియగు మోక్షము గురువు సహాయము వలననే పొందనగును.

సాయి దర్బారులోనికి అనేకమంది వచ్చి, వారికి తెలియు విద్యలను ప్రదర్శించి పోయెడివారు. జ్యోతిష్కులు రాబోవు విషయములు చెప్పుచుండెడివారు. యువరాజులు, గౌరవనీయులు, సామాన్యులు, పేదవారు, సన్యాసులు, యోగులు, పాటకాండ్రు మొదలగువారు బాబా దర్శనమునకై వచ్చెడివారు. ఒక మహారు (మాలవాడు) వచ్చి జోహారు చేసి యీ సాయి 'మాబాప్' (తల్లియు తండ్రియు) అనియు, వారు మన చావుపుట్టుకలను తుడిచివేయుదు రనియు చెప్పెను. గారడివాండ్రు, గుడ్డి వాండ్రు, చొట్టవారు, నర్తకులు, నాథసంప్రదాయము వారు, పగటి వేషములవారు కూడ అచ్చట సమాదరింప బడుచుండిరి. తన వంతు రాగా ఆ బంజారా కూడ గాన్పించెను. తన పాత్రను ముగించెను. మన మిప్పుడింకొక కథను విందము.

**గోఖలేగారి భార్య - ఉపవాసము**

బాబా యెన్నడు ఉపవసించలేదు. ఇతరులను కూడ ఉపవాసము చేయనిచ్చువారు కారు. ఉపవాసము చేయువాని మనస్సు స్థిమితముగా నుండదు. అట్టివాడు పరమార్థ మెట్లు సాధించును? ఉత్తకడుపుతో దేవుని

చూడలేము. మొట్టమొదట ఆత్మను శాంతింప చేయవలెను. కడుపులో తడి కలుగజేయు ఆహారము గాని, పౌష్టికశక్తి గాని లేనప్పుడు భగవంతు నేకండ్లతో చూడగలము? ఏ నాలుకతో పొగడగలము. ఏచెవులతో వానిని వినగలము? వేయేల మన యవయవము లన్నియు వాని శక్తిని అవి సంపాదించుకొన్నప్పుడు, అవి మంచి స్థితిలో నున్నప్పుడే మనము భక్తి మొదలగు సాధనముల నాచరించి దేవుని చేరగలము. కాబట్టి ఉపవాసము గాని మితిమించిన భోజనముగాని మంచిది గాదు. ఆహారములో మితి శరీరమునకు మనస్సునకు కూడ మంచిది.

గోఖలే భార్య, కానిట్‌కర్ భార్య శ్రీమతి కాశీబాయి వద్ద నుండి దాదా కేల్కరుకు జాబు తీసికొని శిరిడీకి వచ్చెను. ఆమె బాబా పాదముల వద్ద మూడు రోజులుపవసించి కూర్చొను నిశ్చయముతో వచ్చెను. బాబా అంతకు ముందురోజు కేల్కరుతో తన భక్తులను హోళీపండుగనాడు ఉపవాసము చేయనీయనని చెప్పియుండెను. వారుపవసించినచో బాబా (తన) యొక్క ఉపయోగమేమనెను. ఆ మరుసటిదినము ఆమె దాదాకేల్కరుతో పోయి బాబా వద్ద కూర్చుండగా బాబా వెంటనే యామెతో, "*ఉపవాసము చేయవలసిన యవసరమేమి? దాదాభట్టు ఇంటికి పోయి బొబ్బట్లు చేసి అతనికి పిల్లలకు బెట్టి నీవు కూడ తినుము*" అనెను. హోళీ పండుగ వచ్చెను. దాదాకేల్కరు భార్య బయట చేరెను. కేల్కర్ ఇంట్లో వండుట కెవరు లేకుండిరి. కావున బాబా సలహా సమయోచితముగా నుండెను. గోఖలే గారి భార్య దాదాభట్టు ఇంటికి బోయి బొబ్బట్లు చేసెను. ఆ రోజు అక్కడనే యుండెను. ఇతరులకు బెట్టెను, తాను తినెను. ఎంత మంచి కథ! ఎంత చక్కని నీతి!

**బాబా సర్కారు**

బాబా తన బాల్యములో జరిగిన కథను ఈ విధముగ చెప్పెను. "నా చిన్నతనములో భుక్తి కొరకు వెదకుచు బీడ్‌గాం వెళ్ళితిని. అక్కడ నాకు బట్టలపై చేయు అల్లికపని దొరికెను. శ్రమ యనక కష్టపడి పని చేసితిని. యజమాని నాపనికి సంతుష్టి చెందెను. నా కంటె పూర్వము ముగ్గురు కుర్రవాళ్ళు పనిలో నుండిరి. మొదటివానికి 50 రూపాయలు, రెండవవానికి 100 రూపాయలు, మూడవవానికి 150 రూపాయలు, నాకీమూడు మొత్తములకు రెండింతలు

అనగా 600 రూపాయల జీత మిచ్చెను. నా తెలివితేటలు జూచి, యజమాని నన్ను ప్రేమించి మెచ్చుకొని, నిండు దుస్తులిచ్చి నన్ను గౌరవించెను. (తలపాగా, శెల్లా) వీనిని వాడకుండ జాగ్రత్తగా దాచుకొంటిని. మానవు డిచ్చినది త్వరలో సమసి పోవునుగాని, దైవమిచ్చునది శాశ్వతముగా నిలుచును. ఇంకెవ్వరిచ్చినది దీనితో సరిపోల్చలేము. నా ప్రభువు "తీసికో, తీసికో" అనును కాని, ప్రతివాడు నావద్దకు వచ్చి 'తే తే' యనుచున్నాడు. నేనేమి చెప్పుచున్నానో గ్రహించువా డొక్కడును లేడు. నాసర్కారు యొక్క ఖజానా (ఆధ్యాత్మిక ధనము) నిండుగా నున్నది. అది యంచువరకు నిండి పొంగిపోవుచున్నది. నేను "త్రవ్వి ఈ ధనమును బండ్లతో తీసుకపొండు. సుపుత్రుడైనవాడు ఈ ద్రవ్యము నంతయు దాచుకొనవలెను" అనుచున్నాను. *"నా ఫకీరు చతురత, నా భగవానుని లీలలు, నా సర్కారు అభిరుచి మిక్కిలి యమోఘమైనవి. నా సంగతి యేమి? శరీరము మట్టిలో కలియును. ఊపిరి గాలిలో కలియును. ఇట్టి యవకాశము తిరిగి రాదు. నే నెక్కడికో పోయెదను; ఎక్కడనో కూర్చుండెదను; మాయ నన్ను మిగుల బాధించుచున్నది. ఐనప్పటికి నావారికొరకు నేను ఆతురపడెదను. ఎవరయిన నేమైన సాధన చేసినచో తగిన ఫలితము పొందెదరు. ఎవరయితే నా పలుకులను జ్ఞప్తియందుంచుకొనెదరో, వారమూల్యమైన యానందమును పొందెదరు."*

శ్రీసాయినాథాయ నమః

**ముప్పదిరెండవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదిమూడవ అధ్యాయము

ఊదీ మహిమ:
1. తేలుకాటు, ప్లేగు జ్వరము నయమగుట;
2. జామ్నేర్ చమత్కారము; 3. నారాయణరావు జబ్బు;
4. బాలబువ సుతార్; 6. హరిభావు కర్ణిక్‌ల అనుభవములు.

గత అధ్యాయములో గురువు మహిమను వర్ణించితిమి. ఇందులో ఊదీ మహిమను వర్ణించెదము.

మనమిప్పుడు గొప్ప యోగీశ్వరులకు నమస్కరించెదము. వారి కరుణాకటాక్షములు కొండంత పాపములను గూడ నశింపజేయును. మనలోని దుర్గుణములను పోగొట్టును. వారి సామాన్యపు పలుకులే మనకు నీతులు బోధించును. అమృతానందమును ప్రసాదించును. ఇది నాది, అది నీది, యను భేదభావము వారి మనస్సులందు పుట్టదు. వారి ఋణమును ఈ జన్మయందుగాని వచ్చే పెక్కు జన్మలయందు గాని మనము తీర్చుకొనలేము.

### ఊదీ ప్రసాదము

బాబా యందరివద్దనుంచి దక్షిణ తీసికొనుచుండునని యందరికి తెలిసిన విషయమే. ఈ విధముగా వసూలు చేసిన మొత్తములో నెక్కువ భాగమ దానము చేసి మిగతదానితో వంటచెఱకును (కట్టెలను) కొనుచుండెను. ఈ కట్టెలను బాబా ధునిలో వేయుచుండెను. దానిని నిత్యము మంట

పెట్టుచుండెను. అది యిప్పటికి నటులే మండుచున్నది. అందులోని బూడిదనే ఊదీ యనుచున్నాము. బాబా దానిని భక్తులకు తమతమ యిండ్లకు తిరిగి పోవునప్పుడు పంచి పెట్టెడివారు.

ఊదీ వలన బాబా యేమి బోధించ నుద్దేశించెను? ప్రపంచములో కనిపించు వస్తువులన్నియు బూడిదవలె అశాశ్వతములు. పంచభూతములచే చేయబడిన మన శరీరములన్నియు సౌఖ్యముల ననుభవించిన పిమ్మట పతనమైపోయి బూడిద యగును. ఈసంగతి జ్ఞప్తికి దెచ్చుటకై బాబా భక్తులకు ఊదీ ప్రసాదమును పంచి పెట్టుచుండెను. ఈ ఊదీవలననే బ్రహ్మము నిత్యమనియు, ఈ జగత్తు అశాశ్వతమనియు, ప్రపంచములో గల బంధువులు, కొడుకుగాని, తండ్రిగాని, తల్లిగాని, మనవారు కారనియు బాబా బోధించెను. ఈ ప్రపంచములోనికి మనము ఒంటరిగా వచ్చితిమి, ఒంటరిగానే పోయెదము. ఊదీ యనేకవిధముల శారీరకమానసికరోగములను బాగు చేయుచుండెను. భక్తుల చెవులలో బాబా ఊదీ ద్వారా దక్షిణ ద్వారా నిత్యానిత్యములకు గల తారతమ్యము, అనిత్యమైన దానియందు అభిమానరాహిత్యము గంట మ్రోత వలె వినిపించుచుండెను. మొదటిది (ఊదీ) వివేకమును, రెండవది (దక్షిణ) వైరాగ్యమును బోధించుచుండెను. ఈ రెండును కలిగియున్నగాని సంసారమనే సాగరమును దాటలేము. అందుచే బాబా యడిగి దక్షిణ తీసికొనుచుండెను. శిరిడీనుంచి యింటికి పోవునప్పుడు భక్తులకు ఊదీయే ప్రసాదముగా నిచ్చి, కొంత నుదుటిపై వ్రాసి వరదహస్తమును వారి శిరస్సుపై నుంచుచుండెను. బాబా సంతోషముతో నున్నప్పుడు పాడుచుండెడివారు. పాటలలో ఊదీ గురించి యొకటి పాడుచుండిరి. దాని పల్లవి "కళ్యాణరామ రారమ్మా! గోనెలతో ఊదీని తేతెమ్మా!" బాబా దీనిని చక్కని రాగముతో మధురముగ పాడు చుండెడివారు.

ఇదంతయు ఊదీయొక్క ఆధ్యాత్మికప్రాముఖ్యము. దానికి భౌతిక ప్రాధాన్యము కూడ కలదు. అది ఆరోగ్యమును, ఐశ్వర్యమును, ఆతురతల నుండి విమోచనమును మొదలగునవి యొసగుచుండెను. ఇక ఊదీ గూర్చిన కథలను ప్రారంభించెదము.

**తేలుకాటు**

నాసిక్ నివాసియగు నారాయణ మోతీరాంజాని యనునతడు బాబా భక్తుడు. అతడు రామచంద్ర వామనమోడక్ యను బాబా భక్తునివద్ద ఉద్యోగము చేయుచుండెను. అతడు ఒకసారి తనతల్లితో శిరిడీకి పోయి బాబాను దర్శించెను. అప్పుడు స్వయముగా బాబా అతడు మోదక్ సేవను మాని, తాను సొంతముగా వ్యాపారము పెట్టుకొనవలెనని చెప్పెను. కొన్ని దినముల తరువాత బాబా మాట సత్యమయ్యెను. నారాయణ జాని ఉద్యోగము మాని స్వయముగా 'ఆనందాశ్రమము' అను హోటలు పెట్టెను. అది బాగా అభివృద్ధి చెందెను. ఒకసారి యీ నారాయణారావు స్నేహితునికి తేలు కుట్టెను. దాని బాధ భరింపరానంత యుండెను. అటువంటి విషయములలో ఊదీ బాగా పనిచేయును. నొప్పి యున్నచోట ఊదీని రాయవలెను. అందుచే నారాయణరావు ఊదీ కొరకు వెదకెను. కాని యది కనిపించలేదు. అతడు బాబా పటము ముందర నిలచి బాబా సహాయము కోరి, బాబా నామజపము చేసి, బాబా పటము ముందు రాలిపడిన అగరువత్తి బూడిద చిటికెడు తీసి దానినే ఊదీగా భావించి, నొప్పి యున్నచోట రాసెను. అతడు ఊదీ రాసిన చేయి తీసివేయగనే నొప్పి తగ్గిపోయెను. ఇద్దరు ఆశ్చర్యానందములలో మునిగిరి.

**ప్లేగు జబ్బు**

ఒకానొకప్పుడు బాంద్రాలో నుండు ఒక బాబా భక్తునికి, వేరొక గ్రామమున నున్న తన కుమార్తె ప్లేగు జ్వరముతో బాధపడుచుండెనని తెలిసెను. అతడు తన వద్ద ఊదీ లేదనియు, కనుక ఊదీ పంపుమని నానాసాహెబు చాందోర్కరుగారికి కబురు పంపెను. ఈ వార్త నానాసాహెబుకు ఠాణా రైల్వేస్టేషను వద్ద తెలిసెను. అప్పుడతడు భార్యతో కూడ కల్యాణ్ పోవుచుండెను. వారివద్ద అప్పుడు ఊదీ లేకుండెను. కావున నానాసాహెబు రోడ్డుపైని మట్టిని కొంచెము తీసి, సాయినామజపము చేసి, బాబా అనుగ్రహమును నభ్యర్థించి తన భార్య నుదుటిపై రాసెను. కబురు తెచ్చిన వ్యక్తి ఇదంతయు జూచెను. ఆభక్తు యింటికి పోవుసరికి మూడు రోజులనుండి బాధ పడుచున్న వాని కూతురు జబ్బు నానాసాహెబు తన భార్య నుదుటిపై మట్టిని పూసినప్పటినుండి తగ్గెనని విని మిక్కిలి సంతసించెను.

## జామ్నేర్ లీల

1904-1905వ సంవత్సరమున నానాసాహెబు చాందోర్కర్ జామ్నేర్‌లో మామలతదారుగా నుండెను. ఇది ఖాందేషు జిల్లాలో శిరిడీకి 100 మైళ్లదూరములో నున్నది. ఆయన కుమార్తె మైనతాయి గర్భిణి; ప్రసవించుటకు సిద్ధముగా నుండెను. ఆమె స్థితి బాగులేకుండెను. ఆమె రెండుమూడు దినములనుంచి ప్రసవవేదన పడుచుండెను. నానాసాహెబు ఔషధములన్నియు వాడెను కాని ప్రయోజనము లేకుండెను. అప్పుడు బాబాను జ్ఞప్తికి దెచ్చుకొని వారి సహాయము వేడెను. శిరిడీలో రామ్‌గీర్ బువాయను సన్యాసి యుండెను. బాబా అతనిని 'బాపూగీర్ బువా' యనువారు. అతని స్వగ్రామము ఖాందేషులో నుండెను. అతడచ్చటికి పోవుటకు నిశ్చయించుకొనెను. బాబా అతనిని బిలిచి మార్గమధ్యమున జామ్నేర్‌లో కొంత విశ్రాంతి తీసికొని నానాసాహెబుకు ఊదీని హారతి పాటను ఇమ్మనెను. తన వద్ద రెండే రూపాయలున్నవనియు అవి జలగామ్‌వరకు రైలు టిక్కెటుకు సరిపోవుననియు, కాబట్టి జలగామ్‌నుండి జామ్నేర్ పోవుటకు (సుమారు 30 మైళ్ళు) ధనము లేదని రామ్‌గీర్ బువా చెప్పెను. అన్నియు సరిగా అమరునుగాన, నతడు కలతజెంద నవసరము లేదని బాబా పలికెను. శ్యామాను బిలిచి మాధవ అడ్కర్ రచించిన హారతిని వ్రాయుమనెను. హారతి పాటను ఊదీని రామ్‌గీర్ బువాకిచ్చి నానాసాహెబుకు అందజేయుమనెను. బాబా మాటలపయి ఆధారపడి రామగీర్ బువా శిరిడీ విడచి, రాత్రి రెండున్నర గంటలకు జలగామ్ చేరెను. అచటికి చేరునప్పటికి అతని చెంత 2 అణాలు మాత్రమే యుండెను. కాబట్టి కష్టదశలో నుండెను. అప్పుడే యెవరో "బాపూగీర్ బువా యెవరు?" అని కేక వైచుచుండిరి. బువా యచ్చటికి పోయి తనేయని చెప్పెను. నానాసాహెబు పంపించినారని చెప్పుచు, ఆ బంట్రోతు బువాను ఒక చక్కని టాంగావద్దకు తీసికొని పోయెను. దానికి రెండు మంచి గుఱ్ఱములు కట్టియుండెను. ఇద్దరు అందులో కూర్చుండి బండిని వదలిరి. టాంగా వేగముగా బోయెను. తెల్లవారుఝామున టాంగా యొక సెలయేరు వద్దకు చేరెను. బండి తోలువాడు గుఱ్ఱములను నీళ్ళు త్రాగించుటకు పోయెను. బంట్రోతు రామ్‌గీర్ బువాను ఫలహారము

చేయుమని, ఫలహారపు దినుసులను బెట్టెను. గడ్డము మీసములున్న ఆ బంట్రోతు బట్టలు చూచి రామ్‌గీర్ బువా యతడు మహ్మదీయుడని సంశయించి ఫలహారము తినకుండెను. కాని యా బంట్రోతు తాను హిందువుడననియు, గర్‌వాల్ దేశపు క్షత్రియుడననియు, నానాసాహెబు ఆ ఫలహారము బంపెను గాన, తినుట కెట్టి సంశయము వలదనెను. అప్పుడిద్దరు కలిసి ఫలహారము చేసి బయలుదేరిరి. ఉషః కాలము జామ్‌నేర్ చేరిరి. ఒంటికి పోసుకొనుటకై రామ్‌గీర్ బువా టాంగా దిగి రెండు మూడు నిమిషములలో వచ్చెను. తిరిగి వచ్చుసరికి టాంగా గాని, టాంగా తోలువాడు గాని, బంట్రోతుగాని లేకుండిరి. బాపుగీర్ బువా నోటివెంట మాటరాకుండెను. దగ్గరున్న కచేరికి బోయి యడుగగా నానాసాహెబు ఇంటి వద్దనే యున్నట్లు దెలిసెను. అతడు నానాసాహెబుగారింటికి వెళ్ళి తాను శిరిడీ సాయిబాబా వద్దనుంచి వచ్చినట్లు చెప్పెను. బాబా ఇచ్చిన ఊదీ, హారతి పాట నానాసాహెబు కందజేసెను. మైనతాయి చాలా దుస్థితిలో నుండెను. అందరు ఆమె గూర్చి మిగుల ఆందోళన పడుచుండిరి. నానాసాహెబు తన భార్యను బిలచి ఊదీని నీళ్ళలో కలిపి కుమార్తెకిచ్చి హారతిని పాడుమనిరి. బాబా మంచి సమయములో సహాయము బంపెననుకొనిరి. కొద్ది నిముషములలో ప్రసవము సుఖముగా జరిగెనని వార్త వచ్చెను. గండము గడచినదని చెప్పిరి. నానాసాహెబు గారు టాంగాను, నౌకరును, ఫలహారములను పంపినందుకు బాపుగీర్ బువా ఆయనకు కృతజ్ఞత తెలుపగా నాతడు మిక్కిలి యాశ్చర్యపడెను. శిరిడీ నుంచి యెవ్వరు వచ్చుచున్నది అతనికి తెలియదు, కనుక నతడేమియు పంపి యుండలేదని చెప్పెను.

బి.వి. దేవ్‌గా రీవిషయమై నానాసాహెబ్ చాందోర్కరు కొడుకు బాపూరావు చాందోర్కరును, రామ్‌గీర్ బువాను కలిసికొని విచారించి సాయిలీలా మాగజైన్ లో (xiii - 11, 12, 13) గొప్ప వ్యాసమును ప్రకటించినారు. బి.వి. నరసింహస్వామిగారు మైనతాయి, బాపూరావు చాందోర్కరు, రామ్‌గీర్ బువాల వాజ్మూలమును సేకరించి "భక్తుల అనుభవములు" అను గ్రంథమున (3వ భాగము) ప్రకటించినారు.

భక్త నారాయణరావుకు బాబాను రెండుసారులు దర్శనముచేయు భాగ్యము కలిగెను. బాబా సమాధి చెందిన మూడేండ్లకు. శిరిడీకి పోవలెననుకొనెను. కాని పోలేకపోయెను. బాబా సమాధి చెందిన యొక సంవత్సరములో నతడు జబ్బు పడి మిగుల బాధపడుచుండెను. సాధారణ చికిత్సలవలన ప్రయోజనము కలుగలేదు. కావున రాత్రింబవళ్ళు బాబాను ధ్యానించెను. ఒకనాడు స్వప్నములో నొక దృశ్యమును జూచెను. అందు బాబా అతనిని ఓదార్చి యిట్లనెను. "ఆందోళన పడవద్దు. రేపటినుంచి బాగగును. వారము రోజులలో నడువ గలవు." స్వప్నములో చెప్పిన రీతిగా రోగము వారములో కుదిరెను. ఇచ్చట మన మాలోచించవలసిన విషయమిది. "*శరీర మున్నన్నాళ్ళు బాబా బ్రతికి యుండిరా? శరీరము పోయినదిగాన చనిపోయినారా?*" లేదు. ఎల్లప్పుడు జీవించియే యున్నారు. వారు జననమరణముల కతీతులు. ఎవరయితే బాబా నొకసారి హృదయ పూర్వకముగా ప్రేమించెదరో వారెక్కడున్నప్పటికి ఎట్టి సమయమందుగాని బాబానుంచి తగిన జవాబు పొందెదరు. వారెల్లప్పుడు మన ప్రక్కనే యుందురు. ఏ రూపములోనో భక్తునకు దర్శనమిచ్చి వాని కోరికను నెరవేర్చెదరు.

**బాలబువ సుతార్**

బొంబాయిలో నుండు ప్రముఖ సంకీర్తనాకారుడు బాలబువ సుతార్ ఒకసారి శిరిడీకి వచ్చెను. అతడు గొప్ప భక్తుడు. ఎల్లప్పుడు అతడు భగవధ్యానము-భజన యందే తత్పరుడైయుండెడివాడు. అందుచే జనులు వారిని 'నవయుగ తుకారామ్' అని పిలుచేవారు. వారు బాబాకు నమస్కరించగా బాబా "నేనీతనిని నాలుగు సంవత్సరముల నుండి యెరుగుదును," అనిరి. తాను మొదటి సారిగా ఇప్పుడే శిరిడీకి వచ్చినవాడగుటచే బాలబువా ఇదెట్లు సంభవమనుకొనెను. కాని తీవ్రముగా నాలోచించగా బొంబాయిలో 4 సంవత్సరముల క్రిందట బాబా ఫోటోకు నమస్కరించినట్లు జ్ఞప్తికి వచ్చెను. అతడు బాబా మాటల ప్రాముఖ్యమును గ్రహించెను. తనలో తానిట్లనుకొనెను. "యోగు లెంతటి సర్వజ్ఞులు, సర్వాంత ర్యాములు? తమ భక్తులందు వారికెంత ప్రేమ? నేను వారి ఫోటోను చూచుట వారిని స్వయముగా చూచిన దానితో సమానమని నాకు బోధించిరి."

**అప్పా సాహెబు కులకర్ణి**

1917వ సంవత్సరమున అప్పాసాహెబు కులకర్ణి వంతు వచ్చెను. అతడు ఠాణాకు బదిలీ యయ్యెను. బాలాసాహెబు భాటే అతనికి బాబాఫోటో నిచ్చియుండెను. అతడు దానిని జాగ్రత్తగా పూజించుచుండెను. పువ్వులు, చందనము నైవేద్యము బాబాకు నిత్యమర్పించుచు బాబాను చూడవలెనని మిగుల కాంక్షించుచుండెను. ఈ సందర్భమున బాబా పటమును మనఃపూర్వకముగ చూచినచో బాబాను ప్రత్యక్షముగా చూచినదానితో సమానమే యని చెప్పవచ్చును. (దీనికి నిదర్శనము పైన జెప్పబడిన కథ)

కులకర్ణి ఠాణాలో నుండగా భివండి పర్యటనకు బోవలసివచ్చెను. ఒక వారమురోజుల లోపల తిరిగి వచ్చుట కవకాశము లేకుండెను. అతడు లేనప్పుడు మూడవరోజున ఈ దిగువ యాశ్చర్యకరమయిన సంగతి జరిగెను. మధ్యాహ్నము 12 గంటలకు ఒక ఫకీరు అప్పాకులకర్ణి యింటికి వచ్చెను. వారి ముఖలక్షణములు సాయిబాబా ముఖలక్షణములతో సరిపోయెను. కులకర్ణిగారి భార్యాబిడ్డలు వారు శిరిడీ సాయిబాబాగారా యని యడిగిరి. వారిట్లు నుడివిరి. *"లేదు. నేను భగవంతుని సేవకుడను. వారి యాజ్ఞానుసారము మీ యోగక్షేమములను కనుగొనుటకు వచ్చితిని."* అట్లనుచు దక్షిణనడిగెను. ఆమె ఒక రూపాయి ఇచ్చెను. వారొక చిన్న పొట్లముతో ఊదీ నిచ్చి, దానిని పూజలో ఫోటోతో కూడ నుంచుకొని పూజించుమనిరి. పిమ్మట యిల్లు విడిచి వెళ్ళిపోయిరి. ఇక చిత్రమైన సాయిలీలను వినుడు.

భివండిలో తన గుఱ్ఱము జబ్బు పడగా అప్పాసాహెబు తన పర్యటన మానుకొనవలసి వచ్చెను. ఆనాటి సాయంకాలమే అతడు తిరిగి ఇల్లు చేరెను. ఫకీరుగారి రాక భార్యవల్ల వినెను. ఫకీరుగారి దర్శనము దొరకనందులకు మిగుల మనోవేదన పొందెను. ఫకీరుకు ఒక్క రూపాయి మాత్రమే దక్షిణగా నిచ్చుట కిష్టపడకుండెను. తానే యింటివద్ద నున్నచో 10 రూపాయలకు తక్కువ గాకుండ దక్షిణ యిచ్చి యుండుననెను. వెంటనే ఫకీరును వెదకుటకై బయలుదేరెను. మసీదులలోను, తక్కిన చోట్లను భోజనము చేయకయే వారి కొరకు వెదకెను. అతని యన్వేషణ నిష్ఫలమయ్యెను. ఇంటికి వచ్చి భోజనము చేసెను. 32వ అధ్యాయములో ఉత్తకడుపుతో భగవంతుని వెదకరాదని బాబా

చెప్పినది చదువరి గమనించవలెను. అప్పాసాహెబిచ్చట ఒక నీతిని నేర్చుకొనెను. భోజనమయిన తరువాత చిత్రేయను స్నేహితునితో వ్యాహ్యాళికి బయలుదేరెను. కొంత దూరము పోగా నెవరో వారి వైపు త్వరగా వచ్చుచున్నట్లు గాన్పించెను. వారి ముఖలక్షణములను బట్టి వారు తన యింటికి 12 గంటలకు వచ్చినవారే యని యనుకొనెను. వెంటనే ఫకీరు చేయి చాచి దక్షిణ నడిగెను. అప్పాసాహెబు ఒక రూపాయి నిచ్చెను. వారు తిరిగి యడుగగా ఇంకను రెండు రూపాయలిచ్చెను. అప్పటికి అతడు సంతుష్టి చెందలేదు. అప్పాసాహెబు చిత్రేవద్దనుంచి మూడు రూపాయలు తీసికొని ఫకీరుకు ఇచ్చెను. వారింకను దక్షిణ కావలెననిరి. అప్పాసాహెబు వారినింటికి రావలసినదిగా వేడుకొనెను. అందరు ఇల్లు చేరిరి. అప్పాసాహెబు వారికి 3 రూపాయలిచ్చెను. మొత్తము తొమ్మిది రూపాయలు ముట్టెను. అప్పటికి సంతుష్టి చెందక ఫకీరు ఇంకను దక్షిణ యిమ్మనెను. అప్పాసాహెబు తన వద్ద పదిరూపాయల నోటు గలదనెను. ఫకీరు దానిని పుచ్చుకొని తొమ్మిది రూపాయలు తిరిగి యిచ్చివేసి యక్కడనుండి వెడలెను. అప్పాసాహెబు పదిరూపాయ లిచ్చెదననెను గనుక ఆ మొత్తమును దీసికొని పవిత్రపరచిన పిమ్మట తొమ్మిది రూపాయల నిచ్చి వేసెను. 9 సంఖ్య చాల ముఖ్యమైనది. అది నవవిధ భక్తులను తెలియజేయును. (బాబా లక్ష్మీబాయి శిందేకు 9 రూపాయలు సమాధి సమయమందిచ్చిరి.) అప్పాసాహెబు ఊదీ పొట్లము విప్పి చూచెను. అందులో పువ్వురెక్కలు అక్షతలుండెను. కొంతకాలము పిమ్మట బాబాను శిరిడీలో దర్శించినప్పుడు వారి వెంట్రుక యొకటి చిక్కెను. అతడు ఊదీ పొట్లమును, వెంట్రుకను, ఒక తాయెత్తులో పెట్టి తన దండపై కట్టుకొనెను. అప్పాసాహెబు ఊదీ ప్రభావమును గ్రహించెను. అతడు మిక్కిలి తెలివైనవాడయినప్పటికి నెలకు 40 రూపాయలు మాత్రమే జీతము దొరుకుచుండెను. బాబా ఫోటోను ఊదీని పొందిన తరువాత 40 రూపాయల కెన్నో రెట్లు ఆదాయము వచ్చెను. మంచి పలుకుబడియు అధికారము లభించెను. ఈ లౌకికమైన కానుకలేగాక దైవభక్తి కూడ వృద్ధియగుచుండెను. కావున బాబా ఊదీని పొందు భాగ్యము కలవారు స్నానము చేసిన పిమ్మట ఊదీని నుదుట రాసికొని, కొంచెము నీటిలో కలిపి బాబా పవిత్రమైన తీర్థముగా భావించి పుచ్చుకొనవలెను.

## హరిభావ్ కర్ణిక్

ఠాణా జిల్లా దహను గ్రామమునుండి హరిభావ్ కర్ణిక్ అనునతడు 1917వ సంవత్సరమున గురుపౌర్ణమినాడు శిరిడీకి వచ్చి బాబాను తగిన లాంఛనములతో పూజించెను; వస్త్రములు దక్షిణ సమర్పించెను. శ్యామా ద్వారా బాబా సెలవు పొంది మసీదు మెట్లు దిగెను. అప్పుడే యింకొక రూపాయి బాబాకు దక్షిణ నివ్వవలెనని తోచి మసీదు మరల ఎక్కుచుండగా, బాబా సెలవు పొందిన పిమ్మట తిరిగి వెనుకకు రారాదని విని యింటికి బయలుదేరెను. మార్గమధ్యమున నాసిక్‌లో కాలారాముని మందిరము ప్రవేశించి, దర్శనము చేసికొని వెలుపలికి వచ్చుచుండగా నరసింగ మహరాజ్ అను యోగి తన శిష్యులను విడిచి లోపల నుండి బయటకు వచ్చి, హరిభావ్ ముంజేతిని బట్టుకొని, "నా రూపాయి నాకిమ్ము" అనెను. కర్ణిక్ మిగుల ఆశ్చర్యపడెను. రూపాయిని సంతోషముగా నిచ్చి, సాయిబాబా యివ్విధముగా తానివ్వ నిశ్చయించుకొనిన రూపాయిని నరసింగ మహరాజ్ ద్వారా గ్రహించెననుకొనెను.

యోగీశ్వరులంద రొకటే యనియు ఏకాత్మతాభావముతో కార్యము లొనర్తురనియు నీకథ తెలుపుచున్నది.

శ్రీసాయినాథాయ నమః

ముప్పదిమూడవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదినాలుగవ అధ్యాయము

ఊదీ మహిమ: 1. డాక్టరు మేనల్లుడు; 2. డాక్టరు పిళ్ళే; 3. శ్యామా మరదలు; 4. ఇరానీ బాలిక; 5. హార్దా పెద్దమనిషి; 6. బొంబాయి మహిళ.

ఈ అధ్యాయములో కూడ ఊదీ మహిమ వర్ణితము. ఊదీ ధరించినంత మాత్రమున నెట్టి ఫలములు కలిగెనో చూతము.

### డాక్టరుగారి మేనల్లుడు

నాసిక్ జిల్లాలోని మాలెగాంలో ఒక డాక్టరుండెను. ఆయన వైద్యములో పట్టభద్రులు. వారి మేనల్లుడు నయముకానట్టి రాచకురుపుతో బాధపడుచుండెను. డాక్టరుగారితో పాటు ఇతర డాక్టర్లుకూడ నయము చేయ ప్రయత్నించిరి. ఆపరేషను చేసిరి. కాని ఏమాత్రము మేలు జరుగలేదు. కుఱ్ఱవాడు మిగుల బాధపడుచుండెను. బంధువులు స్నేహితులు తల్లిదండ్రులను దైవసహాయము కోరుమనిరి. శిరిడీ సాయిబాబాను చూడుమనిరి. వారి దృష్టిచే అనేక కఠిన రోగములు నయమయ్యెనని బోధించిరి. తల్లిదండ్రులు శిరిడీకి వచ్చిరి. బాబా పాదములకు సాష్టాంగనమస్కారము చేసిరి. కుఱ్ఱవానిని బాబా ముందుంచిరి. తమ బిడ్డను కాపాడుమని అధికవినయ గౌరవములతో వేడుకొనిరి. దయార్ద్ర హృదయుడగు బాబా వారిని ఓదార్చి యిట్లనెను. "ఎవరయితే ఈ మసీదుకు వచ్చెదరో

వారెన్నడు ఈ జన్మలో ఏ వ్యాధిచేతను బాధపడరు. కనుక హాయిగా నుండుడు. కురుపుపై ఊదీని పూయుడు. ఒక వారము రోజులలో నయమగును. దేవునియందు నమ్మకముంచుడు. ఇది మసీదుకాదు ఇది ద్వారవతి. ఎవరయితే యిందు కాలు మోపెదరో వారు ఆరోగ్యమును ఆనందమును పొందెదరు. వారి కష్టములు గట్టెక్కును." వారు కుఱ్ఱవానిని బాబా ముందు కూర్చుండబెట్టిరి. బాబా యా కురుపుమీద తమ చేతిని త్రిప్పెను, ప్రేమాస్పదమైన చూపులను ప్రసరింపజేసెను. రోగి సంతుష్టి చెందెను. ఊదీ రాయగా కురుపు నెమ్మదించెను. కొద్ది రోజుల పిమ్మట పూర్తిగా మానిపోయెను. తల్లిదండ్రులు కుఱ్ఱవానితో గూడ బాబాకు కృతజ్ఞతలు తెలిపి శిరిడీ విడచిరి. బాబా ఊదీప్రసాదమువల్లను వారి దయాదృష్టివల్లను రాచకురుపు మానిపోయినందులకు వారు మిగుల సంతసించిరి.

ఈ సంగతి విని కుఱ్ఱవాని మామయగు డాక్టరు ఆశ్చర్యపడి బొంబాయి పోవుచు మార్గమున బాబాను చూడగోరెను. కాని మాలేగాంలోను మన్‌మాడ్‌లోను ఎవరో బాబాకు వ్యతిరేకముగ చెప్పి అతని మనస్సును విరిచిరి. కావున నతడు శిరిడీకి పోవుట మానుకొని తిన్నగా బొంబాయి చేరెను. తనకు మిగిలియున్న సెలవులు అలిబాగులో గడుపవలెననుకొనెను. బొంబాయిలో మూడురాత్రులు వరుసగా నొక కంఠధ్వని "ఇంకను నన్ను నమ్మవా!" యని వినిపించెను. వెంటనే డాక్టరు తమ మనస్సును మార్చుకొని శిరిడీకి పోవ నిశ్చయించుకొనెను. అతడు బొంబాయిలో నొక రోగికి అంటుజ్వరమునకు చికిత్స చేయుచుండెను. రోగికి నయము కాకుండెను. కనుక శిరిడీ ప్రయాణము వాయిదా పడుననుకొనెను. కాని, తన మనస్సులో బాబాను పరీక్షించదలచి, "రోగి యొక్క వ్యాధి యీనాడు కుదిరినచో, రేపే శిరిడీకి పోయెదను" అని యనుకొనెను. జరిగిన చిత్రమేమన సరిగా మనోనిశ్చయము చేసినప్పటినుంచి, జ్వరము తగ్గుటకు ప్రారంభించి త్వరలో సామాన్య ఉష్ణతకు దిగెను. డాక్టరు తన మనోనిశ్చయము ప్రకారము శిరిడీకి వెళ్ళెను. బాబా దర్శనము చేసి వారి పాదములకు సాష్టాంగనమస్కార మొనర్చెను. బాబా అతనికి గొప్ప యనుభవము కలుగజేయుటచే అతడు బాబాభక్తుడయ్యెను. అక్కడ 4 రోజులుండి, బాబా ఊదీతోను,

ఆశీర్వచనములతోను ఇంటికి వచ్చెను. ఒక పక్షము రోజులలో అతనిని బిజాపూరుకు హెచ్చు జీతముపై బదిలీ చేసిరి. అతని మేనల్లుని రోగము ఆ డాక్టరుకు బాబా దర్శనమునకు తోడ్పడెను. అప్పటినుంచి అతనికి బాబాయందు భక్తి కుదిరెను.

**డాక్టరు పిళ్ళే**

డాక్టరు పిళ్ళే యనునాతడు బాబాకు ప్రియభక్తుడు. అతని యందు బాబాకు మిగుల ప్రేమ. బాబా అతనిని 'భావూ' (అన్నా) అని పిలుచువారు. బాబా యతనితో ప్రతివిషయము సంప్రదించువారు. అతని నెల్లప్పుడు చెంత నుంచుకొనువారు. ఒకప్పుడు ఈ డాక్టరు గినియా పురుగులచే (నారిపుండు) బాధపడెను. అతడు కాకాసాహెబు దీక్షిత్‌తో, "*బాధ చాలా హెచ్చుగా నున్నది. నేను భరించలేకున్నాను. దీనికంటె చావు మేలని తోచుచున్నది. గత జన్మములో చేసిన పాపమును పోగొట్టుకొనుటకై నేనీబాధ ననుభవించుచున్నాను. కాన బాబా వద్దకు బోయి యీ బాధ నాపుచేసి, దీనిని రాబోయే 10 జన్మలకు పంచిపెట్టవలసినదని వేడు*" మనెను. దీక్షితు బాబావద్దకు వెళ్ళి యాసంగతి చెప్పెను. బాబా మనస్సు కరగెను. బాబా దీక్షితు కిట్లనెను. "*నిర్భయుడుగా నుండు మనుము. అతడేల పది జన్మలవరకు బాధ పడవలెను? పది రోజులలో గతజన్మపాపమును హరింపజేయగలను. నేనిక్కడుండి యిహపరసౌఖ్యము లిచ్చుటకు సిద్ధముగా నుండ అతడేల చావును కోరవలెను? అతని నెవరి వీపు పయి నయిన తీసికొనిరండు. అతని బాధను శాశ్వతముగా నిర్మూలించెదను.*"

ఆ స్థితిలో డాక్టరును దెచ్చి బాబా కుడివైపున, ఫకీరు బాబా యెప్పుడు కూర్చుండుచోట, కూర్చుండబెట్టిరి. బాబా అతనికి బాలీసునిచ్చి యిట్లనెను. "*ఇచ్చట నెమ్మదిగా పరుండి విశ్రాంతి తీసికొమ్ము. అసలయిన విరుగుడేమనగా గతజన్మపాపము లనుభవించి, విమోచనము పొందవలెను. మన కష్టసుఖములకు మన కర్మయే కారణము. వచ్చినదాని నోర్చుకొనుము. అల్లాయే ఆర్చి తీర్చువాడు. వాని నెల్లప్పుడు ధ్యానించుము. అతడే నీ క్షేమమును చూచును. వారి పాదములకు శరీరము, మనస్సు, ధనము, వాక్కు,*

సమస్తము అర్పింపుము. అనగా సర్వస్యశరణాగతి వేడుము. అటుపై వారేమి చేసెదరో చూడుము.'' నానాసాహెబు కట్టుకట్టెననియు కాని, గుణమివ్వలేదనియు డాక్టరు పిళ్ళే చెప్పెను. బాబా యిట్లనెను. "నానా తెలివి తక్కువవాడు; కట్టు విప్పుము లేనిచో చచ్చెదవు. ఇప్పుడే ఒక కాకి వచ్చి పొడుచును. అప్పుడు నీ కురుపు నయమగును."

ఈ సంభాషణ జరుగుచుండగా అబ్దుల్ వచ్చి మసీదు శుభ్రము చేసి దీపములు బాగుచేయుచుండగా, అతని కాలు సరిగా పిళ్ళే కురుపు మీద హఠాత్తుగా పడెను. కాలు వాచి యుండెను. దానిపయి అబ్దుల్ కాలు పడగనే యందులోనుంచి ఏడు పురుగులు నొక్కబడి బయటపడెను. బాధ భరింపరానిదిగా నుండెను. డాక్టరు పిళ్ళే బిగ్గరగా నేడ్వసాగెను. కొంతసేపటికి నెమ్మదించెను. అతనికి ఏడ్పు, నవ్వు ఒకటి తరువాత నింకొకటి వచ్చుచుండెను. బాబా యిట్లనెను. "చూడుడు! మన అన్న జబ్బు కుదిరి నవ్వుచున్నాడు." పిళ్ళే "కాకి ఎప్పుడు వచ్చు"ననెను. బాబా యిట్లు జవాబు నిచ్చెను "నీవు కాకిని చూడ లేదా? అది తిరిగి రాదు. అబ్దులే యా కాకి. ఇప్పుడు నీవు పోయి వాడాలో విశ్రాంతి గొనుము. నీవు త్వరలో బాగయ్యెదవు." ఊదీ పూయుటవలన, దానిని తినుట వలనను, ఏ చికిత్స పొందకయే, ఔషధమును పుచ్చుకొనకయే వ్యాధి పూర్తిగా 10 రోజులలో బాబా చెప్పిన ప్రకారము మానిపోయెను.

### శ్యామా మరదలు

శ్యామా తమ్ముడు బాపాజీ సావూల్ విహిర్ దగ్గర నుండువాడు. ఒకనాడతని భార్యకు ప్లేగు తగిలెను. ఆమెకు తీవ్రమైన జ్వరము వచ్చెను. చంకలో రెండు బొబ్బలు లేచెను. బాపాజీ శ్యామావద్దకు పరుగెత్తి వచ్చి సహాయపడుమనెను. శ్యామా భయపడెను. కాని యథాప్రకారము బాబావద్దకు వెళ్ళెను. సాష్టాంగ నమస్కారము చేసి వారి సహాయము కోరెను. వ్యాధిని బాగుచేయుమని ప్రార్థించెను. తన తమ్ముని ఇంటికి బోవుటకు అనుజ్ఞ నిమ్మనెను. బాబా యిట్లనెను. "ఈ రాత్రి సమయమందు వెళ్ళవద్దు. ఊదీ పంపుము. జ్వరమును గాని, బొబ్బలను గాని లక్ష్యపెట్ట నవసరము

లేదు. మన తండ్రియును, యజమానియు ఆ దైవమే. ఆమె వ్యాధి సులభముగా నయమగును. ఇప్పుడు వెళ్ళవద్దు. రేపటి ఉదయము వెళ్ళుము. వెంటనే తిరిగి రమ్ము."

శ్యామాకు బాబా ఊదీయందు సంపూర్ణ విశ్వాసముండెను. బాపాజీ ద్వారా దానిని బంపెను. బొబ్బలపై దానిని పూసి కొంత నీళ్ళలో కలిపి త్రాగించిరి. దానిని తీసికొనిన వెంటనే, బాగా చెమట పట్టెను; జ్వరము తగ్గెను. రోగికి మంచి నిద్ర పట్టెను. మరుసటి యుదయము తన భార్యకు నయమగుట జూచి బాపాజీ యాశ్చర్యపడెను. జ్వరము పోయెను. బొబ్బలు మానెను. మరుసటి ఉదయము శ్యామా బాబా యాజ్ఞ ప్రకారము వెళ్ళగా, నామె పొయ్యి దగ్గర తేనీరు తయారు చేయుచుండుట చూచి యాశ్చర్యపడెను. తమ్ముని అడుగగా బాబా ఊదీ ఒక్క రాత్రిలోనె యా బొబ్బలను బాగు చేసెననెను. అప్పుడు "ఉదయము వెళ్ళు, త్వరగా రమ్ము" అను బాబా మాటల భావము శ్యామా తెలిసికొనగలిగెను.

టీ తీసికొని శ్యామా తిరిగి వచ్చెను. బాబాకు నమస్కరించి యిట్లనెను. "దేవా! ఏమి నీ యాట! మొట్టమొదట తుఫాను లేపి మాకు అశాంతి కలుగ చేసెదవు. తిరిగి దానిని శాంతింపజేసి మాకు నెమ్మది ప్రసాదింతువు." బాబా యిట్లు జవాబిచ్చెను. "కర్మ యొక్క మార్గము చిత్రమైనది. నేనేమి చేయకున్నను, నన్నే సర్వమునకు కారణభూతునిగా నెంచెదరు. అది యదృష్టమును బట్టి వచ్చును. నేను సాక్షీభూతుడను మాత్రమే. చేయువాడు ప్రేరేపించువాడు దేవుడే. వారు మిక్కిలి దయార్ద్రహృదయులు. నేను భగవంతుడను కాను. ప్రభువును కాను. నేను వారి నమ్మకమైన బంటును. వారి నెల్లప్పుడు జ్ఞాపకము చేయుచుందును. ఎవరైతే తమ యహంకారమును ప్రక్కకు దోసి భగవంతునికి నమస్కరించెదరో, ఎవరు వారిని పూర్తిగా నమ్మెదరో, వారి బంధము లూడి మోక్షమును పొందెదరు."

**ఇరానీ బాలిక**

ఇక ఇరానీవాని యనుభవమును చదువుడు. అతని కొమార్తెకు ప్రతి గంటకు మూర్ఛ వచ్చుచుండెను. మూర్ఛ రాగానే యామె మాటలాడ లేకుండెను. కాళ్ళు చేతులు ముడుచుకొని స్పృహ తప్పి పడిపోవుచుండెను.

ఏ మందులు ఆమెకు నయము చేయలేదు. ఒక స్నేహితుడు బాబా ఊదీ నుపయోగించు మనెను. విలేపార్లేలోనున్న కాకాసాహెబు దీక్షిత్‌వద్ద ఊదీ తీసికొని రమ్మనెను. ఇరానీవాడు ఊదీని తెచ్చి ప్రతి రోజు నీటిలో కలిపి త్రాగించుచుండెను. మొదట ప్రతిగంటకు వచ్చు మూర్ఛ 7 గంటల కొకసారి రాసాగెను. కొద్దిరోజుల పిమ్మట పూర్తిగా నిమ్మళించెను.

**హార్దా పెద్దమనిషి**

హార్దాపుర (మధ్యపరగణాలు) నివాసియగు వృద్ధుడొకరు మూత్రకోశములో రాయితో బాధపడుచుండెను. అట్టి రాళ్ళు ఆపరేషను చేసి తీసెదరు. కనుక ఆపరేషను చేయించుకొమ్మని సలహా యిచ్చిరి. అతడు ముసలివాడు, మనో బలము లేనివాడు. ఆపరేషను కొప్పుకొనకుండెను. అతని బాధ యింకొక రీతిగా బాగు కావలసియుండెను. ఆ గ్రామపు ఇనాముదారు అచటకు వచ్చుట తటస్థించెను. అతడు బాబా భక్తుడు. అతని వద్ద బాబా ఊదీ యుండెను. స్నేహితులు కొందరు చెప్పగా, వృద్ధుని కుమారుడు ఊదీ తీసికొని దానిని నీళ్ళలో కలిపి తండ్రి కిచ్చెను. 5 నిమిషములలో ఊదీ గుణమిచ్చెను. రాయి కరిగి మూత్రము వెంబడి బయటపడెను. వృద్ధుడు శీఘ్రముగ బాగయ్యెను.

**బొంబాయి మహిళ**

కాయస్థప్రభుకులమునకు చెందిన బొంబాయి స్త్రీ యొకతె ప్రసవించు సమయమున మిగుల బాధపడుచుండెను. ఆమె గర్భవతియైన ప్రతిసారి మిగుల భయపడుచుండెను. ఆమె కేమియు తోచకుండెను. బాబా భక్తుడు కల్యాణ్‌వాసుడగు శ్రీరామమారుతి ఆమెను ప్రసవించునాటికి శిరిడీకి తీసికొని పొమ్మని సలహా యిచ్చెను. ఆమె గర్భవతి కాగా భార్యాభర్తలు శిరిడీకి వచ్చిరి. కొన్ని మాసములక్కడ నుండిరి. బాబాను పూజించిరి. వారి సాంగత్యము వలన సంపూర్ణఫలము పొందిరి. కొన్నాళ్ళకు ప్రసవవేళ వచ్చెను. మామూలుగానే యోనిలో అడ్డు గనిపించెను. ఆమె మిగుల బాధపడెను. ఏమి చేయుటకు తోచకుండెను. బాబాను ధ్యానించెను. ఇరుగుపొరుగువారు వచ్చి బాబా ఊదీని నీళ్ళలో కలిపి యిచ్చిరి. 5 నిమిషములలో నా స్త్రీ సురక్షితముగా, ఎట్టి కష్టము

లేక ప్రసవించెను. దురదృష్టము కొలది చనిపోయిన బిడ్డ పుట్టి యుండెను. కాని తల్లి ఆందోళనము, బాధ తప్పెను. బాబాకు నమస్కరించి వారిని ఎల్ల కాలము జ్ఞప్తియందుంచుకొనిరి.

శ్రీసాయినాథాయ నమః

**ముప్పదినాలుగవ అధ్యాయము**

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదియైదవ అధ్యాయము

*ఊదీ మహిమ: 1. కాకామహాజని స్నేహితుడు, యజమాని.*
*2. బాంద్రా అనిద్ర రోగి. 3. బాలాజీ పాటీలు నేవాస్కర్.*

**ఈ** అధ్యాయములో కూడ ఊదీమహిమ వర్ణితము. ఇందులో బాబా రెండు విషయములలో పరీక్షింపబడి లోపము లేదని కనుగొనబడుట గూడ చెప్పబడినది. బాబాను పరీక్షించు కథలు మొట్టమొదట చెప్పబడును.

ఆధ్యాత్మిక విషయములో లేదా సాధనలందు, శాఖలు మన యభివృద్ధికి అడ్డుపడును. భగవంతుడు నిరాకారుడని నమ్మువారు భగవంతుడాకారము గలవాడని నమ్మువారిని ఖండించి యది వట్టి భ్రమ యనెదరు. యోగీశ్వరులు మామూలు మానవులు మాత్రమే. కనుక వారికి నమస్కరింపనేల? యందురు. ఇతర శాఖలవారు కూడ ఆక్షేపణ చేయుచు వారి సద్గురువు వారికి ఉండగా ఇతరయోగులకు నమస్కరించి వారికి సేవ చేయనేల? యందురు. సాయిబాబా గూర్చి కూడ నట్టి యాక్షేపణ చేసిరి. శిరిడీకి వెళ్ళిన కొందరిని బాబా దక్షిణ యడిగెను. యోగులు ఈ ప్రకారముగా ధనము ప్రోగుచేయుట శ్రేయస్కరమా? వారిట్లు ధనము జాగ్రత్త చేసినచో వారి యోగి గుణము లెక్కడ? అని విమర్శించిరి. అనేకమంది బాబాను వెక్కిరించుటకు శిరిడీకి వెళ్ళి తుదకు వారిని ప్రార్థించుట కచటనే నిలచిపోయిరి. అటువంటి రెండు ఉదాహరణలీ దిగువ నిచ్చుచున్నాము.

**కాకామహాజని స్నేహితుడు**

కాకామహాజని స్నేహితుడు నిరాకారుడగు భగవంతు నారాధించువాడు. విగ్రహారాధనమున కాతడు విముఖుడు. అతడు ఊరకనే వింతలేమైన తెలిసికొనుటకు శిరిడీకి పోవనంగీకరించెను. కాని, బాబాకు నమస్కరించననియు, వారికి దక్షిణ యివ్వననియు చెప్పెను. కాకా యీ షరతులకు ఒప్పుకొనెను. ఇద్దరును శనివారమునాడు రాత్రి బొంబాయి విడిచి యా మరుసటి దినము శిరిడీకి చేరిరి. వారు మసీదు మెట్లను ఎక్కగనే కొంచెము దూరమున నున్న బాబా, మహాజని స్నేహితుని మంచి మాటలతో నాహ్వానించెను. ఆకంఠధ్వని మిక్కిలి చిత్రముగా నుండెను. ఆ కంఠము అతని తండ్రి కంఠమువలె నుండెను. ఆ కంఠము గతించిన తన తండ్రిని జ్ఞప్తికి దెచ్చెను. శరీరము సంతోషముతో నుప్పొంగెను. కంఠపు ఆకర్షణశక్తి యేమని చెప్పుదును? మిగుల నాశ్చర్యపడి యా స్నేహితుడు *"ఇది తప్పనిసరిగ మా తండ్రి కంఠమే"* యనెను. వెంటనే మసీదు లోపలికి వెళ్ళి, తన మనోనిశ్చయమును మరచినవాడై, బాబా పాదములకు నమస్కరించెను.

ఉదయ మొకసారి మధ్యాహ్న మొకసారి బాబా దక్షిణ యడుగగా కాకా మహాజని యిచ్చెను. బాబా కాకానే దక్షిణ అడుగుచుండెను, కాని యతని స్నేహితుని అడుగలేదు. అతని స్నేహితుడు కాకా చెవిలో *"బాబా నిన్నే రెండుసారులు దక్షిణ యడిగెను. నేను నీతో నున్నాను. నన్నెందుకు విడిచి పెట్టుచున్నారు?"* అనెను. *"నీవే బాబాను అడుగుము"* అని యతడు జవాబిచ్చెను. తన స్నేహితుడేమని చెవిలో నూదుచున్నాడని బాబా కాకామహాజని నడుగగా, తన స్నేహితుడు తాను కూడ దక్షిణ యివ్వవచ్చునా యని అడుగుచున్నాడనెను. బాబా "నీ కిచ్చుటకు మనమున నిష్టము లేకుండెను. కాన నిన్నడుగ లేదు. కాని, యిప్పుడు నీ కిష్టమున్న యెడల ఇవ్వవచ్చు" ననెను. కాకా యిచ్చినంత అనగా 17 రూపాయలు దక్షిణను అతని స్నేహితుడు కూడ ఇచ్చెను. బాబా యప్పుడు కొన్ని మాటలు సలహా రూపముగా నిట్లు చెప్పెను. *"నీవు దానిని తీసివేయుము; మనకు మధ్య నున్న యడ్డును తీసివేయుము. అప్పుడు మన మొకరినొకరు ముఖాముఖి చూచుకొనగలము, కలిసికొనగలము!"* పోవుటకు బాబా వారికి సెలవునిచ్చెను.

ఆకాశము మేఘములతో కమ్మియున్నప్పటికి వర్షము వచ్చునేమో యను భయము కలుగుచున్నప్పటికి ప్రయాస లేకుండ ప్రయాణము సాగునని బాబా యాశీర్వదించెను. ఇద్దరు సురక్షితముగా బొంబాయి చేరిరి. అతడు ఇంటికి పోయి తలుపు తీయుసరికి రెండు పిచ్చుకలు చచ్చి పడియుండెను. ఇంకొకటి కిటికీ ద్వారా యెగిరిపోయెను. తానే కిటికీలు తెరచియుంచినచో పిచ్చుకలు రక్షింపబడియుండును. వాని యదృష్టానుసారముగ నవి చచ్చెను. మూడవదానిని రక్షించుటకై బాబా త్వరగా తనను బంపె ననుకొనెను.

**కాకామహాజని - యజమాని**

ఠక్కర్ ధరమ్సె జెఠాభాయి, హైకోర్టు ప్లీడరు కొక కంపెని గలదు. దానిలో కాకా మేనేజరుగా పనిచేయుచుండెను. యజమానియు మేనేజరును అన్యోన్యముగా నుండెడివారు. కాకా శిరిడీకి అనేక సారులు పోవుట, కొన్ని దినము లచటనుండి, తిరిగి బాబా యనుమతి పొంది వచ్చుట, మొదలగునవి ఠక్కరుకు తెలియును. కుతూహలము కోసము బాబాను పరీక్షించు ఆసక్తితో, ఠక్కర్ కాకాతో హోళీ సెలవులలో శిరిడీకి పోవ నిశ్చయించుకొనెను. కాకా యెప్పుడు తిరిగి వచ్చునో యనునది నిశ్చయముగా తెలియదు కనుక ఠక్కరింకొకరిని వెంట తీసుకొని వెళ్ళెను. ముగ్గురు కలసి బయలుదేరిరి. బాబా కిచ్చుటకై కాకా రెండు సేర్ల యెండు ద్రాక్ష పండ్లు (గింజలతో నున్నవి) దారిలో కొనెను. వారు శిరిడీకి సరియైన వేళకు చేరి, బాబా దర్శనమునకయి మసీదుకు బోయిరి. అప్పుడక్కడ బాబాసాహెబు తర్ఖడుండెను. ఠక్కర్ మీరెందుకు వచ్చితిరని తర్ఖడు నడిగెను. దర్శనము కొరకని తర్ఖడు జవాబిచ్చెను. మహిమలేమైన జరిగినవాయని ఠక్కర్ ప్రశ్నించెను. బాబా వద్ద ఏమైన అద్భుతములు చూచుట తన నైజము కాదనియు, భక్తులు ప్రేమతో కాంక్షించునది తప్పక జరుగుననియు తర్ఖడ్ చెప్పెను.

కాకా బాబా పాదములకు నమస్కరించి యెండు ద్రాక్షపండ్లను అర్పించెను. బాబా వానిని పంచి పెట్టుమని యాజ్ఞాపించెను. ఠక్కరుకు కొన్ని ద్రాక్షలు దొరికెను. అతనికి అవి తినుట కిష్టము లేదు. ఎందుచేత ననగా తన వైద్యుడు కడిగి శుభ్రపరచనిదే ద్రాక్షలు తినకూడదని సలహా యిచ్చియుండెను.

ఇప్పుడాతనికి అది సమస్యగా తోచెను. తనకు వానిని తినుటకిష్టము లేదు కాని బాబా తినుట కాజ్ఞాపించుటచే పారవేయలేకుండెను. పారవేసినట్లయితే బాగుండదని వానిని నోటిలో వేసికొనెను. గింజలనేమి చేయవలయునో తోచకుండెను. మసీదులో గింజలుమ్మివేయుటకు జంకుచుండెను. తన యిష్టమునకు వ్యతిరేకముగ తుదకు గింజలు తన జేబులోనే వేసికొనెను. బాబా యోగి యయినచో తనకు ద్రాక్షపండ్లు ఇష్టము లేదని తెలియదా? బాబా వాని నేల బలవంతముగా నిచ్చెను? ఈ యాలోచన అతని మనస్సున తట్టగానే బాబా యింకను మరికొన్ని ద్రాక్షపండ్లు ఇచ్చెను. అతడు వానిని తినలేదు. చేతిలో పట్టుకొనెను. బాబా వానిని తినుమనెను. వారి యాజ్ఞానుసారము తినగా, వానిలో గింజలు లేకుండెను. అందుకతడు మిగుల నాశ్చర్యపడెను. అద్భుతములు చూడలేదనుకొనెను. గాన నాతనిపై నీ యద్భుతము ప్రయోగింపబడెను. బాబా తన మనస్సును గనిపెట్టి గింజలు గల ద్రాక్షపండ్లను గింజలు లేనివానిగా మార్చివేసెను. ఏమి యాశ్చర్యకరమైన శక్తి! బాబాను పరీక్షించుటకు తర్ఖడు కెట్టి ద్రాక్షలు దొరికెనని యడిగెను. గింజలతోనున్నవి దొరికెనని తర్ఖడ్ చెప్పెను. ఠక్కరు ఆశ్చర్యపడెను. తనయందుద్భవించుచున్న నమ్మకము దృఢపరచుటకై బాబా యదార్థముగా యోగి యైనచో ద్రాక్షపండ్లు మొట్టమొదట కాకా కివ్వవలె ననుకొనెను. అతని మనస్సునందున్న యీ సంగతి కూడ గ్రహించి, బాబా కాకావద్ద నుంచి యెండు ద్రాక్షల పంపిణీ ప్రారంభింపవలయునని యాజ్ఞాపించెను. ఈ నిదర్శనముతో ఠక్కరు సంతుష్టి చెందెను.

శ్యామా ఠక్కరును కాకా యజమానిగా బాబాకు పరిచయము చేసెను. అందుకు బాబా యిట్లనెను. "*అతడెట్లు వానికి యజమాని కాగలడు? అతని యజమాని వేరొకరు గలరు.*" కాకా యీ జవాబుకు చాలా ప్రీతిచెందెను. తన మనోనిశ్చయము మరచి ఠక్కరు బాబాకు నమస్కరించి వాడాకు తిరిగిపోయెను. మధ్యాహ్నహారతియైన పిమ్మట, వారందరు బాబా సెలవు దీసికొనుటకు మసీదుకు బోయిరి. శ్యామా వారి పక్షమున మాట్లాడెను. బాబా యిట్లు చెప్పదొడంగెను.

"ఒక చంచలమనస్సుగల పెద్దమనుష్యుడుండెను. అతనికి ఆరోగ్యము

ఐశ్వర్యము కూడ నుండెను. ఎట్టి విచారములు లేకుండెను. అనవసరమైన యారాటము పైన వేసుకొని, యక్కడక్కడ తిరుగుచు మనఃశ్శాంతిని పోగొట్టు కొనుచుండెను. ఒక్కొక్కప్పుడు భారములన్నియు వదలివేయుచుండెను. మరొకప్పుడు వానిని మోయుచుండెను. అతని మనస్సునకు నిలకడ లేకుండెను. అతని స్థితి కనిపెట్టి కనికరించి నేను నీ కిష్టము వచ్చినచోట నీ నమ్మకము పాదుకొల్పుము. ఎందుకిట్లు భ్రమించెదవు? ఒకేచోటు నాశ్రయించుకొని నిలకడగా నుండు" మని చెప్పితిని.

వెంటనే ఠక్కర్ యిదియంతయు తన గూర్చియే యని గ్రహించెను. కాకా కూడ తన వెంట రావలె ననుకొనెను. కాని కాకాకు అంత త్వరగా శిరిడీ విడుచుట కాజ్ఞ దొరుకునని యెవ్వరనుకొనలేదు. బాబా దీనిని కూడ కనుగొని కాకాను అతని యజమానితో పోవుట కనుజ్ఞనిచ్చెను. ఈ విధముగా బాబా సర్వజ్ఞుడనుటకు ఠక్కరు కింకొక నిదర్శనము దొరికెను.

బాబా కాకాను 15 రూపాయలు దక్షిణ యడిగి పుచ్చుకొని అతనికిట్లని చెప్పెను. "నేను ఒక రూపాయి దక్షిణ యెవరివద్దనుంచిగాని తీసికొనినచో దానికి పదిరెట్లు ఇవ్వవలెను. నేనూరక యేమి తీసికొనను. యుక్తాయుక్తములు తెలియకుండ నేనెవరిని అడుగను. ఫకీరెవరిని చూపునో వారివద్దనే నేను తీసికొనెదను. ఎవరైన ఫకీరుకు గతజన్మనుంచి బాకీ యున్నచో, వాని వద్దనే ధనము పుచ్చుకొందును. దానము చేయువాడిచ్చునది ప్రస్తుతము విత్తనములు నాటుటవంటిది. అది మునుముందు గొప్ప పంట అనుభవించుట కొరకే. ధర్మము చేయుటకు ధనముపయోగించవలెను. దానిని సొంతమునకు వాడుకొనిన నది వ్యర్థమయి పోవును. గతజన్మలో నీవిచ్చియుంటేనే గాని, నీవిప్పుడు అనుభవించలేవు. కనుక ధనమును పొందవలెనని నచో, దానిని ప్రస్తుత మితరులకిచ్చుటే సరియైన మార్గము. దక్షిణ యిచ్చుచున్నచో వైరాగ్యము పెరుగును. దానివలన భక్తిజ్ఞానములు కలుగును. ఒక రూపాయి నిచ్చి 10 రూపాయలు పొందవచ్చును.

ఈ మాటలు విని, ఠక్కరు తన నిశ్చయమును మరచి 15 రూపాయలు బాబా చేతిలో పెట్టెను. శిరిడీకి వచ్చుట మేలయిన దనుకొనెను. ఏలన అతని సంశయము లన్నియు తొలగెను. అతడెంతయో నేర్చుకొనెను.

అటువంటివారి విషయములో బాబా ప్రయోగించు యుక్తి మిక్కిలి యమోఘమయినది. అన్ని బాబాయే చేయుచున్నను, దేనియందభిమాన ముంచలేదు. ఎవరయినను నమస్కరించినను నమస్కరించకపోయినను, దక్షిణ యిచ్చినను, ఈయకున్నను తన కందరు సమానమే. బాబా యెవరిని అవమానించలేదు. తనను పూజించినందుకు బాబా గర్వించెడివారు కాదు. తనను పూజించలేదని విచారించేవారు కాదు. వారు ద్వంద్వాతీతులు.

## నిద్రపట్టని రోగము

బాంద్రానివాసి, కాయస్థప్రభు కులమునకు చెందిన ఒకపెద్ద మనుష్యుడు చాల కాలము నిద్రపట్టక బాధపడుచుండెడివాడు. నిద్రించుటకై నడుము వాల్చగనే గతించిన తన తండ్రి స్వప్నములో గానిపించి తీవ్రముగా తిట్టుచుండెడివాడు. ఇది అతని నిద్రను భంగపరచి రాత్రియందస్థిరునిగా చేయుచుండెను. ప్రతిరోజిట్లు జరిగి యేమి చేయుటకు తోచకుండెను. ఒకనాడతడు బాబాభక్తునితో నీ విషయము మాట్లాడెను. బాబా ఊదియే దీనిని తప్పనిసరిగా బాగుచేయునని అతడు సలహా ఇచ్చెను. అతడు వానికి కొంత ఊదీ నిచ్చి ప్రతిరోజు నిద్రించుటకు ముందు కొంచెము నుదుటికి రాసుకొని మిగత పొట్లమును తలక్రింద దిండుకు దిగువ పెట్టుకొనుమనెను. ఇట్లు చేసిన పిమ్మట సంతోషము, ఆశ్చర్యము కలుగునట్లు అతనికి మంచినిద్ర పట్టెను. ఎట్టి చికాకు లేకుండెను. అతడు సాయిని నిత్యము స్మరించుచుండెను. సాయిబాబా పటమును దెచ్చి గోడపై వ్రేలాడదీసెను. దానిని ప్రతిరోజు పూజించుచుండెను. గురువారమునాడు పూలమాల వేయుచుండెను. నైవేద్యము సమర్పించుచుండెను. పిమ్మట నతని వ్యాధి పూర్తిగా తగ్గిపోయెను.

## బాలాజీ పాటీలు నేవాస్కరు

ఇతడు బాబాకు గొప్ప భక్తుడు. ఇతడు ఫలాపేక్షలేకుండ చాల మంచి సేవ చేసెను. ఇతడు శిరిడీలో బాబా యేయే మార్గముల ద్వారా పోవుచుండెనో వాని నన్నింటిని తుడిచి శుభ్రము చేయుచుండెను. అతని యనంతరము ఈపని రాధాక్రిష్ణమాయి యతిశుభ్రముగా నెరవేర్చుచుండెను. ఆమె తరువాత అబ్దుల్లా చేయుచుండెను. బాలాజీ ప్రతి సంవత్సరము పంట కోయగనే దాని

నంతయు దెచ్చి బాబా కర్పితము చేయుచుండెను. అతడు బాబా యిచ్చినదానితో తన కుటుంబమును పోషించుకొనువాడు. ఈప్రకారముగా నతడు చాల సంవత్సరములు చేసెను. అతని తరువాత అతని కుమారుడు దాని నవలంభించెను.

**ఊదీ ప్రభావము**

ఒకనాడు బాలాజీ సాంవత్సరికమునాడు నేవాస్కరు కుటుంబమువారు కొంతమంది బంధువులను భోజనమునకు బిలచిరి. భోజనసమయానికి పిలచినవారికంటె మూడురెట్లు బంధువులు వచ్చిరి. నేవాస్కరు భార్యకు సంశయము కలిగెను. వండిన పదార్థములు వచ్చినవారికి చాలవనియు, కుటుంబగౌరవమునకు భంగము కలుగుననియు ఆమె భయపడెను. ఆమె యత్తగారు ఓదార్చుచు, "భయపడకుము. ఇది మనది కాదు. ఇది సాయి యాహారమే. అన్ని పాత్రలు గుడ్డలతో పూర్తిగా కప్పి వేయుము. వానిలో కొంచెము ఊదీ వేయుము. గుడ్డ పూర్తిగా తీయకుండ వడ్డన చేయుము. సాయి మనలను కాపాడును." అనెను. ఆమె యా సలహా ప్రకారమే చేసెను. వచ్చిన వారికి భోజనపదార్థములు సరిపోవుటయేగాక ఇంకను చాల మిగిలెను. తీవ్రముగా ప్రార్థించినచో యథాప్రకారము ఫలితమును బొందవచ్చునని యీ సంఘటనము తెలుపుచున్నది.

**సాయి పాములవలె గాన్పించుట**

ఒకనాడు శిరిడీ నివాసి రఘుపాటీలు నేవాసెలో నున్న బాలాజీ పాటీలింటికి వెళ్ళెను. ఆనాడు సాయంకాల మొకపాము ఆవులకొట్టము లోనికి బుసకొట్టుచు దూరెను. అందులోని పశువులన్ని భయపడి కదలజొచ్చెను. ఇంటిలోని వారందరు భయపడిరి. కాని బాలాజీ శ్రీ సాయియే ఆ రూపమున వచ్చెనని భావించెను. ఏమియు భయపడక గిన్నెతో పాలు దెచ్చి సర్పము ముందు బెట్టి యిట్లనెను. "బాబా ఎందుకు బుసకొట్టుచున్నావు? ఎందులకీ యలజడి? మమ్ము భయపెట్ట దలచితివా? ఈ గిన్నెడు పాలను దీసికొని నెమ్మదిగా త్రాగుము." ఇట్లనుచు అతడు దాని దగ్గర నిర్భయముగా గూర్చుండెను. ఇంటిలోని తక్కినవారు భయపడిరి. వారికి ఏమి చేయుటకు

తోచకుండెను. కొద్దిసేపటిలో సర్పము తనంతట తానే మాయమైపోయెను. ఎంత వెదకినను కనిపించలేదు.

బాలాజీకి ఇద్దరు భార్యలు, కొంతమంది బిడ్డలుండిరి. బాబా దర్శనమునకై వారప్పుడప్పుడు శిరిడీకి పోవుచుండెడివారు. బాబా వారికొరకు చీరలు, బట్టలు కొని యాశీర్వచనములతో ఇచ్చుచుండెడివారు.

శ్రీసాయినాథాయ నమః

**ముప్పదియైదవ అధ్యాయము**

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదియారవ అధ్యాయము

1. ఇద్దరు గోవా పెద్ద మనుష్యులు 2. షోలాపూరు నివాసియగు ఔరంగాబాద్‌కర్ భార్య - వింత కథలు

### ఇద్దరు పెద్దమనుష్యులు

ఒకనాడు గోవానుండి యిద్దరు పెద్దమనుష్యులు బాబా దర్శనమునకై వచ్చి, బాబా పాదములకు సాష్టాంగముగా నమస్కరించిరి. ఇద్దరు కలిసి వచ్చినప్పటికి బాబా వారిలో నొక్కరిని 15 రూపాయలు దక్షిణ యిమ్మనెను. ఇంకొకరు అడుగకుండగనే 35 రూపాయలివ్వగా నందరికి ఆశ్చర్యము కలుగునట్లు బాబా నిరాకరించెను. అక్కడున్న శ్యామా బాబా నిట్లడిగెను. “ఇది యేమి? ఇద్దరు కలిసి వచ్చిరి. ఒకరి దక్షిణ యామోదించితివి. రెండవవానిది తిరస్కరించితివి. ఎందులకీ భేదభావము?” బాబా యిట్లు జవాబిచ్చెను. “శ్యామా! ఎందులకో నీకేమియును తెలియదు. నేనెవరివద్ద ఏమియు తీసికొనను. మసీదుమాయి బాకీని కోరును. బాకీయున్నవాడు చెల్లించి, ఋణవిమోచనము పొందును. నాకిల్లుగాని, ఆస్తిగాని. కుటుంబముగాని కలవా? నాకేమీ యక్కరలేదు. నేనెప్పుడు స్వతంత్రుడను. ఋణము, శతృత్వము, హత్య చేసిన దోషము చెల్లించియే తీరవలెను. దానిని తప్పించుకొను మార్గము లేదు.” పిమ్మట బాబా తన విశిష్ట ధోరణిలో నిట్లనెను. “ప్రప్రథమమున అతడు పేదవాడు. ఉద్యోగము దొరికినచో మొదటినెల

జీతము నిచ్చెదనని తన ఇష్టదైవమునకు మ్రొక్కుకొనెను. అతనికి నెలకు 15 రూపాయల యుద్యోగము దొరికెను. క్రమముగా జీతము పెరిగి 15 రూపాయలనుంచి 30,60,100,200లకు హెచ్చెను. తుదకు 700లకు హెచ్చెను. అతడు ఐశ్వర్యము ననుభవించు కాలమందు తన మ్రొక్కును మరచెను. అతని కర్మఫలమే అతని నిటకు ఈడ్చుకొని వచ్చినది. ఆ మొత్తమునే (15 రూపాయలు) నేను దక్షిణరూపముగా నడిగితిని."

**ఇంకొక కథ**

సముద్రతీరమున తిరుగుచుండగా ఒక పెద్ద భవనమువద్దకు వచ్చి, దాని వసారాపై కూర్చుంటిని. యజమాని నన్ను బాగుగా నాదరించి చక్కని భోజనము పెట్టెను. బీరువా ప్రక్కన శుభ్రమైన స్థలము చూపి యక్కడ పరుండు మనెను. నేనక్కడ నిద్రపోయితిని. నేను గాఢనిద్రలో నుండగా ఆ మనిషి యొక రాతిపలకను లాగి గోడకు కన్నము చేసి, లోపల ప్రవేశించి నా జేబులో నున్న ద్రవ్యమునంతయు దొంగిలించెను. నేను లేచి చూచుకొనగా 30,000 రూపాయలు పోయినవి. నేను మిగుల బాధపడితిని, ఏడ్చుచు కూర్చుంటిని. పైకమంతయు నోట్ల రూపముగా నుండెను. ఆ బ్రాహ్మణుడే దానిని దొంగలించె ననుకొంటిని. భోజనము నీరు రుచించవయ్యెను. వసారాపై ఒక పక్షము కాలము కూర్చుండి నాకు కలిగిన నష్టమున కేడ్చుచుంటిని. పిమ్మట ఒక ఫకీరు దారివెంట పోవుచు నే నేడ్చుచుండుట జూచి యెందుల కేడ్చుచుంటివని యడిగెను. నేను జరిగిన వృత్తాంతము చెప్పితిని. వారిట్లనిరి. "నేను చెప్పినట్లు చేసినట్లయితే నీ డబ్బు నీకు దొరకును. ఒక ఫకీరు వద్దకు వెళ్ళుము. వారి చిరునామా నే నిచ్చెదను. వారి శరణు వేడుము. వారు నీ పైకము నీకు తిరిగి తెప్పించెదరు. ఈ లోగా నీకు ప్రియమైన యాహారమేదో దానిని నీ ద్రవ్యము దొరకునంతవరకు విసర్జింపుము." నేను ఫకీరు చెప్పినట్లు నడచుకొంటిని. నా పైకము నాకు చిక్కినది. నేను వాడాను విడిచి సముద్రపుటొడ్డునకు పోయితిని. అక్కడొక స్టీమరుండెను. దానిలో జనులు ఎక్కువగా నుండుటచే లోపల ప్రవేశించలేక పోయితిని. ఒక మంచి నౌకరు నాకు తోడ్పడగా నేను లోపలకు బోయితిని. అది యింకొక యొడ్డునకు దీసికొని పోయినది. అక్కడ రైలుబండి నెక్కి యీ మసీదుకు వచ్చితిని.

కథ పూర్తి కాగానే బాబా ఆ యతిథులను భోజనముకొరకు తీసికొని పొమ్మనగా శ్యామా యట్లే చేసెను. శ్యామా వారి నింటికి దీసికొనిపోయి భోజనము పెట్టెను. భోజనసమయములో శ్యామా బాబా చెప్పిన కథ చిత్రముగా నున్నదనెను. బాబావారెన్నడు సముద్రతీరమునకు పోయి యుండలేదు. వారివద్ద 30,000 రూపాయ లెప్పుడు లేకుండెను. ఎన్నడు ప్రయాణము చేయలేదు. ద్రవ్యమెప్పుడును పోవుటగాని వచ్చుటగాని జరుగలేదు. కాన దాని భావము తమకేమైన దెలిసినదా? యని వారినడిగెను. అతిథుల మనస్సులు కరగెను. వారు కండ్ల తడిపెట్టుకొనిరి. ఏడ్చుచు "బాబా *సర్వజ్ఞుడు, అనంతుడు, పరబ్రహ్మస్వరూపుడే*"యని నుడివిరి. "బాబా చెప్పిన కథ మాగూర్చియే. వారు చెప్పినదంతయు మా విషయమే. వారికి ఎట్లు తెలిసెనో యనునది గొప్ప చిత్రము. భోజనమైన తరువాత పూర్తి వివరములను చెప్పెద"మనిరి.

భోజనమయిన పిమ్మట తాంబూలము వేసుకొనుచు అతిథులు వారి కథలను చెప్పదొడంగిరి. అందులో నొకరు ఇట్లు చెప్పిరి. "లోయలోనున్న *యూరు మా స్వగ్రామము. జీవనోపాధికై నేనుద్యోగము సంపాదించి గోవా వెళ్ళితిని. నాకు ఉద్యోగము లభించినచో నా మొదటినెలజీతము నిచ్చెదనని దత్తదేవునికి మ్రొక్కుకొంటిని. వారి దయవల్ల నాకు 15 రూపాయల యుద్యోగము దొరికెను. నాకు క్రమముగా జీతము బాబా చెప్పిన ప్రకారము 700 రూపాయల వరకు హెచ్చినది. నా మ్రొక్కును నేను మరచితిని. దానిని బాబా యివ్విధముగా జ్ఞప్తికి దెచ్చి నావద్ద 15 రూపాయలు తీసికొనిరి. అది దక్షిణ కాదు. అది పాత బాకీ; తీర్చుకొనక మరచిన మ్రొక్కును చెల్లించుట.*"

**నీతి**

బాబా యెన్నడు డబ్బు భిక్షమెత్తలేదు, సరికదా తమ భక్తులు కూడ భిక్షమెత్తికొనుటకు ఒప్పుకొనలేదు. వారు ధనమును ప్రమాదకారిగాను, పరమును సాధించుట కడ్డుగాను భావించువారు. భక్తులు దాని చేతులలో జిక్కకుండ కాపాడెడివారు. ఈ విషయమున భక్త మహాల్సాపతి యొక

నిదర్శనము. ఆయన మిక్కిలి పేదవాడు. అతనికి భోజనవసతికి కూడ జరుగుబాటు లేకుండెను. అయినను అతడు ద్రవ్యము సంపాదించుటకు బాబా యనుమతించలేదు; దక్షిణలోనుండి కూడ ఏమియు ఈయలేదు. ఒకనాడు ఉదారవర్తకుడైన హంసరాజు అను బాబా భక్తుడొకడు చాల ద్రవ్యమును బాబా సముఖమున మహాల్సాపతి కిచ్చెను. కాని బాబా దానిని పుచ్చుకొనుట కనుమతించలేదు.

పిమ్మట రెండవ యతిథి తన కథ నిట్లు ప్రారంభించెను. "నా బ్రాహ్మణ వంటమనిషి నావద్ద 35 సంవత్సరముల నుండి నౌకరి చేయుచుండినను, దురదృష్టమున వాడు చెడు మార్గములో పడెను. వాని మనస్సు మారిపోయెను. వాడు నా ద్రవ్యమునంతయు దొంగిలించెను. రాతి పలకను తొలగించి, ధనము దాచిన భోషాణమున్న గదిలో ప్రవేశించి నాయాస్తి సర్వమును అనగా 30,000 రూపాయల కరెన్సీని దొంగిలించి పారిపోయెను. బాబా సరిగా ఆ మొత్తమునే యెట్లు చెప్పగలిగెనో నాకు తెలియదు. రాత్రింబవళ్ళు ఏడ్చుచు కూర్చుంటిని. నా ప్రయత్నములన్నియు విఫలమైనవి. ఒక పక్షమువరకు చాల యారాట పడితిని. విచారగ్రస్తుడనై దుఃఖముతో అరుగుపై కూర్చొనియుండగా ఒక ఫకీరు నా స్థితిని గనిపెట్టి కారణమును దెలిసికొనెను. నేను వివరములన్నియు దెలిపితిని. అతడు "శిరిడీసాయి యను ఔలియా యున్నారు, వారికి మ్రొక్కుము. నీకు ప్రియమైన యాహారమును విడువుము. నీ మనస్సులో వారి దర్శనము చేయువరకు నీకు ప్రియమైన యాహారమును తిననని మ్రొక్కుకొనుము." అనెను. నేనట్లులే "బాబా! నా ద్రవ్యము దొరికిన పిమ్మట, మీ దర్శనము చేసిన పిమ్మట, నేనన్నము తినెదను" అని మ్రొక్కుకొంటిని.

"దీని తరువాత 15 దినములు గడచెను. బ్రాహ్మణుడు తనంతట తానే నా డబ్బును నాకిచ్చెను. నాశరణు వేడెను. వాడిట్లనియెను. "నేను పిచ్చి యెత్తి యిట్లు చేసినాను. నా శిరస్సు నీ పాదములపై బెట్టితిని. దయచేసి క్షమించుము." ఈ విధముగా కథ శుభాంతమైనది. నాకు కనిపించి సహాయమొనర్చిన ఫకీరు తిరిగి కనబడలేదు. ఫకీరు చెప్పిన శిరిడీ సాయిబాబాను చూచుట కెంతో గాఢమైన కోరిక కలిగినది. మాయింటికంత

దూరము వచ్చినవారు శిరిడీ సాయిబాబాయే యని నా నమ్మకము. ఎవరయితే నాకు కనపడి నా ద్రవ్యమును తిరిగి తెప్పించిరో అట్టివారు 35 రూపాయల కొరకు పేరాస చూపెదరా? దీనికి వ్యతిరేకముగా మా వద్దనుంచి యేమియు ఆశించక, ఎల్లప్పుడు తమ చేతనయినంతవరకు బాబా మమ్ములను ఆధ్యాత్మికమార్గమున నడిపింతురు.

దొంగిలించిన నా ద్రవ్యము దొరికిన వెంటనే మిక్కిలి సంతసించి మైమరచి నా మ్రొక్కును మరచితిని. ఒకనాటి రాత్రి నేను కొలాబాలో నున్నప్పుడు బాబాను స్వప్నములో జూచితిని. శిరిడీకి పోవలెనను సంగతి యప్పుడు జ్ఞప్తికి వచ్చెను. నేను గోవా వెళ్ళితిని. అక్కడనుండి స్టీమర్ మీద బొంబాయి వెళ్ళి అటునుండి శిరిడీకి పోవ నిశ్చయించితిని. నేను హార్బరు వద్దకు పోగా స్టీమరులో జాగా లేకుండెను. కేప్టెను ఒప్పుకొనలేదు కాని, నాకు పరిచయము లేని నవుకరొకడు చెప్పగా ఒప్పుకొని నన్ను స్టీమరులో బొంబాయికి తీసికొనివచ్చెను. అక్కడనుండి యిక్కడకు రైలులో వచ్చితిని. కాబట్టి బాబా సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి. మేమెక్కడ? మా యిల్లెక్కడ? మా యదృష్టమేమని చెప్పవలెను? బాబా మా ద్రవ్యమును తిరిగి రాబట్టెను. ఇక్కడకు లాగుకొనివచ్చెను. శిరిడీ జనులారా! మీరు మా కంటె పుణ్యాత్ములు, మాకంటె యదృష్టవంతులు. ఏలన, బాబా మీతో ఆడి నవ్వి మాట్లాడి యెన్నో సంవత్సరములు మీతో నివసించెను. మీ పుణ్యమనంతము. ఎందుకనగా అది బాబాను శిరిడీకి లాగెను. సాయియే మన దత్తుడు. వారే మ్రొక్కుకొమ్మని నన్ను అజ్ఞాపించిరి. స్టీమరులో జాగా యిప్పించిరి. నన్ను ఇచ్చటకు దెచ్చిరి. ఇట్లు వారి సర్వజ్ఞత్వమును సర్వశక్తిమత్వమును నిరూపించిరి.

**ఔరంగబాదుకర్ భార్య**

షోలాపూరు నివాసియగు సఖారామ్ ఔరంగాబాద్కర్ భార్యకు 27 సంవత్సరములైనను సంతానము కలుగలేదు. ఆమె అనేకదేవతలకు మ్రొక్కులు మ్రొక్కెను, కాని నిష్ప్రయోజనమయ్యెను. తుదకు నిరాశ చెందెను. ఈ విషయమై చివరి ప్రయత్నము చేయ నిశ్చయించుకొని తన సవతి కొడుకగు విశ్వనాథునితో శిరిడీకి వచ్చెను. అచట బాబా సేవ చేయుచు రెండు నెలలు గడపెను. ఆమె ఎప్పుడు మసీదుకు పోయినను అది భక్తులచే

నిండియుండెడిది. బాబా చుట్టు భక్తమండలి మూగి యుండువారు. బాబా నొంటరిగా జూచి, వారి పాదములపై పడి తన మనస్సును విప్పి చెప్పి, తన కొక సంతానము కావలెనని కోరుకొనుటకై తగిన యవకాశమునకై ఆమె కనిపెట్టుకొని యుండెను. తుట్టతుదకు శ్యామా కీసంగతి చెప్పి, బాబా యెంటరిగా నున్నప్పుడు తన విషయములో జోక్యము గలుగ జేసికొనుమనెను. శ్యామా, బాబా దర్బారెల్లప్పుడు తెరచియుండుననియు, ఐనను ఆమెగూర్చి ప్రయత్నించెదననియు సాయి ప్రభువు ఆశీర్వదించవచ్చు ననియు చెప్పెను. బాబా భోజనసమయమున మసీదు వాకిలిలో కొబ్బరికాయ, అగరువత్తులతో సిద్ధముగా నుండుమనియు తాను సైగ చేయగనే మసీదుపైకి రావలెననియు చెప్పెను. ఒకనాడు శ్యామా మధ్యాహ్న భోజనానంతరము బాబా చేతులు తువాలుతో తుడుచుచుండగా బాబా శ్యామా బుగ్గను గిల్లెను. శ్యామా కోపగించి *"దేవా! నా బుగ్గను గిల్లుట నీకు తగునా? మా బుగ్గలు గిల్లునట్టి పెంకి దేవుడు మాకక్కరలేదు. మేము నీపై నాధారపడియున్నామా? ఇదియేనా మన సాన్నిహిత్య ఫలితము?"* అనెను. బాబా యిట్లనెను. *"శ్యామా! 72 జన్మలనుంచి నీవు నాతో నున్నప్పటికి నేను నిన్ను గిల్లలేదు. ఇన్నాళ్ళకు గిల్లగా నీకు కోపము వచ్చుచున్నది."* శ్యామా యిట్లనియెను. *"ఎల్లప్పుడు ముద్దులు, మిఠాయిలు ఇచ్చు దైవము మాకు కావలెను. మీనుండి మాకు గౌరవముగాని, స్వర్గముగాని, విమానముగాని యవసరము లేదు. మీ పాదములయందు నమ్మకము మాకెప్పుడును నుండుగాక."* బాబా యిట్లనెను. *"అవును, నేను వచ్చినది యందుకే. ఇన్నాళ్ళనుంచి మీకు భోజనము పెట్టి పోషించుచుంటిని. నీ యందు నాకు ప్రేమానురాగములున్నవి."*

అట్లనుచు బాబా పైకి వెళ్ళి తన గద్దెపయి కూర్చొనెను. శ్యామా యామెను సైగచేసి రమ్మనెను. ఆమె మసీదుపైకి వచ్చి బాబాకు నమస్కరించి, కొబ్బరికాయ, అగరువత్తు లిచ్చెను. బాబా ఆ టెంకాయ నాడించెను. అది యెండుది కనుక లోపల కుడుక ఆడుచు శబ్దము వచ్చుచుండెను.

బాబా:- శ్యామా! యిది గుండ్రముగా లోపల తిరుచుగున్నది. అది యేమనుచున్నదో విను!

శ్యామా:- ఆమె తన గర్భమందు ఒక బిడ్డ అటులే ఆడవలెనని వేడుచున్నది కాన, టెంకాయను నీ యాశీర్వాదముతో నిమ్ము!

బాబా:- టెంకాయ బిడ్డను ప్రసాదించునా? అట్లనుకొనుటకు ప్రజలెంత అమాయకులు?

శ్యామా:- నీ మాటల మహిమయు, ఆశీర్వాదప్రభావమును నాకు దెలియును. నీ యాశీర్వాదమే ఆమెకు బిడ్డల పరంపరను ప్రసాదించును. నీవు మాటలచే కాలయాపన చేయుచు ఆశీర్వాదమును ఇవ్వకున్నావు.

ఆ సంవాదము కొంతసేపు జరిగెను. బాబా పదేపదే టెంకాయను కొట్టుమనుచుండెను. శ్యామా టెంకాయను కొట్టకుండ నా స్త్రీకే ఇవ్వుమని వేడుచుండెను. తుదకు బాబా లొంగి "*ఆమెకు సంతానము కలుగు*"నెనెను. ఎప్పుడని శ్యామా యడిగెను. 12 మాసములలోనని బాబా జవాబిచ్చెను. టెంకాయను పగులగొట్టిరి. ఒక చిప్పను ఇరువురు తినిరి. రెండవచిప్ప నామె కిచ్చిరి.

అప్పుడు శ్యామా యా స్త్రీవైపు తిరిగి "*అమ్మా! నీవు నా మాటలకు సాక్షివి. నీకు 12 మాసములలో సంతానము కలుగనిచో, ఈ దేవుని తలపై నొక టెంకాయను గొట్టి ఈ మసీదునుంచి తరమివేసెదను. ఇందుకు తప్పినచో నేను మాధవుడ గాను. మీరు దీనిని జూచెదరు గాక!*" యనెను.

ఆమె ఒక సంవత్సరములో కొడుకును గనెను. 5వ మాసములో కొడుకును మసీదుకు తీసికొనివచ్చి భార్యాభర్తలు బాబా పాదములపై బడిరి. కృతజ్ఞుడగు తండ్రి 500 రూపాయ లిచ్చెను. బాబా గుఱ్ఱము 'శ్యామకర్ణ'కు ఈ ధనముతో శాల కట్టించెను.

శ్రీసాయినాథాయ నమః

**ముప్పదియారవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదియేడవ అధ్యాయము

### చావడి యుత్సవము

హేమాడ్‌పంతు ఈ అధ్యాయములో కొన్ని వేదాంతవిషయములు ప్రస్తావించిన పిమ్మట చావడి యుత్సవమును గూర్చి వర్ణించుచున్నాడు.

**తొలిపలుకు**

శ్రీసాయిజీవితము మిగుల పావన మయినది. వారి నిత్య కృత్యములు ధన్యములు. వారి పద్ధతులు, చర్యలు వర్ణింప నలవికానివి. కొన్ని సమయములందు వారు బ్రహ్మానందముతో మైమరచెడివారు. మరికొన్ని సమయములం దాత్మజ్ఞానముతో తృప్తి పొందెడివారు. ఒక్కొక్కప్పుడన్ని పనులను నెరవేర్చుచు ఎట్టి సంబంధము లేనట్లుండెడివారు. ఒక్కొక్కప్పు డేమియు చేయనట్లు గన్పించినప్పటికిని వారు సోమరిగా గాని, నిద్రితులుగా గాని, కనిపించెడువారు కారు. వారు ఎల్లప్పుడు ఆత్మానుసంధానము చేసెడివారు. వారు సముద్రమువలె శాంతముగా తొణకక యుండినట్లు గనిపించినను వారి గాంభీర్యము, లోతు, కనుగొనరానివి. వర్ణనాతీతమయిన వారి నైజము వర్ణింపగలవా రెవ్వరు? పురుషులను అన్నదమ్ములవలె, స్త్రీల నక్కచెల్లెండ్రవలె తల్లులవలె చూచుకొనెడివారు. వారి శాశ్వతాస్ఖలితబ్రహ్మచర్యము

అందరెరిగినదే. వారి సాంగత్యమున మనకు కలిగిన జ్ఞానము మనము మరణించువరకు నిలుచుగాక! ఎల్లప్పుడు హృదయపూర్వకమగు భక్తితో వారి పాదములకు సేవ చేసెదముగాక! వారిని సకలజీవకోటియందు జూచెదము గాక! వారి నామము నెల్లప్పుడు ప్రేమించెదము గాక!

వేదాంతసంబంధమైన దీర్ఘోపన్యాసము చేసిన పిమ్మట హేమాడ్‌పంతు చావడి యుత్సవమును వర్ణించుటకు మొదలిడెను.

**చావడి యుత్సవము**

బాబా శయనశాలను ఇదివరకే వర్ణించితిని. వారు ఒకనాడు మసీదులోను, ఇంకొకనాడు చావడిలోను నిద్రించుచుండిరి. మసీదుకు దగ్గరలోనే చావడి రెండు గదులతో నుండెడిది. బాబా మహాసమాధి చెందువరకు ఒకరోజు మసీదులో, ఇంకొకరోజు చావడిలో నిద్రించుచుండిరి. 1910 డిశంబరు 10వ తేదీనుండి చావడిలో భక్తులు పూజా హారతులు జరుప మొదలిడిరి. బాబా కటాక్షముచే దీనినే యిప్పుడు వర్ణింతుము. చావడిలో నిద్రించు సమయము రాగా భక్తులు మసీదులో గుమిగూడి కొంతసేపు మండపములో భజన చేసెడివారు. భజనబృందము వెనుక రథము, కుడివైపు తులసీబృందావనము, ముందర బాబా వీని మధ్య భజన జరుగుచుండెను. భజనయందు ప్రీతి గల స్త్రీపురుషులు సరియైన కాలమునకు వచ్చుచుండిరి. కొందరు తాళములు, చిరతలు, మృదంగము, కంజిరా, మద్దెలలు పట్టుకొని భజన చేయుచుండెడివారు. సూదంటురాయివలె సాయిబాబా భక్తులందరిని తమ వద్దకు ఈడ్చుకొనెడివారు. బయట బహిరంగస్థలములో కొందరు దివిటీలు సరిచేయుచుండిరి. కొందరు పల్లకి నలంకరించుచుండిరి. కొందరు బెత్తములను చేత ధరించి *'శ్రీసాయినాథ మహారాజ్‌కీ జై!'* యని కేకలు వేయుచుండిరి. మసీదు మూలలు తోరణములతో నలంకరించుచుండిరి. మసీదు చుట్టు దీపముల వరుసలు కాంతిని వెదజల్లుచుండెను. బాబా గుఱ్ఱము శ్యామకర్ణ సజ్జితమై బయట నిలుచుండును. అప్పుడు తాత్యాపాటీల కొంతమందిని వెంటబెట్టుకొని వచ్చి బాబాను సిద్ధముగా నుండుడని చెప్పెడివాడు. బాబా నిశ్చలముగా కూర్చొనెడివారు. తాత్యాపాటీలు వచ్చి బాబా

చంకలో చేయివేసి లేవనెత్తుచుండెను. తాత్యా బాబాను 'మామా' యని పిలచెడివాడు. నిజముగా వారి బాంధవ్యము మిక్కిలి సన్నిహితమయినది. బాబా శరీరముపై మామూలు కఫనీ వేసికొని చంకలో సటకా పెట్టుకొని, చిలుమును పొగాకును తీసికొని పైన ఉత్తరీయము వేసుకొని, బయలుదేరుటకు సిద్ధపడుచుండిరి. పిమ్మట తాత్యా జలతారు శెల్లాను బాబా ఒడలిపై వేసెడివాడు. అటు పిమ్మట బాబా తన కుడిపాదము బొటనవ్రేలుతో ధునిలోని కట్టెలను ముందుకు త్రోసి, కుడిచేతితో మండుచున్న దీపము నార్పి, చావడికి బయలుదేరెడివారు. అన్ని వాయిద్యములు మ్రోగెడివి; మతాబా మందుసామాను లనేకరంగులు ప్రదర్శించుచు కాలెడివి. పురుషులు, స్త్రీలు బాబా నామము పాడుచు మృదంగము వీణల సహాయముతో భజన చేయుచు ఉత్సవములో నడచుచుండిరి. కొందరు సంతసముతో నాట్యమాడుచుండిరి. కొందరు జెండాలను చేత బట్టుకొనుచుండిరి. బాబా మసీదు మెట్లపైకి రాగా భాల్దారులు *'శ్రీసాయినాథ్ మహరాజ్‌కీ జై!'* అని కేకలు పెట్టుచుండిరి. బాబా కిరుప్రక్కల చామరములు మొదలగునవి పట్టుకొని విసరుచుండిరి. మార్గమంతయు అడుగులకు మడుగులు పరచెడువారు. వానిపై బాబా భక్తుల కేలూతతో నడచెడువారు. తాత్యా యెడమచేతిని, మహాల్సాపతి కుడిచేతిని, బాపు సాహెబుజోగ్ శిరస్సుపై ఛత్రమును పట్టుకొనెడివారు. ఈ ప్రకారముగా బాబా చావడికి పయనమగుచుండెను. బాగుగాను, పూర్తిగాను నలంకరించిన యెఱ్ఱ గుఱ్ఱము శ్యామకర్ణ దారి తీయుచుండెను. దాని వెనుక పాడెడువారు, భజన చేయువారు, వాయిద్యములు మ్రోగించువారు, భక్తుల సమూహ ముండెడిది. హరినామస్మరణతోను, బాబా నామస్మరణతోను ఆకాశము బ్రద్దలగునటుల మారు మ్రోగుచుండెను. ఈ మాదిరిగ శోభాయాత్ర మసీదు మూల చేరుసరికి ఉత్సవములో పాల్గొనువారందరు ఆనందించుచుండిరి.

ఈ మూలకు వచ్చుసరికి బాబా చావడివైపు ముఖముపెట్టి నిలిచి యొక విచిత్రమయిన ప్రకాశముతో వెలిగెడివారు. వారి ముఖము ఉదయసంధ్యవలె లేదా బాలభానునివలె ప్రకాశించుచుండెను. అచట బాబా ఉత్తరమువైపు ముఖము పెట్టి కేంద్రీకరించిన మనస్సుతో నిలచెడివారు. వారెవరినో పిలుచునటుల గనిపించెడిది. సమస్త వాయిద్యములు మ్రోగు చున్నప్పుడు

బాబా తన కుడిచేతిని క్రిందకు మీదకు ఆడించెడివారు. అట్టి సమయమున కాకాసాహెబు దీక్షిత్ ముందుకు వచ్చి, యొక వెండిపళ్ళెములో పువ్వులు గులాల్ పొడిని దీసికొని బాబాపై పెక్కుసార్లు చల్లుచుండెను. అట్టి సమయమందు సంగీత వాయిద్యములు వాని శక్తికొలది ధ్వనించుచుండెను. బాబా ముఖము స్థిరమైన ద్విగుణీకృత ప్రకాశముతోడను, సౌందర్యముతోడను, వెలుగుచుండెను. అందరు ఈ ప్రకాశమును మనసారా గ్రోలుచుండిరి. ఆ దృశ్యమును ఆ శోభను వర్ణించుటకు మాటలు చాలవు. ఒక్కొక్కప్పు డానందమును భరించలేక మహాల్సాపతి దేవత యావేశించినవానివలె నృత్యము చేయువాడు. కాని బాబాయొక్క ధ్యాన మేమాత్రము చెదరక యుండెడిది. చేతిలో లాంతరు పట్టుకొని తాత్యాపాటీలు బాబాకు ఎడమప్రక్క నడచుచుండెను. భక్తమహాల్సాపతి కుడివయిపు నడచుచు బాబా సెల్లాయంచును పట్టుకొనెడివారు. ఈ యుత్సవమెంతో రమణీయముగ నుండెడిది. వారి భక్తి చెప్పనలవికానిది. ఈపల్లకి యుత్సవమును చూచుటకు పురుషులు, స్త్రీలు, ధనికులు, పేదవారు గుమిగూడుచుండిరి. బాబా నెమ్మదిగా నడచుచుండెను. భక్తిప్రేమలతో భక్తమండలి బాబా కిరుప్రక్కల నడుచుచుండెడివారు. వాతావరణమంతయు ఆనందపూర్ణమై యుండగ శోభాయాత్ర చావడి చేరుచుండెను. ఆ దృశ్యము, ఆ కాలము గడచిపోయినవి. ప్రస్తుతముగాని, యికముందుగాని యా దృశ్యమును గనలేము. ఐనను ఆ దృశ్యమును జ్ఞప్తికి దెచ్చుకొని భావన చేసినచో మనస్సుకు శాంతి తృప్తి కలుగును.

చావడిని బాగుగా నలంకరించుచుండిరి. దానిని తెల్లని పై కప్పుతోను, నిలువుటద్దములతోను, అనేక రంగుల దీపములతోను, వ్రేలాడగట్టిన గాజుబుడ్డీల తోను అలంకరించుచుండిరి. చావడి చేరగనే తాత్యా ముందు ప్రవేశించి యొక యాసనము వేసి బాలీసు నుంచి బాబాను కూర్చుండబెట్టి మంచి యంగరఖా తొడిగించినపిమ్మట భక్తులు బాబాను వేయి విధముల పూజించుచుండిరి. బాబా తలపై తురాయి కిరీటమును బెట్టి, పువ్వుల మాలలు వేసి, మెడలో నగలు వేయుచుండిరి. ముఖమునకు కస్తూరి నామమును, మధ్యను బొట్టును పెట్టి మనఃస్ఫూర్తిగా బాబావైపు హృదయానందకరముగా

జూచెడివారు. తలపై కిరీటము అప్పుడప్పుడు తీయుచుండెడివారు. లేనిచో బాబా దానిని విసరివైచునని వారి భయము. బాబా భక్తుల యంతరంగమును గ్రహించి వారి కోరికలకు లొంగియుండెడివారు. వారు చేయుదానికి అభ్యంతర పెట్టువారు కారు. ఈ యలంకారముతో బాబా మిక్కిలి సుందరముగా గనుపించుచుండిరి.

నానాసాహెబు నిమోన్కర్ గిఱ్ఱున తిరుగు కుచ్చుల ఛత్రమును పట్టుకొనుచుండెను. బాపూసాహెబు జోగ్ యొక వెండి పళ్ళెములో బాబా పాదములు కడిగి, యర్ఘ్యపాద్యము లర్పించి చేతులకు గంధము పూసి, తాంబూలము నిచ్చుచుండెను. బాబా గద్దెపై కూర్చొనియుండగా తాత్యా మొదలగు భక్తులు వారి పాదములకు నమస్కరించుచుండిరి. బాలీసుపై ఆనుకొని బాబా కూర్చొని యుండగా భక్తులు ఇరువైపుల చామరములతోను, విసనకఱ్ఱలతోను విసరుచుండిరి. అప్పుడు శ్యామా చిలుమును తయారుచేసి, తాత్యాకు ఇవ్వగా నతడొక పీల్పుపీల్చి బాబా కిచ్చుచుండెను. బాబా పీల్చిన పిమ్మట భక్త మహాల్సాకు ఇచ్చెడువారు. తదుపరి యితరులకు లభించుచుండెను. జడమగు చిలుము ధన్యమైనది. మొట్టమొదట అది యనేక తపఃపరీక్షల కాగవలసి వచ్చెను. కుమ్మరులు దానిని త్రొక్కుట, ఎండలో ఆరబెట్టుట, నిప్పులో కాల్చుట వంటివి సహించి తుదకు అది బాబా ముద్దుకు హస్తస్పర్శకు నోచుకొన్నది. ఆ యుత్సవము పూర్తి యయిన పిమ్మట భక్తులు పూలదండలను బాబా మెడలో వేసెడివారు. వాసన చూచుటకు పువ్వులగుత్తులను చేతికిచ్చేవారు. బాబా నిర్వ్యామోహము అభిమానరాహిత్యముల కవతారమగుటచేత ఆ యలంకరణములను గాని మరియాదలను గాని లెక్క పెట్టువారుకారు. భక్తులందుగల్గ యనురాగముచే, వారి సంతుష్టికొరకు వారి యిష్టానుసారము చేయుటకు ఒప్పుకొనుచుండిరి. ఆఖరుకు బాపూసాహెబ్ జోగ్ సర్వలాంఛనములతో హారతి నిచ్చువాడు. హారతి సమయమున బాజాభజంత్రీ మేళతాళములు స్వేచ్ఛగా వాయించువారు. హారతి ముగిసిన పిమ్మట భక్తులు ఆశీర్వాదమును పొంది బాబాకు నమస్కరించి యొకరి తరువాత నొకరు తమతమ యిండ్లకు బోవుచుండిరి. చిలుము, అత్తరు, పన్నీరు సమర్పించిన పిమ్మట తాత్యా యింటికి పోవుటకు

లేవగా, బాబా ప్రేమతో నాతనితో నిట్లనును. "నన్ను కాపాడుము. నీకిష్టమున్నచో వెళ్ళుము గాని రాత్రి యొకసారి వచ్చి నా గూర్చి కనుగొనుచుండుము." అట్లనే చేయుదుననుచు తాత్యా చావడి విడచి గృహమునకు పోవుచుండెను. బాబా తన పరుపును తానే యమర్చుకొనువారు. 50, 60 దుప్పట్లను ఒకదానిపై నింకొకటి వేసి దానిపై నిద్రించువారు.

మనము కూడ ఇప్పుడు విశ్రమించెదము. ఈ యధ్యాయమును ముగించకముందు భక్తుల కొక మనవి. ప్రతిరోజు రాత్రి నిద్రించుటకు ముందు సాయిబాబాను, వారి చావడి యుత్సవమును జ్ఞప్తికి దెచ్చుకొనవలెను.

శ్రీసాయినాథాయనమః

ముప్పదియేడవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

**ఐదవరోజు పారాయణము సమాప్తము**



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదియెనిమిదవ అధ్యాయము

### ఆరవ రోజు పారాయణము

**మంగళవారము**

*1. బాబా వంటపాత్ర; 2. దేవాలయమును గౌరవించకుండుట; 3. కాలా లేదా మిశ్రమము; 4. మజ్జిగ.*

గత అధ్యాయములో బాబాగారి చావడి యుత్సవము వర్ణించితిమి. ఈ యధ్యాయములో మనము బాబా వంటపాత్ర మొదలగువానిని గూర్చి చదివెదము.

**తొలిపలుకు**

ఓ సద్గురుసాయి! నీవు పావనమూర్తివి! ప్రపంచమంతటికి సంతోషమును ప్రసాదించితివి, భక్తులకు మేలు కలుగజేసితివి. నీ పాదముల నాశ్రయించినవారి బాధలను తొలగించితివి. నిన్ను శరణు జొచ్చినవారిని ఉదారస్వభావుడవగుటచే వారిని పోషించి రక్షించెదవు. నీ భక్తుల కోరికలు నెరవేర్చుటకు, వారికి మేలు చేయుటకొరకు నీవవతరించెదవు. పవిత్రాత్మయను ద్రవసారమును బ్రహ్మమనెడి యచ్చులో పోయగా దానినుండి యోగులలో నలంకారమగు సాయి వెడలెను. ఈ సాయి యాత్మారాముడే. స్వచ్ఛమైన దైవికానందమునకు వారు పుట్టినిల్లు. జీవితేచ్ఛలన్నియు పొందినవారై, వారు భక్తులను నిష్కాములను జేసి విముక్తుల జేసిరి.

**బాబా వంటపాత్ర**

యుగయుగములకు శాస్త్రములు వేర్వేరు సాధనములను ఏర్పాటు చేసియున్నవి. కృతయుగములో తపస్సు, త్రేతాయుగములో జ్ఞానము, ద్వాపరయుగములో యజ్ఞము, కలియుగములో దానము చేయవలెనని శాస్త్రములు ఘోషించుచున్నవి. దానములన్నింటిలో అన్నదానవే శ్రేష్ఠమయినది. మధ్యాహ్నము 12 గంటలకు భోజనము దొరకనిచో మనము చాల బాధపడెదము. అట్టి పరిస్థితులలో నితరజీవులు కూడ నట్లే బాధ పడును. ఈ విషయము తెలిసి యెవరయితే బీదలకు, ఆకలితోనున్న వారికి భోజనము పెట్టెదరో వారే గొప్ప దాతలు. తైత్తిరీయోపనిషత్తు ఇట్లు చెప్పుచున్నది. "ఆహారమే పరబ్రహ్మస్వరూపము, ఆహారమునుండియే సమస్తజీవులు ఉద్భవించినవి. చచ్చిన పిమ్మట నవి తిరిగి ఆహారములో ప్రవేశించును." మిట్టమధ్యాహ్నము మన యింటి కెవరైన అతిథి వచ్చినచో, వారి నాహ్వానించి భోజనము పెట్టుట మన విధి. ఇతరదానములు అనగా ధనము, బట్టలు మొదలగునవి యిచ్చునప్పుడు కొంత విచక్షణ కావలెను. కాని యాహారవిషయములో నట్టి యాలోచన యనవసరము. మన యింటికి మిట్టమధ్యాహ్న మెవరు వచ్చినను వారికి మొట్టమొదట భోజనము పెట్టవలెను. కుంటి, గ్రుడ్డి, రోగిష్ఠులు వచ్చినచో వారికి మొట్టమొదట భోజనము పెట్టిన పిమ్మట ఆరోగ్యవంతులకు, అటుపిమ్మట మన బంధువులకు పెట్టవలెను. మన బంధువులు మొ॥గు వారికి పెట్టుటకంటె, నిస్సహాయులైన అంగవికలురు తదితరులకు పెట్టుట యెంతో శ్రేయస్కరము. అన్నదానము లేకున్నచో నితర దానములు ప్రకాశించవు. ఎట్లన చంద్రుడు లేని నక్షత్రములవలె, పతకములేని కంఠహారమువలె, పింఛము లేని కిరీటమువలె, కమలము లేని చెఱువువలె, భక్తిలేని భజనవలె, కుంకుమబొట్టులేని పుణ్యస్త్రీవలె, బొంగురు కంఠముగలవాని పాటవలె, ఉప్పు లేని మజ్జిగవలె రుచింపవు. అన్ని వ్యంజనములకంటె పప్పుచారు ఎట్లు ఎక్కువో అట్లే అన్ని పుణ్యములలో అన్నదాన మెక్కువ. బాబా ఆహారము నెట్లు తయారుచేసి పంచి పెట్టుచుండెనో చూచెదము.

బాబాకొరకు చాలా తక్కువ భోజనము కావలసియుండెను. అదియు కొన్ని యిండ్లనుండి భిక్షాటనము చేసి తెచ్చుకొనెడివారని యిదివరకే తెలిసికొంటిమి. ఏనాడైనా అందరికి భోజనము పెట్టవలెనని బాబా నిశ్చయించుకొన్నచో మొదటినుండి చివరివరకు కావలసిన యేర్పాటు లన్నియు వారే స్వయముగా చేసికొనెడివారు. ఈ విషయమై వారు ఇతరులపై అధారపడలేదు; ఎవరికిని బాధ కలుగజేయలేదు. మొట్టమొదట బజారుకు వెళ్ళి ధాన్యము, పిండి, మసాలాదినుసులు మొదలగునవి యన్నియు నగదునిచ్చి కొనెడివారు. వారే విసరుచుండెడివారు. మసీదు ముందున్న ఖాళీస్థలములో మధ్యన పొయ్యి పెట్టి దానిపై పెద్ద వంటపాత్రలో కొలత ప్రకారము నీళ్ళు పోసి పెట్టెడివారు. వారి వద్ద వంటపాత్రలు రెండు గలవు. ఒకటి పెద్దది వందమందికి సరిపోవునది, రెండవది చిన్నది 50 మందికి మాత్రము సరిపోవునది. ఒక్కొక్కప్పుడు చక్కెర పొంగలి వండేవారు. మరొకప్పుడు మాంసపు పులావు వండెడివారు. ఒక్కొక్కప్పుడు పప్పుచారుడుకునప్పుడు గోధుమపిండి బిళ్ళలు అందులోనికి వదిలేవారు. మసాలా వస్తువులను చక్కగా నూరి దానిని వంటపాత్రలో వేసేవారు. పదార్థములు చాల రుచిగా నుండుట కెంత శ్రమ తీసికొనవలెనో అంత శ్రమను పడుచుండెడి వారు. అప్పుడప్పుడు అంబలి వండెడివారు. అనగా జొన్న పిండిని నీళ్ళలో నుడకపెట్టి దానిని మజ్జిగలో కలుపుచుండెడివారు. భోజన పదార్థములతో ఈ అంబలిని కూడ అందరికి కొంచెము కొంచెముగా పెట్టెడివారు. అన్నము సరిగా నుడికినదో లేదో యని పరీక్షించుటకు బాబా తన కఫనీని పై కెత్తి చేతిని నిర్భయముగా మరుగుచున్న డేకిసాలో బెట్టి కలుపుచుండెడివారు. వారి ముఖమునందు భయచిహ్నములు గాని చేయి కాలునట్లుగాని కనిపించెడిది కాదు. వంట పూర్తికాగానే, బాబా ఆ పాత్రలను మసీదులోనికి దెచ్చి, మౌల్వీచే అరగింపు పెట్టించేవారు. మొట్టమొదట కొంత మహాల్సాపతికి, తాత్యాకు ప్రసాదముగా పంపించిన పిమ్మట మిగతదానిని బీదవాండ్రకు దిక్కులేనివారికి సంతృప్తిగా బెట్టుచుండిరి. బాబా స్వయముగా తన చేతులతో తయారుచేసి స్వయముగా వడ్డించగా భోజనము చేసినవారు నిజముగా ఎంతో పుణ్యాత్ములు అదృష్టవంతులయి యుండవలెను.

బాబా తన భక్తులందరికి శాకాహారము మాంసాహార మొకేరీతిగా బెట్టుచుండెనా యని ఎవరికైన సందేహము కలుగవచ్చును. దీని జవాబు సులభము, సామాన్యమైనది. ఎవరు మాంసాహారులో అట్టివారికే ఆ వంట పాత్రలోనిది పెట్టెడివారు. మాంసాహారులు కానివారి నా పాత్రను గూడ ముట్టనీయలేదు. వారి మనసులలో దీనిని తినుటకు కోరిక కూడ కలుగనిచ్చెడివారు కారు. గురువుగారేదైనా ఇచ్చినప్పుడు దానిని తినవచ్చునా లేదా యని యోచించు శిష్యుడు నరకమునకు పోవునను రూఢి కలదు. దీనిని శిష్యులు బాగా గ్రహించి నెరవేర్చుచుండిరో లేదో చూచుటకు బాబా యొక్కొక్కప్పుడు పరీక్షించు చుండెడివారు. దీనికొక ఉదాహరణము. ఒక ఏకాదశినాడు దాదాకేల్కరుకు కొన్ని రూపాయలిచ్చి కొరాల్బాకు పోయి మాంసము కొని తెమ్మనెను. ఇతడు సనాతనాచారపరాయణుడగు బ్రాహ్మణుడును ఆచారవంతుడును. సద్గురువుకు ధనము, ధాన్యము, వస్త్రములు మొదలగునవి ఇచ్చుట చాలదనియు, కావలసినది అక్షరాల గురువు ఆజ్ఞను పాటించుటే యనియు, గురువు ఆజ్ఞానుసారము నెరవేర్చుటయే యనియు, ఇదియే నిజమైన దక్షిణ యనియు, దీనివల్లనే గురువు సంతుష్టిచెందెదరనియు అతనికి తెలియును. కనుక దాదా కేల్కరు దుస్తులు ధరించి బజారుకు బయలుదేరెను. కాని బాబా అతనిని వెంటనే పిలచి తానే స్వయముగా పోవలదనియు నింకెవరినైన పంపుమనెను. అతడు పాండువను నౌకరును బంపెను. వాడు బయలుదేరుట జూచి బాబా వానిని కూడ వెనుకకు బిలిపించి యానాడు మాంసము వండుట మానుకొనిరి. ఇంకొకసారి బాబా దాదాకేల్కరును బిలిచి పొయ్యి మీదనున్న పులావు ఉడికినదో లేదో చూడుమనెను. కేల్కర్ దానిని పరీక్షించకయే సరిగా నున్నదని జవాబిచ్చెను. అప్పుడు బాబా "నీవు కండ్లతో దానిని చూడలేదు, నాలుకతో రుచి చూడలేదు, రుచిగానున్నదని ఎట్లు చెప్పితివి. మూత తీసి చూడుము." అనుచు బాబా యతని చేతిని బట్టుకొని మరుగుచున్న డేకిసాలో బెట్టెను. ఇంకను నిట్లనెను. "నీ చేయిని తీయుము. నీ ఆచారము నొక ప్రక్కకు బెట్టి తెడ్డుతో దీసి, కొంచెము ప్లేటులో వేసి సరిగా ఉడికినది లేనిది తెలిసికొనుము." తల్లి మనస్సున నిజమైన ప్రేమ జనించునప్పుడు ఆమె తన

బిడ్డను గిల్లి ఆ బిడ్డ యేడ్చునప్పుడు దానిని కౌగలించి ముద్దుబెట్టుకొనును. అట్లనే బాబా కూడ కన్నతల్లివలె దాదాకేల్కరును ఈ విధముగా గిల్లెను. నిజముగా ఏ యోగిగాని, గురువుగాని తన శిష్యునకు నిషిద్ధాహారము తిని చెడిపొమ్మని చెప్పడు.

ఈవిధముగ బాబా పులావు వండుట 1910వ సంవత్సరమువరకు జరుగుతుండెడిది. పూర్వము చెప్పిన రీతిగా దాసగణు, బాబా కీర్తిని తన హరికథల ద్వారా బొంబాయి రాష్ట్రములో వెల్లడి చేసెను. ఆ ప్రాంతమునుండి ప్రజలు తండోపతండములుగా శిరిడీకి వచ్చుచుండిరి. కొలది దినములలో శిరిడీ యొక పుణ్యక్షేత్రమాయెను. భక్తులనేక రకముల యాహారములను బాబాకు నైవేద్యము పెట్టుచుండిరి. వారు తెచ్చిన పదార్థములు ఫకీరులు, బీదలు తినగా నింకను మిగులుచుండెను. నైవేద్యమునెట్లు పంచి పెట్టెడివారో చెప్పుటకు ముందు బాబాకు శిరిడీలోని దేవాలయములందును, నందుండు దేవతల యందును గల గౌరవమును చాటెడు నానాసాహెబు చాందోర్కరు కథ తెలిసికొందము.

## నానాసాహెబు దేవాలయమును అగౌరవించుట

ఎవరికి తోచినట్లు వారాలోచించి ఊహించి బాబా బ్రాహ్మణుడని కొందరు, మహమ్మదీయుడని మరికొందరు చెప్పుచుండిరి. నిజముగా బాబా యేజాతికి చెందినవారు కారు. వారెప్పుడు పుట్టిరో, ఏజాతియందు పుట్టిరో, వారి తల్లిదండ్రులెవరో యెవరికి తెలియదు. కనుక వారు బ్రాహ్మణుడుగాని, మహమ్మదీయుడుగాని యెట్లు కాగలరు? వారు మహమ్మదీయు లయినచో మసీదులో నెప్పుడు ధుని నెట్లు మండనిత్తురు? అచ్చోట తులసీబృందావన మెట్లుండును? శంఖము లూదుట కెట్లు ఒప్పుకొందురు? గంటలను మ్రోయించుట కెట్లు సమ్మతింతురు? సంగీతవాద్యముల నెటుల వాయించనిత్తురు? హిందువుల మతప్రకారము షోడశోపచార పూజలెటుల జరుగనిత్తురు? వారు మహమ్మదీయు లయినచో వారి చెవులకు కుట్లు (రంధ్రములు) ఎటులుండును? గ్రామములోని హిందూదేవాలయము లన్నిటిని ఏల మరమ్మతు చేయించిరి? బాబా హిందూ దేవాలయములను దేవతలను ఏ మాత్రము అగౌరవించినను ఊరకొనెడివారు కారు.

ఒకనాడు నానాసాహెబు చాందోర్కర్ తన షడ్డకుడగు బినీవాల్యాతో శిరిడీకి వచ్చెను. బాబావద్ద కూర్చొని మాట్లాడుచుండగా నానామీద బాబా హఠాత్తుగా కోపగించి, "నా సహవాసము ఇన్నాళ్ళు చేసియు నిట్లేల చేసితివి?" అనెను. నానాసాహెబు మొదట దీనిని గ్రహించలేకపోయెను. కనుక అదేమిటో వివరించవలసినదిగా ప్రార్థించెను. కోపర్‌గాం నుండి శిరిడీకి ఎట్లు వచ్చితివని బాబా యతని నడిగెను. నానాసాహెబు వెంటనే తన తప్పు గ్రహించెను. సాధారణముగా శిరిడీకి పోవునపుడెల్ల నానాసాహెబ్ కోపర్‌గాంలో దిగి దత్తదర్శనము చేసికొనెడివాడు. కాని ఈసారి తన బంధువు దత్తభక్తు డయినప్పటికి అతనిని గూడ వెళ్ళనీయక, యాలస్యమయిపోవునని చెప్పుచు తిన్నగా శిరిడీకి చేర్చెను. ఇదంతయు బాబాకు తెలియజేయుచు, తాను గోదావరిలో స్నానము చేయునప్పుడొక ముల్లు పాదములో గ్రుచ్చుకొని తనను చాల బాధ పెట్టెనని చెప్పెను. బాబా యది కొంతవరకు ప్రాయశ్చిత్తమే యనుచు నిక మీదట జాగ్రత్తయని హెచ్చరించెను.

**కాలా (మిశ్రమము)**

ఇక నైవేద్యమెటుల పంచి పెట్టెడువారో చూచెదము. హారతి పిమ్మట, భక్తులందరికి ఊదీతో తమ ఆశీర్వాదములు ఇచ్చి పంపివేసిన పిమ్మట, బాబా మసీదులోనికి బోయి నింబారువైపు వీపు పెట్టి కూర్చొనుచుండిరి. కుడివైపు ఎడమవైపు భక్తులు పంక్తులలో కూర్చొనుచుండిరి. నైవేద్యము తెచ్చిన భక్తులు పళ్ళెములను మసీదులో బెట్టి బాబా యాశీర్వాదములకై ఊదీకై కనిపెట్టుకొని బయట నిలుచుచుండిరి. అన్ని రకముల ప్రసాదములు బాబాకు వచ్చుచుండెడివి. పూరీలు, మండెగలు, బొబ్బట్లు, బాసుంది, సాంజా, వరమాన్నము మొదలగున వన్నియు ఒకే పాత్రలో వేసి బాబా ముందుంచువారు. బాబా దీనిని దైవమునకు అర్పించి, పావన మొనర్చుచుండెను. అందులో కొంతభాగము బయట కనిపెట్టుకొని యున్నవారికి పంచి తక్కినది బాబాకు అటునిటు రెండు వరుసలలో కూర్చుండిన భక్తులు సంతృప్తిగా తినుచుండిరి. శ్యామా, నానాసాహెబు నిమోన్‌కర్ వడ్డించువారు. వచ్చినవారి సౌకర్యములను వీరు చూచువారు. వారాపని అతిజాగ్రత్తగాను, ఇష్టముగాను చేయుచుండిరి. తిన్నట్టి ప్రతి రేణువు

కూడ తృప్తియు, సత్తువయు కలుగజేయుచుండెను. అది యట్టి రుచి, ప్రేమ, శక్తి గలిగిన యాహారము. అది సదా శుభ్రమైనది, పవిత్రమైనది.

**ఒక గిన్నెడు మజ్జిగ**

ఒకనాడు హేమాడ్‌పంతు మసీదులో నందరితో కడుపునిండ తినెను. అట్టి సమయమున బాబా అతనికొక గిన్నెడు మజ్జిగ త్రాగుమని యిచ్చెను. అది తెల్లగా చూచుట కింపుగా నుండెను. కాని యతని కడుపులో ఖాళీ లేనట్లుండెను. కొంచెము పీల్చగా అది మిక్కిలి రుచిగా నుండెను. అతని గుంజాటనము గనిపెట్టి బాబా యతనితో నిట్లనెను. "*దాని నంతయు త్రాగుము. నీ కికమీదట ఇట్టి యవకాశము దొరకదు*". అతడు వెంటనే దాని నంతయు త్రాగెను. బాబా పలుకులు సత్యమయ్యెను. ఏలన త్వరలో బాబా సమాధి చెందిరి.

పాఠకులారా! హేమాడ్‌పంతుకు మనము నిజముగా నమస్కరించ వలెను. అతడు గిన్నెడు మజ్జిగను ప్రసాదముగా త్రాగెను. కాని మనకు కావలసినంత యమృతమును బాబా లీలల రూపముగా నిచ్చెను. మనము ఈ యమృతమును గిన్నెలతో త్రాగి సంతుష్టిచెంది యానందించెదముగాక!

శ్రీసాయినాథాయ నమః

**ముప్పదియెనిమిదవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ముప్పదితొమ్మిదవ అధ్యాయము

*1. బాబా సంస్కృత పరిజ్ఞానము: భగవద్గీత శ్లోకమునకు బాబా చెప్పిన అర్థము;*
*2. మహాసమాధి మందిరనిర్మాణము.*

**ఈ** యధ్యాయములో భగవద్గీతయందుగల ఒక శ్లోకమునకు బాబా చెప్పిన యర్థమున్నది. కొందరు బాబాకు సంస్కృతము తెలియదనియు, అది నానాసాహెబు చాందోర్కర్ చెప్పినదనియు ననుటచే, హేమాడ్‌పంతు 50వ అధ్యాయములో ఈ సంగతిని విశదీకరించెను. రెండధ్యాయములలోను నొకే విషయ ముండుటచే రెండును నిందులో పొందుపరచడమైనది.

**తొలిపలుకు**

శిరిడీ పవిత్రమైనది, ద్వారకామాయి పావనమైనది. ఏలన శ్రీసాయి యచటనే నివసించుచు, తిరుగుచు, మసలుచు, తుదకు అక్కడనే మహాసమాధి పొందిరి. శిరిడీ గ్రామప్రజలు ధన్యులు. వారి సర్వకార్యములను బాబా నెరవేర్చుచుండెను. బాబా వారికొరకే చాల దూరమునుండి యచటకు వచ్చెను. మొదట శిరిడీ చాలా చిన్న గ్రామము. సాయిబాబా యచట నివసించుటచే దానికి గొప్ప ప్రాముఖ్యము వచ్చెను. తుదకది పవిత్రమైన యాత్రాస్థల మాయెను. అచటనుండు స్త్రీలు కూడ ధన్యులు. బాబాయందు

వారి భక్తి నిస్సంశయముగా పరిపూర్ణమైనది. బాబా మహిమను వారు స్నానము చేయునప్పుడు, విసరునప్పుడు, రుబ్బునప్పుడు, ధాన్యము దంచునప్పుడు, తదితర గృహకృత్యములు చేయునప్పుడు పాడుచుండెడివారు. వారి భక్తిప్రేమలు పావనములు. వారు చక్కని పాటలు పాడుచుండెడివారు. అవి పాడిన వారికి, విన్న వారికి మనఃశ్శాంతి కలుగ జేయుచుండెను.

**బాబా చెప్పిన యర్థము**

బాబాకు సంస్కృతము వచ్చునని నమ్మువారుండరు. ఒకనాడు భగవద్గీతలోని ఒక శ్లోకమునకు బాబా చక్కని యర్థమును నానాసాహెబు చాందోర్కరుకు బోధించి ఆశ్చర్యము కలుగజేసెను. ఈ విషయమును గూర్చి బి.వి.దేవుగారు (శ్రీసాయి లీల, సంపుటి- IV, పుట- 563, 'స్ఫుటవిషయ' నందు) వ్రాసినారు. వారు స్వయముగా నానాసాహెబు చాందోర్కర్ వద్దనుంచి కొన్ని సంగతులు తెలిసికొనుటచే ఆ వృత్తాంతము ఈ దిగువ నివ్వబడెను.

నానాసాహెబు చాందోర్కర్ వేదాంతమును బాగా చదివినవారు. ఆయన భగవద్గీతను వివిధ వ్యాఖ్యానములతో చదివి యున్నందున తన పాండిత్యమునకు గర్వించుచుండెను. బాబాకీ విషయముగాని, సంస్కృతముగాని తెలియదని ఆయన అభిప్రాయము. అందుచే ఒకనాడు బాబా యతని గర్వమణచెను. ఆ తొలిరోజులలో భక్తులు గుంపులుగుంపులుగా రానప్పుడు బాబా భక్తుల సంశయముల దీర్చుటకు నొంటరిగా వారితో మసీదులో మాట్లాడుచుండిరి. బాబా దగ్గర నానా కూర్చొని వారి కాళ్ళనొత్తుచు నోటిలో ఏదో గొణుగుకొనుచుండెను.

**బాబా** : నానా! యేమి గొణుగుచున్నావు?

**నానా** : సంస్కృత శ్లోకమును వల్లించుచున్నాను.

**బాబా** : ఏ శ్లోకము?

**నానా** : భగవద్గీతలోనిది.

**బాబా** : గట్టిగా చదువుము.

**నానా** : (భగవద్గీత 4-వ అధ్యాయము, 34వ శ్లోకము ఈ క్రింది విధముగా చదివెను.)

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః"

**బాబా** : నానా! అది నీకు బోధపడినదా?

**నానా** : అవును.

**బాబా** : నీకు తెలిసినచో నాకు చెప్పుము.

**నానా** : దాని తాత్పర్యమిది. సాష్టాంగనమస్కారము చేయుట అనగా పాదములపై బడుట, గురుని ప్రశ్నించుట, వారి సేవచేయుట ద్వారా ఈ జ్ఞానమును తెలిసికొనుము. అప్పుడు మోక్షమును పొందు జ్ఞానముగలవారు అనగా, పరబ్రహ్మమును దెలిసినవారు ఆ జ్ఞానము నుపదేశించెదరు.

**బాబా** : నానా! శ్లోకము యొక్క తాత్పర్యమక్కరలేదు. ప్రతిపదార్థము వ్యాకరణము, మరియు దాని యర్థము చెప్పుము.

అప్పుడు నానా ప్రతి పదమున కర్థము చెప్పెను.

**బాబా** : నానా! ఉత్త సాష్టాంగనమస్కారము చేసినచో చాలునా?

**నానా** : ప్రణిపాత యను పదమున కింకొక యర్థము నాకు తెలియదు.

ప్రణిపాత యనగా సాష్టాంగనమస్కారమని నాకు తెలియును.

**బాబా** : పరిప్రశ్న యనగా నేమి?

**నానా** : ప్రశ్నలడుగుట.

**బాబా** : ప్రశ్న యనగా నేమి?

**నానా** : అదే, అనగా ప్రశ్నించుట.

**బాబా** : పరిప్రశ్న యన్నను ప్రశ్న యన్నను ఒక్కటే యయినచో, వ్యాసుడు 'పరి' యను ప్రత్యయమును ప్రశ్నకు ముందేల యుపయోగించెను? వ్యాసుడు తెలివి తక్కువవాడా?

**నానా** : పరిప్రశ్న యను మాటకు నాకితరయర్థ మేమియు తెలియదు.

**బాబా** : సేవ యనగా నెట్టిది?

**నానా** : ప్రతిరోజు మేము చేయుచున్నట్టిది.

**బాబా** : అట్టి సేవ చేసిన చాలునా?

**నానా** : సేవయను పదమున కింకను వేరే యర్థమేమి గలదో నాకు తోచుట లేదు.

**బాబా** : రెండవ పంక్తిలోని "ఉపదేక్ష్యంతి తే జ్ఞానం" అనుదానిలో జ్ఞానమను పదముపయోగించకుండ యింకొకపదము ఉపయోగించగలవా?

**నానా** : అవును

**బాబా** : ఏ పదము?

**నానా** : అజ్ఞానము.

**బాబా** : జ్ఞానమునకు బదులు అజ్ఞానము ఉపయోగించినచో, ఈ శ్లోకములో నేమైన అర్థము గలదా?

**నానా** : లేదు; శంకరభాష్య మా విధముగా చెప్పుట లేదు.

**బాబా** : వారు చెప్పనిచో పోనిమ్ము, అజ్ఞానము అనుపదము నుపయోగించిన యెడల తగిన యర్థము వచ్చునప్పుడు దాని నుపయోగించుట కేమైన ఆక్షేపణ కలదా?

**నానా** : అజ్ఞానమను పదమును చేర్చి దాని యర్థమును విశదపరచుట నాకు తెలియదు.

**బాబా** : కృష్ణుడు అర్జునుని జ్ఞానులకు తత్త్వదర్శులకు నమస్కారము, ప్రశ్నించుట, సేవ-చేయుమని చెప్పనేల? స్వయముగా కృష్ణుడు తత్త్వదర్శి కాడా? వారు నిజముగా జ్ఞానమూర్తియే కదా!

**నానా** : అవును, అతడు తత్త్వదర్శియే, కాని అర్జును నితరజ్ఞానుల నేల సేవించుమనెనో నాకు తోచుటలేదు.

**బాబా** : నీకది బోధపడలేదా?

నానా సిగ్గుపడెను. అతని గర్వమణగెను. అప్పుడు బాబా ఇట్లు వ్యాఖ్యానించెను.

1. జ్ఞానులముందు ఉత్త సాష్టాంగనమస్కారము చేసినచో సరిపోదు. మనము సద్గురువునకు సర్వస్యశరణాగతి చేయవలెను.

2. ఊరక ప్రశ్నించుట చాలదు. దుర్బుద్ధితోగాని, దొంగయెత్తుతోగాని, వారిని బుట్టలో వేయుటకుగాని, వారి తప్పులను పట్టుటకు గాని, పనికిమాలిన యాసక్తితోగాని యడుగకూడదు. నిజముగా తెలిసికొని దానిచే మోక్షము పొందుటకు గాని, ఆధ్యాత్మికాభివృద్ధికిగాని యడుగవలెను.

3. సేవ యనగా ఇష్టమున్నచో చేయవచ్చును, లేనిచో మానవచ్చుననే యభిప్రాయముతో చేయునది సేవకాదు. శరీరము తనది కాదనియు, దానికి తాను యజమాని కాదనియు శరీరము గురువుగారిదనియు, వారి సేవకొరకే శరీరమున్నదనియు భావింపవలెను. ఇట్లు చేసినచో సద్గురువు శ్లోకములో చెప్పబడిన జ్ఞానమును బోధించును.

గురువజ్ఞానమును బోధించుననగా, నానాకు అర్థముకాలేదు.

బాబా: జ్ఞానము ఉపదేశమెట్లగును? అనగా సాక్షాత్కారము బోధించుట యెట్లు? అజ్ఞానమును నశింపజేయుటయే జ్ఞానము.

జ్ఞానేశ్వరమహారాజు ఇట్లు చెప్పియున్నారు. 'అజ్ఞానమును తొలగించుట ఇట్లు. ఓ అర్జునా! స్వప్నము, నిద్ర తొలగిపోయినచో మిగులునది నీవుగా గ్రహింపుము. జ్ఞానమనగా నజ్ఞానమును నశింప జేయుటయే. చీకటిని తరుముటయే వెలుతురు. ద్వైతమును నశింపచేయుటయే అద్వైతము. ద్వైతమును నశింపజేసెద మనగా, అద్వైతమును గూర్చి చెప్పుట. చీకటిని నశింపజేసెద మనినచో, వెలుతురు గూర్చి చెప్పుట. అద్వైతమును పొందవలెనని నచో, ద్వైతమను భావమును మనలోనుంచి తీసివేయవలెను. అదియే అద్వైతమును పొందు జ్ఞానము. ద్వైతములోనే యుండి అద్వైతమును గూర్చి మాట్లాడగలవా రెవ్వరు? ఎవరైన నట్లు చేసినచో నా స్థితిలోనికి వారు రానిదే వారికి అది యెట్లు తెలియును? దాని నెట్లు పొందెదరు? శిష్యుడు గురువువలె జ్ఞానమూర్తియే. వీరిద్దరికి భేదమేమనగా గ్రహించు తీరు, గొప్ప సాక్షాత్కారము, ఆశ్చర్యకరమైన మానవాతీత సత్వము, మహాశక్తిమత్వము, మరియు ఐశ్వర్యయోగము. సద్గురువు నిర్గుణుడు, సచ్చిదానందుడు. వారు మానవాకారమున అవతరించుట, జగత్తును, మానవాళిని ఉద్ధరించుటకు మాత్రమే. దానివలన వారి యసలయిన నిర్గుణస్వభావము కొంచెము గూడ వికారము చెందదు. వారి సత్యస్వరూపము, దైవికశక్తి, జ్ఞానము తరుగకుండ

నుండును. శిష్యుడు కూడ నట్టిస్వరూపము కలవాడే. కాని యతని అనేకజన్మల యజ్ఞానము తానే శుద్ధచైతన్యమను సంగతిని కప్పివేయును. అతడు "నేను సామాన్య నికృష్టజీవుడను" అనుకొనును. గురువు ఈ యజ్ఞానమును మూలముతో తీసివేయవలెను. తగిన యుపదేశము నివ్వవలెను. లెక్కలేనన్ని జన్మలనుంచి సంపాదించిన యజ్ఞానమును గురువు నిర్మూలించి యుపదేశించ వలెను. ఎన్నో జన్మలనుంచి తాను నికృష్టజీవుడ ననుకొను శిష్యునికి గురువు "నీవే దైవము, శక్తి యుతుడవు, ఐశ్వర్యశాలివి" అని బోధించును. అప్పుడు శిష్యుడు కొంచెము కొంచెముగా తానే దైవమని గ్రహించును. తాను శరీరమనియు, తానొక జీవిననియు లేదా యహంకారమనియు, దేవుడు, లోకము తనకంటె వేరనియు తలంచు నితాంతభ్రమ అనేకజన్మలనుంచి వచ్చుచున్న దోషము. దానిపై నాధారపడి చేసిన కర్మలనుండి వానికి సంతోషము, విచారము, ఈ రెంటియొక్క మిశ్రమము కలుగును. ఈ భ్రమను, ఈ దోషమును, ఈ మూల అజ్ఞానమును గూర్చి అతడు విచారమారంభించవలెను. ఈ అజ్ఞానమెట్లు అంకురించినది? అది యెక్కడ నున్నది? అను దానిని చూపుటయే గురూపదేశమందురు. ఈ దిగువ వివరించినవి యజ్ఞానలక్షణములు :

1. నేను జీవిని (ప్రాణిని).
2. శరీరమే యాత్మ (నేను శరీరమును).
3. భగవంతుడు, ప్రపంచము, జీవుడు వేర్వేరు.
4. నేను దేవుడను కాను.
5. శరీర మాత్మకాదని తెలిసికొనకుండుట.
6. దేవుడు, జీవుడు, ప్రపంచము ఒకటేయని తెలియకుండుట.

ఈ తప్పులన్నియు చూపించనిదే, శిష్యుడు దేవుడనగా, ప్రపంచమనగా శరీరమనగానేమో తెలియజాలడు. వానిలో వానికి ఎట్టి సంబంధము కలదో ఒకటి యింకొకటికంటె వేరైనదా లేక రెండును ఒకటేనా యనుసంగతి గ్రహింప జాలడు. ఈ సంగతులను బోధించుటకు వాని యజ్ఞానము నశింపజేయుటకు చెప్పునది జ్ఞానమా? అజ్ఞానమా? జ్ఞానమూర్తియైన జీవునకు జ్ఞానోపదేశము చేయనేల? ఉపదేశమనునది వాని తప్పును వానికి చూపి వాని యజ్ఞానమును నశింపజేయుటకొరకే. బాబా యింకను ఇట్లనెను:

1. ప్రణిపాత మనగా శరణాగతి చేయుట. 2. శరణాగతియనగా తను (శరీరము), మన (మనస్సు), ధనముల (ఐశ్వర్యము) నర్పించుట. 3. శ్రీకృష్ణుడు అర్జునుని ఇతర జ్ఞానుల నాశ్రయించు మననేల?

సద్భక్తుడు సర్వము వాసుదేవమయముగా భావించును. భక్తుడు ఏ గురువునైన శ్రీకృష్ణునిగనే భావించును. గురువు శిష్యుని వాసుదేవుడుగాను, శ్రీకృష్ణుడు ఇద్దరిని తన ప్రాణము, ఆత్మలుగాను భావించును. అటువంటి భక్తులు, గురువులు గలరని శ్రీకృష్ణుడు తెలిసి యుండుటచే, వారినిగూర్చి అర్జునునికి చెప్పెను. అట్టివారి గొప్పతనము హెచ్చి యందరికి తెలియవలెననియే కృష్ణుడట్లు పేర్కొనెను.

## సమాధిమందిర నిర్మాణము

బాబా తాను చేయ నిశ్చయించుకొనిన పనులగూర్చి ఎప్పుడును మాట్లాడువారు కారు. ఏమి సందడి చేయువారు కారు. సంగతి సందర్భములను వాతావరణమును మిక్కిలి యుక్తిగా నేర్పరచి తప్పనిసరి పరిస్థితులు కలిగించుచుండువారు. అందుకు సమాధిమందిర నిర్మాణము ఒక ఉదాహరణము.

నాగపూరు కోటీశ్వరుడు, శ్రీమాన్ బాపూసాహెబు బూటీ శిరిడీలో సకుటుంబముగా నుండెడివాడు. అతనికి అచట సొంత భవనముండిన బాగుండునని యాలోచన కలిగెను. కొన్నాళ్ళ పిదప దీక్షిత్ వాడాలో నిద్రించుచుండగా అతనికొక దృశ్యము కనిపించెను. బాబా స్వప్నములో నగుపడి యొక వాడాను మందిరముతో సహ నిర్మించుమనెను. అచ్చట నిద్రించుచున్న శ్యామాకు కూడ అట్టి దృశ్యము గనిపించెను. బాపూసాహెబు లేచి శ్యామా యేడ్చుచుండుట చూచి కారణమడిగెను. శ్యామా యిట్లు చెప్పెను. "బాబా నా దగ్గరకు వచ్చి ఒక మందిరముతో సహా వాడాను నిర్మింపుము. నేను అందరి కోరికలను నెరవేర్చెద ననెను. బాబా ప్రేమమధురమైన పలుకులు విని, భావావేశమున మైమరచితిని; నా గొంతుక యార్చుకొనిపోయెను. నా కండ్లనుండి నీరు కారుచుండెను. నేను ఏడ్చుట మొదలిడితిని." వారిద్దరి దివ్యస్వప్నములు ఒకటే యయినందులకు

బాపూసాహెబు బూటీ విస్మయమందెను. ధనవంతుడగుటచేతను, చేతనయినవాడగుటచేతను, అచ్చటొక వాడాను నిర్మించుటకు నిశ్చయించుకొని మాధవరావు (శ్యామా) సహాయముతో ఒక ప్లాను గీసెను. కాకాసాహెబు దీక్షిత్ దాని నామోదించెను. దానిని బాబా ముందర పెట్టగా, బాబా కూడ వెంటనే యామోదించెను. కట్టుట ప్రారంభించిరి. శ్యామా పర్యవేక్షణ చేయుచుండెను. భూమ్యుపరిగృహము, భూగృహము, బావి పూర్తియయ్యెను. బాబా కూడ లెండీకి పోవునప్పుడు, తిరిగి వచ్చునప్పుడు కొన్ని మార్పులను సూచించుచు సలహాలను ఇచ్చుచుండెను. మిగిలిన పనియంతయు బాపూసాహెబు జోగును చూడుమనిరి. అది నిర్మించునప్పుడు, బాపూసాహెబు బూటీకి ఒక యాలోచన కలిగెను. చుట్టూ గదులుండి, దాని మధ్యనొక విశాలమైన హాలులో మురళీధరుని (శ్రీకృష్ణుని) ప్రతిమను ప్రతిష్ఠ చేయవలెనని తట్టెను. బాబాకీ సంగతి తెలియజేసి వారి యభిప్రాయమును కనుగొనవలెనని శ్యామాకు చెప్పెను. వాడా ప్రక్కనుంచి బాబా పోవుచుండగా వారిని శ్యామా యీ విషయము నడుగగా బాబా యందులకు సమ్మతించి "దేవాలయము పూర్తికాగానే నేనే యచ్చట నివసించుటకు వచ్చెదను" అని వాడావయిపు జూచుచు "వాడా పూర్తియయిన పిమ్మట మనమే దానిని ఉపయోగించుకొనవలెను. మనమందర మచ్చట నుందము. అందరు కలసి మెలసి యాడుకొందము. ఒకరి నొకరు కౌగిలించుకొని సంతోషముగా నుండవచ్చును" అనెను. దేవస్థాన మధ్యమందిరము కట్టుట కది తగిన శుభసమయమా యని శ్యామా యడుగగా, బాబా సమ్మతించుటచే శ్యామా కొబ్బరికాయ తెచ్చి పగులగొట్టి పనిని ప్రారంభించెను. కొద్దికాలములో పని పూర్తి యాయెను. మురళీధర్ విగ్రహము తయారు చేయుట కాజ్ఞాపించిరి.

అది తయారు కాకమునుపే క్రొత్త సంగతి జరిగెను. బాబాకు తీవ్రమైన జ్వరము వచ్చెను. వారు కాయమును విడుచుటకు సిద్ధముగా నుండిరి. బాపూసాహెబు మిక్కిలి విచారగ్రస్తుడాయెను; నిరాశపడెను. బాబా సమాధి చెందినచో, తన వాడా బాబా పాదములచే పవిత్రము కాదనియు, తాను మదుపు పెట్టిన లక్షరూపాయలు వ్యర్థమగుననియు చింతించెను. కాని బాబా సమాధి చెందక ముందు "నన్ను రాతి వాడాలో నుంచుడు!" అన్నట్టి పలుకులు

బాపూసాహెబుకే గాక యందరికి ఊరట కలిగించెను. సకాలమున బాబా పవిత్రశరీరమును మధ్యమందిరములో బెట్టి సమాధి చేసిరి. ఇట్లు మురళీధరుని కొరకు నిర్ణయించిన స్థలమునందు బాబాను సమాధిచేయుటచే బాబాయే మురళీధరుడనియు, బూటీవాడాయే సమాధిమందిరమనియు అర్థము గ్రహించవలెను. వారి విచిత్రజీవితము లోతును కనుగొన శక్యముగాదు. తాను కట్టించిన వాడాలో బాబా పవిత్ర శరీరము సమాధి యగుటచే బాపూసాహెబ్ బూటీ మిగుల ధన్యుడు, అదృష్టశాలి.

శ్రీసాయినాథాయ నమః

**ముప్పదితొమ్మిదవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నలుబదియవ అధ్యాయము

*బాబా కథలు: 1. దేవుగారి యింటిలో ఉద్యాపనకు బాబా సన్యాసి వేషముతో మరి యిద్దరిని తోడ్కొని పోవుట. 2. హేమాడ్‌పంతు ఇంటికి ఫోటో రూపములో పోవుట.*

**ఈ** యధ్యాయములో రెండు కథలు చెప్పెదము 1. దహనులో బి.వి. దేవుగారింటికి వారి తల్లి యాచరించిన ఉద్యాపన వ్రతమునకు బాబా వెళ్ళుట. 2. బాంద్రాలోని హేమాడ్‌పంతు ఇంటికి హోళీ పండుగనాడు భోజనమునకు పోవుట.

**తొలిపలుకు**

శ్రీసాయిసమర్థుడు పావనమూర్తి. తన భక్తుల కిహపరవిషయములందు తగిన సలహాల నిచ్చి జీవితపరమావధిని పొందునట్లు చేసి వారిని సంతోషపెట్టును. సాయి తన హస్తమును భక్తుల తలపై పెట్టి తమ శక్తులను వారిలోనికి పంపించి భేదభావమును నశింపజేసి, అప్రాప్యమును ప్రాప్తింపజేయును. వారు తమ భక్తుల యెడ భేదము లేక, తమకు నమస్కరించిన వారిని ఆదరముతో అక్కునజేర్చుకొనెడి వారు. వర్షాకాలములో నదులు కలియు సముద్రమువలె బాబా భక్తులతో కలిసి తమ శక్తిని స్థాయిని శిష్యుల కిచ్చును. దీనినిబట్టి, యెవరయితే భగవద్భక్తుల లీలలను పాడెదరో వారు భగవంతుని లీలలను పాడినవారికంటెగాని, యంతకంటె యెక్కువగాని దేవుని ప్రేమకు పాత్రులగుదురని తెలియవలెను. ఇక ఈ అధ్యాయములోని కథల వైపు మరలుదము.

## దేవుగారింట ఉద్యాపనవ్రతము

దహనులో బి.వి. దేవుగారు మామలతదారుగా నుండెను. వారి తల్లి 25, 30 నోములు నోచెను. వాని ఉద్యాపన చేయవలసి యుండెను. ఈ కార్యములో 100, 200 మంది బ్రాహ్మణులకు భోజనము పెట్టవలసియుండెను. ఈ శుభకార్యమునకు ముహూర్తము నిశ్చయమయ్యెను. దేవుగారు బాపూసాహెబు జోగ్‌గారి కొక లేఖ వ్రాసిరి. అందులో బాబా ఈ శుభకార్యమునకు దయ చేయ వలయుననియు, వారు రాకున్నచో అసంతృప్తికరముగా నుండుననియు వ్రాసెను. జోగ్ ఆ యుత్తరము చదివి బాబాకు వినిపించెను. మనఃపూర్వకమయిన విజ్ఞాపనను విని బాబా యిట్లనియె. *"నన్నే గుర్తుంచుకొనువారిని నేను మరువను. నాకు బండిగాని, టాంగాగాని, రైలుగాని, విమానముగాని యవసరము లేదు. నన్ను ప్రేమతో బిలుచువారి యొద్దకు నేను పరుగెత్తిపోయి ప్రత్యక్షమయ్యెదను. అతనికి సంతోషమయిన జవాబు వ్రాయుము. నీవు, నేను, ఇంకొకరు సంతర్పణకు వచ్చెదమని వ్రాయుము."* జోగ్ బాబా చెప్పినది దేవుకు వ్రాసెను. దేవుగారెంతో సంతసించిరి. కాని బాబా రహతా, రుయీ, నీమగాం దాటి ప్రత్యక్షముగా ఎక్కడికి పోరని ఆయనకు తెలియును. బాబాకు అశక్యమైనదేమియు లేదు. వారు సర్వాంతర్యామి యగుటచే హఠాత్తుగా నేరూపమున నయిన వచ్చి, తమ వాగ్దానమును పాలించవచ్చు ననుకొనెను.

ఉద్యాపనకు కొద్దిరోజులు ముందుగా, బెంగాలీ దుస్తులను ధరించిన సన్యాసి యొకడు గోసంరక్షణకయి సేవచేయుచు దహను స్టేషన్ మాస్టరు వద్దకు చందాలు వసూలుచేయు మిషతో వచ్చెను. స్టేషన్ మాస్టరు, సన్యాసిని ఊరి లోనికి పోయి మామలతదారుని కలిసికొని వారి సహాయముతో చందాలు వసూలు చేయుమనెను. అంతలో మామలతదారే యచ్చటికి వచ్చెను. స్టేషనుమాస్టరు సన్యాసిని దేవుగారికి పరిచయమొనర్చెను. ఇద్దరు ప్లాట్‌ఫారమ్ మీద కూర్చుండి మాట్లాడిరి. దేవు, ఊరిలో నేదో మరొక చందా పట్టి రావుసాహెబు నరోత్తమ శెట్టి నడుపుచుండుటచే, నింకొకటి యిప్పుడే తయారు చేయుట బాగుండదని చెప్పి 2 లేదా 4 మాసముల పిమ్మట రమ్మనెను. ఈ

మాటలు విని సన్యాసి యచటనుండి పోయెను. ఒక నెల పిమ్మట యా సన్యాసి యొక టాంగాలో వచ్చి 10 గంటలకు దేవుగారి యింటిముందర ఆగెను. చందాల కొరకు వచ్చెనేమోయని దేవు అనుకొనెను. ఉద్యాపనకు కావలసిన పనులలో దేవుగారు నిమగ్నులై యుండుట జూచి, తాను చందాలకొరకు రాలేదనియు భోజనమునకై వచ్చితినని సన్యాసి చెప్పెను. అందుకు దేవు *"మంచిది! చాల మంచిది! మీకు స్వాగతము. ఈ గృహము మీదే!"* యనెను. అప్పుడు సన్యాసి *"ఇద్దరు కుఱ్ఱవాళ్ళు నాతో నున్నారు"* అనెను. దేవు *"మంచిది, వారితో కూడ రండు!"* అనెను. ఇంకా రెండుగంటల కాలపరిమితి యుండుటచే, వారికొరకు ఎచ్చటికి పంపవలెనని యడిగెను. సన్యాసి ఎవరిని బంపనవసరము లేదనియు తామే స్వయముగా వచ్చెదమనియు చెప్పెను. సరిగా 12 గంటలకు రమ్మని దేవు చెప్పెను. సరిగా 12 గంటలకు ముగ్గురు వచ్చి సంతర్పణలో భోజనము చేసిన పిమ్మట వెడలి పోయిరి.

ఉద్యాపన పూర్తికాగానే దేవుగారు బాపూసాహెబు జోగుకు ఉత్తరము వ్రాసెను. అందులో బాబా తన మాట తప్పెనని వ్రాసెను. జోగు ఉత్తరము తీసికొని బాబా వద్దకు వెళ్ళెను. దానిని తెరువకమునుపే బాబా యిట్లనెను. *"హా! వాగ్దానము చేసి, దగా చేసితి ననుచున్నాడు. ఇద్దరితో కూడ నేను సంతర్పణకు హాజరయితిని. కాని నన్ను పోల్చు కొనలేకపోయెనని వ్రాయుము. అట్టివాడు నన్ను పిలువనేల? సన్యాసి చందాల కొరకు వచ్చెనని యనుకొనెను. అతని సంశయమును తొలగించుటకే మరిద్దరితో వచ్చెదనంటిని. ముగ్గురు సరిగా భోజనము వేళకు వచ్చి యారగించలేదా? నా మాట నిలబెట్టుకొనుటకు ప్రాణములనైన విడిచెదను. నా మాటలను నేనెప్పుడూ పొల్లు చేయను."* ఈ జవాబు జోగ్ హృదయములో నానందము కలుగజేసెను. బాబా సమాధాన మంతయు దేవుగారికి వ్రాసెను. దానిని చదువగనే దేవుకు ఆనందబాష్పములు దొరలెను. అనవసరముగా బాబాను నిందించినందులకు పశ్చాత్తాపపడెను. సన్యాసి మొదటి రాకచే తానెట్లు మోసపోయెనో; సన్యాసి చందాలకు వచ్చుట, మరిద్దరితో కలిసి భోజనమునకు వచ్చెదనను మాటలు తాను గ్రహింపలేక మోసపోవుట - మొదలైనవి అతనికి ఆశ్చర్యము కలుగజేసెను.

భక్తులు పూర్ణముగా సద్గురువును శరణు వేడినచో, వారు తమ భక్తుల యిండ్లలో శుభకార్యములను సవ్యముగా నెరవేరునట్లు జూచెదరు అనునది యీ కథవల్ల స్పష్టపడుచున్నది.

**హేమాడ్‌పంతు ఇంట హోళీ పండుగ భోజనము**

ఇక బాబా తన ఫోటో రూపమున సాక్షాత్కరించి భక్తుని కోరిక నెరవేర్చిన మరొక కథను చెప్పెదము.

1917వ సంవత్సరము హోళీ పండుగనాడు వేకువఝామున హేమాడ్ పంతుకొక దృశ్యము కనిపించెను. చక్కని దుస్తులు ధరించిన సన్యాసివలె బాబా కాన్పించి, నిద్రనుండి లేపి ఆనాడు భోజనమునకు వారింటికి వచ్చెదనని చెప్పెను. ఇట్లు తనను నిద్రనుంచి లేపినది కూడ కలలోని భాగమే. నిజముగా లేచి చూచుసరికి సన్యాసిగాని, బాబాగాని కనిపించలేదు. స్వప్నమును బాగుగా గుర్తుకు దెచ్చుకొనగా, సన్యాసి చెప్పిన ప్రతిమాట జ్ఞాపకమునకు వచ్చెను. బాబాగారి సహవాసము ఏడు సంవత్సరములనుండి యున్నప్పటికి, బాబా ధ్యానము నెల్లప్పుడు చేయుచున్నప్పటికి, బాబా తన యింటికి వచ్చి భోజనము చేయునని అతడనుకొనలేదు. బాబా మాటలకు మిగుల సంతసించి తన భార్యవద్దకు బోయి ఒక సన్యాసి భోజనమునకు వచ్చునుగాన, కొంచెము బియ్యము ఎక్కువ పోయవలెనని చెప్పెను. అది హోళీ పండుగదినము. వచ్చువారెవరని ఎక్కడనుంచి వచ్చుచున్నారని యామె యడిగెను. ఆమె ననవసరముగా పెడదారి పట్టించక ఆమె యింకొక విధముగా భావింపకుండునట్లు, జరిగినది జరిగినట్లుగా చెప్ప నెంచి, తాను గాంచిన స్వప్నమును తెలియజేసెను. శిరిడీలో మంచి మంచి పిండివంటలను విడిచి బాబా తనవంటివారింటికి బాంద్రాకు వచ్చునాయని, యామెకు సంశయము కలిగెను. అందులకు హేమాడ్‌పంతు బాబా స్వయముగా రాకపోవచ్చు, కాని ఎవరినైన బంపవచ్చును కనుక కొంచెము బియ్యము ఎక్కువ పోసినచో నష్టము లేదనెను.

మధ్యాహ్నభోజనమునకై ప్రయత్నము లన్నియు చేసిరి. మిట్ట మధ్యాహ్నమునకు సర్వము సిద్ధమయ్యెను. హోళీ పూజ ముగిసెను. విస్తళ్ళు

వేసిరి, ముగ్గులు పెట్టిరి. భోజనమునకు రెండు పంక్తులు తీర్చిరి. రెండింటిమధ్య నొక పీట బాబాకొరకు కమర్చిరి. గృహములోని వారందరు కొడుకులు, మనుమలు, కుమార్తెలు, అల్లుండ్రు మొదలగువారందరు వచ్చి వారివారి స్థలముల నలంకరించిరి. వండిన పదార్థములు వడ్డించిరి. అందరు అతిథి కొరకు కనిపెట్టుకొని యుండిరి. 12 గంటలు దాటినప్పటికి ఎవరు రాలేదు. తలుపు వేసి గొండ్లెము పెట్టిరి. అన్నశుద్ధి యయ్యెను, అనగా నెయ్యి వడ్డించిరి. భోజనము ప్రారంభించుట కిది యొక గుర్తు. అగ్నిహోత్రునకు శ్రీ కృష్ణునకు నైవేద్యము నమర్పించిరి.అందరు భోజనము ప్రారంభింపబోవుచుండగా, మేడ మెట్లపై చప్పుడు వినిపించెను. హేమాడ్‌పంతు వెంటనే పోయి తలుపు తీయగా ఇద్దరు మనుష్యులచట నుండిరి. ఒకరు అలీమహమ్మద్ వేరొకరు మౌలానా ఇస్మూముజావర్. ఆ యిరువురు వడ్డన మంతయు పూర్తియై అందరును భోజనము చేయుటకు సిద్ధముగా నుండుటను గమనించి హేమాడ్‌పంతును క్షమించుమని కోరి యిట్లు చెప్పిరి. "భోజన స్థలము విడిచి పెట్టి మా వద్దకు పరుగెత్తుకొని వచ్చితివి. తక్కినవారు నీకొరకు చూచుచున్నారు. కావున, ఇదిగో నీ వస్తువును నీవు తీసుకొనుము. ఆ తరువాత తీరుబడిగా వృత్తాంత మంతయు దెలిపెదము." అట్లనుచు తమ చంకలోనుంచి ఒక పాత వార్తాపత్రికలో కట్టిన పటమును విప్పి టేబిల్‌పైన బెట్టిరి. హేమాడ్‌పంతు కాగితము విప్పి చూచుసరికి అందులో పెద్దది యగు చక్కని సాయిబాబా పటముండెను. అతడు మిగుల ఆశ్చర్యపడెను. అతని మనస్సు కరగెను. కండ్లనుండి నీరు కారెను. శరీరము గగుర్పాటు చెందెను. అతడు వంగి పటములోనున్న బాబా పాదములకు నమస్కరించెను. బాబా యీ విధముగా తన లీలచే ఆశీర్వదించెనని యనుకొనెను. గొప్ప యాసక్తితో నీకా పటమెట్లు వచ్చెనని అలీమహమ్మద్‌ను అడిగెను. అతడా పటమొక యంగడిలో కొంటిననియు, దానికి సంబంధించిన వివరములన్నియు తరువాత తెలియజేసెద ననెను. తక్కినవారు భోజనమునకు కనిపెట్టుకొని యుండుటచే త్వరగా పొమ్మని యనెను. హేమాడ్‌పంతు వారికి అభినందనలు తెల్పి భోజనశాలలోనికి బోయెను. ఆ పటము బాబా కొరకు వేసిన పీటపయి బెట్టి వండిన పదార్థములన్నియు వడ్డించి, నైవేద్యము పెట్టినపిమ్మట అందరు

భుజించి సకాలమున పూర్తి చేసిరి. పటములో నున్న బాబాయొక్క చక్కని రూపును జూచి యందరు అమితానందభరితులయిరి. ఇదంతయు నెట్లు జరిగెనని యాశ్చర్యపడిరి.

ఈ విధముగా బాబా హేమాడ్‌పంతుకు స్వప్నములో జెప్పిన మాటలను నెరవేర్చి తన వాగ్దానమును పాలించుకొనెను. ఆ ఫోటో వివరములు అనగా నది అలీమహమ్మదు కెట్లు దొరికెను? అతడెందుకు తెచ్చెను. దానిని హేమాడ్‌పంతు కెందుకిచ్చెను? అనునవి వచ్చే అధ్యాయములో చెప్పుకొందము.

శ్రీసాయినాథాయ నమః

**నలుబదియవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నలుబదియొకటవ అధ్యాయము

1. చిత్రపటము యొక్క వృత్తాంతము; 2. గుడ్డపీలికలను దొంగిలించుట. 3. జ్ఞానేశ్వరి పారాయణము.

గతఅధ్యాయములో చెప్పిన ప్రకారము ఈ అధ్యాయములో చిత్రపటము యొక్క వృత్తాంతమును చెప్పెదము. గత అధ్యాయములోని విషయము జరిగిన 9 సంవత్సరములకు అలీ మహమ్మద్, హేమాడ్‌పంతును కలిసి ఈ దిగువ కథ నతనికి జెప్పెను.

ఒకనాడు బొంబాయి వీథులలో బోవునప్పుడు, వీథిలో తిరిగి యమ్మువానివద్ద అలీమహమ్మద్ సాయిబాబా పటమును కొనెను. దానికి చట్రము కట్టించి, తన బాంద్రా యింటిలో గోడకు వ్రేలాడ దీసెను. అతడు బాబాను ప్రేమించుటచే ప్రతిరోజు చిత్రపటము దర్శనము చేయుచుండెను. హేమాడ్‌పంతుకు ఆ పటమిచ్చుటకు 3 నెలల ముందు అతడు కాలుమీద కురుపులేచి బాధపడుచుండెను. దానికి శస్త్రచికిత్స జరిగెను. అప్పుడతడు బొంబాయిలో నున్న తన బావమరిదియగు నూర్‌మహమ్మద్ పీర్‌భాయి యింటిలో పడియుండెను. బాంద్రాలో తన యిల్లు 3 మాసములవరకు మూయబడి యుండెను. అక్కడ ఎవ్వరును లేకుండిరి. అచ్చట ప్రసిద్ధి జెందిన అబ్దుల్‌రహమాన్ బాబా, మౌలానాసాహెబు, మహమ్మద్ హుసేను, సాయిబాబా, తాజుద్దీన్ బాబా మొదలగు (సజీవ) యోగుల పటము లుండెను.

వానిని కూడ కాలచక్రము విడువలేదు. అతడు వ్యాధితో బాధపడుచు బొంబాయిలో నుండెను. బాంద్రాలో ఆ పటము లేల బాధపడవలెను? పటములకు గూడ చాప్పుట్టుక లున్నట్లుండెను. పటములన్నియు వానివాని యదృష్టము లనుభవించెను; కాని సాయిబాబా పటము మాత్రము ఆ కాలచక్రమును తప్పించుకొనెను. అదెట్లు తప్పించుకొన గలిగెనో నాకింతవరకెవరు చెప్పలేరైరి. దీనినిబట్టి సాయిబాబా సర్వాంతర్యామి యనియు, సర్వవ్యాపి యనియు ననంతశక్తుడనియు దెలియుచున్నది.

అలీమహమ్మద్ అనేక సంవత్సరముల క్రిందట యోగియగు అబ్దుల్ రహమాన్ బాబా యొక్క చిన్న పటమును మహమ్మద్ హుసేన్ థారియా వద్ద సంపాదించెను. దానిని తన బావమరిదియగు నూర్ మహమ్మద్ పీర్‌భాయికి ఇచ్చెను. అది యతని టేబిల్‌లో 8 సంవత్సరములు పడియుండెను. ఒకనాడు అతడు దానిని జూచెను. అతడు దానిని ఫోటోగ్రాఫర్ దగ్గరకు తీసికొనిపోయి సజీవప్రమాణమంత పెద్దదిగా చేయించి దాని ప్రతులను తన బంధువులకు, స్నేహితులకు పంచిపెట్టెను. అందులో నొకటి అలీమహమ్మద్ కిచ్చెను. దాని నతడు తన బాంద్రా యింటిలో బెట్టెను. నూర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్‌గారి శిష్యుడు. గురువు నిండు దర్బారులో నుండగా నతడు గురువుగారికి దీనిని కానుకగా నిచ్చుటకు పోగా వారు మిక్కిలి కోపించి కొట్టబోయి నూర్ మహమ్మదు నచటినుండి తరిమి వేసిరి. అతడు మిగుల విచారపడి చికాకు పొందెను. తన ద్రవ్యమంతయు నష్టపడుటయేగాక గురువుగారి కోపమునకు, అసంతుష్టికి కారణమాయెనుగదా యని చింతించెను. విగ్రహారాధన గురువుగారికి ఇష్టము లేకుండెను. ఆ పటమును అపోలో బందరుకు తీసుకొని పోయి, ఒక పడవను అద్దెకు గట్టించుకొని సముద్రములోనికి పోయి, దాని నక్కడ నీళ్ళలో ముంచివేసెను. తన బంధువుల వద్దనుంచి స్నేహితుల వద్దనుంచి పటములను తెప్పించి (6 పటములు) వానిని కూడ బాంద్రా సముద్రములో ముంచెను. ఆ సమయమున అలీమహమ్మద్ తన బావమరిది యింటిలోనుండెను. యోగుల పటములను సముద్రములో పడవైచినచో తన వ్యాధి కుదురునని బావమరిది చెప్పెను. ఇది విని అలీమహమ్మద్ తన మేనేజర్‌ను బాంద్రా యింటికి పంపి యక్కడున్న పటముల నన్నింటిని సముద్రములో వేయించెను.

రెండునెలల పిమ్మట అలీమహమ్మద్ తన ఇంటికి తిరిగి రాగా బాబాపటము ఎప్పటివలె గోడమీద నుండుట గమనించి యాశ్చర్యపడెను. తన మేనేజరు పటములన్ని దీసివైచి బాబా పటము నెట్లు మరచెనో అతనికే తెలియకుండెను. వెంటనే దానిని తీసి బీరువాలో దాచెను. లేకున్న తన బావగారు దానిని చూచినచో దానిని కూడ నాశనము చేయునని భయపడెను. దాని నెవరికివ్వవలెను? దానిని నెవరు జాగ్రత్త పరచెదరు? దానిని భద్రముగా నెవరుంచగలరు? అను విషయముల నాలోచించుచుండగా సాయిబాబాయే ఇస్మముజావర్‌ను కలిసి వారి యభిప్రాయము ప్రకారము చేయవలసినదని తోచునట్లు చేసెను. అలీమహమ్మద్ ఇస్మముజావర్‌ను కలిసికొని జరిగినదంతయు చెప్పెను. ఇరువురును బాగుగా ఆలోచించి యా పటమును హేమాడ్‌పంతు కివ్వ నిశ్చయించిరి. అతడు దానిని జాగ్రత్తపరచునని తోచెను. ఇద్దరును హేమాడ్‌పంతు వద్దకు బోయి సరియైన కాలములో దానిని బహూకరించిరి.

ఈ కథను బట్టి బాబాకు భూతభవిష్యద్వర్తమానములు తెలియుననియు, చాకచక్యముగా సూత్రములు లాగి తన భక్తుల కోరికలు నెట్టుల నెరవేర్చుచుండెనో కూడ తెలియుచున్నది. ఎవరికయితే ఆధ్యాత్మికవిషయములలో నెక్కువ శ్రద్ధయో వారిని బాబా ప్రేమించుటే కాక వారి కష్టములను తొలగించి వారిని ఆనందభరితులుగా జేయుచుండిరని రాబోవు కథవలన తెలియును.

### గుడ్డపీలికలను దొంగిలించుట - జ్ఞానేశ్వరి చదువుట

బి.వి. దేవు దహనులో మామలతదారు. అతడు జ్ఞానేశ్వరిని, ఇతరమత గ్రంథములను చదువవలెనని చాలకాలము నుండి కోరుచుండెను. భగవద్గీతపై మరాటీ భాషలో జ్ఞానేశ్వరుడు వ్రాసిన వ్యాఖ్యయే జ్ఞానేశ్వరి. ప్రతిదినము భగవద్గీతలో నొక యధ్యాయమును ఇతరగ్రంథములనుండి కొన్ని భాగములను పారాయణము చేయుచుండెను. కాని జ్ఞానేశ్వరిని ప్రారంభించగనే ఏవో అవాంతరము లేర్పడుటచే పారాయణ మాగిపోవుచుండెను. మూడు నెలలు సెలవు పెట్టి శిరిడీకి వెళ్ళి యక్కడనుండి తన స్వగ్రామమగు పౌండకు బోయెను. ఇతరగ్రంథములన్నియు నచట చదువగలిగెను. కాని జ్ఞానేశ్వరి ప్రారంభించగనే యేమో విపరీతమైన

చెడ్డయాలోచనలు తన మనస్సున ప్రవేశించుటచే చదువలేకుండెను. అతడెంత ప్రయత్నించినను కొన్ని పంక్తులు కూడ చదువలేకపోయెను. కాబట్టి బాబా తనకు ఆ గ్రంథమందు శ్రద్ధ కలుగ జేసినప్పుడే, దానిని చదువుమని వారి నోటివెంట వచ్చినప్పుడే, దానిని ప్రారంభించెదననియు అంతవరకు దానిని తెరువననియు, నిశ్చయము చేసికొనెను. అతడు 1914వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో కుటుంబసహితముగా శిరిడీకి వెళ్ళెను. అక్కడ ప్రతిదినము జ్ఞానేశ్వరి చదువుచుంటివాయని బాపూసాహెబు జోగ్, దేవుగారి నడిగెను. దేవు తనకు అట్టి కోరిక గలదనియు, కాని దానిని చదువుటకు శక్తి చాలకుండెననియు, బాబా యాజ్ఞాపించినచో దానిని ప్రారంభించెదననియు చెప్పెను. అప్పుడు జోగ్, ఒక పుస్తకమును దీసికొని బాబా కిచ్చినచో, దానిని వారు తాకి పవిత్రము చేసి యిచ్చెదరనియు అప్పటినుండి నిరాటంకముగా చదువవచ్చుననియు దేవుకు సలహా నిచ్చెను. బాబాకు తన యుద్దేశము తెలియును గనుక దేవుగా రట్లు చేయుటకు అంగీకరించలేదు. బాబా తన కోరికను గ్రహించలేరా? దానిని పారాయణ చేయుమని స్పష్టముగా నాజ్ఞాపించలేరా? యనెను.

దేవు బాబాను దర్శించి, ఒక రూపాయి దక్షిణ నిచ్చెను. బాబా 20 రూపాయలు దక్షిణ యడుగగా దానిని చెల్లించెను. ఆనాడు రాత్రి బాలకరాముడను వానిని కలిసికొని యతడు బాబాయందు భక్తిని వారి యనుగ్రహమును ఎట్లు సంపాదించెనని ప్రశ్నించెను. మరుసటి దినము హారతి పిమ్మట అంతయు దెలిపెదనని యతడు బదులిచ్చెను. ఆ మరుసటి దినము దర్శనము కొరకు దేవు వెళ్ళగా బాబా అతనిని 20 రూపాయలు దక్షిణ ఇమ్మనెను. వెంటనే దేవు దానిని చెల్లించెను. మసీదు నిండా జనులు నిండి యుండుటచే దేవు ఒక మూలకు బోయి కూర్చుండెను. బాబా అతనిని బిలచి శాంతముగా తన దగ్గర కూర్చొనుమనియెను. దేవు అట్లనే చేసెను. మధ్యాహ్నహారతి పిమ్మట భక్తులందరు పోయిన తరువాత దేవు, బాలకరాముని జూచి యాతని పూర్వవృత్తాంతముతో పాటు బాబా యాతని కేమేమి చెప్పెనో, ధ్యానము నెట్లు నేర్పిరో యని యడుగగా బాలకరాముడు వివరములు చెప్పుటకు సిద్ధపడెను. అంతలో బాబా చంద్రు అను కుష్ఠురోగభక్తుని బంపి దేవును తీసికొని రమ్మనెను. దేవు బాబా వద్దకు బోగా నెవరితో ఏమి మాట్లాడుచుంటివని బాబా యడిగెను. బాలకరామునితో మాట్లాడుచుంటిననియు, బాబా కీర్తిని వినుచుంటిననియు అతడు చెప్పెను. తిరిగి బాబా 25 రూపాయలు

దక్షిణ అడిగెను. వెంటనే దేవు సంతోషముతో దక్షిణ చెల్లించెను. అతనిని బాబా లోపలకు దీసికొనిపోయి స్తంభము వద్ద కూర్చుండి. "*నా గుడ్డ పీలికలను నాకు దెలియకుండ దొంగిలించితి వేల?*" యనెను. దేవు తనకు ఆ గుడ్డ పీలికలగూర్చి యేమియు తెలియదనెను. బాబా యతనిని వెదకుమనెను. అతడు వెదకెను. కాని యచ్చట ఏమియు దొరకలేదు. బాబా కోపగించి యిట్లనెను. "*ఇక్కడ ఇంకెవ్వరు లేరు. నీ వొక్కడవే దొంగవు. ముసలితనముచే వెంట్రుకలు పండినప్పటికి ఇచ్చటకు దొంగిలించుటకు వచ్చితివా?*" యని కోపగించెను. బాబా మతిచెడినవానివలె తిట్టి కోపగించి చివాట్లు పెట్టెను. దేవు నిశ్శబ్దముగా కూర్చుండెను. దేవు తాను సటకా దెబ్బలుకూడ తినునేమో యనుకొనెను. ఒక గంట తరువాత బాబా యతనిని వాడాకు వెళ్ళు మనెను. దేవు అచ్చటికేగి జరిగినదంతయు జోగుకు, బాలకరామునకు తెలియజేసెను. సాయంకాల మందరిని రమ్మని బాబా కబురు పంపెను. ముఖ్యముగా దేవును రమ్మనెను. "*నా మాటలు వృద్ధుని బాధించి యుండవచ్చునుగాని, యతడు దొంగిలించుటచే నేనట్లు పలుకవలసి వచ్చె*" నని బాబా నుడివెను. తిరిగి బాబా 12 రూపాయలు దక్షిణ అడిగెను. దేవు దానిని వసూలు చేసి చెల్లించి, సాష్టాంగనమస్కారము చేసెను. బాబా యిట్లనెను. "*ప్రతిరోజు జ్ఞానేశ్వరిని చదువుము. పోయి వాడాలో కూర్చుండుము. ప్రతి నిత్యము కొంచెమైనను క్రమము తప్పక చదువుము. చదువునపుడు దగ్గరనున్న వారికి శ్రద్ధాభక్తులతో బోధపరచి చెప్పుము. నేను నీకు జల్తారు సెల్లా నిచ్చుటకు ఇచట కూర్చొనియున్నాను. ఇతరుల వద్దకు పోయి దొంగిలించెదవేల? నీకు దొంగతనమునకు అలవాటు పడవలెనని యున్నదా?*"

బాబా మాటలు విని దేవు సంతసించెను. బాబా తనను జ్ఞానేశ్వరిని ప్రారంభించుమని యాజ్ఞాపించె ననియు, తనకు కావలసినదేదో యది దొరికెననియు, అప్పటినుండి తాను సులభముగ చదువగల ననియు అనుకొనెను. తిరిగి బాబా పాదములకు సాష్టాంగనమస్కార మొనర్చెను. తాను శరణువేడెను కనుక తనను బిడ్డగానెంచి, జ్ఞానేశ్వరి చదువుటలో తోడ్పడవలసినదని బాబాను వేడుకొనెను. పీలికలు దొంగిలించుట యనగా నేమో దేవు అప్పుడు గ్రహించెను. బాలకరాముని ప్రశ్నించుటయే గుడ్డపీలికలు దొంగిలించుట. బాబా కట్టి వైఖరి యిష్టము లేదు. ఏ ప్రశ్నకైన సమాధానము ఇచ్చుటకు తామే సిద్ధముగా నుండిరి. ఇతరుల నడుగుట బాబాకు ఇష్టము

లేదు. అందుచే నతని బాధించి చికాకు పెట్టెను. అదియునుగాక యితరుల నడుగకుండ బాబానే సర్వము అడిగి తెలిసికొనవలయు ననియు, నితరులను ప్రశ్నించుట నిష్ప్రయోజన మనియు చెప్పెను. దేవు ఆ తిట్లను ఆశీర్వాదములుగ భావించి సంతుష్టితో ఇంటికి బోయెను. ఆ సంగతి యంతటితో సమాప్తి కాలేదు. బాబా చదువుమని యాజ్ఞాపించి ఊరుకొనలేదు. ఒక సంవత్సరము లోపుగా బాబా దేవు వద్దకు వెళ్ళి వాని యభివృద్ధి కనుగొనెను. 1914వ సంవత్సరము ఏప్రిల్ నెల 2వ తేదీ గురువారము ఉదయము బాబా స్వప్నములో సాక్షాత్కరించి పై అంతస్తులో కూర్చుండి "జ్ఞానేశ్వరి బోధపడుచున్నదా లేదా?" యని యడిగెను. "లేదు" అని దేవు జవాబిచ్చెను.

బాబా: ఇంకా యెప్పుడు తెలిసికొనెదవు?

దేవు కండ్ల తడిపెట్టుకొని "నీకృపను వర్షింపనిదే పారాయణము చికాకుగా నున్నది, బోధపడుట చాలా కష్టముగా నున్నది. నేను దీనిని నిశ్చయముగా చెప్పుచున్నాను." అనెను.

బాబా: చదువునప్పుడు, నీవు తొందరపడుచున్నావు. నా ముందర చదువుము. నా సమక్షమున చదువుము.

దేవు: ఏమి చదువవలెను?

బాబా: అధ్యాత్మ చదువుము.

పుస్తకమును తీసికొని వచ్చుటకు దేవు వెళ్ళెను. అంతలో మెలకువ వచ్చి కండ్లు తెరచెను. ఈ దృశ్యమును జూచిన పిమ్మట దేవుకెంత యానందము, సంతోషము కలిగెనో చదువరులే గ్రహింతురు గాక!

శ్రీసాయినాథాయ నమః

**నలుబదియొకటవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీసాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నలుబదిరెండవ అధ్యాయము

*బాబా మహాసమాధి చెందుట: 1. ముందుగా సూచించుట 2. రామచంద్ర దాదా పాటీలు, తాత్యాకోతే పాటీలుల చావులను తప్పించుట 3. లక్ష్మీబాయి శిందేకు దానము. 4. చివరిదశ.*

ఈ అధ్యాయములో బాబా తమ దేహమును చాలించిన వృత్తాంతము వర్ణితము.

గత అధ్యాయములలో చెప్పిన లీలలు, బాబా కృపయను కాంతిచే ఐహికజీవితమందలి భయము నెటుల త్రోసివేయగలమో, మోక్షమునకు మార్గము నెట్లు తెలిసికొనగలమో, మన కష్టములను సంతోషముగా నెట్లు మార్చగలమో చెప్పును. సద్గురుని పాదారవిందములను జ్ఞప్తియందుంచుకొనినచో మన కష్టములు నశించును. మరణము దాని నైజమును కోలుపోవును. ఐహికదుఃఖములు నశించును. ఎవరయితే తమ క్షేమమును కోరెదరో వారు శ్రీసాయి లీలలను జాగ్రత్తగా వినవలెను. అది వారి మనస్సును పావనము చేయును.

### ముందుగా సూచించుట

చదువరు లింతవరకు బాబా జీవితకథలను వింటిరి. ఇప్పుడు వారు మహాసమాధిని ఎట్లు పొందిరో వినెదరుగాక. 1918 సెప్టెంబరు 28వ తేదీన బాబాకు కొంచెము జ్వరము తగిలెను. జ్వరము రెండుమూడు దినములుండెను. కాని అటుతరువాత బాబా భోజనమును మానెను.

అందుచేత క్రమముగా బలహీనులైరి. 17వ రోజు అనగా 1918వ సంవత్సరము అక్టోబర్ 15వ తేదీ మంగళవారము 2-30 గంటలకు బాబా భౌతికశరీరమును విడిచిరి. ఈ విషయమును రెండు సంవత్సరములకు ముందే బాబా సూచించిరి గాని, యది యెవరికి బోధపడలేదు. అది యిట్లు జరిగెను. 1916 వ సం॥ విజయదశమినాడు సాయంకాలము గ్రామములోని వారందరు సీమోల్లంఘున మొనర్చి తిరిగి వచ్చుచుండగా బాబా హఠాత్తుగా కోపోద్రిక్తులైరి. సీమోల్లంఘున మనగా గ్రామపు సరిహద్దును దాటుట. బాబా తమ తలగుడ్డ, కఫనీ, లంగోటీ తీసి వానిని చించి ముందున్న ధునిలోనికి విసరివైచిరి. దీని మూలముగా ధుని యెక్కువగా మండజొచ్చెను. ఆ కాంతిలో బాబా మిక్కిలి ప్రకాశించెను. బాబా అక్కడ దిగంబరుడై నిలచి ఎఱ్ఱగా మండుచున్న కండ్లతో బిగ్గరగా ఇట్లు అరచెను. *"ఇప్పుడు సరిగా గమనించి నేను హిందువునో, మహమ్మదీయుడనో చెప్పుడు."* అచటనున్న ప్రతివాడు గడగడ వణకిపోయెను. బాబా వద్దకు పోవుట కెవ్వరును సాహసించలేకపోయిరి. కొంతసేపటికి భాగోజి శిందే (కుష్ఠురోగ భక్తుడు) ధైర్యముతో దగ్గరకు బోయి లంగోటీని కట్టి యిట్లనెను. *"బాబా! సీమోల్లంఘునమునాడు ఇదంతయు నేమి?" "ఈ రోజు నా సీమోల్లంఘునము."* అనుచు బాబా సటకాతో నేలపై గొట్టెను. బాబా రాత్రి 11 గంటలవరకు శాంతించలేదు. ఆ రాత్రి చావడి యుత్సవము జరుగునో లేదో యని యందరు సంశయించిరి. ఒక గంట తరువాత బాబా మామూలు స్థితికి వచ్చెను. ఎప్పటివలె దుస్తులు వేసికొని చావడి యుత్సవమునకు తయారయ్యెను. ఈ విధముగా బాబా తాము దసరానాడు సమాధి చెందుదుమని సూచించిరి గాని యది యెవరికి అర్థము కాలేదు. దిగువ వివరించిన ప్రకారము బాబా మరియొక్క సూచన గూడ చేసిరి.

**రామచంద్ర, తాత్యాకోతే పాటీళ్ళ మరణము తప్పించుట**

ఇది జరిగిన కొంతకాలము పిమ్మట రామచంద్ర పాటీలు తీవ్రముగా జబ్బుపడెను. అతడు చాల బాధపడెను. అన్ని ఔషధములు ఉపయోగించెను గాని, అవి గుణము నివ్వలేదు. నిరాశ చెంది, చావుకు సిద్ధముగా నుండెను. ఒకనాడు నడిరేయి బాబా యతని దిండువద్ద నిలచెను. పాటీలు బాబా పాదములు పట్టుకొని, *"నేను నా జీవితముపై ఆశ వదలుకొన్నాను. నేనెప్పుడు మరణించెదనో దయచేసి చెప్పుడు"* అనెను. దాక్షిణ్యమూర్తి యగు బాబా

*"నీ వాతురపడవద్దు, నీ చావు చీటి తీసివేసితిని! త్వరలో బాగుపడెదవు కాని, తాత్యాకోతే పాటీలు గూర్చి సంశయించుచున్నాను. అతడు శక. సం. 1840 (1918) విజయదశమినాడు మరణించును. ఇది యెవరికిని తెలియనీయకు. వానికి కూడ చెప్పవద్దు, చెప్పినచో మిక్కిలి భయపడును."* అనిరి. రామచంద్ర దాదా జబ్బు కుదిరెను. కాని యతడు తాత్యాగూర్చి సంశయించుచుండెను. ఏలన బాబా మాటకు తిరుగు లేదు కనుక తాత్యా రెండు సంవత్సరములలో మరణము చెందుననుకొనెను. దీనిని రహస్యముగా నుంచెను. ఎవరికిని తెలియనీయ లేదు కాని, బాలాషింపికి మాత్రమే చెప్పెను. రామచంద్రపాటీలు, బాలాషింపి ఈ యిరువురు మాత్రమే తాత్యా గూర్చి భయపడుచుండిరి.

రామచంద్ర దాదా త్వరలో ప్రక్కనుండి లేచి నడువసాగెను. కాలము వేగముగా కదలిపోయెను. 1918 భాద్రపదము ముగిసెను. ఆశ్వయుజమాసము సమీపించుచుండెను. బాబామాట ప్రకారము తాత్యా జబ్బుపడెను. మంచము బట్టెను. అందుచే బాబా దర్శనమునకై రాలేకుండెను. బాబా కూడ జ్వరముతో నుండెను. తాత్యాకు బాబాయందు పూర్తి విశ్వాసముండెను. బాబా శ్రీహరిని పూర్తిగా నమ్మియుండెను. దైవమే వారి రక్షకుడు. తాత్యా రోగము అధికమయ్యెను. అతడు కదలలేకపోయెను, ఎల్లప్పుడు బాబానే స్మరించుచుండెను. బాబా పరిస్థితి గూడ క్షీణించెను. విజయదశమి సమీపించుచుండెను. రామచంద్ర దాదాయు, బాలాషింపియు తాత్యాగూర్చి మిగుల భయపడిరి. వారి శరీరములు వణకజొచ్చెను. శరీరమంతయు చెమటలు పట్టెను. బాబా నుడివిన ప్రకారము తాత్యాచావు దగ్గరకు వచ్చె ననుకొనిరి. విజయదశమి రానే వచ్చెను. తాత్యా నాడి బలహీన మయ్యెను. త్వరలో ప్రాణము విడుచునని యనుకొనిరి. ఇంతలో గొప్ప వింత జరిగెను. తాత్యా నిలచెను, అతని మరణము తప్పెను. అతనికి బదులుగా బాబా దేహత్యాగము చేసెను. వారిలో వారు మరణము మార్చుకొన్నట్లు గనిపించెను. బాబా తన ప్రాణమును తాత్యా కోసమర్పించెనని జనులనుకొనిరి. బాబా యెందుకిట్లు చేసెనో బాబాకే తెలియును. వారి కృత్యము లగోచరములు. ఇవ్విధముగా బాబా తమ సమాధిని సూచించిరి. తమ పేరుకు బదులు తాత్యా పేరు తెలిపిరి.

ఆ మరుసటి యుదయము అనగా అక్టోబర్ 16వ తేదీన పండరీ పురములో దాసగణుకు బాబా స్వప్నమున సాక్షాత్కరించి యిట్లనిరి. "మసీదు కూలిపోయినది. వర్తకులు నన్ను చాల చికాకు పెట్టిరి. కనుక ఆ స్థలమును విడిచి పెట్టినాను. ఈ సంగతి నీకు తెలియజేయుటకై వచ్చినాను. వెంటనే యక్కడకు పొమ్ము. నన్ను చాలినన్ని పుష్పములచే గప్పుము." శిరిడీనుంచి వచ్చిన ఉత్తరమువలన కూడ దాసగణుకీ సంగతి దెలిసెను. అతడు వెంటనే శిష్యులతో శిరిడీకి చేరెను. భజన కీర్తన ప్రారంభించెను. బాబాను సమాధి చేయుటకు ముందు రోజంతయు భగవన్నామస్మరణ చేసెను. భగవన్నామస్మరణ చేయుచు నొక చక్కని పువ్వుల హారమును స్వయముగా గ్రుచ్చి దానిని బాబా సమాధిపై వేసెను. బాబా పేరుతో అన్నదానము చేసెను.

## లక్ష్మీబాయి .శిందేకు దానము

దసరా లేదా విజయదశమి హిందువులకు గొప్ప శుభసమయము. ఈ దినమున బాబా సమాధి చెందుటకు నిశ్చయించుకొనుట మిగుల సవ్యముగా నున్నది. కొన్ని దినములనుండి వారు వ్యాధిగ్రస్తులుగా నుండిరి. లోపల మాత్రము పూర్ణ చైతన్యులుగా నుండిరి. చివరి సమయమప్పుడు హఠాత్తుగా ఎవరి సహాయము లేకుండ, లేచి కూర్చుండి మంచి స్థితిలో నున్నట్లు గనపడిరి. అపాయస్థితి దాటినదని, బాబా కోలుకొనుచుండెనని యందరనుకొనిరి. తాము త్వరలో సమాధి చెందెదమని బాబాకు తెలియును, కాన లక్ష్మీబాయి శిందేకు కొంత ద్రవ్యమును దానము చేయ నిశ్చయించుకొనిరి.

## బాబా సర్వజీవవ్యాపి

ఈ లక్ష్మీబాయి శిందే ధనవంతురాలు, సుగుణవతి. రాత్రింబవళ్ళు ఆమె మసీదులో బాబా సేవ చేయుచుండెను. రాత్రి సమయమందు భక్త మహాల్సాపతి, తాత్యా, లక్ష్మీబాయి శిందే తప్ప తదితరులెవ్వరు మసీదులో కాలుపెట్టుట కాజ్ఞ లేకుండెను. ఒకనాడు సాయంకాలము బాబా మసీదులో తాత్యాతో కూర్చొనియుండగా లక్ష్మీబాయి శిందే వచ్చి బాబాకు నమస్కరించెను. బాబా యిట్లనెను, "ఓ లక్ష్మీ! నాకు చాల ఆకలి వేయుచున్నది." వెంటనే యామె లేచి "కొంచెము సేపాగుము. నేను త్వరలో రొట్టెను దీసికొని వచ్చెద" ననెను. అనిన ప్రకారము ఆమె త్వరగా రొట్టె, కూర తీసికొని వచ్చి బాబా

ముందుపెట్టెను. బాబా దానిని అందుకొని యొక కుక్కకు వేసెను. లక్ష్మీబాయి యిట్లడిగెను. "ఇది యేమి బాబా! నేను పరుగెత్తుకొని పోయి నా చేతులార నీ కొరకు రొట్టె చేసితిని. నీవు దానిని కొంచెమైనను తినక కుక్కకు వేసితివి. అనవసరముగా నాకు శ్రమ కలుగజేసితివి." అందుకు బాబా యిట్లు సమాధానమిచ్చెను. "అనవసరముగా విచారించెదవేల? కుక్క యాకలి దీర్చుట నా యాకలి దీర్చుట వంటిది. కుక్కకు కూడ ఆత్మ గలదు. ప్రాణులు వేరు కావచ్చును. కాని అందరి యాకలి యొకటియే. కొందరు మాట్లాడగలరు. కొందరు మూగవానివలె మాట్లాడలేరు. ఎవరయితే యాకలితో నున్నవారికి భోజనము పెట్టెదరో వారు నాకు అన్నము పెట్టినట్లే. దీనినే గొప్ప నీతిగా ఎరుగుము." ఇది చాల చిన్న విషయముగాని, బాబా దాని వల్ల గొప్ప ఆధ్యాత్మికసత్యమును బోధించి, ఇతరుల కెట్టి బాధయు కలుగకుండ నిత్యజీవితములో దానిని ఆచరణలో పెట్టుట ఎటులో చూపించిరి. ఆనాటినుండి లక్ష్మీబాయి రొట్టె పాలు భక్తి ప్రేమలతో బాబాకు పెట్టుచుండెను. బాబా మెచ్చుకొని యెంతో ప్రేమతో తినుచుండెడివారు. అందులో కొంత తాను తిని మిగత రాధాకృష్ణమాయికి పంపుచుండెను. ఆమె బాబా భుక్తశేషమునే యెల్లప్పుడు తినుచుండెను. ఈ రొట్టె కథను విషయాంతరముగా భావించరాదు. దీనినిబట్టి బాబా సర్వజీవులయందు గలడని తెలిసికొనగలము. బాబా సర్వవ్యాపి, చావుపుట్టుకలు లేనివారు, అమరులు.

బాబా లక్ష్మీబాయి సేవలను జ్ఞప్తియందుంచుకొనిరి. ఆమెను మరచెదరెట్లు? బాబా తన భౌతికశరీరమును విడుచునప్పుడు, తన జేబులో చేయిపెట్టి యొకసారి 5 రూపాయలు, యింకొకసారి 4 రూపాయలు మొత్తము 9 రూపాయలు తీసి లక్ష్మీబాయి కిచ్చిరి. ఈ సంఖ్య 21వ అధ్యాయములోని నవవిధభక్తులను తెలియజేయును. లేదా ఇది సీమోల్లంఘన సమయమున నిచ్చు దక్షిణ యనుకొనవచ్చును. లక్ష్మీబాయి శిందే ధనవంతురాలగుటచే నామెకు ధనమవసరము లేదు. కనుక బాబా ఆమెకు ముఖ్యముగా నవవిధభక్తులను గూర్చి బోధించియుండవచ్చును. భాగవతము ఏకాదశస్కంధము దశమాధ్యాయములో ఆరవశ్లోకము పూర్వార్ధమున 5, ఉత్తరార్ధమున 4 విధముల భక్తి చెప్పబడియున్నది. బాబా ఈ ప్రకారముగ

మొదట 5, తదుపరి 4 మొత్తము 9 రూపాయలు ఇచ్చెను. ఒక తొమ్మిదేకాక తొమ్మిదికి ఎన్నో రెట్ల రూపాయలు లక్ష్మీబాయి చేతిమీదుగా వ్యయమైనవి. కాని బాబా యిచ్చిన ఈ తొమ్మిది రూపాయల నామె యెన్నటికి మరువదు.

మిక్కిలి జాగరూకత మరియు పూర్ణచైతన్యము కలిగియుండు బాబా యవసానకాలమందు కూడ తగిన జాగ్రత్త పడెను. తన భక్తులపై గల ప్రేమానురాగముల యందు తగుల్కొనకుండునట్లు, వారందరిని లేచిపొమ్మనిరి. కాకాసాహెబు దీక్షిత్, బాపూసాహెబు బూటీ మొదలగువారు మసీదునందు ఆందోళనతో బాబాను గనిపెట్టుకొనియుండిరి. కాని బాబా వారిని వాడాకు బోయి భోజనము చేసి రండనిరి. వారు బాబాను విడువ లేకుండిరి; బాబా మాటను జవదాటలేకుండిరి. మనస్సునందు ఇష్టము లేనప్పటికి వారు పోలేక పోలేక మసీదు విడిచి పోయిరి. బాబా స్థితి యపాయకరముగా నుండెనని వారికి తెలియును. కనుక వారు బాబాను మరువకుండిరి. వారు భోజనమునకు కూర్చుండిరే కాని వారి మనస్సు బాబాపై నుండెను. వారు భోజనము పూర్తి చేయక మునుపే బాబా తమ భౌతిక శరీరమును విడిచెనని వార్త వచ్చెను. భోజనములను విడిచి యందరు మసీదుకు పరుగెత్తిరి. బయాజీ అప్పాకోతే పై బాబా దేహము ఒరిగి యుండెను. వారు నేలపై గాని తమ గద్దెపైగాని పడలేదు, తమ స్థలములో ప్రశాంతముగా గూర్చుండి తమ చేతితో దానము చేయుచు శరీరము విడిచిరి. యోగులు శరీరము ధరించి యేదో పనిమీద భూలోకమునకు వత్తురు. అది నెరవేరిన పిమ్మట వారెంత నెమ్మదిగాను సులభముగాను అవతరించిరో యంత శాంతముగా వెళ్ళెదరు.

శ్రీసాయినాథాయ నమః

**నలుబదిరెండవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## 43, 44 అధ్యాయములు

*బాబా సమాధి చెందుట: 1. సన్నాహము, 2. సమాధి మందిరము, 3. ఇటుకరాయి విరుగుట, 4. 72 గంటల సమాధి, 5. జోగుయొక్క సన్యాసము, 6. అమృతము వంటి బాబా పలుకులు.*

43 మరియు 44 అధ్యాయములు కూడ బాబా శరీరత్యాగము చేసిన కథనే వర్ణించునవి కనుక వాటినొకచోట చేర్చుట జరిగినది.

### ముందుగా సన్నాహము

హిందువులలో నెవరైన మరణించుటకు సిద్ధముగా నున్నప్పుడు, మత గ్రంథములు చదివి వినిపించుట సాధారణాచారము. ఏలన ప్రపంచ విషయములనుండి అతని మనస్సును మరలించి భగవద్విషయములందు లీనమొనర్చినచో నతడు పరమును సహజముగాను సులభముగాను పొందును. పరీక్షిన్మహారాజు బ్రాహ్మణ ఋషిబాలునిచే శపింపబడి, వారము రోజులలో చనిపోవుటకు సిద్ధముగా నున్నప్పుడు గొప్పయోగి యగు శుకుడు భాగవత పురాణమును ఆ వారములో బోధించెను. ఈ అభ్యాసము ఇప్పటికిని అలవాటులో నున్నది. చనిపోవుటకు సిద్ధముగా నున్నవారికి గీత, భాగవతము మొదలగు గ్రంథములు చదివి వినిపించెదరు. కాని, బాబా భగవంతుని యవతారమగుటచే వారికట్టిది యవసరము లేదు. కాని, బాబా యితరులకు

ఆదర్శముగా నుండుటకు ఈ యలవాటును పాటించిరి. త్వరలోనే దేహత్యాగము చేయనున్నామని తెలియగనే వారు వజే యను నాతని బిలిచి రామవిజయమను గ్రంథమును పారాయణ చేయుమనిరి. అతడు వారములో గ్రంథము నొకసారి పఠించెను. తిరిగి దానిని చదువుమని బాబా యాజ్ఞాపింపగా అతడు రాత్రింబవళ్ళు దానిని చదివి మూడు దినములలో రెండవ పారాయణము పూర్తిచేసెను. ఈ విధముగా 11 దినములు గడచెను. అతడు తిరిగి 3 రోజులు చదివి యలసి పోయెను. బాబా అతనికి సెలవిచ్చి పొమ్మనెను. బాబా నెమ్మదిగా నుండి ఆత్మానుసంధానములో మునిగి చివరి క్షణమునకయి యెదురు చూచుచుండిరి.

రెండుమూడుదినములు ముందునుండి బాబా గ్రామము బయటకు పోవుట, భిక్షాటనము చేయుట మొదలగునవి మాని మసీదుల్లో కూర్చుండిరి. చివరవరకు బాబా చైతన్యముతో నుండి, అందరిని ధైర్యముగా నుండుడని సలహా ఇచ్చిరి. వారెప్పుడు పోయెదరో ఎవరికి తెలియనీయలేదు. ప్రతిదినము కాకాసాహెబు దీక్షితు, శ్రీమాన్ బూటీయు వారితో కలిసి మసీదులో భోజనము చేయుచుండెడివారు. ఆనాడు (1918 అక్టోబరు 15వ తారీఖు) హారతి పిమ్మట వారిని వారివారి బసలకుబోయి భోజనము చేయుమనిరి. అయినను కొంతమంది లక్ష్మీబాయి శిందే, భాగోజిశిందే, బాయాజి, లక్ష్మణ్ బాలాషింపి, నానాసాహెబు నిమోన్‌కర్ యక్కడనే యుండిరి. దిగువ మెట్లమీద శ్యామా కూర్చొనియుండెను. లక్ష్మీబాయి శిందేకు 9 రూపాయలను దానము చేసినపిమ్మట, బాబా తన కాస్థలము (మసీదు) బాగ లేదనియు, అందుచేత తనను రాతితో కట్టిన బూటీ మేడ లోనికి దీసికొని పోయిన నచట బాగుగా నుండుననియు చెప్పెను. ఈ తుదిపలుకు లాడుచు బాబా బయాజీ తాత్యాకోతే పై ఒరిగి ప్రాణములు విడిచెను. భాగోజీ దీనిని గనిపెట్టెను. దిగువ కూర్చొనియున్న నాన్సాసాహెబు నిమోన్‌కర్‌కు ఈ సంగతి చెప్పెను. నానాసాహెబు నీళ్ళు తెచ్చి బాబా నోటిలో పోసెను. అవి బయటకు వచ్చెను. అతడు బిగ్గరగా *"ఓ దేవా!"* యని యరచెను. అంతలో బాబా కండ్లు తెరచి మెల్లగా *"ఆ!"* యనెను. బాబా తమ భౌతికశరీరమును విడిచి పెట్టెనని తేలిపోయెను.

బాబా సమాధి చెందెనను సంగతి శిరిడీ గ్రామములో కార్చిచ్చువలె వ్యాపించెను. ప్రజలందరు స్త్రీలు, పురుషులు, బిడ్డలు మసీదుకు పోయి యేడ్వసాగిరి. కొందరు బిగ్గరగా నేడ్చిరి. కొందరు వీథులలో నేడ్చుచుండిరి. కొందరు తెలివితప్పి పడిరి. అందరి కండ్లనుండి నీళ్ళు కాలువల వలె పారుచుండెను. అందరును విచారగ్రస్తులయిరి.

కొందరు సాయిబాబా చెప్పిన మాటలు జ్ఞాపకము చేసికొన మొదలిడిరి. మునుముందు ఎనిమిదేండ్ల బాలునిగా ప్రత్యక్షమయ్యెదనని బాబా తమ భక్తులతో చెప్పిరని యొకరనిరి. ఇవి యోగీశ్వరుని వాక్కులు కనుక నెవ్వరును సందేహింప నక్కరలేదు. ఏలన కృష్ణావతారములో శ్రీమహావిష్ణువీ కార్యమే యొనర్చెను. సుందర శరీరముతో, ఆయుధములు గల చతుర్భుజములతో, శ్రీకృష్ణుడు దేవకీదేవికి కారాగారమున ఎనిమిదేండ్ల బాలుడుగానే ప్రత్యక్షమయ్యెను. ఆ యవతారమున శ్రీకృష్ణుడు భూమిభారమును తగ్గించెను. ఈ యవతారము (సాయిబాబా) భక్తుల నుద్ధరించుటకై వచ్చినది. కనుక సంశయింపకారణమే మున్నది? యోగుల జాడ లగమ్యగోచరములు. సాయిబాబాకు తమ భక్తులతోడి సంబంధ మీ యొక్క జన్మతోడిదే కాదు. అది కడచిన డెబ్బదిరెండు జన్మల సంబంధము. ఇట్టి ప్రేమబంధములు కల్గించిన యీ మహారాజు (సాయిబాబా) ఎచటికో పర్యటనకై పోయినట్లనిపించుటవలన వారు శీఘ్రముగానే తిరిగి వత్తురను దృఢవిశ్వాసము భక్తులకు గలదు.

బాబా శరీరము నెట్లు సమాధి చేయవలెనను విషయము గొప్ప సమస్య యాయెను. కొందరు మహమ్మదీయులు బాబా శరీరమును ఆరుబయట సమాధిచేసి దానిపై గోరి కట్టవలెననిరి. కుషాల్‌చంద్, అమీర్‌శక్కర్ కూడ ఈ యభిప్రాయమునే వెలిబుచ్చిరి. కాని రామచంద్ర పాటీలు అను గ్రామమునసబు గ్రామములోని వారందరితో నిశ్చితమైన దృఢకంఠస్వరముతో "మీ యాలోచన మాకు సమ్మతము కాదు. బాబా శరీరము రాతి వాడాలో పెట్టవలసినదే" యనెను. అందుచే గ్రామస్థులు, రెండు వర్గములుగా విడిపోయి ఈ వివాదము 36 గంటలు జరిపిరి.

బుధవార ముదయము గ్రామములోని జ్యోతిష్కుడును, శ్యామాకు మేనమామయునగు లక్ష్మణ్‌మామా జోషికి బాబా స్వప్నములో గాన్పించి, చేయిపట్టి లాగి యిట్లనెను: "త్వరగా లెమ్ము, బాపూసాహెబు నేను మరణించితి ననుకొనుచున్నాడు. అందుచే నతడు రాడు. నీవు పూజ చేసి, కాకడహారతిని ఇమ్ము!" లక్ష్మణ్‌మామా సనాతనాచారపరాయణుడయిన బ్రాహ్మణుడు. ప్రతిరోజు ఉదయము బాబాను పూజించిన పిమ్మట తక్కిన దేవతలను పూజించుచుండెడి వాడు. అతనికి బాబా యందు పూర్ణభక్తివిశ్వాసము లుండెను. ఈ దృశ్యమును చూడగనే పూజాద్రవ్యముల పళ్ళెమును చేత ధరించి మౌల్వీలు ఆటంక పరచుచున్నను పూజను హారతిని చేసి పోయెను. మిట్టమధ్యాహ్నము బాపూసాహెబు జోగ్ పూజాద్రవ్యములతో నందరితో మామూలుగా వచ్చి మధ్యాహ్న హారతిని నెరవేర్చెను.

బాబా తుది పలుకులను గౌరవించి ప్రజలు వారి శరీరమును వాడాలో నుంచుటకు నిశ్చయించి అచటి మధ్యభాగమును త్రవ్వుట ప్రారంభించిరి. మంగళవారము సాయంకాలము రహతానుండి సబ్‌ఇన్‌స్పెక్టర్ వచ్చెను. ఇతరులు తక్కిన స్థలములనుండి వచ్చిరి. అందరు దానిని ఆమోదించిరి. ఆ మరుసటి యుదయము అమీర్‌భాయి బొంబాయినుండి వచ్చెను. కోపర్‌గాంనుండి మామలతదారు వచ్చెను. ప్రజలు భిన్నాభిప్రాయములతో నున్నట్లు తోచెను. కొందరు బాబా శరీరమును బయటనే సమాధి చేయవలెనని పట్టుబట్టిరి. కనుక, మామలతదారు ఎన్నికద్వారా నిశ్చయించవలెననెను. వాడా నుపయోగించుటకు రెండురెట్లకంటె ఎక్కువ వోట్లు వచ్చెను. అయినప్పటికి జిల్లా కలెక్టరుతో సంప్రదించవలెనని అతడనెను. కనుక కాకాసాహెబు దీక్షిత్ అహమద్‌నగర్ పోవుటకు సిద్ధపడెను. ఈ లోపల బాబా ప్రేరేపణవల్ల రెండవ పార్టీ యొక్క మనస్సు మారెను. అందరు ఏకగ్రీవముగా బాబాను వాడాలో సమాధి చేయుట కంగీకరించిరి. బుధవారము సాయంకాలము బాబా శరీరమును ఉత్సవముతో వాడాకు తీసికొనిపోయిరి. మురళీధరుని కొరకు కట్టిన చోట శాస్త్రోక్తముగా సమాధి చేసిరి. యధార్థముగా బాబాయే మురళీధరుడు. వాడా దేవాలయ మయ్యెను. అది యొక పూజామందిర

మాయెను. అనేకమంది భక్తులచ్చటకు బోయి శాంతిసౌఖ్యములు పొందుచున్నారు. ఉత్తరక్రియలు బాలాసాహెబు భాటే, ఉపాసనీ బాబా నెరవేర్చిరి. ఉపాసనీ బాబా, బాబాకు గొప్పభక్తుడు.

ఈ సందర్భములో నొక విషయము గమనించవలెను. ప్రొఫెసర్ నార్కే కథనము ప్రకారము బాబా శరీరము 36 గంటలు గాలి పట్టినప్పటికి అది బిగిసిపోలేదు. అవయవములన్నియు సాగుచుండెను. వారి కఫనీ చింపకుండ సులభముగా దీయగలిగిరి.

**ఇటుకరాయి విరుగుట**

బాబా భౌతికశరీరమును విడుచుటకు కొన్ని దినముల ముందు ఒక దుశ్శకున మయ్యెను. మసీదులో ఒక పాత యిటుక యుండెను. బాబా దానిపై చేయివేసి యానుకొని కూర్చుండువారు. రాత్రులందు దానిపై ఆనుకొని యాసనస్థు లగుచుండిరి. అనేకసంవత్సరము లిట్లు గడిచెను. ఒకనాడు బాబా మసీదులో లేనప్పుడు, ఒక బాలుడు మసీదును శుభ్రపరచుచు, దానిని చేతితో పట్టుకొనియుండగా అది చేతినుండి జారి క్రింద పడి రెండు ముక్కలయిపోయెను. ఈ సంగతి బాబాకు తెలియగానే వారు మిగుల చింతించి యిట్లని యేడ్చిరి. "ఇటుక కాదు, నా యదృష్టమే ముక్కలు ముక్కలుగా విరిగిపోయినది. అది నా జీవితపు తోడునీడ. దాని సహాయమువలననే నేను ఆత్మానుసంధానము చేయుచుండెడివాడను. నా జీవితమునందు నాకెంత ప్రేమయో దానియందు నాకంత ప్రేమ. ఈరోజు అది నన్ను విడిచినది." ఎవరైన ఒక ప్రశ్న అడుగవచ్చును. "బాబా నిర్జీవియగు ఇటుక కోసమింత విచారపడనేల?" అందులకు హేమాడ్‌పంతు ఇట్లు సమాధానమిచ్చెను. "యోగులు బీదవారికి, నిస్సహాయులకు సహాయము చేయుటకై అవతరించెదరు. వారు ప్రజలతో కలిసి మసలునప్పుడు ప్రజలవలె నటింతురు. వారు మనవలె బాహ్యమునకు నవ్వెదరు, ఆడెదరు, ఏడ్చెదరు. కాని లోపల వారు శుద్ధచైతన్యులయి వారి కర్తవ్యవిధుల నెరుగుదురు."

**72 గంటల సమాధి**

ఇటుక విరుగుటకు 32 సంవత్సరములకు పూర్వము అనగా, 1886

సంవత్సరములో బాబా సీమోల్లంఘనము చేయ ప్రయత్నించెను. ఒక మార్గశిర పౌర్ణమినాడు బాబా ఉబ్బసము వ్యాధితో మిక్కిలి బాధ పడుచుండెను. దానిని తప్పించుకొనుటకై బాబా తన ప్రాణమును పైకి దీసికొనిపోయి సమాధిలో నుండవలెననుకొని, భక్త మహల్సాపతితో నిట్లనిరి. "నా శరీరమును మూడు రోజులవరకు కాపాడుము. నేను తిరిగి వచ్చినట్లయిన సరే, లేనియెడల నా శరీరము నెదురుగా నున్న ఖాళీ స్థలములో పాతిపెట్టి గుర్తుగా రెండు జెండాలను పాతుము" అని స్థలమును జూపిరి. ఇట్లనుచు రాత్రి 10 గంటలకు బాబా క్రింద కూలెను. వారి ఊపిరి నిలచిపోయెను. వారి నాడి కూడ అడకుండెను. శరీరములోనుండి ప్రాణము పోయినట్లుండెను. ఊరివారందరు అచ్చట చేరి న్యాయవిచారణ చేసి బాబా చూపిన స్థలములో సమాధి చేయుటకు నిశ్చయించిరి. కాని మహల్సాపతి యడ్డగించెను. తన ఒడిలో బాబా శరీరము నుంచుకొని మూడురోజులట్లే కాపాడుచు కూర్చుండెను. మూడు దినముల పిమ్మట తెల్లవారుఝామున 3 గంటలకు బాబా శరీరములో ప్రాణమున్నట్లు గనిపించెను. ఊపిరి ఆడ నారంభించెను, కడుపు కదలెను, కండ్లు తెరచెను, కాళ్ళు చేతులు సాగదీయుచు బాబా లేచెను.

దీనినిబట్టి చదువరు లాలోచించవలసిన విషయమేమన బాబా 3 మూరల శరీరమా లేక లోపలనున్న యాత్మయా? పంచభూతాత్మకమగు శరీరము నాశనమగును. శరీర మశాశ్వతముగాని, లోనున్న యాత్మ పరమ సత్యము, అమరము, శాశ్వతము. ఈ శుద్ధసత్తాయే బ్రహ్మము. అదియే పంచేంద్రియములను, మనస్సును స్వాధీనమందుంచుకొనునది, పరిపాలించునది. అదియే సాయి. అదియే ఈ జగత్తునందు గల వస్తువులన్నిటియందు వ్యాపించి యున్నది. అదీ లేని స్థలము లేదు. అది తాను సంకల్పించుకొనిన కార్యమును నెరవేర్చుటకు భౌతికశరీరము వహించెను. దానిని నెరవేర్చిన పిమ్మట శరీరమును విడిచెను. సాయి యెల్లప్పుడు ఉండువారు. అట్లనే పూర్వము గాణ్గాపురములో వెలసిన దత్తదేవుని అవతారమగు శ్రీనరసింహసరస్వతియు, వారు సమాధిచెందుట బాహ్యమునకే గాని, సమస్తచేతనాచేతనములందు గూడ నుండి వానిని నియమించువారును, పరిపాలించువారును వారే. ఈ విషయము ఇప్పటికిని

సర్వస్యశరణాగతి చేసిన వారికిని, మనఃస్ఫూర్తిగా భక్తితో పూజించువారికిని అనుభవనీయమయిన సంగతి.

ప్రస్తుతము బాబా రూపము చూడ వీలులేన్పటికిని, మనము శిరిడీకి వెళ్ళినచో, వారి జీవిత మెత్తుపటము మసీదులో నున్నది. దీనిని శ్యామరావు జయకర్ యను గొప్ప చిత్రకారుడును బాబా భక్తుడును వ్రాసియున్నాడు. భావుకుడు భక్తుడు నైన ప్రేక్షకునికి ఈ పటము ఈ నాటికిని బాబాను భౌతిక శరీరముతో చూచినంత తృప్తి కలుగజేయును. బాబాకు ప్రస్తుతము భౌతిక శరీరము లేనప్పటికి వారక్కడనే కాక ప్రతి చోటున నివసించుచు పూర్వమువలెనే తమ భక్తులకు మేలు చేయుచున్నారు. బాబా వంటి యోగులు ఎన్నడు మరణించరు. వారు మానవులవలె గనిపించినను నిజముగా వారే దైవము.

**బాపుసాహెబు జోగ్ సన్యాసము**

జోగు సన్యాసము పుచ్చుకొనిన కథతో హేమాడ్‌పంతు ఈ అధ్యాయమును ముగించుచున్నారు. సఖారాం హరి వురఫ్ బాపూసాహెబ్ జోగ్ పుణే నివాసియగు సుప్రసిద్ధ వార్కరి విష్ణుబువా జోగ్‌గారికి చిన్నాయన. 1909వ సంవత్సరమున సర్కారు ఉద్యోగమునుండి విరమించిన తరువాత (P.W.D. Supervisor), భార్యతో శిరిడీకి వచ్చి నివసించుచుండెను. వారికి సంతానము లేకుండెను. భార్యాభర్తలు బాబాను ప్రేమించి బాబా సేవయందే కాలమంతయు గడుపుచుండిరి. మేఘశ్యాముడు చనిపోయిన పిమ్మట బాపూసాహెబు జోగ్ మసీదులోను, చావడిలోను కూడ బాబా మహాసమాధి పొందువరకు హారతి ఇచ్చుచుండెను. అదియునుగాక ప్రతిరోజు సాఠేవాడాలో జ్ఞానేశ్వరియు, ఏకనాథ భాగవతమును చదివి, వినవచ్చినవారందరికి బోధించుచుండెను. అనేక సంవత్సరములు సేవ చేసిన పిమ్మట జోగ్, బాబాతో *"నేనిన్నాళ్ళు నీ సేవ చేసితిని. నా మనస్సు ఇంకను శాంతము కాలేదు. యోగులతో సహవాసము చేసినను నేను బాగు కాకుండుటకు కారణమేమి? ఎప్పుడు కటాక్షించెదవు?"* అనెను. ఆ ప్రార్థన విని బాబా *"కొద్ది కాలములో నీ దుష్కర్మల ఫలితము నశించును. నీ పాపపుణ్యములు భస్మమగును. ఎప్పుడు నీ వభిమానమును పోగొట్టుకొని, మోహమును రుచిని జయించెదవో, యాటంకము లన్నిటిని*

కడచెదవో, హృదయపూర్వకముగ భగవంతుని సేవించుచు సన్యాసమును బుచ్చుకొనెదవో, అప్పుడు నీవు ధన్యుడవయ్యెదవు" అనిరి. కొద్ది కాలము పిమ్మట బాబా పలుకులు నిజమాయెను. అతని భార్య చనిపోయెను. అతనికింకొక యభిమాన మేదియు లేకుండుటచే నతడు స్వేచ్ఛాపరుడై సన్యాసమును గ్రహించి తన జీవితపరమావధిని పొందెను.

### అమృతతుల్యముగు బాబా పలుకులు

దయాదాక్షిణ్యమూర్తి యగు సాయిబాబా పెక్కుసారులు మసీదులో ఈ దిగువ మధురవాక్యములు పలికిరి. "ఎవరయితే నన్ను ఎక్కువగా ప్రేమించెదరో వారు ఎల్లప్పుడు నన్ను దర్శించెదరు. నేను లేక ఈ జగత్తంతయు వానికి శూన్యము, నా కథలు తప్ప మరేమియు చెప్పడు, సదా నన్నే ధ్యానము చేయును. నా నామమునే యెల్లప్పుడు జపించుచుండును. ఎవరైతే సర్వస్యశరణాగతి చేసి, నన్నే ధ్యానింతురో వారికి నేను ఋణస్థుడను, వారికి మోక్షమునిచ్చి వారి ఋణము దీర్చుకొనెదను. ఎవరయితే నన్నే చింతించుచు నా గూర్చియే దీక్షతో నుందురో, ఎవరయితే నాకర్పించనిదే యేమియు తినరో అట్టివారిపై నేను ఆధారపడి యుందును. ఎవరయితే నా సన్నిధానమునకు వచ్చెదరో వారు నది సముద్రములో కలిసిపోయినట్లు నాలో కలిసిపోవుదురు. కనుక నీవు గర్వము అహంకారము లేశమైన లేకుండ, నీ హృదయములో నున్న నన్ను సర్వస్యశరణాగతి వేడవలెను."

### నేననగా నెవరు?

నేను అనగా నెవ్వరో సాయిబాబా యెన్నోసార్లు బోధించిరి. వారిట్లనిరి. "నన్ను వెదకుటకు నీవు దూరముగాని మరెచ్చటికిగాని పోనక్కరలేదు. నీ నామము నీ యాకారము విడిచినచో నీలోనేగాక యన్ని జీవులలోను, చైతన్యము లేదా యంతరాత్మ యని యొకటి యుండును. అదే నేను. దీనిని నీవు గ్రహించి, నీలోనేగాక అన్నిటిలోను నన్ను జూడుము. దీనిని నీవభ్యసించినచో, సర్వవ్యాపకత్వ మనుభవించి నాలో ఐక్యము పొందెదవు."

హేమాడ్‌పంతు చదువరులకు ప్రేమతో నమస్కరించి వేడున దేమనగా వారు వినయవిధేయతలతో దైవమును, యోగులను, భక్తులను

ప్రేమింతురుగాక! బాబా పెక్కుసారులు "ఎవరయితే యితరులను నిందించుదురో వారు నన్ను హింసించినవారగుదురు. ఎవరయితే బాధ లనుభవించెదరో, ఓర్చుకొందురో వారు నాకు ప్రీతి గూర్చెదరు" అని చెప్పిరి గదా! బాబా సర్వవస్తుజీవ సముదాయములో నైక్యమైయున్నారు. భక్తులకు నలుప్రక్కల నిలచి సహాయపడెదరు. సర్వజీవులను ప్రేమించుట తప్ప వారు మరేమియు కోరరు. ఇట్టి శుభమయిన పరిశుభ్రమయిన యమృతము వారి పెదవులనుండి స్రవించుచుండెను. హేమాడ్‌పంతు ఇట్లు ముగించుచున్నారు. ఎవరు బాబా కీర్తిని ప్రేమతో పాడెదరో, ఎవరు దానిని భక్తితో వినెదరో, ఉభయులును సాయితో నైక్యమగుదురు.

శ్రీసాయినాథాయ నమః

43, 44 అధ్యాయములు

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।

**ఆరవరోజు పారాయణము సమాప్తము**



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నలుబదియైదవ అధ్యాయము

**ఏడవ రోజు పారాయణము**

**బుధవారము**

1. కాకాసాహెబు సంశయము 2. ఆనందరావు దృశ్యము
3. కొయ్య బల్ల మంచము

గత మూడు అధ్యాయములలో బాబా దివంగతులగుట గూర్చి చెప్పితిమి. వారి భౌతికశరీరము మన దృష్టినుండి నిష్క్రమించెను గాని, వారి యనంతస్వరూపము లేదా సాయిశక్తి యెల్లప్పుడు నిలిచియే యుండును. ఇప్పటివరకు వారి జీవితకాలములో జరిగిన లీలలను చెప్పితిమి. వారు సమాధి చెందినపిమ్మట క్రొత్త లీలలు జరుగుచున్నవి. దీనిని బట్టి బాబా శాశ్వతముగా నున్నారనియు తమ భక్తులకు పూర్వమువలె తోడ్పడుచున్నారనియు తెలియుచున్నది. ఎవరయితే బాబా సమాధి చెందకముందు వారిని జూచిరో వారు నిజముగ సదృష్టవంతులు. అట్టివారిలో నెవరైన ప్రపంచసుఖములందు వస్తువులందు మమకారము పోగొట్టుకొననిచో, వారి మనస్సులు భగవత్పరము కానిచో యది వారి దురదృష్టమని చెప్పవచ్చును. అప్పుడేకాదు ఇప్పుడుకూడ కావలసినది బాబాయందు హృదయపూర్వకమయిన భక్తి. మన బుద్ధి, యింద్రియములు, మనస్సు బాబా సేవలో నైక్యము కావలెను. కొన్నిటిని మాత్రమే సేవలో లయము చేసి తక్కన

వానిని వేరే సంచరించునట్లు చేసినచో, ప్రయోజనము లేదు. పూజగాని ధ్యానము గాని చేయ పూనుకొనినచో దానిని మనఃపూర్వకముగాను ఆత్మశుద్ధితోడను చేయవలెను.

పతివ్రతకు తన భర్తయందుగల ప్రేమను, భక్తుడు గురువునందు చూపవలసిన ప్రేమతో పోల్చెదరు. అయినప్పటికి మొదటిది రెండవ దానితో పోల్చుటకే వీలులేదు. జీవితపరమావధిని పొందుటకు తండ్రిగాని, తల్లిగాని సోదరుడుగాని యింక తదితరబంధువు లెవ్వరుగాని తోడ్పడరు. ఆత్మ సాక్షాత్కారమునకు దారిని మనమే వెదకుకొని ప్రయాణమును సాగించవలెను. నిత్యానిత్యములకు భేదమును తెలిసికొని, ఇహలోక పరలోకములలోని విషయసుఖములను త్యజించి మన బుద్ధిని, మనస్సును స్వాధీనమందుంచుకొని మోక్షమునకై కాంక్షించవలెను. ఇతరులపై నాధారపడుటకంటె మన స్వశక్తియందే మనకు పూర్తి నమ్మకము ఉండవలెను. ఎప్పుడయితే మనము నిత్యానిత్యములకు గల భేదమును పాటించెదమో, ప్రపంచము అబద్ధమని తెలిసికొనెదము. దానివలన ప్రపంచవిషయములందు మోహము తగ్గి, మనకు నిర్వ్యామోహము కలుగును. క్రమముగా గురువే పరబ్రహ్మస్వరూపమనియు కావున వారొక్కరే నిజమనియు గ్రహించెదము. వారు ఈ జగత్తును జయించినవారును ప్రపంచమున కతీతులును. అప్పుడు వారిని ప్రతి జీవరాశియందు జూడగలిగి పూజించెదము. ఇదియే అద్వైతభజనము లేదా పూజ. ఎప్పుడయితే మనము బ్రహ్మమును, లేదా గురుని హృదయపూర్వకముగ ధ్యానించెదమో, మనము కూడ వారిలో ఐక్యమై ఆత్మసాక్షాత్కారము పొందెదము. వేయేల గురువు నామమును జపించుట వలనను, వారి స్వరూపమునే మనమున నుంచుకొని ధ్యానించుట చేతను వారిని సర్వజంతుకోటియందు చూచుట కవకాశము కలుగును. మనకది శాశ్వతానందమును కలుగజేయును. ఈ దిగువ కథ దీనిని విశదీకరించును.

**కాకాసాహెబు సంశయము - ఆనందరావు అనుభవము**

కాకాసాహెబు దీక్షిత్‌ను ప్రతిరోజు శ్రీఏకనాథుడు వ్రాసిన గ్రంథములను అనగా భాగవతమును, భావార్థరామాయణమును చదువుటకు బాబా ఆదేశించెను. బాబా సమాధికి పూర్వము కాకాసాహెబు దీక్షిత్ ఈ గ్రంథములను చదువుచుండెను. బాబా సమాధి చెందిన తరువాత కూడ అట్లే

చేయుచుండెడివాడు. ఒకనాడు ఉదయము బొంబాయి చౌపాటీలో నున్న కాకామహాజని యింటిలో కాకాసాహెబు దీక్షిత్ ఏకనాథభాగవతము చదువుచుండెను. శ్యామా, కాకామహాజని కూడ నచట నుండి శ్రద్ధతో భాగవతమును వినుచుండిరి. దీక్షిత్ ఏకాదశస్కంధములోని ద్వితీయాధ్యాయమును చదువుచుండెను. అందు వృషభకుటుంబములోని నవనాథులు లేదా సిద్ధులగు కవి, హరి, అంతరిక్ష, ప్రబుద్ధ, పిప్పలాయన, అవిర్‌హోత్ర, ద్రుమిళ, చమస్, మరియు కరభాజన్‌లు భాగవతధర్మసూత్రములను జనకమహారాజుకు చెప్పుచుండిరి. జనకుడు నవనాథులను ముఖ్యమైన ప్రశ్నలు కొన్ని యడిగెను. వారొక్కొక్కరు సంతృప్తికరమైన సమాధానము లిచ్చిరి. అందులో మొదటివాడగు కవి భాగవత ధర్మమును బోధించెను. హరి భక్తుని లక్షణములను, అంతరిక్షుడు మాయను దాటుటను, పిప్పలాయనుడు పరబ్రహ్మమును, అవిర్‌హోత్రుడు కర్మను, ద్రుమిళుడు భగవంతుని యవతారములను వారి లీలలను, చమస్ భక్తుడుకానివాడు చనిపోయిన పిమ్మట పొందు స్థితిని, కరభాజనుడు యుగయుగములందు భగవంతుని ఉపాసించు వేర్వేరు విధానములను సంతృప్తికరముగా బోధించిరి. వాని సారాంశమేమన కలియుగములో మోక్షము పొందుట కొక్కటే మార్గము గలదు. అదేమన గురుని లేదా హరి పాదారవిందములను స్మరించుట. పారాయణ ముగించిన పిమ్మట కాకాసాహెబు నిరుత్సాహముతో శ్యామాతో నిట్లనియె: *"నవనాథులు భక్తి విషయమై చెప్పినది యెంత అద్భుతముగా నున్నది? దాని నాచరించుట యెంత కష్టము? నవనాథులు పూర్ణజ్ఞానులేగాని మనవంటి మూర్ఖులకు వారు వర్ణించిన భక్తిని పొందుటకు వీలగునా? అనేకజన్మ లెత్తినను మనము దానిని సంపాదించలేము. అట్లయిన మనకు మోక్షము వచ్చుటెట్లు? కాబట్టి యట్టిదానిని మన మాశించరాదని తెలియుచున్నది."* కాకాసాహెబు నిరుత్సాహము, నిరాశలు శ్యామా యిష్టపడలేదు. వెంటనే యతడిట్లనెను: *"ఎవరయితే వారి యదృష్టవశముచే బాబా వంటి యాభరణమును పొందిరో, అట్టివారు నిరాశచెంది యేడ్చుట విచారకరమైన సంగతే. వారికి బాబాయందు నిశ్చలమైన విశ్వాసమే యున్నచో, వారు నిరాశ చెందనేల? నవనాథుల భక్తి*

బలమైనదై యుండవచ్చును గాని, మనది మాత్రము ప్రేమానురాగములతో నిండియుండలేదా? హరినామస్మరణము గురునామస్మరణము మోక్షప్రదమని బాబా నొక్కి చెప్పియుండలేదా? అట్లయినచో భయమునకుగాని ఆందోళనకుగాని యవకాశమేది?'' శ్యామా చెప్పిన సమాధానముతో కాకాసాహెబు సంతుష్టి చెందలేదు. నవనాథుల భక్తిని పొందుటెట్లు? అను మనోవేదన కలిగి ఆందోళనతో చికాకుగా నుండెను. ఆ మరుసటి యుదయమే యీ క్రింది యద్భుతము జరిగెను.

ఆనందరావు పాఖాడే యనువాడు శ్యామాను వెదకుచు పురాణ కాలక్షేపము జరుగుచున్న స్థలమునకు వచ్చెను. కాకాసాహెబ్ భాగవతము చదువుచుండెను. పాఖాడే శ్యామాకు దగ్గరగా కూర్చుండి అతని చెవిలో నేమో చెప్పుచుండెను. అతడు మెల్లగా తాను కాంచిన స్వప్న దృశ్యమును శ్యామాకు చెప్పుచుండెను. ఇది పురాణకాలక్షేపమునకు కొంచె మాటంకము గలుగజేసెను. కాకాసాహెబు పురాణము చదువుటమాని విషయమేమని యడిగెను. శ్యామా యిట్లు నుడివెను. "నిన్న నీ సంశయమును దెలిపితివి. దానికి సమాధాన మిదిగో! బాబా పాఖాడేకు చూపిన స్వప్నదృశ్యమును వినుము. "రక్షకమైన భక్తి" గాక వేరేదియు దీనిని సాధించలేదు. గురుని పాదములు భక్తితో ధ్యానించిన చాలును అని బాబా నొక్కి చెప్పియున్నారు.'' అందరు ముఖ్యముగా కాకాసాహెబు ఆ దృశ్యమును వివరముగా వినగోరిరి. వారి కోరిక ప్రకారము పాఖాడే యా దృశ్యమును ఈ క్రింది విధముగా చెప్ప నారంభించెను.

లోతైన సముద్రములో నడుమువరకు దిగి యచ్చట నిలచితిని. హఠాత్తుగా నచట సాయిబాబాను చూచితిని. రత్నములు తాపిన చక్కని సింహాసనముపై బాబా కూర్చొనియుండెను. వారి పాదములు నీటిలో నుండెను. బాబా స్వరూపమ్మును జూచి మిగుల ఆనందించితిని. అది నిజమువలె నుండెనే కాని స్వప్నమువలె గానరాకుండెను. దానిని నేను స్వప్నమని యనుకొనలేదు. మాధవరావు కూడ అచ్చట నిలచియుండెను. శ్యామా "ఆనందరావు! బాబా పాదములపై బడుము" అని సలహానిచ్చెను. "నాకు కూడ నమస్కరించవలెననియే యున్నది. కాని వారి పాదములు

నీటిలో నున్నవి. కనుక నా శిరస్సును వారి పాదములపై నెట్లుంచగలను? నేను నిస్సహాయుడను." అని నేనంటిని. అది విని యతడు బాబాతో నిట్లనెను. "ఓ దేవా! నీటిలో నున్న నీ పాదములను బయటకు దీయుము." వెంటనే బాబా తమ పాదములను బయటకు తీసిరి. క్షణమైన ఆలస్యము చేయక నేను వారి పాదములకు మ్రొక్కితిని. దీనిని జూచి బాబా నన్ను దీవించి యిట్లనెను. "ఇక పొమ్ము. నీవు క్షేమమును పొందెదవు. భయము గాని ఆందోళన గాని అవసరము లేదు. శ్యామాకు పట్టుపంచె యొకటి దానము చేయుము. దానివల్ల మేలు పొందెదవు."

బాబా యాజ్ఞానుసారము పాఖాడే పట్టుధోవతిని తెచ్చెను. మాధవరావు కివ్వవలసినదని కాకాసాహెబును వేడెను. శ్యామా యందులకొప్పు కొనలేదు. ఏలన బాబా తనకు అట్టి సలహా నివ్వలేదు కనుక. కొంత వివాదము జరిగిన పిమ్మట కాకాసాహెబు చీట్లువేసి తెలిసికొనుటకు సమ్మతించెను. సంశయ విషయములందు చీటి వేసి సంశయమును దీర్చుకొనుట కాకాసాహెబు స్వభావము. 'పుచ్చుకొనుము' 'నిరాకరించుము' అను రెండు చీటీలు వ్రాసి బాబా పాదుకల వద్ద బెట్టిరి. ఒక బాలునితో అందులో నొకదానిని తీయించిరి. 'పుచ్చుకొనుము' అను చీటీ ఎంచుటచే మాధవరావుకు ధోవతి ఇచ్చిరి. దానిని శ్యామా యంగీకరించెను. ఇద్దరును సంతుష్టి చెందిరి. కాకాసాహెబు సంశయము తీరెను.


ఇతర యోగుల మాటలను కూడ గౌరవించవలసినదని యీ కథ ప్రబోధించుచున్నది. కాని మన తల్లియగు గురువునందు పూర్ణమైన భక్తి విశ్వాసము లుండవలెను. వారి బోధల ప్రకారము నడువవలెను. ఎందుకనగా మన కష్టసుఖము లితరులకంటె వారికే బాగుగ తెలిసి యుండును. నీ హృదయఫలకమందు బాబా చెప్పిన ఈ దిగువ పలుకులను చెక్కుము. "ఈ లోకములో ననేకమంది యోగులు గలరు. గాని మన గురు వసలైన తండ్రి. ఇతరులు అనేక సుబోధలు చేయవచ్చును. కాని, మనము మన గురువు యొక్క పలుకులను మరువరాదు. వేయేల! హృదయపూర్వకముగ నీగురువును ప్రేమించుము. వారిని సర్వస్య శరణాగతి వేడుము. భక్తితో వారి పాదములకు మ్రొక్కుము. అట్లు చేసినచో సూర్యుని ముందు చీకటి లేనట్లు, నీవు దాటలేని భవసాగరము లేదు."

### కొయ్య బల్ల మంచము బాబాదే, మహాల్సాపతిది కాదు


బాబా శిరిడీకి చేరిన కొద్ది కాలమునకే 4 మూరల పొడవు, ఒక జానెడు వెడల్పు గల కొయ్య బల్ల మీద నాలుగు చివరల నాలుగు దీపపు ప్రమిదలు పెట్టి దానిపై పండుకొనువారు. కొన్నాళ్ళు గడచిన పిమ్మట బాబా దానిని విరిచి ముక్కలు చేసి పారవేసెను. ఒకనాడు బాబా దాని మహిమను కాకాసాహెబుకు వర్ణించి చెప్పుచుండెను. ఇది విని యతడు బాబా కిట్లనియె. "మీ కింకను కొయ్య బల్లయందు మక్కువ యున్నచో నింకొక బల్ల మీ కొరకు మసీదులో వ్రేలాడ వేసెదను. దానిపై మీరు సుఖముగా నిద్రించవచ్చును." అందుకు బాబా ఇట్లనెను. "మహాల్సాపతిని దిగువ విడిచి నేనొక్కడనే పైన పండుకొనుట కిష్టము లేదు." కాకాసాహెబు ఇట్లనెను. "మహాల్సాపతికొర కింకొక బల్లను తయారు చేయించెదను." బాబా "అతడెట్లు బల్లపై పరుండగలడు? బల్లమీద అంత ఎత్తున పడుకొనుట సులభమయిన పనికాదు. ఎవరు మిక్కిలి పుణ్యవంతులో వారే పడుకొనగలరు. ఎవరయితే కండ్లు దెరచి నిద్రించగలరో వారికే యది వీలగును. నేను నిద్రపోవునప్పుడు మహాల్సాపతిని నా ప్రక్కన కూర్చుండి తన చేయి నా హృదయముపై నుంచుమనెదను. అచ్చటినుంచి వచ్చు భగవన్నామస్మరణమును వినుమనెదను. నేను పండుకొనినచో నన్ను లేవగొట్టు మనెదను. దీనినే యతడు నెరవేర్చలేకున్నాడు. నిద్రతో కునుకుపాట్లు పడుచుండును. నా హృదయముపై వాని చేతి బరువును గమనించి, ఓ భగత్! అని పిలచెదను. వెంటనే కండ్లు తెరచి కదలును. ఎవడయితే నేలపై చక్కగా నిద్రించలేడో, ఎవడు కదలకుండ యుండలేడో, ఎవడు నిద్రకు సేవకుడో, వాడు ఎత్తైన బల్లమీద నెట్లు పండుకొనగలడు?" అనెను. అనేక పర్యాయములు బాబా తన భక్తులయందు ప్రేమచే నిట్లనెను. "మంచిగాని చెడ్డగాని, ఏది మనదో యది మన దగ్గర నున్నది. ఏది యితరులదో, యది యితరులవద్ద నున్నది."

శ్రీసాయినాథాయ నమః

**నలుబదియైదవ అధ్యాయము**



**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నలుబదియారవ అధ్యాయము

బాబా గయ వెళ్ళుట - రెండు మేకల కథ

ఈ అధ్యాయములో శ్యామా కాశి, గయ, ప్రయాగ యాత్రలకు వెళ్ళుట, బాబా ఫోటో రూపమున నతనికంటె ముందే వెళ్ళుట చెప్పెదము. బాబా రెండు మేకల పూర్వజన్మవృత్తాంతమును జ్ఞప్తికి దెచ్చుట గూడ చెప్పుకొందము.

**తొలిపలుకు**

ఓ సాయీ! నీపాదములు పవిత్రము లయినవి. నిన్ను జ్ఞప్తియందుంచుకొనుట మిగుల పావనము. కర్మబంధములనుండి తప్పించు నీ దర్శనము కూడ మిక్కిలి పావనమయినది. ప్రస్తుతము నీ రూప మగోచరమయినప్పటికి, భక్తులు నీయందే నమ్మక ముంచినచో, వారు నీవు సమాధి చెందకముందు చేసిన లీలలను అనుభవించెదరు. నీవు కంటి కగపడని చిత్రమైన దారముతో నీ భక్తులను దగ్గరనుండిగాని యెంతో దూరమునుండిగాని యీడ్చెదవు. వారిని దయగల తల్లివలె కౌగలించుకొనెదవు. నీ వెక్కడున్నావో నీ భక్తులకు తెలియదు. కాని నీవు చతురతతో తీగలను లాగుటచే వారి వెనుకనే నిలబడి తోడ్పడుచున్నావని తుట్టతుదకు గ్రహించెదరు. బుద్ధిమంతులు, జ్ఞానులు, పండితులు అహంకారముచే

సంసారమనే గోతిలో పడెదరు. కాని నీవు నీ శక్తివలన నిరాడంబరభక్తుల రక్షించెదవు. అంతరికముగను, అదృశ్యముగను ఆటంతయు నాడెదవు. కాని దానితో నీకెట్టి సంబంధము లేనట్లు గనిపించెదవు. నీవే పనులన్నియును నెరవేర్చుచున్నప్పటికి ఏమియు చేయనివానివలె నటించెదవు. నీ జీవితము నెవరు తెలియజాలరు. కాబట్టి మేము పాపములనుండి విముక్తి పొందుట యెట్లన శరీరమును, వాక్కును, మనస్సును నీపాదములకు సమర్పించి నీ నామమునే జపించవలెను. నీ భక్తుల కోరికలను నీవు నెరవేర్చెదవు. ఎవరికయితే కోరికలుండవో అట్టివారికి నీవు బ్రహ్మానందము నిచ్చెదవు. నీ మధురమగు నామము జపించుటయే భక్తులకు సులభసాధనము. ఈ సాధనవల్ల మన పాపములు, రజస్తమోగుణములు నిష్క్రమించును. సాత్త్వికగుణములు, ధార్మికత్వము ప్రాముఖ్యము వహించును. దీనితో నిత్యానిత్యములకు గల భేదము, నిర్వ్యామోహము, జ్ఞానము లభించును. మనమట్టి సమయమందు గురువునే యనగా నాత్మనే యనుసంధానము చేసెదము. ఇదియే గురువునకు సర్వస్యశరణాగతి. దీనికి తప్పనిసరి యొకే గుర్తు - మన మనస్సు నిశ్చలము శాంతమునగుట. ఈ శరణాగతి గొప్పదనము, భక్తి, జ్ఞానములు విశిష్టమైనవి. ఎందుకన శాంతి, అభిమాన రాహిత్యము, కీర్తి, తదుపరి మోక్షము ఒకటి వెనుక నింకొకటి వెన్నంటి వచ్చును.

ఒకవేళ బాబా ఎవరైన భక్తుని ఆమోదించినచో రాత్రింబవళ్ళు అతని చెంతనే యుండి, యింటి వద్దనుగాని దూరదేశమునగాని వానిని వెంబడించు చుండును. భక్తుడు తన యిష్టము వచ్చిన చోటునకు పోనిమ్ము. బాబా అచ్చటకు భక్తునికంటె ముందుగా బోయి యేదో ఒక ఊహించరాని రూపమున నుండును. ఈ దిగువకథ దీనికి ఉదాహరణము.

### గయ యాత్ర

బాబాతో పరిచయము కలిగిన కొన్నాళ్ళ తరువాత కాకాసాహెబు తన పెద్ద కుమారుడు బాబు ఉపనయనము నాగపూరులో చేయ నిశ్చయించెను. సుమారదే సమయమందు నానాసాహెబు చాందోర్కరు తన పెద్ద కుమారుని వివాహము గ్వాలియర్‌లో చేయ నిశ్చయించుకొనెను. కాకాసాహెబు, నానాసాహెబు చాందోర్కరులిద్దరును శిరిడీకి వచ్చి బాబాను ప్రేమతో ఆ శుభకార్యములకు ఆహ్వానించిరి. శ్యామాను తన ప్రతినిధిగా దీసికొని వెళ్ళుడని

బాబా నుడివెను. తామే స్వయముగా రావలసినదని బలవంతపెట్టగా బాబా వారికి శ్యామాను దీసుకొని పోవలసినదనియు "కాశీ ప్రయాగ యాత్రలు ముగియుసరికి నేను శ్యామాకంటె ముందుగనే గయలో కలిసికొనెద"నని చెప్పెను. ఈ మాటలు గుర్తుంచుకొనవలెను. ఏలన అవి బాబా సర్వవ్యాపియని నిరూపించును.

బాబా వద్ద సెలవు పుచ్చుకొని, శ్యామా నాగపూరు గ్వాలియరు పోవ నిశ్చయించెను. అచటినుండి కాశీ, ప్రయాగ, గయ పోవలెననుకొనెను. అప్పాకోతే యతని వెంట బోవ నిశ్చయించెను. వారిరువురు మొట్టమొదట నాగపూరులో జరుగు ఉపనయమునకు బోయిరి. కాకాసాహెబు దీక్షిత్ శ్యామాకు 200 రూపాయలు ఖర్చుల నిమిత్తము కానుక నిచ్చెను. అచ్చటినుండి గ్వాలియర్ పెండ్లికి బోయిరి. అచ్చట నానాసాహెబు చాందోర్కరు శ్యామాకు 100 రూపాయలును, అతని బంధువు జఠార్ 100 రూపాయలును ఇచ్చిరి. అక్కడినుండి శ్యామా కాశీకి వెళ్ళెను. అచ్చట జఠారు యొక్క అందమైన లక్ష్మీనారాయణ మందిరములో అతనికి గొప్ప సత్కారము జరిగెను. అచ్చటినుండి శ్యామా అయోధ్యకు పోయెను. అచ్చట జఠారు మేనేజరు శ్రీరామమందిరమున ఆహ్వానించి మర్యాద చేసెను. వారు అయోధ్యలో 21 రోజు లుండిరి. కాశీలో రెండు మాసములుండిరి. అక్కడనుంచి గయకు పోయిరి. రైలు బండిలో గయలో ప్లేగు గలదని విని కొంచెము చికాకు పడిరి. రాత్రి గయ స్టేషనులో దిగి ధర్మశాలలో బసచేసిరి. ఉదయువే గయ పండా వచ్చి యిట్లనెను. "యాత్రికులందరు బయలుదేరుచున్నారు. మీరు కూడ త్వరపడుడు." అచ్చట ప్లేగు గలదా?" యని శ్యామా ప్రశ్నించెను. లేదని పండా జవాబు నిచ్చెను. మీరే స్వయముగా వచ్చి చూచుకొనుడనెను. అప్పుడు వారు అతని వెంట వెళ్ళి పండా ఇంటిలో దిగిరి. ఆ యిల్లు చాలా పెద్దది. పండా ఇచ్చిన బసకు శ్యామా చాలా సంతుష్టి చెందెను. అచ్చట గల బాబా యొక్క అందమైన పెద్దపటము అతనికి అన్నిటికంటె ఎక్కువ ప్రీతిని కలుగజేసెను. అది యింటికి ముందు భాగములో మధ్య నమర్చబడియుండెను. దీనిని చూచి శ్యామా మైమరచెను. "కాశీ ప్రయాగ యాత్రలు ముగియుసరికి నేను శ్యామాకంటె ముందుగనే గయకు బోయెదను" అను బాబా పలుకులను జ్ఞప్తికి దెచ్చుకొనెను. కండ్ల నీరు గ్రమ్మెను,

శరీరము గగుర్పొడిచెను, గొంతుక యార్చుకొని పోయెను. అతడు వెక్కి వెక్కి యేడ్వసాగెను. ఆపట్టణములో ప్లేగు జాడ్యము గలదని భయపడి యేడ్చుచున్నాడేమోయని పండా యనుకొనెను. పండాను బాబా పటమెక్కడనుండి తెచ్చితివని శ్యామా యడిగెను. పండా తన ప్రతినిధులు రెండు మూడువందల మంది మన్మాడులోను, పుణతాంబేలోను గలరనియు, వారు గయకు పోయే యాత్రికుల మంచి చెడ్డలు చూచెదరనియు, వారివల్ల బాబా కీర్తిని విని బాబా దర్శనము 12 యేండ్ల క్రిందట చేసితిననియు చెప్పెను. శిరిడీలో శ్యామా యింటిలో వ్రేలాడుచున్న బాబా పటమును జూచి దాని నిమ్మని కోరితిననియు బాబా యనుజ్ఞ పొంది శ్యామా దానిని తన కిచ్చెననియు చెప్పెను. శ్యామా పూర్వము జరిగిన దంతయు జ్ఞప్తికి దెచ్చుకొనెను. పూర్వము తనకు పటము నిచ్చిన శ్యామాయే ప్రస్తుతము తన యింట నతిథిగా నుండుట గ్రహించి పండా మిక్కిలి యానందించెను. వారిరువురు ప్రేమానురాగము లనుభవించి యమితానందమును పొందిరి. శ్యామాకు పండా చక్కని రాజలాంఛనములతోడి స్వాగత మిచ్చెను. పండా ధనవంతుడు. అతడొక పల్లకిలో కూర్చుండి, శ్యామాను ఏనుగుపైన కూర్చుండబెట్టి ఊరేగించెను. అతిథికి తగిన సౌఖ్యము లన్నియు నేర్పరచెను.

**ఈ కథవల్ల నేర్చుకొనవలసిన నీతి**

బాబా మాటలు అక్షరాలా సత్యములనియు బాబాకు తన భక్తులందుగల ప్రేమ యమితమనియు తెలియుచున్నది. ఇదియేగాక వారికి జంతువులయందు కూడ సమానప్రేమ యుండెను. వారు వానిలో నొకరుగా భావించెడివారు. ఈ దిగువ కథ దీనిని వెల్లడించును.

**రెండు మేకల కథ**

ఒకనాడుదయము బాబా లెండితోటనుండి తిరిగి వచ్చుచుండెను. మార్గమున మేకలమందను జూచెను. అందులో రెండు మేకల మీద బాబా దృష్టిపడెను. బాబా వానిని సమీపించి ప్రేమతో తాకి లాలించి వానిని 32 రూపాయలకు కొనెను. బాబా వైఖరిని జూచి భక్తులు ఆశ్చర్యపడిరి. బాబా మిగుల మోసపోయెనని వారనుకొనిరి. ఎందుచేతననగా నొక్కొక్క మేకను 2 గాని, 3 గాని, 4 గాని రూపాయలకు కొనవచ్చును. రెండు మేకలకు 8 రూపాయలకు హెచ్చు కాదనిరి. బాబాను నిందించిరి. బాబా నెమ్మదిగా

నూరకొనెను. శ్యామా, తాత్యాకోతే బాబాను సమాధానము వేడగా బాబా "నాకు ఇల్లుగాని, కుటుంబముగాని లేకుండుట చేత నేను ధనము నిలువ చేయరాదు." అనిరి. మరియు బాబా తమ ఖర్చుతోనే 4 సేర్ల శనగపప్పును కొని మేకలకు పెట్టుమని చెప్పిరి. పిదప ఆ మేకలను వారి యజమానికి తిరిగి యిచ్చి వేసి వాని పూర్వవృత్తాంతము ఈ రీతిగా చెప్పిరి.

"ఓ శ్యామా! తాత్యా! మీరీ బేరములో నేను మోసపోయితినని యనుకొనుచున్నారు. అట్లుకాదు, వాని కథ వినుడు. గతజన్మలో వారు మానవులు. వారి యదృష్టము కొలది నా జతగాండ్రుగా నుండెడివారు. వారొకే తల్లి బిడ్డలు. మొదట వారికి నొకరిపై నొకరికి ప్రేమ యుండెను. రానురాను శత్రువులైరి. పెద్దవాడు సోమరిగాని, చిన్నవాడు చురుకైనవాడు. అతడు చాల ధనము సంపాదించెను. పెద్దవాడు అసూయ చెంది చిన్నవానిని చంపి వాని ద్రవ్యము నపహరిరప నెంచెను. తమ సోదరత్వమును మరచి వారిద్దరు కలహించిరి. అన్న తమ్ముని జంపుటకు పెక్కు పన్నుగడలను పన్నెను, కాని నిష్ప్రయోజనములయ్యెను. ఇద్దరు బద్ధవైరు లయిరి. అన్న ఒకనాడు తన సోదరుని బడితెతో కొట్టెను, చిన్నవాడు అన్నను గొడ్డలితో నరకెను. ఇద్దరదే స్థలమున చచ్చిపడిరి. వారి కర్మఫలముచే మేకలుగా పుట్టిరి. నా ప్రక్కనుండి పోవుచుండగా వారిని ఆనవాలు పట్టితిని. వారి పూర్వవృత్తాంతమును జ్ఞప్తికి దెచ్చుకొంటిని వారియందు కనికరించి వారికి తిండి పెట్టి, కొంత విశ్రాంతి కలుగజేసి యోదార్చవలెనని యనుకొంటిని. అందుచే నింత ద్రవ్యమును వ్యయపరచితిని. అందులకు మీరు నన్ను దూషించుచున్నారా? నా బేరము మీరిష్టపడుకుండుటచే నేను వాని యజమానివద్దకు తిరిగి పంపివేసితిని." మేకలపైని కూడ బాబా ప్రేమ యెట్టిదో చూడుడు.

శ్రీసాయినాథాయ నమః

**నలుబదియారవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నలుబదియేడవ అధ్యాయము

*బాబా చెప్పిన వీరభద్రప్ప, చెన్నబసప్పల (పాము-కప్ప) కథ*

గత అధ్యాయములో రెండు మేకల పూర్వవృత్తాంతమును బాబా వర్ణించెను. ఈ అధ్యాయమున కూడ అట్టి పూర్వవృత్తాంతముల వర్ణించు వీరభద్రప్ప యొక్కయు, చెన్నబసప్ప యొక్కయు కథలు చెప్పెదుము.

**ప్రస్తావన**

శ్రీసాయి రూపము పావనమైనది. ఒక్కసారి వారివైపు దృష్టి నిగిడించినచో యెన్నో గతజన్మల విచారమును నశింపజేసి, యెంతో పుణ్యము ప్రాప్తించునటుల జేయును. వారి దయాదృష్టి మనపై బరపినచో, మన కర్మబంధములు వెంటనే విడిపోయి మన మానందమును పొందెదము. గంగానదిలో స్నానము చేయువారి పాపములన్నియు తొలగును. అట్టి పావనమైన నది కూడ యోగులెప్పుడు వచ్చి తనలో మునిగి, తనలో ప్రోగైన పాపములన్నిటిని వారి పాదధూళిచే పోగొట్టెదరాయని యాతురతతో జూచును. యోగుల పవిత్రపాదధూళి చేతనే పాపమంతయు కడుగుకొనిపోవునని గంగామాతకు తెలియును. యోగులలో ముఖ్యాలంకారము శ్రీసాయి. పావనము చేయు ఈ క్రింది కథను వారినుండి వినుడు.

పాము - కప్ప

సాయిబాబా ఒకనాడిట్లు చెప్పదొడగెను:

"ఒకనాడుదయము ఉపాహారము ముగించిన తరువాత వ్యాహ్యాళికి పోయి యొక చిన్న నది యొడ్డున చేరితిని. అలసిపోవుటచే నచట విశ్రాంతి నొందితిని. చేతులు కాళ్ళు కడుగుకొని స్నానము చేసి హాయిగా కూర్చొని యుంటిని. అచట చెట్ల నీడలున్న కాలిత్రోవ, బండిత్రోవ రెండును కలవు. చల్లని గాలి మెల్లగా వీచుచుండెను. చిలుమును త్రాగుటకు తయారు చేయుచుండగా కప్ప యొకటి బెకబెక లాడుట వింటిని. చెకుముకిరాయి కొట్టి నిప్పు తీయుచుండగా ఒక ప్రయాణీకుడు వచ్చి నా ప్రక్కన కూర్చుండెను. నాకు నమస్కరించి తన ఇంటికి భోజనమునకు రమ్మని వినయముతో నాహ్వానించెను. అతడు చిలుము వెలిగించి నాకందజేసెను. కప్ప బెకబెక మనుట తిరిగి వినిపించెను. అతడు అదేమియో తెలిసికొనగోరెను. 'ఒక కప్ప తన పూర్వ జన్మపాపఫలము ననుభవించుచున్నద'ని చెప్పితిని. గతజన్మలో చేసినదాని ఫలము నీ జన్మలో ననుభవించి తీరవలయును. దానిని గూర్చి దుఃఖించినచో ప్రయోజనము లేదు. వాడు చిలుమును బీల్చి నాకందజేసి తానే స్వయముగా పోయి చూచెదనని చెప్పెను. ఒక కప్ప పాముచే పట్టుకొనబడి యరచుచుండెననియు గతజన్మలో రెండును దుర్మార్గులేగాన, ఈ జన్మయందు గతజన్మయెుక్క పాపమును యీ దేహముతో ననుభవించుచున్నవనియు చెప్పితిని. అతడు బయటకు పోయి ఒక నల్లని పెద్దపాము ఒక కప్పను నోటితో బట్టుకొని యుండుట జూచెను.

"అతడు నావద్దకు వచ్చి 10, 12 నిమిషములలో పాము కప్పను మ్రింగునని చెప్పెను. నేనిట్లంటిని. 'లేదు. అట్లు జరుగనేరదు. నేనే దాని తండ్రిని (రక్షకుడను)! నేనిచటనేయున్నాను. పాము చేత కప్ప నెట్లు తినిపించెదను? నేనిక్కడ ఊరకనే యున్నానా? దాని నెట్లు విడిపించెదనో చూడు.'

"చిలుము పీల్చిన పిమ్మట మేమా స్థలమునకు పోతిమి. అతడు భయపడెను. నన్ను కూడ దగ్గరకు పోవద్దని హెచ్చరించెను. పాము మీదపడి కరచునని వాని భయము. అతని మాట లెక్కించకయే నేను ముందుకు

బోయి యిట్లంటిని. 'ఓ వీరభద్రప్పా! నీ శత్రువు చెన్నబసప్ప కప్ప జన్మమెత్తి పశ్చాత్తాపపడుట లేదా? నీవు సర్పజన్మమెత్తినప్పటికిని వానియందు శత్రుత్వము వహించి యున్నావా? ఛీ, సిగ్గులేదా! మీ ద్వేషములను విడచి శాంతింపుడు.'

"ఈ మాటలు విని యా సర్పము కప్పను వెంటనే విడిచి నీటిలో మునిగి అదృశ్యమయ్యెను. కప్పకూడ గంతువేసి చెట్ల పొదలలో దాగెను. బాటసారి ఆశ్చర్యపడెను. 'మీరన్న మాటలకు పాము కప్పనెట్లు వదలి యదృశ్యమయ్యెను? వీరభద్రప్ప యెవరు? చెన్నబసప్ప యెవరు? వారి శత్రుత్వమునకు కారణ మేమి?' అని యతడు ప్రశ్నింపగా, నతనితో కలసి చెట్టు మొదటికి పోయితిని. చిలుము కొన్ని పీల్పులు పీల్చి నతనికి వృత్తాంతమంతయు నీ రీతిగా బోధించితిని.

"మా యూరికి 4,5 మైళ్ళ దూరమున ఒక పురాతన శివాలయము గలదు. అది పాతబడి శిథిలమయ్యెను. ఆ గ్రామములోని ప్రజలు దానిని మరామతు చేయుటకై కొంత ధనము ప్రోగుచేసిరి. కొంత పెద్ద మొత్తము ప్రోగైన పిమ్మట పూజకొరకు తగిన యేర్పాటు చేసిరి. మరామతు చేయుట కంచనా వేసిరి. ఊరిలోని ధనవంతుని కోశాధికారిగా నియమించి సర్వము అతని చేతిలో పెట్టిరి. లెక్కలను చక్కగా వ్రాయు బాధ్యత వానిపై బెట్టిరి. వాడు పరమలోభి. దేవాలయము బాగు చేయుటకు చాల తక్కువ వ్యయము చేసెను. దేవాలయములో నేమి యభివృద్ధి కానరాలేదు. అతడు ధనమంతయు ఖర్చు పెట్టెను. కొంత తాను మ్రింగెను. తన సొంత డబ్బు కొంచెమైనను దానికై వెచ్చించలేదు. తియ్యని మాటలు చెప్పువాడు. అభివృద్ధి కాకుండుటకేవో కారణములు చెప్పెడివాడు. గ్రామస్థులు తిరిగి వానివద్దకు బోయి అతడు సొంతముగా తగిన ధనసహాయము చేయనియెడల మందిరము వృద్ధికాదని చెప్పిరి. వాని అంచనా ప్రకారము పని సాగించవలసినదని చెప్పుచు మరికొంత ద్రవ్యమును వసూలుచేసి యాతని కిచ్చిరి. వాడాధనమును పుచ్చుకొని, పూర్వమువలెనే యూరక కూర్చుండెను. కొన్నాళ్ళ పిమ్మట మహాదేవుడు వాని భార్యకు కలలో గనిపించి యిట్లు చెప్పెను. 'నీవు లేచి దేవాలయపు శిఖరమును గట్టుము. నీవు ఖర్చు పెట్టినదానికి 100

రెట్లు ఇచ్చెదను.' ఆమె యీ దృశ్యమును తన భర్తకు చెప్పెను. అది ధనము వ్యయమగుటకు హేతువగునేమో యని భయపడి ఎగతాళి చేయుచు అది ఉత్త స్వప్నమనియు, దానిని నమ్మనవసరము లేదనియు, లేకున్నచో దేవుడు తనకు స్వప్నములో గనపడి యేల చెప్పలేదనియు, తాను మాత్రము దగ్గర లేకుండెనా యనియు, ఇది దుస్స్వప్నమువలె గనిపించుచున్నదనియు, భార్యాభర్తలకు విరోధము కల్పించునటుల తోచుచున్నదనియు అతడు సమాధానము చెప్పెను. అందుచే ఆమె ఊరుకొనవలసి వచ్చెను.

"దాతలను బాధించి వసూలు చేయు పెద్ద మొత్తము చందాల యందు దేవునకు ఇష్టముండదు. భక్తితోను ప్రేమతోను మన్ననతోను ఇచ్చిన చిన్న చిన్న మొత్తములకయిన దైవ మిష్టపడును. కొన్ని దినముల పిమ్మట దేవుడామెకు స్వప్నములో తిరిగి కనిపించి యిట్లనెను. 'భర్త దగ్గరనున్న చందాలగూర్చి చికాకు చెంద నవసరములేదు. దేవాలయము నిమిత్తమేమైన వ్యయము చేయుమని యాతని బలవంతము చేయవద్దు. నాకు కావలసినవి భక్తి మరియు సద్భావము. కాబట్టి నీ కిష్టమున్న సొంతము దేదైన ఇవ్వవలెను.' ఆమె తన భర్తతో సంప్రదించి తన తండ్రి తన కిచ్చిన బంగారునగలు దానము చేయ నిశ్చయించెను. ఆ లోభి యీ సంగతి విని చికాకు చెంది భగవంతుని కూడ మోసము చేయ నిశ్చయించుకొనెను. ఆమె నగలనెంతో తక్కువ ధర కట్టి 1000 రూపాయలకు తానే కొని, నగదునకు బదులుగా నొక పొలమును దేవదేయముగా నిచ్చెను. అందులకు భార్య సమ్మతించెను. ఆ పొలము వాని సొంతము గాదు. అదియొక పేదరాలగు డుబ్కీ యను నామెది. ఆమె దానిని 200 రూపాయలకు కుదువ పెట్టి యుండెను. ఆమె దానిని తీర్చలేకపోయెను. ఆ టక్కరి లోభి తన భార్యను, డుబ్కీని, దైవమును - అందరిని మోసగించెను. ఆ నేల పనికిరానిది, సాగులో లేనిది. దాని విలువ చాల తక్కువ. దానివలన ఆదాయమేమియు లేదు.

"ఈ వ్యవహారమిట్లు సమాప్తి చెందెను. ఆ పొలమును పూజారి యధీనములో నుంచిరి. అందులకతడు సంతసించెను. కొన్నాళ్ళకు ఒక చిత్రము జరిగెను. గొప్ప తుఫాను సంభవించెను. కుంభవృష్టి కురిసెను. లోభి యింటికి పిడుగుపాటు తగిలి వాడు, వాని భార్య చనిపోయిరి. డుబ్కీ కాలగతి చెందెను.

"తరువాతి జన్మలో ఆ లోభి మథురాపట్టణములో నొక బ్రాహ్మణ కుటుంబములో పుట్టి వీరభద్రప్పయను పేర నుండెను. అతని భార్య పూజారి కొమార్తెగా జన్మించెను. ఆమెకు గౌరి యని పేరు పెట్టిరి. దుబ్కీ మందిర గౌరవనింటిలో మగశిశువుగా జన్మించెను. అతనికి చెన్నబసప్ప యని నామమిడిరి. ఆ పూజారి నా స్నేహితుడు. అతడు నావద్దకు తరచుగా వచ్చుచుండెను. నావద్ద కూర్చుండి మాట్లాడుచు చిలుము పీల్చెడివాడు. అతని కొమార్తె గౌరి కూడ నా భక్తురాలు. ఆమె త్వరగా నెదుగుచుండెను. ఆమె తండ్రి వరునికై వెదకుచుండెను. ఆ విషయమై చికాకుపడ నవసరము లేదనియు, ఆమె భర్త తానై వెదకుకొని వచ్చుననియు నేను చెప్పితిని. కొన్నాళ్ళకు వీరభద్రప్పయను ఒక బీద బ్రాహ్మణబాలుడు భిక్షకై పూజారి యింటికి వచ్చెను. పూజారి నా సమ్మతి ప్రకారము వానికి గౌరి నిచ్చి పెండ్లి చేసెను. అతడు కూడ నాభక్తుడయ్యెను. ఏలన పిల్లను కుదిర్చితినని అతడు నాయందు విశ్వాసము చూపుచుండెను. వాడు ఈ జన్మలో కూడ ధనమునకై మిగుల తాపత్రయ పడుచుండెను. నా వద్దకు వచ్చి యాతడు కుటుంబముతో నుండుటచే తన కెక్కువగా ధనము వచ్చునట్లు చేయుమని బతిమాలుచుండెను.

"ఇట్లుండగా కొన్ని విచిత్రములు జరిగెను. ధరలు హఠాత్తుగా పెరిగెను. గౌరి యదృష్టముకొలది పొలమునకు ధర పెరిగెను. కానుకగా నిచ్చిన పొలము ఒక లక్షరూపాయల కమ్మిరి. ఆమె యాభరణముల విలువకు 100 రెట్లు వచ్చెను. అందులో సగము నగదుగా నిచ్చిరి. మిగతా దానిని 25 వాయిదాలలో ఒకొక్క వాయిదాకు 2000 రూపాయల చొప్పున ఇచ్చుటకు నిశ్చయించిరి. అందుకందరు సమ్మతించిరి. కాని ధనమునకై తగవులాడిరి. సలహాకొరకు నావద్దకు వచ్చిరి. ఆ యాస్తి మహాదేవునిది కాబట్టి పూజారిది. పూజారికి కొడుకులు లేనందున సర్వ హక్కులు గౌరికి వచ్చెను. ఆమె సమ్మతి లేనిదే యేమీ ఖర్చు చేయవద్దని చెప్పితిని. ఆమె భర్తకు ఈ పైకముపై నెట్టి యధికారము లేదని బోధించితిని. ఇది విని వీరభద్రప్ప నాపై కోపగించెను. ఆస్తిపై గౌరికే హక్కు గలదని తీర్మానించి దానిని కబళించుటకు నేను యత్నించుచున్నానని నుడివెను. అతని మాటలు విని భగవంతుని ధ్యానించి

ఊరకొంటిని. వీరభద్రప్ప తన భార్య గౌరిని తిట్టెను. అందుచే నామె పగటి పూట నావద్దకు వచ్చి యితరుల మాటలు పట్టించుకొనవలదనియు తనను కూతురుగా జూచుకొనవలెననియు వేడుకొనెను. ఆమె నాయాశ్రయమును కోరుటచే నేనామెను రక్షించుటకు సప్తసముద్రములైన దాటుదునని వాగ్దానమిచ్చితిని. ఆనాడు రాత్రి గౌరి కొక స్వప్నదృశ్యము గనపడెను. మహాదేవుడు స్వప్నములో గనిపించి యిట్లనెను. 'ధనమంతయు నీదే. ఎవరికి నేమియును ఇవ్వవలదు. చెన్నబసప్పతో సలహా చేసి దేవాలయపు మరామతు నిమిత్తము కొంత ఖర్చు చేయుము. ఇతరములకై వ్యయము చేయవలసి వచ్చునప్పుడు మసీదులో నున్న బాబా సలహా తీసుకొమ్ము.' గౌరి నాకీ వృత్తాంతమంతయు దెలిపెను. నేను తగిన సలహా నిచ్చితిని. అసలు తీసికొని వడ్డీలో సగము మాత్రము చెన్నబసప్ప కివ్వుమనియు వీరభద్రప్ప కిందులో జోక్యము లేదనియు నేను గౌరికి సలహానిచ్చితిని. నేనిట్లు మాట్లాడుచుండగా వీరభద్రప్ప చెన్నబసప్ప కొట్లాడుచు నా వద్దకు వచ్చిరి. సాధ్యమైనంతవరకు వారిని సమాధానపరచితిని. గౌరికి మహాదేవుడు చూపిన స్వప్నదృశ్యమును చెప్పితిని. వీరభద్రప్ప మిగుల కోపించి చెన్నబసప్పను ముక్కలు ముక్కలుగా నరికెదనని బెదరించెను. చెన్నబసప్ప పిరికివాడు. వాడు నాపాదములు పట్టి నన్నే యాశ్రయించెను. కోపిష్ఠి శత్రువు బారినుండి కాపాడెదనని నేను వానికి వాగ్దానము చేసితిని. కొంత కాలమునకు వీరభద్రప్ప చనిపోయి పాముగా జన్మించెను; చెన్నబసప్ప కూడ చనిపోయి కప్పగా జన్మించెను. చెన్నబసప్ప బెకబెకలాడుట విని, నేను చేసిన వాగ్దానమును జ్ఞప్తికి దెచ్చుకొని, ఇక్కడకు వచ్చి వానిని రక్షించి, నామాటను పాలించుకొంటిని. భగవంతుడు ఆపదసమయమందు భక్తుల రక్షించుటకై వారి వద్దకు పరుగెత్తును. భగవంతుడు నన్నిచటకు బంపి చెన్నబసప్పను రక్షించెను. ఇదంతయు భగవంతుని లీల."

**నీతి**

ఈ కథవల్ల మనము నేర్చుకొనిన నీతి యేమనగా ఎవరు చేసిన దానిని వారే యనుభవించవలెను. ఇతరులతో గల సంబంధము లన్నిటిని, బాధను కూడ అనుభవించవలెను. తప్పించుకొను సాధనము లేదు. తన కెవరితోనైన

శత్రుత్వమున్న యెడల దానినుండి విముక్తిని పొందవలెను. ఎవరికైన ఏమైన బాకీయున్న దానిని తీర్చివేయవలెను. ఋణముగాని శతృత్వశేషముగాని యున్నచో దానికి తగిన బాధ పడవలెను. ధనమునందు పేరాసగలవాని నది హీనస్థితికి దెచ్చును. తుట్టతుదకు వానికి నాశము కలుగజేయును.

శ్రీసాయినాథాయ నమః

నలుబదియేడవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నలుబదియెనిమిదవ అధ్యాయము

*భక్తుల ఆపదలు బాపుట: 1. శేవడే 2. సపత్నేకరుల కథలు*

**ఈ** యధ్యాయము ప్రారంభించునప్పు డెవరో హేమాడ్‌పంతును *"బాబా గురువా? లేక సద్గురువా?"* యని ప్రశ్నించిరి. ఆ ప్రశ్నకు సమాధాన మిచ్చుటకై సద్గురువు లక్షణములను హేమాడ్‌పంతు ఇట్లు వర్ణించుచున్నారు.

### సద్గురుని లక్షణములు

ఎవరు మనకు వేదవేదాంతములను షట్‌శాస్త్రములను బోధించెదరో, ఎవరు చక్రాంకితము చేసెదరో, ఎవరు ఉచ్ఛ్వాసనిశ్శ్వాసములను బంధించెదరో, ఎవరు బ్రహ్మమును గూర్చి అందముగా నుపన్యసించెదరో, ఎవరు భక్తులకు మంత్రోపదేశము చేసి దానిని పునఃశ్చరణము చేయుమందురో, ఎవరు తమ వాక్శక్తిచే జీవితపరమావధిని బోధించగలరో, కాని ఎవరు స్వయముగా ఆత్మసాక్షాత్కారము పొందలేరో అట్టివారు సద్గురువులు కారు. ఎవరయితే చక్కని సంభాషణలవల్ల మనకు ఇహపరసుఖములందు విరక్తి కలుగజేసెదరో, ఎవరాత్మసాక్షాత్కారమందు మన కభిరుచి కలుగునట్లు జేసెదరో, యెవరైతే ఆత్మసాక్షాత్కార విషయమున పుస్తకజ్ఞానమేగాక ఆచరణయం దనుభవము కూడ పొంది యున్నారో అట్టివారు సద్గురువులు. ఆత్మసాక్షాత్కారమును స్వయముగ పొందని గురువు దానిని

శిష్యులకెట్లు ప్రసాదించగలరు? సద్గురువు స్వప్నమందయినను శిష్యులనుండి సేవనుగాని ప్రతిఫలమునుగాని యాశించడు. దానికి బదులుగా శిష్యులకు సేవ చేయతలచును. తాను గొప్పవాడనియు తన శిష్యుడు తక్కువవాడనియు భావించడు. సద్గురువు తన శిష్యుని కొడుకువలె ప్రేమించుటయేగాక తనతో సరిసమానముగా జూచును లేదా పరబ్రహ్మ స్వరూపముగా జూచును. సద్గురుని ముఖ్యలక్షణ మేమన, వారు శాంతమున కునికిపట్టు. వారెన్నడు చాపల్యమునుగాని చికాకుగాని చెందరు. తమ పాండిత్యమునకు వారు గర్వించరు. ధనవంతులు, పేదలు, ఘనులు, నీచులు వారికి సమానమే.

హేమాడ్‌పంతు తన పూర్వజన్మ సుకృతముచే సాయిబాబా వంటి సద్గురువు ఆశీర్వాదమును, సహవాసమును పొందెనని తలంచెను. బాబా యౌవనమందు కూడ ధనము కూడబెట్టలేదు. వారికి కుటుంబముగాని స్నేహితులుగాని, యిల్లుగాని, ఎట్టి యాధారముగాని లేకుండెను. 18 ఏండ్ల వయస్సునుండి వారు మనస్సును స్వాధీనమందుంచుకొనిరి. వారొంటరిగా, నిర్భయముగా నుండెడివారు. వారెల్లపు డాత్మానుసంధానమందు మునిగి యుండెడివారు. భక్తుల స్వచ్ఛమైన యభిమానమును జూచి వారి మేలుకొరకేవైన చేయుచుండెడివారు. ఈ విధముగా వారు తమ భక్తులపై ఆధారపడి యుండెడివారు. వారు భౌతికశరీరముతో నున్నప్పుడు తమ భక్తులకు ఏ యనుభవముల నిచ్చుచుండిరో, యట్టివి వారు మహాసమాధి చెందిన పిమ్మటకూడ వారి పై నాధారపడిన భక్తులకిప్పటికినీ నొసగుచున్నారు. అందుచే భక్తులు చేయవలసిన దేమన - భక్తి విశ్వాసములనెడు హృదయదీపమును సరిచేయ వలెను. ప్రేమయను వత్తిని వెలిగించవలెను. ఎప్పుడిట్లు చేసెదరో, యప్పుడు జ్ఞానమనే జ్యోతి (ఆత్మ సాక్షాత్కారము) వెలిగి ఎక్కువ తేజస్సుతో ప్రకాశించును. ప్రేమలేని జ్ఞానము ఉత్తది. అట్టి జ్ఞానమెవరికి అక్కరలేదు. ప్రేమ లేనిచో సంతృప్తి యుండదు. కనుక మనకు అవిచ్ఛిన్నమైన అపరిమితప్రేమ యుండవలెను. ప్రేమను మన మెట్లు పొగడగలము? ప్రతి వస్తువు దాని యెదుట ప్రాముఖ్యము లేనిదగును. ప్రేమ యనునదే లేనియెడల చదువుటగాని, వినుటగాని, నేర్చుకొనుటగాని నిష్ఫలములు. ప్రేమ యనునది వికసించినచో భక్తి, నిర్వ్యామోహము, శాంతి, స్వేచ్ఛలు

పూర్తిగా నొకటి తరువాత నింకొకటి వచ్చును. దేనిని గూర్చిగాని మిక్కిలి చింతించనిదే దానియందు మనకు ప్రేమ కలుగదు. యదార్థమైన కాంక్ష, ఉత్తమమైన భావమున్న చోటనే భగవంతుడు తానై సాక్షాత్కరించును. అదియే ప్రేమ; అదే మోక్షమునకు మార్గము.

ఈ యధ్యాయములో చెప్పవలసిన ముఖ్యకథను పరిశీలించెదము. స్వచ్ఛమైన మనస్సుతో నెవరైనను నిజమైన యోగీశ్వరుని వద్దకు బోయి వారి పాదములపై బడినచో, తుట్టతుద కతడు రక్షింపబడును. ఈ విషయము దిగువ కథవలన విశదపడును.

**శేవడే**

షోలాపూర్ జిల్లా అక్కల్‌కోట నివాసి, సపత్నేకర్ న్యాయ పరీక్షకు చదువుచుండెను. తోటి విద్యార్థి శేవడే అతనితో చేరెను. ఇతర విద్యార్థులు కూడ గుమిగూడి తమ పాఠముల జ్ఞానము సరిగా నున్నది లేనిది చూచుకొనుచుండిరి. ప్రశ్నోత్తరముల వలన శేవడేకు ఏమియు రానట్లు తోచెను. తక్కిన విద్యార్థులు అతనిని వెక్కిరించిరి. అతడు పరీక్షకు సరిగా చదువకపోయినను తనయందు సాయిబాబా కృప యుండుటచే ఉత్తీర్ణుడనగుదునని చెప్పెను. అందుకు సపత్నేకర్ యాశ్చర్యపడెను. సాయిబాబా యెవరు? వారినేల యంత పొగడుచున్నావు? అని అడిగెను. అందువలన శేవడే యిట్లనెను. "శిరిడీ మసీదులో నొక ఫకీరు గలరు. వారు గొప్ప సత్పురుషులు, యోగులితరు లున్నను, వారమోఘమైన వారు. పూర్వజన్మ సుకృతమున్న గాని, మనము వారిని దర్శించలేము. నేను పూర్తిగా వారినే నమ్మి యున్నాను. వారు పలుకునది యెన్నడు అసత్యము కానేరదు. నేను పరీక్షలో తప్పక యుత్తీర్ణుడ నగుదునని వారు నన్ను ఆశీర్వదించి యున్నారు. కనుక వారి కృపచే తప్పక చివరి పరీక్షయందుత్తీర్ణుడ నయ్యెద" ననెను. సపత్నేకర్ తన స్నేహితుని ధైర్యమునకు నవ్వెను. వానిని బాబాను కూడ వెక్కిరించెను.

**సపత్నేకర్ దంపతులు**

సపత్నేకర్ న్యాయపరీక్షలో నుత్తీర్ణుడయ్యెను. అక్కల్‌కోటలో వృత్తిని ప్రారంభించి, యచట న్యాయవాది యాయెను. పది సంవత్సరముల పిమ్మట

అనగా 1913లో వానికి గల యొకే కుమారుడు గొంతు వ్యాధితో చనిపోయెను. అందువలన అతని మనస్సు వికలమయ్యెను. పండరీపురం, గాణగాపురం మొదలగు పుణ్యక్షేత్రములకు యాత్రార్థము పోయి శాంతి పొందవలె ననుకొనెను. కాని యతనికి శాంతి లభించలేదు. వేదాంతము చదివెను గాని యది కూడ సహాయపడలేదు. అంతలో శేవడే మాటలు, అతనికి బాబాయందుగల భక్తియు జ్ఞప్తికి వచ్చెను. కాబట్టి తాను కూడ శిరిడీకి పోయి శ్రీసాయిని చూడవలె ననుకొనెను. అతడు తన సోదరుడగు పండితరావుతో శిరిడీకి వెళ్ళెను. దూరమునుండియే బాబా దర్శనము చేసి సంతసించెను. గొప్ప భక్తితో బాబా వద్దకేగి యొక టెంకాయ నచట బెట్టి, బాబా పాదములకు సాష్టాంగనమస్కారము చేసెను. "బయటకు పొమ్ము!" అని బాబా యరచెను. సపత్నేకర్ తలవంచుకొని కొంచెము వెనుకకు జరిగి యచట కూర్చుండెను. బాబా కటాక్షమును పొందుట కెవరి సలహాయైన తీసికొనుటకు యత్నించెను. కొందరు బాలాషింపి పేరు చెప్పిరి. అతని వద్దకు పోయి సహాయమును కోరెను. వారు బాబా ఫోటోలను కొని బాబా వద్దకు మసీదుకు వెళ్ళిరి. బాలాషింపి ఒక ఫోటోను బాబా చేతిలో బెట్టి యదెవరిదని యడిగెను. దానిని ప్రేమించువారిదని బాబా చెప్పుచు సపత్నేకర్ వయిపు చూపెను. బాబా నవ్వగా నచటివారందరు నవ్విరి. బాలా ఆ నవ్వుయొక్క ప్రాముఖ్యమేమని బాబాను అడుగుచు సపత్నేకర్‌ను దగ్గరకు జరిగి బాబా దర్శనము చేయుమనెను. సపత్నేకర్ బాబా పాదములకు నమస్కరించగా, బాబా తిరిగి వెడలి పొమ్మని యరచెను. సపత్నేకరు కేమి చేయవలెనో తోచకుండెను. అన్నదమ్ములిద్దరు చేతులు జోడించుకొని బాబా ముందు కూర్చుండిరి. మసీదు ఖాళీ చేయుమని బాబా సపత్నేకర్‌ను ఆజ్ఞాపించెను. ఇద్దరు విచారముతో నిరాశ జెందిరి. బాబా యాజ్ఞను పాలించవలసి యుండుటచే సపత్నేకర్ శిరిడీ విడువవలసి వచ్చెను. ఇంకొకసారి వచ్చినప్పుడైన దర్శన మివ్వవలెనని అతడు బాబాను వేడెను.

**సపత్నేకర్ భార్య**

ఒక సంవత్సరము గడచెను. కాని అతని మనసు శాంతి పొందకుండెను. అతడు గాణగాపురము వెళ్ళెను కాని యశాంతి హెచ్చెను. విశ్రాంతికై మాఢేగాం వెళ్ళెను; తుదకు కాశీ వెళ్ళుటకు నిశ్చయించుకొనెను. బయలు దేరుటకు

రెండు దినములకు ముందు అతని భార్యకొక స్వప్నదృశ్యము గనపడెను. స్వప్నములో నామె నీళ్ళ కొరకు కుండ పట్టుకొని లకడ్షాబావికి పోవుచుండెను. అచ్చట నొక ఫకీరు తలకొక గుడ్డ కట్టుకొని, వేపచెట్టు మొదట కూర్చున్నవారు తనవద్దకు వచ్చి *"ఓ అమ్మాయి! అనవసరముగా శ్రమపడెద వేల? నేను స్వచ్ఛజలముతో నీ కుండ నింపెదను"* అనెను. ఆమె ఫకీరుకు భయపడి, ఉత్తకుండతో వెనుకకు తిరిగి పోయెను. ఫకీరు ఆమెను వెన్నంటెను. ఇంతటితో ఆమెకు మెలకువ కలిగి నేత్రములు తెరచెను. ఆమె తన కలను భర్తకు జెప్పెను. అదియే శుభశకున మనుకొని యిద్దరు శిరిడీకి బయలుదేరిరి. వారు మసీదు చేరునప్పటికి బాబా యక్కడ లేకుండెను. వారు లెండీతోటకు వెళ్ళి యుండిరి. బాబా తిరిగి వచ్చువరకు వారచట ఆగిరి. ఆమె స్వప్నములో తాను జూచిన ఫకీరుకు బాబాకు భేదమేమియు లేదనెను. ఆమె మిగుల భక్తితో బాబాకు సాష్టాంగముగా నమస్కరించి బాబాను చూచుచు అచటనే కూర్చుండెను. ఆమె యణకువ జూచి సంతసించి బాబా తన మామూలు పద్ధతిలో నొక కథ చెప్పుటకు మొదలిడెను. *"నా చేతులు, పొత్తికడుపు, నడుము చాల రోజులనుండి నొప్పి పెట్టుచున్నవి. నే ననేకౌషధములు పుచ్చుకొంటిని, కాని నొప్పులు తగ్గలేదు. మందులు ఫలమీయకపోవుటచే విసుగు జెందితిని. కాని నొప్పులన్ని నిచట వెంటనే నిష్క్రమించుట కాశ్చర్యపడుచుంటిని"* అనెను. పేరు చెప్పనప్పటికి ఆ వృత్తాంతమంతయు సపత్నేకర్ భార్యదే. ఆమె నొప్పులు బాబా చెప్పిన ప్రకారము త్వరలో తగ్గి పోవుటచే నామె సంతసించెను.

సపత్నేకర్ ముందుగా పోయి దర్శనము చేసికొనెను. మరల బాబా బయటకు పొమ్మనెను. ఈసారి యతడు మిక్కిలి పశ్చాత్తాపపడి యెక్కువ శ్రద్ధతో నుండెను. ఇది బాబాను తాను పూర్వము నిందించి యెగతాళి చేసినదాని ప్రతిఫలమని గ్రహించి, దాని విరుగుడు కొరకు ప్రయత్నించుచుండెను. బాబా నొంటరిగా కలిసికొని వారిని క్షమాపణ కోరవలెనని యత్నించుచుండెను. అట్లే యొనర్చెను. అతడు తన శిరస్సును బాబా పాదములపై బెట్టెను. బాబా తన వరదహస్తమును సపత్నేకర్ తలపయి బెట్టెను. బాబా కాళ్ళనొత్తుచు సపత్నేకర్ అక్కడనే కూర్చుండెను. అంతలో ఒక గొల్లస్త్రీ వచ్చి బాబా నడుమును బట్టుచుండెను. బాబా యొక కోమటి

గూర్చి కథ చెప్పదొడంగెను. వాని జీవితములోని కష్టములన్నియు వర్ణించెను. అందులో వాని యొకే కొడుకు మరణించిన సంగతి కూడ చెప్పెను. బాబా చెప్పిన కథ తనదే యని సపత్నేకర్ మిక్కిలి యాశ్చర్యపడెను. బాబాకు తన విషయములన్నియు దెలియుటచే విస్మయమందెను. బాబా సర్వజ్ఞుడని గ్రహించెను. అతడందరి హృదయముల గ్రహించుననెను. ఈ యాలోచనలు మనస్సున మెదలుచుండగా బాబా ఆ గొల్లస్త్రీకి చెప్పుచున్నట్లే నటించి సపత్నేకర్ వైపు జూపించి యిట్లనెను. "వీడు తన కొడుకును నేను చంపితినని నన్ను నిందించుచున్నాడు. నేను లోకుల బిడ్డలను జంపెదనా? ఇతడు మసీదునకు వచ్చి యేడ్చుచున్నా డేల? అదే బిడ్డను వీని భార్య గర్భములోనికి మరల దెచ్చెదను." ఈమాటలతో బాబా యతని తలపై హస్తముంచి యోదార్చి యిట్లనియె. "ఈ పాదములు ముదుసలివి, పవిత్రమైనవి. ఇక నీ కష్టములు తీరిపోయినవి. నా యందే నమ్మకముంచుము. నీ మనోభీష్టములు నెరవేరును." సపత్నేకర్ మైమరచెను. బాబా పాదములను కన్నీటితో తడిపెను. తరువాత తన బసకు పోయెను.

సపత్నేకర్ పూజాసామాగ్రి నమర్చుకొని నైవేద్యముతో మసీదుకు భార్యతో బోయి ప్రతిరోజు బాబాకు సమర్పించి వారి వద్ద ప్రసాదము పుచ్చుకొను చుండెడివాడు. ప్రజలు మసీదులో గుమిగూడి యుండెడివారు. సపత్నేకర్ మాటిమాటికి నమస్కరించుచుండెను. ప్రేమవినయములతో నొక్కసారి నమస్కరించిన చాలునని బాబా నుడివెను. ఆనాడు రాత్రి సపత్నేకర్ బాబా చావడి యుత్సవమును జూచెను. అందు బాబా పాండురంగనివలె ప్రకాశించెను.

ఆ మరుసటి దినమింటికి పోవునప్పుడు బాబాకు మొదట ఒక రూపాయి దక్షిణ యిచ్చి తిరిగి యడిగినచో రెండవ రూపాయి లేదనక యివ్వవచ్చునని సపత్నేకర్ అనుకొనెను. మసీదుకు బోయి ఒక రూపాయి దక్షిణ నివ్వగా బాబా యింకొక రూపాయి కూడ అడిగెను. బాబా వానిని ఆశీర్వదించి యిట్లనెను. "టెంకాయను దీసికొనుము. నీ భార్య చీరకొంగులో పెట్టుము. హాయిగా పొమ్ము. మనస్సునందెట్టి యాందోళనము నుంచకుము!" అతడట్లే చేసెను. ఒక సంవత్సరములో కొడుకు పుట్టెను. 8 మాసముల శిశువుతో

భార్యాభర్తలు శిరిడీకి వచ్చి ఆ శిశువును బాబా పాదములపై బెట్టి యిట్లు ప్రార్థించిరి. "ఓ సాయీ! నీ బాకీ నెటుల తీర్చుకొనగలమో మాకు తోచకున్నది. కనుక మీకు సాష్టాంగ నమస్కారము చేయుచుంటిమి. నిస్సహాయుల మగుటచే మమ్ముద్ధరించ వలసినది. ఇక మీదట మేము మీ పాదములనే యాశ్రయించెదము గాక. అనేకాలోచనలు, సంగతులు స్వప్నావస్థలోను, జాగ్రదవస్థలోను మమ్ముల బాధించును. మా మనస్సులను నీ భజనవైపు మరల్చి మమ్ము రక్షింపుము!"

ఆ దంపతులు తమ కుమారునకు మురళీధర్ యను పేరు పెట్టిరి. తరువాత భాస్కర్, దినకర్ యను నిద్దరు జన్మించిరి. బాబా మాటలు వృధా పోవని సపత్నేకర్ దంపతులు గ్రహించిరి. అవి యక్షరాల జరుగునని కూడ నమ్మిరి.

శ్రీసాయినాథాయ నమః

నలుబదియెనిమిదవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## నలుబదితొమ్మిదవ అధ్యాయము

1. హరి కానోబా, 2. సోమదేవ స్వామి, 3. నానాసాహెబు చాందోర్కరు - కథలు

**వే**దములు, పురాణములు బ్రహ్మమును లేదా సద్గురువును సరిగా పొగడలేవు. అట్లయినప్పుడు మావంటి మూర్ఖులు సద్గురువగు సాయిబాబాను ఎట్లు వర్ణించగలరు? ఈ విషయములో మాట్లాడక ఊరుకొనుటయే మేలని తోచుచున్నది. మౌనవ్రతమును పూనుటయే సద్గురుని స్తుతించుటకు తగిన మార్గమని తోచును. కాని సాయిబాబా సుగుణములను జూచినచో మా వ్రతమును మరచి మమ్ములను మాట్లాడునట్లు ప్రేరేపించును. మన స్నేహితులుగాని, బంధువులుగాని మనతో లేకున్నచో మంచి పిండివంటలు కూడ రుచింపవు. కాని వారు మనతో నున్నచో ఆ పిండి వంటలు మరింత రుచికరములగును. సాయిలీలామృతము కూడ అట్టిదే. దీనిని మన మొంటరిగా తినలేము. స్నేహితులు, బంధువులు కలసినచో చాల బాగుగా నుండును.

ఈ కథలను సాయిబాబా ప్రేరేపించి వారి యిష్టానుసారము మాచే వ్రాయించెదరు. వారికి సర్వస్యశరణాగతి యొనర్చి వారియందే ధ్యానము నిలుపుట మా కర్తవ్యము. తీర్థయాత్ర, వ్రతము, త్యాగము, దానములకంటె తపస్సు చేయుట గొప్ప. హరిని పూజించుట తపస్సు కంటె మేలు. సద్గురుని

ధ్యానించుట యన్నిటికంటె మేలయినది. కాబట్టి మనము సాయినామమును నోటితో పలుకుచు వారి పలుకులను మననము చేయుచు, వారి యాకారమును మనస్సున భావించుకొనుచు, వారిపై హృదయపూర్వకమగు ప్రేమతో, వారికొరకే సమస్తకార్యములను చేయుచుండవలెను. సంసారబంధమునుండి తప్పించుకొనుటకు దీనికి మించిన సాధనము లేదు. పైన వివరింపబడిన ప్రకారము మన కర్తవ్యమును మనము చేయగలిగినచో, సాయి తప్పనిసరిగా మనకు సహాయము చేయును. తుదకు మోక్షము నిచ్చును. ఇక నీ యధ్యాయములోని కథలవైపు మరలుదము.

**హరి కానోబా**

హరి కానోబా యను బొంబాయి పెద్దమనుష్యుడొకడు తన స్నేహితువల్ల బంధువులవల్ల బాబాలీల లనేకములు వినెను, కాని నమ్మలేదు. కారణమేమన అతనిది సంశయస్వభావము. బాబాను స్వయముగా పరీక్షించవలెనని యతని కోరిక. కొంతమంది బొంబాయి స్నేహితులతో అతడు శిరిడీకి వచ్చెను. అతని తలపై జలతారు పాగా యుండెను. అతని పాదములకు క్రొత్త చెప్పులుండెను. కొంతదూరమునుండి బాబాను చూచి బాబా వద్దకు బోయి సాష్టాంగనమస్కారము చేయవలె ననుకొనెను. క్రొత్త చెప్పులెచట నుంచవలెనో ఆతనికి తెలియలేదు. చెప్పులు మసీదు ముందొక మూలన బెట్టి బాబా దర్శనమునకు బోయెను. బాబాకు భక్తిపూర్వకమైన నమస్కారము చేసి ఊదీని, ప్రసాదమును బాబా చేతినుండి యందుకొని తిరిగివచ్చెను. మూలకు పోయి చూచుసరికి చెప్పులు కనిపించలేదు. చెప్పులకొరకు వెదకెను. కాని నిష్ప్రయోజనమయ్యెను. చాల చికాకు పడుచు బసకు వచ్చెను.

అతడు స్నానము చేసి, పూజ చేసి, నైవేద్యము పెట్టి భోజనమునకు కూర్చుండెను. కాని తన చెప్పుల గూర్చియే చింతించుచుండెను. భోజనానంతరము, చేతులు కడుగుకొనుటకు బయటకు వచ్చెను. ఒక మరాటీ కుఱ్ఱవాడు తనవైపు వచ్చుట చూచెను. ఆ కుఱ్ఱవాని చేతిలో నొక కఱ్ఱ యుండెను. దాని చివరన క్రొత్త చెప్పులజత వ్రేలాడుచుండెను. చేతులు కడుగుకొనుటకు బయటకు వచ్చిన వారితో అతడు బాబా తనను బంపెననియు వీథిలో 'హరికా బేటా, జరీకా ఫేటా'యని యరచుమనియు

చెప్పెననెను. ఎవరయిన ఆ చెప్పులు తమవే యన్నచో నతని పేరు హరి యనియు, నతడు కానోబా కొడుకనియు, అతని తలపై జరీపాగా గలదా యను సంగతి పరీక్షించిన తరువాత చెప్పుల నిచ్చివేయుమని చెప్పెననెను. ఈ కుఱ్ఱవాడిట్లు చెప్పుట విని, హరి కానోబా యాశ్చర్యానందములు పొందెను. కుఱ్ఱవానివద్దకు బోయి చెప్పులు తనవని రూఢి చేసెను. అతడు తన పేరు హరి యనియు, తాను కానోబా కుమారుడననియు తన తలపై ధరించు జరీపాగాను చూపెను. ఆ కుఱ్ఱవాడు సంతృప్తి జెంది చెప్పుల నిచ్చివేసెను. హరి కానోబా మిక్కిలి యాశ్చర్యపడెను. తన జల్తారుపాగా యందరికి కనిపించవచ్చునుగాని, తన పేరు, తన తండ్రి పేరు బాబా కెట్లు దెలిసెను? అదియే శిరిడీకి మొదటిసారి తన రాక. అతడచ్చటకు బాబాను పరీక్షించుటకే వచ్చెను. ఈ విషయమువల్ల నాతడు బాబా గొప్ప సత్పురుషుడని గ్రహించెను. అతనికి కావలసినది బాబాను పరీక్షించుట. అది పూర్తిగా నెరవేరెను. సంతోషముతో నింటికి పోయెను.

### సోమదేవస్వామి

బాబాను పరీక్షించుటకై యింకొకరు వచ్చిరి. వారి కథను వినుడు. కాకాసాహెబు దీక్షిత్ తమ్ముడు భాయీజీ నాగపూరులో నివసించుచుండెను. 1906వ సంవత్సరములో హిమాలయమునకు బోయినప్పుడు సోమదేవ స్వామి యను సాధువుతో అతనికి పరిచయము కలిగెను. ఆ సాధువు గంగోత్రికి దిగువ ఉత్తరకాశీకి చెందినవారు. వారి మఠము హరిద్వారములో గలదు. ఇద్దరు పరస్పరము తమ చిరునామాలు వ్రాసికొనిరి. 5 సంవత్సరముల పిమ్మట సోమదేవస్వామి నాగపూరు వచ్చి భాయీజీ యింట్లో దిగెను. బాబా లీలలను విని సంతసించెను. శిరిడీకి పోయి బాబాను చూడవలెనని అతనికి గట్టికోరిక కలిగెను. భాయీజీ వద్దనుంచి పరిచయపుటుత్తరమును దీసికొని శిరిడీకి పోయెను. మన్మాడు, కోపర్‌గాం దాటిన పిమ్మట టాంగా చేసికొని శిరిడీకి పోవుచుండెను. శిరిడీ సమీపమునకు రాగా మసీదుపై రెండు పెద్ద జండాలు కనిపించెను. సాధారణముగా యోగులు వేర్వేరు వైఖరులతోను వేర్వేరు జీవనపద్ధతులతోను, వేర్వేరు బాహ్యాలంకారములతోను ఉందురు. కాని యీ పైపై గుర్తులను బట్టి యే యోగియొక్క గొప్పదనమును గనిపెట్టలేము.

సోమదేవస్వామికి ఇదంతయు వేరే పంథాగా దోచెను. రెండు పతాకము లెగురుట చూడగనే తనలో తాను "ఈ యోగి జండాలయందేల మక్కువ జూపవలెను? అది యోగికి తగినది కాదు. దీనిని బట్టి ఈ యోగి కీర్తికొరకు పాటుపడుచున్నట్లు తోచుచున్నది" అనుకొనెను. ఇట్లు ఆలోచించుకొని, శిరిడీకి పోవుట మానుకొన నిశ్చయించినట్లు తనతోనున్న యితర యాత్రికులకు జెప్పెను. వారతనితో నిట్లనిరి. "అట్లయిన ఇంత దూరము వచ్చితి వేల? జండాలను చూచినంతలో నీ మనస్సు చికాకు పడినచో శిరిడీలో రథము, పల్లకి, గుఱ్ఱము మొదలగు బాహ్యాలంకారములు చూచినచో మరెంత చికాకు పొందెదవు?" సోమదేవస్వామి గాభరాపడి యిట్లనెను. "గుఱ్ఱములతోను, పల్లకీతోను, జట్కాలతోను గల సాధువులను నేనెచ్చట జూచి యుండలేదు. అట్టి సాధువులను చూచుటకంటె తిరిగిపోవుటయే మేలు" అనెను. ఇట్లనుచు తిరుగు ప్రయాణమునకు సిద్ధమయ్యెను. తక్కిన తోటి ప్రయాణీకులు ఆతనిని తన ప్రయత్నమును మాని శిరిడీ లోనికి బొమ్మనిరి. అట్టి వక్రాలోచనను మానుమనిరి. బాబా యా జండాలను కాని తక్కిన వస్తువులనుగాని ఆడంబరములనుగాని కీర్తినిగాని లక్ష్యపెట్టనివారని చెప్పిరి. అవన్నియు నలంకరించినవారు బాబా భక్తులేగాని ఆయనకేమి యవసరముగాని సంబంధముగాని లేదనిరి. వారి భక్తి ప్రేమల కొలది వారు వాటిని కూర్చిరని చెప్పిరి. తుట్టతుదకు ప్రయాణము సాగించి శిరిడీకి పోయి సాయిబాబాను చూచునట్లు జేసిరి.

సోమదేవస్వామి మసీదు దిగువనుంచి బాబాను దర్శించగనే అతని మనస్సు కరగెను. అతని కండ్లు నీటితో నిండెను; గొంతుక యార్చుకొని పోయెను. అతని కుంటి యాలోచన లన్నియు నడుగంటి పోయెను. "ఎచ్చట మనస్సు శాంతించి యానందమును పొంది యాకర్షింపబడునో అదే మనము విశ్రాంతి పొందవలసిన స్థలము" అని తన గురువు చెప్పిన దానిని జ్ఞప్తికి దెచ్చుకొనెను. అతడు బాబా పాదధూళిలో దొర్లుటకు తహతహలాడెను. బాబా దర్శనముకొరకు దగ్గరకు పోగా "మా వేషము మాదగ్గరనే యుండనీ, నీ యింటికి నీవు పొమ్ము. తిరిగి మసీదుకు రావద్దు. ఎవరయితే మసీదుపై జండా నెగురవైచుచున్నారో యట్టివారి దర్శనము చేయనేల? ఇది యోగి

లక్షణమా? ఇక్కడొక నిమిషమయిన ఉండవద్దు" అనెను. ఆ స్వామి మిగుల ఆశ్చర్యపడెను. బాబా తన మనస్సును గ్రహించి బయటికి ప్రకటించుచున్నారని తెలిసికొనెను. అతడెంత సర్వజ్ఞుడు! తాను తెలివితక్కువవాడనియు బాబా మహానుభావుడనియు గ్రహించెను. బాబా కొందరిని కౌగలించుకొనుట, కొందరిని యాశీర్వదించుట, కొందరిని యోదార్చుట, కొందరివైపు దాక్షిణ్యముతో జూచుట, కొందరివైపు చూచి నవ్వుట, ఊదీ ప్రసాదమును కొందరి కిచ్చుట, యిట్లు అందరిని ఆనందింపజేసి, సంతృప్తి పరచుట జూచి తన నొక్కరినే యేల యంత కఠినముగ జూచుచుండెనో అతనికి తెలియకుండెను. తీవ్రముగా నాలోచించి బాబా చేయునదంతయు తన యంతరంగమున నున్న దానితో సరిగా నుండెనని గ్రహించెను. దానివల్ల పాఠము నేర్చుకొని వృద్ధిపొందుటకు యత్నించవలెనని గ్రహించెను. బాబా కోపము మారురూపముతో నున్న యాశీర్వాదమే యనుకొనెను. కొన్నాళ్ళ పిమ్మట బాబాయందు ఆతనికి నమ్మకము బలపడెను. అతడు బాబాకు గొప్ప భక్తుడయ్యెను.

### నానాసాహెబు చాందోర్కరు

ఈ యధ్యాయమును హేమాడ్‌పంతు నానాసాహెబు చాందోర్కరు కథతో ముగించెను. ఒకనాడు నానాసాహెబు మసీదులో మహల్సాపతి మొదలగు వారితో కూర్చొని యుండగా బీజాపూరునుండి ఒక మహమ్మదీయుడు కుటుంబముతో బాబాను జూచుటకు వచ్చెను. అతనితో ఘోషా స్త్రీ లుండుటచే నానాసాహెబు అచ్చటనుంచి లేవనెంచెను. కాని బాబా యాతని నివారించెను. స్త్రీలు వచ్చి బాబా దర్శనము చేసికొనిరి. అందులో నొక స్త్రీ ముసుగు దీసి బాబా పాదములకు నమస్కరించి తిరిగి మునుగు వేసికొనెను. నానాసాహెబు ఆమె ముఖసౌందర్యమును చూచి మరల మరల చూడగోరెను. నానా యొక్క చాంచల్యమును జూచి, స్త్రీలు వెళ్ళిపోయిన పిమ్మట, బాబా నానాతో నిట్లనెను. "నానా! అనవసరముగా చికాకు పడుచుంటి వేల? ఇంద్రియములను వాని పనులను జేయనిమ్ము. వానిలో మనము జోక్యము కలుగ జేసికొన గూడదు. దేవుడు ఈ సుందరమైన ప్రపంచమును సృష్టించియున్నాడు, గాన అందరిని చూచి సంతసించుట మన విధి. క్రమముగాను మెల్లగాను మనస్సు స్థిరపడి

శాంతించును. ముందు ద్వారము తెరిచియుండగా వెనుక ద్వారము గుండా పోనేల? మన హృదయము స్వచ్ఛముగా నున్నంతవరకు నేమియు దోషములేదు. మనలో చెడ్డ యాలోచన లేనప్పుడితరులకు భయపడనేల? నేత్రములు వానిపని యవి నెరవేర్చు కొనవచ్చును. నీవు సిగ్గుపడి బెదరనేల?"

శ్యామా యచ్చటనే యుండెను. కాని బాబా చెప్పినదానిని గ్రహించలేక పోయెను. ఇంటికి పోవు దారిలో శ్యామా ఆ విషయమై నానా నడిగెను. ఆ చక్కని స్త్రీ వైపు జూచి తాను పొందిన యా చంచలత్వమును గూర్చి నానా చెప్పెను. బాబా దానిని గ్రహించి యెట్లు సలహానిచ్చెనో వివరించెను. బాబా చెప్పిన దాని భావము నానా యిట్లు చెప్ప దొడంగెను. "మనస్సు సహజముగా చంచలమైనది. దానిని ఉద్రేకించునట్లు చేయరాదు. ఇంద్రియములు చలింపవచ్చును. శరీరమును స్వాధీనమునందుంచుకొనవలెను. దాని యోరిమి పోవునట్లు చేయరాదు. ఇంద్రియములు విషయములవైపు పరుగెత్తును. కాని మనము వానివెంట పోరాదు. మనము ఆ విషయములను కోరగూడదు. క్రమముగాను, నెమ్మదిగాను సాధన చేయుటవలన చంచలత్వమును జయించవచ్చును. ఇంద్రియములకు మనము లోబడగూడదు. కాని వానిని మనము పూర్తిగ స్వాధీనమందుంచు కొనలేము. సమయానుకూలముగా వాని నణచి సరిగా నుంచుకొనుచుండవలెను. నేత్రము లందమైనవానిని జూచుట కొరకే యివ్వబడినవి. విషయముల సౌందర్యమును నిర్భయముగా చూడవచ్చును. భయమునకుగాని, లజ్జకుగాని యవకాశము లేదు. దురాలోచనలు మనస్సునందుంచుకొనరాదు. మనస్సున ఎట్టి కోరికయు లేక భగవంతుని సుందరమైన సృష్టిని చూడుము. ఈ విధముగా నింద్రియములను సులభముగాను, సహజముగాను స్వాధీనము చేసికొనవచ్చును. విషయము లనుభవించుటలో కూడ నీవు భగవంతుని జ్ఞప్తియందుంచుకొనెదవు. బాహ్యేంద్రియములను మాత్రము స్వాధీనమందుంచుకొని మనస్సును విషయములవైపు పరుగిడనిచ్చినచో, వానిపై అభిమానముండనిచ్చినచో చావుపుట్టుకల చక్రము నశింపదు. ఇంద్రియవిషయములు హానికరమయినవి. వివేకము (అనగా నిత్యానిత్యములకు భేదమును గ్రహించుట) సారథిగా, మనస్సును స్వాధీనమందుంచుకొనవలెను. ఇంద్రియముల నిచ్చవచ్చినట్లు

సంచరింపజేయరాదు. అటువంటి సారథితో విష్ణుపదమును చేరగలము. అదియే మన గమ్యస్థానము. అదియే మన నిజమైన యావాసము. అచట నుండి తిరిగి వచ్చుటలేదు.

శ్రీసాయినాథాయ 'నమః

**నలుబదితొమ్మిదవ అధ్యాయము**

**సంపూర్ణము**



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాథాయ నమః

# శ్రీసాయిసచ్చరిత్రము

## ఏబదియవ అధ్యాయము

1. కాకాసాహెబు దీక్షిత్ 2. టెంబెస్వామి 3. బాలారామ్ ధురంధర్ కథలు.

శ్రీసాయిసచ్చరిత్ర మూలములోని 50వ అధ్యాయము 39వ అధ్యాయములో చేర్చుట జరిగినది. కారణము అందులోని యితివృత్తముగూడ నిదియే కనుక. సచ్చరిత్రలోని 51వ అధ్యాయ మిచ్చుట 50వ అధ్యాయముగా పరిగణించవలెను.

భక్తుల కాశ్రయమైన శ్రీసాయికి జయమగుగాక! వారు మన సద్గురువులు. వారు మనకు గీతార్థమును బోధించెదరు. మనకు సర్వశక్తులను కలుగజేయుదురు. ఓ సాయీ! మాయందు కనికరించుము. మమ్ము కటాక్షింపుము. చందనవృక్షములు మలయపర్వతముపై పెరిగి వేడిని పోగొట్టును. మేఘములు వర్షమును గురిపించి చల్లదనము కలుగజేయుచున్నవి. వసంతఋతువునందు పుష్పములు వికసించి అవి దేవుని పూజ చేయుటకు వీలు కలుగజేయుచున్నవి. అట్లనే సాయిబాబా కథలు మనకు ఊరటను సుఖశాంతులను కలుగజేయుచున్నవి. సాయి కథలు చెప్పువారును వినువారును ధన్యులు, పావనులు. చెప్పువారి నోరును వినువారి చెవులును పవిత్రములు.

**కాకాసాహెబు దీక్షిత్ (1864-1926)**

మధ్యపరగణాలలోని ఖాండ్వా గ్రామమందు వడనగర నాగర బ్రాహ్మణ కుటుంబములో హరిసీతారామ్ ఉరఫ్ కాకాసాహెబ్ దీక్షిత్ జన్మించెను. ప్రాథమిక విద్యను ఖండ్వా, హింగన్‌ఘాట్‌లలో పూర్తి చేసెను. నాగపూరులో మెట్రిక్ వరకు చదివెను. బొంబాయి విల్సన్, ఎల్ఫిన్‌స్టన్ కాలేజీలలో చదివి 1883లో పట్టభద్రుడయ్యెను. న్యాయవాది పరీక్షలో కూడ ఉత్తీర్ణుడై లిటిల్ అండు కంపెనీలో కొలువునకు చేరెను. తుదకు తన సొంత న్యాయవాదుల కంపెనీ పెట్టుకొనెను.

1909కి ముందు సాయిబాబా పేరు కాకాసాహెబు దీక్షిత్‌కు తెలియదు. అటుపిమ్మట వారు బాబాకు గొప్ప భక్తులైరి. ఒకానొకప్పుడు లొనావాలాలో నున్నప్పుడు, తన పాత స్నేహితుడగు నానాసాహెబు చాందోర్కర్‌ను జూచెను. ఇద్దరును కలిసి యేవో విషయములు మాట్లాడుకొనిరి. కాకాసాహెబు తాను లండనులో రైలుబండి ఎక్కుచుండగా కాలుజారి పడిన యపాయమును గూర్చి వర్ణించెను. వందలకొలది ఔషధములు దానిని నయము చేయలేక పోయెను. కాలు నొప్పియు, కుంటితనమును పోవలెనన్నచో అతడు సద్గురువగు సాయివద్దకు పోవలెనని నానాసాహెబు సలహా ఇచ్చెను. సాయిబాబా విషయమై పూర్తి వృత్తాంతమును విశదపరచెను. సాయిబాబా *"నా భక్తుని సప్తసముద్రముల మీదనుంచి గూడ పిచ్చుక కాలికి దారముకట్టి* యీడ్చినట్లు లాగుకొనివచ్చెదను." అను వాగ్దానమును, ఒకవేళ వాడు తనవాడు కానిచో వాడు తనచే నాకర్షింపబడడనియు, వాడు తన దర్శనమే చేయలేడనియు బాబా చెప్పిన సంగతి తెలియజేసెను. ఇదంతయు విని కాకాసాహెబు సంతసించి, "సాయిబాబా వద్దకుపోయి, వారిని దర్శించి కాలుయొక్క కుంటితనముకంటె నా మనస్సు యొక్క కుంటితనమును బాగు చేసి శాశ్వతమైన యానందమును కలుగజేయుమని వేడుకొనెద"నని నానాసాహెబుతో చెప్పెను.

కొంతకాలము పిమ్మట కాకాసాహెబు అహమదనగర్ వెళ్ళెను. బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో వోట్లకై సర్దార్ కాకాసాహెబు మిరీకర్ యింటిలో దిగెను. కాకాసాహెబు మిరీకర్ కొడుకు బాలాసాహెబు మిరీకర్.

వీరు కోపర్‌గాంకు మామలతదారు. వీరు కూడ గుఱ్ఱపు ప్రదర్శన సందర్భములో అహమద్‌నగరు వచ్చి యుండిరి. ఎలక్షను పూర్తియైన పిమ్మట కాకాసాహెబు శిరిడీకి పోవ నిశ్చయించుకొనెను. మిరీకర్ తండ్రి కొడుకులు వీరిని ఎవరివెంట శిరిడీకి పంపవలెనా యని యాలోచించుచుండిరి. శిరిడీలో సాయిబాబా వీరిని ఆహ్వానించుటకు సిద్ధపడుచుండెను. అహమద్‌నగరులోనున్న శ్యామా మామగారు తన భార్య ఆరోగ్యము బాగా లేదనియు, శ్యామాను తన భార్యతో గూడ రావలసినదనియు టెలిగ్రామ్ యిచ్చిరి. బాబా యాజ్ఞను పొంది శ్యామా అహమద్‌నగరు చేరి తన అత్తగారికి కొంచెము నయముగా నున్నదని తెలిసికొనెను. మార్గములో గుఱ్ఱపు ప్రదర్శనమునకు బోవుచున్న నానాసాహెబు పాన్సే, అప్పాసాహెబు గద్రే శ్యామాను కలిసి మిరీకరు ఇంటికిపోయి కాకాసాహెబు దీక్షితుని కలిసి, వారిని శిరిడీకి తీసికొని వెళ్ళుమనిరి. కాకాసాహెబు దీక్షితుకు మిరీకరులకు శ్యామా అహమద్‌నగరు వచ్చిన విషయము తెలియజేసిరి. సాయంకాలము శ్యామా మిరీకరులవద్దకు పోయెను. వారు శ్యామాకు కాకాసాహెబు దీక్షిత్‌తో పరిచయము కలుగజేసిరి. శ్యామా కాకాసాహెబు దీక్షిత్‌తో కోపర్‌గాంకు ఆనాటి రాత్రి 10 గంటల రైలులో పోవలెనని నిశ్చయించిరి. ఇది నిశ్చయించిన వెంటనే యొకవింత జరిగెను. బాబాయొక్క పెద్దపటము మీది తెరను బాలాసాహెబు మిరీకరు తీసి దానిని కాకాసాహెబు దీక్షితుకు చూపెను. కాకాసాహెబు శిరిడీకి పోయి యెవరినయితే దర్శించవలెనని నిశ్చయించుకొనెనో, వారే పటము రూపముగా నచట తన్ను ఆశీర్వదించుటకు సిద్ధముగా నున్నట్లు తెలిసి యతడు మిక్కిలి యాశ్చర్యపడెను. ఈ పెద్దపటము మేఘశ్యామునిది. దానిపై అద్దము పగిలినందున నాతడు దానికింకొక అద్దము వేయుటకు మిరీకరుల వద్దకు బంపెను. చేయవలసిన మరమ్మతు పూర్తి చేసి ఆ పటమును కాకాసాహెబు శ్యామాల ద్వారా శిరిడీకి పంపుటకు నిశ్చయించిరి.

10 గంటల లోపల స్టేషనుకు పోయి టిక్కెట్లు కొనిరి. బండి రాగా సెకండు క్లాసు క్రిక్కిరిసి యుండుటచే వారికి జాగా లేకుండెను. అదృష్టవశాత్తు గార్డు కాకాసాహెబు స్నేహితుడు. అతడు వారిని ఫస్టుక్లాసులో కూర్చుండబెట్టెను. వారు సౌఖ్యముగా ప్రయాణము చేసి కోపర్‌గాంలో దిగిరి. బండి దిగగానే

శిరిడీకి పోవుటకు సిద్ధముగా నున్న నానాసాహెబు చాందోర్కరును జూచి మిక్కిలి యానందించిరి. కాకాసాహెబు, నానాసాహెబు కౌగలించుకొనిరి. వారు గోదావరిలో స్నానము చేసిన పిమ్మట శిరిడీకి బయలుదేరిరి. శిరిడీ చేరి బాబా దర్శనము చేయంగా, కాకాసాహెబు మనస్సు కరగెను. కండ్లు ఆనందబాష్పములచే నిండెను. అతడానందముచే పొంగిపొరలుచుండెను. బాబా కూడ వారికొరకు తాము కనిపెట్టుకొని యున్నట్లును వారిని తోడ్కొని వచ్చుటకై శ్యామాను పంపినట్లును తెలియజేసెను.

పిమ్మట కాకాసాహెబు బాబాతో నెన్నో సంవత్సరములు సంతోషముగా గడపెను. శిరిడీలో నొక వాడాను గట్టి దానినే తన నివాస స్థలముగా జేసికొనెను. అతడు బాబా వల్ల పొందిన యనుభవములు లెక్కలేనన్ని గలవు. వాటి నన్నిటిని ఇచ్చట పేర్కొనలేము. ఈ కథను ఒక విషయముతో ముగించెదము. బాబా కాకాసాహెబుతో "అంత్యకాలమున నిన్ను విమానములో తీసుకపోయెదను" అన్న వాగ్దానము సత్యమైనది. 1926వ సంవత్సరము జూలై 5వ తేదీన అతడు హేమాడ్‌పంతుతో రైలు ప్రయాణము చేయుచు బాబా విషయము మాట్లాడుచు, సాయిబాబా యందు మనస్సు లీనము చేసెను. ఉన్నట్లుండి తన శిరమును హేమాడ్‌పంతు భుజముపై వాల్చి యే బాధయు లేక, యెట్టి చికాకు పొందక ప్రాణములు విడచెను.

**శ్రీ టెంబె స్వామి**

యోగులు ఒకరినొకరు అన్నదమ్ములవలె ప్రేమించుకొనెదరు. ఒకానొకప్పుడు శ్రీవాసుదేవానంద సరస్వతి స్వాములవారు (టెంబె స్వామి) రాజమండ్రిలో మకాం చేసిరి. ఆయన గొప్ప నైష్ఠికుడు, పూర్వాచారపరాయణుడు, జ్ఞాని, దత్తాత్రేయుని యోగిభక్తుడు. నాందేడు ప్లీడరగు పుండలీకరావు వారిని జూచుటకై కొంతమంది స్నేహితులతో రాజమండ్రికి పోయెను. వారు స్వాములవారితో మాట్లాడుచున్నప్పుడు సాయిబాబా పేరు శిరిడీ పేరు వచ్చెను. బాబా పేరు విని స్వామి చేతులు జోడించి, ఒక టెంకాయను దీసి పుండలీకరావు కిచ్చి యిట్లనిరి. "దీనిని నా సోదరుడగు సాయికి నా ప్రణామములతో నర్పింపుము, నన్ను మరువ వద్దని వేడుము. నాయందు ప్రేమ చూపుమనుము." ఆయన స్వాములు

సాధారణముగా నితరులకు నమస్కరించరనియు కాని బాబా విషయమున ఇది యొక అపవాదమనియు చెప్పెను. పుండలీకరావు ఆ టెంకాయను, సమాచారమును శిరిడీకి దీసికొని పోవుటకు సమ్మతించెను. బాబాను స్వామి సోదరుడనుట సమంజసముగా నుండెను. ఏలన బాబావలె వారును రాత్రింబవళ్ళు అగ్నిహోత్రమును వెల్గించియే యుంచిరి.

ఒకనెల పిమ్మట పుండలీకరావు తదితరులును శిరిడీకి టెంకాయను దీసికొని వెళ్ళిరి. వారు మన్మాడు చేరిరి. దాహము వేయుటచే ఒక సెలయేరు కడకు బోయిరి. పరగడుపున నీళ్ళు త్రాగకూడదని కారపు అటుకులు ఉపాహారము చేసిరి. అవి మిక్కిలి కారముగా నుండుటచే టెంకాయను పగులగొట్టి దాని కోరును అందులో కలిపి యటుకులను రుచికరముగా జేసిరి. దురదృష్టముకొలది యా కొట్టిన టెంకాయ స్వాములవారు పుండలీకరావు కిచ్చినది. శిరిడీ చేరునప్పటికి పుండలీకరావుకీ విషయము జ్ఞప్తికి వచ్చెను. అతడు మిగుల విచారించెను. భయముచే వణకుచు సాయిబాబా వద్దకేగెను. టెంకాయ విషయమప్పటికే సర్వజ్ఞుడగు బాబా గ్రహించెను. బాబా వెంటనే తన సోదరుడగు టెంబెస్వామి పంపించిన టెంకాయను దెమ్మనెను. పుండలీకరావు బాబా పాదములు గట్టిగా బట్టుకొని, తన తప్పును అలక్ష్యమును వెలిబుచ్చుచు, పశ్చాత్తాపడుచు, బాబాను క్షమాపణ వేడెను. దానికి బదులింకొక టెంకాయను సమర్పించెదననెను. కాని బాబా యందులకు సమ్మతించలేదు. ఆ టెంకాయ విలువ సాధారణ టెంకాయ కెన్నో రెట్లనియు దాని విలువకు సరిపోవున దింకొకటి లేదనియు చెప్పుచు నిరాకరించెను. ఇంకను బాబా యిట్లనెను. "*ఆ విషయమై నీవేమాత్రము చింతింపనవసరము లేదు. అది నా సంకల్పము ప్రకారము నీ కివ్వబడెను. తుదకు దారిలో పగులగొట్టబడెను. దానికి నీవే కర్తవని యనుకొననేల? మంచిగాని చెడ్డగాని చేయుటకు నీవు కర్తవని యనుకొనరాదు. గర్వాహంకార రహితుడవయి యుండుము. అప్పుడే నీ పరచింతన యభివృద్ధి పొందును.*" ఎంత చక్కని వేదాంతవిషయమును బాబా బోధించెనో చూడుడు!

**బాలారామ్ ధురంధర్ (1878-1925)**

బొంబాయికి దగ్గరనున్న శాంతాక్రజ్‌లో పఠారేప్రభుజాతికి చెందిన బాలారామ్ ధురంధర్ యనువారుండిరి. వారు బొంబాయి హైకోర్టులో న్యాయవాది. కొన్నాళ్ళు బొంబాయి న్యాయశాస్త్ర కళాశాలకు ప్రిన్సిపాలుగా నుండెను. ధురంధర్ కుటుంబములోని వారందరు భక్తులు, పవిత్రులు, భగవచ్చింతన గలవారు. బాలారామ్ తన జాతికి సేవ చేసెను. ఆ విషయమై యొక గ్రంథము వ్రాసెను. అటుపిమ్మట తన దృష్టిని మతము ఆధ్యాత్మిక విషయములవైపు మరలించెను. గీతను, జ్ఞానేశ్వరిని, వేదాంత గ్రంథములను, బ్రహ్మవిద్య మొదలగువానిని చదివెను. అతడు పండరీపుర విఠోబా భక్తుడు. అతనికి 1912లో సాయిబాబాతో పరిచయము కలిగెను. 6 నెలలకు పూర్వము తన సోదరులగు బాబుల్జీయును, వామనరావును శిరిడీకి పోయి బాబాదర్శనము చేసిరి. ఇంటికి వచ్చి వారి యనుభవములను బాలారామునకు ఇతరులకు చెప్పిరి. అందరు బాబాను చూడ నిశ్చయించిరి. వారు శిరిడీకి రాకమునుపే బాబా యిట్లు చెప్పెను. *"ఈ రోజున నా దర్బారు జనులు వచ్చుచున్నారు."* ధురంధర సోదరులు తమ రాకను బాబాకు తెలియజేయనప్పటికి బాబా పలికిన పలుకులు ఇతరులవలన విని విస్మయమొందిరి. తక్కిన వారందరు బాబాకు సాష్టాంగనమస్కారము చేసి వారితో మాట్లాడుచు కూర్చొని యుండిరి. బాబా వారితో నిట్లనెను. "వీరే నా దర్బారు జనులు. ఇంతకు ముందు వీరి రాకయే మీకు చెప్పియుంటిని" బాబా ధురంధర సోదరులతో నిట్లనెను. *"గత 60 తరముల నుండి మన మొండొరులము పరిచయము గలవారము."* సోదరులందరు వినయవిధేయతలు గలవారు. వారు చేతులు జోడించుకొని నిలచి, బాబా పాదములవైపు దృష్టిని నిగిడించిరి. సాత్వికభావములు అనగా కండ్ల నీరు కారుట, రోమాంచము, వెక్కుట, గొంతుక యార్చుకొని పోవుట, మొదలగునవి వారి మనస్సులను కరగించెను. వారంద రానందించిరి. భోజనానంతరము కొంత విశ్రమించి తిరిగి మసీదుకు వచ్చిరి. బాలారామ్ బాబాకు దగ్గరగా కూర్చొని బాబా పాదము లొత్తుచుండెను. బాబా చిలుము త్రాగుచు దానిని బాలారామున కిచ్చి పీల్చుమనెను. బాలారామ్ చిలుము పీల్చుట కలవాటు

పడి యుండలేదు. అయినప్పటికి దాని నందుకొని కష్టముతో బీల్చెను. దానిని తిరిగి నమస్కారములతో బాబా కందజేసెను. ఇదియే బాలారామునకు శుభసమయము. అతడు 6 సంవత్సరములనుండి ఉబ్బసము వ్యాధితో బాధపడుచుండెను. ఈ పొగ అతని వ్యాధిని పూర్తిగా నయము చేసెను. అది అతనిని తిరిగి బాధపెట్టలేదు. 6 సంవత్సరముల పిమ్మట నొకనాడు ఉబ్బసము మరల వచ్చెను. అదేరోజు అదే సమయమందు బాబా మహాసమాధి చెందెను.

వారు శిరిడీకి వచ్చినది గురువారము. ఆ రాత్రి బాబా చావడి యుత్సవము జూచు భాగ్యము ధురంధర సోదరులకు కలిగెను. చావడిలో హారతి సమయమందు బాలారాము బాబా ముఖమందు పాండురంగని తేజస్సును ఆ మరుసటి ఉదయము కాకడ హారతి సమయమందు అదే కాంతిని పాండురంగవిఠలుని ప్రకాశమును బాబా ముఖమునందు గనెను.

బాలారామ్ ధురంధర్ మరాటీ భాషలో తుకారామ్ జీవితమును వ్రాసెను. అది ప్రకటింపబడకమునుపే అతడు చనిపోయెను. 1928లో అతని సోదరులు దానిని ప్రచురించిరి. అందు బాలారాము జీవితము ప్రప్రథమమున వ్రాయబడెను. అందు వారు శిరిడీకి వచ్చిన విషయము చెప్పబడియున్నది.

శ్రీసాయినాథాయ నమః

ఏబదియవ అధ్యాయము

సంపూర్ణము



।సద్గురు శ్రీసాయినాథార్పణమస్తు।

।శుభం భవతు।



శ్రీ సాయినాధాయ నమః

# శ్రీ సాయి సచ్చరిత్రము

## ఏబది యొకటవ అధ్యాయము

***సద్గురు సాయి యొక్క గొప్పదనము: ప్రార్థన: ఫలశ్రుతి***

శ్రీసాయి సచ్చరిత్రములోని 52, 53 అధ్యాయములిందు 51వ అధ్యాయముగా పరిగణించవలెను. ఇదియే చివరి అధ్యాయము. ఇందు హేమాడ్‌పంతు ఉపసంహార వాక్యములు వ్రాసెను. పీఠికతో విషయసూచిక నిచ్చునట్లు వాగ్దానము చేసెను కాని యది హేమాడ్‌పంతు కాగితములలో దొరకలేదు. కావున దానిని బాబా యొక్క గొప్ప భక్తుడగు బి.వి.దేవ (ఠాణా వాసి, ఉద్యోగమును విరమించుకొనిన మామలతదారు) కూర్చెను. ప్రతి అధ్యాయము ప్రారంభమున దానిలోని యంశములను ఇచ్చుటచే విషయసూచిక యనవసరము. కాబట్టి దీనినే తుది పలుకుగా భావించెదము. ఈ అధ్యాయమును సవరించుటకు, ప్రచురించుటకు పంపునరికి దేవుగారికి ఇది పూర్తిగా వ్రాసియున్నట్లు కనబడలేదు. అచ్చటచ్చట చేతి వ్రాతను బోల్చుకొనుట గూడ కష్టముగా నుండెను. కాని యదంతయు నున్నదున్నట్లుగా ప్రచురింపవలసి వచ్చెను. అందు చెప్పిన ముఖ్య విషయములు ఈ దిగువ క్లుప్తముగా జెప్పబడినవి.

**సద్గురు సాయి యొక్క గొప్పదనము :**

శ్రీసాయి సమర్థునకు సాష్టాంగ నమస్కారము చేసి వారి యాశ్రయమును పొందెదము. వారు జీవజంతువులయందును, జీవములేని వస్తువుల యందును వ్యాపించియున్నారు. వారు స్తంభము మొదలు పరబ్రహ్మ స్వరూపము వరకు కొండలు, ఇండ్లు, మేడలు, ఆకాశము మొదలుగా గలవాని యన్నిటియందు వ్యాపించియున్నారు. జీవరాశి యందంతటను కూడ వ్యాపించి యున్నారు. భక్తులందరు వారికి సమానమే. వారికి మానావమానములు లేవు. వారికిష్టమైనవి మయిష్టమయినవియు లేవు. వారినే జ్ఞప్తియందుంచుకొని వారి శరణు పొందినచో వారు మన కోరికలన్నిటిని నెరవేర్చి మనము జీవిత పరమావధిని పొందునట్లు చేసెదరు.

ఈ సంసారమనే మహాసముద్రమును దాటుట మహాకష్టము. విషయ సుఖములనెడు కెరటములు దురాలోచనలనే ఒడ్డును తాకుచు ధైర్యమను చెట్లను కూడ విరుగగొట్టుచుండును. అహంకారమనే గాలి తీవ్రముగా వీచి మహాసముద్రమును కల్లోలపరచును. కోపము, అసూయలనెడు మొసళ్ళు నిర్భయముగా సంచరించును. అచట నేను, నాది యను సుడిగుండములును, ఇతర సంశయములును గిఱ్ఱున తిరుగుచుండును. పరనింద, అసూయ, ఓర్వలేనితనము అను చేపలచట ఆడుచుండును. ఈ మహాసముద్రము భయంకరమైనప్పటికి సాయి సద్గురువు దానికి అగస్త్యుని వంటివారు (అనగా నాశనము చేయువారు). సాయి భక్తులకు దానివల్ల భయమేమి యుండదు. ఈ మహాసముద్రమును దాటుటకు మనసద్గురువు నావ వంటివారు. వారు మనలను సురక్షితముగా దాటించెదరు.

**ప్రార్థన :**

మనమిప్పుడు సాయిబాబాకు సాష్టాంగ నమస్కారము చేసి వారి పాదములు బట్టుకొని సర్వజనుల కొరకు ఈ క్రింది ప్రార్థనము చేసెదము. మా మనస్సు అటు నిటు సంచారము చేయకుండుగాక. నీవు దప్ప మరేమియు కోరకుండుగాక. ఈ సచ్చరిత్రము ప్రతి గృహమందుండు గాక. దీనిని

ప్రతినిత్యము పారాయణ చేసెదము గాక. ఎవరయితే దీనిని నిత్యము పారాయణ చేసెదరో వారి యాపదలు తొలగిపోవు గాక !

**ఫలశృతి :**

ఈ గ్రంథమును పారాయణ చేసినచో గలుగు ఫలితమును గూర్చి కొంచెము చెప్పుదుము. పవిత్ర గోదావరిలో స్నానము చేసి, షిరిడీలో సమాధిని దర్శించి, సాయిసచ్చరిత్రము పారాయణ చేయుటకు ప్రారంభింపుము. నీవిట్లు చేసినచో నీకుండు ముప్పేటల కష్టములు తొలగిపోవును. శ్రీసాయి కథలను అలవోకగా విన్నను ఆధ్యాత్మిక జీవితమునందు శ్రద్ధ కలుగును. ఇంకను ఈ చరిత్రమును ప్రేమతో పారాయణ చేయుచున్నచో నీ పాపములన్నియు నశించును. జనన మరణములనే చక్రము నుండి తప్పించుకొనవలెనన్నచో సాయిలీలలను చదువుము. వాని నెల్లప్పుడు జ్ఞప్తి యందుంచుకొనుము. వారి పాదములనే యాశ్రయింపుము; వానినే భక్తితో పూజింపుము. సాయిలీలలనే సముద్రములో మునిగి వానిని ఇతరులకు చెప్పినచో నందు క్రొత్త సంగతులను గ్రహించగలవు. అవి వినువారిని పాపముల నుండి రక్షించగలవు. శ్రీ సాయి సగుణ స్వరూపమునే ధ్యానించినచో క్రమముగా నది నిష్క్రమించి ఆత్మ సాక్షాత్కారమునకు దారి చూపును. ఆత్మ సాక్షాత్కారమును పొందుట బహుకష్టము. కాని నీవు సాయి సగుణ స్వరూపము ద్వారా పోయినచో నీ ప్రగతి సులభమగును. భక్తుడు వారిని సర్వస్య శరణాగతి వేడినచో నతడు 'తాను' అనుదానిని పోగొట్టుకొని నది సముద్రములో గలియునట్లు భగవంతునిలో ఐక్యమగును. మూడింటిలో ననగా జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్థలలో నేదయిన యొక్క యవస్థలో వారి యందు లీనమయినచో సంసార బంధమునుండి తప్పుకొందువు. స్నానము చేసిన పిమ్మట ఎవరు దీనిని భక్తి ప్రేమలతోను, పూర్తి నమ్మకముతోను పారాయణ చేసి వారము రోజులలో ముగింతురో, వారి యాపదలన్నియు నశించగలవు. దీనిని పారాయణ చేసి ధనమును కోరినచో దానిని పొందవచ్చును. వర్తకుల వ్యాపారము వృద్ధియగును. వారి వారి భక్తి

నమ్మకములపై ఫల మాధారపడి యున్నది. ఈ రెండును లేనిచో నెట్టి యనుభవము కలుగదు. దీనిని శ్రద్ధతో పారాయణ చేసినచో శ్రీ సాయి ప్రీతి చెందును. నీ యజ్ఞానమును పేదరికమును నిర్మూలించి నీకు జ్ఞానము, ధనము, ఐశ్వర్యముల నొసంగును. కేంద్రీకరించిన మనస్సుతో ప్రతిరోజు ఒక అధ్యాయమును పారాయణ చేసినచో నది యపరిమితానందమును కలుగజేయును. ఎవరు హృదయమందు తమ శ్రేయస్సును కోరెదరో వారు దీనిని జాగరూకతతో పారాయణ చేయవలయును. అప్పుడతడు శ్రీ సాయిని కృతజ్ఞతతో, సంతసముతో జన్మజన్మములవరకు మదిలో నుంచుకొనును. ఈ గ్రంథమును గురుపౌర్ణమినాడు (అనగా ఆషాఢ శుద్ధ పౌర్ణమినాడు) గోకులాష్టమినాడు, శ్రీరామనవమినాడు, విజయదశమినాడు (అనగా, బాబా పుణ్యతిథినాడు) ఇంటివద్ద తప్పక పారాయణ చేయవలెను. ఈ గ్రంథమును జాగరూకతతో పారాయణ చేసిన యెడల వారల కోరికలన్నియును నెరవేరును. నీ హృదయమునందు శ్రీ సాయి చరణములనే నమ్మిన యెడల భవసాగరమును సులభముగా దాటగలుగుదువు. దీనిని పారాయణ చేసిన యెడల రోగులు ఆరోగ్యవంతులగుదురు, పేదవారు ధనవంతులగుదురు. అధములు ఐశ్వర్యమును పొందుదురు. వారి మనస్సునందు గల ఆలోచనన్నియు పోయి తుదకు దానికి స్థిరత్వము కలుగును.

ఓ ప్రియమైన భక్తులారా ! పాఠకులారా ! శ్రోతలారా !

మీకు కూడ మేము నమస్కరించి మీకొక మనవి చేయుచున్నాము. ఎవరి లీలలను ప్రతిరోజు, ప్రతినెల మీరు పారాయణ చేసితిరో వారిని మరువవద్దు. ఈ లీలల నెంత తీవ్రముగా చదివెదరో, వినెదరో అంత తీవ్రముగా మీకు ధైర్యము, ప్రోత్సాహము సాయిబాబా కలుగజేసి మీచే సేవ చేయించి, మీకుపయుక్తముగా నుండునట్లు చేయును. ఈ కార్యమందు రచయితయు, చదువరులును సహకరించవలెను. ఒండొరులు సహాయము చేసికొని సుఖపడవలెను.

ఈ గ్రంథమును సర్వశక్తిమయుడైన భగవంతుని ప్రార్థనతో ముగించెదము. కారుణ్యమును జూపుమని వారిని వేడెదము. ఈ గ్రంథమును చదువు భక్తులు హృదయ పూర్వకమగు సంపూర్ణ భక్తి శ్రీ సాయి పాదములందు పొందెదరు గాక ! సాయి సగుణ స్వరూపము వారి నేత్రములందు నిలచిపోవును గాక ! వారు శ్రీసాయిని సర్వజీవముల యందు చూచెదరు గాక ! తథాస్తు !

**శ్రీ సాయి సచ్ఛరిత్రము సర్వము సంపూర్ణము**



# సద్గురు శ్రీ సాయినాథార్పణమస్తు

**శుభం భవతు**